# సంప్రదాయ సాహిత్యం

## ఎం..ఏ. తెలుగు - మొదటి సంవత్సరం

## సెమిస్టర్ - 1, పేపరు - 1


**రచయితలు :**

**డా॥ చెర్రెడ్డి మస్తాన్‌రెడ్డి**
రిటైర్డ్ ప్రిన్సిపాల్,
ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల,
నరసరావుపేట

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం
వారణాసి.

**డా॥ జి. వైదేహి**
రిటైర్డ్ లెక్చరర్,
టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

**డా॥ ఇరపని మాధవి**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్

**సంపాదకులు :**

**డా॥ ఇరపని మాధవి,** యం.ఏ., యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**సమన్వయకర్త :**

**డా॥ ఇరపని మాధవి,** యం.ఏ., యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డైరెక్టర్ :**

**డా॥ బి. నాగరాజు**
దూరవిద్యా కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ - 522 510.
Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 2110204 (Study Material)
Cell : 9848285518
e_mail : info.anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

**M.A. Sociology : Indian Society Structure and Change**

Edition: 2021

No. of Copies: 246

(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of Distance Education, Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by:

**Dr. NAGARAJU BATTU**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Printed at:

**Romith Technologies**

Guntur.

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతిపథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి., మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు' అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముమ్మందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.

కులపతి (FAC)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

## ఎం.ఏ. తెలుగు - సెమిస్టర్ - 1 పేపర్ - 1

### నిర్ణయించిన పాఠ్యాంశాలు

# సంప్రదాయ సాహిత్యం

### సిలబస్

1. నన్నయ - శ్రీమదాంధ్ర మహాభారతము - ఆదిపర్వం - చతుర్థాశ్వాసం - శకుంతలోపాఖ్యానం
   (1వ పద్యం నుండి 110వ పద్యం వరకు)

2. పాల్కురికి సోమన - బసవపురాణం - తృతీయాశ్వాసం - బెజ్జమహాదేవి కథ
   (151వ పద్యం నుండి 166వ పద్యం వరకు)

3. తిక్కన - శ్రీమదాంధ్ర మహాభారతం - విరాటపర్వం - ద్వితీయాశ్వాసం - కీచకవధ
   (22 నుండి 361వ పద్యం వరకు)

4. ఎఱ్ఱన - శ్రీమదాంధ్ర మహాభారతం - ఆరణ్యపర్వం - సప్తమాశ్వాసం - సావిత్ర్యుపాఖ్యానం
   (170 నుండి 279వ పద్యం వరకు)

5. శ్రీనాథుడు - హరవిలాసం - ద్వితీయాశ్వాసం - సిరియాళుని కథ
   (1 నుండి 142వ పద్యం వరకు)

<u>ఆధార గ్రంథాలు :</u>

1) శ్రీమదాంధ్ర మహాభారతం - ఆది, ఆరణ్య, విరాట పర్వాలు - కవిత్రయం
2) హరవిలాసం - శ్రీనాథుడు
3) బసవ పురాణం - పాల్కురికి సోమన.

## ఎం.ఏ. తెలుగు - సెమిస్టర్ - 1 పేపర్ - 1

## నిర్ణయించిన పాఠ్యాంశాలు

# సంప్రదాయ సాహిత్యం

## విషయసూచిక


| పాఠం నెం. | | పేజీ సంఖ్య |
|---|---|---|
| 1. | శకుంతలోపాఖ్యానము - నన్నయ | 1.1 - 1.19 |
| 2. | శకుంతలోపాఖ్యానము - నన్నయ | 2.1 - 2.15 |
| 3. | బెజ్జమహాదేవి కథ - పాల్కురికి సోమన | 3.1 - 3.6 |
| 4. | బెజ్జమహాదేవి కథ - పాల్కురికి సోమన | 4.1 - 4.7 |
| 5. | కీచక వధ - తిక్కన | 5.1 - 5.13 |
| 6. | కీచక వధ - తిక్కన | 6.1 - 6.38 |
| 7. | కీచక వధ - తిక్కన | 7.1 - 7.9 |
| 8. | కీచక వధ - తిక్కన | 8.1 - 8.36 |
| 9. | సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన | 9.1 - 9.15 |
| 10. | సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన | 10.1 - 10.17 |
| 11. | సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన | 11.1 - 11.6 |
| 12. | సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన | 12.1 - 12.15 |
| 13. | సిరియాళుని కథ - శ్రీనాథుడు | 13.1 - 13.7 |
| 14. | సిరియాళుని కథ - శ్రీనాథుడు | 14.1 - 14.15 |
| 15. | సిరియాళుని కథ - శ్రీనాథుడు | 15.1 - 15.8 |
| 16. | సిరియాళుని కథ - శ్రీనాథుడు | 16.1 - 16.9 |

# ఎం.ఏ., తెలుగు - సెమిస్టర్ - 1 పేపర్ - 1

## నిర్ణయించిన పాఠ్యాంశాలు

# సంప్రదాయ సాహిత్యం

### మాదిరి ప్రశ్నాపత్రం

సమయం : 3 గం॥లు మార్కులు : 70

**1. ఈ క్రింది వానిలో ఒకదానికి సమగ్రవ్యాఖ్య రాయండి 12 × 1 = 12 మా.**

అ) నుతజల పూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత యొక బావి మేలు నుఱి బావులు నూఱిటి కంటె నొక్కస
త్క్రతు వదిమేలు తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్.

ఆ) తమమును బెల్లుగాబరఁగె దవ్వు నిజాశ్రమ భూమియున్ మదిన్
శ్రమమును బాయదిప్పు డను చందమ యైనఁజనంగనేల యిం
పమరఁగ నింతప్రొద్దు సుగుణాకర యిచ్చట నిల్చి రేపు వో
దమె తెఱఁగెద్ది నావుడును దన్మికి సాళ్వతనూజుఁడిట్లనున్

**2. ఈ క్రింది వానిలో ఐదింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి. 2 × 5 = 10**

అ) దీపంబువలన నొండొక దీపము ప్రభవించినట్లు
ఆ) ఇంక దైవంబకాని యొండు శరణంబు లేదు
ఇ) తానెంత పెరుగునో తల్లిగల్గినను
ఈ) నీ చెమటయుఁజూచి నెత్తురు నవుదు
ఉ) అణంగు పట్ట యాడెడు జంత్రంబు పగిది నుండె
ఊ) అన్న ! మదన వికృతింజేయుననుట యెంతయును నిషిద్ధముగానె
ఋ) నీకు నేనుఁజుట్టమనని చెప్పనేల వేఱ
ౠ) ధర్మగతుల తెఱగెల్ల భవద్భావాధీనము
ఎ) భ్రమసి తప్పిన పసరంబు నెమకినట్లు
ఏ) దానవుఁడు గాక వాఁడేటి తండ్రి చెపుమ

**3. ఈ క్రింది వానిలో నాల్గింటికి వ్యాసరూప సమాధానాలు రాయండి 12 × 4 = 45**

అ. దుష్యంతుడు శకుంతలను స్వీకరించిన విధానాన్ని వివరించండి.
ఆ. బెజ్జమహాదేవి మాతృ వాత్సల్యాన్ని వివరించండి.
ఇ. పాఠ్యభాగమాధారంగా నన్నయ కవితీరుతాలను విశ్లేషించండి.
ఈ. కీచకపాత్రను తిక్కన తీర్చిన విధం ఎట్టిది ?
ఉ. పాఠ్యభాగమాధారంగా తిక్కన నాటకీయతను నిరూపించండి.
ఊ. ఎఱ్ఱన చిత్రించిన సావిత్రి పాత్రను ఆవిష్కరించండి.
ఋ. సిరియాళుని కథ ఇతివృత్తాన్ని రాయండి.
ౠ. శ్రీనాథుడి కవితాశైలిని పాఠ్యభాగమాధారంగా వివరించండి.

# ఎం.ఏ., తెలుగు - సెమిస్టర్ - 1 పేపర్ - 1

## నిర్ణయించిన పాఠ్యాంశాలు

# సంప్రదాయ సాహిత్యం

## మాదిరి ప్రశ్నాపత్నం

సమయం : 3 గం॥లు                                                                 మార్కులు : 70

**1. ఈ క్రింది వానిలో ఒకదానికి సమగ్రవ్యాఖ్య రాయండి                         12 × 1 = 12 మా.**

అ) దుర్వాదోద్యమ బాహువిక్రమ రసోస్త్రోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్పు నిను దోర్లీలన్ వెసం గట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముంగొనుట తథ్యం బెమ్మెయిం గీచకా !

ఆ) ప్రజలెల్లం బురిఁ గంతఁ కంతల మహాపాంబుగాఁ బల్కెడున్
నిజమో కల్లయొగాని మీరఁట కడున్ నిస్త్రింశభావంబునన్
నిజపుత్రున్ సుకుమారుఁ జంపి యొక దుర్నిర్వాణికిం జోగికి
న్భుజియింపంగ నొనర్చు వారటిది యెందున్గల్గునే యిద్ధరన్.

**2. ఈ క్రింది వానిలో ఐదింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.                    2 × 5 = 10**

అ) చూచి మునిశక్తి కెంతయుఁజోద్యమంది
ఆ) తప్పఁ బలుక నగునె ధార్మికులకు
ఇ) తల్లి లేకుండుట దావిచిత్రంబు
ఈ) నిప్పున ఁజెదలంటునే
ఉ) మాయదైవమ యేనేమి సేయుదాన
ఊ) నా పోల్కియాడుదాని వెదకియునెయ్యెడనైన నీకుఁ బడయవచ్చునె
ఋ) సతులకు నన్యమెట్టిదియు ధర్మమె భర్తృసంశ్రయముగాక
ౠ) అనన్య గుణాకారులియ్యిరువురును సమంచిత మూర్తుల్
ఎ) గ్రహంబులలో నుడురాజు కైవడిన్
ఏ) మగవాడో మ్రానో యనుమాట నేఁటిమాటయె చెపుమా

**3. ఈ క్రింది వానిలో నాల్గింటికి వ్యాసరూప సమాధానాలు రాయండి                    12 × 4 = 45**

అ. శకుంతల పాత్రను చిత్రీకరించండి.
ఆ. బెజ్జమహాదేవి కథను వివరించండి.
ఇ. మీ పాఠ్యభాగమాధారంగా తిక్కన కవితారీతులను విశదీకరించండి.
ఈ. మీ పాఠ్యభాగమాధారంగా తిక్కన రచించిన ద్రౌపది పాత్ర చిత్రణను వివరించండి.
ఉ. పాఠ్యభాగమాధారంగా ఎఱ్ఱన కవితారీతులను వివరించండి.
ఊ. సావిత్ర్యుపాఖ్యానం ఇతివృత్తాన్ని రాయండి.
ఋ. పాఠ్యభాగమాధారంగా సిరియాళుడి పాత్ర చిత్రణ చేయండి.
ౠ. చిఱుతొండనంబి శివభక్తిని వివరించండి.

# First Semester

# Telugu

# Paper- I : Classical Literature

**1. ఈ క్రింది వానికి సమగ్రవ్యాఖ్య వ్రాయండి.**

అ) తమమును బెల్లుగాబరఁగె దవ్వు నిజాశ్రమ భూమియున్ మదిన్
శ్రమమును బాయదిప్పుడను చందమ యైనఁజనంగనేల యిం
పమరఁగ నింతప్రొద్దు సుగుణాకర యిచ్చట నిల్చి రేపు వో
దమె తెఱఁగెద్ది నావుడును దన్వికి సాళ్వతనూజుఁడిట్లనున్

**2. ఈ క్రింది వానికి సందర్భ సహిత వ్యాఖ్యలు వ్రాయండి.**

ఎ) అన్న! మదన వికృతింజేయుననుట యెంతయును నిషిద్ధముగానె

బి) నీకు నేనుఁజుట్టమనని చెప్పనేల వేఱ

సి) ధర్మగతుల తెఱఁగెల్ల భవద్భావాధీనము

డి) భ్రమసి తప్పిన పసరంబు నెమకినట్లు

ఇ) దానవుఁడు గాక వాఁడేటి తండ్రి చెపుమ

**3. ఈ క్రింది వానికి వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.**

అ) దుష్యంతుడు శంకుతలను స్వీకరించిన విధానాన్ని వివరించండి.

ఆ) బెజ్జమహాదేవి మాతృ వాత్సల్యాన్ని వివరించండి.

ఇ) పాఠ్యభాగమాధారంగా నన్నయ కవితా రీతులను విశ్లేషించండి.

ఈ) కీచకపాత్రను తిక్కన తీర్చిన విధం ఎట్టిది?

**4 ఈక్రింది వానికి సమగ్రవ్యాఖ్య వ్రాయండి.**

అ) నుతజల పూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత యొక బావి మేలు నుఱి బావులునూఱిటి కంటె నొక్కస
త్క్రతు వదిమేలు తత్క్రతు సతంబున కంటె సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్

**5. ఈ క్రింది వానికి సందర్భ సహిత వ్యాఖ్యలు వ్రాయండి.**

అ) దీపంబువలన నొండొక దీపము ప్రభవించినట్లు

ఆ) ఇంక దైవంబకాని యొండు శరణంబు లేదు

ఇ) తానెంత పెరుగునో తల్లిగల్గినను

ఈ) నీ చెమటయుఁజూచి నెత్తురు నవుదు

ఉ) అణంగు పట్ట యాడెడు జంత్రంబు పగిది నుండె

**6. ఈ క్రింది వానికి వ్యాసరూప సమాధానాలు వ్రాయండి.**

అ) పాఠ్యభాగమాధారంగా తిక్కన నాటకీయతను నిరూపించండి.

ఆ) ఎఱ్ఱన చిత్రించిన సావిత్రి పాత్రను ఆవిష్కరించండి.

ఇ) సిరియాళుని కథ ఇతివృత్తాన్ని వ్రాయండి.

ఈ) శ్రీనాథుడి కవితాశైలిని పాఠ్యభాగమాధారంగా వివరించండి.

----

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

## (ఆంధ్రమహాభారతం - ఆదిపర్వం - చతుర్థాశ్వాసం : 1 - 110 పద్యాలు)

## పాఠం -1

1. 1. 0 పరిచయం : కవి కావ్య పరిచయాలు

1. 1. 1 పాఠ్యభాగ వివరణ

1. 1. 2 సమగ్ర వ్యాఖ్యలు

### 1.1.0 పరిచయం : కవి కావ్య పరిచయాలు

మన పాఠ్యభాగమైన శకుంతలోపాఖ్యానం ఆదికవి నన్నయభట్టు రచించిన ఆంధ్రమహాభారతంలోని ఆదిపర్వంలోని చతుర్థాశ్వాసం నుంచి గ్రహించబడింది.

సరస్వతీపుత్రులైన "ఆంధ్రకవులకెల్ల నన్నయ్య అన్నయ్య". తెలుగు తల్లికి అమృత కలశాన్ని అందించిన సువర్ణుడూ ఆయన. నన్నయ భట్టారకుడు, రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకొని వేంగీ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుడి (1019 - 1061) ఆస్థానంలో ఉండేవాడు. రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహంతో భారతాంధ్రీకరణాన్ని ప్రారంభించాడు. ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వం చతుర్థాశ్వాసంలోని 'శారదరాత్రులు' (ప. 142) అనే పద్యం దాకా ఆంధ్రీకరించాడు. అంతటితో ఆ మహాకవి గంటం ఆగిపోయింది.

నన్నయ రాజరాజ నరేంద్రుడికి కుల బ్రాహ్మణుడు. అనురక్తుడు. అవిరళజపహోమ తత్పరుడు. విపుల శబ్దశాసనుడు. సంహితాభ్యాసుడు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు. పాత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. ముద్గల గోత్రజాతుడు. సద్వినుతావదాత చరితుడు. లోకజ్ఞుడు. ఉభయభాషాకావ్య రచనాభిశోభితుడు. సత్ప్రతిభాభియోగ్యుడు. నిత్యవచనుడు మత్యమరాధిపాచార్యుడు. సుజనుడు. నన్నయ తన కావ్యావతారికలో చెప్పిన ఈ అంశాలు అన్నీ ప్రత్యక్షర సత్యాలు.

నన్నయకు భారతాంధ్రీకరణ కార్యక్రమంలో ఆయన సహాధ్యాయుడైన నారాయణభట్టు తోడుగా ఉండేవాడు. నారాయణ భట్టు 'వాఙ్మయధురంధరుడు'. సంస్కృత ప్రాకృత కర్ణాట పైశాచికాంధ్ర భాషలలో కవిరాజశేఖరుడిగా ప్రసిద్ధుడు. ఇంతకూ నన్నయకు కవిరాజశేఖరుడిగా ఎలా తోడ్పడ్డాడు ? భారతయుద్ధంలో అర్జునుడికి కృష్ణుడు తోడ్పడ్డట్లుగా వదలకుండా తోడ్పడ్డాడు. ఆయుధాన్ని పట్టకుండా, యుద్ధం చేయకుండా అంటే గంటం పట్టకుండా రచన చేయకుండా తోడ్పడ్డాడు. కొన్ని సందర్భాల్లో సముచితమైన సలహాలిచ్చాడు.

నన్నయ తన కవిత్వంలోని ప్రధాన లక్షణాలను ఇలా సూచించాడు :

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తిలో
నారసి మేలు నా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగాన్. (ఆది. 1 - 26)

నన్నయ కవిత్వంలో మూడు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. (1) ప్రసన్న కథాకలి(వి)తార్థయుక్తి (2) అక్షరరమ్యత (3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వం.

ప్రసన్న కథాకలితార్థయుక్తికి ప్రసన్న కథాకవితార్థయుక్తి అనే పాఠాంతరం కూడా ఉంది. కాని 'కలితార్థయుక్తి' పాఠమే ఎక్కువ అర్థవంతమైన పాఠం. మూలభారతంలో కొన్ని అనావశ్యక విషయాలు, పునరుక్తులు అక్కడక్కడా కనిపిస్తాయి. తద్వారా కొంత క్లిష్టత కలుగుతుంది. నన్నయ తన రచనలో వాటిని పరిహరించి కథను ప్రసన్నం చేశాడు. తేటతెల్లం చేశాడు. రససమర్పక గుణమైన ప్రసాదంతో భాసింపజేశాడు. ఆ ప్రసన్న కథలతో కూడిన పరమార్థాన్ని భాసింపజేశాడు. చతుర్విధ పురుషార్థాలను - ధర్మార్థ కామ మోక్షాలను సువ్యక్తం చేశాడు. తదనుగుణంగా కొన్ని కీలకమైన శబ్దాలను ప్రయోగించాడు. ఇదంతా కవీంద్రులు తమ సారవంతమైన బుద్ధిబలంతో లోతుగా ఆలోచిస్తే అర్థమయ్యే విషయం.

ఇక ఇతరులు సైతం మెచ్చుకొనే విషయం అక్షర రమ్యత. అక్షరాల ఆవృత్తి వల్ల కలిగే శ్రావ్యత. దీన్ని నన్నయ ఆదరించడం వల్ల సామాన్యులకు కూడా ఆయన కవిత్వం అభిమాన పాత్రమైంది. ఈ అక్షరరమ్యత కోసం ఆయన వృత్త్యను ప్రాసాలంకారాన్ని స్వీకరించాడు. నన్నయ అక్షరరమ్యత క్షరంకాని శాశ్వత సౌందర్యం. నన్నయ పద్యాలలో వేదనాదమాధుర్యం వీనుల విందు చేస్తుంది.

నన్నయ నానార్థ సూక్తనిధి; అనేక మనోహరార్థాలతో కూడిన సూక్తులకు నిధి. ఆయన కవిత్వమూ అంతే. ఆవులాంటిదే కదా దూడ కూడా ! నన్నయ ఎన్నో ధర్మాలను, ధర్మ సూక్ష్మాలను మనోహరంగా చెప్పాడు. పురుషార్థాలను ఆవిష్కరించాడు. వ్యక్తీకరణ కౌశలాన్ని ప్రదర్శించాడు.

సంస్కృతంలో మహాభారతాన్ని వాఙ్మయంలో వాణీదరహాసమైన మహేతిహాసంగా వ్యాసమహర్షి తీర్చిదిద్దాడు. నన్నయ దానికి కావ్య కమనీయతను కలిగించి వన్నె తెచ్చాడు. ఇతిహాసంలో ప్రధానకథతో పాటు ఉపాఖ్యానాలు ఉంటాయి; అధికంగా ఉంటాయి. శబ్దం కన్నా అర్థం అందునా ఉపదేశం ప్రధానంగా ఉంటుంది. శృంగార హాస్యరసాలకు చెప్పుకోదగ్గ ప్రాముఖ్యం ఉండదు. శాంత వీర బీభత్సాద్భుత సన్నివేశాలతివేలంగా ఉంటాయి. మానవులతో పాటు సురాసురులు, పశుపక్ష్యాదులు పాత్రలుగా సాక్షాత్కరిస్తాయి. నన్నయ తన రచనలో వర్ణనలకూ అలంకారాలకూ కొంత ప్రాధాన్యాన్ని ఇచ్చి, ఉపదేశాన్ని ఉక్తి వైభవంతో మేళవించి తన రచనలో కావ్యత్వాన్ని స్ఫురింపజేశాడు.

### 1.1.1 పాఠ్యభాగ వివరణ :

మహాభారతంలోని మొదటి పర్వమైన ఆదిపర్వంలో పాండవుల జననం, విద్యాభ్యాసం, వివాహం మొదలైన ప్రధానకథాంశాలు ఉన్నాయి. ఇంకా ఆ వంశానికి సంబంధించిన పూర్వరాజుల కథలు - యయాతి, దుష్యంతుడు మొదలైన వారి కథలు - ఉన్నాయి. ఇక ధృతరాష్ట్ర పాండురాజుల విషయాలు సరే సరి !

దుష్యంతోపాఖ్యానం పరమరమణీయ కథ. వ్యాసభారతంలోని ఈ కథను గ్రహించి కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతల నాటకాన్ని రచించాడు. అది అనేక ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసుల ప్రశంసలకు పాత్రమైంది.

నన్నయ వ్యాసభారతాన్ని ఆంధ్రీకరిస్తూ అభిజ్ఞానశాకుంతల నాటకాన్ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు. ఈ అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 15 వ శతాబ్దిలో ఉన్న పిల్లలమర్రి పినవీరన శృంగార శాకుంతలమనే కావ్యాన్ని రచించాడు.

నన్నయ తీర్చిదిద్దిన అనేకోపాఖ్యానాలలో అత్యంతోజ్జ్వలమైనది శకుంతలోపాఖ్యానం. ఇది శతాధిక గద్యపద్య సంకలితం; వీర శాంత శృంగారాద్భుతరస బంధురం; ఆనందామృత నిష్యంది. భార్యాభర్తల, పితాపుత్రుల అనుబంధాలు, సత్యధర్మాల ఔన్నత్యాలు మొదలైన అంశాలు ఇందులో గమనార్హాలు.

చంద్రుని కుమారుడు బుధుడు. బుధుని కుమారుడు పురూరవుడు. పురూరవుని కుమారుడు ఆయువు. ఆయువు కుమారుడు. నహుషుడు. నహుషుని కుమారుడు యయాతి. యయాతి కుమారుడు పూరుడు. ఆ తరువాత దాదాపు పదిహేను తరాలు గడిచాయి. త్రసమహారాజు జన్మించాడు. త్రసుడికి కాళిందికి ఈలినుడు జన్మించాడు.

ఈలిమడికి రథంతరికి దుష్యంతుడు పుట్టాడు. దుష్యంతుడు అనన్య సాధారణ గుణయుక్తుడు. దుష్యంతుడు తన చిన్నతనంలో జింకపిల్లల్ని పట్టే విధంగా మహారణ్యంలో తిరుగుతూ ఉండే సింహ శార్దూలాలను, ఏనుగులను, శరభమృగాలను తరిమి తరిమి పట్టుకుంటూ ఉండేవాడు. చెట్లతో సహా పర్వతాల్ని పీకి ఇతర పర్వతాలపైకి విసరివేస్తూ యౌవనగర్వంతో ప్రకాశించాడు. మహాబల సంపన్నుడైన ఆ దుష్యంతుడు సూర్యకిరణాలూ గాలీ కూడా ప్రవేశించలేని భయంకరారణ్య ప్రదేశాలతో కూడి ఉన్న భూమండలాన్ని పూర్వరాజుల్లాగా బాహుబలంతో అజేయుడై పరిపాలించాడు. దిగ్గజాలే ఆయన రాజ్యానికి సరిహద్దులు. ఆయన రాజ్యం ప్రజాసమృద్ధితో, రోగాలు, శోకాలు, భయాలు, అనుమానాలు లేకుండా ధర్మమార్గంలో వర్ధిల్లింది.

ఆ దుష్యంతమహారాజా ఒకనాడు వేట వినోదంతో సూర్యుడి గుర్రాల కన్నా ఎక్కువ వేగంగా ప్రయాణించే అశ్వాల్ని పూన్చిన రథాన్ని ఎక్కి బయలు దేరాడు. ఎందరో ఆశ్వికులు ఆయన చుట్టూ మేలుజాతి గుర్రాలెక్కి బయలుదేరారు. వీరభటులు కుంతశక్తి ధనుష్ఖడ్గ ధారులై బయలుదేరారు. అరుపులతో, బొబ్బలతో బల మహామందరం ఆ అరణ్య సాగరాన్ని కలచివేసింది. మదించిన ఏనుగులు, సింహాలు, శరభమృగాలు, పెద్దపులులు, అడవి పందులు మహావేగంతో భయంకరంగా తిరుగుతున్న అరణ్య మధ్యంలో దుష్యంతుడు తన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. తప్పించుకొని పోతున్న మృగాల్ని బాణాదుల్ని ప్రయోగించి, దగ్గరలో ఉన్న మృగాల్ని తరిమి ఖడ్గాదులతో నరికి చంపాడు. వేట మీది విశేషాసక్తితో అపార ఘోర వన్యమృగావళిని దుష్యంతుడు హతమార్చాడు.

ఇలా చాలా మృగాల్ని తరిమి తరిమి చంపుతూ, ఇంకా చంపాలనే వేడుకతో దుష్యంతుడు చాలా దూరం వెళ్లాడు. ఆయన రథవేగాన్ని అందుకోలేక ఆగిపోయిన కాలిబంట్లు ఆకలి దప్పికలతో వివశులై అక్కడక్కడా విశ్రమించారు. ఆ దుష్యంతుడు కొంతమంది మంత్రులతోను, పరిజనులతోను, పురోహితులతోను కొంత ముందుకు వెళ్లాడు.

అలా ముందుకు వెళ్లిన దుష్యంతుడు ఒక పుణ్యనదీ తీరంలో అనేక పరిమళ భరిత పుష్పాలతో, ఫలాలతో వినమ్రంగా ఉన్న చెట్లతో, తీగలతో, పొదరిండ్లతో ప్రకాశిస్తున్న ఒక వనాన్ని చూశాడు. దేవేంద్రుడి ఖాండవవనానికి, కుబేరుడి చైత్రరథానికి సమానంగా ఈ వనాన్ని బ్రహ్మ ఎంతో దయతో భూలోకానికి ప్రసాదించాడేమో ! అని భావించాడు.

ఈ విధంగా తత్ సౌందర్యాన్ని పొగడుతూ వచ్చి ఆ వనంలో ప్రవేశించాడు. ఎంతో మనోహరంగా వచ్చిన ఆ దుష్యంత మహారాజుకు మనోహ్లాదం కలిగేటట్లు లతలు అనే స్త్రీలు, పిల్లగాలికి రాలిన పుష్పాక్షతలతో, సేసలు చల్లారు. సేసలు అనడంతో భవిష్యద్వివాహ సూచకమైన తలంబ్రాలు స్ఫురిస్తున్నది. అలాగే తుమ్మెదల ఝుంకారాలతో ఆశీస్సులిచ్చారు. ఇంకా వేటాడి అలసి ఉన్న అతని శరీరతాపం ఉపశమించేటట్లు ఆ నదీ పవనాలు వీచాయి.

బాగా చిగురించిన గోరంటలను, తగిన ప్రదేశాల్లో గుబురులుగా పూచిన మంచి అశోకాలను, సురపొన్నలను, పొన్నలను, మొగళ్లను, కాచి బాగా పండిన తియ్యమామిళ్లను, అరటులను చూస్తూ, చిలుకలు, కోకిల కంఠధ్వనులను వింటూ దుష్యంతుడు ముందుకు సాగాడు.

వెళ్లి వెళ్లి, నేతి హవిస్సుల పరిమళంతో కూడిన పొగలతో కూడిన తీగలు పెనవేసుకొన్న చెట్ల కొమ్మలమీద పూలు లేకపోయినా వాలి ఉన్న తుమ్మెదల సమూహాలను చూశాడు దుష్యంతుడు. ఇది తపోవనం అయి ఉంటుంది. అది మహర్షి ఆశ్రమమై ఉంటుందని భావించాడు.

హృదయ సుఖావహమైన ఆ వనంలో ముందుకు వెళ్తూ ఉన్నాడు దుష్యంతుడు. బ్రాహ్మణ వేద ధ్వనులు, అగ్నిహోత్ర స్వాహాశబ్దాలు, విద్వత్సంభాషణఘోషలు, మీమాంసక గోష్ఠి వివాద నినాదాలు మ్రోగుతూ ఉన్న కణ్వాశ్రమాన్ని చూశాడు. ఆ ఆశ్రమం యాజ్ఞికులకు, అనుష్ఠాతలకు, మహా తపోధనులకు నివాసమైన పుణ్యనదీ తీరంలో మనోహరంగా ఉంది; గంగాతీరంలో ఉన్న నరనారయణ స్థానం లాగా ఉంది.

కణ్వాశ్రమంలో చిలుకలు వీనుల విందుగా సామగానం చేస్తున్నాయి. ఆ చిలుకలు చదువును తన్మయత్వంతో ఏనుగులు వింటున్నాయి. ఆ ఏనుగులు తొండాల చల్లని నీడలో, తొండాల నీటి తుంపరుల చల్లగాలి మీది ఆశతో సింహాలు ఆశ్రయించి ఉన్నాయి.

బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులుగా పెట్టే నివ్వరి అన్నపు పిండాల్ని తినడానికి ఎలుకలు, పిల్లులు కలిసి ఆడుకొంటున్నాయి. ఈ సహజ వైరివర్గాల సహవాసాన్ని చూచి కణ్వశక్తికి ఆశ్చర్యచకితుడయ్యాడు దుష్యంతమహారాజు.

"నేను కణ్వమహామునీంద్రుడికి నమస్కరించి వస్తాను. నేను వచ్చేదాకా అందరూ ఇక్కడే ఉండండి" అని మంత్రులను తగిన వారిని ఆజ్ఞాపించి దుష్యంతుడు ఒక్కడే వెళ్లి ఆ కణ్వుడి ఇంటిలో శకుంతల అనే కన్యను చూచాడు. అమె సన్నగా ఉంది. తామరరేకుల లాంటి విశాల నేత్రాలు కలిగి ఉంది. చిక్కగా తుమ్మెదల లాగా ఉన్న నల్లని వంకరలు తిరిగిన వెంద్రుకలు కలిగి ఉన్నది.

ఆ శకుంతల జయంతుడి లాంటి అనంత విలాసవంతమైన దుష్యంతుణ్ణి తెలుసుకుంది. తొందరగా ఆసనార్ఘ్య పాద్యాది విధులతో పూజించి కుశల మడిగింది. అప్పుడు దుష్యంతుడు ఆమెతో ఇలా అన్నాడు : "మేము వేటకు వచ్చి, ఇక్కడ కణ్వ మహామునిని దర్శించి వెళ్దామని వచ్చాం. ఆయన ఎక్కడకు వెళ్లారో ! " శకుంతల అమాటలు విని ఇలా అన్నది " ఆయన ఇక్కడే ఉండి ఇప్పుడే వనానికి పండ్లు తేవడానికి వెళ్లారు. మీరు వచ్చిన విషయం తెలుసుకుంటే ఆయన ఇప్పుడే వస్తారు. వారు వచ్చేదాకా కొంచెం సేపు ఉండండి". శకుంతల మాటలను విని దుష్యంతుడు అమె వినయానికి, మృదుమధుర వచనాలకు సంతోషించాడు. పెండ్లికాని అమ్మాయి అని గ్రహించాడు. మన్మథ రాజ్యలక్ష్మి లాంటి ఆమె సర్వలక్షణ లక్షిత సర్వావయవ సందర్శనంతో సంచలిత హృదయుడయ్యాడు. "నీవు ఎవరి కూతురివి ? ఇక్కడికి ఎందుకు వచ్చావు ? అని శకుంతలను అడిగాడు. శకుంతల దుష్యంతునితో తాను జగదారాధ్యుడైన కణ్వమహామునీంద్రుని పుత్రికనని చెప్పింది.

అప్పుడు దుష్యంతుడిలా ఆలోచించాడు : "ఈమె మునికన్య అయితే ఈమె మీద నా మనస్సు ఎందుకు లగ్నమైంది ? నేను ఈ మాటలను నమ్మలేను. అదిగాక ఈ కణ్వమహర్షి విజితేంద్రియుడని విన్నాను". ఇలా ఆలోచించి ఉన్న సంగతి తెలుసుకోవడానికి ఉత్సుకుడయ్యాడు.

శకుంతల జన్మ వృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమెతో ఇలా అన్నాడు. "కణ్వమహాముని ఊర్ధ్వరేతుడు. ఆ పుణ్య చరితుడికి నీవు ఎలా పుత్రికవయ్యావు ? వివరంగా చెప్పు !" ఆ మాటలు విని శకుంతల దుష్యంతుడితో ఇలా అన్నది. "పూర్వం ఒక మహర్షి 'శకుంతల ఎక్కడిది ? ఎలా జన్మించింది ? ' అని మా తండ్రిని అడిగాడు. మా తండ్రి నేను వింటూఉండగా ఆయనకు చెప్పాడు. ఆ విషయాలను మీకు చెబుతాను. సావధానంగా వినండి" అని చెప్పనారంభించింది.

రాజర్షి అయిన విశ్వామిత్రుడి అతి ఘోరతపస్సుకు దేవేంద్రుడు భయపడ్డాడు. మేనకను పిలిచి అతని తపస్సును భగ్నం చెయ్యమని, తద్వారా దేవరాజ్యమహిమను రక్షించమని కోరాడు. మేనక చాలాభయపడి ఇంద్రునితో ఇలా అన్నది. "దేవేంద్రా ! బ్రహ్మ అంతటివాడైన వసిష్ఠుణ్ణి పుత్రశోక సముద్రంలో ముంచినవాడు ఆ విశ్వామిత్రుడు. ఆయనంటే నీవూ, దేవతలూ అందరూ భయపడుతుంటారు. అటువంటి ఉగ్రక్రోధుడి దగ్గరకు వెళ్లమని, తపోభంగం చేయమని నన్ను ఆజ్ఞాపించడం న్యాయమా! ఆ మహర్షి కోపించి చూస్తే ఆ క్షణంలో కులపర్వతాలు సైతం బ్రద్దలౌతాయి. ఇసుక మినహా సముద్రాలు ఇంకిపోతాయి. మూడు లోకాలు దిర్థిర తిరుగుతాయి. గాలి వీచడానికి జంకుతుంది. మహాతీవ్ర కోపపరుడి దగ్గరకు స్త్రీలు వెళ్లడానికి సంకోచించరా ? అయినా నా చేతనయిన విధంగా ఆ విశ్వామిత్రుడి మనస్సుకు మన్మథాయత్త మయ్యేటట్లు చేస్తాను" - అని ఇంద్రుణ్ణి వీడ్కొని బయలుదేరింది. మేనక తనకు మందమలయానిలం తోడుకాగా వచ్చి హిమవత్పర్వత ప్రదేశంలోని విశ్వామిత్రుడి తపోవనంలో ప్రవేశించింది.

చల్లని దక్షిణపు గాలి, మేనక జడలోని పూలను, మైపూతలను తగిలి పరిమళ భరితమై విశ్వామిత్రుడి మీద వీచింది. మేనక అప్పుడే వికసించిన పుష్పాభరణులను ధరించి మెల్లమెల్లగా వనకేళీలాలస విలాస గమనంతో వచ్చి విశ్వామిత్రుణ్ణి చూచింది. ఆ విశ్వామిత్ర మహర్షి మన్మథుణ్ణి నిరసించిన స్థితిలో ఉన్నాడు. ఆయనను చూచి మేనక ఆయనకు నమస్కరించింది. తాను చెలికత్తెలతో కలిసి పూలుకోసుకునే వంకతో అక్కడ విహరిస్తున్నది. మేనక ఆ మహాముని ఎదుట ఉన్న సమయంలో కమ్మని వాయువు వల్ల ఆమె పైగుడ్డ జారి వికలమైంది. ఆమె స్తనాలు, చంకలు, అందమైన సన్నని పొట్ట, మూడు వళులతో కూడిన నూగారు బయటపడ్డాయి. వాటి

మీద విశ్వామిత్రుడి చూపుపడింది. అతని హృదయంలో మన్మథబాణాలు పడ్డాయి. విశ్వామిత్రుడు చిత్తస్థైర్యాన్ని కోల్పోయాడు. తపించాడు. ఆమెతో సంభోగ సౌఖ్యాన్ని అనుభవించడానికి పూనుకొన్నాడు. మేనక కూడ విశ్వామిత్రుడికి ఇష్టమైన కామోపభోగాలతో చాలాకాలం రమించింది. మేనకా విశ్వామిత్రులకు ఈ పిల్ల పుట్టింది. ఈ బిడ్డను మాలినీ నదీపులినతలంలో వదలివేసి మేనక దేవలోకానికి వెళ్లింది. విశ్వామిత్రుడు తపోవనానికి వెళ్లాడు.

ఆ విశ్వామిత్ర మహర్షి ప్రభావం వల్ల, ఏడుస్తూ ఉన్న పసిపాపను రాక్షసులూ క్రూరమృగాలు ఆహారంగా పట్టుకోకుండా పక్షిసమూహాలు రెక్కలతో కప్పి రక్షిస్తూ ఉన్నాయి. ఆ తరువాత మేము శిష్యగణాలతో సమిధలూ పూలూ పండ్లూ తెచ్చుకోవడానికి అక్కడకు వెళ్లాం. దివినుండి భువికి దిగివచ్చిన చంద్రరేఖలా ఉన్న అత్యంత కాంతిమతి అయిన బిడ్డను ఎత్తుకొని వచ్చాం. ఆమె శకుంత రక్షిత కావడం వల్ల శకుంతల అని పేరుపెట్టి గారాబంగా పెంచాం. స్త్రీలకు కన్నతండ్రి, అన్నంపెట్టినవాడు, భయంనుండి రక్షించినవాడు - ఈ ముగ్గురూ తండ్రులు. ఈ శాస్త్రార్థానుగుణంగా మేము ఈమెకు భయత్రాతలం కనుక గురువులం. ఈమె మా చేత పెంచబడింది. కాబట్టి మాకు హృదయానందని అయిన నందన.

ఈ విధంగా కణ్వమహాముని ఆ మునికి చెప్పిన తీరును వివరంగా శకుంతల దుష్యంతుడికి చెప్పింది.

దుష్యంతుడు తనలో ఇలా అనుకొన్నాడు. "ఈ శకుంతల ముని శ్రేష్ఠుడైన కణ్వుని పుత్రిక అని నా హృదయం, ఇప్పటిదాకా ఎంతో నిస్పృహతో ఉంది. ఇప్పుడు ఈమె రాజపుత్రినని తన అభిజాత్య సంపదను తెలియజేసింది. ఇక నా హృదయం మన్మథబాణాలకు గురి అయింది. తుమ్మెద పాటుతో కంపించిన పద్మంలాగా సంచలించింది." ఇలా అంటూ కామాతురుడయ్యాడు దుష్యంతుడు. తన మీద శకుంతలకు అనురాగం ఉన్నట్లు గమనించి ఇలా అన్నాడు "ఓ శకుంతలా ! నీ రూపలావణ్యాలు ఈ నారచీరలకు, ఈ అడవి పండ్ల ఆహారాలకు, ఈ చెట్లకొమ్మల క్రింది కుటీర నివాసాలకు తగినవా ? కావు. నీవు ఈ మునిపల్లెలో ఉండడమెందుకు ? నాకు భార్యవై మహారాజ్య మహనీయ సౌఖ్యాన్ని అనుభవించు. చంద్రకిరణ స్వచ్ఛ సౌధాల్లో, బంగారు నేలమీద సంచరించు. అష్టవిధ వివాహాలలో గాంధర్వ రాక్షసాలు క్షత్రియులకు చాలా ప్రశస్తాలు. నీకూ నాకూ స్నేహాన్ని ప్రేమను మన్మథుడు పెంచనారంభించాడు. మనకు గాంధర్వ వివాహం యుక్తమైనది."

ఆ మాటలు విని శకుంతల లజ్జా వనతవదనమై ఇలా అన్నది. 'దయామయులూ, ధర్మ స్వరూపులైన మా తండ్రిగారు కొద్ది సేపట్లో వస్తారు. వారు నన్ను నీకిస్తే వివాహం చేసుకో ! " అప్పుడు దుష్యంతుడు "తనకు తానే చుట్టం, తానే గతి తనను తానే అర్పించుకోవాలి - ఇది అతి రహస్యమూ అమంత్రకమూ అయిన గాంధర్వ వివాహ విధానం" అని శకుంతలను అంగీకరింపజేశాడు. అనంతరం ఆమె దుష్యంతుడితో "నీ దయవల్ల నాకు కలిగిన కుమారుణ్ణి యౌవరాజ్యాభిషిక్తుడిగా చేయాలి. నీవు ప్రసన్న బుద్ధితో ఈ వరం దయచెయ్యి. అలా అయితే నీకూ నాకూ సంగమం అవుతుంది" అని అన్నది. ఆ మాటలు విని దుష్యంతుడు ఎంతో సంతోషంతో ఆమె కోరిన వరం ఇచ్చాడు. గాంధర్వ వివాహ పద్ధతిలో అభిమతసుఖాలను అనుభవించాడు. ఆమెను వీడ్కొని వెళ్లేటప్పుడు " త్వరలో నిన్ను తోడ్కొని రావడానికి నా మంత్రుల్ని కణ్వమహాముని దగ్గరకు పంపుతాను" అని ఊరడించి దుష్యంతుడు తన పట్టణానికి వెళ్లాడు.

ఇక్కడ శకుంతల తాను చేసిన పనిని కణ్వమహర్షి తెలిసికొని కోపిస్తాడేమో అని భయపడుతున్నది. తరువాత ఆ మహర్షి వనం నుండి కందమూల ఫలాలు తీసుకొని వచ్చాడు. లలిత శృంగార భావంతో సిగ్గుతో తలవంచుకొని భయపడుతున్న కూతురును చూశాడు. దివ్యజ్ఞానంతో విషయమంతా తెలుసుకున్నాడు. క్షత్రియులకు గాంధర్వ వివాహం విధి చోదితమే అని సంతోషించాడు. కణ్వమహర్షి శకుంతలతో "అమ్మా ! నీకుల గోత్ర సౌందర్యాలకు తగిన భర్తను పొందావు. గర్భవతివి అయ్యావు. నీ గర్భంలో ఉన్న బిడ్డ చక్రవర్తి సుమా ! నీ ధర్మ చరిత్రకు మెచ్చుకున్నాను. నీవు కోరిన వరం ఇస్తా ! కోరుకో ! " అన్నాడు. అప్పుడామె తన మనస్సు ధర్మలగ్నమై ఉండాలనీ, తన కుమారుడు దీర్ఘాయురారోగ్యైశ్వర్య బల సమన్వితుడూ, వంశకర్తా కావాలి అని కోరుకున్నది. ఆ మహర్షి కరుణించి ఆమె కోరిన వరాలు ఇచ్చాడు.

కణ్వుడు శకుంతలకు కాలోచిత విధ్యుక్త గర్భసంస్కార సంరక్షణలు చేయించాడు. భరతుడు జన్మించాడు. భరతుడు కణ్వ నిర్వర్తిత జాతకర్మాది క్రియాకలాపుడై పెరుగుతున్నాడు. అతడు కరతలాలంకృత చక్రుడూ, చక్రవర్తి లక్షణ లక్షితుడూ, సర్వాంగ సుందరుడూ, దీర్ఘ బాహుడూ అనంత జవసత్వ సంపన్నుడూ అయి ప్రకాశిస్తున్నాడు.

మహాభయంకరమైన ఆ అడవిలో తిరిగే అడవి పందుల్ని, సర్పాల్ని పెద్ద పులుల్ని, ఖడ్గమృగాల్ని, మదపుటేనుగుల్ని, ఇంకా తక్కిన జంతువుల్ని తెచ్చి కణ్వాశ్రమ సమీపంలోని వృక్షాలకు వరుసగా కట్టి వేస్తున్నాడు. మహాబలంతో మదించిన ఏనుగుల్ని అధిరోహిస్తున్నాడు. ఇలా తన బలాన్ని చూపుతూ శకుంతలా నందనుడు శైశవ క్రీడల్ని సాగిస్తున్నాడు.

అరణ్యంలో ఉన్న అన్ని జంతువుల్ని తన మహాబలంతో అణచివేస్తున్న భరతుణ్ణి చూచి అక్కడి ఋషులు అతనికి సర్వదమనుడని పేరు పెట్టారు. కణ్వమహాముని కూడా భరతుడి మహావర్చస్సుకు, రూపరేఖలకు, పరాక్రమానికి సంతోషించాడు. యౌవరాజ్యాభిషేకానికి అర్హుడయ్యే సమయం సమీపించిందని భావించాడు.

కణ్వమహర్షి ఒకనాడు తన కూతురు శకుంతలతో ఇలా అన్నాడు : "ఎంత పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువకాలం ఉండడం అంత మంచిది కాదు. భర్తల దగ్గర ఉండడమే స్త్రీలకు ధర్మం. భార్యలకు సంరక్షకులు భర్తలేసుమా! కనుక నీవు ఈ కుమారుణ్ణి తీసుకొని నీ భర్త దగ్గరకు వెళ్లు" అని చెప్పి మహా తపోధనులైన కొంతమంది శిష్యుల్ని తోడు పంపాడు. శకుంతల భరతుణ్ణి తీసుకొని దుష్యంతుడి దగ్గరకు వచ్చింది. అప్పుడు దుష్యంతుడు సామంతమంత్రి పురోహిత ప్రధాన పౌరజన పరివృతుడై ఉన్నాడు.

శకుంతల దుష్యంతుణ్ణి చూచింది. ఇంతకు ముందు తన తండ్రి ఆశ్రమంలో భర్తవల్ల తాను పొందిన అనురాగం, ఆదరం, సంభ్రమం, ఇప్పుడు కనిపించలేదు. ఇలా ఆలోచించింది. "ఇతడు నన్ను ఎరుగడా ? తెలిసికూడా తెలియనట్లు ఉన్నాడా ? చాలాకాలం, చాలాదూరం కావడం వల్ల మరచిపోయాడా? రాజులు మోహపరవశులు కనుక మరిచిపోకుండా ఉంటారా? అదికాక ప్రభువులు ఎన్నో పనుల్లో మునిగిపోయి ఉంటారు కదా? పూర్వం ఇచ్చిన మాటను మనస్సునుంచి తొలిగించుకొన్నాడేమో ! చూపులు సరసంగా లేవు సరే! విరసంగా, క్రూరంగా తయారయ్యాయి. కారణం ఏమిటో ! కలుపుగోలుతనంతో పలకరించారని, ఉపకారం చేశారని బుద్ధిమంతులైన వారు రాజుల్ని నమ్మి ఉండకూడదు. రాజులు కొత్తవారి పట్ల మోజుతో ఇంతకుముందు ఉన్న ప్రేమపాత్రుల్ని వదలివేస్తారు".

ఇలా ఆలోచించి చింతాక్రాంత అయింది శకుంతల. మళ్లీ మనస్సులో ఇలా అనుకొన్నది. "ఎవరైనా నిజంగా మరచిపోతే గుర్తు చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్ని విధాలా తెలిసేటట్లు చేయవచ్చు. కాని తెలిసి ఉండి, ఇతరులు చెప్పేది వినడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం ఆ బ్రహ్మకు కూడా తరం కాదు. అయినా ఇక్కడి దాకా వచ్చి ఊరక తిరిగి పోగూడదు. కాబట్టి నా పూర్వ వృత్తాంతం మొత్తాన్ని చెప్పి ఈ కుమారుణ్ణి చూపుతాను" అని శకుంతల తన మనస్సులో అట్లా నిశ్చయించుకొని దుష్యంతుడితో ఇలా అన్నది. "ఓ రాజా ! నీవు వేట నెపంతో ఉద్దేశపూర్వకంగా కణ్వాశ్రమానికి వచ్చి సంతోషంతో నాకు ఇచ్చిన వరాన్ని గుర్తుతెచ్చుకో ! బాలసూర్యుడితో సమానమైన తేజస్సు కలిగిన ఈ బాలుడు నీ కుమారుడు. పౌరవవంశరత్నా భరణుడూ, సద్గుణ నిలయుడూ అయిన వీడికి పట్టాభిషేకం జరిపించి యువరాజుగా చెయ్యి".

దుష్యంతుడు అంతా తెలిసికూడా తెలియని వాడిలాగా ఇట్లా అన్నాడు: "నేను నిన్ను ఎరుగను! నీవు ఎక్కడి దానివి? ఊరకే అనగూడని మాటలు అంటావెందుకు ? ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికి వేగంగా వెళ్లు !"

శకుంతల దుష్యంతుడి మాటల్ని విని తెల్లబోయింది. వేడినిట్టూర్పులు వదలింది. నిశ్చేష్టురాలైంది. ఎర్రతామర రేకుల నుంచి జారుతున్న నీటిబొట్లులాగా కోపంతో ఎరుపెక్కిన ఆమె కళ్లనుంచి బాష్పబిందువులు స్రవిస్తూ ఉన్నాయి. ఆమె తలవంచి ఆ రాజును కడకంట చూస్తూ, హృదయ సంతాపాన్ని తనకు తానే అణచుకొన్నది. చాలాసేపు విచారించింది.

శకుంతల రాజుతో ఇలా అన్నది : "జ్ఞానంలేని ఇతరుల్లాగా నీవు ఎరుగనంటున్నావు. అన్నీ తెలిసి కూడా ఇలా ఎందుకు మాటాడుతున్నావు? నేను తప్ప ఇక్కడ ఉన్నవారు ఎవ్వరూ దీని నెరుగరని ధార్మికులైనవారు అబద్ధమాడవచ్చా? వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, సంధ్యలు, అంతరాత్మ, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు ఉండగా మానవుడు తన్ను తాను

మోసగించుకోవడానికి పూనుకుంటాడా ? పూనుకోడు. ఓ రాజా! నీవు ఇచ్చిన వరం నాకు తెలిసినట్లే వీటి అన్నిటికీ తెలుసు. కనుక నా మీద పూర్వంలాగే దయచూపించు. తిరస్కరించడం తగినపని కాదు. పతివ్రత, గుణశాలిని, సంతానవతి, అనువ్రత అయిన అనురాగవతి అయిన భార్యను తిరస్కార దృష్టితో చూచే దుర్బుద్ధికి భూలోక సుఖంలేదు, స్వర్గలోక సుఖంలేదు. అనుగుణమైన భార్య కలవాడు శాశ్వతమైన గృహస్థ ఫలితాన్ని పొందుతాడు. యజ్ఞయాగాది కర్మలు చేసేవాడు, తపఃక్లేశాన్ని సహించేవాడు, పుత్రవంతుడూ అవుతాడు.

"ఇంకా ధర్మార్థ కామసాధనకు సాధనం, గృహనీతి విద్యకు గృహం, స్వచ్ఛమైన నడవడిని బోధించడానికి గురుస్థానం, వంశవృద్ధికి మూలం, మంచి మార్గంలో నడవడానికి ఊత, గౌరవానికి ప్రధానకారణం, సద్గుణమణులకు గని, హృదయ సంతోషాన్ని కలిగించేది భార్యయే సుమా ! కనుక భర్తకు తక్కినవి ప్రియం కావు. అరణ్య వాసాది క్లిష్టమట్టాలలోను, ఆపదలలోను, అవసరాల్లోను చుట్టుముట్టిన శోకాలన్నీ గూడా, భార్యల్ని సంతానాన్ని చక్కగా చూచుకునే ప్రజలకు సులభంగా తొలగిపోతాయి.

"భార్య పురుషుడిలో అర్ధభాగం. భర్తకన్నా ముందే మరణించిన పతివ్రత పరలోకంలో తన భర్తకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఒకవేళ తనభర్త ముందే మరణిస్తే వెంటనే తానుకూడా మరణించి తన భర్తను కలిసి పరలోకానికి పోతుంది. అటువంటి భార్యను అవమానించడం అధర్మం. ఇంకా భర్త భార్యలో ప్రవేశించి గర్భంలో పుత్రుడై తానే జన్మిస్తాడు. కనుక "అంగా దంగాత్ సంభవసి" (ప్రతి శరీరంలోనుంచి జన్మిస్తున్నావు) మొదలైన వేదవాక్కుల్లోనూ తండ్రీ కొడుకూ అనే తేడాలేదు. గార్హపత్యం అనే అగ్ని వేరే ప్రదేశంలో అహవనీయమనే పేరుతో ప్రకాశించేటట్లు తండ్రి తానే కుమారుడిగా తన తేజస్సుతో వెలుగుతుంటాడు. తానే తన ప్రతిబింబాన్ని నీళ్లలో స్పష్టంగా చూచేటట్లు తండ్రి తన కొడుకును తాను చూచి అధిక ప్రీతితో మహానందాన్ని పొందుతాడు. 'పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః' (పుత్ అనే పేరుగల నరకంనుంచి రక్షిస్తాడు కనుక పుత్రుడు) అనే వేదవాక్యం ఉంది. కాబట్టి పుణ్యాచారుడైన పుత్రుడు తల్లివంక వారిని తండ్రివంక వారిని ఉద్ధరిస్తాడు. వారికి ఉత్తమ గతులు కలిగిస్తాడు.

"కాబట్టి దీపం నుంచి మరో దీపం పుట్టినట్లు నీ పుణ్యశరీరం నుంచి ఈ కుమారుడు పుట్టి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. ఓ మహారాజా ! విరుద్ధమైన ప్రత్యుత్తరాలు ఎందుకు? ఈ కుమారుడి శరీరాన్ని కౌగిలించుకోవడం వల్ల కలిగే సుఖాన్ని పొందు. ముత్యాలహారాలు, కర్పూర ధూళి, మంచి గంధం, వెన్నెల కుమార శరీరాలింగనం లాగా జీవులకు హాయిని కలిగిస్తాయా? అధికమైన చల్లదనాన్ని కలిగిస్తాయా? కలిగించవు. నీ కుమారుడు పుణ్యాత్ముడూ వంశోద్ధారకుడై అధిక్యంతో వంద వాజపేయయాగాలు చేస్తాడని మునులందరూ వింటూ ఉండగా ఆకాశవాణి నన్నుద్దేశించి అన్నది. కనుక ధర్మాన్ని ప్రేమించే మహారాజా ! న్యాయమైన బుద్ధికలవాడా! శాస్త్రచింతనాదుల వల్ల కలిగే అర్థ నిర్ణయ జ్ఞానం కలిగినవాడా ! ఆనాటి సత్యం ఎటూ ఉన్నది. నీవు నిష్కారణంగా ఇటువంటి సమస్త సద్గుణ సంపన్నుణ్ణి, వంశోద్ధారకుణ్ణి కాదనడం న్యాయమా?

"ప్రశస్తమైన నీటితో నిండిన నూరు నూతులకన్నా ఒక బావి శ్రేష్ఠమైనది. నూరుబావుల కన్నా ఒక మంచి యజ్ఞం శ్రేష్ఠమైనది. నూరు యజ్ఞాలకన్నా ఒక కుమారుడు శ్రేష్ఠం. నూరుగురు కొడుకులకన్నా బాగా ఆలోచిస్తే ఒక సత్యవాక్యం శ్రేష్ఠం. వెయ్యి అశ్వమేధాల్ని, ఒక సత్యాన్ని త్రాసులో రెండు ప్రక్కలా పెట్టి తూకం వేస్తే అధికమైన భారం కారణంగా సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. అన్ని తీర్థాలను పొందడం (యాత్ర చేసి చూడడం), అన్ని వేదాలను పొందడం (చదవడం), సత్యంతో సమానం కావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాలలో సత్యమే గొప్పదని అంటారు. గమనించు !

"కాబట్టి నీవ్వు స్వచ్ఛమైన ప్రతిభతో సత్యమే గొప్పదని భావించి, కణ్వాశ్రమంలో అనుకున్న మాటప్రకారం దయ ఉంచి కొడుకును దయార్ద్రదృష్టితో చూడు. క్షత్రియ శ్రేష్ఠమైన విశ్వామిత్రుడికి, పవిత్రురాలైన మేనకకు కూతురునై అబద్ధం ఆడడానికి నేను అంత అధర్మపరురాలినా?"

ఇలా అన్న శకుంతల మాటల్ని ఆదరించడానికి అంగీకరించలేదు దుష్యంతుడు. ఇలా అన్నాడు. "నేనెక్కడ? నువ్వెక్కడ? కొడుకెక్కడ! నేను ఇంతకు పూర్వం ఎప్పుడూ నిన్ను చూచి ఎరుగను. 'ఆడవాళ్లు అబద్ధాలాడే వాళ్లు' అనేటట్లు అసత్యమాడడం తగిన పనేనా? ఇంకా ఇలా అన్నాడు. "ఎత్తులో వయస్సులో చాలా అధికమైన బలంతో సాటిలేని వీణ్ణి నీ కొడుకని చూపించడానికి తీసుకు వచ్చావా? అందరూ నవ్వుతున్నారు ! ఇటువంటి లోకవిరుద్ధాలకు మేము సంకోచిస్తున్నాం. అయుక్తమైన మాటలుమాని నీ ఆశ్రమానికి పో !"

అట్లా దుష్యంతుడనగానే శకుంతల మనస్సు మలమల మాడిపోయింది. "పుట్టిన వెంటనే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్త కూడా విడిచి వేస్తాడేమో ! వేయి మాటలెందుకు ? పూర్వజన్మలో ఎంతో తక్కువ నోములు నోచి ఉంటాను. లేకపోతే ఇదేమిటి ? అంటూ బాధ పడింది. ఆశలు వదలుకున్నది". కన్నీరు ఒత్తుకొంటూ ఇక "దేవుడే దిక్కు" "అన్యథా శరణం నాస్తి" అని ఆ మహాపతివ్రత తన కుమారుణ్ణి తీసుకొని పోబోయే సమయంలో ఒక అద్భుతం జరిగింది.

ఆకాశవాణి ప్రయత్న పూర్వకంగా, ఆ సభలోని వారంతా ఆశ్చర్యచకితులౌతూ ఉండగా రాజుతో ఇలా అన్నది. "వీడు శకుంతలకూ నీకూ ప్రియపుత్రుడు. నీ బిడ్డను నీవు దగ్గరకు తీసుకొని పోషించు ! శకుంతల పతివ్రతలందరూ బాగా ప్రశంసించే మహాపతివ్రత" అని వివేకంతో సత్యాన్ని పలికింది. అప్పుడు ఆకాశం నుంచి దేవతల మాటలు అతిస్పష్టంగా వినిపించాయి. అవి శకుంతల పతివ్రతాత్వ ప్రశంసలు. సత్యప్రశంసలు. భరతోత్పత్తి ప్రశంసలు. ఆ మాటలు అందరికీ సంతోషాన్ని కలిగించాయి.

అప్పుడు దుష్యంతుడు సభలోని వారందరూ వినేటట్లు ఇలా అన్నాడు "నేను కణ్వమహాముని ఆశ్రమంలో గాంధర్వ వివాహ పద్ధతిలో శకుంతలను పెండ్లాడిన విషయం మా ఇద్దరికే తప్ప ఇతరులకు తెలియదు. ఇతరులకు తెలియదుగదా ! అని లోకాపవాద భీతితో నేను ప్రీతిని విడిచి ఈమెను ఎరిగికూడా ఎరుగనన్నాను. ఆకాశవాణి ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఇక్కడ ఉన్న వారందరికీ తెలిసేటట్లు చెప్పింది."

దుష్యంతుడు ఎంతో అనురాగంతో కొడుకును ఎత్తుకొని సంతోషం వలన గగుర్పాటు ఎక్కువ కాగా కొడుకును కౌగలించుకున్నాడు. శకుంతలా మహాదేవిని ఎంతో ప్రేమతో గౌరవించాడు. భరతుణ్ణి యౌవరాజ్యానికి అభిషిక్తుణ్ణి చేశాడు. దుష్యంతుడు చాలాకాలం రాజ్యసుఖాలు అనుభవించాడు. ఆ తరువాత తన రాజ్యభారాన్ని భరతుడి మీద మోపి తపోవనానికి వెళ్లాడు.

భరతుడు సువిశాల భూభారాన్ని వహించినవాడై లోక ప్రసిద్ధిని పొందాడు. గంగాయమునా తీరప్రదేశాల్లో అనేక యాగాలను మంచి నిష్ఠతో చేశాడు. బ్రాహ్మణులకు బంగారాన్ని, ఆవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని, దక్షిణలు ఇచ్చాడు. వంశకర్త అయ్యాడు.

### 1.1.2. సమగ్ర వ్యాఖ్యలు :

**పద్యం 8 :**

ఆ దుష్యంతుఁ డనంత సత్త్వుఁడు సమస్తాశాంత మాతంగ మ
ర్యాదాలంకృతమైన భూవలయ మాత్మాయత్తమై యుండఁగా
నాదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్య దేశాళితో
నాదిక్షత్త్ర చరిత్ర నేలె నజితుండై బాహు వీర్యంబునన్.

**పరిచయం :**

ఈపద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

దుష్యంత మహారాజు రాజ్యపరిపాలనను కవి వర్ణిస్తున్న సందర్భంలోది ఈ పద్యం.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| న + అంత సత్త్వుడు | = | మేరలేని బలం కలిగిన వాడైన;<br>శేషుని వంటి విష్ణువు వంటి బలం కలిగిన వాడైన |
| ఆ దుష్యంతుడు | = | ఆ దుష్యంత మహారాజు |

| | | |
|---|---|---|
| బాహు వీర్యంబునన్ | = | భుజబలంతో |
| అజితుండు + ఐ | = | గెలువబడిన వాడై: త్రిమూర్తుల వంటివాడై |
| ఆదిత్య + అంశు | = | సూర్యకిరణాలు |
| సమీర | = | వాయువు |
| దుర్గమ | = | ప్రవేశించరానిదైన |
| మహా + ఉగ్ర + అరణ్యదేశ + ఆళితోన్ | = | చాలా భయంకరమైన అరణ్య ప్రదేశాల సమూహంతో |
| సమస్త + ఆశా + అంత | = | అన్ని దిక్కుల చివరలలో ఉన్న |
| మాతంగ | = | ఏనుగులే |
| మర్యాదా + అలంకృతము + ఐన | = | హద్దుగా అలంకరించబడిన |
| భూవలయము | = | గుండ్రని నేల |
| ఆత్మ + ఆయత్తము + ఐ + ఉండన్ + కాన్ | = | తన ఆధీనమై ఉండగా |
| ఆదిక్షత్ర చరిత్రన్ | = | పూర్వరాజుల నడవడిలో |
| ఏలెన్ | = | పరిపాలించెన్. |

**తాత్పర్యం :** ఆ దుష్యంత మహారాజు అంతంలేని బలం కలవాడు. సూర్య కిరణాలూ, గాలీ కూడా ప్రవేశించలేని చిక్కని వనులలో కూడి ఉన్న భూమిని పరిపాలించాడు. ఆయన సామ్రాజ్యానికి దిగ్గజాలే హద్దులు. ఆయన భుజబలంలో ఎవరికీ లొంగలేదు. పుణ్యాత్ములైన పూర్వరాజుల మార్గంలో ఏలుబడిని కొనసాగించాడు.

**కవితా విశేషాలు :**

ఈ పద్యంలో నన్నయ దుష్యంతుడి సామ్రాజ్య విస్తీర్ణతను సుదీర్ఘ సమాస బంధురంగా వర్ణించాడు. దుష్యంతుడి భూభారవహనంలో శేషుణ్ణి విష్ణువును ఇంకా బ్రహ్మరుద్రులనూ స్ఫురింపజేసి మన కథానాయకుణ్ణి మహనీయుడిగా తీర్చి దిద్దాడు.

వృత్త రచనలో ఎంతో ప్రవీణుడైన నన్నయ సందర్భోచితంగా ఈ శార్దూలాన్ని చాలా గంభీరంగా నడిపాడు.

**17. ఉ**

అతిరుచిరాగతుం డయిన యాతనికిన్ హృదయ ప్రమోద మా
తతముగ నవ్వనంబున లతాలలనల్ మృదులానిలావ వ
ర్జిత కుసుమాక్షతావళులు సేసలు వెట్టిన యట్టి రైరి సం
పతదళినీ నినాద మృదు భాషల దీవన లొప్ప నిచ్చుచున్.

**పరిచయం :**

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

దుష్యంత మహారాజు మృగయా వినోదంలో ఎన్నో మృగాల్ని తరిమి చంపాడు. ఇంకా చంపే వేడుకతో చాలా దూరం వెళ్లి ఒక వనాన్ని చూశాడు. దాని రమణీయతను ప్రశంసిస్తూ వచ్చి అందులో ప్రవేశించాడు. ఆ వనం ఆయనను సత్కరించిన సందర్భంలోది ఈ పద్యం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| అతి రుచిర + ఆగతుండు + అయిన | = | చాలా మనోహరమైన రాక కలవాడైన |
| ఆతనికిన్ | = | ఆ దుష్యంత మహారాజుకు |
| హృదయ ప్రమోదము | = | మనస్సంతోషం |
| ఆతతముగ | = | విస్తారమయ్యేటట్లుగా |
| ఆ + వనంబున | = | ఆ వనంలోని |
| లతాలలనల్ | = | తీగలనే స్త్రీలు |
| సంపతత్ | = | వాలుతున్న |
| అళినీ నినాద | = | ఆడు తుమ్మెదల రొదలనే |
| మృదు భాషలన్ | = | మెత్తని మాటలతో |
| దీవెనలు | = | ఆశీస్సులు |
| ఒప్పన్ | = | చక్కగా |
| ఇచ్చుచున్ | = | ఇస్తూ |
| మృదుల + అనిల | = | సుకుమార వాయువుచే |
| ఆపవర్జిత | = | రాల్చబడ్డ |
| కుసుమ + అక్షత + ఆవళుల | = | పూలనే అక్షతల సమూహంతో |
| సేసలు + పెట్టిన + అట్టిరు + ఐరి | = | అక్షతలు చల్లిన వాళ్ల అయ్యారు |

తాత్పర్యం : దుష్యంతుడు చాలా మనోహరంగా వస్తున్నాడు. అతని మనస్సుకు ఆనందం అధికమయ్యేటట్లుగా ఆ వనంలోని తీగల నుంచి పిల్లగాలుల స్పర్శకు పూలు రాలి అతనిపై పడ్డాయి; ఆడు తుమ్మెదలు ఝుంకారాలతో వీనులవిందు చేస్తున్నాయి. ఇది ముత్తైదువులు అక్షతలు చల్లుతూ ఆశీస్సులు పలికినట్లుగా ఉంది.

కవితా విశేషాలు :

నన్నయగారు ఇక్కడ దుష్యంతుడికి త్వరలో జరగనున్న వివాహాన్ని స్ఫురింపజేశాడు. దుష్యంత వివాహం ఈశ్వర సంకల్పం. అందువల్లనే దుష్యంతుడు అతిరుచిరాగతుడు. సేసలు అంటే తలంబ్రాలు అని కూడా అర్థం.

ఈ పద్యంలోని రూపకాలంకారం మనోజ్ఞం. ఇక్కడ మత్తేభ, శార్దూలాది ఉద్ధత వృత్తాల్ని వాడకుండా సుకుమారమైన చంపకమాలను వాడడం ఔచిత్యశోభితం.

25. ప.

వలయు నమాత్యులం దగిన వారల నుండఁగఁబంచి ధారుణీ
తలవిభుఁ డొక్కరుండ చని తన్విఁ బయోజదళాయతాక్షి సం
కుల మిళితాళి నీల పరికుంచిత కోమల కుంతలన్ శకుం
తల యను కన్యకం గనియెఁదన్మునివల్లభు మందిరంబునన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

దుష్యంతుడు కణ్వాశ్రమాన్ని చూశాడు. అతనితో పాటు ఉన్న మంత్రులు మొదలైన వారితో "మీరు ఇక్కడే ఉండండి! నేను కణ్వమహాముని దర్శనం చేసుకొని వస్తాను" అని కణ్వ మహాముని మందిరానికి వెళ్లాడు. శకుంతలను చూశాడు.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ధారణీతల విభుడు | = | మహారాజు (దుష్యంతుడు) |
| వలయు + అమాత్యులన్ | = | ఇష్టులైన మంత్రులను |
| తగిన వారలను | = | యుక్తమైన వారిని |
| ఉండగన్ + పంచి | = | అక్కడే ఆగమని ఆజ్ఞాపించి |
| ఒక్కరుండు + అ | = | ఒక్కడే |
| చని | = | వెళ్లి |
| తత్ + మునివల్లభు | = | ఆ ముని శ్రేష్ఠుని (కణ్వుని) |
| మందిరంబునన్ | = | ఇంటిలో |
| తన్విన్ | = | బక్క పలుచనిదీ |
| పయోజదళ + ఆయత + అక్షి | = | తామర రేకులు లాగా విశాలమైన కళ్లు కలదీ |
| సంకుల | = | విస్తారమైన |
| మిళిత | = | కలిసిన (చిక్కని) |
| అళినీల | = | తుమ్మెదలవలె నల్లనైన |
| పరికుంచిత | = | బాగా వంకరలు తిరిగిన |
| కోమల | = | మృదువైన |
| కుంతలన్ | = | వెంట్రుకలు కలదీ అయిన |
| శకుంతల + అను | = | శకుంతల అనే పేరుగల |
| కన్యకన్ | = | పెండ్లికాని పడుచును |
| కనియెన్ | = | చూశాడు |

తాత్పర్యం : దుష్యంతుడు అందరినీ ఆగమని చెప్పి ఒక్కడే వెళ్లి శకుంతలను చూశాడు. ఆమె బక్కపలుచగా ఉంది. తామర రేకుల్లాంటి విశాలనేత్రాలతో విరాజిల్లుతున్నది. బాగా వ్యాపించిన చిక్కని నల్లని వంకరలు తిరిగిన నున్నని జుట్టుతో ప్రకాశిస్తున్నది.

కవితా విశేషాలు :

నన్నయగారు శకుంతల సౌందర్యాన్ని ఎంతో ఉదాత్తంగా వర్ణించారు. ముచ్చటైన మూడు విశేషణాలలో ఒకటిన్నర పాదంలోనే ఆ దివ్య సౌందర్యాన్ని రూపు కట్టించారు. ఇంకొక కవి అయితే అందునా ప్రబంధ కవి అయితే అంగాంగ శృంగారాన్ని అభివర్ణించి ముప్పై నలభై పద్యాలు వ్రాసేవాడే. ఇది అమలిన శృంగారం. శకుంతల సౌందర్యం ఆమె కేశపాశంలో ఉందనిపిస్తోంది. నన్నయ ఆరామణీయకాన్ని సురుచిర సమాసంలో నిక్షేపించాడు. అంత్యానుప్రాస, ఉపమాలంకారాలు అప్రయత్న సిద్ధాలు. ఈ సౌందర్య వర్ణనకు చంపకమాలను స్వీకరించి ఆదికవి వృత్తౌచిత్య పాలనను ప్రదర్శించాడు.

51. ఉ

ఇది మునినాథ కన్య యని యెంతయు నిస్పృహవృత్తి మన్న నా
హృదయము రాజపుత్రి యని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించినన్ మదనబాణ పరంపర కిప్పుడుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

దుష్యంతుడు కణ్వమందిరంలో శకుంతలను చూశాడు. మన్మథరాజ్యలక్ష్మి లాంటి ఆమెను చూచి సంచలిత హృదయుడై 'నీ వెవరి కూతురివి' అని అడిగాడు. ఆమె తాను కణ్వాత్మజనని చెప్పింది. 'ఇది ముని కన్యయేని మఱి యేలొకొ యీ లలితాంగి యందు నా హృదయము దగ్గయుందవిలె ?' నని నమ్మలేక పోయాడు. ఊర్ధ్వరేతుడైన కణ్వుడికి నీవెలా కూతురివయ్యావు ? అని ప్రశ్నించాడు. అప్పుడు ఆమె, పూర్వం కణ్వుడొక మహర్షికి చెప్పిన తన జన్మ వృత్తాంతాన్ని చెప్పింది. అనంతరం దుష్యంతునకు కలిగిన ఆలోచన ఈ పద్యంలో ఉంది.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ఇది | = | ఈ శకుంతల |
| మునినాథ కన్య + అని | = | ఋషి కన్య అని (కణ్వ మహాముని కూతురని) |
| ఎంతయు | = | ఎంతో |
| నిస్పృహవృత్తిన్ + ఉన్న | = | ఆశలేని నడవడితో ఉన్న |
| నా హృదయము | = | నా మనస్సు |
| ఈ + కమల + అక్షి | = | ఈ పద్మ నేత్ర అయిన శకుంతల |
| రాజపుత్రిని + అని | = | క్షత్రియుడైన విశ్వామిత్రునకూ అప్సరోంగన అయిన మేనకకూ పుత్రికనని |
| నిజ + అభిజాత్య సంపదను | = | తన గొప్ప ఇంటి పుట్టుక కలిమిని |
| ఎఱిగించినన్ | = | తెలుపగా |
| ఇప్పుడు | = | ఈ సమయంలో |
| మదనబాణ పరంపరకు | = | మన్మథ బాణాల వరుసకు |
| ఉండన్ + ఆస్పదము + అయి | = | ఉండడానికి చోటై |
| అళిపాత | = | తుమ్మెదల పాటువల్ల |
| వికంపిత | = | బాగా వణకెత్తిన |
| పంకజ + ఆకృతిన్ | = | తామరపువ్వు రూపంగా |
| సంచలించెన్ | = | బాగా కదిలింది. |

**తాత్పర్యం :** ఈ శకుంతల కణ్వమహర్షి పుత్రిక అని, ఋషి కన్య అని నేను నిరాశలో మునిగి పోయాను. ఈమె విశ్వామిత్రుడి సంతానాన్ని అని చెప్పడం వల్ల క్షత్రియ కన్య అని తేలిపోయింది. వెంటనే మన్మథబాణాలు వరుసగా నా హృదయాన్ని తాకుతున్నాయి. తుమ్మెదలు పైన పడడం వల్ల వణకిపోయే తామరపువ్వులాగా ఉంది నా మనస్సు అని దుష్యంతుడు భావించాడు.

**కవితా విశేషాలు :**

ఇక్కడ దుష్యంతుడి పవిత్ర హృదయం వ్యక్తమౌతున్నది. దీన్ని కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల నాటకంలో చక్కగా విశ్లేషించాడు. "సతాం హి సందేహ పదేషు వస్తుషు / ప్రమాణ మంతః కరణ ప్రవృత్తయం" అన్నాడు. నన్నయ దీన్ని గమనించి "ఇది ముని కన్యయేని" (ప. 30) పద్యంలో సందేహాన్ని ప్రారంభించాడు. ఈ పద్యంలో ముగించాడు

పౌరవ వంశ సంభవుల పావన చిత్త విధంబు లన్య కాం
తారతికిం బ్రమోద కలితంబులు కావు ........ (శృం.. శా. 2 - 65)

అని పిల్లలమర్రి పిన వీరభద్రకవి తన శృంగార శాకుంతలంలో మరింత స్పష్టం చేశాడు.

నన్నయ గారు ఈ పద్యంలో ఉపమాలంకారాన్ని సముచితంగా ప్రయోగించి దుష్యంత హృదయ ప్రకంపనాల్ని మనకు అందించాడు. ఈ సుకుమార సన్నివేశానికి ఈ చంపకమాలాచ్ఛందస్సు అనుగుణంగా ఉంది.

70 ప.

తలఁపఁగ నాఁడు వల్కిన విధం బెడఁదప్పఁగ వీడెనొక్కొ చూ
డ్కులు విరసంబులై కరము క్రూరములైన నిమిత్త మేమియో
కలయఁగఁ బల్కరించి రుపకారులు నై రని నమ్మియుండఁగా
వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులన్.

**పరిచయం :**

ఈపద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :**

శకుంతలను భర్తదగ్గరకు వెళ్లమని మహాతపోధనులైన శిష్యులను కొంతమందిని తోడిచ్చి పంపించాడు కణ్వమహర్షి. ఆమె తన కుమారుడైన భరతుడితో కూడ దుష్యంతుడి దగ్గరకు వచ్చింది. నిండు కొలువులో ఉన్న దుష్యంత మహారాజును చూచింది. అంతకు పూర్వం తానుభర్త వల్ల పొందిన అనురాగదరానుగ్రహ కరుణా సంభ్రమాలు ఇప్పుడు కనపడలేదు. తదనంతరం శకుంతల ఆలోచించిన తీరు ఈ పద్యంలో ఉంది.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తలఁపగన్ | = | ఆలోచిస్తే |
| నాఁడు | = | ఆనాడు |
| పల్కిన విధంబు | = | అన్నమాట ప్రకారాన్ని |
| ఎడన్ | = | హృదయంలో నుంచి |
| తప్పఁగన్ | = | తప్పిపోయేటట్లుగా |
| వీడెను + ఒక్కొ | = | విడిచి పెట్టాడేమో ! |
| చూడ్కులు | = | చూపులు |
| విరసంబులు + ఐ | = | ప్రేమ లేనివై |
| కరము | = | చాలా |

| | | |
|---|---|---|
| క్రూరములు + ఐన | = | భయంకరాలైన |
| నిమిత్తము | = | కారణం |
| ఏమి + ఓ | = | ఏమిటో ? |
| కలయఁగన్ | = | బాగా కలుపుగోలుతనంతో |
| పల్కరించిరి | = | పలకరించారనీ |
| ఉపకారులున్ + ఐరి + అని | = | మేలు చేశారనీ |
| నవ ప్రియులు + ఐన | = | కొత్తవారి పట్ల మోజుగల వారైన |
| ధరా + అధినాథులన్ | = | భూ భర్తలైన రాజుల్ని |
| బుద్ధిమంతులు | = | బుద్ధి ఉన్నవారు |
| నమ్మి + ఉండన్ + కాన్ + వలవదు | = | నమ్ముకొని ఉండగూడదు. |

**తాత్పర్యం** : ఈ రోజు ఈ రాజు చూపులు ప్రేమ శూన్యాలై ఇలా మరీ భయంకరంగా మారడానికి కారణం ఏమిటో ? కణ్వాశ్రమంలో ఇచ్చిన మాటను తప్పాడేమో ! బాగా కలుపుగోలుతనంతో తియ్యగా పలకరించారని, ఏదో కాస్త ఉపకారం చేశారని బుద్ధి ఉన్న వాళ్లు రాజుల్ని నమ్మకూడదు. ప్రభువులందరూ నవప్రియులు. కొత్తవారు కనపడగానే పాతవాళ్లను ఎంతటి ఆత్మీయుల్ని అయినా వదలి వేస్తారు.

కవితా విశేషాలు :

నన్నయ ఈ పద్యంలో శకుంతల వివేకాన్ని, పరేంగితజ్ఞతను, రాజుల స్వభావాన్ని చక్కగా చిత్రించాడు. ఇది ఆదికవి లోకజ్ఞతకు అద్దం పడుతున్న పద్యం. చివరి రెండు పాదాలలో నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం ప్రస్ఫుటమౌతున్నది. ఇందులోని అలంకారం అర్థాంతరన్యాసం. శకుంతల అంతరంగంలోని చింతను ఈ చంపకమాల చక్కగా వ్యక్తీకరిస్తున్నది.

80. ప.

విమల యశోనిధీ ! పురుష వృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచ భూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్ర సూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొన నేర్చునె తన్ను బ్రుచ్చిలన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

కొలువులో ఉన్న దుష్యంతుడు శకుంతలను ఎరుగునట్లు ప్రవర్తించాడు. ఆమె చింతాక్రాంత అయింది. కణ్వాశ్రమ వృత్తాంతాన్ని వివరించింది. అయినా ప్రయోజనం లేకపోయింది. శకుంతల కళ్లవెంట నీళ్లు కారాయి. తన సంతాపాన్ని తానే ఉపశమించుకొని పలికిన మాటలు ఈ పద్యంలో ఉన్నాయి.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| విమల యశః + నిధీ | = | స్వచ్ఛమైన కీర్తికి పాతర అయినవాడా |
| వేదములును | = | నాలుగు వేదాలు (ఋగ్యజుస్సామాధర్వాలు) |
| పంచ భూతములు | = | భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం |
| ధర్మువు | = | ధర్మదేవత |
| సంధ్యలన్ | = | ఉదయ సాయం సంధ్యలు |
| అంతః + ఆత్మయున్ | = | అంతరాత్మ |
| యముఁడును | = | యమధర్మరాజు |
| చంద్ర సూర్యులును | = | చంద్రుడూ, సూర్యుడూ |
| అహంబును | = | పగలు |
| రాత్రియున్ | = | రాత్రి |
| అన్ | = | అనే |
| మహాపద + అర్థములు | = | గొప్ప పదార్థాలు |
| పురుష వృత్తము | = | మానవుడి నడతను |
| ఎఱుంగుచున్ + ఉండున్ + చూవె | = | తెలుసుకుంటూ ఉంటాయి సుమా ! |
| ఇవి + ఉండన్ + కాన్ | = | ఈ మహా పదార్థాలు సాక్షులుగా ఉండగా |
| నరుడు | = | మానవుడు |
| తన్ను ముచ్చిలన్ | = | తనను తాను మోసగించుకోవడానికి |
| తక్కాన నేర్చునె | = | పూనుకుంటాడా ? (పూనుకోడు అని భావం) |

తాత్పర్యం : నిర్మలమైన కీర్తికి పాతరలాంటి వాడా ! ఓ దుష్యంత మహారాజా ! వేదాలు, పంచభూతాలు, ధర్మదేవత, ఉభయ సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యుడు, చంద్రుడు, పగలు, రాత్రి అవే మహా పదార్థాలు మానవుడి నడవడిని గమనిస్తుంటాయి. ఈ గొప్ప పదార్థాలు సాక్షులుగా ఉండగా మానవుడు ఆత్మవంచనకు పూనుకుంటాడా ? పూనుకోడు. పూనుకోగూడదు.

కవితా విశేషాలు :

శకుంతల ధర్మ చరిత. తన మనస్సు ఎప్పుడూ ధర్మ నిమగ్నంగా ఉండాలని కోరుకొంటుంది. ఆమె ఇప్పుడు దారి తప్పిన దుష్యంతుణ్ణి 'కటాక్షించి', ఎంతో 'చింతించి' చెప్పిన ధర్మాలు ఇవి. విశ్వనాథ వారన్నట్లు "నన్నయ్య గారి శకుంతల యందు ఆకాశనిష్ఠమైన శబ్దబ్రహ్మము నిత్య ప్రసన్నమై యున్నది." శకుంతల ఋషి కల్పురాలు. ఆమె చెప్పిన ధర్మాలెన్నో తెలుగుజాతికి నేటికి ఆరాధ్యాలుగా ఉన్నాయి. నిత్య ప్రసక్తాలై ఉన్నాయి. ఒక శతాబ్దం క్రిందటి మన పత్రాలలో సూర్య చంద్రులు సాక్షులుగా ఉన్నారు. సూర్యుడు కర్మసాక్షి.

ఇక భారతాన్ని వ్రాయించిన రాజరాజు 'పరమ ధర్మ విదుడు' వ్రాసిన నన్నయ 'నిత్య సత్యవచనుడు'. నానారుచిరార్థ సూక్తినిధి. భారతమో ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని ప్రశంసించేది. ఈ విషయాలన్నీ ఈ పద్యానికి వన్నె పెడుతున్నాయి.

ఇందులోని ఛందస్సు చంపకమాల.

91. ప

విపరీత ప్రతిభాష లేమిటికీ నుర్వీనాథ ! యీ పుత్ర గా
త్ర పరిష్వంగ సుఖంబు సేకొనుము; ముక్తాహార కర్పూర సాం
ద్రరాగ ప్రసరంబుఁ జందనము ఁజంద్రజ్యోత్స్నయుం బుత్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే ? కడున్ శీతమే ?

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంత మహారాజు, పుత్రసమేతంగా తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను ఎరుగనట్లు ప్రవర్తించాడు. ఆమె ఎన్నో ధర్మాలను, ముఖ్యంగా గృహస్థాశ్రమ ధర్మాన్ని ప్రబోధించింది. భార్యాభర్తల సంబంధం, తండ్రీ కొడుకుల సంబంధం వేదవచన పురస్సరంగా వివరించింది. అతడూ ప్రజ్ఞావాది అయి ఆయా సందర్భాలలో మాటకు మాట సమాధానం చెప్పాడు. చిట్టచివరకు ఆమె అనుభూతి సూత్రాన్ని ప్రయోగించింది - ఈ పద్యంలో.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| ఉర్వీనాథా | = | ఓ మహారాజా ! |
| విపరీత ప్రతిభాషలు | = | విరుద్ధమైన ప్రత్యుత్తరాలు |
| ఏమిటికి | = | ఎందుకు ? |
| ఈ పుత్రగాత్ర | = | ఈ కుమారుడి శరీరాన్ని |
| పరిష్వంగ | = | కౌగలించుకోవడం వల్ల కలిగే |
| సుఖంబు + చేకొనుము | = | సుఖాన్ని పొందు ! |
| ముక్తాహార | = | ముత్యాల దండలయొక్క |
| కర్పూర | = | కర్పూరం యొక్క |
| సాంద్రపరాగ | = | దట్టమైన ధూళియొక్క |
| ప్రసరంబున్ | = | వ్యాప్తి |
| చందనమున్ | = | మంచిగంధమూ |
| చంద్రజ్యోత్స్నయున్ | = | చందమామ వెన్నెలా |
| పుత్రగాత్ర | = | కుమారుడి శరీరం యొక్క |
| పరిష్వంగము + అట్లు | = | కౌగిలి లాగా |
| జీవులకు | = | ప్రాణులకు |
| కడున్ | = | మిక్కిలి |
| హృద్యంబు + ఏ | = | మనోహరమైనదా ? (కాదు) |
| శీతము + ఏ | = | చల్లనిదా ? (కాదు) |

**తాత్పర్యం :** ఓ దుష్యంత మహారాజా ! 'మాటకు మాట తెగులు' అన్నట్లు ఈ విరుద్ధమైన సమాధానాలు దేనికి ? ఒక్కసారి ఈ కుమారుడి దేహాన్ని కౌగలించుకో ! ఆ సుఖాన్ని అనుభవించు ! ముత్యాల దండలు కానీ, కర్పూర ధూళిగానీ, మంచి గంధంగానీ, చందమామ వెన్నెల కానీ కొడుకు శరీరాన్ని కౌగిలించుకోవడం లాగా ప్రాణులకు మనోహరంగా ఉండదు. చల్లగా ఉండదు.

కవితా విశేషాలు :

ఈ పద్యంలో పుత్రగాత్ర పరిష్వంగ సుఖ పారమ్యాన్ని ఆరోహణక్రమంలో ఎంతో గంభీరంగా మత్తేభ విక్రీడితంలో చక్కగా చిత్రించాడు నన్నయ. సంహితాభ్యాసుడైన నన్నయ ఈ పద్యాన్ని వేదనాదమేదురంగా తీర్చిదిద్దాడు.

ఈ పద్యంలో ఋషికల్పుల భావలక్షణాలు ఉన్నాయి. పుత్రగాత్ర పరిష్వంగ హృద్యత జీవులకు అనుభవ సిద్ధం. భవభూతి సీతారామచంద్రుల స్పర్శ సుఖం ఆధారంగా ఉత్తరరామ చరిత్ర నాటకాన్ని వ్రాశాడు. అది భార్యాభర్తల స్పర్శ లక్షణం. ఈ పద్యంలోది తండ్రి కొడుకును కౌగలించుకున్నప్పుడు పొందే స్పర్శానుభూతి. ఇది ధర్మానుష్ఠాతలైన 'జీవుల శ్రేష్ఠమైన అనుభూతి విశేష వివరణం.

ఇది నన్నయ కవిత్వపు 'ఖజానా' మనకందించిన 'నజరానా'.

94. ప

నుతజల పూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు మఱి బావులు నూఱిటి కంటె నొక్కస
త్క్రతు వదిమేలు తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు త
త్సుతశతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీమదాంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంత మహారాజు, పుత్ర సహితమై తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను ఎరుగనట్లు ప్రవర్తించాడు. ఆమె ఎన్నో వేదధర్మాలను, పుత్రగాత్ర పరిష్వంగ సుఖానుభూతిని వివరించింది. ఆ తరువాత సత్యవాక్య ప్రశస్తిని వక్కాణిస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| సూనృతవ్రత | = | సత్యవ్రతం కలిగినవాడా ! ఓ దుష్యంత మహారాజా ! |
| నుతజల | = | ప్రశస్తమైన నీటితో |
| పూరితంబు + అగు | = | నిండినవైన |
| నూతులు | = | చేద బావులు |
| నూఱిటి కంటెన్ | = | వందకన్నా |
| ఒక బావి | = | ఒక దిగుడు బావి |
| మేలు | = | శ్రేష్ఠమైనది |
| మఱి | = | ఇంకా |
| బావులు | = | దిగుడు బావులు |
| నూఱిటి కంటెన్ | = | వందకన్నా |
| ఒక్క | = | ఒక |
| సత్ + క్రతువు + అది | = | మంచి యజ్ఞం ఉందే అది |

| | | |
|---|---|---|
| మేలు | = | శ్రేష్ఠమైనది. |
| కల్ + క్రతు శతంబున కంటెన్ | = | ఆ వంద యజ్ఞాల కన్నా |
| సుతుండు | = | ఒక కుమారుడు |
| మేలు | = | శ్రేష్ఠం |
| కల్ + సుతశతకంబు కంటెన్ | = | ఆ కుమారులు వందమంది కన్నా |
| చూడఁగన్ | = | బాగా పరిశీలిస్తే |
| ఒక సూనృత వాక్యము | = | ఒక సత్యవాక్యం |
| మేలు | = | శ్రేష్ఠమైనది |

**తాత్పర్యం :** సత్యవాక్య పాలనమే వ్రతంగా కలిగిన ఓ దుష్యంతమహారాజా ! నూరు మంచినీటి నూతులకన్నా ఒక దిగుడు బావి మేలు. నూరు దిగుడు బావుల కన్నా ఒక మంచి యజ్ఞం గొప్పది. అటువంటి నూరు సత్క్రతువులకన్నా ఒక కుమారుడు ఎక్కువ. బాగా ఆలోచించి చూస్తే ఇన్నిటి కన్నా మిన్న అయిన కుమారుడి కన్నా కూడా ఒక సత్యవాక్యం శ్రేష్ఠమైనది.

అందువల్ల నీవు మన కుమారుణ్ణి ఈ భరతుణ్ణి ఆదరించు ! పూర్వం కణ్వాశ్రమంలో చేసిన వరదానాన్ని పాటించు ! ఆ సత్యపాలనం కన్నా పుణ్యం లేదు ! ఏతత్తిరస్కారం కన్నా పాపం లేదు - అన్న ధ్వని ఇందులో గర్భితం.

**కవితా విశేషాలు :**

శకుంతల ధర్మచరిత. తన మనస్సు ధర్మనిమగ్నంగా ఉండాలన్నది ఆమె నిరంతర వాంఛ. ఆమె మాటతప్పిన దుష్యంతుణ్ణి కటాక్షించి', పుత్రుడి కన్నా కూడా సత్యవాక్యం మిన్న అని చెప్పింది. శకుంతల ఋషి కల్పురాలు. ఆమె చెప్పిన సత్యప్రశస్తి నేటికీ ఆంధ్రజాతికి ఆదర్శంగా ఉంది.

నన్నయ 'నిత్య సత్యవచనుడు'. భారతాంధ్రీకరణ ప్రేరణ కారణభూతుడు రాజరాజు 'పరమ ధర్మవిదుడు'. భారతమో ? ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రమని కొనియాడేది. ఈ విషయాలన్నీ ఈ పద్యాన్ని హృద్యం చేస్తున్నాయి.

నానారుచిరార్థ బంధురమైన ఈ పద్యం సారాలంకార సంకలితం. సత్యసౌరభ శోభితమైన ఈ చంపకమాల శిరోధార్యం.

**110.** చ

భరతుఁడు శేష భూభువన భార ధురంధరుఁడై వసుంధరం
బరఁగి యనేక యాగములఁ బాయక భాస్కర జహ్నుకన్యకా
సురుచిర తీర దేశముల సువ్రతుఁడై యొనరించి భూరి భూ
సురులకు నిచ్చె దక్షిణలు శుద్ధ సువర్ణ గవాశ్వ హస్తులన్.

పరిచయం :

ఈ పద్యం నన్నయ భట్టారకుడు రచించిన శ్రీ మదాంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానం' నుంచి గ్రహించబడింది.

సందర్భం :

సభాస్థితుడైన దుష్యంతమహారాజు పుత్రసహితయై తనముందు నిల్చిన ధర్మపత్ని శకుంతలను తిరస్కరించాడు. ఆమె దుఃఖంలో దైవం తప్పక శరణం లేదని తిరిగిపోబోతున్న వేళలో ఆకాశవాణి జోక్యం చేసుకొని యథార్థం పలికింది. దేవతలూ శకుంతల పై పాతివ్రత్యాన్ని సత్యనిష్ఠనూ భరతోత్పత్తిని ప్రశంసించారు. అప్పుడు దుష్యంతుడు తాను లోకాపవాద భీతి వల్ల శకుంతలను ఎరుగనన్నానని

ఒప్పుకున్నాడు. భార్యాపుత్రుల్ని స్వీకరించాడు. భరతుడికి యౌవరాజ్యాభిషేకం చేశాడు. చాలాకాలం రాజ్యసుఖాలనుభవించి భరతుడికి రాజ్యాభిషేకం చేసి దుష్యంతుడు తపోవనానికి వెళ్లాడు. భరతుడు వంశకర్తయై రాజ్యాన్ని పాలించిన తీరు ఈ పద్యంలో వర్ణితం.

ప్రతిపదార్థం :

| | | |
|---|---|---|
| భరతుడు | = | శకుంతలా దుష్యంతుల కుమారుడైన భరతుడు |
| అశెష | = | అఖిలమైన |
| భూభువన భార | = | భూలోకపు బరువును |
| దురం ధరుడు + ఐ | = | వహించిన వాడై |
| వసుంధరన్ | = | నేల మీద |
| పరగి | = | ప్రవర్తిల్లి, ప్రసిద్ధిని పొంది, ప్రయాణించి |
| భాస్కర జహ్నుకన్యకా | = | యమునా గంగానదుల |
| సురుచిర తీర దేశముల | = | మహామనోహర తట ప్రదేశాల్లో |
| పాయక | = | వదలకుండా |
| న + ఏక యాగముల | = | చాలా యాగాలను |
| సువ్రతుడు + ఐ | = | మంచి వ్రతం కలవాడై |
| ఒనరించి | = | చేసి |
| భూరి భూసురులకు | = | గొప్ప వారైన బ్రాహ్మణులకు |
| శుద్ధ సువర్ణ | = | మేలిమి బంగారాన్ని |
| గో + అశ్వ హస్తులన్ | = | ఆవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని |
| ఇచ్చె | = | ఇచ్చాడు. |

**తాత్పర్యం :** భరతుడు మహా సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూ మహాకీర్తిని పొందాడు. గంగా యమునా నదీ తీరాల్లో ఎడతెగకుండా ఎన్నో యాగాలు చేశాడు. మహానుభావులైన బ్రాహ్మణులకు స్వచ్ఛమైన బంగారాన్ని, గోవుల్ని, గుర్రాల్ని, ఏనుగుల్ని దక్షిణలుగా ఇచ్చాడు.

**కవితా విశేషాలు :**

భరతుడు వంశకర్త. మన దేశానికి భారత దేశమనే పేరు భరతుడి పేరు మీదగానే వచ్చిందని చెబుతుంటారు. భరత వంశం వారి చరిత్ర భారతం. భారతంలో యజ్ఞయాగాలకు, బ్రాహ్మణాధిక్యానికీ, దక్షిణలకు దాన ధర్మాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాజరాజ నరేంద్రుడు కూడా "భూదేవ కులాభితర్పణ మహీయః ప్రీతి", "సంతతదానశీలత" కలవాడు. నన్నయ కూడా 'అవిరళ జపహోమ తత్పరుడు', 'సంహితాభ్యాసుడు', భరతుడి పాలనలోని ప్రధాన లక్షణాన్ని - యజ్ఞయాగాదుల్ని - చక్కగా వర్ణించాడు నన్నయ.

నన్నయ అక్లిష్ట మనోహరమైన అనతిదీర్ఘ సంస్కృత సమస్త పదశైలిలో అక్షరరమ్యతను ఆదరించి అనతిదీర్ఘ సంస్కృత సమస్త పదశైలిలో అక్షరరమ్యతను ఆదరించి ఈ పద్యాన్ని రచించాడు. ఇందులోని అలంకారం వృత్త్యనుప్రాసం. ఛందస్సు చంపకమాల.

డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి ఎం.ఏ., పి హెచ్.డి.
ప్రిన్సిపాల్ & రీడర్
ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల
నరసరావు పేట, గుంటూరు జిల్లా

## మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

# శకుంతలోపాఖ్యానము - నన్నయ

## (ఆం.మ.భా. ఆది. 4 - 1 నుంచి 110 పద్యాలు)

## పాఠం - 2

1. 2. 0 సందర్భ సహిత వ్యాఖ్యలు

1. 2. 1.1 నన్నయ ఆంధ్రీకరణ విధానం

1. 2. 1.2 నన్నయ కవితారీతులు

1. 2. 2 ప్రశ్నలు - సమాధానాలు

1. 2. 3 రాదగిన ప్రశ్నలు

1. 2. 4 ఆచూకీ గ్రంథాలు

### 1. 2. 0 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. బాల హరిణముల ఁబట్టెడు లీలను. (ఆ.ప 4 - 6)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టు రచించినటువంటి ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతబాల్య వర్ణనంలో కవి అన్నమాట. దుష్యంతుడు తన బాల్యంలో విషమాటవీచలిత గజసింహ శార్దూలాది మృగాలను తరిమి తరిమి పట్టుకుంటున్నాడు. ఈ సందర్భంలో కవి ప్రయోగించిన ఉపమానమిది.

వివరణ : జింకపిల్లలను పట్టుకున్నట్లుగా అని భావం. అనంతర కాలంలో దుష్యంతుడి కుమారుడైన భరతుడు కూడా ఇలాగే ప్రవర్తించాడు. "పెట్టుబడులు దూరమైనా పుట్టుబడులు దూరమౌతాయా ?" అంటారు పెద్దలు. జన్యులక్షణ సామ్యమంటారు జీవశాస్త్రవేత్తలు.

అలంకారం : ఉపమాలంకారం.

**2. కలచెను దుష్యంతుమహాబల మందర నగము (ఆ. ప. 4 - 11)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : యౌవన సంశోభితుడైన దుష్యంతుడు మృగయా వీరవిహారం చేస్తున్న సందర్భంలో ఆయన సైన్యం చూపిన పరాక్రమాన్ని కవి వర్ణిస్తూ అన్నమాట.

వివరణ : ఆ దుష్యంతుడి సైన్యం అనే మందర పర్వతం ఆ అరణ్యమనే సముద్రాన్ని సంక్షోభింపజేసిందని భావం. ఇందులో చక్కని రూపకాలంకారం ఉంది. ఆనాడు వననిధి మథనం వల్ల లక్ష్మి జన్మించినట్లు ఈనాడు వనమథనం వల్ల శకుంతల లభించి, విష్ణు స్వరూపుడైన దుష్యంతుడికి భార్య అయింది.

**3. రచియించె నొక్కొ కమలజుడు దయన్. (ఆ. ప. 4 - 15)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు వేటాడుతూ ముందుముందుకు సాగిపోతుండగా, అతని రథవేగాన్ని అనుగమింపలేక కాలిబంట్లు అక్కడక్కడా విశ్రమించారు. ఆయన ఇంకా ముందుకు వెళ్లి ఒక మనోహరవనాన్ని చూచి దాన్ని ప్రశంసించిన సందర్భంలోనిది ఈ వాక్యం.

**వివరణ :** దేవేంద్రుడి ఖాండవవనానికీ, కుబేరుడి చైత్రరథానికీ సమానంగా దీన్ని భూలోక సౌందర్యం కోసం దయతో బ్రహ్మ సృష్టించాడేమో ! అని భావం. దుష్యంత వివాహానికీ, శృంగార రసచిత్రణకూ ఇది చక్కని నేపథ్యం. ఇందులోని ఉత్ప్రేక్షాలంకారం అత్యంత మధురం.

**4. చూచి మునిశక్తి కెంతయుఁజోద్యమిది. (ఆ. ప. 4 - 23)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు వేటకు వచ్చి వనంలో నడుస్తూ నరనారాయణాశ్రమం లాంటి పవిత్రమైన కణ్వాశ్రమం చూచాడు. అక్కడ చిలుకలు చెవులకింపుగా సామగానాలు చదువుతున్నాయి. సామజాలు వాటిని కదలకుండా వింటున్నాయి. ఆ ఏనుగులు తొండాల చల్లదనాన్ని ఆశ్రయించి సింహాలు ఉన్నాయి. బ్రాహ్మణులు భూతబలులుగా పెట్టే నీవారాన్న పిండాల్ని భక్షించడానికి ఎలుకలూ పిల్లులూ కలిసి తిరుగుతున్నాయి. ఈ విషయాలన్నింటి సారాంశాన్ని కవి ఈ వాక్యంలో చెప్పాడు.

**వివరణ :** ఇది అంతా వైరివర్గాల సహవాసం. ఇది ఇలా జరగడానికి కారణం కణ్వమహాముని శక్తి. దీనికి దుష్యంతుడు అద్భుతరసావిష్టుడయ్యాడు. భారతీయ సంస్కృతిలోని ప్రధానాంశమైన సహజీవనాన్ని మనం ఇక్కడ సందర్శించవచ్చు. స్వభావోక్తి సుందరమైన ఋష్యాశ్రమ వాతావరణ చిత్రణం నన్నయ సాటిలేని మేటి.

**5. కోపపరు పాలికి భామలు పోవ నోడరే. (ఆ. ప. 4 - 38)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** దుష్యంతుడు కణ్వమహర్షి మందిరంలో శకుంతలను చూచాడు. శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమె నడిగాడు. పూర్వం ఒక ముని కణ్వుణ్ణి అడిగితే ఆయన చెప్పిన కథను శకుంతల దుష్యంతుడికి చెప్పింది. విశ్వామిత్రుడొకసారి మేనకను పిలిపించి ఆయన తపస్సును భగ్నం చెయ్యమని ఆజ్ఞాపించాడు అప్పుడు మేనక అన్న మాట ఇది.

**వివరణ :** విశ్వామిత్రుడు కోపపడి చూస్తే కులపర్వతాలు బద్దలౌతాయి. సముద్రాలు, ఇసుకే మిగిలేటట్లు ఇంకిపోతాయి, మూడులోకాలూ గిర్రున తిరుగుతాయి. వాయు సంచారం కూడా ఉండదు. అటువంటి భయంకరమైన కోపాత్ముడి దగ్గర స్త్రీలు వెళ్లడానికి భయపడరా ? ఇందులోని అర్థాంతరన్యాసం అత్యంత మనోజ్ఞం.

**6. అవనీ తలంబున కవతరించిన తరుణశశిరేఖ యుంబోని దాని. (ఆ. ప. 4 - 48)**

**పరిచయం :** ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని ఆమెనడిగాడు. పూర్వం ఒక ముని కణ్వుణ్ణి అడిగితే ఆయన చెప్పిన కథను శకుంతల దుష్యంతుడికి చెప్పింది. కణ్వమహర్షి తాను శిష్యగణాలతో సమిత్కుసుమ ఫలహారణార్థం మాలినీ నదీతీరంలో శకుంత రక్షితయైన అత్యంతకాంతితో వెలుగుతున్న బిడ్డను చూచినట్లు చెబుతున్న సందర్భంలోని మాట ఇది.

వివరణ : దివినుండి భువికి దిగివచ్చిన లేతజాబిల్లి రేకలాగా ఎంతో కాంతితో శకుంతల ప్రకాశిస్తున్నదని భావం. ఇందులోని ఉపమానం పరమసుకుమార సుందరం.

**7. ఇంతులకు ముచ్చు రొగిన గురువులు (ఆ. ప. 4 - 49)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల జన్మవృత్తాంతాన్ని తెలుసుకోవాలని దుష్యంతుడు ఆమెనడిగాడు. పూర్వం ఒక మునికి కణ్వుడు చెప్పిన కథను, తాను విన్నది విన్నట్లుగా, శకుంతల దుష్యంతుడికి చెప్పింది. తాను భయత్రాత అయినందువల్ల శకుంతలకు తండ్రినని ధర్మశాస్త్రార్థాన్ని కణ్వుడు ప్రవచించిన సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : స్త్రీలకు ముగ్గురు గురువులు. వారు కన్నతండ్రి, అన్నదాత, భయంనుంచి రక్షించినవారు. ఇటువంటి ధర్మ ప్రవచనం వల్ల భారతం పంచమవేదమైంది. 'ధర్మార్థులకు నిత్యధర్మ సంప్రాప్తి' గావించే గ్రంథమైంది. మధురాక్కర ఛందస్సులోని మందగమనం ఈ భావవ్యక్తీకరణ కెంతో దోహదకారిగా వుంది.

**8. నిరుపమదాన యట్లయిన నీకును నాకును సంగమంబగున్. (ఆ. ప. 4 - 60)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలకు గాంధర్వ వివాహ స్వరూపాన్ని చెప్పి ఆమెను అంగీకరింపజేసాడు. అప్పుడామె దుష్యంతుడితో తమకు జన్మించే కుమారుడికి దయతో యౌవరాజ్యాభిషేకం చేయమని కోరి, ఈ వాక్యం పలికింది.

వివరణ : అలా అయితే నీకూ నాకూ కలయిక జరుగుతుంది అని భావం. భరతుడి యౌవరాజ్యాభిషేకం శకుంతలోపాఖ్యానంలోని కీలకాంశం. ఇది ఒక వరమని శకుంతల సప్రశ్రయంగా అడిగింది. దయతో, ప్రసన్నబుద్ధి, దయతో ఇలాంటి పదాలను శకుంతల ప్రయోగించింది. 'నిరుపమదాన' అన్నచోట ఈ అర్థం మరింత విస్ఫారితమైంది. సాటిలేని మేటిదానం కలవాడా ! అన్నది సార్థక సంబోధన.

**9. సతుల కేడు గడయు (బతుల చూవె ? (ఆ. ప. 4 - 66)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టు రచించినటువంటి ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : కణ్వ మహాముని తన పెంపుడు కూతురైన శకుంతలను ఆమె పుత్రుడైన భరతుడితో సహా భర్తృగృహానికి, - దుష్యంతుడి దగ్గరకు - పంపాలనుకున్నాడు. ఒకనాడు తన కూతురితో అన్న మాటలివి.

వివరణ : ఎంతటి పతివ్రతలకైనా పుట్టినిళ్లల్లో ఎక్కువ కాలం ఉండడం అంతమంచిది కాదు. స్త్రీలకు భర్తల దగ్గర ఉండడమే ధర్మం. స్త్రీలకు భర్తలే సంరక్షకులు సుమా !

ఏడు + కడ = గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత - ఈ ఏడు విధాల రక్షణ.

ఈ పద్యపాదంలో నన్నయ నానారుచిరార్థ సూక్తి నిధిత్వం గోచరిస్తున్నది.

**10. ముగ్ధ లధిపులు, మఱవరె బహు కార్య భార మగ్నులుకారే ! (ఆ. ప. 4 - 69)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయ భట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : శకుంతల కుమార సమేతంగా దుష్యంతుడి దగ్గరకు వచ్చినప్పుడు ఆయనలో పూర్వం ఉన్నట్లుగా అనురాగం, ఆదరణం, దయ, ప్రేమతో కూడిన తొందర కనిపించలేదు. అప్పుడు శకుంతల దుష్యంతుణ్ణి గురించి, అలాంటి రాజుల్ని గురించి అనుకొనే సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : నన్ను ఈ దుష్యంతుడు ఎరుగడా ! ఎరిగికూడా తెలియనట్లు ఉన్నాడు. చాలా కాలం గడిచింది కాబట్టి మరచిపోయాడా? రాజులు మోహపరవశులు. అదీగాక అనేక కార్యక్రమాల్లో మునిగిపోయి ఉంటారు.

**11. కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే ? (ఆ. ప. 4 - 72)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆది పర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడి చూపులు చాలా విరసంగా ఉండడాన్ని గమనించిన శకుంతల చింతాక్రాంత అయి తనలో అనుకొన్న మాట.

వివరణ : ఎవరైనా ఒక విషయాన్ని మరచిపోతే జ్ఞప్తి చేయవచ్చు. అసలు తెలియకపోతే అన్నివిధాలా తెలిసేటట్లు చెప్పవచ్చు. కాని తెలిసి, తెలుసుకోవడానికి ఇష్టపడని వంచకుడికి తెలియజెప్పడం బ్రహ్మకైనా తరం అవుతుందా ? కాదు.

ఇక్కడ శకుంతల లోకజ్ఞతను, మనస్తత్త్వ పరిశీలనను లోకజ్ఞుడైన నన్నయ చక్కగా చిత్రించాడు.

**12. కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలె. (ఆ. ప. 4 - 78)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను వచ్చినదారినే తిరిగి వెళ్లమన్నాడు. వేగంగా వెళ్లమన్నాడు. అంటే కణ్వాశ్రమానికే తిరిగి వెళ్లమన్నాడు. ఆ మాటలకు శకుంతల నిశ్చేష్టిత అయింది. కోపంతో ఎర్రబడ్డ కళ్లనుంచి కన్నీరు కారుతూఉండగా తలవంచకుంది. ఈ సందర్భంలో నన్నయ ప్రయోగించిన ఉపమానం ఈ వాక్యం.

వివరణ : ఎర్రతామర రేకులనుంచి స్రవిస్తున్న నీటిబొట్లులాగా ఆమె కోపారుణిత నయనాలనుంచి బాష్పకణాలు ప్రవహిస్తున్నాయి. ఈ వాక్యం నన్నయ అలంకార శైలికి చక్కని నిదర్శనం.

**13. తప్పఁ బలుక నగునె ధార్మికులకు ? (ఆ. ప. 4 - 79)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడాడు. కన్నీరు కారుతూఉండగా, తలవంచి, దుష్యంతుణ్ణి కడకంటితో చూస్తూ, తన మనోవ్యథను తానే అణచుకొని శకుంతల దుష్యంతుడితో మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : అన్నీ తెలిసికూడా ఏమీ తెలియనట్లు అజ్ఞానుల లాగా మాటాడుతున్నావని, నేను తప్పక ఎవరూ ఎరుగరని అసత్యాలు పలకరాదని శకుంతల దుష్యంతుణ్ణి మందలించింది. అబద్ధమాడడం ధర్మాత్ముల లక్షణం కాదని హెచ్చరించింది.

**14. ఇహముం బరము ( గలదె మతిఁబరికింపన్. (ఆ. ప. 4 - 82)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరిస్తూ మాటాడినప్పుడు శకుంతల తన మనోవ్యథను తానే ఉపశమింపజేసుకొని మాటాడిన సందర్భంలోది ఈ వాక్యం

వివరణ : పతివ్రత, గుణవతి, సంతానవతి అయిన భార్యను తిరస్కారదృష్టితో చూచే దుర్బుద్ధికి ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాలు ఉండవు. ఈ ధర్మవచనం సాధారణంగా కనిపించినా దుష్యంతుణ్ణి వేలెత్తి చూపినట్లుంది.

**15. దీపంబువలన నొండొక దీపము ప్రభవించినట్లు (ఆ. ప. 4 - 90)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల పుత్ర విశిష్టతను వివరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : దీపంనుంచి ఇంకొకదీపం వెలిగినట్లు నీ పుణ్యశరీరంనుంచి ఈ పుత్రుడు ఉద్భవించి తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

ఈ ఉపమానం ప్రజాసామాన్యం లోది. నన్నయ లోకజ్ఞతకు నిదర్శనం.

**16. సత్యము వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్ ! (ఆ. ప. 4 - 95)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : వేయి అశ్వమేధ యాగాల్నీ ఒక సత్యాన్నీ త్రాసులో రెండు వైపులా పెట్టి తూస్తే సత్యం వైపే ముల్లువాలుతుంది. సత్యానికి ఉన్న గౌరవాతిశయం అంతటిది.

ఇందులో శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**17. ఎల్ల ధర్మంబుల కెందు ( బెద్ద యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు. (ఆ. ప. 4 - 96)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడికి శకుంతల సత్యవాక్య ప్రశస్తిని తెలుపుతున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : అన్ని తీర్థ ప్రదేశాలకు యాత్రలు చేయడం, అన్ని వేదాలు చదవడం లాంటి గొప్ప పుణ్యకార్యాలు కూడా సత్యంతో సమానంకావు. ధర్మవేత్తలైన మునులు అన్ని ధర్మాల్లోనూ సత్యమే గొప్పది అని చెప్పారు.

ఇక్కడ శకుంతల ధర్మజ్ఞత వ్యక్తమౌతున్నది.

**18. ఇప్పాటినోములు దొల్లి కడఁగి నోచితిని గాకేమి ? (ఆ. ప. 4 - 103)**

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : తనను తిరస్కరించిన దుష్యంతుడితో శకుంతల ఎన్నో ధర్మవచనాలను పలికింది. కాని అతడు స్వీకరించలేదు. "నేనెక్కడ ! నీ వెక్కడ ! కుమారుడెక్కడ ! నేను ఇంతకుముందు నిన్ను చూచి ఎరుగను. ఇటువంటి లోకవిరుద్ధాలకు నేను భయపడుతుంటాను. అయుక్త వచనాలు మాని నీ ఆశ్రమానికి పో !" అని దుష్యంతుడు అన్నప్పుడు శకుంతల మనస్సులో ఎంతో పరితాపాన్ని పొందింది. అప్పటి ఆమె ఆలోచన పరంపరలోది ఈ వాక్యం.

వివరణ : 'నేను పుట్టిన వెంటనే నన్ను తల్లిదండ్రులు విడిచిపెట్టారు. ఇప్పుడు భర్తకూడా విడిచిపెడతాడు కాబోలు ! వేయి మాట లెందుకు ! నేను క్రిందటి జన్మలో కొరత నోములు నోచి ఉంటాను' అని శకుంతల బాధపడింది.

ఇందులో భారతీయ సంప్రదాయానికి మూలస్తంభాల్లో ఒకటైన పునర్జన్మ సిద్ధాంతం ప్రస్తావించబడింది. 'పతి' తప్ప అన్నీ తెలుగుపదాలే. నన్నయ శోకసన్నివేశాల్లో సంఘర్షణను చిత్రించడానికి గాను తెనుగు శైలిని వాడడం ఇందులో కనిపిస్తుంది.

## 19. ఇంక దైవంబ కాని యొండు శరణంబు లేదు. (ఆ. ప. 4 - 104)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : దుష్యంతుడు శకుంతలను తిరస్కరించాడు. తగని మాటలు మాని, నీ ఆశ్రయానికి వెళ్లు అన్నాడు. శకుంతల మహాదుఃఖాన్ని పొందింది. ఇక దుష్యంతుడు స్వీకరిస్తాడనే ఆశలేదు. కన్నీరును ఒత్తుకుంటూ అనుకున్న మాట.

వివరణ : ఇంక దైవం తప్ప వేరే శరణం లేదు అని శకుంతల అనుకొన్నది. భగవంతుణ్ణి శరణుజొచ్చింది. మానవ ప్రయత్నం ఫలించక పోవడంతో ఆ నిర్ణయానికి వచ్చింది. వెంటనే భగవదాదరం ఆకాశవాణి రూపంలో లభించింది.

ఇతిహాస ప్రధాన లక్షణమైన భగవత్ప్రాధాన్యం ఈ వాక్యంలో కనిపిస్తున్నది. దైవం, పురుషకారం రెండూ ముఖ్యమైనవైనా దైవమే మిన్న.

## 20. ఎఱిఁగియు నిత్తన్వి ప్రీతి దప్పి యెఱుఁగనంటిని ! (ఆ. ప. 4 - 108)

పరిచయం : ఈ వాక్యం ఆదికవి నన్నయభట్టారకుడు రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం లోని 'శకుంతలోపాఖ్యానము' నుంచి గ్రహించబడింది.

సందర్భం : ఆకాశవాణి సభాసదులు అందరూ ఆశ్చర్యపడేటట్లుగా "శకుంతల సత్యం పలికింది, ఈ భరతుడు నీ కుమారుడు, ఇతన్ని స్వీకరించి పోషించు" అని చెప్పింది. శకుంతలా పతివ్రతాత్వాన్ని, భరతోత్పత్తిని ప్రశంసిస్తున్న దేవతల మాటలు కూడా ఆకాశం నుంచి వినిపించాయి. దుష్యంతుడు అందరిముందు వాస్తవాన్ని అంగీకరిస్తున్న సందర్భంలోది ఈ వాక్యం.

వివరణ : కణ్వమహాముని ఆశ్రమంలో జరిగిన మా గాంధర్వ వివాహం ఇతరులకు తెలియదన్న ఉద్దేశంతో లోకాపవాద భీతికిలోనై, ఈమె ప్రీతిని వదలివేసి ఎరుగనన్నాను. ఇప్పుడు ఆశ్చర్యకరంగా ఆకాశవాణి అందరికీ తెలియజేసింది.

దుష్యంతుడు లోకాపవాదభీతి వల్ల శకుంతలను తిరస్కరించినట్లు భారతంలో ఉండగా, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం నాటకంలో మార్పుచేశాడు. శకుంతల పొందిన దుర్వాసశ్శాపం వల్ల దుష్యంతుడు మరచిపోయినట్లు కల్పించాడు. నన్నయ కాళిదాస కల్పనను స్వీకరించకుండా వ్యాసభారతబద్ధ నిరూపితార్థాన్నే ఆంధ్రీకరించాడు.

## 1. 2. 1.1 నన్నయ ఆంధ్రీకరణ విధానం :

నన్నయ భట్టారకుడు ఆదికవి. ఆయన ఆంధ్రీకరణానికి రాచబాటలు వేశాడు. వ్యాసమహర్షి సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని వ్యాసహృదయానుకూలంగా నన్నయ ఆంధ్రీకరించాడు. కన్నడకవులు వ్యాసహృదయానికి భిన్నంగా అర్జునుణ్ణి నాయకుడుగా చేసి రచన సాగించారు. నన్నయ అటువంటి మూలచ్ఛేదానికి ఒడిగట్టలేదు.

అట్లా అని నన్నయ వ్యాసభారతాన్ని మక్కికి మక్కిగా ఆంధ్రీకరించలేదు. కొన్ని విషయాల్ని పరిహరిస్తూ కొన్నిటిని పరిగ్రహిస్తూ, మార్పులతో చేర్పులతో కూర్పు నేర్పును ప్రదర్శించాడు. ముఖ్యంగా మూలంలోని గహనమైన వేదాంత విషయాలను, పునరుక్తులను, అనావశ్యకాలను నన్నయ విడిచిపెట్టాడు.

నన్నయది అనువాదం కాదు; ఆంధ్రీకరణం. అనువాదమంటే అనుసరించి పలకడం - చిలకపలుకుల్లాగా. నన్నయ రచన అటువంటిది కాదు. ఆయన ఎంతో స్వాతంత్ర్యాన్ని అవలంబించారు. "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" (ఆది. 1 - 16) అన్న తన ప్రభువు రాజరాజనరేంద్రుడి అభ్యర్థనను అక్షరాలా పాటించారు. పునస్సృష్టి చేశాడు. ఆయన ఎంతో బుద్ధిబలంతో - సాహితీబలంతో - భారతాంధ్రీకరణం చేసి తిక్కనాది అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

నన్నయ ఆంధ్రీకరణంలో ప్రధానంగా ఈ ఆరు పద్ధతులు ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1. యథామూలకత | : | మూలంలో ఉన్నట్లే అనువదించడం. |
| 2. మూలకుంచనం | : | మూలంలో మరీ విస్తారంగా ఉన్న విషయాన్ని కుదించడం. |
| 3. మూల ప్రపంచనం | : | మూలంలో సంక్షిప్తంగా ఉన్న విషయాన్ని పెంచడం |
| 4. అన్యధా ప్రకల్పనం | : | మూలంలో ఒకవిధంగా ఉంటే వేరే విధంగా చెప్పడం |
| 5. మూలత్యాగం | : | మూలంలో ఉన్నదాన్ని ఆంధ్రీకరణంలో వదలిపెట్టడం |
| 6. అమూలకత | : | మూలంలో లేని విషయాల్ని కొత్తగా కల్పించడం |

ఈ ఆరు ఆంధ్రీకరణ విధానాలు శకుంతలోపాఖ్యానంలో నిక్షిప్తమైన తీరును పరిశీలిద్దాం !

1. **యథామూలకత :** శకుంతల దుష్యంతుడికి తండ్రీ కొడుకుల సంబంధాన్ని తెలిపే సన్నివేశంలో మూలంలో ఇలా ఉంది.

సరసీ వామలే ఽ త్మానం / ద్వితీయం పశ్యతే సుతమ్
సరసీ వామలే సోమం ప్రేక్షాత్మానం త్వ మాత్మనా ।

దీన్ని నన్నయ యథామూలకంగా ఇలా అనువదించాడు.

తాన తన నీడ నీళ్లల
లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత త
త్సూను జనకుండు సూచి మ
హానందముఁ బొందు నతిశయ ప్రీతి మెయిన్.

సత్య వాక్య ప్రశక్తికి సంబంధించిన

అశ్వమేధ సహస్రంచ / సత్యంచ తులయా ధృతమ్
అశ్వమేధ సహస్రాద్ధి / సత్యమేవ విశిష్యతే । - అనే శ్లోకాన్ని

వెలయంగ నశ్వ మేథం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి తూపఁగ సత్యము
వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్ - అని తెనిగించాడు. 'విశిష్యతే' అన్నదానికి 'ములుసూపు' మంచి అనువాదం.

**2. మూలకుంచనం :** మూలంలో దుష్యంత వర్ణనం పన్నెండు శ్లోకాల్లో వివరంగా ఉంది. ఈ సందర్భంలో నన్నయ నాలుగు పద్యాలు మాత్రమే వ్రాసి సంక్షిప్తతను పాటించాడు. మూలంలో ఐదు శ్లోకాల్లో ఉన్న దుష్యంతుడి రాజ్యస్థితిని, ప్రజాసమృద్ధిని నన్నయ "ఆతని రాజ్యంబున'' అనే కందంలో పొందుపరిచాడు. మూలంలో దుష్యంత బలవర్ణనం మూడు శ్లోకాల్లో ఉంటే నన్నయ దాన్ని ఒక్కకందంలో - 'ఉర్వీరుహనివహముతో' - అందించాడు. మూలంలో ఇరవై ఆరు శ్లోకాలున్న దుష్యంతుడి మృగయావర్ణన నన్నయ భారతంలో నాలుగు గద్యపద్యాల్లో సంగ్రహించబడింది. మూలంలో మేక ఇంద్రుడితో విశ్వామిత్రుడి గొప్పతనాన్ని తెలిపే పనులను ఎన్నింటినో విపులంగా చెప్పింది. ఈ సందర్భంలో నన్నయ "వనజభవ ప్రభావుఁడవు వాని'' అని ఒక్క చంపకమాల వ్రాసి తత్సౌరభాన్ని గుభాళింప జేశాడు. శకుంతల తన తల్లిదండ్రులైన మేనకా విశ్వామిత్రుల గొప్పతనాన్ని వర్ణించి, తన జన్మవృత్తాంతాన్ని, గాంధర్వ వివాహాన్ని ఏకరువు పెట్టింది. ఆ పౌనరుక్త్యాన్ని నన్నయ పాటించలేదు. "క్షత్రవీరుడైన విశ్వామిత్రునకు'' అనే ఒక్కపద్యంలో సారాంశాన్ని అందించాడు. దుష్యంతుడు శకుంతలను నిరాకరిస్తూ పలికిన మాటలు :

'నపుత్ర మభిజానామి త్వయి జాతం శకుంతలే'

ఇత్యాదిగా మూడు శ్లోకాల్లో ఉన్నాయి. నన్నయ "ఏనెట నీవెట సుతుడెట'' అనే కందంలో ఇమిడ్చాడు. భరతుడి గొప్పతనం మూలంలో సప్తశ్లోకాల్లో ఉంది. నన్నయ "భరతుడశేష భూభవన భార ధురంధరుడై'' అని ఒక్క పద్యం రచించాడు.

**3. మూల ప్రపంచనం :** మేనకా విశ్వామిత్రుల కథలో వాయువు మేనకను వివస్త్రను చేసిందని, ఆ స్థితిలో విశ్వామిత్రుడు చూచాడని ఉంది.

'అనిర్దేశ్య వయోరూపా మపశ్య ద్వివృతాం తదా'

నన్నయ ఈ భావాన్ని "అలసతయొప్పగా'' అనే పద్యంలో వివరించాడు. మూలంలో స్త్రీకి మాత్రమే గురువులెవరో చెప్పబడింది.

'శరీరకృత్ ప్రాణదాతా యస్య చాన్నాని భుంజతే'

ఆంధ్రీకరణంలో - " తన జనకుండు'' అనే మధురాక్కరలో పురుషుడికి గురువులెవరో కూడా చెప్పి నన్నయ తన శాస్త్రజ్ఞతను స్పష్టం చేశాడు.

**4. అన్యథా ప్రకల్పనం :** శకుంతల దుష్యంతునితో తాను కణ్వమహా మునీంద్రుడి ఆత్మజను అని చెప్పింది. అప్పుడు దుష్యంతుడు తనలో సందేహించాడు. నన్నయ "ఇది మునికన్యయేని మఱియేలొకొ యీ లలితాంగియందు నా హృదయము దద్దయుం దవిలె'' అని వ్రాశాడు. కాని మూలంలో దుష్యంతుడు తన సందేహాన్ని శకుంతలతో అన్నట్లు ఉంది. ఇక్కడ నన్నయ కావించిన అన్యథాప్రకల్పనమే సముచితం.

పితృ పరిత్యక్త అయిన బాల శకుంతలను పక్షులు తమకు తాము రక్షించినట్లు మూలంలో ఉంది. విశ్వామిత్రుడి తపఃప్రభావం వల్ల అలా జరిగిందని నన్నయ వ్రాశాడు. నన్నయ అన్యథా ప్రకల్పనమే మాన్యము.

మూలంలో శకుంతల తన్ను దుష్యంతుడు చేపట్టిన సంగతి కణ్వుడితో తనకుతానై చెప్పినట్లు కొంత చెప్పి తర్వాత "అతస్సర్వం తు యద్వృత్తం దివ్యజ్ఞానేన పశ్యసి'' అన్నట్లు ఉంది. కాని నన్నయ భారతంలో మొత్తం వృత్తాంతాన్ని కణ్వుడు తన దివ్యజ్ఞానంతో తెలుసుకున్నట్లు ఉంది. ఇదే సమంజసం.

మూలంలో కణ్వుడు శకుంతలా శరీరాన్ని విశుద్ధ్యర్థం స్పృశించినట్లు, అలా స్పృశింపగానే శకుంతల పరమహర్షాన్ని పొందినట్లు ఉన్నది. నన్నయ రచనలో ఇది లేదు. శకుంతల ధర్మచరిత్రకు మెచ్చి వరప్రదానం చేసినట్లుంది. ఇదే బాగున్నది.

దుష్యంతుడు వెళ్లిన తర్వాత మూలంలో ఇలా ఉంది. కణ్వుడు సర్వదమనుడితో 'నీ తండ్రి దగ్గరకు వెళ్లు' అన్నాడు. అప్పుడతడు తాను వెళ్లననీ, మునిపాదాల దగ్గరే అధ్యయనం చేస్తాననీ అన్నాడు. అప్పుడు శకుంతల కుమారుడితో "నీవు మృగాన్ని దమించడం వల్ల మహర్షికి కోపం వచ్చి పొమ్మంటున్నారు. నేనిక్కడే ఉంటాను" అన్నది. అప్పుడు కణ్వుడామెకు పాతివ్రత్య మహిమను చెప్పి సర్వదమనుడితో "నీతల్లి భర్తమీది కోరికతో వేరే విధంగా మాటాడుతున్నది. కావున ఆమెను తీసుకువెళ్లు" అన్నాడు. అప్పుడు భరతుడు శకుంతలతో దుష్యంతుడి దగ్గరకు వెళదామన్నాడు. శకుంతల తన అజ్ఞానాన్ని మన్నించమని కణ్వుణ్ణి వేడుకొన్నది. కణ్వుడు తలవంచుకొని ఏమీ అనకుండా కన్నీళ్లు కారుస్తూ మునుల్ని పిల్చి శకుంతలను రాజు దగ్గరకు తీసుకువెళ్ళండన్నాడు.

ఆ మునులు శకుంతలను తోడ్కొని కొండలను కోనలను దాటి మధ్యాహ్నానికి ప్రతిష్ఠానపురం చేరుకున్నారు. జటావల్కల ధారులైన ఆ మహర్షులను చూచి ఆ పురప్రజలు నవ్వారు. ఇక ఆ మునులు తిరిగిపోయారు.

నన్నయ రచనలో కణ్వుడు శకుంతలతో "ఎంతటి పతివ్రతలకైనా పుట్టినిళ్లలో ఎక్కువకాలం ఉండడం మంచిది కాదు, నీ కుమారుణ్ణి తీసుకొని నీ భర్త దగ్గరకు వెళ్లు" అన్నట్లున్నది. మహాతపోధనులైన తన శిష్యుల్ని తోడు పంపినట్లు, వారు శకుంతలా భరతులతో దుష్యంతుడి దగ్గరకు వచ్చినట్లున్నది. ఈ అన్యథాప్రకల్పనమే ఔచిత్యభరితంగా ఉంది.

**5. మూలత్యాగం :** మూలంలో మేనక, విశ్వామిత్రుడి దగ్గరకు వెళ్లేటప్పుడు తనకు మన్మథుణ్ణి, వాయువును తోడు పంపమని కోరినట్లు ఉంది. ఆ తరువాత తనను వివస్త్రను చేసిన వాయువును నిందించినట్లు ఉన్నది. నన్నయ ఇక్కడ మూలత్యాగం చేశాడు. శకుంతల దుష్యంతుడితో పలికినట్లున్న "పితారక్షతి కౌమారే" అని శ్లోకాన్ని,

"యది మే యాచమానాయా / వచనం న కరిష్యసి
దుష్యన్త శతధా త్వద్య / మూర్ధా తే విఫలిష్యతి"

అనే శ్లోకాన్ని నన్నయ ఆంధ్రీకరించలేదు. రాజు శకుంతలను అన్న అవాచ్యాలను నన్నయ పరిహరించాడు. శకుంతల కారణంగా దుష్యంతుడు లోకంలోని స్త్రీలందరినీ నిందించాడు.

ఏ తన్నిందా గర్భితాలైన 'సర్వా వామా స్త్రియో లోకే / సర్వాః కామపరాయణా':

- మొదలైన శ్లోకాలను ఆంధ్రీకరించలేదు. ఔచిత్యవేత్త నన్నయ.

కథాంతంలో దుష్యంతుడు శకుంతలను అంతఃపురానికి తీసుకువెళ్లి ఆమెను 'వాసో ఽన్నపానాలతో' పూజించి, ఆమెను కొడుకును తన తల్లికి పరిచయం చేసినట్లు మూలంలో ఉంది. నన్నయ ఈ అంశాలను తన ఆంధ్రీకరణంలో వర్జించాడు.

**6. అమూలకత :** దుష్యంతుడు తపోవన మిది అని నిర్ధారణకు రావడానికి అమోఘమైన కారణాన్ని ప్రదర్శించాడు నన్నయ. నేతి హవిస్సుల పరిమళాలతో కూడిన ధూమలతాతతులతో ఉన్న కొమ్మలమీద వాలి పూలు లేకపోయినా తుమ్మెదలు వదలడం లేదని నన్నయ అన్నాడు. ఈ భావం అమూలకం.

దుష్యంతుడు శకుంతలతో నేను నిన్ను ఎరుగనన్నప్పుడు ఆమె కళ్లనుంచి అశ్రుకణాలు రాలాయి.

"కెందమ్మి రేకుల వలనం దొరంగు జలకణంబుల పోలెఁ
గోపారుణిత నయనంబుల బాష్ప కణంబులు దొరగ"

అని నన్నయ వచనం. ఇందులోని ఉపమాలంకారం అమూలకం.
శకుంతల కుమారుణ్ణి చూపుతూ దుష్యంతుడితో ఇలా అన్నది.

నీ పుణ్య తనువు వలనన
యీ పుత్రకుఁ డుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబు వలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసఁగన్.

పితా పుత్ర సంబంధ వ్యక్తీకరణ పటువైన ఈ ఔపమ్యం రమ్యం ఇది అమూలకం.
ఈ విధంగా నన్నయ తన ఆంధ్రీకరణ నైపుణ్యంతో వ్యాస మహాభారతాన్ని మరింత సౌందర్యభరితం చేశాడు; వనాన్ని తపోవనం చేశాడు.

## 1. 2. 1. 2 నన్నయ కవితారీతులు :

ఆదికవి నన్నయ భట్టారకుడు గద్యపద్యోభయమయమైన చంపూకావ్య రచనతో తెలుగు కవిత్వానికి శ్రీకారం చుట్టాడు. మధుమయ ఫణితికి మార్గదర్శి అయ్యాడు. అనంతరం కవులకు ఆదర్శం కాదగిన కవితారీతులను వెలార్చాడు. "తస్య ప్రతిభావేశః సర్వేషా మాంధ్రసుకవితా శ్రీః" అనే కవిసమ్రాట్టుల కైవారా లందుకున్నాడు.

నన్నయ తన భారతావతారికలో తన కవితారీతులలోని ప్రధానాంశాలను పేర్కొన్నాడు. అవి ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం. ఆయన కథా కథన కౌశలంతో పాటు రసపోషణ పాత్ర చిత్రణ వర్ణనా వైదగ్ధ్యాలూ, ప్రశంసార్హాలు. అక్షరరమ్యతను అంది పుచ్చుకున్న నన్నయ శబ్దార్థాలంకార ప్రయోగాలు కూడా మెచ్చుకోదగ్గవి. నానారుచిరార్థ సూక్తులతో పాటు సామెతలు, జాతీయాలు ఆయన కవిత్వానికి ఎంతో అందం తెచ్చాయి. ఇక నన్నయ ఛందోగమన సౌందర్యాలు వర్ణనాతీతాలు.

వ్యాసమహర్షి ప్రణీతమైన మహాభారత మహేతిహాసానికి కావ్యకళాకమనీయతను కొంతకు కొంత సంతరించాడు. నన్నయ భారతం అనువాదం కాదు. ఆంధ్రీకరణం. వ్యాసహృదయాన్ని ఆవిష్కరించిన స్వతంత్రరచన.

నన్నయ కథాకథనదక్షుడు. ప్రసన్న కథాకవితార్థ యుక్తి ఆయన కవితా ప్రధాన లక్షణం. ఆయన మూలకథలోని చిక్కుల్ని తొలగించి దాన్ని ప్రసన్నం చేశాడు. ఆ కథలను అర్థాలనూ ప్రసన్నం చేశాడు. మొత్తం మీద ప్రసన్న కథలలో ప్రసన్నార్థాల కూర్పును భాసింపజేశాడు. మూలంలోని గహనమైన వేదాంతవిషయాలను, పునరుక్తులను, అనావశ్యక విషయాలను, అనౌచిత్యాలను పరిహరించాడు నన్నయ. శకుంతల భర్తృగృహానికి వెళ్లే ముందున్న కొన్ని మూలకథాంశాలు నన్నయ పరిహరించాడు. అలాగే దుష్యంతుడు శకుంతలను స్వీకరించిన తరువాత ఉన్న కొన్ని కథాంశాలను కూడా నన్నయ అనువదించలేదు.

నన్నయది రసపోషణంలో అందెవేసిన చెయ్యి. దుష్యంతుడు కణ్వాశ్రమానికి వెళ్లేముందు నన్నయ రచించిన "అతిరుచిరాగతుండయిన" పద్యం శృంగారరస సమ్మిళితం. అలాగే శకుంతల దుష్యంతనిరాకృత అయి విలపిస్తూ అన్న మాటలను నన్నయ "తడయక పుట్టిన" అనే మధ్యాక్కరలో నిబంధించి కరుణరస పోషణం చేశాడు. అలాగే కణ్వాశ్రమ వర్ణన పద్యంలో (శ్రవణ సుఖంబుగా సామగానంబుల) శాంతరసపోషణం చేశాడు నన్నయ.

ఆదికవి నన్నయ పాత్రపోషణం ప్రశంసాపాత్రం. కావ్యంలో అత్యంత ప్రధానమైన రసానికి ఆధారభూతమైన పాత్రలు పాత్రలు. మహాభారతం విభిన్న మనస్తత్వాలు కలిగిన బహుపాత్రలతో కూడింది. మూలంలోని పాత్రల రూపరేఖలను మరింత స్పష్టంగా చూపిన నన్నయ 'అబ్జాసన కల్పుడు'. శకుంతలోపాఖ్యానంలోని శకుంతల, దుష్యంతుడు, భరతుడు, కణ్వుడు, విశ్వామిత్రుడు, మేనక అందరూ నన్నయ భారతంలో తమతమ ప్రత్యేక లక్షణాలతో సాక్షాత్కరిస్తారు. శకుంతల సంభాషణలోని పారుష్యాన్ని, దుష్యంత వాగ్గతానౌచిత్యాన్ని నన్నయ తగ్గించి ఉదాత్తతను సమకూర్చాడు నన్నయభట్టు. "ఇది మునికన్యయేని", "ఇది మునినాథ కన్యయని" అనే పద్యాలలో దుష్యంతుడి మనస్సంఘర్షణ అద్భుతంగా చిత్రితమైంది.

నన్నయ వర్ణనావైదగ్ధ్యం తదనంతర కవులకు ముఖ్యంగా ప్రబంధ కవులకు ఒజ్జబంతి అయింది. దుష్యంతుడి బాల్యవర్ణన, రాజ్యవర్ణన, మృగయా వర్ణన, వన వర్ణన, కణ్వాశ్రమ వర్ణన మొదలైనవి అమోఘాలు. శకుంతల సౌందర్య వర్ణన, శోకవర్ణన మనోహరాలు. భరతుడి బాల్యవర్ణన, రాజ్యపాలన వర్ణన కూడా హృద్యాలు.

నన్నయ కవిత్వంలో అక్షర రమ్యత ఉజ్జ్వలమైన భాగం. అందులో సంగీతమాధుర్యం, వేదనాద మాధుర్యం తరంగితాలౌతుంటాయి. 'ఆదిత్యాంశు సమీర దుర్గమ మహోగ్రారణ్యదేశాళితో' అన్న పద్యపాదంలోని సమాసదీర్ఘత దుష్యంత సామ్రాజ్య విస్తీర్ణ స్ఫోరకంగా ఉంది. ఆయన శబ్దాలు రసాబ్దాలు.

నన్నయ కవిత్వంలోని శబ్దాలంకారాలు మితంగా, సుస్నితంగా, సుందరంగా ఉంటాయి. ఎక్కడా భావప్రవాహానికి భంజకాలుగా ఉండవు; పైగా రంజకాలుగా ఉంటాయి. నన్నయ వాడే శబ్దాలంకారాలలో ప్రధానమైనది వృత్యాను ప్రాసం. వృత్త్యనుప్రాసం కనిపించీ కనిపించని శబ్దాలంకారం. ఇది గర్భస్థ పిండంలాంటిది. శిశువు లాంటిది కూడా కాదు.

సరభస పరిచలిత మహా
శరభ ద్విపరిపు వరహా శార్దూల మద
ద్విరదాది ప్రకర భయం
కర వనమధ్యమున నృపతి గడుఁ గడిమి మెయిన్.

అనే దుష్యంతుడి వేట వర్ణన పద్యంలో, చిన్న కందంలో తొమ్మిది చోట్ల రకారం ఉంది. కర్తన శీలమైన రేఫాన్ని ప్రయోగించి సన్నివేశాన్ని సముద్దీపింపజేశాడు నన్నయ.

నన్నయ అంత్యానుప్రాసాలంకారం విశిష్టమైంది. చివరంటా అలంకారాన్ని సాగదీసి కొనసాగించాలన్న ఆగ్రహాన్ని ఆయన ప్రదర్శించాడు. సహజంగా ఉన్నదాకే అని మిన్నకుంటాడు నన్నయ. దుష్యంతుడి వేట సందర్భంలోని

ఓసరిలి పఱచు మృగముల
నేసియు డాసిన మృగముల నెగిచి భుజాసిన్
వ్రేసియు.

పద్యం ఇందుకు నిదర్శనం. ఏసియు, వ్రేసియు అని వదలి వేశాడు. దుష్యంతుడు శకుంతలను చూచిన సందర్భంలోని "సంకుల మిళితాళినీల పరికుంచిత కోమల కుంతలన్ శకుంతల" అన్నది కూడా ఇటువంటిదే.

నన్నయ ప్రయోగించే అర్థాలంకారాలు కూడా అతి మనోజ్ఞంగా ఉంటాయి. దుష్యంతుడు విషమాటవీ చలిత కేసరి శార్దూలాది మృగాలను బాలహరిణాలను పట్టుకునే విధంగా పట్టుకొన్నాడని, గార్హపత్యమనే అగ్ని ఆహవనీయంగా ప్రకాశించే విధంగా జనకుడు పుత్రుడై ప్రకాశిస్తాడని, తాను తన నీడను నీళ్లలో చూచే విధంగా తండ్రి కుమారుణ్ణి చూచి అతిశయ ప్రీతితో మహానందాన్ని పొందుతాడని, దుష్యంతుడి పుణ్యతనువు వల్ల ఉద్భవిల్లిన భరతుడు దీపం నుండి పుట్టిన దీపంలాగా ఉన్నాడని చక్కని ఉపమాలంకారాలను ప్రయోగించాడు నన్నయ. దుష్యంతుడు వనాన్ని చూచి దేవేంద్రుడి ఖాండవవనానికి, కుబేరుడి చైత్యరథానికి సమానంగా దీన్ని భూలోకం కోసం బ్రహ్మ సృష్టించాడేమో అనుకున్నాడు. ఇది మంచి ఉత్ప్రేక్షాలంకారం. దుష్యంత సైన్యమనే మందరపర్వతం అరణ్యమనే మహాసముద్రాన్ని సంక్షోభింపజేసిందని, అతిరుచిరాగతుడయిన దుష్యంతుడి మీద లతాలలనలు కుసుమాక్షతలు చల్లారని, అళినీనినాద మృదుభాషలతో దీవనలిచ్చారని నన్నయ మనోహరమైన రూపకాలంకారాన్ని ప్రయోగించాడు. ఉత్తరోత్తరోత్కర్షను వర్ణించే సారాలంకారం 'నుతజల పూరితంబులగు' అనే పద్యంలో పరమరమణీయంగా సాక్షాత్కరిస్తున్నది.

నన్నయ కవిత్వంలో నానారుచిరార్థ సూక్తులకు విశిష్టస్థానం ఉంది. లోకనీతులు, రాజనీతులు వీటిలో విరాజిల్లుతుంటాయి.

1. ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను బెద్ద కాలమునికి తద్ద తగదు.
2. నమ్మియుండగా వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధి నాథులన్
3. ఎల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద యండ్రు సత్యంబు ఇత్యాదుల నెన్నింటినో ఉదాహరించవచ్చు.

నన్నయ కవిత్వంలో అక్కడక్కడ సామెతలు, జాతీయాలు తీయదనాన్ని అందిస్తుంటాయి. వ్యవహార సన్నిహితమైన వాక్యవిన్యాసం కూడా అక్కడక్కడా మనస్సును స్పందింపజేస్తుంది.

1. అరుగుము ఎందుండి వచ్చి తందులకు వడిన్.
2. ఇంక దైవంబకాని యొండు శరణంబులేదు.

నన్నయ ఛందశ్శిల్పవేత్త. శకుంతలోపాఖ్యానంలో మత్తేభశార్దూలాలను పరిమితంగా వాడాడు. దుష్యంత రాజ్యవిస్తృతిని శార్దూలంలోను, భరతుడి బాల్యాన్ని తద్గాత్ర పరిష్వంగ సౌఖ్యాన్ని రెండు మత్తేభాల్లో వర్ణించాడు నన్నయ. తక్కిన శృంగార కరుణ రస సన్నివేశాలలో ఉద్ధత వృత్తాలను వాడలేదు. చంపకోత్పల మాలలనే ప్రయోగించాడు. విశేషవృత్తాలైన మానిని, కవిరాజ విరాజితాలను వనవర్ణనంలో ప్రయోగించాడు నన్నయ. ఇవి చతురస్ర గతిలో నడుస్తూ దుష్యంత గమనాన్ని సూచిస్తున్నాయి.

"తనర జనకుండు" అనే మధురాక్కర గంభీరంగా ఔపదేశిక ప్రతిపత్తితో, "తడయక పుట్టిననాడ" అనే మధ్యాక్కర జాను తెనుగు శైలిలో కరుణ రసప్రసారంతో ప్రకాశిస్తున్నాయి. 'ఇది మునికన్య యేని', 'ఇది మునినాథ కన్యయని' అనే పద్యాలు ఒకే ఎత్తుగడతో ఉండి దుష్యంత సందేహ ప్రవృత్తిని సూచిస్తున్నాయి. "క్రచ్చఱ వేట వచ్చి" అనే ఉత్పలమాలలో పూర్వార్థంలో దుష్యంతుడి మాటలు, ఉత్తరార్థంలో శకుంతల మాటలు సమవిభక్తాలై సౌందర్యాన్ని విరజిమ్ముతున్నాయి.

ఈ విధంగా నన్నయ శకుంతలోపాఖ్యానంలో తన కవితారీతులను ప్రదర్శించాడు. వీటిని మననం చేసుకుంటుంటే "వాల్మీకిం నన్నార్యం త్యక్త్వా కవిరస్తివా జగత్యన్యః" అన్న విశ్వనాథ వారి అభిభాషణం అక్షర సత్యమనిపిస్తుంది.

## 1. 2. 2 ప్రశ్నలు - సమాధానాలు

**ప్రశ్న 1. 'శకుంతలోపాఖ్యానం' ఆధారంగా శకుంతలా దుష్యంతుల పాత్ర చిత్రణం కావించండి . - లేదా -**

**దుష్యంతుడు శకుంతలను స్వీకరించిన విధానాన్ని వివరించండి.**

ఆంధ్రమహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసంలో ఉన్న శకుంతలోపాఖ్యానంలోని ప్రధాన పాత్రలు శకుంతలా దుష్యంతులు.

శకుంతల మేనకా విశ్వామిత్రుల ముద్దుబిడ్డ. ఆమె పుట్టగానే తల్లిదండ్రులు విడిచిపెట్టారు. పక్షులామెను రెక్కలతో కప్పి రక్షించాయి. కణ్వుడు సమిత్కుసుమ ఫలాహరణార్థం అక్కడకు వెళ్లి మాలినీనది ఇసుక తిన్నెమీద ఉన్న ఆమెను తీసుకువచ్చి శకుంతరక్షిత - పక్షులచేత రక్షించబడింది - కనుక శకుంతల అనే పేరుపెట్టి ప్రేమతో పెంచాడు. అందువల్ల కణ్వుడు శకుంతలకు పెంపుడు తండ్రి.

దుష్యంతమహారాజు వేటకు వచ్చి కణ్వమహర్షిని సందర్శించడానికి వచ్చి శకుంతలను చూచి గాంధర్వ వివాహం చేసుకుంటానని శకుంతలను అంగీకరింపజేశాడు. అప్పుడు ఆమె దుష్యంతుడితో "నీ దయవల్ల కలిగే కుమారుడికి యౌవరాజ్యాభిషేకం చేయడానికి వరం ఇవ్వు. అట్లయితేనే నీకూ నాకు సంగమం అవుతుం'దని అన్నది. దుష్యంతుడు శకుంతల కోరిన వరం ఇచ్చి గాంధర్వ వివాహం చేసుకొని అభిమత సుఖాలు అనుభవించాడు. వెళ్లేటప్పుడు దుష్యంతుడు తనమంత్రులను కణ్వమహాముని వద్దకు పంపుతానన్నాడు. శకుంతల ఊరడిల్లింది. శకుంతల గాంధర్వవివాహం క్షత్రియులకు విధి చోదితమని కణ్వుడు ఆమోదముద్ర వేశాడు.

శకుంతల దుష్యంతుణ్ణి కోరిన వరం విషయం కణ్వుడి నోట వెంట వచ్చింది. ఆమె ధర్మచరిత్ర. తన మనస్సు ఎప్పుడూ ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉండాలని, తన పుత్రుడు వంశకర్త కావాలని తండ్రిని వరం కోరుకోవడంలో ఆమె ధర్మశీలం తెలుస్తున్నది.

శకుంతల భరతుణ్ణి కన్నది. ఆ కుమారుడు చక్రవర్తి లక్షణలక్షితుడు. అనంత జవసత్త్వ సంపన్నుడు. అరణ్యంలోని సర్వజంతువుల్నీ తన మహాబలంతో అరికట్టాడు. మునులు సర్వదమనుడన్నారు అతనిని. ఇలా యౌవరాజ్యాభిషేకానికి అర్హతకల వయస్సు వాడయ్యాడు.

ఇలా శకుంతల తగిన పతిని, సుతుణ్ణి పొందింది. ఆమె ఉత్తమపత్ని. ఉత్తమ జనని.

శకుంతల తండ్రి చెప్పిన ప్రకారం ఆయన పంపిన శిష్యులతో కుమార సమేతంగా భర్త దగ్గరకు వచ్చింది. నిండు కొలువులో ఆ రాజును చక్కగా పరిశీలించింది. అనురాగం, ఆదరం, ప్రేమతోడి తొందర లేకపోగా చూపుల్లో క్రూరత చోటు చేసుకున్నదని గమనించింది. శకుంతల గొప్ప పరేంగితజ్ఞ. దుష్యంతుడు తెలియనట్లు నటిస్తున్నాడు. యథార్థాన్ని మనస్సులోకి ప్రవేశింపనివ్వడం లేదని ఆమె గ్రహించింది.

శకుంతల క్రియాశీలం ప్రశంసార్హం. ఇంతదూరం వచ్చి ఊరకే తిరిగిపోవడం మంచిదికాదని తన ప్రయత్నాన్ని ప్రారంభించింది. పూర్వవృత్తాంతం చెప్పి కొడుకును చూపాలనుకుంది. దుష్యంతుడు 'నిన్ను ఎరుగను, వచ్చిన చోటికే తిరిగి వెళ్లు "అనగానే ఆమెకు కళ్లవెంట బాష్పకణాలు స్రవించాయి.

"ఆపదలందు ధైర్యగుణం" శకుంతల నైజం. తన హృదయ సంతాపాన్ని తానే ఉపశమించిజేసుకున్నది. శకుంతల ధర్మజ్ఞ. ఆమె దుష్యంతుడితో ఇలా అన్నది. ధార్మికులైనవారు మాటతప్పకూడదని, మనం చేసిన పనిని మానవులు చూడకపోయినా పంచభూతాలు సూర్యచంద్రులు అహోరాత్రాలు మొదలైన మహాపదార్థాలు గమనిస్తూ ఉంటాయని అందువల్ల అబద్ధమాడి ఆత్మవంచన చేసుకోవద్దని హెచ్చరించింది. భార్యను తిరస్కరించే దుర్మతికి ఇహపరాలులేవని, ఎటువంటి ఆపదల్లోనైనా భార్యాపుత్రులను చూచుకుంటే చాలు బాధలు తొలగిపోతాయని చెప్పింది. ఆ తరువాత పుత్రప్రాశస్త్యాన్ని వివరించింది. పుత్రగాత్ర పరిష్వంగ సౌఖ్యంకన్నా చల్లనిదీ, మనోహరమైనదీ లేదని అతి మధురానుభూతికి అక్షరాకృతి ఇచ్చింది. ఆ తరువాత సత్యగౌరవాన్ని వక్కాణించింది.

"ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మలైన మునులు" ని చెప్పింది.

శకుంతల దైవవిశ్వాసం వర్ణనాతీతం. ఆమె ఎన్ని చెప్పినా దుష్యంతుడు వినలేదు. నీ ఆశ్రమానికి వెళ్లు అన్నాడు. ఆమె వెంటనే "దైవంబకాని యొండు శరణంబు" లేదనుకున్నది.

ఆకాశవాణి జోక్యం చేసుకున్నది. దుష్యంతుడితో శకుంతల మహాసాధ్వి, ఆమె వివేకంతో సత్యం పలికిందని, ఈ బాలుడు మీ కుమారుడని అందరూ వినేటట్లు చెప్పింది.

శకుంతల మహాసాధ్వి. ఆమెను ఆకాశవాణితో పాటు గగనస్థితులైన దేవతలూ ప్రశంసించారు. దుష్యంతుడి చేత అతిప్రణయ గౌరవంతో సంభావింపబడింది.

దుష్యంతుడు రాజ్యపరిపాలనాదక్షుడు, మహావీరుడు, సౌందర్య పిపాసి, ఇంకా అన్ని విధాలా గొప్పవాడే, కాని లోకాపవాద భీతివల్ల తెలియనట్లు నటించాడు. శకుంతల మాటలను చెవిలో దూరనీయలేదు. చివరకు ఆకాశవాణి చెప్పగానే యథార్థాన్ని అంగీకరించాడు. అందుకైనా మనం ఆ మహారాజును మెచ్చుకోవలసిందే. ఆ తరువాత కొడుకును ఎత్తుకొన్నాడు. హర్ష పులకలు అతిశయించేటట్లు ఆలింగనం చేసుకున్నాడు. పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని తనివితీర అనుభవించాడు 'సృష్టి కర్త ప్రవృత్తి గుణ సమగ్రతకు విముఖం గదా' అని కాళిదాసోక్తి కనుక దుష్యంతుడిలోని ఈ లోపం క్షమార్హ మైనదే!

**ప్రశ్న 2. శకుంతలోపాఖ్యానం లోని సందేశాన్ని వివరించండి.**

**- లేదా - శకుంతలో పాఖ్యానం ద్వారా గృహస్థాశ్రమ ధర్మ స్వరూపాన్ని తెలుపండి. - లేదా - శకుంతలోపాఖ్యానంలో విదితమయ్యే మహిళా చైతన్య స్వరూపాన్ని వివరించండి.**

మహభారతాన్ని ఇతిహాసంగా, శాస్త్రేతిహాసంగా వేదవ్యాస మహర్షి రూపొందించాడు, నన్నయ వ్యాస విహిత మార్గంలో పురుషార్థ నిరూపణం చేశాడు. ప్రధానంగా ధర్మ ప్రబోధం చేశాడు.

శకుంతల ధర్మ చరిత. కణ్వ మహాముని సైతం ' నీ ధర్మ చరితంబునకు మెచ్చితి ' అన్నాడు ఆమెతో. ఆమె తన మనస్సు 'ధర్మువునంద తగిలి' ఉండాలని వరం కోరుకొన్నది.

కణ్వ మహర్షి శకుంతలకు బోధించిన ధర్మాన్ని ముందుగా మననం చేసుకుందాం. " ఎంతటి పతివ్రతలైనా పుట్టింట్లో ఎక్కువ కాలం ఉండరాదు. భర్త తగ్గర ఉండడమే ధర్మం." అన్నాడు కణ్వుడు, ఇది శాశ్వత సత్యం.

దుష్యంతుడి పరిస్థితిని గమనించి శకుంతల రాజుల తత్త్వాన్ని ప్రకటించింది. రాజులు ప్రయోజనాపేక్ష కలవారు. తమ ప్రయోజనం కోసం ఆశ్రితుల మీద అభిమానాన్ని మార్చుకుంటారు. వారికి కొత్తవారిమీద మోజు ఎక్కువ. అందువల్ల బుద్ధి మంతులు రాజుల్ని నమ్మకూడదు. ఇదీ శకుంతల అభిప్రాయ సారాంశం. వ్యాసుడు, నన్నయ ప్రకటించిన ఈ అభిప్రాయాలే పోతన, ధూర్జటి, త్యాగరాజు

మొదలైన తెలుగుకవులను ప్రభావితం చేశాయి. రాజులు మత్తులనీ, వారిసేవ నరక సమానమనీ, వారి కానుకలు ఆత్మవ్యథా బీజాలనీ ధూర్జటి అన్నాడు. నిధి చాల సుఖమా రాముని సన్నిధి చాల సుఖమా? అని త్యాగరాజు ఎలుగెత్తి పాడాడు.

మాట తప్పిన భర్తను 'సైతం క్షమించలేదు శకుంతల.' అజ్ఞాని లాగా తెలిసిన విషయాన్ని తెలియదనవద్దు అని మందలించింది. ఇది రహస్యం ఎవరికీ తెలియదులే అని అబద్ధ మాడడం ధార్మికుల లక్షణం కాదన్నది. వేదాలు, పంచభుతాలు, ధర్మదేవత, ఉభయసంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్య చంద్రులు, రేయీ పగలూ ఉండగా అవి మానవ ప్రవర్తనను గమునిస్తూ ఉండగా అబద్ధమాడి ఆత్మవంచనకు పూనుకోరాదు.

గృహస్థాశ్రమంలో భార్యకు ఉన్న ఉన్నతస్థానాన్ని శకుంతల చక్కగా వ్యక్తం చేసింది. పతివ్రత, గుణవతి, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కరించే దుర్మార్గుడికి ఇహపరాలు లేవు. అనుగుణ భార్యావంతుడు శాశ్వతమైన గృహస్థ ఫలాన్ని మొత్తం పొందుతాడు. భార్య పురుషార్థాలైన ధర్మార్ధ కామాలను సాధించడానికి సాధనం స్వచ్ఛమైన నడవడికి గురుస్థానం వంశస్థితికి మూలం మోక్షానికి చేదోడు. గౌరవానికి కారణం. సంతోష జనకం.

కష్టాలు వచ్చినప్పుడు భార్యను, బిడ్డల్ని చూస్తే బాధలన్నీ తొలగిపోతాయి. భార్య భర్తలో అర్ధ భాగం. ఆమె ముందు మరణిస్తే స్వర్గంలో భర్త కోసం ఎదురు చూస్తుంటుంది. భర్త భార్యలో ప్రవేశించి కుమారుడిగా జన్మిస్తాడు 'అంగాదంగాత్ సంభవసి' అనే వేదవాక్యాన్ని బట్టి తండ్రీ కొడుకులకు తేడాలేదు.

శకుంతల పుత్ర విశిష్టతను కూడా పేర్కొన్నది. గార్హపత్యాగ్ని మరోరూపంలో ఆహవనీయాగ్నిగా ప్రకాశించే విధంగా జనకుడే తనయుడిగా ప్రకాశిస్తాడు. తన నీడను తాను నీళ్లలో చూచుకొని ఆనందించే విధంగా తండ్రి కుమారుణ్ణి చూచి ఆనందిస్తాడు. పున్నామ్నో నరకాత్ త్రాయత ఇతి పుత్రః' అనే వేదవచనం ప్రకారం పుత్ అనే పేరుగల నరకం నుంచి తల్లి వైపు వారిని తండ్రి వైపు వారిని రక్షిస్తాడు అని పుత్ర శబ్దార్థం. పున్నామ నరకం నుంచి తల్లి వైపు వారిని, తండ్రి వైపు వారిని రక్షిస్తాడు. దీపం నుంచి పుట్టిన దీపం లాగా తండ్రి వల్ల జన్మించిన కుమారుడు ఆ కాంతిని-పితృలక్షణాల్ని-కొనసాగిస్తాడు. కొడుకు ఒంటిని కౌగిలించుకుంటే కలిగే హాయి అనుభవిస్తే తెలియాల్సిందే కాని మాటలకు అందదు. ముత్యాల దండలు, కర్పూర రజం, మంచిగంధం, ఆహ్లాదానికి మారుపేరైన వెన్నెల-ఏవీ కలిగించలేవు. అందువల్ల పుణ్యాచారుడైన పుత్రుణ్ణి ఎవరూ దూరం చేసుకోగూడదు.

అనంతరం శకుంతల సత్యఔన్నత్యాన్ని చాటింది. అందురూ బాగా మెచ్చుకునే నీటితో నిండిన నూరు నూతుల కన్నా ఒక దిగుడు బావి శ్రేష్ఠం. అటువంటి బావులు నూరిటి కన్నా ఒక సత్క్రతువు శ్రేష్ఠం. అటువంటి క్రతువులు నూరిటికన్నా ఒక కుమారుడు మేలు. అటువంటి కుమారులు వందమంది కన్నా ఒక సత్యవాక్యం మంచిది. వెయ్యి అశ్వమేధ యాగాల ఫలితాన్ని త్రాసులో ఒక ప్రక్కన పెట్టి, సత్య ఫలాన్ని మరో ప్రక్కన పెట్టి తూకం వేస్తే సత్యం వైపే ముల్లు మొగ్గుతుంది. సత్యానికి ఉన్న గురుత్వాతిశయం. గొప్పతనం బరువు - అలాంటిది. ఎన్ని తీర్థ యాత్రలు చేసినా, ఎన్ని వేదాలు చదివినా సత్యంతో సమానం కావని ధర్మశాస్త్ర వేత్తలైన ఋషుల అభిప్రాయం.

మానవులకు జన్మ పరంపర ఉంటుంది. ఒక జన్మలో చేసుకున్న పుణ్యాపాపాలు ఆ తరువాత జన్మలోకి వెన్నంటి వస్తాయి.

మానవుడు ఎప్పుడు తన పని తాను చేయవలసిందే. వ్యతిరేక పరిస్థితులు వచ్చినప్పుడు అధైర్యపడకుండా ముందుకు సాగి పోవాలి. అయితే దైవాన్ని విస్మరించకూడదు మానుష శక్తి కన్నా దైవ శక్తి మిన్న అన్న భావంతో ప్రవర్తించాలి. ఫలితాన్ని ఆశించకుండా పని చేయాలి. ఈ నిష్కామకర్మకు, భగవత్ శరణాగతి తోడుకావాలి. అప్పుడు భగవంతుడు జోక్యం చేసుకొని తన స్వరూపమైన సత్యాన్ని ప్రతిష్ఠిస్తాడు. 'సత్యమేవ జయతే' పరమార్థాన్ని సాక్షాత్కరింపజేస్తాడు. శకుంతల కథలో ఇలాగే జరిగింది. "ఇంక దైవంబ కాని ఒండు శరణంబు లేదు'' అనుకోగానే ఆకాశవాణి యథార్థం పలికింది. కథ సుఖాంతమైంది.

మొత్తం మీద మానవుడు భౌతిక సంపదల కోసం మరో మానవుణ్ణి అర్థించడం మంచిది కాదని, భార్యను సంతానాన్ని గౌరవించడం ఉత్తమ మానవ లక్షణమని, క్లేశాలు అనుభవించినా విజయం సాధిస్తారని శకుంతలోపాఖ్యానం సందేశం. అది ధర్మ సందేశం.

### 1.2.3 రాదగిన ప్రశ్నలు :

1. దుష్యంతుడు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకున్న విధానాన్ని గురించి, తత్పర్యవసానాన్ని వివరించండి.
2. శకుంతల జన్మ వృత్తాంతాన్ని వ్యక్తీకరించండి లేదా మేనక విశ్వామిత్రుడి తపస్సును భగ్నం చేసిన తీరును తెలియజేయండి
3. రాజ సభలో జరిగిన శకుంతలాదుష్యంతుల సంవాదాంశాన్ని క్రోడీకరించండి.
4. దుష్యంతుడు శకుంతలాభరతుల్ని స్వీకరించడంలో ఏర్పడ్డ సంఘర్షణను సమీక్షించండి.
5. శకుంతలోపాఖ్యానంలోని సమకాలిక సార్వకాలిక విశేషాలను పేర్కొనండి.

### 1.2.4 ఆచూకీ గ్రంథాలు :


1. ఆంధ్రమహాభారతము. ఆది పర్వము : ఆం. ప్ర. సా. అకాడమి
2. ఆంధ్రమహాభారతము. ఆది సభాపర్వము : సంశోధితము. ఉస్మానియా విశ్వవిద్యాలయం.
3. ఆంధ్రమహాభారతము-కవిత్రయము : దివాకర్ల వేంకటావధాని, ఆం.ప్ర.సా. అకాడమి
4. ఆంధ్రమహాభారతోపన్యాసములు : ఆంధ్రసారస్వత పరిషత్తు.
5. ఆంధ్రవాఙ్మయారంభదశ (సం. 1,2) ప్రాఙ్నన్నయ యుగము, నన్నయ భారతము : దివాకర్ల వేంకటావధాని.
6. ఆంధ్రసాహిత్య చరిత్ర : పింగళి లక్ష్మీ కాంతం.
7. నన్నయ కవితా వైభవం : దివాకర్ల వేంకటావధాని
8. నన్నయ్య కవిత్వము-అక్షర రమ్యత : వి.వి.యల్. నరసింహారావు
9. నన్నయగారి ప్రసన్న కథా కలితార్థయుక్తి : విశ్వనాథ సత్యనారాయణ
10. భారత ధ్వని దర్శనము : శలాక రఘునాథ శర్మ.
11. భారత పద్యశైలి : చేరెడ్డి మస్తాన్ రెడ్డి
12. సమగ్ర ఆంధ్రసాహిత్యం (సం.1) : ఆరుద్ర.


**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి**, ఎం.ఏ., పిహెచ్. డి.

రీడర్ & ప్రిన్సిపాల్

ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల,

నర్సరావుపేట

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

పాల్కురికి సోమన

# బెజ్జ మహా దేవి కథ

(బసవ పురాణం - తృ.ఆ 151 - 166)

## పాఠం - 3

1. 3. 0 - పరిచయం
1. 3. 0. 1 - కవి పరిచయం
1. 3. 0. 2 - కావ్య పరిచయం
1. 3. 1 - పాఠ్యభాగ వివరణ
1. 3. 1. 1 - బెజ్జ మహాదేవి కథ
1. 3. 1. 1 - పాఠ్యభాగ వివరణ

### 1.3. 0 పరిచయం :

### 1.3. 0.1 కవి పరిచయం :

తెలుగు సాహిత్యంలో నన్నయ యుగానంతరం శివకవి యుగమన్నది ప్రసిద్ధం. శివకవుల్లో ప్రముఖుల్లో నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమన. నన్నెచోడుడు వృత్తాల్నే స్వీకరించాడు. కానీ పాల్కురికి సోమన ద్విపదచ్ఛందస్సుకు ప్రాముఖ్యమిచ్చాడు. శివపారమ్యమైన కథలే గ్రంథస్థం చేశాడు. కనుకనే వీర శైవ కవుల్లో ప్రథమగణ్యుడు పాల్కురికి సోమన. ఇతడు అష్ట భాషా కవితా ప్రవీణుడు. తత్త్వ విద్యాకలాప కవితా సారుడు. సోమనను గూర్చి తెలుసుకోవడానికి ముఖ్యమైన ఆధారగ్రంథాలు. 1. ఇతని బసవ పురాణము మొదలైన గ్రంథాలు 2. పిడపర్తి సోమన రచించిన పద్య బసవ పురాణము 3. తోంటదసిద్ధ లింగకవి కన్నడంలో రచించిన పాల్కురికి సోమేశ్వర పురాణము. 4. ఏకామ్రనాథుని ప్రతాప చరిత్ర.

జన్మస్థలం : ఈ కవి ఇంటిపేరును బట్టి 'పాలకురికి' - గ్రామ వాస్తవ్యుడై ఉండవచ్చునని పండితుల అభిప్రాయం. శ్రీశైలానికి ఈశాన్యభాగాన కొలనుపాక గ్రామంలోని సోమేశ్వరస్వామి వరప్రసాదాన, పాలుకురికి గ్రామంలో జన్మించాడని తోంటదసిద్ధలింగకవి, తన 'సోమేశ్వర పురాణం' పేర్కొన్నాడు. ప్రస్తుతం వరంగల్లుకు 30 కి.మి. దూరంలో పాల్కురికి గ్రామం ఉంది. ఇతడు క్రీ. శ. 1160 - 1240 మధ్యకాలంలో జీవించినట్లు తెలుస్తుంది. ఇతని ప్రసిద్ధరచనలైన 'అనుభవ సారము' ను క్రీ.శ. 1180 ప్రాంతంలోను, బసవపురాణాన్ని 1192 ప్రాంతంలోను, పండితారాధ్య చరిత్రను 1230 ప్రాంతంలోను రచించిఉంటాడని 'బండారు తమ్మయ్య' గారి అభిప్రాయం.

తల్లిదండ్రులు : బసవపురాణావతారికలో :

'భ్రాజిష్ణుడగు విష్ణు రామిదేవుండు
తేజిష్ణువగు శ్రీయాదేవి యమ్మయును
గారవింపగ నొప్పు గాదిలి నుతుఁడ
వీరమాహేశ్వరాచార వ్రతుండ' - అని చెప్పుకున్నాడు.

కాని సోమనాథుని బాల్యమందే తల్లిదండ్రులు మరణించగా, అప్పటి పాలకురికి గ్రామ పరిపాలకులు, శైవ బ్రాహ్మణ కుటుంబం వారాతని ఆదరించి పోషించారని ఒక ఐతిహ్యం కూడా ప్రచారంలో ఉంది. సోమనాథుడాజన్మాంతము గృహస్థుడుగా జీవించాడు. అతడు సన్యాసం స్వీకరించాడని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. సోమనాథుని కవితా విద్యాగురువు కరస్థలి విశ్వనాథుడు.

**సోమనాథుని వైదుష్యము :** సోమనాథుడు సకల విద్యాపారంగతుడు. సరస కవితా విశారదుడు. సంగీత శాస్త్రజ్ఞుడు. పిడపర్తి సోమనాథుడు ఇతని మేధాశక్తిని ఈ విధంగా చెప్పాడు.

సీ ॥ లిపి లిఖింపక మున్న యపరిమితార్థోక్తి
శక్తి యాతని జిహ్వ జరుగుచుండు
ఛందోధి కరణాది సరణి జూడకమున్న
మదినుండు కావ్య నిర్మాణశక్తి,
భాష్య సంతతులు చెప్పక చూడకయ మున్న
రుద్ర భాష్య క్రియారూఢి వెలయు
తర్క శాస్త్రాది విద్యలు పఠింపకమున్న
పర పక్ష నిగ్రహ ప్రౌఢి వెలయు,

గీ॥ అతని నుతియింప నాబోటి కలవి యగునె
జైన మస్తక విన్యస్త శాతశూల
కవిత బిజ్జల తలగుండు గండ బిరుద
శోభితుడు పాల్కురికి సోమనామాభిదుండు' --

ఇటువంటి అపారజ్ఞానం, గురువు అనుగ్రహం వల్ల సంపాదించడం, కేవలం ఒక్క జన్మలో సాధ్యమయ్యేది కాదు. ఈశ్వర ప్రసాదాన అప్రయత్నంగానే సకల విద్యాశక్తులు ఇతనికి లభించాయి. అందుచేతనే అతనిని సాక్షాత్తు 'భృంగి' అవతారంగా భావించడం జరిగింది.

**బిరుదులు :** 'పర సర్వజ్ఞ శిఖామణి,' 'ప్రత్యక్ష భృంగీశావతార', 'తత్వ విద్యాకలాప', 'అన్యవాద కోలాహ', 'కవితా సార', మొదలగునవి ఇతనికి గల బిరుదులు.

**సోమన రచనలు :** తెలుగు భాషాకృతులు : బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, అనుభవసారం, వృషాధిపశతకం, చతుర్వేద సారం, బసవరగడ, గంగోత్పత్తిరగడ, సద్గురు రగడ, చెన్నమల్లు సీసములు, నమస్కార గద్య, అక్షరాంక గద్య, పంచప్రకార గద్య, అష్టోత్తర శతనామగద్య, శరణు బసవగద్య, బసవోదాహరణము, పండితారాధ్యోహరణము మొదలైనవి. వీటిలో మనకు కొన్ని మాత్రమే లభ్యమవుతున్నాయి.

ఇందులో బసవపురాణం, పండితారాధ్య చరిత్ర ద్విపద కావ్యాలు.

**సంస్కృత భాషాకృతులు :** సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, సంస్కృత బసవోదాహరణం, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం అనేవి.

కన్నడ భాషలోని లఘుకృతులు : సద్గురు రగడ, చెన్న బసవ రగడ, అక్షరాంక పద్యాలు, శరణు బసవ రగడ, బసవ లింగనామావళి, శీలసంపాదనం, శివగణ సహస్రమాలఅనేవి.

ఈ విధంగా పాల్కురికి సోమన సంస్కృతాంధ్ర కర్ణాట భాషల్లో నిష్ణాతుడు, కవిశ్రేష్ఠుడు.

**1.3.0. 2 కావ్య పరిచయం :**

**బసవపురాణ పరిచయం :**

తెలుగులో వెలసిన తొలి వీరశైవ పురాణ గ్రంథం బసవపురాణం. వీరశైవ మతాచార్యుడు బసవేశ్వరుని చరిత్రను ఈ కవి బసవ పురాణంగా రచించాడు. జైనులు, తీర్థంకరుల చరిత్రలకు 'పురాణం' - అని పేరుపెట్టడం, సంస్కృత కన్నడ సాహిత్యాల్లో ఉంది. ఆ సంప్రదాయాన్ననుసరించి సోమన, బసవన్న చరిత్రకు పురాణమని పేరు పెట్టాడు. బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారంగా ఇందులో వర్ణించబడ్డాడు. ఈ గ్రంథంలో ఏడాశ్వాసాలున్నాయి. బసవని పూర్వావతారాలు, జననం, వ్యవహార దక్షత, వీరశైవ ధర్మ రక్షాప్రచారాలు, జంగమసేవ, లింగైక్యము మొదలైన పుణ్యచరిత్రలతోపాటు సుమారు 75 మంది శివభక్తుల కథలు కూడా పూసలలో దారం లాగా ఇందులో కూర్చబడ్డాయి. ముగ్ధసంగయ్యకథ, బెజ్జమహాదేవి కథ, గొడగూచి కథ, కన్నప్ప కథ, మాదిరాజయ్య కథ, సిరియాళుని కథ మొదలైనవెన్నో రసనిర్భరంగా సోమన రచించాడు.

**బసవేశ్వరుడు :** బసవేశ్వరుడు క్రీ.శ 1139 ప్రాంతంలో జన్మించినట్లు తెలుస్తుంది. ఆదిశంకరుని లాగానే 40 సంవత్సరాల లోపే జీవించాడు బసవేశ్వరుడు. ఇతడు నందీశ్వరుని అంశతో, మాదిరాజు, మాదాంబ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించాడు. పసితనంలోనే అనేక విద్యలు నేర్చి, తల్లిదండ్రులను విడిచి, కల్యాణ కటకంలో తన మేనమామ దగ్గర చేరాడు. అతని మేనమామ బిజ్జలుని వద్ద మంత్రిగా ఉండేవాడు. తన మేనమామ కుమార్తె గంగాంబను వివాహమాడి క్రమంగా, మేనమామ అనంతరం మంత్రి అయ్యాడు. అప్పటినుంచి వీరశైవమత ప్రచారానికి ఉద్యమించాడు. ఆనాడు శైవ మతంలో భిన్న శాఖలుండేవి. వాటినన్నింటిని ఒక్క కూటం లాగా చేర్చి, ఆంధ్ర కర్ణాట ప్రాంతాలలో వీర శైవం వ్యాప్తి చేశాడు. కులాధిక్యాలతో కూడుకున్న వర్ణవ్యవస్థను ధిక్కరించాడు. సర్వవర్ణాలవారు ఇందులో చేరడానికి అర్హులే. వర్ణవ్యవస్థ తుడిచివేయడంతో ప్రజల్లో న్యూనాధిక్యాలు తొలగిపోయాయి. అందరికీ భక్తి భావంకుదిరింది. ఇతడు కత్తిచేత బట్టి వీరశైవాన్ని ప్రబోధించాడు.

పురుషులతో పాటు సమాన బాధ్యతలతో స్త్రీలకు కూడా లింగధారణ దీక్ష ఇవ్వబడేది. ఈ కారణం చేత వీరశైవుల్లో స్త్రీ పురుష వివక్షలేక పుట్టుక నుంచి ద్విజులై, ఆజన్మ శుద్ధులై ఉండేవారు. వారికి లింగధారణే యజ్ఞోపవీతం. "లీన మర్థంగమయతి" - ఈ సృష్టి అంతా దేనిచేనుద్భవించి, దేనియందు లీనమవుతుందో ఆ పరబ్రహ్మకు లింగవాచకం వర్తిస్తుంది.

'ఈశాన స్సర్వ విద్యానామ్' - అని పంచబ్రహ్మ మంత్రాలలో చెప్పినట్లు సకల విద్యాధీశుడగు శివుని వదనపంచకం నుంచి ఆవిర్భవించిన సంతతివారగుటచే, తాము శివకులీనులమని, అందుచే వేదాధ్యయనాది సమస్తాధికారాలు తమకున్నాయని వీరశైవుల విశ్వాసం.

ఈశ్వరుని పంచముఖాల నుంచి 'సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన' - అనే అయిదుగురాచార్యులుద్భవించి, వేర్వేరు యుగాలలో, వివిధ నామాలతో వ్యవహార ప్రసిద్ధులైనారు. వారే వీరశైవులకు గోత్రకర్తలని శైవాగమాల్లో చెప్పబడింది. బసవేశ్వరుడు పండితుడు, జ్ఞాని, మాత్రమే కాదు. మధుర గాయకుడు కూడా. ఇతడు సుమారు నాలుగు లక్షల వచనాలు రచించినట్లు చెబుతారు. బసవేశ్వరుడు తన మధుర కంఠంతో, ఆ వచనాలు తన్మయత్వంతో పాడుతుంటే ప్రజలు పరవశులై వినేవారట.

**సోమన కవితా దృక్పథం :**

సంస్కృత భూయిష్ఠ రచన పండితులకేనని, తన రచన సర్వజన సుబోధకంగా ఉండడానికి 'జాను తెనుగు' ను అభిలషించానని, అవి కేవలం తెలుగు మాటలని చులకనగా చూడవద్దని, వాటిని 'వేదముల కొలదియకాఁజూడుడ' ని, 'అల్పాక్షరంబుల అనల్పార్థ రచన కల్పించుటయె కాదె కవి వివేకమ' ని సోమన చెప్పుకున్నాడు.

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వ సామాన్యంబు గామి
జాను దెనుగు విశేషము ప్రసన్నతకు." (పండితారాధ్య చరిత్ర)

"ఉరు తరగద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను దెనుంగు
చర్చింపగా సర్వ సామాన్య మగుట
గూర్చెద ద్విపదలు గోర్కె దైవార

తెలుగు మాటలనంగ వలదు, వేదముల
కొలదియ కాజూడు డిల ......."
"అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుట మెకాదె కవివివేకంబు" (బసవపురాణం)

దీనిని బట్టి తన రచనలు సమాజంలో అందరికీ అర్థంకావాలనే అతని అభ్యుదయ దృక్పథం వెల్లడౌతుంది.

దేశికవితోద్యమం శివకవులతోనే ప్రారంభమైంది. పాల్కురికి సోమన వస్తువు, ఛందస్సు, భాష - అనే అంశాలతో ఈ దేశికవితను సాధించాడు.

బసవేశ్వరుడు, పండితారాధ్యుడు - అనే మహాశైవ ప్రముఖుల చరిత్రలో అనేక వీర శైవభక్తుల కథలను కావ్యవస్తువులుగా స్వీకరించి, ద్విపద చందస్సులో, జాను దెనుగు భాషలో రచనలు చేసి సోమన శివకవి యుగానికి తలమానికమయ్యాడు. కాని, ఇతడు, చారిత్రకంగా, సాహిత్య పరంగా దేశికవులకు ఆచార్యుడైనప్పటికీ, ఇతని గ్రంథాలు మతావేశంతో కూడి ఉన్నాయి. కాబట్టి పాక్షిక దృష్టితో పాఠకలోకంలో ఉండిపోయాయి. కవితావేశం, మతావేశం పరస్పర పోషకంగా కనిపిస్తాయి. అయినప్పటికీ సోమన దేశికవితోద్యమ నాయకుడంటే అబ్బురపడవలసిన పనిలేదు.

## 1.3. 1 పాఠ్యభాగ వివరణ :

### 1.3.1. 1 బెజ్జ మహాదేవి :

బెజ్జ మహాదేవి ఈశ్వరుని శుభప్రదమైన పాదపద్మాలను తన అంతరంగంలో నిలుపుకున్న భక్తురాలు. ఆమె ఇలా ఆలోచించింది. " భర్గునకు సేవకులు, బంధువులు అందరూ ఉన్నారు. కాని తల్లి మాత్రం లేదు. ఇది చాలా చిత్రంగా ఉంది. కానీ తల్లిలేకుండా తానెట్లా జన్మించాడు ? త్రిలోకాలకు అధిపతియైన శివునకు తల్లి మరణించి ఉంటుంది. ఇప్పుడేం చెయ్యాలి ? తల్లి చనిపోయిన కారణంగానేకద తానెంతో దుఃఖపడింది ? ఎటువంటి వారికైనా మాతృవియోగ దుఃఖమంతేగద ? శివునికి తల్లిగనక ఉంటే ఎందుకు తపస్సు చేయనిస్తుంది? తల్లి ఉంటే వెంట్రుకలు జడలు గట్టనిచ్చేదా ? హాలాహల విషాన్ని తాగడానికి ఒప్పుకునేదా ? తోలు చీరలు ధరించనిచ్చేదా ? ఒంటినిండా బూడిద పూసుకోనిచ్చేదా ? భిక్షాటన చేయనిచ్చేదా ? శ్మశానంలో నివాసం ఉంటే ఊరుకునేదా ? తల్లి లేని బిడ్డడు కాబట్టి ఇన్ని చెయ్యరాని పనులు చేశాడు ! ఎన్నో ఇబ్బందులు పడ్డాడు !

తల్లి ఉంటే తన స్తన్యాన్నిచ్చి, వెన్నబెట్టి, ఆకలైతే మళ్లీ మళ్లీ చూసి పాలిచ్చి సాకి పెంచి పెద్దవాణ్ణి చేసేది కాదా ? తల్లి లేక పోతేనే ఇంత వాడయ్యాడు ! చిన్నప్పటి నుంచీ తల్లి ఉంటే ఇంకెంతగా వృద్ధిపొందే వాడోగదా ! ఎంత మగబిడ్డలైనా పెండ్లిండ్లలోను, పేరంటాలప్పుడు, పండుగ రోజుల్లోను, జాతరలప్పుడు చక్కగా అలంకరించి ఆదరించే తల్లి లేకపోతే దుఃఖపడరా ? ఇంక ఉపేక్షించడం మంచిదికాదు. హరునికి నేనే తల్లి నౌతాను. భేదభావం లేక పెంచే ఏ స్త్రీయైనా తల్లికాదా ?" అని ఆలోచించి బెజ్జ మహాదేవి తానే శివుని తల్లిగా

భావించుకుంది. పరమేశ్వరుణ్ణి తన కుమారునిగా లాలించసాగింది. పసిపిల్ల వాడు గాబట్టి తొడలమీద పడుకోబెట్టి అభ్యంజన స్నానం చేయించింది. స్నానం చేయించేటప్పుడు ముక్కును, చెక్కిళ్లను, కడుపును, వీపును చక్కగా పెరగాలని చేతులతో ఒత్తింది. మూడు కళ్లనూ స్పృశించింది. కాళ్లు, చేతులు వంకర్లు లేకుండా చక్కగా లాగింది. నలుగులు పెట్టింది. కాళ్లమీద బోరగిల పడుకోబెట్టి, నీటితో వీపుమీద చరచింది. తలమీద నీరు పోసింది. నీళ్లు నోట్లోకి పోకుండా ముఖానికి తన చేతిని అడ్డంపెట్టింది. పసుపు కలిపిన నీటితో స్నానం చేయించేది. స్నానం తర్వాత కళ్లు, చెవులు గట్టిగా ఊదేది. వ్రేలితో నోట్లో సున్నితంగా నొక్కి, కఫాన్ని వెలికి తీసేది. స్నానం చేయించడం పూర్తి కాగానే చేతినీరు చుట్టూరా తిప్పి దిష్టి తీసినట్లుగా, బొట్టు పెట్టేది.

తర్వాత బొటనవ్రేలితో మెత్తని మట్టిని కలిపి బొట్టు పెట్టేది. కడవ క్రింద అంటుకున్న కాలిన పిడకలు నలిచి, ఆ బూడిదను శివుని నొసటికి పూసేది. పై కెత్తితే ఎత్తు పెరగడేమో అని భయపడి ఆమె, ఆ బాలుని తన గుండెలకు అదుముకునేది. కాటుక పెడితే కళ్లుపెద్దవౌతాయని మూడుకళ్లకు కాటుక పెట్టి స్తన్యమిచ్చేది. పక్షుల నీడ పారితే పిల్లవాడు పాడైపోతాడని, జాగ్రత్తపడేది. తినడానికి వెన్నపెట్టేది. బుగ్గగిల్లి ఏడ్వగానే ఉగ్గుపాలు పోసేది. ఏడుపు మానడానికి ముద్దాడి బుజ్జగించేది. తన ఉదరాన్నే పాన్పుగా వేసి 'వీరెవ్వరో ?' యని లాలించేది. 'జో' కొట్టేది. ఈ విధంగా శివుని తన కుమారునిగా తలచి ఆమె ఉపచారాలు చేస్తూ ఉండగా ఆమె నిశ్చల ముగ్ధ భావానికి మెచ్చుకొని, ఈశ్వరుడు వాటినన్నింటిని స్వీకరించాడు. 'రూపం ఒక్కటే' అని వేదాలు, 'సాధకుడు ఎల్లప్పుడూ భగవంతుణ్ణి స్మరించాలి' - అప్పుడే 'ఆ రూపం, భావం సిద్ధిస్తాయి' - అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఇది హరుని వాక్యం. దానికి లోకంలో తిరుగులేదు. 'భక్తు డే విధంగా భావిస్తే శివుడు ఆ రూపంలోనే సాక్షాత్కరిస్తాడ' ని భక్తులందరూ భావిస్తుంటారు.

ఈ విధంగా కొన్ని రోజులు జరుగగా, ఆ దేవ దేవుడు బెజ్జ మహాదేవికి ప్రసన్నుడు కాదలచి, చిన్న పరీక్ష పెట్టాడు. ఆ పిల్లవానికి తీవ్రమైన రోగం వచ్చింది. పాలు తాగడం లేదు. వెన్న తినడానికి నోరు తెరవలేదు. పిల్లవాని పరిస్థితి చూచి తల్లి తల్లడిల్లింది. దుఃఖంతో వివశురాలై ఇలా అంటుంది "నా ముద్దుల పట్టి ! పాలెందుకు తాగవు ? నీ చెమటలు చూస్తే నేను నెత్తురు ముద్దనౌతాను. (అంటే భరించలేనని భావం) ఈ స్థితిలో నిన్నెట్లా చూడగలను ? తల్లిని గద ! ఇంతటి బాధను ఏ విధంగా సహించగలను ? లేకలేక ఒక్కడివే పుట్టావు. ఈ దుఃఖాన్ని ఎలా దాటగలను ? నాకు నేలమీద కాళ్లు నిలవడం లేదు. ఏమీ మాట్లాడవెందుకు ? ఆహారం జీర్ణం కాలేదా ? గొంతు నొప్పిగా ఉందా ? అంగిట్లో బాధ కలిగిందా ? నాకేమీ మందులు మాకులు తెలియవు' - అంటూ దుఃఖంలో పలకరించింది. పొర్లింది. బిడ్డ ఒళ్ళు వేడిగా ఉందేమోనని చూచింది. కౌగిట్లో చేర్చింది. శరీరం మీద గుడ్డ కప్పుతుంది. తీస్తుంది. మళ్ళీ మళ్లీ అదేపని చేస్తుంది. తల్లడపడింది. పిల్లవానికి అంగిటిముల్లు అయిందని ఇరుగుపొరుగు వాళ్లంటే ఎంతో బాధపడింది. శోకసముద్రంలో మునిగిపోయింది.

ఆమె శివుణ్ణి చూస్తూ ఇలా నిష్ఠూరంగా అంటున్నది "కడుపులో కొంచెం వెలితి అంటే ఒడయనంబి దగ్గరకు వెళ్లావు. అక్కడ తినడానికి ఏమీలేక పోతే కుమ్మర గుండయ్య వాద్యం వాయిస్తూ ఉంటే నాట్యం చేశావు. అక్కడ కూడ ఏమీ లేకపోతే చేరమ చక్రవర్తి వద్ద అందరూ ఆశ్చర్యపడేటట్లుగా ఆడావు. ఆకలితో అలసిపోయావు. ఇటువంటి ఆటలు ఎన్ని ఆడినా కడుపునిండుతుందా ? అన్ని తిరిగివచ్చి, పిట్టవ్వ దగ్గర చివరకు ఇంత పిట్టు తిన్నావు. తర్వాత సామవేదుల వారింట్లో చచ్చిన పెయ్యను వండిపెడితే తిని, కరికాళవ్వ యింట్లో రహస్యంగా మామిడి పళ్ళు తిన్నావు. అంతటితో ఆగకుండా చెన్నయ్య ఇంట్లో పులిసిన అంబలి జుర్రి, చిరుతొండనంబి కొడుకు మాంసం అడిగి మరీ తిన్నావు. నిమ్మవ్వ దగ్గర భుజించి, చోడవ్వ గిన్నెతో ఇచ్చిన పులగం తిని, సురియ చౌడయ్య చేతి ముద్దలకు ఆశపడ్డావు. నిన్న ఈ విషయాలన్నీ ఒకామె నాకు చెప్పింది. కుమారా ? నన్ను ఇంతగా ఎందుకు బాధిస్తావు ? నీవు ఆకలికి మలమల మాడుతూ అందరి దగ్గర తిరగడమెందుకు ? అనవసరమైన తిళ్లు తినడం ఎందుకు ? నేను ఎలా బ్రతుకుతాను ? ఇలా చెడ్డ తిళ్లు తింటుంటే కడుపు ఉబ్బకుండా ఎలా ఉంటుంది" ?

"నేను నీకు చాలాసార్లు పాలు తాగిస్తున్నాను. వెన్న పెడుతున్నాను. వేళకు లేకపోతే ఎక్కడైనా అడిగి తెస్తున్నాను. నీవు ఇతరుల ఇళ్లకు వెళ్లి అడిగి తినడం ఎందుకు ? ఇన్ని రోజులు ఏ విధంగా సరిపోయింది ? నిన్న నీ కడుపు ఎందుకు నిండలేదు ? పగలైనా, రాత్రిపూట అయినా నీవు చంక దిగడం లేదు. నీలాటి మంకుపిల్లలుంటారా ? నాలాంటి తల్లులు ముల్లోకాల్లో ఉంటారా ? నీవు నా ప్రాణానివి. దానికి నీవే సాక్షివి. ఎలాగైనా, నేను చెప్పినట్లు ఉండి, పెట్టినంత తిని ఉంటే నీకు ఈ నొప్పి, రోగం ఎందుకు వస్తాయి ? నిప్పుకు చెదలంటుతాయా ? ఈ రోగం నీకు నీవే తెచ్చుకున్నావు. లేకపోతే ఈ ఆపద నీకెలా వస్తుంది ? మాటలతో రోగాలు తగ్గుతాయా ? నా పిచ్చిగానీ, ఇవ్వన్నీ నిన్ను అడగడమెందుకు ? ఈ బాధ నేనింక చూడలేను. నీకోసం నేను ప్రాణాలు విడుస్తాను" అని

బెజ్జ మహాదేవి తన శిరస్సును పగులకొట్టుకోబోయింది. అపుడు శివుడు ప్రత్యక్షమై 'నీకు కావలిసిన వరం కోరుకోమంటాడు. ఆమె 'కుమారా ! నాకు ఏమీ లోటు లేదు. నీవు ఏ రోగం లేకుండా శాశ్వతంగా సుఖంగా ఉంటే నాకంతే చాలు. కన్న ప్రేమ కన్న పెంచిన ప్రేమ ఎక్కువంటారు. నిన్ను కళ్లారా చూస్తూ ఇక్కడ ఉండడమే నాకోరిక' - అంటుంది. అపుడీశ్వరుడు చిరునవ్వు నవ్వి తల్లిని కౌగిట చేర్చి ఇలా అంటాడు. 'నీవు నాకు తల్లివిగాబట్టి మూడులోకాలకు నీవే ముత్తవ్వవు. నీలాంటి తల్లి ఉంటే నాకు రోగాలెందుకు వస్తాయి ?' - అని ఆమెకు శాశ్వతమైన ముక్తిని ప్రసాదించాడు. ఆమె 'అమ్మ' యై శివుణ్ణి సేవించింది గాబట్టి ఆమెకు 'అమ్మవ్వ' - అన్న పేరు వచ్చింది.

మొదటి భాగము - ప్రాచీన పద్యభాగము

పాల్కురికి సోమన

# బెజ్జ మహా దేవి కథ

## పాఠం - 7


1. 7. 1 సందర్భ సహిత వ్యాఖ్యలు

1. 7. 1. 1 బెజ్జమహాదేవి కథ

1. 7. 2 పాల్కురికి సోమన కవితారీతులు

1. 7. 3 ప్రశ్నలు - సమాధానాలు

1. 7. 3. 1 బెజ్జ మహాదేవి కథ

1. 7. 4 రాదగిన ప్రశ్నలు

1. 7. 5 ఆచూకీ గ్రంథాలు


### 1. 7. 1 సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. 7. 1. 1 బెజ్జ మహాదేవి కథ :

**1. 'తల్లి లేకుండుట దావిచిత్రంబు' !**

**పరిచయం :** ఈ వాక్యం సుప్రసిద్ధ కవి పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసం నుంచి స్వీకరింపబడిన 'బెజ్జమహాదేవి' అనే పాఠ్య భాగంలోనిది.

**సందర్భం :** బెజ్జ మహాదేవి శివభక్తురాలు. ఆమె, శివునకు బంధువులు, సేవకులు, అందరున్నప్పటికీ తల్లిలేదని బాధపడే సందర్భంలోనిదీవాక్యం.

**వివరణ :** బెజ్జమహాదేవి శివభక్తురాలేగానీ, పండితురాలు కాదు. కేవలం ఆమెది ముగ్ధభక్తి. అందుకనే సర్వాంతర్యామియైన ఈశ్వరుని, సాధారణ మానవమాత్రునిగా భావిస్తున్నది. 'లోకంలో అందరికీ తల్లి ఉందికదా ! శివునకు తల్లిలేక పోవడం చాలా విచిత్రంగా ఉంది' ! - అనేది ఆమె ఆలోచన ! అమాయక స్త్రీ ప్రకృతికి గాఢమైన భక్తికీ ఇది నిదర్శనం.

**2. 'ఎల్ల వారికి దుఃఖమిట్టిద కాదె ?' -**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి గ్రహించబడింది.

**సందర్భం :** అఖిల లోకాధిపతియైన ఈశ్వరునకు తల్లి మరణించి ఉంటుందని అమాయకురాలైన బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'శివునకు బంధువులందరూ ఉన్నారు. తల్లి మాత్రం లేదు. అయినా తల్లి లేకుండా తానెట్లా ఉద్భవిస్తాడు ? కాబట్టి, శివునకు తల్లి మరణించి ఉంటుంది. తల్లి మరణం తననెంతో క్రుంగదీసింది. మాతృవియోగ దుఃఖం అందరికీ ఒక్కటే గదా !' అని ఆమె భావిస్తున్నది. తనలాగే అందరూ అని భావించే మనస్తత్వం ఆమెది !

### 3. 'తల్లి పుచ్చునె సుతు వల్ల కాటికిని' ?

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'బెజ్జ మహాదేవి కథ' నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** 'లోకంలో ఏ తల్లి అయినా కుమారుణ్ణి వల్ల కాటికి పంపిస్తుందా' ? - అని బెజ్జమహాదేవి ఆలోచించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** శివునకు తల్లిలేదని అమాయకురాలైన బెజ్జమహాదేవి భావించింది. తానుకూడా తల్లి మరణించినప్పటి దుఃఖాన్ని అనుభవించింది. అందరికీ అంతేగద ! శివునకు తల్లి ఉన్నట్లైతే తల జడలు గట్టనిస్తుందా ? విషం తాగడానికి ఒప్పుకుంటుందా ? తోలు చీరలు కట్టుకోవడానికి ఒప్పుకునేదా ? పాములు ధరించడానికి, బూది పూసుకోవడానికి, తిరిపెమెత్తడానికి తల్లి అనుమతిస్తుందా ? ఏ తల్లైనా, తన కుమారుణ్ణి శ్మశానంలో నివాసముండడానికి అంగీకరిస్తుందా ? - అని ఎన్నో ప్రశ్నలు ఆమె మనసులో ఉదయించాయి ! ఇక్కడ ఆమె మాతృ హృదయం చక్కగా ఆవిష్కరింపబడింది. ఇది ఆమె గాఢమైన ముగ్ధభక్తికి ఉదాహరణ.

### 4. 'తానెంత పెరుగునో తల్లి గల్గినను ?' -

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :** బెజ్జ మహాదేవి ఈశ్వరునకు తల్లి లేదని భావిస్తున్నది. తల్లి గనకఉంటే ఇంకెంతగా శివుడు పెరిగి వృద్ధిలోకి వచ్చేవాడో గదా ! అని భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** తల్లిలేకుండా శివుడు అనేక కష్టాలు పడుతున్నాడు. తల్లి ఉన్నట్లయితే తనస్తన్యాన్నిచ్చి, వెన్నపెట్టి, ఆకలైతే పాలుపట్టి చక్కగా పెంచి ఉండేది. తల్లి లేకుండానే, ఇంతవాడయ్యాడు. తల్లి ఉంటే ఇంకెంతగా పెరిగేవాడో కదా ! అని ఆమె భావన. ఇది ఆమె మాతృహృదయాన్ని అద్దం పట్టి చూపిస్తుంది.

### 5. 'వగవరే మఱి యెట్టి మగ బిడ్డలైన ?' -

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణంలోని తృతీయాశ్వాసం నుంచి గ్రహింపబడిన 'బెజ్జ మహాదేవి కథ' - అనే పాఠ్యభాగం లోనిది.

**సందర్భం :** 'తల్లి లేని మగపిల్లలు కూడా ఏ అచ్చటా ముచ్చటా నోచుకోరు. ఎంత మగపిల్లలైనా బాధపడతారు గదా !' - అని బెజ్జమహాదేవి భావించే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ:** వివాహం మొదలైన వేడుకల్లోను, పేరంటాలలోను, పండుగదినాల్లోనూ, జాతరలప్పుడు గూడ, ముద్దుమురిపాలు తీర్చి సంతోషించే తల్లి లేకపోతే ఎంత మగబిడ్డలైనా దుఃఖ పడతారు. ఇక్కడ శివునికి తల్లిలేదు. ఈ బాధే అతని మనస్సులో కూడా ఉంటుంది - అని, తన మనస్సులోని తపనే, శివుని తపనగా భావించింది బెజ్జమహాదేవి.

### 6. 'కాటుక యిడు మూడు(గన్నుల గలయ' -

**పరిచయం :** పాల్కురికి సోమన రచించిన బసవపురాణం తృతీయాశ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - నుంచి ఈ వాక్యం స్వీకరింపబడింది.

**సందర్భం :** తల్లిలేని ఈశ్వరునకు, తననే తల్లిగా భావించుకుంది బెజ్జమహాదేవి. శివునకు బాల్యోపచారాలన్నీ చేస్తుంది. ఆ సందర్భంలో కవి పల్కిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** బెజ్జమహాదేవి శివునికి స్నానం చేయించి, విభూతి పెట్టి కాటుక పెడుతుంది. కాటుక పెడితే పిల్లల కళ్లు విశాలంగా ఉంటాయని తల్లి భావన. శివుని మూడునేత్రాలకు ఆమె కాటుక పెట్టింది. ఇక్కడ సోమన, తెలుగు తల్లుల పసిపిల్లలను పెంచే పద్ధతులు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు అన్నింటినీ సహజసుందరంగా వర్ణించాడు.

**7. 'భక్తుడె బ్భంగిగా భావించు శివుడు**

**వ్యక్తిగాఁ దద్రూపుడై యుండటరుదె' !**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయా శ్వాసంలోని 'బెజ్జ మహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** బెజ్జమహాదేవి శివునికి బాల్యోపచారాలన్నీ చేస్తూ ఉంటుంది. ఆమె నిశ్చల ముగ్ధభావాన్ని మెచ్చుకొని ఈశ్వరుడు వాటినన్నింటినీ అంగీకరిస్తాడు. సోమన, ఈ సందర్భంలో శ్రుతి, స్మృతి వాక్యాలను ఉదాహరిస్తాడు. 'ఏక ఏవహి రూపేణ' - 'సాధక స్సంస్మరేత్ సదా' -, 'తస్య తన్మయతాంయాతి' - అన్న భగవద్వాక్యాలను ఒక్కచోట చేర్చి, 'భక్తుల భావన ననుసరించే, భగవంతుడు ఆ రూపాన్ని ధరించి ఉంటాడ' ని భక్తబృందం నుతిస్తున్నట్టుగా కవిచెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** భక్తులు భావన ననుసరించే, భగవంతుని రూపం సాక్షాత్కరిస్తుంది. సోమన ఈ సందర్భంలో శ్రుతి, స్మృతుల వాక్యాలను ఉదాహరించాడు. దేశీయమైన ద్విపదచ్ఛందస్సులో సోమన రచించినా, వివిధ సందర్భాలలో ఆయనకు గల పాండిత్య ప్రకర్ష దర్శనమిస్తుంటుంది. సోమన పండిత కవి. ప్రజలకు తన భావన అర్థం కావాలనే భావంతో దేశయమైన రీతిలో ఈ బసవపురాణం రచించాడు.

**8. 'నీ చెమటయుఁజూచి నెత్తురునవుదు' !**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని బెజ్జమహాదేవి కథలోనిది.

**సందర్భం:** ఈశ్వరుడు బెజ్జమహాదేవి చేసే శైశవోపచారాలను అంగీకరించి స్వీకరిస్తాడు. కొన్నాళ్లకు ఆమె ముగ్ధభక్తిని పరీక్షింపదలచాడు. ఆ బాలునికి వింత వ్యాధి వచ్చి, పాలుత్రాగక నోరు కూడా తెరవడం మానేశాడు. అప్పుడు ఆమె బాధపడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'నీ బాధ చూచి నేను నెత్తురు ముద్దనౌతాను.' - అని ఆమె పలకరిస్తుంది. సాధారణంగా లోకంలో తల్లులు, తమ బిడ్డలకు ఏ వ్యాధి సోకినా ఎంతో తల్లడిల్లి పోతారు. ఇక్కడ ఈమె సాక్షాత్తూ పరమేశ్వరుణ్ణి తన బిడ్డగా భావించిన గొప్పతల్లి. ఆమె మాతృప్రేమకు సాటి మరేదీలేదు. ఎంతో గాఢమైన మమకారంతో ఆమె పైవిధంగా భావించింది. ఆమె తల్లి మనస్సును ఆవిష్కరించడానికి సమతూకంగా, వాడిన సోమన ప్రయోగం యిది. ఇది సోమన రచనా విధానానికి, శైలీ వైశిష్ట్యానికి మచ్చుతునక.

**9. 'చేయి దిగండిట్టి సితగుండు గలఁడె' ?**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని 'బెజ్జమహాదేవి కథ' - అనే పాఠ్యభాగం నుంచి స్వీకరింపబడింది.

**సందర్భం :** శివుడు బెజ్జమహాదేవిని కరుణింపదలచి, చిన్న పరీక్ష పెట్టాడు. తన కుమారునిగా భావిస్తున్న ఆ ప్రతిరూపంగల బాలునికి ముల్లు వ్యాధి వచ్చింది. ఆమె తల్లడిల్లింది. అందరి యిళ్లకూ వెళ్లి అన్ని తింటున్నావని మందలిస్తుంది. నిష్ఠూరాలు పలికింది. ఇంతకుముందు ఇలా లేడని, రేయి పగలూ కూడా దిగకుండా ఉండేవాడని పలికే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** మంకుపట్టు పట్టే పిల్లలతో సాధారణంగా తల్లులు మాట్లాడేమాటలివి. రాత్రిపగలు చంక దిగని మంకు పిల్లాడు వీడని బెజ్జమహాదేవి కూడా భావిస్తుంది. 'సితగుండు' అంటే మంకు బిడ్డడని అర్థం. వైరిసమాసాలు చెయ్యడం శివకవుల రచనలోని ప్రత్యేకత. 'సిత' - అంటే 'తెల్లని' అని 'గుండు' అంటే వర్తులాకారంలో ఉండే శివస్వరూపమని చెప్పవచ్చు. ఈశ్వరుడు తెల్లనివాడు. 'కర్పూర కాంతి ధవళం'తో శోభించేవాడు. స్థాణు స్వరూపుడు ఆదిమధ్యాంతాలు లేనివాడు. వీటినన్నింటినీ స్ఫురింప చేస్తూ సోమన 'సితగుండు' - అని ప్రయోగం చేశాడు.

**10. 'నిప్పునఁ జెదలంటునే' ?**

**పరిచయం :** ఈ వాక్యం పాల్కురికి సోమన రచించిన బసవపురాణం, తృతీయాశ్వాసంలోని బెజ్జ మహాదేవి కథలోనిది.

**సందర్భం :** అంగిట ముల్లు వ్యాధితో బాధపడుతున్న శివుని తన కుమారునిగా భావించి, బెజ్జమహాదేవి మాట్లాడే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :** 'నిప్పుకు చెదలంటునే' అనీ ప్రజల వ్యవహారంలో ఉన్న నానుడి. తాను నిప్పులాగా పవిత్రంగా ఉంటే ఎటువంటి చీడపీడలు, ఆధివ్యాధులు రావని దీని భావం. ఇక్కడ శివుడు అంగిటముల్లు వ్యాధి తనకుతానుగా తెచ్చుకున్నాడనీ, తాను పెట్టినంత తిని యింటిపట్టున ఉంటే, ఇటువంటి జబ్బు వచ్చేదికాదనీ, ఆమె బాధపడుతుంది. ఇక్కడ కవి చక్కని పోలిక చెప్పాడు.

### 1.7. 2 పాల్కురికి సోమన కవితారీతులు :

" ఉరుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుతెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుట
కూర్చెద ద్విపదలు కోర్కిదైవార" - (బసవపురాణం)

"ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగ సర్వ సామాన్యంబుగామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు' - (పండితారాధ్యచరిత్ర) -

అని సోమన కవితా హృదయాన్ని, దృక్పథాన్ని విప్పిచెప్పాడు. సోమన కేవలం కవి మాత్రమే కాదు. వీరశైవ మతవ్యాప్తికి తన కవిత్వాన్ని సాధనంగా చేసుకొన్న మహామేధావి. ఆనాడు సమాజంలో వ్యాపించి ఉన్న బౌద్ధ, జైన వైష్ణవాది మతాలనన్నింటినీ ప్రతిఘటించి, తన అసమాన పాండిత్యంతో వీరశైవమత వ్యాప్తికి కారకుడైనాడు. సంస్కృతంలో చతుర్వేదసారం, సోమనాథ భాష్యం మొదలైన గ్రంథాలలో తన పాండిత్యాన్ని నిరూపించుకున్నాడు. కాని, అది శైవమతవ్యాప్తికి దోహదపడదు. జనసామాన్యంలో తన సిద్ధాంతాలు వ్యాపితం కావాలంటే దేశభాషలో, దేశీయ ఛందస్సులో, దేశీయరీతిలో కవిత్వం చెప్పాలి. అప్పుడది ప్రజలమధ్యకు వెళ్లగలుగుతుంది. తన అభీప్సితం నెరవేరుతుంది. ఈ రహస్యం బాగా తెలిసినవాడు పాల్కురికి సోమన. అందుకనే దేశీయమైన ఛందస్సు ద్విపదను స్వీకరించాడు. జాను తెనుగును ప్రతిపాదించాడు.

**జాను తెను(గు :** సోమనాథునికి పూర్వమందు 'ఆరూఢ గద్యపద్య ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠ రచన'. అది 'సర్వ సామాన్యము' కాదు. అది కొద్దిమంది విద్వత్కవులకు, పండితులకు మాత్రమే పనికి వచ్చేది. కాని కవిత్వ లక్షణమది కాదు. దీనికి 'జాను తెను(గు'ను స్వీకరించాడు. ఇది సర్వజనసుబోధకమైన తెనుగు. 'చదునైన తెలుగు', 'జాను' అంటే 'చదును' శబ్దానికి రూపాంతరమని, ఇది 'చతుర' శబ్దభవమని డా॥ చిలుకూరి నారాయణరావు గారి అభిప్రాయం. దీనికే 'తేటతెను(గు', 'తిన్ననిసూక్తి' అని కూడా

సోమనాథుడు పేర్కొన్నాడు. దీనికే కర్ణాటలాక్షణికులు' సమసంస్కృతోక్తి' - అని అన్నారు. అది నిఘంటు, వ్యాకరణాల ద్వారా బోధపడేదికాకుండా, మరీ అచ్చతెనుగు పదాలు కాకుండా, లోక వ్యవహారసిద్ధమైన సంస్కృత ఆంధ్రపదాలతో కూడింది. వీటిని కేవలం తెలుగు పదాలని నాటి పండితలోకం నిరసిస్తుందేమోనని, 'వేదముల కొలదియ కాఁజూడుడ'ని చెప్పాడు. స్థూలంగా సర్వజనామోద యోగ్యమైందే జానుతెనుగు.

**ద్విపద ఛ్చందస్సు ప్రాధాన్యం :** సంస్కృతంలో 'అనుష్టుప్' ఎలాగో, కన్నడిగులకు త్రిపద ఎట్లో, తెలుగువారికి ద్విపద అటువంటిది. ఇది వీరి జీవితాలతో అల్లుకునిపోయింది. నాటి నుంచి నేటివరకు పల్లెపాటల్లో, పడవపాటల్లో, దంపుడు పాటల్లో, జోలపాటల్లో, పెండ్లిపాటల్లో, ఒకటేమిటి ? అన్ని విషయాలతో పెనవేసుకుపోయింది. నవ్వు, కోపం, దుఃఖం, ఉత్సాహం మొదలైన భావోద్వేగాలు కనబడిన చోటల్లా ద్విపద సాగుతూనే ఉంది. ఇటువంటి ఛందస్సును గ్రంథస్థం చేసి, వ్యాప్తిలోకి తెచ్చిన వాడు మొదటగా పాల్కురికి సోమనాథుడు మాత్రమే. మూడింద్ర గణాల మీద ఒక సూర్యగణం చేరిస్తే ఒక పాదమౌతుంది. పాదంలో మూడవ గణాద్యక్షరం యతి. రెండుపాదాలను ప్రాసాక్షరం కలుపుతుంది. సోమనాథుని తర్వాత ద్విపద వాఙ్మయమమితంగా వెలిసింది.

**సోమన కవితా లక్షణాలు :** కథావస్తువులో కొత్తదనాన్ని తీసుకొని వచ్చాడు. వీరశైవ సిద్ధాంతాన్ని ప్రత్యేకంగా చెప్పకుండా, కథలో మేళవించి చెప్పడం సోమన ప్రత్యేకత. బసవపురాణంలో బసవేశ్వరుని చరిత్రతో పాటుగా, ఎంతోమంది శివభక్తుల గాథలను కలిపి, నాటి సాంఘిక జీవన చిత్రంగా కావ్యాన్ని మలిచాడు.

వేద వేదాంగాలు శ్రుతి, స్మృతులనుంచి వాక్యాలను ఉదాహరించినా, వాటిని తన కవితాధారలో సందర్భ శుద్ధితో లయం చెయ్యడం సోమనకు చెల్లింది. బెజ్జమహాదేవి కథలో 'ఏక ఏవహిరూపేణ' - 'సాధక స్సంస్మరేత్సదా' - 'తస్య తన్మయతాంయాతి' - అనే వాక్యాలిందుకు ఉదాహరణలు. భగవంతుని స్వరూపాన్ని, తత్వాన్ని చక్కగా వివరించే వాక్యాలివి. సాధకుణ్ణి అనుసరించే భగవంతుడుంటాడు. 'యద్భావం తద్భవతి' - అని ఆర్యులన్నట్టుగా, భక్తుడే విధంగా భావిస్తే భగవంతుడా విధంగా అనుగ్రహిస్తాడు. 'యే యథామా ప్రపద్యంతే తాంస్త థైవ భజామ్యహమ్' - అన్న గీతా వాక్యానికి కూడా అర్థమిదే.

అపరిమితమైన వైదుష్యం, వ్యవహార జ్ఞానం గలవాడు సోమన. బసవపురాణం, పండితారాధ్య చరిత్రల్లో ఇవి ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. హఠయోగం, రసయోగం, ద్యూత విద్య, పిల్లలను పెంచే విధం, పిల్లలను తల్లులు లాలించేవిధం, పసిపిల్లల మనస్తత్వం, స్త్రీల హృదయావిష్కరణ మొదలైన వెన్నంటినో తన సునిశిత దృష్టితో పరిశీలించి రచించాడు. బెజ్జమహాదేవి ఈశ్వరుణ్ణి తనపిల్ల వానిగా భావించి లాలించడం, పిల్లవాడు అంగిటముల్లుతో బాధపడుతుంటే తల్లడిల్లడం మొదలైన విషయాలు స్త్రీ సహజ లక్షణాలను, పిల్లలపట్ల ఉండే అవ్యాజమైన మమకారాన్ని సూచిస్తాయి. అలాగే గొడగూచి కథలో గూడ శివుడు పాలుతాగకపోతే గొడగూచి అనేక ప్రశ్నలు వెయ్యడం చివరకు, శివుడు తననింతగా ఏడిపించాడని - ఆ విషయం తన అన్నకు చెప్పివస్తాననడం, మొదలైన సన్నివేశాల్లో పసిపిల్లల మనస్తత్వాన్ని చక్కగా చిత్రీకరించాడు. దీనికి ఎంతో నిశితపరిశీలన, అనుభవ పూర్వకంగా ఉంటేగానీ, ఇది సాధ్యం కాదు.

ఆమ్రేడితాలు, పునరుక్తులతో సన్నివేశానికి అందం తేవడం ఒక ప్రత్యేకత. బెజ్జమహాదేవి కథలో 'తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు? -- తల్లి పుచ్చునె సుతువల్ల కాటికి' -- అన్నపుడు తల్లి వాత్సల్యాన్ని, శివతత్వాన్ని చక్కగా వర్ణించాడు. 'తల్లి' - అన్న పదం పలుమార్లు ఉపయోగించినప్పటికీ, అది పునరుక్తిగా పాఠకులకు తోచదు.

సోమనశైలి సమాసాలు కూడా ప్రయోగించాడు. 'సితగుండు', 'జగదభినుత కరడిగ' - ఇత్యాదులుదాహనరణాలు. ప్రజలమధ్య ఉండే పలుకుబళ్ళు, సామెతలు, 'నేలపై నా కాళ్లు నిలువవురన్న, నిప్పున చెదలంటునే', 'కన్నమోహంబున కంటె నగ్గముల ఎన్న పెంచిన మోహమెందు' - మొదలైనవి నేటికి తెలుగువారికి అలవాటే. అచ్చతెలుగు మాటల్లో సోమనాథుడుపయోగించినన్ని పదాలు మరే ఇతర కవి ఉపయోగించలేదు.

ఈవిధంగా దేశీయకవితా ప్రవర్తకుడుగా, వస్తువు, ఛందస్సు, భాష అనే మూడింటి ద్వారా అనన్య సామాన్యమైన ప్రతిభా పాండిత్యాలతో వీరశైవ మతవ్యాప్తికి తన రచనల ద్వారా దోహదం చేసి, ప్రజల వద్దకు కవిత్వాన్ని తీసుకువెళ్లిన కవి పాల్కురికి సోమన అనడంలో అతిశయోక్తిలేదు.

### 1.7.3 ప్రశ్నలు - సమాధానాలు :

1. బెజ్జ మహాదేవి మాతృ వాత్సల్యాన్ని వివరించండి :
లేదా
**బెజ్జ మహాదేవి తల్లిగా ఈశ్వరునికి చేసిన బాల్యోపచారాలు వివరించండి :**

సమాధానం : పాల్కురికి సోమన బసవపురాణంలో బెజ్జమహాదేవి కథ ఎంతో మనోజ్ఞంగా రచించబడింది. ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథలనే స్వీకరించానని సోమనాథుడు వివరించాడు. ఈ కథలు భక్తి ప్రధానం కానీ, లింగం, కులం, వర్ణం, జాతి ప్రధానంకావని ప్రబోధిస్తాయి. మార్గ సాహిత్యానికి విరుద్ధంగా, పురుషులతో సమానంగా స్త్రీలు కూడా మోక్షార్హులేనని, స్త్రీలు పతిభక్తితో కాకుండా, పరమేశ్వర భక్తితో మోక్షం పొందవచ్చుననీ ఈ కథలు స్పష్టం చేస్తాయి. అది మూఢ భక్తి కావచ్చు. ముగ్ధ భక్తి కావచ్చు. వాత్సల్యభక్తి కావచ్చు. దేన్ని అనుసరించినా వారికి కైవల్యం సిద్ధిస్తుంది. దీనికి సంప్రదాయాలు, నియమాలు ఏమీలేవు.

సహజంగా స్త్రీ ప్రేమమూర్తి. జాలి, కరుణ ఆమె స్వభావాలు. స్త్రీ సహజమైన ఈ లక్షణాలతోనే బెజ్జమహాదేవి శివుని పుత్రవాత్సల్యంతో పెంచుతుంది. మమకారం పంచుతుంది. తల్లిలేని బిడ్డడని జాలి పడుతోంది. అందరిళ్లకూ వెళ్లి అతిగా తిన్నావని కోప్పడుతుంది. బిడ్డడికి వచ్చిన రోగాన్ని నయం చేయలేక, చివరకు ఆత్మార్పణకు సిద్ధమౌతుంది. ఇలా ఈ కథలో బెజ్జమహాదేవి తన శక్తియుక్తులన్నింటినీ, త్రికరణ శుద్ధిగా శివుని మీదే కేంద్రీకరిస్తుంది. ఈ విషయాలలో ఆమె మాతృహృదయం ఎలా ఆవిష్కృతమైందో పరిశీలిద్దాము.

బెజ్జమహాదేవి గొప్ప శివభక్తురాలు. ఆమె మనస్సుకు ఒకనాడొక ఆలోచన వచ్చింది. 'శివునకు బంధువులందరూ ఉన్నారు కానీ, తల్లిమాత్రం లేదు. తల్లి లేకుండా బిడ్డడుదయించడు కాబట్టి, శివుని తల్లి మరణించి ఉంటుంది. లేకపోతే శివుని తపస్సుచేయడానికి అంగీకరించేదా? సంస్కారం లేకుండా జుట్టును జడలు గట్టనిచ్చేదా ? విషాన్ని తిననిచ్చేదా ? తోలు వస్త్రాలను, పాములను ధరింపనిచ్చేదా ? వల్లకాటిలో ఉండనిచ్చేదా ? మాతృవియోగ దుఃఖం తనకు తెలుసు . అందుకనే శివుడు ఇన్ని కష్టాలుపడుతున్నాడు. ఎంతటి మగబిడ్డలైనప్పటికీ తల్లి లేని దుఃఖం వారనుభవించరా?' - అని భావించింది. ఆమె అమాయకురాలు. కల్మషంలేని హృదయం ఆమెది. అఖిల లోకాధీశుడు, సర్వాంతర్యామి, అభవుడైన ఈశ్వరునికి తల్లిలేదని భావించడం ఆమె ముగ్ధత్వానికి నిదర్శనం. సర్వజ్ఞుడైన శివుని సామాన్య బాలకునిగా భావించింది. సమస్త వ్యాపకునికి తానే తల్లిగా ఉందామనుకోవడం ఆమె జాలిగుండెను ప్రతిఫలిస్తుంది.

సమస్త భువనాధీశుణ్ణి తన బిడ్డగా భావించడం, బాల్యోపచారాలన్నీ చెయ్యడం ఆమెకే చెల్లింది. స్నానం చేయించి, వెన్నపెట్టి, పాలుత్రాగించి, కాటుకపెట్టి, దిష్టితీసేది. ఉగ్గుపెట్టి బుజ్జగించేది. లాలించేది. ఆమె నిర్మలభక్తిని ఈశ్వరుడంగీకరించాడు. పరమేశ్వరుడు భక్తసులభుడు. అందునా కలియుగంలో భక్తినిమించిన పరమార్థం లేదు. అందుకని భక్తుడే విధంగా భావిస్తే భగవంతుడా విధంగా దర్శనమిస్తాడని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. సమస్త భువనాధీశుణ్ణి బిడ్డగా భావించింది కాబట్టి, ఆమెను బిడ్డగానే పరమాత్మ కరుణించాడు. ఆమె చేసే శైశవోపచారాలన్నింటినీ స్వీకరించాడు.

అయితే ఈమె మాతృహృదయాన్ని పరీక్షించి, ప్రసన్నుడు కాదలిచాడు పరమేశ్వరుడు. అందుకే చిన్న పరీక్ష పెట్టాడు. తాను బిడ్డడుగా భావించే శివునికి గొంతునొప్పి వచ్చింది. అంగిటి ముల్లు వ్యాధి సోకింది. పాలుత్రాగడానికి నోరు తెరవలేదు. ఇక ఆ తల్లి ఎంతో బాధపడింది. ఆమెకు మందులు మాకులు తెలియవు. దుఃఖించింది. నేలమీదబడి పొరలింది. సన్నటి వస్త్రాన్ని తెచ్చి మాటిమాటికీ కప్పింది. శోకజలధిలో మునిగిపోయింది. మానసికంగా, భౌతికంగా ఆమెపడే బాధను, వేదనను ఎంతో చక్కగా చూపించాడు సోమనాథుడు. అమాయకురాలైన ఒక జానపదాంగన ఎటువంటి భావాలు వ్యక్తం చేస్తుందో, ఇక్కడ బెజ్జమహాదేవి కూడా అలాగే ప్రవర్తించింది. ఆమె పుత్ర వాత్సల్యం ఎల్లలు దాటింది. తల్లి మనస్సు చక్కగా ఆవిష్కృతమైంది.

ఇరుగుపొరుగులతో సంభాషించింది. విషయ సేకరణ చేసింది. తనయింట్లో, తన చంకదిగని బిడ్డడు తనకు తెలియకుండా ఎన్నో పైతిండ్లు తిన్నాడు. పిట్టవ్వ దగ్గర, సామవేదుల వారింట్లోను, కరికాళవ్వ యింట్లోను, చిఱుతొండనంబి వద్ద -- ఇలా ఎందరి దగ్గరికో వెళ్లి తన బిడ్డ తినగూడని తిండి తిన్నాడని బాధపడింది. పరాయి ఇళ్లకు ఎందుకువెళ్లావని ప్రశ్నించింది. నాలాగా ప్రేమతో

పెంచే తల్లులు ఈముల్లోకాలలో ఉంటారా ? అని అడిగింది. పెట్టినంత తిని, ఇంటి పట్టున ఉంటే ఈరోగమెందుకు వచ్చేదని నిష్ఠూరాలాడింది. ఇంక బిడ్డ బాధచూడలేక ప్రాణాలు విడుస్తానన్నది.

ఇలా మాటల కందని ఆర్ద్రతను, ప్రేమను చూపించింది ఆమె. ఆ ప్రేమ మూలంగా, తుదకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడింది. ఇంతకంటె ఆమె నిశ్చలమైన వాత్సల్య భక్తికి తార్కాణం ఇంకేముంటుంది ? అందుకే శివుడామెకు ప్రసన్నుడై వరం కోరుకోమంటే కైవల్యాన్ని, మోక్షాన్ని కోరకుండా "నీవు ఏరోగం లేకుండా, శాశ్వతంగా సుఖంగా ఉంటే చాలు. నిన్ను కన్నులారా చూడడమే నాకోరిక' - అని పల్కింది.

లోకంలో ఏ తల్లైనా బిడ్డను సుఖం కంటే మరేదీ కోరుకోదు. ఇక్కడ ఈమె అవ్యాజమైన ప్రేమ, మమకారం, వాత్సల్యం, ఇవన్నీ మనకు గోచరిస్తున్నాయి. 'తస్యతన్మయతాం యాతి' - అన్నట్లుగానే, అలౌకికమైన మాతృహృదయంతో 'అమ్మవ్వ'గా నిలిచి, పరమేశ్వరునికే తల్లి స్థానాన్ని పొందగలిగింది బెజ్జమహాదేవి. ఈ విధంగా, చిత్తశుద్ధిలేని అర్చనలు, పూజలకన్నా మూఢభక్తి ముగ్ధభక్తికే ప్రాధాన్యం ఇచ్చాడు సోమన.

పాఠం - 5

# కీచక వధ - తిక్కన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - విరాటపర్వం - ద్వితీయాశ్వాసం
## (22 నుండి 361వ పద్యం వరకు)

# 5.1 కవికాలాదులు

**5.1 కవి కాలాదులు**

**5.2 పాఠ్యభాగ సారాంశం**

తిక్కన క్రీ.శ. 13వ శతాబ్దంలో జీవించిన మహాకవి. క్రీ.శ. 1205-1288 సం॥ల మధ్య జీవించి యుండవచ్చునని ఒక ఊహ. తిక్కనగారి తాతపేరు మంత్రి భాస్కరుడు. గుంటూరు విభుడు. సారకవితాభిరాముడు. తండ్రిపేరు కొమ్మన. దండనాథుడు. తల్లి అన్నమ్మ. కాకతీయ చక్రవర్తి గణపతిదేవునికి సామంతుడైన మనుమసిద్ధి ఆస్థానకవి తిక్కన. మనుమసిద్ధి నెల్లూరు పాలకుడు. దాయాదుల మోసానికి గురియై, సింహాసనాన్ని కోల్పోగా, తిక్కన శిష్య సమేతంగా ఓరుగల్లుకుపోయి, ఆస్థానంలోనున్న జైన, బౌద్ధుల్ని వాదంలో ఓడించి, అద్వైతాన్ని స్థాపించాడు. మహాభారతాన్ని వినిపించి, ప్రశంసలను పొంది, గణపతిదేవుని అపారసైన్యాన్ని అర్థించి, ఆ సైన్యాన్ని నెల్లూరిపైన నడిపించి, చోళరాజ్యాన్ని ఆక్రమించి, మనుమసిద్ధిని సింహాసనంపై పున్ణప్రతిష్ఠించి 'మనుమసిద్ధి రాజ్యస్థాపనాచార్యుడయ్యాడు. మనుమసిద్ధికి మంత్రిగా, కావ్యకర్తగా, కావ్యభర్తగా, సోమయాజిగా, కవి బ్రహ్మగా ఖ్యాతికెక్కాడు.

తిక్కన కాలంలో తెలుగునాట జైనవైష్ణవాలు, శైవవైష్ణవాలు ఘర్షణ పడుతుండేవి. కన్నడ ప్రాంతం నుండి వచ్చిన బసవన వీరశైవం, రామానుజుని విశిష్టాద్వైతం ప్రచురప్రచారంలోనుండగా, ఆ రెండింటి సంఘర్షణను తగ్గించి, హరిహరాద్వైతాన్ని స్థాపించి ఆయుగానికి శాంతిదూతగా నిలిచాడు తిక్కన. ధర్మాద్వైత స్థితిని బోధించి ఆంధ్రమహాభారతాన్ని అనువదించాడు. 13వ శతాబ్దంలో తిక్కన అభినవశంకరులై ఆంధ్రజాతిని ఉద్బోధించాడు.

తిక్కన తాతగారయిన మంత్రిభాస్కరుడు పూర్వ రామాయణం రాస్తే, తిక్కనగారు ఉత్తర రామాయణాన్ని రాశారు. దక్షిణ భారతదేశంలో జరుగుతున్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సాహిత్య మత పరిణామాలన్నిటినీ గమనించటమే కాకుండా, అందులో భాగం పంచుకున్నాడు కూడ. పినతండ్రి కొడుకు ఖడ్గతిక్కన కాటమరాజుయుద్ధంలో మరణిస్తే, తానే స్వయంగా యుద్ధ వ్యవహారాలను చూసుకోవలసి వచ్చింది. మనుమసిద్ధిని మళ్లీ గద్దెపై కూర్చోపెట్టింది తిక్కనే. మంత్రిగా, రాయబారిగా, సేనానిగా, ధర్మవేత్తగా, నీతివేత్తగా, అపారమైన అనుభవాన్ని గడించి, మహాభారతాన్ని అనువదించగల అర్హతను సముపార్జించాడు. పాండవుల అజ్ఞాతవాసం, ద్రుపదపురోహిత, సంజయ, శ్రీకృష్ణరాయబారాలు నిర్వహించేనేర్పు, యుద్ధ పంచకాన్ని రచించగల జీవితానుభవం తిక్కన సాధించుకున్నదే. కేతన వంటి శిష్యుల గ్రంథాలను (దశకుమారచరిత్ర) అంకితం పొందేనేర్పు, శాంతిపంచకాన్ని రచించే మానసిక పరిపక్వత తిక్కన సాధించుకున్న జీవనఫలమే. అతని జీవితానుభవమే భారత రచనలో ప్రతిఫలించింది. అందుకే తిక్కన పరిపూర్ణపురుషుడు.

భారతానువాదాన్ని ప్రారంభించిన నన్నయ ఆదిసభాపర్వాలతో పాటు, ఆరణ్యపర్వంలో సగభాగాన్ని అనువదించాడు. ఆ తరువాత శివకవియుగంలో దేశికవితోద్యమం ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రజల భాషకు పట్టం కట్టాలని, ప్రజలకోసమే సాహిత్యమనే స్పృహను పెంచారు. వారు చెప్పిన నియమాలను పాటిస్తూనే నన్నయరచనా పద్ధతిని తెలుగు సాహిత్యంలో పున్ణకొనసాగించిన సాహిత్య చైతన్యం తిక్కనది. తొలుత తన కావ్యాన్ని నిర్వచనంగా రాసినా, ఆంధ్రావళి మోదాన్ని పొందేటట్లు పద్యగద్యాలు కలగలసిన చంపూ పద్ధతిలోనే భారతాన్ని అనువదించాడు.

తిక్కన రచనా శైలిలో నాటకీయత తొంగిచూస్తుంది. దానికి కారణం జాయపసేనాని నృత్తరత్నాకరం రచించి, తెలుగువారి కళాభినివేశాన్ని చాటిన కాలమది. తెలుగు శబ్దం, నాట్యం స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటున్న కాలం. అందుకే తిక్కన కవిత్వంలో నాటకీయత పుష్కలంగా పండించబడింది. పాత్రలు చతుర్విధ అభినయంతో రాణిస్తుంటాయి.

తిక్కన గారిది రసధ్వనికి ప్రాధాన్యమిచ్చే మార్గం. విరాట పర్వాన్ని నానారసాభ్యుదమోల్లాసియని అన్నాడు. భారతాన్ని 'ప్రబంధ మండలి' – అన్నాడు. ఆయన ఉభయ కావ్యప్రౌఢిని పాటించే శిల్పాచార్యుడు. తెలుగు పదాల శక్తిని తెలిపిన పద్యరచన తిక్కనదే. నన్నయది కథాకథనశైలి. తిక్కనది నాటకీయ శైలి. 13వ శతాబ్దిలో రూపొందిన మహాకవి తిక్కన అయితే, ఆయన మహాకవిత్వ దీక్షావిధి తెలుగు సాహిత్య లక్ష్మీసౌభాగ్యం.

తెలుగు సాహిత్యచరిత్రలో తిక్కనయుగం ఉత్తమోత్తమయుగం. ఉదాత్తప్రక్రియలు, విశిష్టప్రయోగాలు, అపూర్వ కవిత్వరుచి ఆయుగంలో వర్ధిల్లిన లక్షణాలు. ఇక్కడే ఒక విషయాన్ని గమనించాలి. శివకవియుగంలోని పాల్కురికి సోమనాథుడు, కవిబ్రహ్మ తిక్కన ఒకే కాలంలో సూర్యచంద్రులవలే ప్రకాశించిన కాలమది. సోమనతిక్కనలిద్దరూ ఆయుగంలోని గొప్పకవులే కాదు. విరుద్ధలక్ష్యాలతో సాహిత్య చైతన్యాన్ని ప్రోది చేసిన మహాకవులు. వారి దృక్పథాల సంఘర్షణమే ఆ యుగమని చెప్పినా ఆశ్చర్యపడవలసినపనిలేదు. అయితే ఆ యుగానికి గొప్పదనం ఎవరివలన సిద్ధించిందని చెప్పాలంటే, సాహిత్యచరిత్రకారులు అంతా చెప్పేపేరు తిక్కనవారిపేరే. ఎందుకంటే ఆరుద్రగారు చెప్పినట్లు 'తిక్కనగారు చేసిన సాహిత్య సృష్టి ఇంకొకరివల్ల అయ్యేది కాదు.'

**నిర్వచనోత్తర రామాయణం**

తిక్కనను గురించి సమీక్షించే విమర్శకులు, రామాయణం తిక్కన, భారతం తిక్కన అని రెండు భాగాలుగా వివేచన చేస్తుంటారు. నిర్వచనోత్తర రామాయణం తిక్కన పూర్వజీవితానికి, భారతం ఉత్తర జీవితానికి సంబంధించింది. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు 'పూర్వరంగంలో తిక్కన కావ్యరంగంలో ప్రదర్శించిన తీరులు, ఉత్తరార్థంలో తిక్కన ప్రకటించిన తీర్పులు గమనించదగినవి.'

అసలు తిక్కన గారు ఉత్తర రామాయణాన్నే ఎందుకు రాశారు? తన తాత పూర్వ రామాయణం రాయటం కారణంగా దానికి అనుబంధంగా ఉత్తర రామాయణం రచించానని తిక్కన చెప్పుకున్న కారణం. దానిని మామా అని పిలిచే మనుమసిద్ధికి అంకితమిచ్చాడు.

నిర్వచనోత్తరరామాయణంలో పది ఆశ్వాసాలు ఉన్నాయి. మొదటి ఏడాశ్వాసాలకు రావణుడు కథానాయకుడు. చివరి మూడశ్వాసాలకు శ్రీరాముడు కథానాయకుడు. "ఇరువురు కథానాయకుల నాశ్రయించుకొని రెండు కథలతోనున్న ఒక గ్రంథంలో ఒక ఏకవాక్యతగాని, ఒక రసంగాని ఉండదు. నిర్వచనోత్తర రామాయణం మహాకావ్యం కాదు. రెండు లఘు కావ్యాల సంపుటి." (తిక్కన కావ్యశిల్పం, పుటలు 20,21) 'అష్టమాశ్వాసం నుండి దశమాశ్వాసం వరకూ గల మూడేమూడు ఆశ్వాసాలలో తెలిపిన ఒక లఘుకథకు ఉత్తర రామాయణమని పేరు పెట్టటంలో ఔచిత్యం ఏమిటో విచారణ చేయవలసిన అవసరముందని' ఆవంత్ससోమసుందర్ వంటి విమర్శకులు విమర్శించారు.

నిర్వచనోత్తర రామాయణంలో రంభారావణ సంవాదం, వేదవతీవృత్తాంతం వంటివి ప్రాముఖ్యతగల ఘట్టాలు. ఒక ఉదాత్త నాయకుని ఇతివృత్తానికి అనుబంధంగా ప్రతినాయక చరిత్రను కూర్చటం విశేషం. దీనిని ఒక సంయుక్త వాక్య రచనతో పోల్చి జి.వి. సుబ్రహ్మణ్యంగారు విశ్లేషించారు. రామరావణ కథలు రెండూ రెండే. అయినా రెండూ కలిసిఒకే కావ్యం. అయినా యిది సఫలం కాని ప్రయోగమేనని జి.వి.సుబ్రహ్మణ్యంగారు అన్నారు.

నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన తన కావ్యకళాదృక్పథాన్ని పేర్కొన్నాడు.

"అమలోదాత్త మనీషనేనుభయ కావ్యప్రౌఢిబాటించుశి
ల్పమునం బారగుడం, గళావిదుడ...." (నిర్వ.రా. 1-13)

కII "తెలుగు కవిత్వము చెప్పం
దలచిన కవియర్థమునకుదగియుండెడు మా
టలుగొని వళులుంబ్రాసం
బులునిలుపక మొగిని బలిమిపుచ్చుట చదురే" (నిర్వ.రా. 1-7)

ఉII జాత్యముగామి యొప్పయిన సంస్కృతిమెయ్యెదుజొన్ప, వాక్యసాం
గత్యము సేయుచోనయిన గద్యము తోడుగు జెప్పిపెట్ట, దౌ
ర్గత్యము దోసు బ్రాసముప్రకారము వేఱగునక్షరంబులన్
శ్రుత్యనురూపమంచునిడ, సూరులకివ్విధమింపుబెంపదే (నిర్వ.రా. 1-14)

కII లలిత పదహృద్య పద్యం
బులన కథార్థంబు ఘటితపూర్వాపరమై
యలతియలతి తునియలుగా
హాళసంధించిన విధంబు నమరుగ వలయున్ (నిర్వ.రా. 1-16)

తే.గీ. ఎట్టి కవికైను దన కృతియింపుబెంపు
జాలుగావును గావ్యంబు సరసులైన
కవుల చెవులకు నెక్కినుగాని నమ్ము
డెందు బరిణతి గలుగుకవీశ్వరుండు (నిర్వ.రా. 1-9)

ఈ పైన పేర్కొన్న పద్యాలలో

1. ఉభయకావ్యప్రౌఢి
2. అర్థానికి తగిన మాటల్ని స్వీకరించటం, యతిప్రాసల్ని నిక్కచ్చిగా పాటించటం
3. సంస్కృత పదాల్నిగాని, తత్సమాల్నిగాని తెలుగులో ఏ అర్థంలో వాడుతారో, ఆ అర్థంలోనే జాత్యమెరిగి వాడటం.
4. అలతియలతి తునియలు కాహాళసంధించినట్లుగా రచన చేయటం.
5. కావ్యం సరసులైన కవుల చెవులకెక్కేలా రాయటం.
6. ప్రాసల్ని ధ్వనిస్సామ్యంగల వేరే అక్షరాలలో వాడే దుర్గతిని అంగీకరించకపోవటం.

ఇలా నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన తన కావ్యకళాదృక్పథాన్ని పేర్కొన్నాడు.

**మహాభారతం**

తిక్కనకు వయసుపండి, జీవితానుభవం నిండిన తరువాతనే మహాభారత రచనకు పూనుకొన్నాడు. మనుమసిద్ధి మరణానంతరం మంత్రిపదవిని వదలి, యజ్ఞం చేసి సోమయాజియై భారతరచనకు పూనుకున్నాడు. దాదాపు 50 సంIIల వయసులో భారత రచనకు పూనుకొని, దాదాపు మూడు దశాబ్దాలు భారత రచన కొనసాగించి యుండవచ్చునని పరిశోధకుల ఊహ. "లేకపోతే అంతటి జిగి, బిగి, నానారసాభ్యుదయోల్లాసం మరొక వయస్సులో సాధ్యంకాదు. ఉద్యోగ పర్వం ముగిసేనాటికి షష్టిపూర్తి, అయి ఉండవచ్చును. లేకపోతే అంతటి రాజనీతి పరిపక్వత అందులో ప్రతిభలించదు. యుద్ధషట్కం ముగిసేనాటికి

70వ పడిలో పడియుండవచ్చును. శాంతిపర్వం నాటికి అంపశయ్యమీద భీష్మునిలా 75 సం॥ల వాడయి ఉండవచ్చును. పండిన విజ్ఞానఖని శాంతిపర్వ తిక్కన. ఆ తరువాత త్వరత్వరగానే చివరి పర్వాలను ముగించియుండవచ్చును. ఆంధ్రమహాభారతం పూర్తికావాలన్న సంకల్పం, పూర్ణఫలాన్ని పొందిన పూర్ణజీవితం తిక్కన సోమయాజిది." – ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం (తి.తి.దే వారి మహాభారత పీఠిక, పుట.7)

"శ్రీయన గౌరినా బర గు చెల్వకు జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తి యై హరిహరంబగు రూపము దాల్చి "విష్ణు రూ
పాయ నమశ్శివాయ" యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చు మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్. (విరా.1-1)

అని ప్రారంభించి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను ఒక్క చేతితో రచించిన మహాకవిత్వ దీక్ష తిక్కనది. ఆయన జీవితానుభవాలు భారతంలో కనిపిస్తాయి. పాండవ అజ్ఞాతవాసం వెనుక మనుమసిద్ధి అజ్ఞాతవాసపు అనుభవముంది. రాయభార ఘట్టాల వెనుక, ఓరుగల్లులో గణపతిదేవ చక్రవర్తితో చేసిన రాయబారానుభవముంది. తను చేసిన యుద్ధవ్యూహాల అనుభవాలు యుద్ధ పంచకంలోను, యుద్ధానంతర విషాదాలు తాను చూచిన విషాద దృశ్యాల అనుభవాలతో స్త్రీ పర్వాదుల్ని, తాను సముపార్జించుకున్న విజ్ఞానమంతా శాంతి పంచకంలోను, తన వైరాగ్య జీవితం చివరి పర్వాలరచనకు దోహదం చేసి యుండవచ్చునని విమర్శకుల ఊహ. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు "ఈ పంచమ వేదమును సవిమర్శకముగా విభజించినప్పుడు అందుమూడే ముఖ్య విషయములు గోచరించును. అవి – 1) రాజనీతి, 2) యుద్ధ తంత్రము, 3) బ్రహ్మవిద్యోపదేశము. పుట్టుక చేతను, నడవడిక చేతను, విజ్ఞానము చేతను ఈ మూడు మహాధర్మములను ఆత్మ ధర్మములుగా నిర్వర్తించి అనుభవగోచరములు చేసికొనిన కవి తెలుగునాట తిక్కన యొక్కడే. ఈ కారణములచే భారతరచనకు తిక్కన యొక్కడే యుత్తమాధికారి యని చెప్పవచ్చును." (ఆంధ్రసాహిత్యచరిత్ర, పు.222)

**తిక్కన స్వప్నవృత్తాంతమూ హరిహరనాథుడు**

మ॥ హృదయాహ్లాది, చతుర్థమూర్జితకథోపేతంబు, నానా రసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాదులుం, గూడుగా
బదియేనింటి దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిముట్టన్ రచియించు టొప్పు బుధ సంతోషంబు నిండారుగన్. (విరా. 1-7)

అని భారతాన్ని గురించి భావన చేసి, ఈ ప్రబంధమండలికి అధినాథునిగా ఎవరిని చేయాలోనన్న ఆలోచనలో కాసేపు కునుకుతీస్తున్న సమయంలో తిక్కనకు వాళ్లనాన్న కొమ్మన స్వప్నంలో సాక్షాత్కరించాడు. కొడుకు తిక్కన చేసిన ప్రణామాలను స్వీకరించి, ఆశీర్వదించి కరుణార్ద్ర దృష్టితో చూచాడు.

కిమస్థిమాలాం కిముకౌస్తుభంవా
పరిష్క్రియాయాం బహుమన్యసే త్వమ్
కింకాలకూట్ట కిము వా యశోదా
స్తన్యం తవస్వాదు వద ప్రభోమే॥

అని నీవు రాసిన పద్యాన్ని హరిహరనాథుడు శ్రద్ధగా ఆలకించి, నీ పట్ల తనకున్న అభిమానాన్ని తెలిసికొనేశక్తిని నాకు ఇచ్చాడు. తన దగ్గరకు పిలిపించుకొని, నా సేవలను అందుకొన్నాడు. ఇదిగో ఆస్వామి వస్తున్నాడని కొమ్మన అన్నాడు. అప్పుడు 'కరుణారసము తొంగి చూచెడు చాడ్పున' హరిహరనాథుడు ప్రత్యక్షమైనాడు. చిరునవ్వుతొణకిసలాడగా

తే.గీ. "తెనుగుబాస వినిర్మింపు దివురు టరయ
భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె!
దీని కెడ నియ్యకొని వేడ్క మాని కృతి
పతిత్వ మర్థించి వచ్చితి దిక్కశర్మ!" (విరా॰1-18)

కొమ్మనకూడా అంగీకరించాడు. తిక్కన దానికి సమ్మతించి అది వరంగా భావించి "జన్మాంతరదుఃఖముల్ దొలుగు నట్లుగు జేసి సుఖాత్ముజేయవే" – అని అభ్యర్థించి హరిహరనాథునకే కావ్యాన్ని అంకితం చేశాడు.

**భారతమూ తిక్కన దృష్టి**

క. వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్. (విరా.1-4)

వేదాలకు, స్మృతులకు, పురాణాలకు ధర్మార్థ కామమోక్షాల విషయంలో వివాదం ఏర్పడితే ఆయా సందర్భాలలో మహాభారతం పురుషార్థ నిర్ణాయక గ్రంథంగా నిలుస్తుందని తిక్కనగారి అభిప్రాయం.

వ్యాసుడిది విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశమని తిక్కనగారి తీర్పు. అందుకే తాను కూడా విద్వాంసులు ప్రశంసించే భవ్యకవితావేశాన్ని పొంది మరీ భారతరచనను కొనసాగించాడు. భారతాన్ని గురించి

"హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథోపేతంబు" అనే పద్యంలో విరాటపర్వానికి హృదయాహ్లాది, ఊర్జిత కథోపేతము, నానారసాభ్యుదయోల్లాసి అనే గుణాలను పేర్కొని, ఉద్యోగం నుండి మిగిలిన పర్వాలన్నీ బుధజనులకు సంతోషం నిండారేటట్లు రచిస్తాననటం ప్రత్యేకంగా గమనించదగింది.

తిక్కన రచన ప్రధానంగా నాటకీయ శైలిలో ఉంటుందని విమర్శకుల తీర్పు. అలాగే రసాభ్యుచిత బంధంతో, పాత్రల సాత్త్వికాభినయ బంధురతతో తిక్కన రచన సాగుతుంది.

'తిక్కన శిల్పంపు తెనుగు తోట' అని విశ్వనాథ సత్యనారాయణగారు తిక్కన కవితా లక్షణాన్ని పేర్కొన్నాడు. తిక్కన భారతం తెలుగు సమాజంలో జరిగినట్లే అనిపిస్తుంది. తిక్కనగారి భాషా ప్రయోగశక్తిని గురించి ఆంధ్రసాహిత్య చరిత్రలో పింగళి లక్ష్మీకాంతంగారు చేసిన ఈ వివేచనను గమనించండి.

"కావ్యరచనకు యోగ్యమైన ఆంధ్రభాష లేని రోజులలో శిష్టమైన భాషను నిర్మించుకొని కావ్యరచనను నిర్వహించిన సిద్ధసంకల్పుడు నన్నయ. ఆయన చేతిలో తత్సమ శబ్దజాలమువలె శుద్ధాంధ్రము పెంపొందలేదు. అచ్చతెనుగున కా గౌరవము ఇచ్చినవాడు తిక్కన. ఒక భాషయొక్క శక్తియు, సంపన్నతయు అది వ్యక్తము చేయు భావములయు, నర్థములయు గంభీరతను బట్టి తెలియవచ్చును. అచ్చ తెనుగు భాష సూక్ష్మాతి సూక్ష్మములైన మనోభావములను వ్యక్తము చేయుటయందును, అతి గంభీరములైన శాస్త్రపరమార్థములను నిష్కర్షగా వివరించుటయందును కూడ సమర్థమే యని తన ప్రయోగములచే లోకములకు చూపినవాడు తిక్కన. అట్టి యీ భాషయంతయు అయన సృష్టించుకొన్నదే. ఆ భాషాసృష్టిలో కొంతవరకు నాటి వాడుకపదముల సహాయము చాల కలదు. ఆయన వాక్యములు వ్యాకరణ లక్షణానుసారముగానే ఉన్నను, భాషయంతయు వ్యావహారిక భాష. అందును నెల్లూరు మాండలిక పద ప్రయోగములు అమితముగా కలవు. (ఆ మండలములో 'పనిలేదు, పలుక కుండుము" అను మాటలు ఇతర ప్రాంతములలో 'అక్కరలేదు, ఊరకుండుము' అని వాడుదురు. అట్లే 'వచ్చినదానికి, పోయినదానికి' అనుసవి 'వచ్చుటకు, పోవుటకు' అనుభావార్థమున ఉపయోగింతురు. ప్రశ్నార్థకమున 'ఎట్లు!' అనుట ఇంకొక మాండలికము.

'నీవు రావా ఎట్ల?' అనిన 'నీవు రావా ఏమి?' అని అర్థము. ఇట్టి ప్రయోగములు (తిక్కన) భారతమున తండోపతండములుగా నున్నవి. వ్యావహారిక భాషాపదములకే శుద్ధరూపమును కొత్త ప్రాణము నిచ్చి ఆయన భారతము రచించెను." (ఆంధ్ర సాహిత్య చరిత్ర పు. 236).

ఇటువంటి తిక్కనను 'నవీన పరాశరసూనుడ'ని మారన కీర్తించాడు.

సీ॥ "సుకవీంద్ర బృంద రక్షకు డెవ్వడనిన, మీ
దను నాలుకకు దొడవైనవాడు;
చిత్త నిత్యస్థిత శివు డెవ్వడనిన, మీ
దను శబ్దమున కర్థమైనవాడు;
దశదిశావిశ్రాంతయశు డెవ్వడనిన, మీ
దని చెప్పుటకు బాత్రమైనవాడు;
సకల విద్యాకళాచణు డెవ్వడనిన, మీ
దని చూపుటకు గుఱియైనవాడు;

తే॥ మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య
భారధౌరేయుః, డభిరూప భావభవుడు,
కొట్టరువు కొమ్మనామాత్యు కూర్మిసుతుడు
దీనజనతా నిధానంబు తిక్కశౌరి." (దశకు. 1-69)

ఇటువంటి మహాకవి తెలుగువాడు కావటం తెలుగుజాతి చేసుకున్న పుణ్యం.

## 5.2 పాఠ్యభాగ సారాంశం

పాండవులు తమ అజ్ఞాతవాసాన్ని గడపటానికి విరాటరాజు కొలువును ఎంచుకున్నారు. ధర్మరాజు కంకుభట్టుగా, భీముడు వలలునిగా, అర్జునుడు బృహన్నలగా, నకులసహదేవులు దామగ్రంథి, తంత్రీపాలునిగా ఉన్నారు. ద్రౌపది సైరంధ్రిగా సుదేష్ణ అంతఃపురంలో కుదురుకొంది. అజ్ఞాతవాసపు నియమమైన సంవత్సరానికి కొద్దిరోజులు తక్కువగా నున్న సందర్భంలో జరిగిన కథే కీచకవధఘట్టం.

మత్స్యదేశాధిపతియైన విరాటరాజుకు బావమరదియైన కీచకుడు ఆ దేశానికి దండనాథుడు. నూట అయిదుమంది సోదరులలో పెద్దవాడు కీచకుడు. రూపాభిమాని, నానాభరణశీలుడు, దుర్విదగ్ధుడు, బలగర్వితుడు, సింహబలుడునైన కీచకుడు ఒక రోజు తన అక్క సుదేష్ణకు మొక్కేందుకై వచ్చి పక్కనే ఉన్న సైరంధ్రిని చూచాడు. ద్రౌపదీ సౌందర్యాన్ని చూచి, చూపు పక్కకు తిప్పుకోలేకపోయాడు. మదన పరవశుడై చలించాడు. ఇటువంటి అతిలోకసౌందర్యాన్ని మానవులెవరైనా చూశారా? ఈమె పొందులభించినవాడి జన్మ ధన్యం. ఈమె అండ లభించియుంటే మన్మథుడు, ఆనాడు ఈశ్వరుడిని సైతం లొంగదీసుకునేవాడు. త్రిమూర్తులు సైతం ఆమె అందానికి పరవశులయ్యేవారు. మన్మథుడు సైతం ఈమె సౌందర్యాన్ని చూస్తే విరహ తాపానికి లోనవుతాడని తలపోశాడు.

ఈమెకు జన్మనిచ్చిన తల్లిదండ్రులెవరో? ఆమె పేరుగా కుదురుకున్న అందమైన అక్షరాలు ఏవో? ఈమె భర్తగానున్న ఆ సౌభాగ్యవంతుడెవరో? ఆమె నివసించే అందమైన ఆ మందిరమేదో? ఈమె పొందును పొందే మార్గమేమిటి? నాకు తోడ్పడేవాళ్లెవరు?

– అటూ రతిభావతీవ్రతతో మన్మథ వికారాలకు లోనయ్యాడు. ఎన్నో వలపు తలపులతో వారించటానికి వీలులేని తమకంతో వింతగా జనాన్ని చూడటం, మతి తప్పినట్లు తల్లడిల్లటం వంటి చేష్టలు చేశాడు.

మదనవికారానికి లోనయిన కీచకునికి, మాసిన దుస్తులతోనున్న సైరంధ్రి కళావిహీనంగా ఉన్నప్పటికీ, తనను అసహ్యించుకుంటున్నా పట్టించుకోలేని స్థితిలో కీచకుడు ఉన్నాడు.

ఈ కీచకుడు జంకుగొంకులేకుండా తనను చూస్తున్నాడే అని సైరంధ్రి మనసులో కలతపడింది. దాంతో ఆమె శరీరమంతా చెమటపోసింది. కీచకుడినెలా తప్పించుకోవాలో తెలియక భయపడి వెలవెలబోయిన ముఖంతో వణకిపోతున్న సైరంధ్రియొక్క భయంతో కూడిన సాత్త్వికభావాలను మదనవికారాలుగా భావించి కీచకుడు రాగరసమగ్నుడయ్యాడు. ఆమెను గురించిన వివరాలను వెళ్లి తన అక్కను అడిగాడు.

కీచకుడి మన్థస్థితిని అక్క గమనించింది. తమ్ముడి కోసం బంగారు గద్దె వేయించింది. మనసు మరలించేలా మర్యాదగా మాటలాడి ప్రేమను కుమ్మరించింది. అయినా ఇవేవీ పట్టించుకోక సైరంధ్రి వివరాలే కావాలని అడిగాడు. వీడి నెలా మళ్లించాలా? అని సుదేష్ణ మాట మటమార్చి ప్రయత్నించింది. కాని కీచకుడు అక్కతో మాట్లాడటం మాని సైరంధ్రితోనే సంబోధించటం ప్రారంభించాడు. “ఓ చంద్రముఖి! నీలాంటి అందచందాలు, ఈ లోకంలో ఎవ్వరికైనా ఉన్నాయా? నీవెవరి కూతురివి? నీ పేరేమిటి? నీ భర్త ఎవడు?” – అంటూ మాట్లాడేసరికి సైరంధ్రి వినీ విననట్లు నటిస్తూ, నిర్వికారంగా మాట్లాడకుండా నిలబడింది. అంతటితో ఆగకుండా ఆ చపలుడు ఆమె సౌందర్యాన్ని పొగడటం ప్రారంభించాడు. ఆమెను చూసి, సమీపించి, ఆమె మాటలు వినాలని ముచ్చటపడి, ఆమె చేతిని తన చేతిలోకి తీసికోవాలని, తన ప్రేమను చెప్పాలని ప్రయత్నించటం వంటి చేష్టలతో సైరంధ్రికి కీచకుడు వెకిలి వాడనిపించాడు. నిన్ను పొందలేక పోతే నా ప్రాణాలే పోతాయని, ప్రాణం పోయాక, మళ్లీ పొందలేవని, ఆమెకు తన అభిలాషను చెప్పాడు. ఆతని స్థితిని గమనించి, వచ్చే కోపాన్ని నిగ్రహించుకొని సైరంధ్రి, వీడు దురహంకారి. తొందరపాటు తగదని, నేర్పుగా తప్పించుకోవాలని భావించి, అతడితో ‘ఓ అన్నా! నా కష్టాల పరిస్థితిని నీవు గమనించటం లేదు. నా కట్టు, బొట్టు, శరీరం ఎంత అసహ్యంగా ఉన్నాయో చూడు. ఇటువంటి స్థితిలో కూడ నేను నీకు మదన వికారాన్ని కలిగిస్తున్నానా? నీకు తోబుట్టువులు ఉన్నారు కదా! సజ్జనులు ఇలా మాట్లాడవచ్చా? పతివ్రతను తక్కువ వంశంలో పుట్టినదాన్ని’ – అంటూ చెప్పి చూచింది. అయినా మదనావేశ వివశుడైన కీచకుడు ఆమె సౌందర్యాన్ని మళ్లీ కీర్తించి, నీ వంశం తక్కువది కాదనటానికి నీవే సాక్షి. పరస్త్రీ సాంగత్యంవలన కలిగే పాపాన్ని నేను ఓర్చుకోగలను. కాని మన్మథబాణాలను ఓర్చుకోలేనంటూ పలికిన మాటలకు సైరంధ్రి ‘వీడు నీచుడు. భయపెడితే తప్ప తొలగిపోడని’ భావించి కోపంతో –

శా॥ “దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణమునం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!” (విరా.2-55)

అంటూ బెదిరించింది. అయినా కీచకుడు లెక్కపెట్టలేదు. నీ భర్తలేకాదు. మూడులోకాలలోను నన్నెదిరించేవారు లేరంటూ మాట్లాడే కీచకునికి ‘అందని మాని పండ్లకోసం అర్రులు చాచి పతనమైన రావణాదులవలె చెడిపోవద్దంటూ హెచ్చరించింది. ఆ మాటలకు మనసులో బాధపడి, ముఖం చిన్నబుచ్చుకొని తిరిగి తన అక్క దగ్గరికి వెళ్లాడు. నిట్టూర్పులు వదులుతూ సైరంధ్రి వివరాలు చెప్పమని, ఆమెవైపు నా మనసు మోహంతో మొగ్గుతోందని, ఇప్పటివరకు ఇక్కడే ఉన్న ఆ యింతి ఎక్కడికి వెళ్లిందో చెప్పమంటూ బలవంతం చేయసాగాడు.

వీడు రాగరసమగ్నుడయ్యాడు. అయినా నాకు చేతనయినంతమేరకు చెప్పిచూస్తాను. అని పరస్త్రీ పొందులోని భయనష్టాలను చెప్పి చూచింది. నిన్ను వలచి, వలపింప చేసుకునే వనితలు ఎందరో ఉంటే, ఇలా అధర్మమైన పనికి పూనుకోవద్దని హెచ్చరించింది. అయినా కీచకుడు 'నా కొలువులోనే కాదు, ఆ ఇంద్రుడి సభలో కూడా సైరంధ్రితో పోల్చదగిన స్త్రీలు లేరు. ఏదో ఒక ఉపాయంతో సైరంధ్రిని నాతో కలపకపోతే, నేను మన్మథుని బారికి గురయి మరణిస్తానని అన్నాడు. ఆమె మరలా నీతులు చెప్పి మనసు మార్చే ప్రయత్నం చేసింది. కాని తెరువున పోతే బ్రతుకు శూన్యమని చెప్పి చూసింది. అక్క చెప్పే నీతి మాటలు కీచకునికి ఓర్వరానివయ్యాయి. "బుద్ధులు చెప్పటం మాని ఏదోవిధంగా ఆమెను పొందే మార్గాన్ని చూడు. ఆలస్యం చేస్తే మదనతాపంతో మరణిస్తాను." – అంటూ దీనంగా లేచి సుదేష్ణ పాదాలు పెట్టుకునే పీట వద్ద నిలువునా పడి సాష్టాంగ నమస్కారం చేశాడు.

తరువాత వచ్చే ఆపదల సంగతినలా ఉంచి, ప్రస్తుతానికి వీడికి సైరంధ్రిని సమకూరిస్తే తప్ప వట్టి మాటలతో తృప్తిపడి తిరిగిపోయేలా లేడు. వీడు సైరంధ్రి భర్తల చేతిలో కాకపోయినా మన్మథుడి చేతిలో చావటం తథ్యం – అని అనుకొని తమ్ముడిని లేవనెత్తి కళ్లలో నీటిని కళ్లలోనే కుక్కుకొంటూ 'దీనికోసం ఇంత చింత దేనికి? ఈ రోజు ముగిసేలోగా మద్యం కోసమని సైరంధ్రిని నీ మందిరానికి పంపిస్తాను. అప్పుడు నీ కోరిక నెరవేర్చుకో?' – అని చెప్పిపంపించింది. ఆ మాటకు కీచకుడు ఎంతో సంతోషపడి, తన మందిరానికి పోయాడు. పలురకాలైన మద్యాలను, వాటికనువైన భక్ష్యాలను సిద్ధం చేసి, మందిరానికి చుట్టుపక్కల జనం ఎవరూ లేకుండా చేసి, సైరంధ్రి కోసం కలలు కంటూ విరహవేదనను అనుభవిస్తూ సైరంధ్రికోసం వేచి చూడసాగాడు.

**సుదేష్ణ సైరంధ్రిని కీచకుని మందిరానికి పంపుట**

అంతఃపురంలో సుదేష్ణ సైరంధ్రిని పిలిపించింది. మద్యం తాగాలన్న దప్పికను నటిస్తూ 'నా నోరు ఎండిపోతోంది. చక్కని సువాసనతో కూడిన మదిరను తాగాలని నా మనసు తీవ్రంగా వేడుకపడుతోంది. కీచకుని ఇంట్లో ఎప్పుడూ మంచి రుచిగల మద్యమే ఉంటుంది. వెళ్లి తీసుకురా! ఎంత త్వరగా వస్తావో నీవేగాన్ని చూస్తాను అంటూ అడిగింది. ఓరి భగవంతుడా! ఈ విపత్తునుండి బయటపడే ఉపాయమేమిటి? – అని భయపడుతూ సైరంధ్రి, నన్ను వదలి వేరెవరినైనా పంపండి. ఇటువంటి నీచకార్యాలకు నన్ను నియోగించవద్దని కొలువుకు చేరేటప్పుడే చెప్పాను. నా భర్తలు వెంట లేకున్నా నీయింట సదాచారం ఉందన్న నమ్మకంతోనే ఉండగలగుతున్నాను. ఆ ధైర్యాన్ని చెరచి ఇలా మర్యాదతప్పి మాట్లాడటం తగునా? – అని బ్రతిమిలాడింది. కీచకుడి మందిరం పరాయి మందిరమా? నేనెంతో మనసుపడి అడిగితే, దీన్ని నీచపు పనిగా భావిస్తున్నావా? ఇదేనా స్నేహమాధుర్యమంటూ సుదేష్ణ నిష్ఠురాలాడింది. బ్రతిమిలాడింది. ఇక ఎంత చెప్పినా వినదని నిశ్చయించుకొని సైరంధ్రి కీచకుని యింటికి ఒంటరిగా బయలుదేరింది. తనకు కలుగనున్న ఆపదను స్మరించింది. మహామహా ఆపదలకు పరిహారం హరినామస్మరణ యేనంటూ విష్ణువును స్మరించి, సుదేష్ణ అంతఃపురం నుండి బయటకు వచ్చి, సూర్యభగవానునకు నమస్కరించి 'తండ్రీ! నేను పాండవులను తప్ప ఇతరులను భావించని పతివ్రతనే అయితే, నాకు కీచకునివలన ఎటువంటి అపాయం జరుగకుండా రక్షించు' – అంటూ ప్రార్థించింది. సూర్యనారాయణుడు దయాంతరంగంతో ఆమెను రక్షించటానికి బహుబలాఢ్యుడైన ఒక రాక్షసుడిని ఆమెకు కనబడకుండా అదృశ్యాకారంతో వెంటనంటి ఉండేలా పంపాడు. పెద్దపులి ఉండే పొదలోనికి వెళ్లే లేడిలా కీచకుని మందిరంలోనికి సైరంధ్రి ప్రవేశించింది.

**కీచకుని మందరం**

కీచకుడు, సైరంధ్రి వచ్చే దారిని తేరిపారచూస్తూ, గగుర్పాటుతో కూడిన ఆశ్చర్యం, సంతోషం పెనవేసికోగా తొట్రుపాటు పడుతూ, ఎదురుపోవటానికి సమకట్టి, హారాలు చక్క చేసికొంటూ, మీద విచిత్ర విలాసాలు చేస్తూ నిలుచున్నాడు. సైరంధ్రి కీచకుని మందిరంలోనికి పోయి 'సుదేష్ణాదేవి మదిరను దప్పికతో తీసుకరమ్మంటే వచ్చాను. పోయించండి' – అని అన్నది. 'మీదేవి దప్పిక తీర్చటానికి పూనుకున్నావుగాని, ఆమె తమ్ముడినైన నా దప్పికను కూడ నీ సరస సల్లాపాలతో తీర్చకపోవటం

న్యాయమా! నీ కటాక్ష వీక్షణాన్ని పొందలేనందున కలిగిన నా దేహ తాపాన్ని, నీ తీయని పలుకులు వినలేకపోవటం చేత కలిగిన శ్రవణతాపాన్ని నీవిలాస చేష్టలను ప్రీతితో మెచ్చలేని కోర్కెల వలన కలిగిన మదన తాపాన్నీ నీతో రహస్య క్రీడలతో రమిస్తూ ఆనందం పొందక పోవటం వలన కలిగిన మనస్తాపాన్నీ పోగొట్టి నా జన్మను సఫలం చేసి నీ బంటుగా స్వీకరించు. ఈ సిగ్గుతెరలు దేనికి?' – అంటూ తొందరపెట్టాడు. ఆ మాటలేవీ పట్టించుకోకుండా 'త్వరగా మద్యం పోయించండి. దేవి ఎదురు చూస్తుంటుంది. శీఘ్రంగా వెళ్లాలి' లేకుంటే దేవికి కోపం వస్తుందని సైరంధ్రి నిబ్బరంగా అన్నది. కీచకుడు 'అక్క సుదేష్ణకు మద్యాన్ని వేరే వాళ్ల ద్వారా పంపిస్తాను. నీవు ఈ మద్యంతాగి, నీ ముఖ పద్మపు వాసనలను నన్ను ఘ్రాగనిచ్చి, మదనతాపాన్ని తీర్చు. నా సంపదనంతా నీకే కట్టబెట్టి రాణిని చేస్తాను. నా భార్యల నందరినీ నీ దాసీలను చేస్తాను. అన్ని పనులు నీవే నడిపించు' – అంటూ మోహావేశంతో, సైరంధ్రిపై బడి ఒడిసి పట్టుకోబోయాడు. సైరంధ్రికి రక్షగా వెన్నంటివస్తున్న రాక్షసుని శక్తి సైరంధ్రిని ఆవహించినందున, ఆమె కీచకుని చేతిని విడిపించి, ఆ ఇంటినుండి బయటపడింది. కాని కీచకుడు వెంటపడ్డాడు. వెనుదిరిగి చూచిన సైరంధ్రి భయపడింది. ఎక్కడికి వెళ్లాలా? అని విలవిలలాడుతున్న సైరంధ్రికి విరాటరాజు కొలువు తీర్చి యుండటం తెలిసింది. వెంటనే విరాటుని కొలువుకు పరుగుపెట్టింది. గద్ద ఆడుపామును ఒడిసిపట్టినట్లు, గండుపిల్ల గోరువంక పిల్ల మీదికి దురుసుగా దూకినట్లు కీచకుడు ద్రౌపది జుట్టుముడిని పట్టిలాగి, నేలకు పడత్రోశాడు. అదే సమయంలో ద్రౌపదీ రక్షకుడైన రాక్షసుడు కీచకుడిని నేలకు పడదోశాడు. తన పాటును ఇతరులు గమనించకుండా వెంటనే లేచి, పట్టుదప్పిన పాములా బుసపెడుతూ కోపంతో లోలోపల ఉడికిపోతున్నాడు.

**విరాటుని కొలువు**

విరాటుడు తీర్చిన ఆ కొలువులో భీమసేనుడున్నాడు. జరిగిన దృశ్యాన్ని చూచాడు. సతీ పరాభవాగ్నికి తట్టుకోలేక ఉగ్రుడై లేచి, రుద్రాకారుడైనాడు. కీచకుడిని, కీచకుని ప్రవర్తనను అదుపులోపెట్టలేని విరాటుడిని ఇద్దరినీ చంపేయాలని, పక్కనే ఉన్న మహావృక్షాన్ని పెకలించాలని చూస్తున్నాడు. సభలో కుంకుభట్టు రూపంలోనున్న ధర్మరాజు దీనిని గమనించి అజ్ఞాతవాస సమయం భంగమవుతుందేమోనన్న భయంతో నిగూఢంగా

మ॥ "వలలుం డెక్కడు జూచె నొండెడ నసేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పుగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపగా నేటికిన్?" (విరా.౨-136)

అంటూ వారించాడు. ధర్మరాజు నర్మగర్భోక్తులతో భీముడి కోపాతిశయం చల్లారింది. ఈ అన్నదమ్ముల చేష్టల్ని గమనిస్తూ మెల్లగా లేచిన ద్రౌపది తన భంగపాటును విరాటునితో చెప్పింది. ఒంటిమీది దుమ్ము, కళ్లనుండి కారేకన్నీరు, విడిచే వేడినిట్టూర్పులతో, తన భర్తలను కోపంతో చూచి, విరాటరాజు, సభాసదులు వినేలాగా ఇలా పలికింది. ధర్మాధర్మ విచక్షణ కలిగి, సాధురక్షణ, దుష్టశిక్షణ చేయగల సామర్థ్యముండి అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరిన నా భర్తలు కీచకుడిలా అవమానించినా ఉదాసీనంగా మిన్నకున్నారు. ఇక లోకంలో ఇతరుల భార్యలకు ఇలాంటి అవమానాలెదురైతే, దిక్కెవరు? ఈ సభలో నున్నవారు ఒక్కరైనా ధర్మంకోసం గళం విప్పేస్థితిలేదు. పతివ్రతనైన నన్ను కీచకుడిలా అవమానిస్తే, కొద్దిపాటి దయనైనా చూపే తరుణం ఇది కాదా? ఇంత జరిగినా మిన్నకున్న ఈ విరాట రాజుననాలి. ధర్మలోపం జరిగితే శిక్షించాల్సింది రాజే కదా! ఇంత చేసిన కీచకునిపట్ల ఇలా ఉదాసీనంగా ఉండటం ధర్మమా?' – అని అడిగిన సైరంధ్రి మాటలకు విరాటుడు రెండోమాటమాటలాడలేకపోయాడు. ఊగిపోతున్న కీచకుడిని సాంత్వన వచనాలు చెప్పి, ఇంటి ముఖం పట్టేలా చేశాడు. సభాసదులంతా ద్రౌపదిని గురించి బాధపడి, సానుభూతిని ప్రకటించారు.

అప్పుడు ధర్మరాజు మనస్సు కలతచెంది, మించిన కోపాన్ని అణచుకొని, నిర్వికారంగా ఇలా అన్నాడు. "సైరంధ్రీ! నీ సమాచారం రాజుగారికి, సభాసదులకు తెలిసింది. ఇకమాటలాపి, రాణిగారి సదనానికిపో. నీకు జరిగిన అవమానానికి నీ

భర్తలయిన గంధర్వులకు కూడా కోపం రాకుండా ఎలా ఉంటుంది. బహుశా యిది సమయం కాదని మిన్నకుండి యుంటారు. అది గమనించక వారినెందుకు నిందిస్తావు. సతులకు సభలలో ఆవేశంగా మాట్లాడటం తగునా? – అని నచ్చ చెప్పినప్పటికీ ద్రౌపది కదలకుండా నిలబడి, ఏదో మాట్లాడాలని అన్నట్లుగా ఉండగా ధర్మరాజు ఇలా అన్నాడు.

"సైరంధ్రీ! ఇలా స్వైరవిహారం చేస్తూ, నాట్యం చేస్తున్నట్లుగా, కొల్వులో కులస్త్రీల గౌరవం తొలగిపోయేలా నీవు నిలబడటం సంభావ్యం కాదు" అని ధర్మరాజు అన్నమాటలకు సాభిప్రాయంగా ద్రౌపది ఇలా సమాధానం చెప్పింది. కంకుభట్టా! నా భర్తనటుడు. పెద్దవారితోటే పిన్నవారు. నేను నర్తకిని కాదనటానికి వీలులేదు. నాకు నాట్యం చేయటం అలవాటే. నాభర్త నాట్యకాడే కాదు, జూదరికూడ. జూదరి భార్యకు పెద్దరికం, గౌరవం ఎక్కడినుండి వస్తుంది. అంటూ ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టి 'నన్నిలా ఆ నీచుడి మందిరానికి వెళ్లమన్న ఆ జంతకి సుదేష్ణకు, నాకు జరిగిన అవమానాన్ని తెలియజెప్పి నిందించాలని, బావురుమంటూ కంపించి దీనురాలై తూలుతూ సుదేష్ణ వద్దకు వెళ్లింది.

**సుదేష్ణ మందిరంలో సైరంధ్రి**

సుదేష్ణ ఏమీ తెలియనట్లు కపటపు దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని డగ్గుత్తిక స్వరాన్ని నటిస్తూ 'ఎందుకిలా ఏడుస్తున్నావు? దుమ్ముకప్పుకున్న శరీరమేమిటి? నీకెవరైనా అపకారం చేశారా? వాళ్ల సంగతి చూస్తాను. చెప్పమని వివరాలు అడిగింది. సైరంధ్రి జరిగింది చెప్పింది. సుదేష్ణ కీచకుడిని దండిస్తాను, నీకు సంతోషం కలిగిస్తాను అని ఓదార్పు మాటలు చెప్పింది. ఆ అబద్ధాలకోరు మాటల్ని ద్రౌపది లక్ష్యపెట్టక 'అవసరంలేదు. నా కష్టాన్ని, లోకుల దుఃఖాన్ని కించిత్తు కూడా మిగల్చకుండా నా భర్తలు పగదీరుస్తారులే' అని సైరంధ్రి పలికింది. ఆ మాటలకు సుదేష్ణతోపాటు, పరిజనులుకూడా భయభ్రాంతులయ్యారు. వాళ్లెంత చెప్పినా ద్రౌపది కోపాన్ని వదలలేదు. అన్న పానాదులు ముట్టలేదు. స్నానమైనా చేయలేదు. చేసేదేమీలేక సుదేష్ణ మిన్నకుండిపోయింది. మిగిలిన స్త్రీలంతా కీచకుని దుష్టత్వాన్ని తలచి, వాడికి కీడుమూడాలనే కోరకున్నారు. ద్రౌపది అవమానాగ్నితో వేగుతూ, పడకగదిలో పడకమీదనడుం వాల్చి కన్నీరు మున్నీరవుతూ ఎన్నో ఆలోచనలు చేసింది.

**కీచకవధకై వలలుని వద్దకు**

బలాఢ్యుడైన కీచకుడిని తుదముట్టించడం భీముని భుజబలం తప్ప మార్గంలేదు. అని ఆలోచించి, రాత్రి కావటం వలన జనమంతా నిద్రిస్తూ ఉండటాన్ని గమనించి, శరీరం మీది దుమ్మును కడుక్కొని, ఉతికిన చీరకట్టుకొని భీముడి వద్దకు వెళ్లింది. "ఓ భీమసేనా! నన్ను అవమానించి కీచకుడు సుఖనిద్రపోతుంటే, నీకెలా నిద్రపడుతోంది. తగిన సమయం కాదని నీ అన్న అనటం వలన ఇలా దయమాలి ఊరుకున్నావా? అని మెల్లమెల్లగా మాట్లాడుతూ కరస్పర్శతో భీముడిని మేల్కొలిపింది. కీచకవధకోసం తనను ప్రేరేపించేందుకు వచ్చిందని భావించి, జరిగిందంతా ఆమెనోటనే వినాలని అనుకొని 'ఇంతపొద్దు పోయాక ఎందుకు వచ్చావు. ఎవరూ చూడలేదుకదా!' అని భీముడడిగాడు. ఆ మాటలకు సైరంధ్రి అంతా తెలిసి నన్నెందుకు అడుగుతావు. అంతలోనే మరచిపోయావా? మరచిపోతే నేను చెప్పేదేముంది? జరిగింది నా నోటితోనే చెప్పించాలని భావిస్తే చెపుతాను విను. అని జరిగిందంతా వినిపించింది. కురుసభలో దుశ్శాసనుడు, వనవాసంలో సైంధవుడు, విరాటుని కొలువులో కీచకుడు ఇలా నా అవమానాల పరంపరకు అంతేలేదా? ఆడుదాని రోదనాన్ని, గోమాత అరుపునూ విన్న పరాయి వాళ్లయినా స్పందించి శిక్షిస్తారు. కాని విరాటుని సభలో కీచకుడు తన్నగా చూచి ఆ ధర్మరాజు ఎలా మిన్నకున్నాడు. అని బాధపడింది. ఆ మాటలకు భీమసేనుడు 'అన్న ధర్మరాజు అడ్డు పడకపోతే కీచకుడిని, ఆతని సేనల్ని అక్కడే మట్టుపెట్టేవాడిని. ఆ ఉద్రిక్త స్థితిలో సమయభంగమయితే, మళ్లీ మనమే ఆపదను కొని తెచ్చినవాళ్లమయ్యే వాళ్లం. ధర్మరాజు నిందార్హుడు కాదు. కీచకుడిని చంపి, నీ చింతను తీరుస్తాను. ఇతరులు గుర్తించని రీతిలో ఉపాయాన్ని ఆలోచించాలి. కీచకుడిని వధించటం ఎంతపని?' అని అన్నాడు. ఆ మాటలకు ద్రౌపది నా జీవితంలో అత్తగారైన కుంతికి, భర్తలైన మీకు, చివరికి ఆదైవానికి కూడ భయపడలేదు. కాని దుష్టురాలైన ఆ సుదేష్ణకు సేవలు చేస్తూ అమితంగా భయపడుతున్నాను. నా కోపాన్ని చెప్పుకునే వీలులేక, కీచక పరాభవ

దుఃఖాన్ని భరించలేక ఇలా అన్నాను కాని, ధర్మరాజు గొప్పదనం తెలియని దానిని కాను. అని భీమునితో ధర్మరాజు గొప్పదనాన్ని, భీముని పరాక్రమాతిశయాన్ని, అర్జునుని అస్త్రశస్త్ర విద్యా నిధిత్వాన్ని, నకులుని సౌందర్యాన్ని, సహదేవుని కార్యనిర్వహణ పరిజ్ఞానాన్ని ప్రస్తావించి వాళ్లంతా అల్పునికి సేవలు చేస్తూ దీనంగా బ్రతకటాన్ని తలచివిలపించింది. తనను కుంతీదేవి ఎలా అపురూపంగా చూచుకునేదో చెప్పి కన్నీరు ధారలు కట్టగా తన పుట్టినింటిని, మెట్టినింటిని, తన కుటుంబపు గొప్పతనాన్ని, రాజసూయాగాది క్రతువులు చేసి పుణ్యాంగనగా ప్రశంసలనందుకోవటాన్ని, తాను పొందిన భర్తల అనురాగాన్నీ భీమునితో చెప్పింది. మానావమానాన్ని వదలి, పొట్టకూటికోసం చేతులు కాయలు కాచేలా గంధలేపనాన్ని నూరి, మైపూతలు పూసి నేపడుతున్న అగచాట్లు ఎవరూ ఎరుగనివి అని దుఃఖిస్తూ భీముని గుండెలపై ముఖాన్ని చేర్చింది. ఆమె కష్టస్థితిని చూచి భీముడి హృదయంకూడ కలతపడింది. దుఃఖాన్ని దిగమ్రింగుకొని ద్రౌపదిని ఓదార్చి, ఆమె చేతుల్ని తన బుగ్గలకు అదుముకొని నిట్టూర్చాడు. భీముడు చింతపడటం గమనించిన ద్రౌపది 'మన ఈ కష్టాలన్నిటికీ కారణం ధర్మరాజే. నా పూర్వజన్మ పాపఫలమీ కష్టాలన్నీ. నాకు దుఃఖశాంతిలేదు. మీరు ప్రాణాలతో ఉండగానే, సభలో ఆ మూర్ఖుడి చేత ఇలా భంగపడ్డాను. అయినా మీరేం చేస్తారులే. విధిని ఎవరు ఉల్లంఘించగలరు. ఆ నీచకీచకుడిని సంహరించకపోతే, నేను నీ ఎదుటనే ప్రాణత్యాగం చేస్తాను. ఉరివేసికొనిగాని, నీళ్లలో దూకిగాని, అగ్నిలో పడిగాని, విషం తినిగాని శరీరం విడిచిపెడతాను. నీ మీద ఒట్టు'- అని అనగా భీముడు చిరునవ్వులు చిందిస్తూ కీచకుడిని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

ఓ ద్రౌపదీ! కీచకుడిని చంపటంకోసం నీవింతగా చెప్పాలా! నేను చూస్తుండగా అడ్డూ అదుపూ లేకుండా పరాభవించిన ఆ కీచకుడు ఇంకా భూమిపై జీవించియుంటే, ఇల్లాండ్ర మానభంగాల నుండి గట్టెంకించే మార్గమేది? ఆ రోజు కొలువులో నా మహాభుజశక్తిని చూపకపోవటం తప్పయింది. అది చాలు. స్వయంగా ధర్మరాజే వచ్చి అడ్డుపడినా, నీవే వచ్చి క్షమించినా రేపు వాడిని చంపితీరుతాను. నీవిక నిశ్చింతగా ఉండు. వాడి మాటలు మరిచిపో! సుకన్యలా, సీతలా, లోపాముద్రలా, దమయంతిలా తొలుత కష్టాలనుభవించినా కడకు సంపదలననుభవిస్తావు. కౌరవులకు కాలం మూడినట్లు, అజ్ఞాతవాసకాలం కూడ పూర్తికావస్తున్నది. పన్నెండవమాసం నడుస్తున్నది. నీవు కీచకుడిని అంగీకరించినట్లు నటించి నర్తనశాలను సంకేతస్థలంగా చెప్పి, ఒంటరిగా వాడిని అక్కడికి వచ్చేలా చేయి. ఆ సోగ్గాడిని అక్కడే మట్టుపెట్టి, నీకు కళ్లారా వాడి శవాన్ని చూపి నీ మనసును రంజింపచేస్తాను. ఇదే నా నిర్ణయమని చెప్పి తెల్లవారబోతున్నది. "ఎవరైనా చూస్తే మన అజ్ఞాతవాసనియమ భంగం అవుతుంది. నీవు వెళ్లి నీ పక్కపై పడుకో" అని తొందరపెట్టిమరీ పంపాడు. కొంతదూరం కలిసివెళ్లి వీడ్కోలు చెప్పి, వచ్చి తన శయ్యపై శయనించాడు. ద్రౌపది కూడా వెళ్లి తన పక్కపై పడుకుంది. కంటినిద్రరాకున్నా, గట్టిగా కళ్లుమూసుకొని కదలకుండా పడుకొని ఉండిపోయింది.

తెల్లవారింది. ప్రాతఃకృత్యాలను పూర్తిచేసుకొని, అలంకరించుకొని, మనసులోని మోహం నిలువనీయకపోతుంటే, తొట్రుపడుతూ మదనావేశంతో సుదేష్ణమందిరానికి వెళ్లాడు. పనిపాటలలో నిమగ్నమైయున్న, సైరంధ్రిని చూచాడు. వేటగాడి ఉరిలోకి ఉరికే జింకలాగా కీచకుడు సైరంధ్రి వద్దకు వెళ్లాడు. ద్రౌపది కీచకుడిని చూచినాచూడనట్లు నటిస్తూ, దూరంగా తొలగిపోకుండా, ధైర్యంగా చేస్తున్న పనిలో మగ్నురాలయింది. తనను చూడటంలేదని కీచకుడు, కంటబడ్డవారితో వృథాగా మాట్లాడుతూ, కాలి మట్టెల శబ్దం చేస్తూ ఒళ్లు విరుచుకొంటూ, అకారణంగా నవ్వుతూ, అరచేతితో స్తంభాన్ని తట్టి తాళంవేస్తూ సైరంధ్రి మీది మోహంతో వెకిలి వేషాలు వేయసాగాడు. ద్రౌపదిని సమీపించి "ఈ కీచకుడి మీదనే యిష్టంలేదా! లేక పురుష జాతిపైనే వైరాగ్యమా? నన్ననుగ్రహించి నా సంపదలను స్వేచ్ఛగా అనుభవించు. రాణివై రాణివాసంలో సుఖించు. నేనే ఈ దేశపు రాజ్యాంగాన్ని నడిపేది. విరాటరాజు నామమాత్రుడే. నేనే అతనికి తగిన తిండిని పడేస్తున్నాను. నన్నెదిరించేవాడు ఈ మూడు లోకాలలో లేడు. నిన్ను కొలువులో త్రోసిపడవేసినా నన్ను అడ్డుకోగల ధైర్యంలేక ఎవరూ ముందుకు రాలేదు. నీ భర్తలు బలవంతులన్నావు. వాళ్లకు నా శక్తి ఏమిటో తెలిసివచ్చియుంటుంది. వాళ్ల అంతు చూస్తాను. నీవు ఎక్కడికి పారిపోయినా, అడ్డులేకుండా నిన్ను గ్రహిస్తా" నంటూ ప్రగల్భాలు పలికాడు. ద్రౌపది కూడా వీడు మంచితమకంతో ఉన్నాడు. ఆలస్యం చేస్తే వీడు మీదపడితే

మొదటికే మోసం వస్తుందని భావించి, మనసు మెత్తబడినట్లు, అంగీకరించినట్లు అతడివైపు చూచింది. మనసులోమాట చెపుతున్నట్లుగా "ఎంతవారించినా వినకుండా మాటిమాటికి మీది మీదికి వస్తున్నావు. నీలాగే అందరిమనస్సులు మదనావేశానికి లోనవుతాయని గ్రహించు. ఆలోచనకు, కోరికకు పొంతన ఉండాలికదా! స్త్రీలు తమ మోహాన్ని గుంభనంగా ఉంచుకుంటారని తెలియదా? రహస్యంగా నీ కోర్కెను తీర్చుకో! నా గుట్టుబయట పెట్టని పద్ధతిలో నన్ను పొందు." – అని అనగానే కీచకుడి హృదయం ఉప్పొంగింది. నా కోర్కెను ఎప్పుడు ఎక్కడ ఏఉపాయంతో తీరుస్తావో చెప్పమని అడిగాడు. తన ఉచ్చులో చిక్కుకున్నాడని భావంచి ప్రేమతోకూడిన మనస్సుతో ఉన్నట్టు నటిస్తూ నర్తనశాలను సంకేత స్థలంగా చెప్పి, రహస్య క్రీడకు ఒంటరిగా రమ్మని చెప్పింది. ఉల్లాసంతో కీచకుడు, నన్ను ఏ విధంగా నీవు ఏలుకుంటే ఆ విధంగానే నీ ఆజ్ఞ పాటిస్తానన్నాడు. ఒంటరిగానే రావాలి. లేకుంటే నేనక్కడ నిలువనని సైరంధ్రి బెట్టుగా కట్టడి చేసింది. నీ మాట మీద నీవు నిలబడు. అలాగే తప్పక వస్తానన్నాడు కీచకుడు. మనమిక్కడ ఎక్కువసేపు ఇలా ఉంటే ఎవరైనా చూస్తారు. నీవు వెళ్ళిపో, నేను నా పని మీద పోతానని నమ్మపలికింది సైరంధ్రి. కీచకుడు పోగానే సైరంధ్రి భీముని వంటశాలకు పోయి, నా పనిని నేను పూర్తిచేశాను నీవంతుపనే మిగిలియుంది. కీచక సంహారానికి, లోకాన్ని మోసం చేయటానికి చీకటిరాత్రి రానున్నది. నీ ఇష్టం. ఏం చేస్తావో చెప్పు. అంటూ కీచకుని పట్ల భీముని క్రోధాన్ని రగుల్కొల్పే ప్రయత్నం చేసింది.

భీముడు నవ్వుతూ 'ఓ పద్మముఖీ! నన్నడగటం దేనికి? ఆ నీచుడు నీవు ఏమేమి మాట్లాడుకున్నారో, నాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పు. నిన్ను మెప్పిస్తానని అన్నాడు. ద్రౌపది జరిగిన విషయాన్నంతా వివరించింది. భీముడు అతిశయ ఉత్సాహంతో, ధర్మరాజు మనసుమెచ్చుకునేలాగా కీచకుడిని సాధిస్తాను. ఇంతకూ వాడు సంకేతస్థలానికి వస్తాడా? సాయంగా ఇతరుల్ని తీసుకొని వస్తాడా? మూర్ఖుడై రహస్యాన్నంతా బట్టబయలు చేస్తాడా? అయినా నీవు ప్రీతిగా మాట్లాడాక వాడలా ఎందుకు చేస్తాడులే! నీవు ఒప్పుకున్నట్లు చెప్పినప్పుడు వాడి సంతోషపురీతిని గమనించావుకదా! అనుమానానికి తావులేదు. నర్తనశాలకువస్తాడు. అని భీముడు నిశ్చయానికి వచ్చాడు. భీముడి ఆవేశాన్ని చూచి, సమయభంగం అవుతుందేమోనని భయపడి 'మన అజ్ఞాతవాసం భంగపడకుండా శత్రువుని చంపాలి. అలా చేయలేని పక్షంలో ఈ ప్రయత్నమే వద్దని ద్రౌపది హెచ్చరించింది. ఆ మాటలకు భీమసేనుడు కీచకునితో ఎదిరించి పోరాడే సమయంలో ఇది రహస్యంగా చేయాలి? ఇది ప్రకాశంగా చేయాలి! అనే విచక్షణ ఎలా ఉంటుంది? అయినా ప్రయత్నిస్తానని చెప్పాడు. ద్రౌపది, భీమునికి శుభాకాంక్షలు చెప్పి, ఇప్పటికే ఆలస్యమైంది నా కోసం సుదేష్ణ వెదకుతుంటుంది. అని వెళ్ళిపోయింది.

కీచకుడు సైరంధ్రి మీది మోహంతో విరహబాధను అనుభవించసాగాడు. ఎన్నో రకాలుగా సైరంధ్రిని గురించి తలపోయసాగాడు. సైరంధ్రిరాకపోతే నా ప్రాణాలు నిలుస్తాయా? అయినా ఆమె రాకుండా ఎలా ఉంటుంది? మాట పాటిస్తుందా? తప్పుతుందా? అని, ఆమె ఎదురుగా సాక్షాత్కరించినట్లే భావించి కౌగిలించుకోబోయేవాడు. అది అబద్ధమని తెలిసికొని చింతించేవాడు. శరీరం స్వాధీనం తప్పి, అంతఃపురం ఉద్యానవన విహారానికి వెళ్లాడు. లీలా ఉద్యానవన విహారం కూడా సంతృప్తినీయలేదు. విరహతాపం విపరీతమై, చంద్రకాంత శిలాతల్పంపై మేను వాల్చాడు. మదనుడు వెర్రివాడిని చేసి ఆడించినట్లుగా ఆడుతూ 'మాయురవి ఇంకా అస్తమించదేమిటి? క్రుంకక, పగవాడై బాధపెడుతున్నాడు. పగళ్లు తప్ప రాత్రిళ్లు లేకుండా బ్రహ్మ సృష్టించాడా? అంటూ తపించసాగాడు. ఎట్టకేలకు సూర్యుడు అస్తమించాడు.

చీకటి భూమిని కప్పేసింది. భీముడు పెళ్లికి పిలిచినట్లు సంతోషంగా నెత్తికి తలపాగా చుట్టుకొని, ద్రౌపదిని తన వెనుక అనుసరిస్తూ కొంచెం దూరంగా మెల్లమెల్లగా రమ్మని చెప్పి, తన యుద్ధోత్సాహాన్ని కొద్దిగా కూడా బయటికి తెలియనీకుండా గంభీరంగా నర్తనశాలముందరి భాగాన్ని చేరాడు. నలువైపులా కలియచూచి, తన భుజబలమే సహాయంగా భావించి మదపుటేనుగులా నిశ్చింతగా నడుస్తూ భార్య చేయిపట్టుకొని అమితకోపంతో లోనికి ప్రవేశించాడు. భవనం మధ్యలో ఉత్తరపవళించే మెత్తని పాన్పును పరిశీలించి, దానికి దగ్గరిలో ద్రౌపదిని కనబడకుండా దాచిఉంచి, ఆ పాన్పుపై కూర్చున్నాడు. సింహం ఉన్న గుహనివాసానికి వచ్చే ఏనుగులాగా భీముడు ఉన్న నర్తనశాలలోనికి సమీపించి 'సైరంధ్రిని మదనుడు ఈ పాటికే

ఇక్కడికి తెచ్చి యుంటాడులే అనుకొంటూ రెచ్చినవలపుపిచ్చితో, అహంకారంలో సంకేతస్థలాన్ని సమీపించి, శయ్యను చూచి, సంతోషంతో తన చేతిని శయ్యమీదికి పోనిచ్చాడు. భీముడు తన కోపాన్ని నిగ్రహించుకొని, కీచకుడి చేష్టలను గమనిద్దామని గుంభనంగా కూర్చున్నాడు. కీచకుడు భీముడి శరీరంపై చేయి వేసి, సైరంధ్రి అనుకొని పులకించిపోయాడు. సరస సంభాషణలు సాగించి 'సైరంధ్రీ! నీకోసం మనోహరమైన వస్తువుల్ని కానుకగా తెచ్చాను తీసికో! నన్ను చూచి మరులుగొన్న స్త్రీలు, నా పొందుగోరి విలువైన విశిష్ట కానుకల్ని లంచంగా యిచ్చారు. నా సౌందర్యాన్ని చూచిన ఏ స్త్రీ అయినా మరొకరిని లక్ష్యపెట్టదు. స్త్రీలందరికీ నేను ఆకర్షణ అయితే, నాకు నీవు ఆకర్షణీయవు. అంటూ మాట్లాడే కీచకుడి మాటలకు భీముడు ఛీయని, ద్రౌపదిని సంతోషపెట్టటం కోసం 'నీవిలాంటివాడివి కాబట్టే నిన్ను నీవు పొగుడుకోవటం సమంజసమే! నాలాంటి స్త్రీ ఎక్కడ వెదకినా నీకు దొరకదు. నా శరీరం నీ శరీరంతో తగిలినప్పుడు నీ శరీరం ఏమవుతుందో అది నీవే తెలుసుకుంటావు. మిగిలిన స్త్రీలతో సమానంగా నన్ను చేయాలనుకుంటున్నావేమో? తప్పుచేసినట్లే సుమా! నన్నొకసారి ముట్టుకున్నాక, మరో ఆడదాని పొందు నీవు పొందగలవా? నేనీ శరీరాన్ని పొందిన ఫలమూ, నీ మదన వికార ఫలమూ ఇప్పుడే చూడగలవు. అంటూ తటాలున లేచి భీముడు కీచకుడి మనస్సు కలతపడేలా అట్టహాసం చేసి తనభుజబలంతో కీచకుడి తలను పట్టి వంచాడు. కీచకుడు తన శక్తినంతా కూడదీసికొని వెనుకాడకుండా గట్టిగా ప్రయత్నించి విడిపించుకున్నాడు. తీవ్రమైనకోపంతో మండిపడ్డాడు.

కీచకుడు భీముడి భుజాలను తన చేతులతో పట్టి, బలంతోలాగి నేలమీద పడవేసి, ఆతని శరీరాన్ని తన మోకాళ్లతో అదిమాడు. భీముడు దెబ్బతిన్న పాములా చప్పున లేచి, అధికమైనకోప సంరంభంతో ఉప్పొంగి శరీరావయవాలతో, విజృంభించాడు. భుజబలాడంబరంతో పరస్పరం త్రోసికొంటూ కొంతసేపు భయంకరంగా పోరాడారు. ఆ సమయంలో తాను అక్కడయున్నానని ఇతరులకు తెలిస్తే అవమానమని కీచకుడు, సమయభంగం అవుతుందేమోనని భీముడు లోలోన జంకుతూ చప్పుడు చేయని పిడికిటిపోట్లతో, పరస్పరం నొప్పించుకుంటూ యుద్ధం చేశారు. ఎన్ని విధాలయినా ఎవరూ ఎవరికి తీసిపోకుండా పోరాడారు. ఒకరికొకరు అసాధ్యులన్నట్లుగా పోరు సలిపారు. క్రమంగా కీచకుడి శక్తి తరిగిపోసాగింది. భీముడి శక్తి క్రమంగా పెరుగసాగింది. అది తెలిసిన భీముడు జింకను సింహం ఆక్రమించినట్లుగా, కీచకుడిని పొదవి పట్టుకున్నాడు. కీచకుడు శక్తినంతా కూడదీసికొని పెనగులాడిపైకి లేచాడు. అయినా భీముడు కీచకుడి ఆయువుపట్టులలో పొడిచి, గుడ్లు తేలవేసేలా దారుణంగా నేలకు విసరాడు. ఫలపుష్ప భరితమైన చెట్టును కూలద్రోసే మదగజంలా, వివిధ రత్నాలంకార శోభితుడైన కీచకుడిని భీముడు పడగొట్టాడు. అయినా వికృతపు చావు చంపాలని భావించిన భీముడు కీచకుని కళేబరాన్ని పట్టుకొని, తల, చేతులు, పాదాలు మొండెంలోకి చొచ్చుకొని పోయేవిధంగా దూర్చి, చిల్లులుపడ్డ నిండు సంచిలాగా శవాన్ని నేలమీద పడవేసి, కసితీర నలిపి గుండ్రని మాంసపుముద్దను చేశాడు. కీచకుని చావును చూడటం ఎప్పుడా? అని తొందరపడుతున్న ద్రౌపదితో, కీచకుడు చచ్చాడని చెప్పి, వెంటనే రహస్యంగా నిప్పును తీసికొనివచ్చి వెలిగించి, చూడమని కీచకుడి శవాన్ని చూపాడు. సంభ్రమాశ్చర్యాలు, భయం, ప్రియం ముప్పిరిగొనగా కీచకుని శవాన్ని ద్రౌపది చూచింది. మెటికలు విరుస్తూ, తలఊపి, ఆశ్చర్యపడే మనసుతో ముక్కున వేలువేసికొని, 'కీచకా! దీనికోసమేనా ఇంతచేశావు? ఇకనైనా శాంతంగా ఉండు అట్లా విజృంభిస్తే నీకు ఇలా జరగకపోదు' – అని ద్రౌపది అన్నది. 'నేను అనుకొన్న పని చేశాను. నీ దుఃఖాన్నీ, అవమానాన్నీ తొలగించాను' – అని ఉప్పొంగే మనసుతో భీముడు ద్రౌపదితో అన్నాడు. ఇంకా 'నీ దుఃఖం తీరిందా? నా బలోద్రేకం నీ మనసు మెచ్చిందా? కోపం శాంతించిందా? దుష్టకీచకుని భంగపాటు చూశావా? సంతోషం కలిగిందా? నీ పొందుకోరుకునే నీచులకెవరికైనా సరే! ఇదే గతి' – అని పలికిన భీముని చూచి సంతోషంతో ద్రౌపది విస్మయానంద నిర్మగ్నయై భీముడి ఉత్తమ నాయకత్వాన్ని ప్రశంసించింది. ద్రౌపది చేసిన ప్రశంసను కర్ణరసాయనంగా విని, ఉప్పొంగి 'ఇక ఇక్కడ ఆలస్యం చెయ్యటం మంచిదికాదు' – అని ద్రౌపదిని హెచ్చరించి, వెంటనే వెళ్లిపోయాడు. ద్రౌపది నర్తనశాల బయటకు వచ్చి, కావలి వారిని పిలిచి కీచకమరణాన్ని ప్రకటించింది."

**– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**

తెలుగు శాఖ

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 6

# కీచక వధ - తిక్కన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - విరాటపర్వం - ద్వితీయాశ్వాసం
## (22 నుండి 361వ పద్యం వరకు)

## సమగ్ర వ్యాఖ్యలు

**ఉ.** **అక్కజమైన చెల్వమున నాత్మకు బ్రేగయి పొల్చు పొల్తిపై**
**నెక్కొను చూడ్కిఁగ్రమ్మఱుప నేరక యూరక నిల్చె గాముచే**
**జిక్కిన నెమ్మనంబు గడు జేద్పడు మానము జేష్టితంబులం**
**దక్కిన యంగముం దలుకు ధైర్యమునై యతు డప్పు డయ్యెడన్.** (భార. విరా. 2-23)

**కవిపరిచయం:** ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** తన అక్క సుదేష్ణకు నమస్కరించటానికి వచ్చిన కీచకుడు ద్రౌపది సౌందర్యాన్ని చూచి మ్రాన్పడిన సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అక్కజము + ఐన | = | ఆశ్చర్యాన్ని కలిగించే |
| చెల్వమునన్ | = | సౌందర్యంతో |
| ఆత్మకున్ | = | హృదయానికి |
| ప్రేగు + అయి పొల్చు | = | భారమై కన్పించే |
| పొల్తిపైన్ | = | స్త్రీపై |
| నెక్కొనుచూడ్కిన్ | = | నిలిచిన చూపును |
| క్రమ్మఱుపన్ + నేరక | = | మరలించలేక |
| కాముచేన్ + చిక్కిన | = | మన్మథునికి చిక్కిన |
| నెఱ + మనంబున్ | = | నిండు మనస్సూ |
| కడున్ + చేద్పడు | = | మిక్కిలి కలత పడే |
| మానమున్ | = | అభిమానమును |
| చేష్టితంబులన్ | = | చేష్టలను |
| తక్కిన | = | కోల్పోయిన |
| అంగమున్ | = | శరీరమును |
| తలుకు | = | చలించే |
| ధైర్యమును + ఐ | = | ధైర్యమునూ కలిగి |
| అతుడు | = | సింహబలుడు, అప్పుడు |
| ఆ + ఎడన్ | = | అచ్చట |
| ఊరక, నిల్చెన్ | = | వ్యర్థంగా నిలబడ్డాడు |

**తాత్పర్యం:**

సైరంధ్రీ సౌందర్యం కీచకుని హృదయానికి భారమై తోచింది. ఆమె మీద ముసిరిన చూపును మరలించలేక మథనునికి లొంగిన మనస్సుతో భంగమైన అభిమానంతో చేష్టలుడిగిన శరీరంతో చలించిన ధైర్యంతో ఏమీ చేయలేక నిల్చున్నాడు.

**సంధులు :** నెఱ + మనంబు =నెమ్మనంబు (ప్రాతాది సంధి)
అ + ఎడన్ = అయ్యెడన్ (త్రికసంధి)

**ఛందస్సు :** భ ర న భ భ ర వ
U I I /U I U /I I I /U I I / U I I /U I U /I U
అక్కజ/మైనచె/ల్వమున/నాత్మకు/మ్రేగయి/పొల్చుపొ/ల్తిపై

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

**చ. అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడిను దల్లడించు బై**
**కొను తలపోత నించు, మదిగోర్కులు పేర్చిన నప్పళించు, నె**
**ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ**
**లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుడై.** (భార. విరా. 2-31)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

ద్రౌపదీ సౌందర్యాన్ని చూచి కీచకుడు పలవించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| మనోజ, వికార మగ్నుడు | = | (కీచకుడు) మనథుని వలన మనసులో కలిగిన భావవికారాలలో మునిగినవాడై (మదన భావావేశపరుడై) |
| అని + అని | = | మాటిమాటికి |
| ఉగ్గడించున్ | = | ప్రశంసిస్తాడు |
| ధృతి | = | మనోధైర్యం |
| అల్లన్ +అల్లన్+ఆడినన్ | = | చెలించగా |
| తల్లడించున్ | = | కలవరపడతాడు |
| పైకొను | = | క్రమ్ముకొని వచ్చే |
| తలపోతన్ | = | ఆలోచనలతో |
| ఇంచున్ | = | ఆనందిస్తాడు |
| మదిన్ | = | మనస్సులో |

కోర్కులు పేర్చినన్ = కోరికలు పెల్లుబ్బగా
అప్పళించున్ = తమకిస్తాడు
నెట్టన = శీఘ్రంగా
తెగన్ + అగ్గలించున్ = తెగించటానికి ఉత్సాహం ప్రదర్శిస్తాడు
అచటన్ = అక్కడి
జనులన్ = మనుష్యులను
పరికించుచున్ = చూస్తూ
బుద్ధి + తూలినన్ = మనస్సు కలవరపడగా
వెసన్ = వెంటనే
ఎంతయున్ = మిక్కిలిగా
కళవళించున్ = తికమక పడతాడు, తల్లడిల్లుతాడు

**తాత్పర్యం:** మన్మథ వికారమగ్నుడై, ద్రౌపది సౌందర్యాన్ని గురించే మాటిమాటికీ ప్రశంసిస్తాడు. మనోధైర్యం సడలిపోయి కలవరపడతాడు. కమ్ముకొచ్చే ఆలోచనలతో సంతోషపడతాడు – మనసులో కోర్కెలు పెల్లుబికిరాగా పట్టరాని తమకంతో, ఉద్రేకపడి అనివార్యంగా తెగించే ఉత్సాహం చూపిస్తాడు. అక్కడే ఉన్న జనాన్ని చూస్తాడు. బుద్ధితూలిపోయినట్లు వెంటనే తికమక పడతాడు.

**విశే:** ఈ పద్యంలో కీచకుని ఆంగికాభినయాన్ని తిక్కనగారు హృద్యంగా వర్ణించాడు. 'మనోజవికారమగ్నుడై' – కీచకుడు చేసిన చేష్టల్ని ఇందులో చిత్రించిన తీరు అపురూపమైంది. ద్రౌపదిని చూచిన తరువాత ఉత్కటమైన రతి భావం పొందిన స్థాయిభావం ఇందులో కనిపిస్తుంది. పదేపదే ద్రౌపది సౌందర్యాన్ని ప్రస్తావించి ప్రశంసించటం, ద్రౌపది అంగీకరిస్తుందో లేదోనని ధైర్యాన్ని కోల్పోయి కలవరపడటం, ముప్పిరిగొనే వలపు తలపులతో తన్మయత్వం చెందటం, పెల్లుబికిన కోర్కెలతో తమకించటం, తెగించే ఉత్సాహం చూపించటం, బుద్ధితూలి తికమకపడటం – ఇవన్నీ ఒక పరిణామక్రమంలో వ్యక్తీకరించటం ఇందులోని విశేషం. మరో విశేషమేమంటే ఉగ్గడించు, తల్లడించు, తలపోతవించు, అప్పళించు, అగ్గలించు, పరికించు, కళవళించు – అనే అచ్చతెలుగు క్రియలు కలిగిస్తున్న అర్థశక్తి విశిష్టమైనది.

**అలంకారం:** ఒకే సమయంలో క్రియలనన్నీ గుదిగుచ్చినట్లు చెప్పి, వర్ణించటం సముచ్చయాలంకారం.

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I /I U I /U I I /I U I /I U I /I U I /U I U

అనియ/నియుగ్గ/డించుధృ/తియల్ల/లనాడి/నుదల్ల/డించుబై

**లక్షణాలూ** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నాజాభాజాజాజార" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలూ21.

**చ. పొలుతుక కాంతి యింత పొలివోమగనీ కెసలారు దార ని**
**శ్చలతు గడంగి క్రోలికొనుజాలుటు గీచకముఖ్యు లోచనం**
**బులు 'నయనం ప్రధాన' మను పూర్వవచస్స్థితి తప్పకుండుగా**
**నెలమి వహించె దక్కు గల యింద్రియ వర్గము ధిక్కరించుచున్.** (భార. విరా.2-35)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

తనను తదేకంగా చూస్తున్న కీచకుని తప్పించుకోవటానికి భయంతో ద్రౌపది ప్రదర్శించే సాత్త్వికభావాలను, తన మీది వలపుచేతనే ప్రదర్శిస్తున్న శృంగార చేష్టలుగా భావించి, ఆమెనే రెప్పవేయకుండా చూస్తున్న సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| పొలుతుక | = | స్త్రీ (ద్రౌపదియొక్క) |
| కాంతి | = | శోభ |
| ఇంత పొలివోమగన్+ఈక | = | కొంచెం కూడా వృథా కాకుండా |
| ఎసలారన్ | = | ఒప్పారగా |
| తార నిశ్చలత | = | కంటి చూపును (కనుగుడ్లను) తదేకంగా నిలిపి |
| కడంగి | = | పూని |
| క్రోలికొనన్ + చాలుటన్ | = | చూపులతో జుర్రుకొన గలగటం చేత |
| తక్కున్ + కల | = | మిగిలిన |
| ఇంద్రియవర్గమున్ | = | కన్నులు తప్ప మిగిలిన ఇంద్రియ సముదాయాన్ని |
| ధిక్కరించుచున్ | = | తిరస్కరిస్తూ |
| కీచకముఖ్యు | = | కీచకులలో శ్రేష్ఠుడైన సంహబలుడి యొక్క |
| లోచనంబులు | = | కళ్ళు |
| 'నయనం ప్రధానం' | = | కళ్ళు ముఖ్యమనే |
| పూర్వవచ్ఛస్థితి | = | పాతకాలపు సూక్తి, సామెత |
| తప్పకుండుగాన్ | = | పొల్లుపోకుండా నిజంచేసే విధంగా |
| ఎలమి వహించెన్ | = | ప్రీతిని పొందాయి. |

**తాత్పర్యం:**

ద్రౌపది శరీర సౌందర్యాన్ని కొంచెం కూడ వృధాపోనీయకుండా, తన కనుచూపుతో రెప్పపాటు వేయకుండా జుర్రుకోవాలన్న తాపత్రయంతో, చూస్తున్న కీచకుని నేత్రాలు, మిగిలిన యింద్రియాలను మించి, 'సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్' –అనే ప్రాచీన లోకోక్తిని సార్థకం చేసేవిధంగా సంతోషాన్ని పొందాయి.

**విశే:**

ఇందులో జాగరమనే మదనావస్థ స్ఫురిస్తోంది. నయన శబ్దానికి 'నీయతే అనేన ఇతినయనం' – అన్న వ్యుత్పత్తి ఇక్కడ సార్థకంగా ప్రయోగించబడింది. దీని చేత అర్థాలు పొందబడతాయి కాబట్టి నయనమనే పేరు వచ్చింది. ఇక్కడ కీచకుడు కామ్యార్థసిద్ధికి ఉపయోగించిన సాధనం 'చూపు'. ఆ చూపు సార్థకతను చమత్కారంగా ఇక్కడ వర్ణించాడు.

**అలంకారం:**

ఈ పద్యంలో లోకోక్తి, నిరుక్తి అలంకారాలున్నాయి. పదాల వ్యుత్పత్తితో నామాలకు అన్వార్థాన్ని కల్పించటం, నిరుక్తి. ఈ పద్యంలో సర్వేంద్రియాణం నయనం ప్రధానం అనే లోకోక్తికి ద్రౌపది సౌందర్యాన్ని ఆస్వాదించడంలో సార్థకంగా ప్రయోగించబడటం చేత ఇది నిరుక్తి అవుతున్నది. చూపులతో జుర్రుకోవటం అనే లోకోక్తిని "క్రోలికొనజాలుట" అని ప్రయోగించటం చేత ఇది లోకోక్తి అలంకారమగుచున్నది.

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I /I U I /U I I /I U I/I U I/I U I /U I U

పొలుతు/కకాంతి/యింతపొ/లివోమ/గనీకె/సలారు/దారని

**లక్షణాలు:** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -21.

ఉ. **'ఇయ్యరవిందగంధి కుల మేమి? చరిత్రము చంద మెట్లు? పే**
**రెయ్యది? నాథుడెవ్వఁ డిది యెచ్చట నెప్పుడు నుండు? నిప్డు దా**
**నియ్యెడ కేగుదేవలయు టేపని సేయుగు బూని? దీనిపై**
**నెయ్యము కల్మి యేకొలుది నీ మది? కింతయు నాకు జెప్పుమా!'** (భార.విరా. 2-40)

**కవిపరిచయం:** ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుడు తన అక్క సుదేష్ణద్వారా, ద్రౌపదికి సంబంధించిన వివరాలను అడిగే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఈ + అరవిందగంధి | = | (పద్మగంధం వంటి మేని వాసనగల) ఈ వనిత యొక్క |
| కులము | = | వంశం, జాతి |
| ఏమి? | = | ఏమిటి? |
| చరిత్రము చందము | = | నడవడిక పద్ధతి |
| ఎట్లు? | = | ఎటువంటిది? |
| పేరు | = | నామం |
| ఏ + అది | = | ఏది |
| నాథుడు | = | భర్త |
| ఎవ్వఁడు | = | ఎవడు? |
| ఇది | = | ఈమె |
| ఎచ్చటన్ | = | ఎక్కడ |
| ఎప్పుడున్ | = | ఎల్లప్పుడు |
| ఉండున్? | = | ఉంటుంది? |
| ఇప్డు | = | ఇప్పుడు |
| తాన్ | = | తాను |
| ఈ+ఎడకున్ | = | ఇక్కడికి |

| | | |
|---|---|---|
| ఏగుదేవలయుట | = | రావటం |
| ఏ పని + చేయుగన్ + పూని? | = | ఏ పని చేయటానికి? |
| నీ మదికిన్ | = | నీ మనస్సుకు |
| దీనిపైన్ | = | ఈమె మీద |
| నెయ్యముకల్మి | = | ప్రేమ సంపద |
| ఏ + కొలది? | = | ఎంతటిది |
| నాకున్ | = | నాకు (కీచకుడికి) |
| ఇంతయున్ | = | ఈ వివరాలన్నీ |
| చెప్పుమా! | = | చెప్పాలి సుమా! |

**తాత్పర్యం:**

పద్మాల వాసనవంటి మేని వాసనగల ఈమె కులం ఏమిటి? నడవడిక తీరు ఏలాటిది? పేరేమిటి? భర్త ఎవరు? ఎక్కడ ఉంటుంది? ఏ పని చేయటానికి ఇక్కడకు వచ్చింది. నీ మనసులో ఈమెపట్ల ఉన్న ప్రేమ ఏపాటిది? ఆ వివరాలన్నీ నాకు చెప్పుసుమా!

**విశే:**

సిగ్గులేకుండా, స్థాయిని మరచి కులం, నడవడిక, పేరు, భర్త, నివాసపు వివరాలు, చేసేపని, మనసులో ఆమె పట్ల యజమానురాలైన సుదేష్ణకు ఉన్న అభిప్రాయం ఈ విధంగా ప్రశ్నలన్నీ ఒకదానివెంట ఒకటి వదలకుండా వేయటంలో కీచకునికి ద్రౌపదిపట్ల ఎంతటి తమకం ఉందో తెలియజేస్తుంది. 'అరవిందగంధి' – అని ద్రౌపదిని గురించి చెప్పిన విశేషం, ద్రౌపది పద్మినీజాతి స్త్రీయని తెలియజెప్పటమే. కీచకుని మనోధోరణి సుదేష్ణకు అర్థమయ్యేలా ఉంది. ఈ పద్యం. పైగా సైరంధ్రి నడవడికను అడగటంలో ఆతని ఉద్దేశం, ఆమె వర్తనలో ఏమైనా జారుపాటు ఉంటే అది తనకు కలిసివస్తుందన్న అభిప్రాయమే.

**సంధులు:** ఈ + అరవిందగంధి = ఇయ్యరవిందగంధి (త్రికసంధి)
చరిత్రము + చందము = చరిత్రము చందము (పుంప్వాదేశసంధి)
(పు ంపులు విభాష కాబట్టి, అదిరాని రూపమిది.)

**సమాసాలు:** అరవిందగంధి = అరవిందమువంటి గంధము కలది (బహువ్రీహి)
నెయ్యమి కల్మి = నెయ్యమనే కల్మి (రూపక సమాసం)

**ఛందస్సు :** భ ర న భ భ ర వ
U I I /U I U/I I I /U I I /U I I /U I U /I U
ఇయ్యర/విందగం/ధికుల/మేమి?చ/రిత్రము/చందమె/ట్లు?పే

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

**శా. 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర**
**ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పుతుల్**

**గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గట్టి గం**
**ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!'** (భార. విరా. 2-55)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుని మాటలకు కోపించిన ద్రౌపది కీచకుని బెదిరించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కీచకా! | = | ఓ కీచకా! |
| మత్పతుల్ | = | నా భర్తలు |
| దుర్వార | = | అడ్డులేని |
| ఉద్యమ | = | ప్రయత్నంగల |
| బాహువిక్రమ | = | భుజబల పరాక్రమం యొక్క |
| రస | = | సారంచేత |
| అస్తోక | = | తక్కువగాని |
| ప్రతాప | = | పరాక్రమం చేత |
| స్ఫురత్ | = | ప్రకాశిస్తున్న |
| గర్వ | = | గర్వంచేత |
| అంధ | = | గుడ్డివాళ్ళయిన |
| ప్రతివీర | = | శత్రువుల యొక్క |
| నిర్మథన | = | వధించటమనే |
| విద్యాపారగుల్ | = | విద్యలో పారంగతులు |
| గీర్వాణ + ఆకృతులు | = | దేవతలతో సమానమైన రూపాలు కలవారు |
| గంధర్వుల్ + ఏవురు | = | గంధర్వులైదుగురు |
| నినున్ | = | నిన్ను |
| దోర్లీలన్ | = | భుజబల విలాసంతో |
| వెసన్ + కిట్టి | = | వెంటనే ఎగిరించి |
| ఏ+ మెయిన్ | = | ఏ విధంగానైనా |
| మానమున్+ప్రాణమున్+కొనుట | = | నీ పరువునూ, ప్రాణాన్నీ, హరించడం |
| తథ్యం | = | తప్పదు. |

**తాత్పర్యం:**

ఓరీ కీచకా! అనివార్యమైన భుజబల పరాక్రమంతో గర్వాంధులైన శత్రువులను వధించటమనే విద్యను ఆమూలాగ్రం చదివినవారు నా భర్తలు. దేవతాకారులు అయిన అయిదుగురు గంధర్వులు నా పతులు. వారు తమ భుజబలవిలాసంతో అవలీలగా ఇప్పుడే నిన్నెదిరించి, ఏ విధంగానైనా నీ ప్రాణాన్నీ పరువునూ హరించటం ఖాయం.

**విశే:**

భారతంలోని విశేష పద్యాలలో ఇది ఒకటి. ఈ 'కీచక వధ' ఘట్టంలోనే ఈ పద్యం పునరావృత్తమవుతుంది. అంటే తిక్కనగారే ఈ పద్యానికి ఆకర్షితులయ్యారని అనిపిస్తుంది. పద్యంలో కీచకునికి భయాన్ని కలిగిస్తూ గంభీరంగా 'దుర్వారోద్యమ...... విద్యాపారగుల్' - అనే సమాస చాలనంతో మాట్లాడింది. విద్యాపారగుల్, మత్పతుల్, గీర్వాణాకృతుల్, గంధర్వుల్ అనే హలంత పదాలు ఎదుటివాడికి దడుపు జ్వరాన్ని రప్పించేటందుకు తగిన విధంగా ఉన్నాయి. తిక్కన వాడిన దీర్ఘ సమాసం ద్రౌపది గాంభీర్యాన్ని తెలుపుతోంది.

శార్దూల వృత్తంలో ద్రౌపది క్రోధాన్ని తెలిపి తిక్కన ఔచిత్యాన్ని పాటించాడు.

**సంధులు:** రస + అస్తోక = రసాస్తోక (సవర్ణదీర్ఘసంధి)
ద్దో + లీలన్ = దోర్లీలన్ (రేఫాదేశ విసర్గ సంధి)
వెసన్ + కిట్టి = వెసంగిట్టి (ద్రుతసంధి)

**సమాసాలు:** విద్యాపారగులు = విద్యయందు పారగులు (తత్పురుష సమాసం)
గీర్వాణాకృతులు = దేవతల వంటి రూపంగలవారు (ఉపమిత సమాసం)

**ఛందస్సు :** మ స జ స త త గ
U U U/I I U/I U I/I I U/U U I/U U I/U
దుర్వారో/ద్యమబా/హువిక్ర/మరసా/స్తోకప్ర/తాపస్ఫు/ర

**లక్షణాలు:**

శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

**ఉ. ఉల్లము దల్లడిల్లు దను వుద్గత ఘర్మజలంబు దాల్చుచున్**
**డిల్లపడంగ 'నా కిది కడింది విచారము పుట్టె; నందుబో**
**నొల్ల ననంగ రా, దచటి కూరక పోవను రాదు, నేర్పు సం**
**ధిల్లగ దీని బాపికొను దీమస మెట్టిది యొక్కొదైవమా!'** (భార. విరా. 2-91)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

కీచకుడి ఇంట్లో ఎప్పుడూ మంచిరుచిగల మద్యముంటుంది. వెళ్లి వేగంగా తీసుకురమ్మని అన్న సుదేష్ణ మాటలలోని ఆంతర్యాన్ని గమనించి మనసులో ద్రౌపది బాధపడే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

ఉల్లము = మనస్సు
తల్లడిల్లన్ = అల్లాడిపోగా

| | | |
|---|---|---|
| తనువు | = | శరీరం |
| ఉద్గత ఘర్మజలంబు | = | పెల్లుబికిన చెమటను |
| తాల్చుచున్ | = | ధరిస్తూ |
| డిల్లపడంగన్ | = | భయంతో నీరసపడగా |
| ఇది | = | సుదేష్ణ ఆదేశం వలన |
| నాకున్ | = | నాకు |
| కడింది విచారము | = | అధిక దుఃఖం |
| పుట్టెన్ | = | కలిగింది |
| అందున్ | = | కీచకుని ఇంటికి |
| పోన్ + ఒల్లను | = | వెళ్ళటానికి ఇష్టంలేదు |
| అనంగరాదు | = | అనటానికి వీలుకాదు |
| అచటికిన్ + ఊరక పోవను రాదు | = | అక్కడికి నిస్సహాయంగా (ఒంటరిగా) వెళ్ళటానికీ వీలులేదు |
| దైవమా! | = | ఓ భగవంతుడా |
| నేర్పు + సంధిల్లుగన్ | = | నైపుణ్యంతో |
| దీనిన్ | = | ఈ సమస్యను |
| పాపికొను | = | వదిలించుకొనే |
| దీమసము | = | ఉపాయము |
| ఎట్టిది + ఒక్కొ | = | ఎలాంటిదో కదా! |

**తాత్పర్యం:**

మనసు తల్లడిల్లుతోంది. శరీరమంతా చెమటపట్టింది. దేహం నీరసపడింది. ఈ సుదేష్ణ ఆదేశం నామనసుకు దుఃఖ కారకమవుతున్నది. కీచకుని కొంపకు వెళ్లటం ఇష్టంలేదని అనటానికి వీలులేదు. అలాగని అక్కడికి ఒంటరిగా పోనూ లేను. ఓ భగవంతుడా! నేర్పుతో ఈ సమస్యనుండి బయటపడే ఉపాయం ఏమిటో?

**విశే:**

వ్యాసభారతంలో ద్రౌపది ఇటువంటి మానసిక క్షోభకు గురయినట్లు లేదు. సుదేష్ణతో వెళ్లనని కరాఖండిగా చెపుతుంది. తన అభిమానం, నిస్సహాయస్థితి రెండింటి మధ్య ఊగిసలాడే ద్రౌపది మానసిక స్థితిని తిక్కన ఎంతో రమ్యంగా ఇందులో చిత్రించాడు. మాటలతో బొమ్మకట్టి చూపటమంటే ఇదే. తిక్కనగారిలో ఈ శైలి సర్వత్రా కనిపిస్తుంది.

**వ్యాకరణకార్యాలు:**

**సంధులు:** ఉల్లము + తల్లడిల్లన్ = ఉల్లముదల్లడిల్లన్ (గసడదవాదేశసంధి)
సూ॥ ప్రథమమీది పరుషములకు గసడదవలగు.
తీమసము + ఎట్టిది = తీమసమెట్టిది (ఉత్వసంధి)

**సమాసాలు:** ఘర్మజలము = ఘర్మపు జలం (తత్పురుష సమాసం)
కడింది విచారము = మిక్కిలి విచారము (కర్మధారయ సమాసం)

**అలంకారం:** వికల్పాలంకారం.

**లక్షణం:** సమాన బలంగల రెండు విరుద్ధాంశాల మధ్య వికల్పాన్ని చెప్పటం వికల్పాలంకార లక్షణం. సైరంధ్రిగా, సేవకురాలిగా ఉన్న ద్రౌపది, రాణియైన సుదేష్ణమాటను తిరస్కరించటానికి వీలులేదు. అలాగని పోతే కీచకుని వలన జరగబోయే ప్రమాదమూ తెలుస్తోంది. పోలేక, రాణి ఆజ్ఞను తిరస్కరించలేక ఊగిసలాడుతోన్న ద్రౌపది మనస్సంఘర్షణ ఇక్కడ కనిపిస్తుంది.

**ఛందస్సు :** భ ర న భ భ ర వ

U I I /U I U/ I I I /U I I /U I I /U I U /I U

ఉల్లము/దల్లడి/ల్లుదను/వుద్గత/ఘర్మజ/లంబుదా/ల్చుచున్

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

**ఉ. సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే**
**బాధలు బొందకుండు దమపాల వసించిను బెద్దవారు ది**
**క్కై ధరియించి వారికొక యాపద వుట్టకయుండు గాచు టొ**
**ప్పై ధరు కీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద వుట్టదే?** (భార.విరా. 2-95)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

కీచకుని యింటనున్న కల్లు తెమ్మని ద్రౌపదిని సుదేష్ణ ఆజ్ఞాపించినప్పుడు, ద్రౌపది అన్న మాటలివి. 'నీ ఇంట్లో సదాచార సంపన్నత ఉన్నదన్న నమ్మకంతో నా భర్తలు దగ్గరగా లేకున్నా ధైర్యంగా ఉన్నాను. మర్యాద తప్పటం న్యాయమా? అని ద్రౌపది అనే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| సాధులు | = | సజ్జనులు |
| నెమ్మిగన్ | = | సంతోషంతో |
| చేరి | = | చేరి |
| నిజస్థిరవృత్తము | = | తమ నిశ్చల సదాచార ప్రవర్తన |
| దుష్టకోటిచేన్ | = | దుర్మార్గులచేత |
| బాధలన్ + పొందకుండన్ | = | బాధలుపడకుండా |
| తమపాలన్ + వసించినన్ | = | తమ వద్ద నివశిస్తుంటే |
| పెద్దవారు | = | ఉన్నతులైన వారు |
| దిక్కు + ఐ | = | శరణమై |
| ధరియించి | = | బాధ్యత వహించి |
| వారికిన్ | = | ఆశ్రయించిన సజ్జనులకు |

| | | |
|---|---|---|
| ఒక ఆపద+పుట్టక+ఉండన్ | = | ఏ విధమైన ఆపదా కలగకుండా |
| కాచుట | = | కాపాడటం |
| ఒప్పు + ఐ | = | తగినదై |
| ధరన్ + కీర్తికిన్ + ఎక్కదె? | = | లోకంలో ప్రశస్తి పొందదా? |
| అపాయముచేసినన్ | = | కీడు కలిగిస్తే |
| నింద + పుట్టదే | = | నింద కలుగదా? |

**తాత్పర్యం:**

సజ్జనులు నిశ్చలమైన తమ సదాచార వృత్తి దుర్మార్గుల చేత ఇబ్బందులపాలు కాకుండా, పెద్దలైన వారిని ఆశ్రయిస్తే వాళ్లు తమను ఆశ్రయించిన వారిని ఎటువంటి ఇబ్బందులు రాకుండా రక్షించటం లోకంలో ఉన్నదే. అలా రక్షించి కీర్తిని పొందుతారు. అలా కాకుండ కీడు కలిగిస్తే అపకీర్త కలుగదా?

**విశే:**

సజ్జన ధర్మాన్ని చెప్పటం ఇందులో కనిపిస్తుంది. ఆ ధర్మాన్ని విరాటరాజుకు, సుదేష్ణ అంత్ణపురానికి వ్యంగ్యంగా అన్వయించి చెప్పటం ఇందులోని ప్రధానాంశం.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** సాధులు + చేరి = సాధులుసేరి (గసడదవాదేశసంధి)
వారికి + ఒక = వారికొక (ఉత్వసంధి)

**సమాసాలు:** దుష్టకోటి = దుష్టసమూహము (కర్మధారయ సమాసం)
నిజస్థిరవృత్తము= నిజమైన స్థిరమైన వృత్తము (కర్మధారయ సమాసం)

**ఛందస్సు :** భ ర న భ భ ర వ
U I I /UIU/I I I /UI I /UI I /UI U/I U
సాధులు/సేరినె/మ్మిగని/జస్థిర/వృత్తము/దుష్టకో/టిచే

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో “భ-ర-న-భ-భ-ర-వ” అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

చ. **అలమటు బొంది మాయ విధియా! యని దైవము దూఱు, నిత్తఱిం**
**గలరొకొ నాకు దిక్కను, మొగంబున నశ్రులు వెల్లిగొల్పు, దొ**
**ట్రిలుబడు, జల్లనం జెదరు దెందము గూడుగుదెచ్చి నన్ను గే**
**వలమున ముట్టనెవ్వరికి వచ్చుననుం, గలుగున్, వెనుంబడున్.** (భార. విరా. 2-104)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుని యింటికి పోతూ ద్రౌపది పొందిన నిర్వేదాన్ని, మనసులో పొందిన బాధను వర్ణించిచెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అలమటన్ + పొంది | = | చింతపడి |
| దైవమున్ | = | భగవంతుడిని |
| మాయవిధియా + అని | = | మాయదారి దైవమా |
| దూఱున్ | = | నిందిస్తుంది |
| ఈ + తఱిన్ | = | ఈ సమయంలో |
| నాకున్ | = | నాకు |
| దిక్కుకలరు + ఒకొ అనున్ | = | అండగా ఎవరైనా ఉన్నారా అని అంటుంది |
| మొగంబునన్ | = | ముఖం మీద |
| అశ్రులు వెల్లి + కొల్పున్ | = | కన్నీళ్ళను ధారగా కారుస్తుంది |
| తొట్రిలన్ + పడున్ | = | తడబడుతుంది |
| జల్లు + అనన్ | = | జల్లుమనేటట్లు |
| చెదరుడెందమున్ | = | చలించే మనస్సును |
| కూడు గన్ + తెచ్చి | = | కూడదీసికొని |
| నన్నున్ | = | నన్ను |
| కేవలమునన్ | = | సాధారణంగా |
| ముట్టన్ | = | తాకటానికి |
| ఎవ్వరికిన్ + వచ్చున్ | = | ఎవ్వరికి సాధ్యపడుతుంది |
| అనున్ | = | అంటుంది |
| కలుగున్ | = | కలతపడుతుంది |
| వెనున్ + పడున్ | = | వెనుకకు తగ్గుతుంది. |

**తాత్పర్యం:**

ద్రౌపదిమనసులో చింతిస్తూ దైవాన్ని 'మాయవిధీ' – అని తిడుతుంది. తనకు దిక్కెవ్వరైనా ఉన్నారా? అని అంటుంది. ముఖం మీద కారేలాగా కన్నీరు కారుస్తుంది. తడబడుతుంది. జల్లుమనేలా చెదిరేమనస్సును కూడగట్టుకొని 'నన్నుతాకటానికి ఎవరికి సాధ్యమవుతుందిలెమ్మని అంటుంది. కలతపడుతుంది. అంతలోనే వెనుకకు తగ్గుతుంది.

**విశే:**

ద్రౌపది హృదయంలోని నిర్వేదంతోపాటు, కలిగిన వివిధ అనుభావాలను సహజంగా ఇందులో వర్ణించటం ప్రధానాంశం. ద్రౌపదీ దేవి హృదయంలోని భావశబలత ఈ పద్యంలో చక్కగా వ్యంజింపబడింది.

**వ్యాకరణకార్యాలు**

| | | | |
|---|---|---|---|
| **సంధులు:** | అలమటన్ + పొంది | = | అలమటుబొంది (ద్రుతసంధి) |
| | వెల్లి + కొల్పు | = | వెల్లిగొల్పు (గసడదవాదేశసంధి) |
| | వెనున్ + పడున్ | = | వెనుంబడున్ (ద్రుతసంధి) |

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I / I U I /U I I / I U I /I U I /I U I /U I U

అలమ/టుబొంది/మాయవి/ధియా!య/నిదైవ/ముదూఱు/నిత్తఱిం

**లక్షణాలు –** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నాజాభాజాజాజార" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలూ21.

**చ. కనుగొని కోప వేగమును గన్నుల నిప్పులు రాల, నంగము**
**ల్గనలుగ, సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంతదంతపీ**
**డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్తన**
**ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై** (భార. విరా. 2-133)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

ద్రౌపది వెంటబడిన కీచకుడు, ద్రౌపది జుట్టుముడిని పట్టుకొని లాగి, జంకుగొంకూ లేకుండా నేలమీద కూలద్రోశాడు. ఆ సమయంలో ద్రౌపదిని కాపుకాచే రక్కసుడు కీచకుని నేలపై పడతోశాడు. ఆ సమయంలో అన్న ధర్మరాజుతోపాటు కొలువులో ఉన్న భీముడు, ద్రౌపదికి జరిగిన అవమానాన్నీ, కీచకుని పొగరుబోతుతనాన్నీ చూచి ఉడికిపోయిన సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కనుగొని | = | చూచి |
| కోపవేగమునన్ | = | కోపభావం యొక్క తీవ్రత చేత |
| కన్నులన్ | = | కన్నుల నుండి |
| నిప్పులు రాలన్ | = | నిప్పులు కురియగా |
| అంగముల్ + కనలుగన్ | = | అవయవాలు కాగిపోగా |
| సాంద్ర ఘర్మ సలిలంబులు | = | దట్టంగా చెమట బిందువులు |
| క్రమ్మన్ | = | కమ్మగా |
| నితాంత | = | ఎడతెగకుండా |
| దంతపీడన | = | పండ్లు కొరకటంచేత |
| రటత్ | = | చప్పుడు చేస్తున్న |
| ఆస్యరంగ | = | ముఖమనే రంగస్థలంపై |
| వికట | = | వంకలు తిరిగిన |
| భ్రుకుటీ | = | బొమముడియొక్క |
| చటుల | = | కదలికవలన |
| ప్రవృత్త | = | ఏర్పడిన |
| నర్తన | = | నాట్యం యొక్క |
| ఘటనా | = | అమరిక యొక్క |

| | | |
|---|---|---|
| ప్రకార | = | పద్ధతి చేత |
| భయద | = | భయాన్ని కలిగించే |
| స్ఫురణా | = | ప్రకాశం చేత |
| పరిణద్ధ | = | రూపొందిన |
| మూర్తి + ఐ | = | ఆకారం కలవాడై |

**తాత్పర్యం:**

కీచకుడి దుష్టచేష్టను కోపతీవ్రతతో చూచిన భీముడు కళ్లనుండి నిప్పులు రాలుతుండగా, చెమట బిందువులు దట్టంగా పట్టగా, ఆగకుండా పళ్లు కొరకటం చేత, చప్పుడు చేస్తున్న ముఖమనే రంగస్థలంపై, వంపులు తిరిగిన కనుబొమల కదలికలతో ఏర్పడిన నాట్యప్రదర్శన వైఖరి భయాన్ని కలిగించే రూపం ధరించినట్లున్న ఆకారం గలవాడై (తరువాతి పద్యంతో అన్వయం)

**విశే:**

తిక్కనగారి రసాభ్యుచిత బంధానికి నిక్కమైన ఉదాహరణ. ఆంధ్రసాహిత్యంలో ప్రసిద్ధమైన పద్యాలలో ఇదొకటి. భీముని కోపాన్ని అభినయ రూపంగా చెప్పిన పద్యమిది. భీముని కడుపులోని మంట ఒక్కసారి భగ్గుమంది. అది కళ్లల్లో నిప్పులై కురిసింది. ద్రౌపదిని అవమానించిన వాడిపై ప్రతీకారం తీర్చుకోవాలన్న భావన మనసులో తీవ్రంగా ఉన్నప్పటికీ అసహాయంగా చూడవలసిన స్థితి. ఫలితంగా చెమట పట్టటం, పళ్లునూరటం, కనుబొమలుకదిలించటం, ఇవన్నీ నాట్య ప్రదర్శనలతో రూపించాడు తిక్కన. క్రోధం నర్తకి. ఆ నర్తకి ముఖమనే రంగస్థలంపై, పళ్లు పటపటలాడించటమనే గజ్జెల సవ్వడి, నాట్యవైఖరులనే విన్యాసం చేస్తోంది. ఓజోగుణ భూయిష్టమైన రచన.

**వ్యాకరణ కార్యాలు:**

**సంధులు:** అంగముల్ + కనలుగ = అంగముల్గనలుగ (గసడదవాదేశసంధి)
రటత్ + ఆస్యరంగము = రటదాస్యరంగము (జశ్త్వసంధి)

**సమాసాలు:** కోపవేగము = కోపము యొక్క వేగము (షష్ఠీ తత్పురుష సమాసం)
సాంద్రఘర్మసలిలంబులు =సాంద్రమైన ఘర్మసలిలములు (కర్మధారయ సమాసం)
ఆస్యరంగము = ఆస్యమనే రంగము (రూపక సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర
I I I/I U I/U I I /I U I /I U I /I U I /U I U
కనుగొ/నికోప/వేగము/నుగన్ను/లనిప్పు/లురాల/నంగము

**లక్షణాలు** – చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నాజాభాజాజాజార" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలూ21.

**అలంకారం:**

రూపకాలంకారం. ఆస్యాన్ని రంగ స్థలంతో ఆరోపించి, క్రోధనర్తకి నృత్యాన్ని చెప్పటం ఇందులోని అంశం కాబట్టి రూపకం. తకార, రకార, టకారాల పునరావృత్తి వల్ల ఇది ....

**మ. 'వలలుం దెక్కడు జూచె నొండెడ ననేవృక్ష్మాజముల్ పుట్టవే?**
**ఫలితంబై వరశాఖ లొప్పుగ ననల్పప్రీతి సంధించుచున్**

**విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా**
**గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపగా నేటికిన్?'** (భార.విరా. 2-136)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

కీచకుడు, ద్రౌపది పట్ల ప్రవర్తించిన తీరుకు క్రుద్ధుడైన భీముడు, తన అజ్ఞాతవాస ప్రతిజ్ఞను మరచిపోయి, కీచకుడిని తుదముట్టించాలని దగ్గరలోనున్న పెద్ద చెట్టును పెకలించాలని భావించినప్పుడు గమనించిన ధర్మరాజు, వారించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| వలలుండు | = | వలలుడు అనే పేరుతో వ్యవహరిస్తున్న వంటవాడు (భీముడు) |
| ఎక్కడన్ + చూచెన్ | = | ఎక్కడ చూచాడో |
| ఒందు + ఎడన్ | = | మరొకచోట |
| అసేవ్యక్ష్మాజముల్ | = | ఉపయోగపడని చెట్లు |
| పుట్టవే? | = | పుట్టవా? |
| ఫలితంబు + ఐ | = | పండ్లు కాచినదై |
| వరశాఖలు + ఒప్పుగన్ | = | మంచి కొమ్మలు కలుగగా |
| అనల్పప్రీతిన్ | = | మిక్కిలి సంతోషాన్ని |
| సంధించుచున్ | = | కలిగిస్తూ |
| విలసత్ + ఛాయన్ | = | ప్రకాశిస్తున్న నీడతో |
| ఉప + ఆశ్రిత ప్రతతకిన్ | = | తనను ఆశ్రయించిన జనసమూహానికి |
| విశ్రాంతి + కావింపగాన్ + కల | = | ఊరట కలిగించగల |
| ఈ భూజమున్ | = | ఈ చెట్టు |
| వంటకట్టియలకై | = | వంటకట్టెలకొరకు |
| ఖండింపగాన్ + ఏటికిన్? | = | నరికి వెయ్యడం దేనికి? |

**తాత్పర్యం:**

వలలుడు ఈ చెట్టును ఎక్కడ చూశాడు. మరొక చోట ఉపయోగపడని చెట్లు లేవా? పండ్లతో, మంచి కొమ్మలతో, సంతోషాన్ని కలిగిస్తూ, విశాలమైన నీడతో, చెంతకు చేరిన వారి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెల కోసం నరకటం దేనికి?

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** వలలుండు + ఎక్కడ = వలలుండెక్కడ (ఉత్వసంధి)
విలసత్ + ఛాయ =విలసచ్ఛాయ (శ్చుత్వసంధి)

**సమాసాలు:** అసేవ్యక్ష్మాజముల్ - అసేవ్యమైన క్ష్మాజముల్ (తత్పురుష సమాసం)
అనల్పప్రీతి - అనల్పమైన ప్రీతి (కర్మధారయ సమాసం)

**ఛందస్సు :** స భ ర న మ య వ

I I U /U I I /U I U /I I I /UUU /I U U /I U

వలలుం/డెక్కడు/జూచెనొం/డెడన/సేవ్యక్ష్మా/జముల్‌పు/ట్టవే?

**లక్షణాలు –** మత్తేభం. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "స-భ-ర-న-మ-య-వ" అనే గణాలుంటాయి. యతి 14వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు – 20.

**అలంకారం:** గూఢోక్తి లక్షణం, ప్రస్తుతాంకురం.

**లక్షణం:**

ఒక విషయాన్ని ఒకరికి చెప్పదలచి, అది పక్కనున్న వాళ్లకు తెలియకుండా గూఢంగా చెప్పటం గూఢోక్తి. సమన్వయరా కీచకుడిని విరాటుడిని మట్టుపెట్టాలని యత్నించే భీమునికి మాత్రమే తెలిసేలా అన్యాపదేశంగా చెప్పటం ఇందులో ఉంది. ధర్మజుని మాటలు గూఢోక్తులు. అందుచేత ఇది గూఢోక్త్యలంకారం.

**ప్రస్తుతాంకురం –**

ప్రస్తుత వర్ణన చేత ప్రస్తుతమే స్ఫురించటం ప్రస్తుతాంకురం. ధర్మరాజు, వలలుని మనసు తెలిసి అన్యాపదేశంగా గూఢోక్తులు పలికినా, వలలుడని పేరు ప్రస్తావించటం చేత భీముడి ప్రసక్తి గూఢంగా వంట వాడన్న పేరు బాహాటంగానే తెలుస్తున్నది. రెండూ ప్రస్తుతాలే కాబట్టి ఇది ప్రస్తుతాంకురం. చెట్టును విరాటుడితో రూపించి, ఇది విస్తారమైన నీడతో, ఆశ్రితుల సేదదీర్చే చెట్టు. అంటే ఆశ్రయమిచ్చిన చెట్టు విరాటుడని తాత్పర్యం. ఆ చెట్టును భగ్నం చేస్తే తమనుతామే నాశనం చేసుకున్నట్లు. ఇది భీమద్రౌపదులకు మాత్రమే అర్థమయ్యే విషయం. ఇతరులకు బాటసారులకు ఉపయోగపడే ఈ చెట్టును వంటకట్టెలకోసం కొట్టటం అనుచితమని.

చ. **'ఎఱిగి యెఱింగి నన్నడుగ నేమిటి? కప్పు డెఱింగి యింతకు**
**న్మఱచుట గల్గెనే, నది వినం బనిలే; దటుగాక యున్న రూ**
**పెఱిగియు నేన చెప్ప విన నిష్టము గల్గుట చాల లెస్స; య**
**త్తెఱు గెఱిగించెదన్ వినుము తెల్లముగా మొదలింటినుండియున్.** (భార. విరా. 2-169)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

తన పరాభవ దుఃఖాన్ని చెప్పుకోవటానికి రాత్రివేళ వంటింట్లో నిద్రపోతున్న భీముని వద్దకు ద్రౌపది వెళ్లింది. కీచకుని దుష్టత్వాన్ని ద్రౌపది నోటనే విననెంచిన భీముడు 'ఇంత రాత్రివేళ వచ్చిన కారణమేమిటి? ఎవరు? గమనించలేదుకదా! – అని అనగా ద్రౌపది భీమునితో అన్న మాటలివి.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఎఱిగి + ఎఱింగి | = | తెలిసి తెలిసి (బాగా తెలిసికూడా) |
| నన్నున్ + అడుగన్ + ఏమిటికిన్ | = | నన్నడగటం దేనికి? |
| అప్పుడు | = | ఆ సమయంలో (కొలువు దగ్గర జరిగిన సంఘటన సందర్భంలో) |
| ఎఱింగి | = | తెలిసి |

| | | |
|---|---|---|
| ఇంతకున్ + మఱచుట | = | ఇంతలో మరచిపోవటం |
| కల్గెన్ + ఏన్ | = | జరిగివుంటే |
| అది వినన్ + పనిలేదు | = | దానిని గూర్చి వినవలసిన అవసరంలేదు |
| అటు + కాక | = | అలాకాక |
| ఉన్న రూపు + ఎఱిగియున్ | = | ఉన్నదంతా తెలిసి కూడా |
| నేను + అ చెప్పన్ + వినన్ | = | నేనే చెప్పగా వినాలని |
| ఇష్టము + కల్గుట | = | ఇష్టపడటం |
| చాల లెస్స | = | చాలా బాగుంది |
| మొదలించి నుండియున్ | = | మొదటి నుండీ |
| ఆ తెఱుగు | = | వరుసగా ఆ కథను |
| తెల్లముగాన్ | = | స్పష్టంగా |
| ఎఱిగించెదన్ | = | తెలియజెబుతాను |
| వినుము | = | వినుము. |

**తాత్పర్యం:**

తెలిసి తెలిసీ నన్నడగటం దేనికి? కొలువు దగ్గర జరిగిన సంఘటన సందర్భం తెలిసి కూడ ఇంతలోనే మరచిపోతే, దానిని గురించి వినవలసిన పనిలేదు. అట్లా కాకుండ విషయమంతా తెలిసికూడ నానోటితోనే వినాలని ఇష్టపడటం చాలాబాగుంది! అయితే విను! మొదటినుండి స్పష్టంగా చెపుతాను.

**విశే:**

తిక్కనగారి రసాభ్యుచిత బంధానికి యిదొక ఉదాహరణ. ద్రౌపది ఎంతటి వివేకవంతురాలో తెలియజెప్పే సందర్భమిది. తెలిసే, కావాలని అడుగుతున్న భీముని మనసును కనిపెట్టి, ఎత్తిపొడిచి మరీ చెప్పింది. విరాటుని సభ వద్ద, ద్రౌపదికి కీచకుని వలన కలిగిన భంగపాటు మాత్రమే తెలుసుగాని, దాని పూర్వాపరాలు భీమునకు తెలియవు. వాటిని, అవమానితయైన ద్రౌపది నోట చెప్పించటం భీముని కోపాగ్నిని రౌద్రాగ్నిగా మార్చే ప్రయత్నమే.

**వ్యాకరణకార్యాలు:**

**సంధులు :** ఎఱిగి + ఎఱిగి = ఎఱిగియెఱిగి = (ఇత్త్వసంధి)
ఆ + తెఱగు = అత్తెఱగు (త్రికసంధి
రూపు + ఎఱిగియు = రూపెఱిగియు (ఉత్త్వసంధి)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర
। । ।/। ∪ ।/∪। ।/। ∪। /। ∪ ।/। ∪ ।/∪। ∪
ఎఱుగి/యెఱింగి/నన్నడు/గనేమి/టి?కప్పు/డెఱింగి/యింతకు

**లక్షణాలూ** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో “న-జ-భ-జ-జ-జ-ర” అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు - 21.

**ఉ.** **నీ వలమూపులావు మును నేల వహించిన నాగకూర్మ గో**
**త్రావనిభృద్దిశాకరుల కారయ నూఱటపట్టు గాదె? సం**

**భావన భూజనంబులకు బండువు గాదె? మహెూగ్ర కోప రే**
**ఖావిభవంబు వైరులకు గాలము చేరువ గాదె పావనీ!** (భార. విరా. 2-193)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

రాత్రివేళ ద్రౌపది భీముని కలిసి, కీచకుని వలన తనకు జరిగిన భంగపాటునంతా విడమర్చి చెప్పి, ధర్మరాజును కీర్తించి అంతటి మహితాత్ముడైన ధర్మరాజు, కూడూ గుడ్డకోసం దీనంగా అజ్ఞాతవాసం చేయటం దుఖకారకమని చెప్పి, భీమని పరాక్రమాన్ని ప్రస్తుతించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| పావనీ! | = | పవనపుత్రుడవైన ఓ భీమా! |
| ఆరయన్ | = | పరిశీలించగా |
| నీ వలమూపులావు | = | నీ కుడిభుజబలం |
| మును | = | పూర్వం |
| నేలన్ + వహించిన | = | భూభారాన్ని మోసిన |
| నాగ | = | ఆదిశేషువు, |
| కూర్మ | = | తాబేలు, |
| గోత్ర + అవనిభృత్ | = | కులపర్వతాలకు |
| దిశాకరులకు | = | దిగ్గజాలకు |
| ఊఱటపట్టు + కాదె | = | విశ్రాంతికి స్థానం కాదా? |
| సంభావన | = | నీవు గౌరవించటం |
| భూజనంబులకున్ | = | లోకులకు |
| పండువు కాదె? | = | పండుగ కాదా? |
| మహా + ఉగ్రకోపరేఖావిభవంబు | = | మిక్కిలి భయాన్ని కొలిపే నీ కోప రేఖ అనే సంపద |
| వైరులకున్ | = | శత్రువులకు |
| కాలము చేరువు + అకాదె | = | కాలం మూడటమే కదా! |

**తాత్పర్యం:**

ఓ భీమసేనా! పరిశీలిస్తే నీకుడి భుజబలం, పూర్వం భూభాగాన్ని మోసిన ఆదిశేషువు, తాబేలు, కులపర్వతాలకు దిగ్గజాలకు ఊరటపట్టు కాదా? నీవు గౌరవంగా చూడటం లోకానికి పండుగేకదా! భయాన్ని కొలిపే నీ కోపం, శత్రువులకు కాలం మూడ్చేదేకదా!

**వ్యాకరణ కార్యాలు**

**సంధులు:** అవనిభృత్ + దిశాకరులకు = అవనిభృద్దిశాకరులకు (జశ్త్వసంధి)

మహా + ఉగ్ర = మహెూగ్ర (గుణసంధి)

**సమాసాలు:** కోపరేఖావిభవంబు = కోపరేఖ అనే విభవము (రూపక సమాసం)
వలమూపులావు = వలమూపు యొక్క లావు (షష్ఠీతత్పురుష సమాసం)

**అలంకారం:** అతిశయోక్తి

భూభారాన్ని ఆదిశేషువు, అది కూర్మం, కులపర్వతాలు, దిగ్గజాలు వహిస్తాయని పురాణాలు చెపుతున్నాయి. భీముని భుజబలం వలన అవి విశ్రాంతి పొందుతాయని ప్రశంసా పూర్వకంగా ద్రౌపది కీర్తించటం వెనుక నున్నది అతిశయోక్తియే.

**ఛందస్సు :** భ ర న భ భ ర వ
∪ I I /∪I∪/ I I I /∪I I /∪I I /∪I ∪/I ∪
నీవల/మూపులా/వుమును/నేలవ/హించిన/నాగకూ/ర్మగో

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

శా. **ఆ రూపం బవికార, మా భుజబలం బత్యంత నిర్గర్వ, మా**
**శూరత్వంబు దయారసానుగత, మా శుంభత్క్రియాజ్ఞాన మా**
**ర్యారంభ ప్రతికూల వాదరహితం, బా యీుగి సన్మాన వి**
**స్తారోదాత్తము మాద్రి పిన్నకొడు కేతన్మాత్రుడే చూడుగన్?** (భార. విరా. 2-209)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

ద్రౌపది భీమునితో పాండవులందరి గుణవిశేషాలను కీర్తిస్తూ, సహదేవుని గుణగణాలను చెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| చూడుగన్ | = | పరిశీలించగా |
| ఆ రూపంబు | = | అంతటి సౌందర్యం |
| న + వికారము | = | మార్పులేనిది |
| ఆ భుజబలంబు | = | ఆ భుజబలం |
| అత్యంత నిర్గర్వము | = | మిక్కిలి గర్వం లేనట్టిది |
| ఆ శూరత్వంబు | = | ఆ సాహసం |
| దయా + రస + అనుగతము | = | దయారసాన్ని అనుసరించి ఉండేది, దయతో కూడినది |
| ఆ శుంభత్ + క్రియాజ్ఞానము | = | ప్రకాశించే ఆ పనులలోని నేర్పరితనం (పశుచికిత్సా జ్ఞానము) |
| ఆర్య + ఆరంభ ప్రతికూల | = | పెద్దలు చెప్పిన నడవడికకు అడ్డు చెప్పే |
| వాదరహితంబు | = | వాదం లేనట్టిది |
| ఆ + ఈుగి | = | ఆ దానగుణం |

| | | |
|---|---|---|
| సత్ + మానవిస్తార + ఉదాత్తము | = | గౌరవం యొక్క గొప్పతనంచేత ప్రకాశించేది |
| మాద్ర పిన్న కొడుకు | = | మాద్రి చిన్నకొడుకు సహదేవుడు |
| ఏతత్ + మాత్రుడే? | = | సామాన్యుడా? |

**తాత్పర్యం:**

ఓ భీమసేనా! పరిశీలించి చూస్తే, మాద్రి చిన్నకొడుకైన సహదేవుడు, సామాన్యమైన వాడా? ఆ సౌందర్యం నిర్వికారమైంది. ఆ భుజబలం గర్వంలేనిది. ఆ సాహసం దయారసానుగుణమైనది. ఆ కార్యనిర్వహణ నైపుణ్యం పెద్దలు చెప్పే మార్గానికి వ్యతిరేకమైంది కాదు. ఆ దానగుణం గౌరవంతో ఉదాత్తంగా ప్రకాశించేది.

**విశే:** 'ఆ' అనే నిర్దేశాత్మక సర్వనామంతో కలిపి సహదేవుని సాటిలేని గుణాన్ని ప్రస్తావించటం గమనించాలి. 'మాద్రి పిన్నికొడుకు ఏతన్మాత్రుడే?' అనటంలో కాకువు, ఏతన్మాత్రుడు కాడని తెలుపుతోంది. అన్నిట్లో గొప్ప వాడన్న తాత్పర్యాన్ని ఇస్తున్నది.

**వ్యాకరణ కార్యాలు**

**సంధులు :** ఆరూపంబు + అవికారము = ఆరూపంబవికారము (ఉత్వసంధి)
నిః + గర్వము = నిర్గర్వము (రేఫాదేశ విసర్గ సంధి)
విస్తార + ఉదాత్తము =విస్తారోదాత్తము (గుణసంధి)
ఏతత్ + మాత్రుడే = ఏతన్మాత్రుడే (అనునాసిక సంధి)

**సమాసాలు:** భుజబలము = భుజము యొక్క బలము (షష్ఠీతత్పురుష సమాసం)
దయారసానుగతము = దయ అనే రసము యొక్క అనుగతము (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు :** మ స జ స త త గ
U U U/I I U/I U I/I I U/U U I/U U I/U
ఆరూపం/బవికా/రమాభు/జబలం/బత్యంత/నిర్గర్వ/మా

**లక్షణాలు:** శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

చ. **'కడు బసిబిడ్డ మీ; డొకటి కాదవునా నెఱుగండు; ముంద రె**
**య్యెడ నొకపా టెఱుంగు; డెద యెంతయు గోమల; మెప్పుడైన నే**
**గుడుమగు బిల్తుగాని తనకుం గల యాకటిప్రా ద్దెఱుంగ డీ**
**కొడు కిటు పోకకు న్మనము గుందెడు; ని న్గని యూఱడిల్లెడున్.** (భార. విరా. 2-213)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం :**

భీమునితో తనదుఃఖాన్ని చెప్పుకోవటానికి వచ్చిన ద్రౌపది, పాండవుల గొప్పతనాన్ని ప్రస్తావిస్తుంది. ఆ సందర్భంలో వనవాసానికి బయలుదేరే సందర్భంలో కుంతీ చేసిన అప్పగింతలను భీమునితో చెపుతూ సహదేవుని గురించి ప్రస్తావించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| మీఁదు | = | ఈ సహదేవుడు |
| కడున్ + పసిబిడ్డ | = | మిక్కిలి పసివాడు |
| ఒకటి కాదు + అవున్ + అనాన్ | = | ఒకటి ఔను, ఒకటి కాదు అని |
| ఎఱుగండు | = | తెలియనివాడు, చెప్పలేడు |
| ముందర | = | ఇంతకు ముందు |
| ఏ + ఎడన్ | = | ఎప్పుడూ |
| ఒకపాటు | = | ఒక కష్టాన్నీ |
| ఎఱుంగుడు | = | అనుభవించలేదు |
| ఎద + ఎంతయున్ | = | మనసెంతో |
| కోమలము | = | సున్నితమైనది |
| ఎప్పుడైనన్ | = | ఎన్నడైనా |
| నేన్ | = | నేను (కుంతి) |
| కుడుమగన్ | = | అన్నం తినుమని |
| పిల్తున్ + కాని | = | పిలుస్తానుగాని |
| తనకున్ + కల | = | తనకున్న (సహదేవుడికిగల) |
| ఆఁకటి ప్రొద్దు | = | ఆకలయ్యే వేళను |
| ఎఱుంగుడు | = | తెలిసికొనలేడు |
| ఈ కొడుకు | = | అట్టి కొడుకూ ఈ సహదేవుడు |
| ఇటు పోకకున్ | = | ఇట్లా అరణ్యాలకు వెళ్ళటానికి |
| మనము + కుందెడున్ | = | నా మనస్సు విచారపడుతున్నది |
| నిన్ + కని | = | నిన్ను చూచి |
| ఊఁఅడిల్లెడున్ | = | ఊరట పొందుతున్నది |

**తాత్పర్యం:**

ఓ ద్రౌపదీ! ఈ సహదేవుడు మిక్కిలి పసివాడు. ఒకటి చెపితే ఔనని, కాదని చెప్పలేడు. ఇంతకుముందెప్పుడూ ఎక్కడా ఒక్క కష్టాన్ని కూడ అనుభవించలేదు. మనసెంతో కోమలమైనది. ఎప్పుడైనా నేను భోజనానికి రమ్మని పిలిస్తే తప్ప, తన ఆకలి వేళనుకూడా తెలిసికోలేడు. ఈ సహదేవుడిలా అరణ్యవాసానికి వెళ్లటం మనసుకు దుఃఖం కలుగుతోంది. అయినా నిన్ను చూచి మనసు ఊరడిల్లుతోంది.

**విశే:**

తల్లిప్రేమకు నిదర్శనం. లోకంలో తల్లికి కడగొట్టుబిడ్డపై మమకారం ఎక్కువని అంటారు. తానుకన్న సంతానం కాకున్నా, పాండవులలో కెల్లా చిన్నవాడైన సహదేవునిపై ఆమెకున్న వాత్సల్యం, ఆవేదన వ్యక్తం అవుతాయి. అరవై ఏళ్లు వచ్చిన కొడుకునయినా తల్లి పసివాడనే అంటుంది. ఆ వాత్సల్య స్థితిని ఇందులో చూడవచ్చు.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు :** కడున్ + పసిబిడ్డ = కడుబసిబిడ్డ (ద్రుతసంధి)

ఏ + ఎడన్ = ఎయ్యెడన్ (త్రికసంధి)

మనము + కుందెడు = మనము గుందెడు (గసడదవాదేశసంధి)

**సమాసాలు:** ఆకటి పొద్దు = ఆకలి యొక్క పొద్దు (షష్ఠీతత్పురుష సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I /I U I /U I I /I U I /I U I /I U I /U I U

క<u>దు</u>బ/సిబిద్ద/మీడొక/టిక్రా<u>ద</u>/వునానె/ఋగండు/ముందరె

**లక్షణాలు –**

చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో “నాజాభాజాజాజార” అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలూ21.

**చ. కనుగొని యప్డు గ్రొత్తయగు కౌతుకవృత్తి మునింగి పల్లటి**
**ల్లిన ధృతితోఁ గ్రమం బరయలేని మనంబు చలింప నచ్చటన్**
**జను లెడ యౌటు గాంచు నెటి సాలక గ్రక్కున నింతి జేరుగా**
**జనియె విధాతృలుబ్ధక వశంబును బోవు మృగంబు చాడ్పునన్** (భార.విరా. 2–247)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

కీచక వధకు నిర్ణయం జరిగాక, యథావిధిగా సైరంధ్రీ అంతఃపురంలో పనులలో నిమగ్నురాలయింది. కీచకుడు, ఆమెను ఎలాగయినా లొంగదీసుకోవాలనే సంకల్పంతో, సైరంధ్రీ చెంతకు వచ్చే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కనుగొని | = | చూచి |
| అప్డు | = | ఆ సమయంలో |
| క్రొత్త + అగు కౌతుకవృత్తిన్ | = | క్రొత్తదైన అనుభవం కోసం ఉత్సాహంలో |
| మునింగి | = | మునిగి |
| పల్లటిల్లిన | = | మిగుల చలించిన |
| ధృతితోన్ | = | ధైర్యంతో |
| క్రమంబు + అరయలేని | = | ఉచితానుచితాలు తెలిసికొనలేని |
| మనంబు | = | మనస్సు |
| చలింపన్ | = | చలించిపోగా |
| అచ్చటన్ | = | అక్కడ |
| జనులు | = | పరివారం |
| ఎడ + ఔటన్ | = | దూరం కావటం కొరకు |
| కాంచు | = | నిరీక్షించి చూచే |
| నెటి | = | ఓపిక |
| చాలక | = | సరిపోక |

| | | |
|---|---|---|
| విధాతృ | = | బ్రహ్మ అనే |
| లుబ్ధక వశంబునన్ | = | వేటగాని చేతిలో పడటానికి |
| పోవు | = | పోయే |
| మృగంబు చాడ్పునన్ | = | జింకవలె |
| గ్రక్కునన్ | = | వెంటనే |
| ఇంతిన్ + చేరుగాన్ | = | ద్రౌపదిని సమీపించటానికి |
| చనియెన్ | = | వెళ్ళాడు |

**తాత్పర్యం:**

సైరంధ్రీగా యున్న ద్రౌపదిని చూచి, కొత్త అనుభవంకోసం ఆశపడుతూ, ధైర్యం సడలతుంటే, చలించే మనస్సుతో, అక్కడ ఉన్న పరివారతమంతా దూరంగా వెళ్లేవరకు నిరీక్షించి చూసే ఓపికలేక, వేటగాని పాశానికి చిక్కటానికి పోయే జింకలాగా ద్రౌపది చెంతకు వెళ్లాడు.

**విశే:**

భావికథార్థ సూచన చేసే అలంకారం ఇక్కడ తిక్కన ప్రయోగించాడు. కీచకుడిని మృగంతో పోల్చటం వలన మృగంలా వీడు ప్రాణాలు కోల్పోతాడు. ఇది విధినిర్ణయమన్న సంకేతం. ఇందులో ఉంది.

**వ్యాకరణ కార్యాలు:**

**సంధులు:** ఎడ + ఔట = ఎడయౌట (యడాగమ సంధి)

సూ॥ సంధిలేని చోట స్వరంబుకంటే పరంబయిన స్వరంబునకు యడాగమంబగు

నెఱి + చాలక = నెఱిసాలక (గసడదవాదేశసంధి)

**సమాసాలు:** కౌతుకవృత్తి = కౌతుకంతో కూడిన వృత్తి (తృతీయా తత్పురుష సమాసం)

విధాతృలుబ్ధక = విధాతృడనే లుబ్ధకుడు (రూపకసమాసం)

**అలంకారం:** ఉపమాలంకారం – ఉపమానోపమేయాలకు మనోహరమైన సాదృశ్యాన్ని చెప్పటం ఇందులోని లక్షణం. విధిని బోయవానితో, కీచకుడిని మృగంతో ఉపమించి చెప్పటం ఇక్కడ కనిపిస్తుంది.

| | | |
|---|---|---|
| ఉపమావాచకం | – | చాడ్పునన్ |
| సమానధర్మం | – | చనియె |
| ఉపమేయం | – | కీచకుడు |
| ఉపమానం | – | లుబ్ధకవశాన పోయే మృగం |

విధాతృ లుబ్ధకవశమనే చోట, విధాతృనకు లుబ్ధకునికి అభేదం చెప్పటం చేత ఇది రూపకం కూడ అవుతోంది.

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I / I U I / U I I / I U I / I U I / I U I / U I U

క్నుగొ/నియప్పు/గ్రొత్తయ/గుకౌతు/కవృత్తి/మునింగి/పల్లటి

**లక్షణాలు –** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నాజాభాజాజాజార" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు – 21.

శా. 'క్రోధం బప్రతికారమై హృదయముం గుందింప నత్యంత చిం
తాధూతాత్ముడనైన నాకు బరమోత్సాహంబు సంధిల్ల దు
స్సాధం బైన విరుద్ధ కార్య మిటు లాసన్నంబుగా సంఘటిం
తే ధర్మాత్మజుఁడిచ్చమెచ్చు బగ సాధింపంగు గాన్పల్పమే?' (భార. విరా. 2-275)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

కీచకుడు నర్తనశాలకు వచ్చే విషయాన్ని భీమునకు ద్రౌపది వివరించి చెప్పి, భీముని క్రోధాగ్నిని ప్రజ్వరిల్లజేసింది. ఆ సమయంలో స్పందించిన భీముని సమాధానమే ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| క్రోధంబు | = | కోపం |
| అప్రతికారము + ఐ | = | తీర్చుకోలేనిదై |
| హృదయమున్ | = | మనస్సును |
| కుందింపన్ | = | బాధించగా |
| అత్యంత | = | మిక్కిలి |
| చింతాధూత + ఆత్ముడను + ఐన నాకున్ | = | విచారం చేత చలించిన మనస్సు కలిగి ఉన్న నాకు (భీముడికి) |
| పరమ + ఉత్సాహంబు | = | మిక్కిలి ఉత్సాహం |
| సంధిల్లన్ | = | కలుగేటట్లు |
| దుస్ + సాధంబు + ఐన | = | కష్టసాధ్యమైన |
| విరుద్ధ కార్యము | = | అజ్ఞాతవాసానికి వ్యతిరేకమైన పనిని (కలహకార్యాన్ని) |
| ఇటులు | = | ఈ విధంగా |
| ఆసన్నంబుగాన్ | = | సమీపంలోనే |
| సంఘటింతే? | = | కూర్చిపెట్టావుగదా! |
| ధర్మ + ఆత్మజుడు | = | ధర్మరాజు |
| ఇచ్చన్ + మెచ్చన్ | = | మనసులో మెచ్చుకొనేటట్లు |
| పగ సాధింపంగన్ | = | శత్రువును జయించటాన్ని |
| కాన్పు | = | చూడటం, సాధించటం |
| అల్పమే? | = | సులభమా? |

**తాత్పర్యం:**

ప్రతీకారాన్ని తీర్చుకోలేని కోపమే, నా హృదయాన్ని బాధిస్తుంది. ఎంతో విచారంతో చలించిపోయిన మనస్సుతో ఉన్న నాకు, మిక్కిలి ఉత్సాహం కలిగేలా, కష్టసాధ్యమైనదీ, అజ్ఞాతవాస నియమానికి విరుద్ధమైనదీ అయిన పనిని సమీపకాలంలోనే చేసేటట్లు సంఘటించావు. ధర్మతనయుడు మనసులో మెచ్చుకునేలా శత్రుజయాన్ని సాధించి చూపటం స్వల్పమే? (స్వల్పమైనదే సుమా!)

**విశే:**

ధర్మరాజు మెచ్చుకునేలా పగసాధించే సందర్భాన్ని సంఘటించిన ద్రౌపది నేర్పును భీముడు ప్రశంసించటం ఇందులోని ప్రస్తావన. అజ్ఞావాస నియమం చెడకుండా రహస్యంగా చేయవలసిన అసాధ్యమైన కార్యాన్ని భీముని చేత నిర్వహింపచేయటానికి అవసరమైన ఉత్సాహాన్ని ద్రౌపది రగిలించి, ఆ ఉత్సాహానికి 'ధర్మాత్మజుడు ఇచ్చమెచ్చ' – అనే చెలియలి కట్టను భీముడినోటనే పలికించింది. ధర్మజుడు మెచ్చుకోవటానికి, అజ్ఞాతవాస సమయభంగం కాకపోవటమే కారణమవుతుంది. 'కాన్పల్పమే' – అనటంలోని కాకువు రెండర్థాలనిస్తున్నది. ఆశ్చర్యార్థంలో చెపితే సామాన్యమా? అంటే సామాన్యం కాదని. ఏవార్థకంలో నయితే 'చాలాతేలికే' నని అర్థం.

**వ్యాకరణ కార్యాలు:**

**సంధులు:** ధూత + ఆత్ముడను = ధూతాత్ముడను (సవర్ణదీర్ఘసంధి)
ఇచ్చున్ + మెచ్చున్ = ఇచ్చుమెచ్చున్ (ద్రుతసంధి)
దుః +సాధ్యము = దుస్సాధ్యము (విసర్గసంధి)
హృదయమున్ + కుందింప = హృదయముంగుందింప (ద్రుతసంధి)

**సమాసాలు:** చింతాధూతాత్ముడు = చింతచేత ధూతాత్ముడు (తృతీయా తత్పురుష సమాసం)
పరమోత్సాహంబు = పరమమైన ఉత్సాహము (కర్మధారయ సమాసం)

**ఛందస్సు :** మ స జ స త త గ
U U U/I I U/I U I/I I U / U U I /U U I /U
క్రోధంబ/ప్రతికా/రమైహృ/దయముం/గుందింప/నత్యంత/చిం

**లక్షణాలు:**

శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

చ. **తలరు, నలందురున్, నవయు, దాపభరంబున వెచ్చనూర్చు, మే**
**నలయుగ నొల్లుబోవు, వెగడందు, గలంగు, బరిభ్రమించు, గొం**
**దలపడు, దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు, వి**
**చ్చలవిడిబేర్చు, నెవ్వగల సందడి డెందము గంది చేడ్పడున్.** (భార. విరా. 2-293)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

సంకేత స్థలానికి రమ్మని ద్రౌపది కీచకునితో చెప్పి పంపాక, మదిలో సందడించే కోర్కెలను నిలువరించుకోలేక, కీచకుడు మదన వికారాలను ప్రదర్శించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

తలరున్ = కంపిస్తాడు
అలందురున్ = దుఃఖిస్తాడు

| | | |
|---|---|---|
| నవయున్ | = | కృశిస్తాడు |
| తాపభరంబునన్ | = | మన్మథ సంబంధమైన తాపాధిక్యంతో |
| వెచ్చన్ + ఊర్చున్ | = | వేడినిట్టూర్పులు విడుస్తుంటాడు |
| మేన్ + అలయుగన్ | = | శరీరం అలసిపోతే |
| ఒల్లన్ + పోవున్ | = | మూర్ఛపోతాడు |
| వెగడు + అందున్ | = | భయపడతాడు |
| కలంగున్ | = | కలత పడతాడు |
| పరిభ్రమించున్ | = | తిరుగుతాడు |
| కొందలపడున్ | = | సంక్షోభాన్ని ప్రకటిస్తాడు |
| తల్లడంబు | = | కలత |
| అడరి | = | ఎక్కువై |
| ధైర్యము + తూలినన్ | = | ధైర్యం నశించగా |
| బెగ్గడిల్లున్ | = | భయపడతాడు |
| విచ్చలవిడిన్ | = | స్వేచ్ఛగా |
| నేర్పున్ | = | రేగిపోతాడు |
| నెఱ + వగల సందడిన్ | = | మదనతాపం వలని బాధలు ఎక్కువకాగా |
| డెందము కంది | = | మనస్సు బాధపడి (తపించి) |
| చేడ్పడున్ | = | బాధతో చలించిపోతాడు. |

**తాత్పర్యం:**

కీచకుడు సైరంధ్రిని పొందాలని తొందరపడతాడు. దుఃఖిస్తాడు. నవసికృశిస్తాడు. మదనతాపంతో వేడినిట్టూర్పులు విడుస్తాడు. శరీరం అలసిమూర్ఛపోతాడు. భయపడతాడు. కలతపడతాడు. అటూ ఇటూ తిరుగుతాడు. సంక్షోభం చెందుతాడు. కలత అతిశయించి, ధైర్యం నశించి, భయపడతాడు. విచ్చలవిడిగా చెలరేగిపోతాడు. మదన తాపం హెచ్చి, మనసు తపిస్తుంటే బాధతో చలించిపోతాడు.

**విశే:**

ఇవి మానసికంగా కలిగే వికారాలు మదన పీడితులైనవారి చేష్టలు. ఆ మానసిక చేష్టలనన్నీ తెలుగు క్రియా పదాలలో చెప్పటం తిక్కనగారి విశేషం. పరిభ్రమించు అన్న క్రియారూపం తప్ప మిగిలిన క్రియాపదాలన్నీ తెలుగువే. అది తిక్కనగారి తెలుగు భాషాభిమాన శక్తి. వాటికన్నిటికీ సంస్కృత పదాలు ఉన్నా, తెలుగు పదాలనే వాడటం తిక్కనగారి భాషాసామర్థ్యం.

**వ్యాకరణ కార్యాలు**

**సంధులు:** ఒల్లన్ + పోవు = ఒల్లుబోవు (ద్రుతసంధి)

నెఱ + వగలు = నెవ్వగలు (ప్రాతాది సంధి)

**సమాసాలు:** తాపభరము = తాపమువలన భరము (పంచమీ తత్పురుష సమాసం)

నెవ్వగలసందడి = నెవ్వగల యొక్క సందడి (షష్ఠీతత్పురుష సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర

I I I/I U I/U I I/I U I/I U I/I U I/U I U

తలరు/నలందు/రున్నవ/యుద్రాప/భరంబు/నవెచ్చ/నూర్చుమే

**లక్షణాలు –** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు – 21.

**ఉ. నిక్కమ పోలె నప్పుడొక నేరిమిమై ననుద్రోచిపుచ్చుగా**
**నక్కమలాక్షి పొందు దగ నాడి, తుదిన్ నిజమేది, నేటి రే**
**యిక్కకు రాక తక్కిన, సహించునె నన్ మరు? దట్టులైన నా**
**కెక్కడిప్రాణ, మేటితను, వెయ్యది నిల్కడ, యేమిసేయుదున్?** (భార. విరా. 2-296)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** సంకేతస్థలానికి వస్తానన్న సైరంధ్రి రాకపోతే తన స్థితి ఏమిటా? అని కీచకుడు చింతించే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| నిక్కమపోలెన్ | = | నిజమా అన్నట్లు |
| అప్పుడు + ఒకనేరిమిమైన్ | = | అప్పుడు ఏదో నేర్పుతో |
| ననున్ + త్రోచిపుచ్చుగాన్ | = | నన్ను తిరస్కరించటానికి |
| ఆ + కమల + అక్షి | = | పద్మాలవంటి కన్నులుగల ఆ సైరంధ్రి |
| పొందున్ | = | కలయికను |
| తగన్ + ఆడి | = | తగినట్లు మాట్లాడి |
| తుదిన్ | = | చివరకు |
| నిజము + ఏది | = | ఆ వాస్తవాన్ని కాదని |
| నేటిరేయి | = | ఈనాటి రాత్రి |
| ఇక్కకున్ | = | సంకేత స్థలానికి |
| రాకతక్కినన్ | = | రాకపోతే |
| మరుడు | = | మదనుడు |
| నన్ + సహించునె? | = | నన్ను సహిస్తాడా? |
| అట్టులు + ఐనన్ | = | అట్లా అయితే |
| నాకున్ + ఎక్కడి ప్రాణము? | = | నా ప్రాణం నిలుస్తుందా? |
| ఏటి తనువు? | = | ఈ శరీరమెందుకు? |
| నిల్కడ ఏ + అది? | = | నిలుకడ ఎక్కడిది? |
| ఏమి + చేయుదున్ | = | ఏమి చేసేది? |

**తాత్పర్యం:**

సైరంధ్రి వాస్తవమా? అన్నట్లు ఏదో ఒక నేర్పుచూపి నన్ను త్రోసిపుచ్చటానికై, పొందుకోరినట్లే అనువుగా మాట్లాడి, చివరకు అబద్ధం చేసి ఈ నాటి రాత్రికి ఈ నర్తనశాలకు రాకపోతే, మన్మథుడు నన్ను సహిస్తాడా? అదే జరిగితే నా ప్రాణం నిలుస్తుందా? ఇక ఈ శరీరం దేనికి? నిలుకడ ఎక్కడిది? ఏమి చేసేది? – అని కీచకుడు మదనవేదనతో బెంబేలెత్తిపోతున్నాడు.

**విశే:**

ఈ పద్యంలో 'అనుస్మృతి' – అనే కామావస్థ వర్ణింపబడిందని జి.వి. సుబ్రహ్మణ్యంగారు పేర్కొన్నారు. అనుస్మృతి అంటే దేశకాలాలను అనుసరించి పూర్వం అనుభూతమైన విషయాలనే మళ్లీ మళ్లీ తలచుకోవటం 'అనుస్మృతి' యని సర్వజ్ఞ సింగభూపాలుడు పేర్కొన్నాడు. తిరస్కరించిన సైరంధ్రి, ఇప్పుడు అంగీకరించింది. ఈ అంగీకారం వాస్తవం కాకపోతే పరిస్థితి ఏమిటి? అని కీచకుడు అనుస్మృతి పాలయ్యాడు. మదనావస్థలలో చివరిది మరణం. ధీరత్వంతో విరహాన్ని అధిగమించకపోతే మరణమే శరణ్యం. సైరంధ్రి తనను వంచిస్తుందన్న భావననే సహించలేకపోతున్న కీచకుని మానసిక అవస్థయిది. ప్రతి నాయకుడైన కీచకుని యందు శృంగార నాయక లక్షణాలను స్ఫురింపచేయటం ఇందులోని విశిష్టత.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** నేటిరేయి + ఇక్కకున్ = నేటిరేయిక్కకున్ (ఇత్వసంధి)

ఏమి + చేయుదున్ = ఏమి సేయుదున్ (గసడదవాదేశసంధి)

**సమాసాలు:** కమలాక్షి = కమలములవంటి అక్షులుగలది (బహువ్రీహి సమాసం)

**ఛందస్సు :** భ ర న భ భ ర వ

U I I /UIU/I I I /UI I /UI I /UI U/I U

నిక్కమ/పోలెన/ప్పుడొక/నేరిమి/మైనను/ద్రోచిపు/చ్చుగా

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

**చ. కమలవనంబుపొంత నునుగా ద్దొకయించుక యాదరించు, జి**
**త్తమునకు దాను దల్లడము దన్కుటయుం జని గారవంపుజూ**
**తముకడ నిల్చు, నిల్చి యది తాపము బెంచిన లేత తీవ జొం**
**పము జొరుబాఱు నం దలుత పై కొనినన్ వెడలున్ వెనుంబడున్.** (భార. విరా. 2-303)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

సైరంధ్రి, కీచకునితోడి పొందునకు అంగీకరించి, నర్తనశాలకు రమ్మని చెప్పిన తరువాత, కీచకుని మదన చేష్టలను వర్ణించి చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కమలవనంబు పొంతన్ | = | తామర కొలను సమీపంలో |
| ననుగాడ్పు | = | మెల్లని గాలిని |
| ఒక + ఇంచుక | = | కొద్దిగా |
| ఆదరించున్ | = | ఆదరిస్తాడు |
| దానన్ | = | దానివలన |
| చిత్తమునకున్ | = | మనస్సునకు |
| తల్లడము | = | బాధ |
| తన్కుటయున్ | = | అతిశయించగా |
| చని | = | వెళ్ళి |
| గారవము + చూతముకడన్ | = | ప్రియమైన మామిడి చెట్టువద్ద |
| నిల్చున్ | = | నిలబడతాడు |
| నిల్చి | = | నిలబడి |
| అది తాపమున్ + పెంచినన్ | = | ఆ మామిడి చెట్టు విరహవేదన పెంచగా |
| లేత తీవ | = | లేత తీగల యొక్క |
| జొంపమున్ | = | గుబురులోకి, పొదరింట్లోకి |
| చొఱన్ + పాఱున్ | = | ప్రవేశిస్తాడు |
| అందున్ | = | అందులో |
| అలుత | = | అలసట |
| పై కొనినన్ | = | ఎక్కువ కాగా |
| వెడలున్ | = | బయటకు వెళ్ళేవాడు |
| వెనుంబడున్ | = | ఉపాయం తోచక మనసులో దుఃఖించేవాడు |

**తాత్పర్యం:**

కీచకుడు తామరల కొలను దగ్గర వీచే పిల్లగాలిని కొద్దిగా ఆస్వాదించి గౌరవించేవాడు. దానివలన మనసుకు బాధ అతిశయించగా వెళ్లి, ఇష్టమైన మామిడి చెట్ల దగ్గర నిలబడతాడు. నిలబడిన కొంతసేపటికి ఆ మామిడి చెట్టు విరహవేదనను పెంచగా లేతతీగల గుబురు గుబురులోకి, దూరేవాడు. అందులో అలసట ఎక్కువ కాగా, బయటకు వెళ్లేవాడు. ఉపాయం తోచక మనసులో చింతపడేవాడు.

**విశే:**

తామరల కొలను, మలయమారుతం, మామిడి చెట్టునీడ, చిగురుతీవెల జొంపాలు ఇవన్నీ విరహార్తిని పెంచేవే. మనసులోని మదన తాపాన్ని తగ్గించే మార్గాంతరం తెలియక కీచకుడు చింతించాడు. అందుకే ఒకదానిని విడిచి మరోదాన్ని ఆశ్రయించాడు. విరహతాపంలో గోచరించే సంచారీ భావాలు ఇందులో వర్ణితమయ్యాయి.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** చొరన్ + పాఱు = చొరుబాఱు (ద్రుతసంధి)

వెనున్ + పడున్ = వెనుంబడున్ (ద్రుతసంధి)

**సమాసాలు:** కలమవనము = కమలములతో కూడినవనము (తృతీయా తత్పురుష సమాసం)
నునుగాడ్పు = నునుపైన గాడ్పు (కర్మధారయ సమాసం)
లేతతీవజొంపము = లేతదైన తీగెలతో కూడిన జొంపము (తృతీయా తత్పురుష సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర
I I I / I U I / U I I / I U I / I U I / I U I / U I U
క్రమల/వనంబు/పొంతను/నుగ్గాడ్పొ/కయించు/కయాద/రించుజి

**లక్షణాలూ** చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు - 21.

శా. **ధ్వాంతాకారితకుడ్యకుట్టిమ ఘనస్తంభావలీరూపముం,**
**భ్రాంతాది ప్రవిభాగ బోధ రహిత ప్రాగ్ద్వారముం, గాతర**
**స్వాంత త్రాసకరంబు నై, దురభివేశంబైన యా లోను ని**
**శ్చింతుండై సతికేలు పట్టికొని చొచ్చెన్ భీముడత్యుగ్రతన్** (భార. విరా. 2-327)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం**: నర్తనశాలలోనికి భీముడు ప్రవేశించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ధ్వాంత + ఆకారిత | = | చీకటి రూపుకట్టినట్లుగా ఉన్న |
| కుడ్య | = | గోడలయొక్క |
| కుట్టిమ | = | నేలయొక్క |
| ఘనస్తంభ + ఆవలీ | = | పెద్ద స్తంభాల వరుస యొక్క |
| రూపమున్ | = | రూపం కలదానినీ |
| ప్రాంత + ఆది | = | తుదిమొదళ్ళు, దగ్గరా దూరం మొదలైన |
| ప్రవిభాగ | = | భేదం యొక్క |
| బోధరహిత | = | జ్ఞానంలేని (తెలియని) |
| ప్రాక్ + ద్వారమున్ | = | ముందరి (సింహ) ద్వారం కలదీ |
| కాతరస్వాంత | = | పిరికి మనస్సుకలవారికి |
| త్రాసకరంబున్ + ఐ | = | భయం కలిగించేదై |
| దురభివేశంబు + ఐన | = | చొరరానిదైన |
| ఆ లోను | = | ఆ నర్తనశాల లోపలి భాగంలో |
| నిశ్చింతుండు + ఐ | = | ఏ చింతా (ఏ అనుమానమూ) లేనివాడై |
| సతి కేలు | = | ద్రౌపది యొక్క చేయి |
| పట్టుకొని | = | అందికొని |

| | | |
|---|---|---|
| భీముడు | = | భీముడు |
| అతి + ఉగ్రతన్ | = | మిక్కిలి కోపంగా |
| చొచ్చెన్ | = | ప్రవేశించాడు. |

**తాత్పర్యం:**

చీకటి రూపమెత్తినట్లుగానున్న గోడలు, నేల, పెద్ద స్తంభాల వరుసతో కూడిన రూపంగలదీ, ఆద్యంతాలూ తెలియని సింహ ద్వారం గలదీ, భయపడే మనస్సుగల వాళ్లకు భయంకరమైనదీ, ప్రవేశించటానికి వీలులేనిదీ అయిన ఆ నర్తనశాలలోనికి, నిశ్చింతగా, తన భార్య చేయిపట్టుకొని కోపంగా భీముడు ప్రవేశించాడు.

**విశే:**

నర్తనశాల యొక్క తుది మొదళ్లను గుర్తించలేని చీకటి, పిరికివాళ్లకు భయాస్పదమై చొరనీయని చీకటి పై పద్యంతో నర్తనశాలలోని లోపలి భాగాల్ని నాలుగు సమాసాలతో వర్ణించాడు. ఉత్తరోత్తరాలు క్రమంగా చిన్నవైపోవటంలో కనిపించే ఒక క్రమాన్ని గమనించవచ్చు. భీముడు నిశ్చింతగా ప్రవేశించేటప్పటి ధీరతను 'ధ్వాంతాకారిత కుడ్యాకుట్టిమ ఘనస్తంభావలీ రూపమున్' – అనే సమాసం ధ్వనిస్తోంది. చీకటిలే చీకటిలాగా తోచే నర్తనశాల శత్రుసంహారానికి అనువైనదన్న స్పృహను భీమునికి స్ఫురింపచేసిందన్న స్ఫూర్తిని ఈ పద్యం కల్పిస్తోంది.

**వ్యాకరణ కార్యాలు**

**సంధులు :** ధ్వాంత + ఆకారిత = ధ్వాంతాకారిత (సవర్ణదీర్ఘసంధి)
ప్రాక్ + ద్వారము = ప్రాగ్ద్వారము (జశ్త్వసంధి)
అతి + ఉగ్రతన్ = అత్యుగ్రతన్ (యణాదేశసంధి)

**సమాసాలు:** సతికేలు = సతియొక్క కేలు (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ధ్వాంతాకా | రితకు | డ్యకుట్టి | మఘన | స్తంభావ | లీరూప | ముం |

**లక్షణాలు:** శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

శా. **సింగంబున్న గుహా నికేతమునకున్ శీఘ్రంబునన్ వచ్చు మా**
**తంగంబుం బురుడించుచుం బవనపుత్ర స్వీకృతంబైన యా**
**రంగాగారము సేరవచ్చి మదిలో రాగంబు ఘూర్ణిల్ల నిం**
**తిం గాముండిటు దేడె యింత కని యుద్వృత్తాంగజోన్మాదుడై.** (భార. విరా. 2-330)

**కవిపరిచయం:** ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుడు నర్తనశాలకు చేరినప్పటి స్థితిని వర్ణించే పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| సింగంబు | = | సింహం |
| ఉన్న గుహానికేతమునకున్ | = | ఉన్న గుహానివాసంలోనికి |
| శీఘ్రంబునన్ | = | వేగంగా |
| వచ్చు | = | వచ్చే |
| మాతంగంబున్ | = | ఏనుగును |
| పురుడించుచున్ | = | పోలుతూ |
| పవన పుత్ర స్వీకృతంబు + ఐన | = | భీముడు గ్రహించిన |
| ఆ రంగ + అగారము | = | ఆ నర్తనశాల |
| చేరన్ + వచ్చి | = | లోపలికివచ్చి |
| మదిలోన్ | = | మనస్సులో |
| రాగంబు | = | వలపు |
| ఘూర్ణిల్లన్ | = | తిరుగాడుతుంటే (వేగిరపెట్టగా) |
| ఇంతకున్ | = | ఇప్పటికే |
| ఇంతిన్ | = | సైరంధ్రిని |
| కాముండు | = | మన్మథుడు |
| ఇటన్ + తేడె | = | ఇక్కడకు తీసికొనిరాడా? |
| అని | = | అని భావించి |

ఉత్+వృత్త+అంగజ+ఉన్మాదుడు+ఐ= విజృంభించిన (పైకెగిసిన) వలపుపిచ్చి కలవాడై.

**తాత్పర్యం:**

సింహం నివసించే గుహలోకి వేగంగా వచ్చే ఏనుగు లాగా భీముడున్న ఆ నర్తనశాలలోనికి వచ్చి, మదిలో వలపు సుడులు తిరుగుతుంటే, మదనుడు ఈ పాటికే సైరంధ్రిని తెచ్చి ఉంటాడులే అని భావించి, ఒళ్లు తెలియక విజృంభించే వలపు పిచ్చి కలవాడై.

**విశే:**

పద్యంలో 'సింహం నివాసముండే గుహ నివాసానికి వేగంగా వచ్చే ఏనుగులాగా కీచకుడు నర్తనశాలను వెళ్లాడన్న ఉపమానం భవిష్యత్తులో కీచకుని గండంతోపాటు అతని ఉన్మత్త స్థితినీ తెలుపుతోంది. సింహం గుహలో ఉన్నదని కీచకునికి తెలియదు. సైరంధ్రి మాటలను నమ్మి నర్తనశాలలోకి ప్రవేశించాడు. కీచకుడు వంచనకు గురవుతున్నాడన్న సానుభూతి, భీముని పట్ల సహానుభూతి రెండూ కలుగుతాయి.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** రంగ + ఆగారము = రంగాగారము (సవర్ణదీర్ఘసంధి)
అంగజ + ఉన్మాదుడై = అంగజోన్మాదుడై (గుణసంధి)

**సమాసాలు:** గుహానికేతనము = గుహ అనే నికేతనము (రూపక సమాసం)
మన్మథోన్మాదుడు = మన్మథుని వలన ఉన్మాదుడైనవాడు (పంచమీ తత్పురుష సమాసం)

**ఛందస్సు :** మ స జ స త త గ

U U U/I I U /I U I /I I U /U U I /U U I /U

<u>సిం</u>గంబు/న్నగుహా/నికేత/మునకున్/<u>శీ</u>ఘ్రంబు/నన్వచ్చు/మా

**లక్షణాలు:**

శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

చ. **ఘనతర కోప వేగమును గంపము నొందు నిజాంగకంబులం**
**దనధృతి పెంపు సొం పచలితంబులు జేయ సమీరుకూర్మినం**
**దనుడు తదీయ చేష్టలును దద్వచనంబుల చొప్పు నేర్పడం**
**గను మతి నూరకుండె నవికార నిగూఢ నిజ ప్రకారుడై.** (భార. విరా. 2-332)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:**

మదనోన్మాదంతో నర్తనశాలలోనికి ప్రవేశించిన కీచకుని చేష్టలను గమనిస్తున్న భీముని స్థితిని చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఘనతర | = | మిక్కిలి గొప్పదైన |
| కోపవేగమునన్ | = | తీవ్రమైన కోపంతో |
| కంపమున్ + ఒందు | = | వణుకుతున్న |
| నిజ + అంగకంబులన్ | = | తన అవయవాలను |
| తన ధృతి పెంపు సొంపు | = | తన ధైర్యగుణం యొక్క అతిశయ వైభవం |
| అచలితంబులన్ + చేయన్ | = | నిశ్చలంగా నిలపగా |
| సమీరు కూర్మి నందనుడు | = | వాయుదేవుడి ప్రియపుత్రుడూ భీముడు |
| తదీయచేష్టలను | = | అతడి చేష్టలను |
| తత్ + వచనంబుల చొప్పున్ | = | అతని మాటతీరును |
| ఏర్పడన్ | = | తేటపడేటట్లు |
| కనుమతిన్ | = | చూద్దాములే అనే ఆలోచనతో |
| అవికార | = | వికారంలేని (ఎటువంటి కలతపాటులేని) |
| నిగూఢ నిజప్రకారుడు + ఐ | = | రహస్యమైన తన పద్ధతి ప్రకారం |
| ఊరక + ఉండెన్ | = | ఊరకున్నాడు. |

**తాత్పర్యం:** భీమసేనుడు, తీవ్రమైన కోపంతో వణుకుతున్న శరీరావయవాలను, తనధైర్యగుణాతిశయపు పెంపుతో కదలనీయకుండా చేసి, కీచకుడి చేష్టలను, మాటలను స్పష్టంగా గమనిద్దామన్న ఆలోచనతో, ఎటువంటి వికారం లేకుండా, గుంభనంగా మిన్నకున్నాడు.

**వ్యాకరణ కార్యాలు**

**సంధులు:** నిజ + అంగకంబులన్ = నిజాంగకంబులన్ (సవర్ణదీర్ఘసంధి)
తత్ + వచనంబులు = తద్వచనంబులు (జశ్త్వసంధి)

**సమాసాలు:** కోపవేగము = కోపము యొక్క వేగము (షష్ఠీ తత్పురుష సమాసం)
సమీరుకూర్మినందనుడు = సమీరుని యొక్క కూర్మినందనుడు (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర
I I I /I U I /U I I /I U I /I U I /I U I /U I U
ఘనత/రకోప/వేగము/నుగ్రంప/మునొందు/నిజాంగ/కంబులం

**లక్షణాలు -**

చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నజభజజజర" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు 21.

**చ. వికృతపు జావు సంప మది వేడుక పుట్టిను గిట్టిపట్టిమ**
**స్తకమును బీన దీర్ఘభుజశాఖలు బాదయుగంబు మేనిలో**
**నికి జొర నుగ్గగా దుటిమి నించిన క్రంతలతిత్తియైన కీ**
**చకు ధరణీస్థలిం జదిపి చక్కని ముద్దగు జేసె దుష్టుడై.** (భార. విరా. 2-353)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుని వధించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| వికృతము + చావు | = | వికారం కలిగించే చావు |
| చంపన్ | = | చంపటానికి |
| మదిన్ వేడుక పుట్టినన్ | = | మనసులో కోరిక కలుగగా |
| కిట్టి | = | దగ్గరకు వెళ్ళి |
| పట్టి | = | పట్టుకొని |
| మస్తకమును | = | తలను |
| పీనదీర్ఘభుజశాఖలున్ | = | బలిసిన పొడవైన కొమ్మలవలె ఉండే చేతులును |
| పాదయుగంబు | = | రెండు కాళ్లను |
| మేనిలోకిన్ + చొరుగాన్ | = | శరీరం లోపలికి చొచ్చుకొని పోయేటట్లు |
| నుగ్గుగాన్ +తుటిమి | = | చూర్ణంగా చేసి, కుక్కి |
| నించినన్ | = | నింపగా |
| క్రంతల తిత్తి + ఐన | = | రంధ్రాలు ఉండే సంచిగా |

| | | |
|---|---|---|
| కీచకున్ | = | కీచకుడిని |
| ధరణీస్థలిన్ | = | నేలమీద |
| చదిపి | = | నలిపి |
| తుష్టుడు + ఐ | = | సంతోషించినవాడై |
| చక్కని ముద్దగన్ | = | గుండ్రటి ముద్దగా |
| చేసెన్ | = | చేశాడు. |

**తాత్పర్యం:**

కీచకుడిని ఏవగింపు కలిగించే చావు చంపాలని మనసులో భీమునికి కోరిక పుట్టింది. కీచకుని వద్దకు పోయి పట్టుకొని, వాడి తలను, పొడవైన కొమ్మల్లాంటి చేతుల్ని, పాదాల్ని శరీరంలోకి చొచ్చుకు పోయేటట్లుగా నుగ్గుచేసి, రంధ్రాలు ఉండే తిత్తిగా కీచకుడిని నేలమీద పడవేసి, నలిపి, సంతోషంతో చక్కని ముద్దను చేశాడు.

**విశే:**

కీచకుడి వికృతపు చావు, భీముని కసి ఈ పద్యంలో కనిపిస్తుంది. కీచకుని శరీరాన్ని మాంసపుముద్దగా మార్చి, క్రంతల తిత్తిని చేశాడు. భీముని ప్రతీకారవాంఛకు ఇది పరాకాష్ఠ. ఇవన్నీ పద్యంలో తిక్కనగారు చెప్పిన తీరు హృద్యం.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** వికృతము + చావు = వికృతపు చావు (పుంప్వాదేశ సంధి)
నుగ్గుగాన్ + తుఱమి = నిగ్గుగాదుఱిమి (ద్రుతసంధి)

**సమాసాలు:** వికృతపు చావు = వికృతమైన చావు (కర్మధారయ సమాసం)
క్రంతల తిత్తి = క్రంతలతో కూడిన తిత్తి (కర్మధారయ సమాసం)

**ఛందస్సు :** న జ భ జ జ జ ర
I I I / I U I /U I I /I U I /I U I /I U I /U I U
వికృత/పుజావు/సంపమ/దివేదు/కపుట్టి/నుగిట్టి/పట్టిమ

**లక్షణాలు –**

చంపకమాల. నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "నాజాభాజాజాజార" అనే గణాలుంటాయి. యతి 11వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలూ21.

ఉ. **చూచుచు జేరి వ్రేల్మిడుచుచుం దలయూచి విలక్ష చిత్తయై**
**యా చపలాక్షి ముక్కుపయి నంగుళముం గదియించి 'దీనికై**
**కీచక! యింత సేసితి, నుఖిత్వము బొందుదుగాక! యింక న**
**ట్లేచిన నిట్లు గా కుడుగునే?' యనుచున్ వెఱుగందుచుండుగన్.** (భార. విరా. 2-356)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకవధానంతరం, ద్రౌపది కీచకుని శవం వద్దకు చేరి ఏమన్నదో చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఆ చపల + అక్షి | = | ద్రౌపది |
| చూచుచున్ | = | చూస్తూ |
| చేరి | = | దగ్గరగా వచ్చి |
| వ్రేల్ + మిడుచుచున్ | = | వ్రేళ్ళు విరుస్తూ |
| తల + ఊఁచి | = | తలూపి |
| విలక్షచిత్త + ఐ | = | అబ్బురపడిన మనస్సుతో |
| ముక్కుపయిన్ | = | ముక్కుమీద |
| అంగుళమున్ | = | వ్రేలు |
| కదియించి | = | వేసికొని |
| కీచక! | = | ఓ కీచకా! |
| దీనికై | = | దీనికోసం (ఇట్లా అయ్యేందుకు) |
| ఇంత + చేసితి(వి) | = | ఇంత చేశావు |
| సుఖిత్వము | = | శాంతిని |
| పొందుదుగాక! | = | పొందుతావుగాక! |
| ఇంకన్ | = | ఇంకా |
| అట్లు + విజృంభిస్తే | = | అట్లా విజృంభిస్తే (నన్ను బాధిస్తే) |
| ఇట్లు | = | ఇట్లా |
| కాక | = | కాకుండా |
| ఉడుగునే? | = | మానుతుందా? |
| అనుచున్ | = | అని అంటూ |
| వెఱుగు + అందుచుండుగన్ | = | ఆశ్చర్యపడుతూ ఉండగా |

**తాత్పర్యం:**

ద్రౌపది, కీచకుడి శవాన్ని చూస్తూ దగ్గరకు చేరి, వ్రేళ్లు విరిస్తూ తలనూపి, అబ్బురపడుతూ, ముక్కుమీద వేలువేసికొని, ఓ కీచకా! దీనికోసమేనా? ఇంత చేశావు. సుఖాన్ని పొందుతావులే! అట్లా ఎగిరిపడితే ఇట్లా కాకుండా ఉంటుందా? అని ఆశ్చర్యపడుతుండగా

**విశే:**

స్త్రీ సహజోచితమైన చేష్టను ద్రౌపది ద్వారా తిక్కనగారు చెప్పారు. శవం దగ్గరకు వెళ్లి మెటికలు విరవటం, ముక్కుపై వేలువేసికొని 'దీనికోసం ఇంత చేశావు, ఇక సుఖాన్ని పొందు!' – అని అనటం సహజోచితమైన వర్తనం.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** ఇంత + చేసితి = ఇంతసేసితి (గసడదవాదేశసంధి)

వెఱగు + అందు చుండుగన్ = వెఱగందుచుండగన్ (ఉత్వసంధి)

**సమాసాలు:** చపలాక్షి = చపలములయిన అక్షులు గలది (బహుబ్రీహి సమాసం)

విలక్షచిత్త = విలక్షణమైన చిత్తము గలది (కర్మధారయ సమాసం)

**ఛందస్సు :** భ ర న భ భ ర వ

∪ I I /∪ I ∪/I I I /∪ I I /∪ I I /∪I∪/I ∪

<u>చూ</u>చుచు/జేరిప్రే/ల్మిడుచు/<u>చు</u>ందల/యూచివి/లక్షచి/<u>త్త</u>యై

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -20.

**శా.** **'చింతాశల్యము వాసెనే? భుజబలోత్సేకంబు నీ కెక్కెనే?**
**శాంతిం బొందెనె రోషపావకుడు? దుశ్చారిత్రునిం జూచితే?**
**సంతోషించితె? యిట్లు గాక, బ్రదుకన్ శక్యంబె? దుర్వృత్తినీ**
**చెంతం జేరినయట్టి వీరులకు నాచేతం బయోజాననా!'** (భార. విరాట 2-358)

**కవిపరిచయం:**

ఈ పద్యం తిక్కనగారిచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ద్వితీయాశ్వాసం నుండి గ్రహింపబడిన కీచకవధాఘట్టంలోనిది.

**సందర్భం:** కీచక వధానంతరం భీముడు ద్రౌపదితో మాట్లాడే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| పయోజ + ఆననా! | = | పద్మవంటి ముఖం గల ఓ ద్రౌపదీ! |
| చింతాశల్యము | = | బాధ అనే ముల్లు |
| పాసెనే? | = | తొలగిపోయిందా? |
| భుజబల + ఉత్సేకంబు | = | (నా) బాహుబలంయొక్క ఆధిక్యం |
| నీకున్ + ఎక్కెనే? | = | నీ మనసు కెక్కిందా? (నచ్చిందా?) |
| రోషపావకుడు | = | రోషమనే అగ్ని |
| శాంతిన్ + పొందెనె? | = | శాంతించాడా? |
| దుస్ + చారిత్రునిన్ | = | చెడు నడవడిగల కీచకుడిని |
| చూచితే? | = | చూచావా? |
| సంతోషించితె? | = | సంతోషించావా? |
| ఇట్లు + కాక | = | ఈ విధంగా కాకుండా |
| దుర్వృత్తిన్ | = | చెడు ప్రవర్తనతో |
| నీచెంతన్ + చేరిన + అట్టి | = | నీదగ్గరకు చేరినటువంటి |
| వీరులకున్ | = | యోధులకు |
| నాచేతన్ | = | నాచేతిలో |
| బ్రదుకన్ శక్యంబె! | = | బ్రతకటం సాధ్యమా? |

**తాత్పర్యం:** పద్మముఖీ! మనసులోని చింతా శల్యం తొలగిపోయిందా? నా బాహుబలాతిశయం నీకునచ్చిందా? రోషాగ్ని శాంతించిందా? దుర్నడతగల కీచకుడిగతి చూశావా? సంతోషించావా? దుష్టవర్తనులై నిన్ను కోరి చెంతకు చేరే ఏ వీరుడికైనా నా చేతిలో బ్రతకటం సాధ్యమేనా?

**విశే:**

తిక్కనగారి ఉభయకావ్యశిల్పానికి ఇది నిదర్శనమైన పద్యం. కీచకవధాఘట్టం మొత్తం భీముడి ఈ అయిదు ప్రశ్నలలోనే పరుచుకొని కనిపిస్తుంది. సింహబలమర్దనుడైన భీముడు ద్రౌపదీరమణునిగా భాసించిన ఘట్టమిది. ఒక ఘనకార్యాన్ని సాధించిన భర్త, భార్యమెచ్చుకోలును ఆశిచటం లాంటిదే. భీముడు అడిగిన ఈ ప్రశ్నలు.

**వ్యాకరణకార్యాలు**

**సంధులు:** చింతాశల్యము + పాసెనే? = చింతాశల్యమువాసెనే (గసడదవాదేశసంధి)
భుజబల + ఉత్సేకము = భుజబలోత్సేకము (గుణసంధి)

**సమాసాలు:** చింతాశల్యము = చింత అనే శల్యము (రూపకసమాసం)
భుజబలోత్సేకము = భుజబలం యొక్క ఉత్సేకం (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు :** మ స జ స త త గ
U UU/I I U/I U I/I I U/U U I/UUI/U
చింతాశ/ల్యమువా/సెనే?భు/జబలో/త్సేకంబు/నీకెక్కె/నే?

**లక్షణాలు:** శార్దూలం. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "మ-స-జ-స-త-త-గ" అనే గణాలుంటాయి. యతి 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో మొత్తం అక్షరాలు -19.

**- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం,
వారణాసి

పాఠం - 7

# కీచక వధ - తిక్కన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - విరాటపర్వం - ద్వితీయాశ్వాసం
## (22 నుండి 361వ పద్యం వరకు)

# సందర్భ సహిత వ్యాఖ్యలు

**1) ద్రౌపదీరూపమను ఉరితగిలి తనదు హృదయమను మృగము (2-24)**

**లేక**

**కాముడను బల్లిదపు వేటగాని బారిబడుటకు (2-24)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** అక్క సుదేష్ణకు నమస్కరించటానికి వచ్చి, అంతఃపురంలోనున్న సైరంధ్రిని చూచి కీచకుడు మరులుకొన్నప్పటి సందర్భంలోనిది.

**భావం:** "ద్రౌపదీ రూప సౌందర్యమనే ఉరిత్రాడుకు తగుల్కొని, కీచకుని హృదయమనే జింక, మన్మథుడనే బలమైన వేటగాని బారిన పడటానికి ఆ సింహబలుడు ఎంతో చలించాడు" - అని భావం.

**2) ఇత్తలోదరిన్ చెందగు గాన్పుగాదె ఫలసిద్ధి పురాతన పుణ్యవృద్ధికిన్ (2-26)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** ద్రౌపది సౌందర్యాన్ని చూచి మరులుగొన్న కీచకుని తలపోతయిది.

**భావం:** 'మానవులెవరైనా ఇటువంటి సౌందర్యరాశిని ఎక్కడైనా చూశారా? నాకే కాదు దేవేంద్రుని కొడుకైన జయంతునికి కూడా ఆసక్తిగా చూడదగిందే ఆమె అందం. ఈ సౌందర్యవతి వలన మదనుని అధికారం లోకాలలో విస్తరించదా? పూర్వపుణ్యం ఫలించటమంటే ఈమెను పొందటమే కదా!' - అని కీచకుడు ద్రౌపదిని చూచి భావించాడని భావం.

**3) ఈడగు చుట్టంబుదడవి యెట్టులొక్కొ బడయువాడ (2-30)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సుదేష్ణ అంతఃపురంలో కనిపించిన ద్రౌపదిని చూచి, కీచకుడు ఆమెను పొందే మార్గమేమిటా? యని తలపోస్తున్న సందర్భంలోనిదీ వాక్యం.

**భావం:** ఈ అతిలోక సౌందర్యవతికి జన్మనీయటం చేత ప్రకాశించే ఆ దంపతులు ఎవరో కదా! ఈమెకు పేరుగా కుదురుకున్న ఆ ఇంపయిన అక్షరాలు ఏవో! ఈమెను భర్తగా పొంది అతిశయించి భూమిమీద జీవించేవాడు ఎవరబ్బా! ఈమె ఉండటం చేత అందగించి ప్రకాశించే ఆ యిల్లు ఏదో కదా! ఈమెను పొందగలిగేమార్గం ఏది? నన్ను ఊరడింపచేసి, ఈ విషయంలో నాకు తోడుపడే సరయిన ఆప్తుడిని వెదకి ఎలా పొందగలవాడను? అని కీచకుడు విరహతప్తమానసంతో ఆలోచించసాగాడు.

**4) "మదన వికృతియ కాందనమది తలంచి, రాగ సాగర పూర నిర్మగ్నుడయ్యె" (2-33)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** తనను గుచ్చిగుచ్చి చూస్తున్న కీచకుని గురించి భయపడే ద్రౌపది చేష్టలను చూచి కీచకుడెలా భావించాడో చెప్పే సందర్భంలోనిది.

**భావం:** ఈ కీచకుడు ఏమాత్రం భయపడకుండా నన్నే చూస్తున్నాడని మదిలో కలత పడటం చేత, క్రమంగా చెమటపట్టింది. తన పట్ల ఎప్పుడూ అనుచిత కృత్యాలే చేసే ఆ బ్రహ్మదేవుని శక్తిని తలచి నిశ్చేష్టురాలయింది. నాకెవరూ ఇక్కడ దిక్కులేరనన్న భావంతో శరీరంలో వణకుపుట్టింది. ఏమి చేయటానికి ఉపాయం తోచక ముఖం వెలవెలపోయింది. అటువంటి పాంచాలిని చూచి నరాధముడు, వివేకహీనుడైన కీచకుడు సంతోషపడుతూ, ఇవన్నీ తనను చూడటం వలన కలిగిన మదన వికారాలని భావించి వలపు సాగరంలో మునిగిపోయాడు అని భావం.

**5) "అణంగు పట్టి యాడెడు జంత్రంబు పగిదినుండె" (2-37)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** సుదేష్ణమందిరంలో కనిపించిన సైరంధ్రీ మోహంలో పడి కొట్టుకుపోతున్న కీచుకుని స్థితిని చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** సైరంధ్రీ శరీర సౌందర్యం వెల్లువై ముంచెత్తుతుండగా, కెంపులవంటి చిగురాకు చేతులనుండి వెలువడే కొత్త మెరుపుల లేత ఎండ అతనిపై వ్యాపించగా, పద్మం వంటి ముఖంనుండి ప్రసరించే కాంతులు సైన్యంలాగా విజృంభించి చుట్టుముట్టగా, తెల్లని కన్నులు తమ కనురెప్పల నల్లని కాంతితో చీకట్లు ముసిరేటట్లు చేయగా, సింహబలునికి మనసులో భయం అధికమై, చెమటలు పట్టి ఉక్కిరిబిక్కిరయి మనసు చెదిరి, ఎక్కడా నిలవటానికి మనసురాక మదనుడు పట్టి ఆడించే జంత్రంలాగా ఉన్నాడు – అని భావం.

**6) "మన్మథుడు సమయించిన మగుడ నన్ను బడయవచ్చునె యెన్నియుపాయములన్" (2-47)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** సుదేష్ణవలన సైరంధ్రి వివరాలను తెలిసికొని, మోహావేశంతో వేగిరపడుతూ, ద్రౌపది మనస్సును తెలిసికొనే ఉపాయంతోచక, ద్రౌపదితో సంభాషించిన సందర్భంలోనిది.

**భావం:** ఓ సౌందర్యరాశి! దృష్టిదోషం తగులుతుందేమోనని, నీ శరీరాన్ని సూటిగా చూడటానికి కూడ జంకుతాను. నా మనసులో అనుకున్న మాటలు నీ గొప్పతనంవలన నాలుక తుదికి రావటంలేదు. నీ చేతులు నా చేతులలోకి తీసుకోవాలనుకుంటే అంగీకరిస్తావో లేదో నన్న శంకతో చేతులు వణకిపోతున్నాయి. నీవు ఇలాగేన్ను ఇంకొంతసేపు పట్టించుకోకపోతే ఆ మదనుడే నన్ను చంపేస్తాడు. ఆ తరువాత నీవు ఎన్ని ఉపాయాలతో ప్రయత్నించినా నన్ను పొందగలవా?

**7) "అన్న! మదన వికృతింజేయుననుట యెంతయును నిషిద్ధముగాదె!" (2-49)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుడు తన మనసులోని అనురాగాన్ని వ్యక్తపరచినప్పుడు ఆతని బారినుండి తప్పించుకోవటానికి, సైరంధ్రి పలికిన మాటలివి.

**భావం:** ఓ అన్నా! నేనున్న ఈ కష్టపరిస్థితిని నీవు పట్టించుకోవటం లేదు. ఏవగించుకోవలసిన ఇటువంటి నా శరీరాన్ని, ధరించిన ఇటువంటి చీరలు నిన్ను మదన వికారం కలిగింపచేస్తున్నాయనటం మిక్కిలి అసమంజసంకదా! అని సైరంధ్రి కీచకునితో అన్నది.

**8) "అందని మ్రాకులపండ్లు గోయదలచుట హితమే!" (2-58)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** ఓర్పుగా చెప్పినప్పటికీ పట్టించుకోని కీచకుడిని తనకు రక్షగా గంధర్వులైన తన పతులు ఉన్నారని చెప్పి భయపెట్టే ప్రయత్నమూ చేసింది. అయినా లక్ష్యపెట్టని కీచకునితో సైరంధ్రి చెప్పిన మాటలివి.

**భావం:** ఓ వివేక విహీనుడా! ఇది తగును ఇది తగదు అన్న వివేకంలేకుండా అందని చెట్ల ఫలాలకు ఆశపడుతున్నావు. పూర్వం రావణాసురుడు మొదలయిన వాళ్లు ఇలాగే పరస్త్రీలను కోరి చెడిపోవటం నీకు తెలియదా? - అని హెచ్చరించింది.

**9) "మాయదైవమ! యేనేమి సేయుదాన!' (2-62)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రిని చూచిన కీచకుడు మోహపరవశుడైనాడు. ఆ విషయాన్ని తన అక్క సుదేష్ణతో ముచ్చటించటానికి సన్నద్ధుడైనాడు. ఆ సందర్భంలో సుదేష్ణ తన క్లిష్టస్థితిని తలచుకొని మనసులో బాధపడే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** 'వీడు సైరంధ్రిని చూచి మోహంలో మునిగిపోయాడు. దీనివలన ఏ విపత్తు కలుగుతుందో! తగదు, వద్దని చెపితే వీడు వినేటట్లు లేదు. ఓ దైవమా! నేనేమి చేసేదీ - అని మనసులో సుదేష్ణ బాధపడుతోంది.

**10) 'కాని తెరువునుబోయిను గలుగునయ్య బ్రదుకు' (2-73)**

**లేదా**

**చవియెంతయైన నపథ్యములకు వేడ్కసేయుదురయ్య (2-73)**

**లేదా**

**నా బుద్ధి వినవయ్య తమకముడిగి (2-73)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రిపట్ల ఆకర్షితుడైన కీచకుని బుద్ధికి బాధపడుతున్న సుదేష్ణ, తన తమ్ముడైన కీచకునికి హితోక్తులు చెప్పే సందర్భంలోనిది.

**భావం:** 'చెడుమార్గంలో పోతే బ్రతుకుకు క్షేమమా? ఎంత ఆసక్తిని కలిగించినా వివేకవంతులు హితం కలిగించని పనులకు ఉబలాట పడతారా? నా మాటవిని నీ మోహాన్ని వదలిపెట్టి నడుచుకో!' - అని సుదేష్ణ తన తమ్ముడైన కీచకునికి హితవు చెప్పింది.

**11) "వీనికెమ్మెయిం జావునిజంబు మన్మథునిశాత శరంబులనైన నక్కటా!" (2-78)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** అక్క సుదేష్ణ చెప్పిన హితోక్తులు రుచించక 'బుద్ధులు చెప్పటం మాని సైరంధ్రిని నాకు సమకూర్చి పెట్టమన్న' కీచకుని వక్రబుద్ధికి సుదేష్ణ అనుకున్న మాటలివి.

**భావం:** ఆ తరువాత వచ్చే ఆపదలనలా ఉంచి, ప్రస్తుతానికి సైరంధ్రిని ఈ కీచకునికి సమకూరిస్తే తప్ప, వట్టిమాటలతో మనసు మార్చుకునేటట్లు లేదు. కండకావరంతో నున్న వీడు మంచిని చెపితే గ్రహించేటట్లు లేదు. వీడికి ఎలాగైనా చావు తప్పేటట్లు లేదు. అది సైరంధ్రి భర్తలవలననా? మదనుని వాడి బాణాలవలననా? - అని సుదేష్ణ మనసులో అనుకొన్నది.

**12) "కొని రమ్మా! చూతముగాని నీ గమనవేగంబున్" (2-89)**

**లేదా**

**నా హృదయంబున వేడ్కయెసకమెసుగెడు దరుణీ! (2-88)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుని నిర్బంధపు కోర్కెను కాదనలేక సుదేష్ణ, మదిరవంకతో సైరంధ్రిని కీచకుని మందిరానికి పంపిస్తానని, కీచకునికి మాట ఇచ్చింది. కీచకుని మందిరానికి సైరంధ్రిని పంపేందుకు సమాయత్తం చేస్తూ సుదేష్ణ మాటలివి.

**భావం:** 'సైరంధ్రీ! తీవ్రమైన దాహంతో నోరు ఎండిపోతున్నది. సువాసనతో కూడిన మదిరను తాగాలని నా మనస్సు తీవ్రంగా వేడుకపడుతున్నది. కీచకుని ఇంట్లో మంచిరుచిగల మద్యం ఉంటుంది. నీవు త్వరగా వెళ్లి తీసుకొనిరా! నీవు ఎంత త్వరగా వెళ్ళి రాగలవో చూద్దాం! అని సుదేష్ణ సైరంధ్రితో అన్నదని భావం.

**13) "బెబ్బులి యున్న పొదరు సొచ్చులేడి చందంబునన్" (2-112)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం :** తప్పనిసరి పరిస్థితులలో సైరంధ్రి, మదిరతేవడానికి కీచకుని మందిరానికి బయలుదేరింది. కీచకుని మందిరంలోనికి ద్రౌపది ప్రవేశించిన తీరును చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** కీచకుని బారినుండి కాపాడమని సూర్యభగవానుని వేడుకొని, ఎట్లాగో ప్రయాసపడి, కలతపడుతూ కీచకుని మందిరానికి సైరంధ్రి చేరింది. ఆ మందిరంలోకి సైరంధ్రి ప్రవేశించటం ఎలా ఉందంటే, పెద్దపులి పొదలోకి వెళ్లే లేడిలాగా ఉందని కవి ఉపమించి చెప్పాడు.

**14) "ఇంక ఈ సిగ్గుదెర యోలమేల నీకు?" (2-118)**

**లేక**

**సరస సంభావనమెయి దీర్పకునికి పాడియె చెపుమా! (2-117)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** తన మందిరానికి వచ్చిన సైరంధ్రిని చూచి, కీచకుడు ఆమెతో మాట్లాడే సందర్భంలోనిది.

**భావం:** ఓ సుందరాంగి! నీ యజమానురాలి దప్పికను తీర్చటానికి పూనుకొన్న నీవు, ఆమె సోదరుడినైన నా దప్పికను కూడా నీ సరసమైన మన్ననతో తీర్చక పోవటం న్యాయమా? నీ కడగంటి చూపుతో కూడని నా దేహపు తాపాన్నీ , తీయని నీ పలుకులు వినలేకపోవటం చేత కలిగిన వీనుల తాపాన్నీ, ఇంపైననీ చేష్టలను మెచ్చలేని కోర్కెల వలన కలిగిన మదన తాపాన్ని సొక్కింపచేసే నీ శృంగార చేష్టలలో చిక్కి ఆనందించలేనందున కలిగిన మనస్తాపాన్నీ పోగొట్టి, నా పుట్టుక ఫలించేలా నన్ను నీ బంటుగా స్వీకరించి పాలించు. ఇంకా ఈ సిగ్గుతెరల చాటు దేనికి? అని నిస్సిగ్గుగా అడిగాడని భావం.

**15) ఈ భూజమువంటకట్టియలకై ఖండింపగా నేటికిన్ (2-136)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రిని నేల పడద్రోచిన కీచకుని మట్టుపెట్టాలని ఉద్రేకంతో వృక్షాన్ని పెరకబోతున్న వలలుడిని ఉద్దేశించి, కంకభట్టు రూపంలోనున్న ధర్మరాజు నర్మగర్భంగా పలికిన వాక్యమిది.

**భావం:** వలలుడు ఈ చెట్టును ఎక్కడ చూశాడు. మరొక చోట ఉపయోగపడని చెట్లు లేవా? పండ్లతో, మంచి కొమ్మలతో, సంతోషాన్ని కలిగిస్తూ, విశాలమైన నీడతో, చెంతకు చేరిన వారి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెల కోసం నరకటం దేనికి? అని అన్యాపదేశంగా ధర్మరాజు సభను ఉద్దేశించి వలలునికి వినిపించేలాగా అన్నాడు.

**16) "ఎవ్వరి యాండ్రురింకు బరిభవంబును బొందకు బ్రదుకువారు" (2-140)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** ద్రౌపది తన భంగపాటును విరాటునితో చెప్పుకునే సందర్భంలోనిది.

**భావం:** కీచకుడు తనను అవమానించినప్పుడు సభలోనున్న భర్తలను కోపంగా చూచి, విరాటునితో ఇలా అన్నది. ఏది ధర్మమో, ఏది అధర్మమో క్షుణ్ణంగా తెలిసినవారూ, సాధుజనుల్ని రక్షించి, దుష్టుల్ని శిక్షించే వారూ, శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరినవారూ, శత్రువుల్ని అవలీలగా చంపగలవారూ అయిన నా భర్తలే, కీచకుడిలా చేస్తుంటే ఉదాసీనంగా చూస్తూ మిన్నకుండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇలాగయితే ఇక లోకంలో ఎవరి భార్యలు అవమానాల పాలుకాకుండా బ్రతుకగలరు? - అని విరాటునితో అన్యాపదేశంగా సైరంధ్రి అన్నదని భావం.

**17) నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు**
**లేదా**
**పెద్దవారి యట్లు పిన్నవారు**
**లేదా**
**ఏ శైలూషి గాననంగరాదు**
**లేదా**
**జూదరియాలికి గఱువచందంబెక్కడిది**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** విరాటుని సభలో కూర్చున్న కంకభట్టు (ధర్మజుడు), వలలుడు (భీముడు) ఇద్దరూ సైరంధ్రి భంగపాటును చూచి మిన్నకున్నారని ఏమీ పలుకలేదు. ఇలా అయితే కులస్త్రీలకు రక్షణ ఎక్కడిదంటూ సైరంధ్రి అన్యాపదేశంగా మాట్లాడింది. ఆ మాటలకు కంకభట్టు జోక్యం చేసికొని, కులస్త్రీల గౌరవం చెరిగిపోయేలా నాట్యం చేస్తున్నట్లుగా ఈ స్వైరవిహారమేమిటి? సభనుండి సుదేష్ణ అంతఃపురానికి వెళ్ళిపొమ్మని సైరంధ్రిని అన్నాడు. ఆ మాటలకు సైరంధ్రి కోపంతో అన్నమాటలివి.

**భావం:** ఓ కంకభట్టా! నిజమే. నా భర్తనటుడు. పెద్దవాళ్లలాగే చిన్నవాళ్లు కూడ. కాబట్టి నేను కూడ నా భర్తవంటిదానినే. అందుచేత నేను నర్తకిని కాదని అనటానికి వీలులేదు. నాకు నాట్యం చెయ్యటం అలవాటే. అంతేకాదు నా భర్త జూదగాడు కూడ. జూదరి భార్యకు గౌరవం ఎక్కడినుండి వస్తుంది? అని సైరంధ్రి కంకభట్టును అధిక్షేపించి వెళ్లిపోయింది.

**20) "వగనాకు వింతయే" (2-176)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రి తన భంగపాటును చెప్పుకోవటానికి వలలుని వద్దకు రాత్రివేళ వచ్చింది. జరిగిన విషయం మొత్తాన్ని గుదిగుచ్చి చెప్పమని వలలుడన్నాడు. ఆ సందర్భంలో విషయాన్నంతా వివరించి, తన కష్టజాతకాన్ని తలచుకొని సైరంధ్రి బాధపడే సందర్భంలోనిది.

**భావం:** అయ్యో! మీ బలపరాక్రమాలు వమ్మయిపోగా, దుశ్శాసనుడు ఆ సభలో నన్ను అవమానించాడు. అంతేకాకుండ సైంధవుడునన్ను, ఎటువంటి భయమూ లేకుండా నన్ను తీసికొనిపోయి అనుచితంగా ప్రవర్తించినా చెల్లిపోయింది. ఇప్పుడు విరాటుని సభలో అందరూ చూస్తుండగా వీడు ఈ విధంగా చేశాడు. దుఃఖం నాకు కొత్తేమికాదు" - అని సైరంధ్రి వలలునితో చెప్పుకొన్నదని భావం.

**21) "ఆడుకూయు నాలకూయునులాతి వారికైన నరయవలయు" (2-177)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రి తన భంగపాటును చెప్పుకోవటానికి వలలుని వద్దకు రాత్రివేళ వచ్చింది. జరిగిన విషయం మొత్తాన్ని గుదిగుచ్చి చెప్పమని వలలుడన్నాడు. ఆ సందర్భంలో విషయాన్నంతా వివరించి, తన కష్టజాతకాన్ని తలచుకొని సైరంధ్రి బాధపడే సందర్భంలోనిది.

**భావం:** 'అయ్యో! ఆడుదాని ఏడుపును, ఆవుల ఆక్రందననూ శత్రువుల విషయంలోనైనా గమనించి రక్షించాలి' - అని లోకప్రసిద్ధి. అటువంటప్పుడు కీచకుడిలా నన్ను తన్నితే, ధర్మరాజు ఎలా చూస్తూ ఉండిపోయాడు - అని సైరంధ్రి, వలలునితో చెప్పుకొని బాధపడిందని భావం.

**22) "తడవి నాచేత దీవన వడయుమమ్మ" (2-214)**

**లేదా**

**నిన్నని యూఅడిల్లెదున్ (2-213)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సైరంధ్రి రాత్రివేళ వలలుని చెంతకు వెళ్లి తన భంగపాటును చెప్పి, పాండవుల గొప్పతనాన్ని చెపుతూ, సహదేవుని గురించి చెప్పే సందర్భంలోనిది ఈ పద్యం.

**భావం:** వనవాసానికి పోయేటప్పుడు కుంతీదేవి, సహదేవుడిని ద్రౌపదికి అప్పగించి "పసివాడు ఈ సహదేవుడు. ఔను కాదు చెప్పటం చేతగానివాడు. ఏ కష్టమూ తెలియనివాడు. ఎప్పుడైనా నేను పిలిచి పెడితే తప్ప ఆకలి కూడా తెలియదు. కోమల హృదయుడైన ఈ కొడుకు ఇలా వనవాసానికి పోవటం బాధగా ఉంది. అయినా నీవున్నావన్న ధైర్యంతో ఊరడిల్లుతున్నాను. ఓ ద్రౌపదీ! ఎక్కడైనా, ఎప్పుడైనా, అన్నిటా ఎట్లా చూసుకోవాలో అట్లాగే చూసుకో. అలసిపోయినా, సొలసిపోయినా, కష్టపడినా ఏమరకుండా అతని మనసు తెలిసి, కనిపెట్టి కాపాడి, నా దీవెనలను పొందమని" చెప్పిందని ద్రౌపది గుర్తుచేసుకొని భీమునితో ప్రస్తావించింది.

**23) "పనిగఱపెడు చందమునన పనుచుటెఱుగవే" (2-219)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** ద్రౌపది తన కష్టాన్ని భీమునితో చెప్పుకునే సందర్భంలోనిది.

**భావం:** 'అభిమానాన్ని కోల్పోయి సుదేష్ణకు పరిచర్యలు చేస్తున్నాను. పట్టమహిషిగా పనులు చేయించుకోవటమేగాని, పని చేసి ఎఱుగను. కుంతీదేవికూడ, నా చేతపని చేయించుకోవలసివస్తే, చేయించుకోవటానికి సందేహించేది. పని నేర్పుతున్నట్లుగా, చెప్పి చేయించుకునేది. అది ఆజ్ఞాపించినట్లు ఉండేదికాదు.' అని సైరంధ్రిగానున్న ద్రౌపది తన బాధను భీమునికి చెప్పుకున్నది.

**24. "విధాతృలుబ్ధకవశంబునుబోవు మృగంబు చాడ్పునన్" (2-247)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచక వధకు నిర్ణయం జరిగాక, యథావిధిగా సైరంధ్రి, అంతఃపురంలో తన పనులలో నిమగ్నురాలయింది. కీచకుడు, ఆమెను ఎలాగయినా లొంగదీసుకోవాలనే సంకల్పంతో, సైరంధ్రి చెంతకు బయలుదేరి వచ్చే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** సైరంధ్రిగా యున్న ద్రౌపదిని చూచి, కొత్త అనుభవంకోసం ఆశపడుతూ, ధైర్యం సడలుతుంటే చలించే మనస్సుతో, అక్కడ ఉన్న పరివారమంతా దూరంగా వెళ్లేవరకు నిరీక్షించి చూసే ఓపికలేక, వేటగాని పాశానికి చిక్కటానికి పోయే జింకలాగా ద్రౌపది చెంతకు వెళ్లాడు.

**25) "సౌభాగ్యము కుందునే మగలపైనొకయించుక చూడ్కి నిల్పినన్." (2-252)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుడు సైరంధ్రిని చూచి, వివిధ శృంగార చేష్టలు చేస్తూ ఆమె వద్దకు పోయి అన్నమాటలివి.

**భావం:** నీ పాదపద్మాల చెంతకు చేరి కొలిచే అవకాశం లభిస్తే అదృష్టంకదా! నన్నొక్కడినే అంగీకరించటం లేదా? కామసౌఖ్యాలపట్ల నీకు వైరాగ్యభావం స్థిరంగా ఏర్పడిందా? నిజం తెలిసేలా చెప్పు. పురుషుల మీద రవ్వంత దృష్టినిలిపితే, నీ అందం తరిగిపోతుందా? అని కీచకుడు ద్రౌపదితో అన్నాడు.

**26) బెబ్బులి గోలఁవ్రేచినటు లుగ్రాకారమేపారుగన్ (2-281)**

**లేదా**

**సాళువము గాకి నొడిసిన భంగిన్ (2-282)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** నర్తనశాల సంకేతస్థలంగా చెప్పి, రాత్రికి రమ్మని సైరంధ్రి కీచకుడిని నమ్మించింది. ఆ విషయాన్ని వలలునికి (భీముడికి) చెప్పి, రాత్రికి నర్తనశాలకు సన్నద్ధం కమ్మని చెప్పింది. ఆ నర్తనశాలలో తానేమి చేయపోతున్నాడో భీముడు చెప్పే సందర్భంలోనిది

**భావం:** బలిష్ఠుడైన ఆ అందగాడు మదనగర్వంతో వచ్చి, నిశ్చలంగానున్న నన్ను చూచి, నీలాగా నేను లేకపోవటంతో కలతపడి పోతాడు. అప్పుడు మందిరమంతా అదిరిపడిపోయేలా 'కఱ్ఱతో కొట్టిన పెద్దపులిలా భయంకరరూపంతో బాధిస్తాను. ఒక వేళ కీచకుడు నన్ను గుర్తించి వెనుకకు అడుగేస్తే, వాడి మీదికి ఎగసి, డేగ కాకిని ఒడిసిపట్టుకున్నట్లుగా వాడిని పట్టుకుంటాను. నీకసితీరేలా వాడిని పీడిస్తాను.' అని వలలుని రూపంలోనున్న భీముడు ద్రౌపదితో చెప్పాడు.

**27) నా అభిమతం బొడగూడియునిష్ఫలంబగున్ (2-286)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకుడిని సంకేత స్థలానికి రమ్మని చెప్పిన విషయాన్ని, సైరంధ్రి, వలలునికి (భీమునికి) తెలియజెప్పింది. ఆ చీకటివేళ ఆ నర్తనశాలలో తానేమి చేయదల్చుకున్నాడో భీముడు అత్యుత్సాహంతో చెప్పాడు. భీముని ఉత్సాహాన్ని చూచి, ఎక్కడ సమయభంగమవుతుందోనని సైరంధ్రిగా నున్న ద్రౌపది, మనసులో ఉలిక్కిపడి జాగ్రత్తలు చెప్పే సందర్భంలోనిది.

**భావం:** శత్రువులు నవ్విపోయేలాగ, ధర్మరాజుకు దుఃఖం కలిగేలా, లోకనిందకలిగేలా, ఈ కలహంలో నీవు పట్టరాని కోపంలో సమయభంగం చేస్తే, నా కోరిక తీరినప్పటికీ చివరికి పొందే ఫలితం శూన్యమే అవుతుంది.' - అని వలలుని రూపంలోనున్న భీమునికి సైరంధ్రి (ద్రౌపది) హెచ్చరిక చేసిందని భావము.

**28) "మాయరవియేలుగ్రుంకడొకో? (2-312)**

**లేదా**

**దాయవతిచెనను మనోజతాపము పేర్మిన్ (2-312)**

**లేదా**

**నాకకానేడ దివము సాగి నిలిచెనొక్కొ (2-313)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' - ఘట్టంలోనిది.

**సందర్భం:** సంకేత స్థలానికి రాత్రికి రమ్మని చెప్పిన సైరంధ్రిని గురించి తలపోస్తూ, ఉద్యానవనంలో విహరిస్తూ ఎప్పుడు పొద్దుక్రుంకుతుందా? యని ఎదురుచూస్తూ, సైరంధ్రీ విరహంతో అల్లల్లాడుతూ కీచకుడు అన్నమాటలివి.

**భావం:** మదన వేదన దుర్భరమై కీచకుడు 'ఈ మాయదారి సూర్యుడు ఇంకా ఎందుకు అస్తమించడు?' 'ఇలా ఎందుకు ఆలస్యం చేస్తున్నాడు?' 'అడుగో అస్తమించబోతున్నాడు', 'పగవాడైనన్ను బాధపెడుతున్నాడు' - అని పలువిధాలుగా రాత్రి

త్వరగా రాలేదని బాధపడతాడు. ఇంకా 'బ్రహ్మ, పగలు తప్ప రాత్రిలేకుండా లోకంలో చేశాడా? నా కోసమే ఈ రోజు పగలు ఇంత పొడవై సాగి కదలటంలేదా?' – అని సూర్యుడిని ఉపాలంభించాడని భావం.

**29) "ఇట్టివాడవుగావున నీవు నిన్నుఁబొగుడికొనుదగు" (2-337)**

**లేదా**

**నాపోల్కి యాఁడుదాని వెదకియునెయ్యెడనైన నీకు బడయవచ్చునె (2-337)**

**లేదా**

**నాయొడలు సేర్చినప్పుడు నీ యొడలెట్లగునొ? (2-338)**

**లేదా**

**నన్నేయబలతోడిదిగాఁ జేయదలచితివి తప్పుసేసితికంటె (2-338)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** నర్తనశాలలో సైరంధ్రి రూపంలోనున్న వలలుడు కీచకునితో సంభాషిస్తూ లోకంలో స్త్రీలంతా తనను వలచి తనపొందుకై తహతహలాడుతుంటే, తానుమాత్రం సైరంధ్రిపొందుకై అల్లాడుతున్నానని కీచకుడు అనగా, సైరంధ్రివేషంలోనున్న భీముడు సమాధానం చెప్పే సందర్భంలోనిది.

**భావం:** ఇలాంటి వాడివి కాబట్టే, నిన్ను నీవే పొగడుకోవటం సమంజసం. నాలాంటిస్త్రీ నీకెక్కడా దొరకదు. తెలియక నీవలా అన్నావు. నా మేనితో నీమేను తగిలినప్పుడు నీ శరీరం ఏమవుతుందో అది నీవే తెలుసుకుంటావు. నన్ను మిగిలిన సామాన్యస్త్రీలతో సమానంగా చేయదలచుకున్నావా? తప్పుచేసినట్లే సుమా!' – అని వ్యంగ్యంగా కీచకునితో, భీముడు చెప్పాడు. ప్రతివాక్యమూ అర్థాంతరం స్ఫురించేలా భీముడు కీచకునితో మాటలాడాడు.

**30) "మహితవిస్మయానందనిర్మగ్ననైతి" (2-360)**

**కవిపరిచయం:** ఈ వాక్యం మహాకవి తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతం, విరాటపర్వంలోని, ద్వితీయాశ్వాసంనుండి గ్రహించబడిన 'కీచకవధ' – ఘట్టంలోనిది.

**సందర్భం:** కీచకవధ ముగిసిన తరువాత, కీచకుడిని చంపిన వలలుడిని (భీమసేనుడిని) చూచి, సైరంధ్రి (ద్రౌపది) సంతోషంతో పలికిన మాటలివి.

**భావం:** విరాట రాజు కొలువులో నిన్న అంత కోపం వచ్చినప్పటికీ చలించకుండా నిలిచిన ధైర్యం, ఈ రోజు నర్తనశాలకు వచ్చి ప్రజలకన్నులు కప్పి, ఏ విధమైన వికారం లేకుండా కార్యాన్ని సాధించిన గౌరవం, మనపాండవులలో ఒక్కరిని కూడా పిల్వకుండా పరాక్రమించిన సాహసం, లోకానికి దుర్జయుడైన కీచకుడిని చిటికెలో చంపిన పరాక్రమం, చూడటానికి, తలపోయటానికి, అభినందించటానికి కీర్తించటానికి నాకు సాధ్యం కాదు. ధీరోదాత్తమైన నీ నాయక స్వభావాన్ని తెలుసుకొని పొగడాలంటే నేనెంతటిదానిని? గొప్ప ఆశ్చర్యంలో, ఆనందంలో మునిగిపోయాను.' – అని ద్రౌపది భీముడిని అభినందించింది అని భావం.

**– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**

తెలుగు శాఖ

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 8

# కీచక వధ - తిక్కన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - విరాటపర్వం - ద్వితీయాశ్వాసం (22 నుండి 361వ పద్యం వరకు)

## వ్యాసరూప సమాధానాలు

**1. మీ పాఠ్యభాగాన్ని అనుసరించి సుదేష్ణ పాత్రను వివరించండి?**

'దిశ'ఉత్సర్జనే అనే ధాతువునుండి సుదేష్ణ శబ్దం వచ్చింది. ఉత్సర్జనమంటే విచ్చలవిడిగా విడిచిపెట్టటమని అర్థం. 'దేష్ణా దాతరి దుర్మదే' అని ఉంది. దీనికి సుశబ్దాన్ని చేరిస్తే మంచి దానగుణం కలది, దుర్మతం అధికంగా గలది అనే అర్థాలు వస్తాయి. విరాట పర్వంతో దానదయాళుత్వాలున్న స్త్రీగానే సుదేష్ణ కనిపిస్తుంది.

సుదేష్ణ శబ్దానికి కొంతమంది ఒత్తుపెట్టి సుదేష్ణగా రాస్తారు. సంస్కృత భారతంలోగాని, తెలుగు భారతంలోగాని ఒత్తులేని రూపమే కనిపిస్తుంది. సుధిషణయే సుదేష్ణగా కొంతమంది భావిస్తారు.

సుదేష్ణ కేకయరాజుకు రెండవ భార్య మాళవిక యందు కలిగిన సంతానం. ఈమె అసలు పేరు 'చిత్ర'. విరాటరాజు కూడా తన తొలి భార్య సురభి మరణానంతరం, సుదేష్ణను వివాహమాడాడు. కేకయ రాజు తొలి భార్య సంతానం 'కీచకులు'. వారిలో పెద్దవాడే ద్రౌపది సౌందర్యానికి ఆకర్షితుడై నశించాడు.

సుదేష్ణ తన తమ్ముడైన కీచకుని పట్ల బద్ధానురాగ. సైరంధ్రి పట్ల ఎంత అనురాగమున్నప్పటికీ, తమ్ముని పట్లగల ప్రేమ, గౌరవాలే ఆమెను ఇచ్చిన మాటను సైతం మరచిపోయేలాగా చేసింది. తిక్కనగారు కీచకవధలో సుదేష్ణపాత్రను ఐదు ఘట్టాలతో ముడిపెట్టి చెప్పాడు. అవి -

1. కీచకుని కోరికను విని మనసులో సంఘర్షణ పడటం.
2. సైరంధ్రిని అనునయించి కీచకుని మందిరానికి పంపటం.
3. కీచకుని చేత పరాభవించబడినదన్న విషయం తెలిసికూడ, తెలియని దానిలా నటించటం.
4. కీచకుడిని మందలించే శక్తి లేకున్నా, దండిస్తానని ఓదార్చటం.
5. కీచకుని మరణానంతరం దుఃఖించటం.

విరాటుడి పట్టమహిషిగా, అంతఃపురాన్ని దాటి బయటికి వచ్చిన దాఖలాలు లేవు. అందువలననే పైన పేర్కొన్న సన్నివేశాలన్నీ, ఆమె మందిరానికే పరిమితమయ్యాయి.

సైరంధ్రిగా అజ్ఞాతవాసపు సంవత్సరకాలాన్ని గడుపుకోవటానికి వచ్చిన ద్రౌపదిని చూచి నీ సౌందర్యం చూస్తే ఆడవాళ్లే చూపును ప్రక్కకు తిప్పుకోలేకపోతుంటే ఇక మా మగవాళ్ల సంగతేమిటి? నిన్ను భరించటం కష్టమనీ, అంతఃపురంలో ఉంటే వినాశనాన్ని తెచ్చుకున్నట్లేనని స్పష్టంగా చెపుతుంది. అంటే సైరంధ్రివలన వచ్చే ఆపదను ముందుగానే పసిగట్టిందని అర్థం. అయినా తనకు తన భర్తలు రక్షగా ఉంటారని, తాను శీలవతినని చెప్పి ఒప్పిస్తుంది. అయితే కుత్సితపు పనులకు నియోగించకుండ ఎంగిలి పెట్టకుండా తగుగౌరవంతో చూడాలని చెప్పింది. సుదేష్ణ కూడ అందుకు అంగీకరించింది. సైరంధ్రిని ఊరడించి, సేవలో ఉంచుకున్నది. మంచివారిని మంచిగా చూడటమనే లక్షణం ఆమె హృదయంలో ఉన్నట్లు ఈ సందర్భాన్ని బట్టి విదితమవుతుంది.

సుదేష్ణ హృదయం ఎంత సున్నితమైందో అంత ఉద్విగ్నమైనది కూడ. మాటలో, నడతలో సంస్కారం లేకపోతే తనంతట తానుగా దారిన పోతున్న సైరంధ్రిని పిలిచి, ఆదరించదు. సైరంధ్రి సేవలను అందుకునే అర్హత ఉన్నట్లుగానే ఆమె వర్తనం మొదట కనిపిస్తుంది. కాని తరువాత చూస్తే ఆదర్శవంతమైన నడవడిక ఉన్నట్లు కనిపించదు.

ఏ బాదరబందీలేకుండా, సమస్య లేకుండా జీవితాన్ని గడపాలని భావించే సుఖాలాలస ఆమె అంతరంగంలో ఉంది. అందువలననే ధర్మంకోసం ఆమె గట్టిగా నిలబడినట్లు కనిపించదు. స్వయంగా ద్రౌపదిని పిలిపించుకొని, తనవద్ద ఉంటే ప్రమాదమని భయపడి, పొమ్మని అనటం వెనుక ఉన్నది బుద్ధికి స్థిరత్వం లేని లక్షణమే. ద్రౌపది అనునయించి చెపితే మళ్లీ అంగీకరించింది. అంటే స్వయం నిర్ణయశక్తి, స్వల్పమని తోస్తుంది. కీచకుని అండదండలతో మనగలగటం కూడా అందుకు ఒక కారణం కావచ్చు.

సైరంధ్రీ సౌందర్యం వలన పురుషులు ఆకర్షించబడతారని సుదేష్ణకు స్పష్టంగా తెలుసు. అందుకే తన భర్తను సైరంధ్రిబారిన పడకుండా కాపాడుకోగలిగింది కాని తమ్ముడిని రక్షించుకోలేకపోయింది. కీచకుడు సుదేష్ణ మందిరంలోనే, సైరంధ్రిని చూచి మదనావేశవివశుడై, వికారపు చేష్టలు చేశాడు. తనకు నమస్కరించాలని వచ్చిన కీచకునికి బంగారుగద్దెను వేయించి, సోదరవాత్సల్యంతో ప్రియమారగా చూచింది. వచ్చినవాడు అక్కతో కుశల సంభాషణ చేయటంమాని, సైరంధ్రిని గురించి ప్రశ్నలు వేశాడు. ఆ ప్రశ్నల జడిని చూచి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైంది. సుదేష్ణ, కీచకుడు సైరంధ్రిని చూచి రాగరసమగ్నుడయ్యాడు. రాబోయే అపాయం తెలియదు. వద్దని వారించినా వీడు వినడు. ఏం చేయాలో పాలుపోక దైవాన్ని తిట్టుకున్నది. అయినా నా నేర్పుకొద్దీ చెప్పి చూస్తానని ప్రయత్నించింది. ద్రౌపదికి ఇచ్చినమాటను నిలబెట్టుకునేందుకు ఒక ప్రయత్నమైతే చేసింది కాని అది సఫలం కాలేదు.

భోగకాంతల సౌందర్యరూపు రేఖా విలాసాన్ని ప్రస్తావించి నీరసాకారయైన సైరంధ్రిపొందు ఏమి విశేషమంటూ మందలించింది. మొండిపట్టు పట్టినకీచకుడు, ఏ ఉపాయంతోనైనా సరే! నాకు సైరంధ్రిని సమకూర్చి పెట్టమని అడిగాడు. అంతే కాకుండ సైరంధ్రిని సమకూర్చకపోతే మన్మథబాణాలతో హతమవుతానని బెదిరించాడు. అప్పుడు కూడా మనసులేని పొందుసుఖమీయదని తెలియజెపుతూ

సీ॥ పతియెఱింగినుదన ప్రాణంబుపై వచ్చు
        ననుభయంబున నుల్లమదురుచుండ,
    జనులు గాంచిన మానుషము దూలు దనకను
        పుయిలోటమున మోము పుల్లగిలుగ,
    బోటికి దోచిను బొలియు దేకువ యను
        వెగడును జెయ్వులు వీడుపడుగ,
    బంధుల కగపడ్డు బాయు నన్వయ మను
        కలుకమై జెమటలు క్రమ్ము, దేరు

తే॥ గ్రీడ దెసుగౌతుకం బురియాద రతుల
    చవులు గొనియాడ నేరని జార పొందు
    హృదయమున కింపు చేయమి నెఱుక గలుగు
    వారు దీని సుఖంబుగా గోరరెందు. (2–70)

పరసతీ గమనం దుర్వివేకమని, ఆయురైశ్వర్యకీర్తుల్ని అపహరిస్తుందని, ధర్మమార్గంలో పయనించేవాళ్లు అటువంటి పనులు చేయరని హెచ్చరించింది. సైరంధ్రి భర్తల వలన కలుగబోయే కీడును కూడా బయటపెట్టి, తన మాటలను వినమని

బ్రతిమిలాడింది. ఈ సందర్భంలో ఆమె ప్రవర్తన అంతా ధర్మశీలగా, అంతఃపుర ధర్మరక్షకురాలిగా కనిపిస్తుంది. తన బలం ముందు గంధర్వులు పెద్ద విషయమేకాదని, ఎదిరిస్తే చంపుతానని సింహబలుడు తన అక్కతో చెప్పాడు. అంతే కాకుండ తన క్షేమం కోరితే సైరంధ్రిని కూర్చమని, బుద్ధులు చెప్పటం మానివేయమన్నాడు. ఆలస్యం చేస్తే మన్మథతాపంతో మరణిస్తానని చెప్పి దీనత్వంతో అక్కకు సాగిలపడి నమస్కరించాడు. అక్కను ప్రసన్నం చేసుకోవటానికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినట్లు సాష్టాంగ నమస్కారం చేశాడు. సుదేష్ణ చిన్నబోయి, పొంగివచ్చే కన్నీళ్లను కళ్లలోనే దాచుకుని, మనసులో సంఘర్షణను అనుభవించింది. గత్యంతరం లేని స్థితిలో మనసుకు నచ్చచెప్పుకుంది. తమ్ముడి వైపు మొగ్గింది.

ఉ॥ "ఆవలవచ్చునాపదల కన్నిటి కోర్చి లతాంగి గూర్చి
కీ వెడ మాటలన్ మరలు; డెన్ని విధంబులు జూపి చెప్పినం
గావల మైన మీదు తగు కార్యము వట్టునె? వీని కెమ్మెయిం
జావు నిజంబు మన్మథునిశాత శరంబులనైన నక్కటా!" (విరా. 2-78)

అని రాబోయే ఆపదల నన్నిటినీ ఓర్చుకోవటానికి సంసిద్ధమైంది. వీడు అటు సైరంధ్రి భర్తల చేతిలో కానీ, ఇటు మన్మథుని చేతిలోకాని చావటం తప్పని విషయమని నిర్ణయించుకొన్నది. ఇంతగా ఎందుకు బాధపడతావు. సాయంత్రంలోగా నీ మందిరానికి మదిరను తీసుకరమ్మనే మిషతో సైరంధ్రిని పంపిస్తాను. అని చావబోయే వాడి తుదికోర్చెను తీర్చినట్లుగా చెప్పి పంపించింది. ఇలా కీచకుడిని అనునయించి ఇంటికి పంపింది. దీనితో సుదేష్ణ కపటత్వం బయటపడి ఆమె వ్యక్తిత్వం మసకబారటానికి రంగం సిద్ధమైంది.

సైరంధ్రిని కీచకుని ఇంటికి పంపటానికై సిద్ధపడ్డ, సుదేష్ణ, సైరంధ్రికి ఇచ్చినమాటను గట్టునపెట్టింది. వంచనాశిల్పంతో తమ్ముడి ఇష్టాన్ని నెరవేర్చటానికే సిద్ధపడింది. తాను చేసేది అనుచితమని తెలుసు. ఈ సంఘర్షణ ఆమె పడ్డది.

క॥ 'ఒదవెడు తృష పెల్లిదమున
వదనము వఱువట్లు వట్టె వాసిత రాజ
న్మదిరారస మానుగ నా
హృదయంబున వేడ్క యెసకమెసుగెడు దరుణీ!' (విరా. 2-88)

క॥ కీచకుని యింట నెప్పుడు
వాచవి యగు బహువిధముల వారుణి గలుగున్
వే చని యచటికి గొని ర
మ్మా చూతముగాని నీ గమన వేగంబున్. (విరా. 2-89)

కపటంగా పలికింది. ఈ కపటపు మాటల ఆంతర్యం తెలిసే సైరంధ్రి కొలువులో చేరేటప్పుడు చెప్పిన మాటలను గుర్తుచేసింది. ఇంకెవరినన్నా పంపమన్నది. నీ ఇల్లు సదాచార సంపన్నమని నా భర్తలు లేకున్నా నమ్మకంతో ధైర్యంగా ఉన్నానని చెపుతుంది. ఆశ్రయించిన వారి బాగోగులు చూడటం యజమానుల కర్తవ్యమని గుర్తుచేసి ఎవరింటికో, దేనికోసమో పంపటం తగదని సైరంధ్రి నిర్ద్వంద్వంగా మాట్లాడింది.

దానికి సుదేష్ణ అది పరాయి యిల్లు కాదంటూ వాదించింది. సైరంధ్రి అనుచితకార్యమని పేర్కొన్న పనిని ఉచితమైనదని సుదేష్ణ వాదించటమే కాక స్నేహం, ప్రీతి ఉన్నచోట ఏ పని కూడా నీచం కాదని, గడుసుగా వాదించింది. ఎంతవాదించినా ఇది అనుచితమైన విషయమని తెలుసు. అలా పంపటము పాపమనే శంకా లేకపోలేదు. కాని తమ్ముడుపై ప్రేమ తప్పు చేయమని ప్రోత్సహించింది -

కII అనిన విని యనుచితంబున
కనయము శంకించియును లతాంగి మదిన్ త
మ్ముని వలవంత దలుచి యి
ట్లనియెం బాంచాలితోడ సాదర వృత్తిన్. (విరా.2-97)

సైరంధ్రితో కల్లబొల్లి మాటలు చెప్పింది. తాను తాగే మదిరను నెచ్చెలి తీసుకరావాలని చెప్పింది. అందరికీ తెలిసిన వ్యక్తి కాబట్టి, సైరంధ్రి వెళితే ఏ కీడు కలగదని చెపుతుంది. సైరంధ్రిని చూచిననాటి నుండి ఆమె గొప్పదనాన్నే చెపుతున్నానంటూ అబద్ధాలు చెప్పి, సైరంధ్రిని సుముఖురాలను చేసింది. సైరంధ్రి సుదేష్ణమాటలకు ప్రభావితురాలయి వెళ్లలేదు. ఎంత చెప్పినా సుదేష్ణ వినదని నిశ్చయానికి వచ్చి, ఇక ఈమెతో వాదులాడటం మంచిదికాదన్న ఆలోచనతో, ఎన్నో విధాలుగా ప్రాధేయ పడుతుండటంతో వెళ్లటానికి అంగీకరించింది.

కీచకుడి చేత భంగపడి, ధర్మజుని చేత మందలించబడి, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ సైరంధ్రి సుదేష్ణ మందిరానికి తిరిగివస్తూ "నన్ను ఆ దుర్మార్గుడి మందిరానికి వెళ్లమన్న ఆ ధూర్తురాలు సుదేష్ణకు ఈ అవమానాలన్నీ తెలిపి, దాన్ని తిట్టి పోయనా? - అని అనుకొంటూ తూలిపడిపోతూ వచ్చింది.

కీచకుని చేత పరాభవించబడినదన్న విషయం తెలిసికూడా తెలియని దానిలాగా సుదేష్ణ నటించింది. తొట్రుపడుతూ, ఎదురుగా పోయి కల్లబొల్లి ఆవేదనను ప్రదర్శించింది. 'ఏమిటి ఇలా దుమ్ముకప్పుకొని నీ శరీరం కాంతిహీనమైంది. మనసులో చింతవల్ల నీ ముఖం వాడిపోయి, చిన్నపోయింది. చెమటకు తడిసి, నీ ముంగురులు నుదురుకంటుకొని అందాన్ని కోల్పోయాయి. కన్నీరు కారి, నీ కళ్లు విలాసరహితంగా ఉన్నాయి. నీకు ఎవరైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా అపకారం చేశారా? వారికెంత ధైర్యం? వాళ్లను చంపుతాను. అవమానాల పాలు చేస్తాను. కష్టాలపాలు చేస్తాను. రూపుమాపుతాను. ఏం జరిగిందో చెప్పమని ప్రగల్భాలు పలికింది. తెలిసికూడా అడుగుతున్న సుదేష్ణమాటల వెనుకనున్న మర్మం తెలిసికూడ సైరంధ్రి జరిగిన విషయం చెప్పింది. విన్న సుదేష్ణ బిత్తరపోయి తత్తరపాటుకు గురయింది.

కీచకుని మందలించే శక్తి తనకు లేకున్నా, దండిస్తానంటూ ప్రగల్భాలు పలికింది సుదేష్ణ.

ఉII "ఖేదము దక్కుమీ క్షణమ కీచకుదండితు జేసి నీకునా
హ్లాదమొనర్తునేనని నయంబును గేకయరాజపుత్రి య
త్యాదర వృత్తితో ననునయంబొనరించిన, నవ్య సత్య సం
వాదిని పూన్కి పాండుసుత వల్లభ యాలము సేసి యిట్లనున్." (విరా. 2-160)

ఆమె, అసత్య సంవాదిని అని సైరంధ్రి గుర్తించింది. అందుకే ఆమె మాటల్ని లక్ష్యపెట్టకుండా సైరంధ్రి 'నీ కంత కష్టం అవసరం లేదులే. నా కష్టాల్నీ, లోకులద్దుఃఖాన్నీ కించిత్తు కూడా మిగల్చకుడా తీరుస్తారులే! అని సమాధానమిచ్చింది. ఆ మాటలకు సుదేష్ణ, ఆమె పరిచారికలూ భయభ్రాంతులయ్యారు. ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా సైరంధ్రి వినిపించుకోకుండా అన్నపానాలు మాని బాధపడుతుంటే, ఏమి చేయలేక సుదేష్ణ ఆశ్చర్యపడిపోయి, గుండెల్లో బిక్కుబిక్కుమంటూ భయపడింది.

కీచకుడు చంపబడ్డాడన్న వార్త తెలిసి, బయటికి తెలియని శోకాన్ని అనుభవించింది. చనిపోయిన సోదరుడిని చూడాలని త్వరపడలేదు. ఉపకీచకులు కూడా మరణించారని తెలిశాక విరాటుడు సుదేష్ణనోదార్చాడు. సైరంధ్రి భర్తలవలన ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని ఏదో ఒక విధంగా ఆమెను అంత్ఃపురం నుండి పంపించమన్నాడు. చివరకు

కII 'బిరుదుగల మగలు గలరని
తరమిడి చంపింప జూచెదవు; జనములు నీ

పొరువును బో వెఱతురు, మా
పురమును రాష్ట్రంబు వెడలి పొమ్మెందైనన్." (విరా. 3-61)

అని మనసులోని మాటను కక్కింది. కొద్దిరోజుల పాటు గడువిమ్మని, తన భర్తలు కృతజ్ఞతతో మేలుచేస్తారని, నా మాటను మన్నించకపోతే ఏమవుతుంది లెమ్మని అనుకోవద్దని సైరంధ్రి అనగానే ఏ కీడు మూడుతుందోనని సరేనన్న గడుసరి సుదేష్ణ. విరాటరాజు సైరంధ్రిని కొలువునుండి పంపించమని చెబితే అలాగే వెళ్లిపొమ్మని చెప్పిన సుదేష్ణ, సైరంధ్రి అడిగిన గడువును అంగీకరించటానికి భర్త అనుమతినేమీ కోరలేదు. కీచకుని భయంతో కొన్నాళ్లు, సైరంధ్రి భయంతో మరి కొన్నాళ్లు, జీవించిన సుదేష్ణ న్యూనత తోనే జీవించినట్లు అనిపిస్తుంది.

కొంత దర్పం, గడుసుదనం, సందర్భాన్ని బట్టి మాటమార్చే తత్త్వము, మానవ స్వభావ సిద్ధమైన క్రోధము, లౌక్యము, దుఃఖము మూర్తీభవించిన పాత్ర సుదేష్ణ.

**2. విరాటరాజు పాత్రను మీ పాఠ్యభాగమాధారంగా నిరూపించండి.**

ఉపరిచరవసురాజుకు, అద్రిక అనే అప్సరసకు కలిగిన సంతానంతో ఆడపిల్లను దాశరాజుకు పెంపుడు కూతురుగా ఇచ్చారు. మగపిల్లవాడిని తానే పెంచాడు. ఆ పిల్లవాడు పెరిగి మత్స్యాధీశుడు అయ్యాడు. ఆతను పాలించిన దేశమే మత్స్యదేశమైంది. ఆ వంశంలోనివాడే విరాటరాజు. మత్స్యదేశానికి రాజధాని విరాట నగరం. దానిని పాలించే రాజుపేరు విరాటుడు. మరుద్గణాంశతో రాజుగా జన్మించాడు.

విరాటుని మొదటి భార్యపేరు సురథ. ఆమె కోసలరాజు కుమార్తె. ఆమె మరణానంతరం, కేకయరాజ పుత్రియైన 'చిత్ర'ను వివాహమాడాడు. ఆమె నామాంతరమే సుదేష్ణ. విరాట రాజుకు తొలి భార్యయైన సురథ వలన కలిగిన ఇద్దరు కుమారులున్నారు. వారి పేర్లు శంఖుడు, శ్వేతుడు. సుదేష్ణకు ఉత్తరుడు, ఉత్తర కలిగారు. విరాటరాజు ఒక్కడే సంతానం కాదు. సోదరులు పదిమంది ఉన్నారు.

విరాటుని రెండవ భార్య సుదేష్ణ కూడ ఆమె తండ్రియైన కేకయరాజుకు రెండవ భార్యయైన మాళవికకు కలిగిన సంతానమే. సుదేష్ణ పెద్దతల్లి సంతానమే కీచకులు. వీరు నూటారుగురు. వీళ్లలోని పెద్దవాడు కీచకుడు. ఇంతటి బలగం కలవాడు కాబట్టే నిశ్చింతగా రాజ్యాన్ని పాలిస్తూ, గానవినోదాలతో హాయిగా కాలంగడిపేవాడు. ద్రౌపదీ స్వయంవరానికి కూడ తనపుత్రులైన శంఖుడు, ఉత్తరుడులతో కలసి వచ్చాడు. ధర్మరాజు నిర్వహించిన రాజసూయంలో సహదేవుడు విరాటరాజును జయించి, కప్పంగా ధనరాశుల్ని తీసికొనిపోయాడు. అంతేకాదు స్వయంగా రాజసూయానికి వచ్చి, బంగారు నగలతో అలంకరించిన వందలాది మదగజాలను, ధర్మజునికి కానుకగా సమర్పించాడు.

అరణ్యవాసం ముగిశాక, పాండవులు తమ అజ్ఞాతవాసాన్ని ఎక్కడ గడపాలన్న విచికిత్సకు లోనయినప్పుడు అర్జునుడు "కురుదేశానికి చుట్టూ పాంచాలం, చేది, మత్స్యదేశాలు ఉన్నాయి. ఇంకా సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన, కళింగ, మగధదేశాలు ఉన్నాయి. ఇవన్నీ సుభిక్షంగా ఉన్నదేశాలు. నివాసయోగ్యమైనవి. సుస్థిర ప్రభుత్వాలతో, జనసంకీర్ణమై ప్రకాశిస్తున్నాయి. వీటిలో మీకు నచ్చినదేదైనా ఒకటి ఎంచితే అందులో అజ్ఞాతవాసాన్ని గడుపుదామని అన్నాడు. అప్పుడు ధర్మజుడు

ఆ.వె. "నాకుజూడ మత్స్యనరపతి సద్ధర్మ
వర్తి, సుజనహితు డనార్య బాహు
బలుడు గాన యతని పాలనందఱుదగ
వైన పనుల నిలుచు టభిమతంబు" (విరా. 1-64)

అని విరాటుని ధర్మబుద్ధిని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తాడు. విరాట నగరమే తమకు ఎటువంటి భయంలేకుండా ఉండదగిన చోటని భావించారు. అందుకు కారణం విరాటుని ధర్మవర్తనంతో కూడిన వ్యక్తిత్వమే కారణం. అయితే విరాటుడు ఎంతటి ఉత్తముడో, అంతటి ఉద్విగ్న హృదయుడు కూడ. ఉత్తమ క్షత్రియుడే కాని ఉత్తమ వీరుడు, యోధుడు కాదు. ఎంత అమాయకత్వమో, అంతటి ఆత్మీయతా ఉంది. ఎంతటి మమకారమో అంతటి పిరికితనమూ ఉంది.

విరాటరాజుకున్న ఈ పిరికితనంవల్లనే కీచకుడు, సైరంధ్రితో "నేనవీటికిన్ రాజనుగా; నెపంబడి విరాటు నకుం దగుగూడు పెట్టుదున్" (విరా.2–254) అని అనగలిగాడు. దీనికి కారణం విరాటునికున్న బలహీనతే.

విరాటునికి బంధుప్రీతి ఎక్కువ. అది ధర్మభీతిని కూడా అధిగమించినది. బంధుప్రీతి, ధర్మభీతి ఈ రెండింటిలో దేనివైపు మొగ్గంటే సందర్భాన్ని బట్టి బంధుప్రీతివైపే మొగ్గుతాడు. కీచకుడి ఇంటినుండి తప్పించుకొని ఎట్లాగో బయటపడిన సైరంధ్రిని, కీచకుడు తరుముకొస్తున్నాడు. ఎటువెళ్ళాలో తెలియని సైరంధ్రి అదే సమయంలో విరాటుడు కొలువుతీర్చి ఉండటాన్ని చూచి ఆ సభలోకి ప్రవేశించింది. కామాంధుడైన కీచకుడు, జనాలను లక్ష్యపెట్టక, గద్ద ఆడుపామును పట్టబోయినట్లు సైరంధ్రి వెంటబడి పరుగెత్తి, జుట్టుపట్టి ఏమాత్రమూ జంకూ గొంకూలేకుండా నేలమీదికి పడేలా తన్నాడు. ఆ సందర్భంలో వలలుని రూపంలో ఉన్న భీముడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. భార్య కాబట్టి భీముడు ఆవేశపూరితుడయ్యాడు. సభలోని మిగిలిన వారెవ్వరూ స్పందించలేదు. సభాసదులూ, విరాటుడు వినేవిధంగా సైరంధ్రి గద్గదస్వరంతో శత్రుభయంకరులైన తన భర్తలు కీచకుడీ విధంగా వెంటబడి అవమానిస్తే ఉదాసీనంగా ఉండిపోయారు. ఇకపై లోకంలో ఇతరుల భార్యలకు ఇలాంటి అవమానం కలిగితే రక్షకులెవరు? ఈ విరాటుని సభలో ధర్మరక్షణ కోసం ముందుకు వచ్చి ఒక్క మాటైనా మాట్లాడేవారు లేకపోయారు. ఈ కీచకుడు, సాధ్విని, పతివ్రతను అయిన నన్నిలా అవమానిస్తే దయచూపేవారేలేరా? అని నిలదీసింది. అంతేకాదు సరాసరి విరాటరాజునే ఉద్దేశించి –

ఉ॥ "ఐనను మత్స్యదేశమున యాజ్ఞి కితం డొడయుండు గాన నా
కీ నరనాథు దూఱుదగు; నెయ్యది యేని నధర్మమెవ్వ రెం
దైన నొనర్చినం బ్రభువు లారసి దండన మాచరింతు; రి
చ్చో నను దన్ను కీచకుని జూచియు నూరక యున్కి పాడియే?" (విరా. 2–143)

అని నిలదీసింది. ఇంత జరిగినందుకు ఈ మత్స్యదేశాన్ని పాలించే విరాటరాజును నేను నిందించాలి. ఏదైనా ధర్మలోపం ఎక్కడైనా జరిగితే రాజు దానిని గమనించి శిక్షించాలి. ఈ సభలో ఈ విధంగా నన్ను తన్నిన కీచకుడిని చూస్తూ ఊరుకోవటం న్యాయమా? అని గట్టిగా మాట్లాడింది. ఆ మాటలకు విరాటుని మనసులో చలనం కలిగి ద్రౌపది పట్ల సానుభూతి కలిగి 'అయ్యో!' – అన్న దయతో చూచాడు. కాని కీచకుడిని చూచేసరికి ఆ దయ ఆవిరైపోయింది. కీచకుడిని మందలించే ధైర్యంలేక ఊరడించటానికి పూనుకున్నాడు. బుసలు కొడుతున్న కీచకుడిని అనునయవాక్యాలతో ఉపశమింపచేసి ఇంటిముఖం పట్టేలా చేశాడు. ఒక సమస్యను తన అధికారంతో కాక, అనునయవాక్యాలతో సామోపాయంలాంటి ప్రవర్తనతో తాత్కాలికంగా ఉపశమింపచేసి సభలో జరుగబోయే అకృత్యపు కొనసాగింపును ఆపగలిగాడు.

కీచకుని ప్రవర్తనకు కోపావేశంతో ఊగిపోతున్న వలలుడి ప్రవర్తనకు కారణాన్నిగాని, వారిస్తూ ధర్మరాజు చేసిన గూఢోక్తుల మర్మాన్ని గాని పోల్చి చూసుకోలేని అమాయకత్వం విరాటునిలో ఉంది. అందువల్లనే సైరంధ్రి చేసిన ప్రసంగాన్నిగాని, ధర్మరాజు – సైరంధ్రుల నర్మగర్భ భాషణాన్ని గాని వివేచించి చూసుకొనేటంత వివేకం లేనివానిగా విరాటుడు కన్పిస్తాడు.

కీచక వధానంతరం ఉపకీచకులు విరాటుని వద్దకుపోయి సైరంధ్రిని తన అన్న శవంతో పాటే కలిపి దహనం చేస్తామని అనుమతి నీయమని కోరారు. వద్దన్నా వాళ్లు మానరని తెలిసి సరే! మీకు తోచినట్లు కానీయండి' – అని చెప్పటంలో కూడ విరాటుని అశక్తత తెలిసిపోతుంది. ఈ సందర్భంలోనే విరాటుని సంఘర్షణ కనిపిస్తుంది. కీచకుడి అధర్మవర్తనను తాను

దండించక మిన్నకున్నా, గంధర్వులు దండించారు. రాజశాసనాన్ని మన్నించే బుద్ధిలేని ఉపకీచకుల్ని నియంత్రించటం తనవల్ల కాని పని కాబట్టి, వీళ్లను కూడ వాళ్ల కర్మకు వదిలేశాడు. ఇలా తన అశక్తతను నిసిగ్గుగా ప్రదర్శించాడు.

ఈ విధంగా కీచకవధ ఘట్టంలో విరాటుడు కరుణాహృదయమున్నప్పటికీ దానిని అమలు చేయలేని అసమర్థపు రాజుగానే కనిపిస్తాడు. ఎవరి కర్మకు వారినే బాధ్యులను చేసే నిష్క్రియాపరత్వం, అసమర్థత నుండి తెచ్చుకున్నాడు. పరిస్థితుల్ని గమనిస్తూ కూడ అసహాయంగా ఉండిపోయాడు. ఈ అసమర్థత వంకతోనే సభామర్యాద పేరుతో కీచకుడిని బ్రతిమిలాడి, అనునయించి తాత్కాలికంగా సమస్యను వాయిదా వేయించగలిగాడు. ఎంతటి ధర్మబుద్ధియైనా అవసరమైన తెగువ లేకుంటే విరాటుడి లాగా మిగిలిపోవలసిందే. ధర్మాచరణకు తెగువ ఎంతటి అవసరమో, ఉన్నత స్థానాలలో ఉన్నవాళ్లు ఎంతటి ఉదాత్త ఆశయులైనప్పటికి, వాటిని సాధించటానికి అవసరమైన బలం ఎంతటి అవసరమో విరాటుని పాత్ర తెలియచెపుతుంది.

**3. మీ పాఠ్యభాగం ఆధారంగా తిక్కన చిత్రించిన ద్రౌపది పాత్రచిత్రణను వివరించండి.**

ద్రౌపది అయోనిజ. నల్లకలువలాంటి కాంతితో ప్రకాశించే దేహచ్ఛాయ, కలువరేకుల్లాంటి కళ్లు, కలువవాసనవంటి సువాసన, నల్లత్రాచువంటి పొడవైన జడ. దివ్యతేజస్సుగల అతిలోక సౌందర్యవతి. అశరీరవాణి ఆమెకు పెట్టినపేరు కృష్ణ. ద్రుపదుని కువర్తె కాబట్టి ఆమె ద్రౌపది. యజ్ఞకుండంలో జన్మించింది కాబట్టి అయోనిజ. పాంచాల రాజు కుమార్తె కాబట్టి పాంచాలి. పాండవపత్ని.

**అతిలోక సౌందర్యవతి**

ద్రౌపది అతిలోక సౌందర్యవతి కావటం వలననే ఎన్నో కష్టాలు ఎదుర్కొనవలసివచ్చింది. కౌరవసభలో అవమానించబడటం, వనవాస కాలంలో సైంధవుడు వావి వరుసలను మరచి వేధించటం, కీచకుడు వెంటబడటం ఇవన్నీ ఆమె సౌందర్యం తెచ్చిపెట్టిన కష్టాలు. అజ్ఞాతవాస కాలంలో సైరంధ్రిగా కాలం వెళ్లదీయటానికి సుదేష్ణవద్దకు వచ్చి వేడుకున్నప్పుడు నీ రూపం చూచి మా రాజే ప్రలోభ పడతాడు. స్త్రీలే నిన్ను చూచి చూపుమరల్చుకోలేని స్థితి. నిన్నెలా భరించటం? అంతఃపురంలో ఉంచుకుంటే కోరికష్టాలుకొని తెచ్చుకోవటమేనని అంటే ద్రౌపది సుదేష్ణను మించిన స్థాయిలో నీకాభయమేమీ అక్కరలేదు, అటువంటివారి సంగతి నా భర్తలే చూసుకొంటారు, నాపై తేరిపారచూడటానికి భయపడతారని, తాను పతివ్రతనని చెప్పి ఒప్పిస్తుంది. ఆ అతిలోకసౌందర్యమే కీచకుని కంట్లో పడటానికి కారణమై, మరోకష్టాన్ని తెచ్చిపెట్టింది.

**నిగ్రహశీల**

కీచకుడు సుదేష్ణమందిరానికి వచ్చి ద్రౌపది సౌందర్యాన్ని చూచి మదనావేశంతో వింత చేష్టలు చేశాడు. పలకరించాడు. అయినప్పటికీ వినీ విననట్లు నిర్వికారంగా ఏమీ మాట్లాడకుంది. కీచకుడు మదిలోని కోర్కెను బయట పెట్టాడు. అయినా ఆ పరాభవాన్ని పొక్కనీయకుండానే, తనను తాను నిగ్రహించుకొని, వీడు దురహంకారి తొందరపాటు తగదని నేర్పుతో తప్పించుకొనే ప్రయత్నం చేసింది.

**సంభాషణా చతుర**

కీచకుడు చేసే నీచ చేష్టలనుండి తప్పించుకోవటానికి తొలుత అనునయంగానే చెప్పి చూచింది. 'ఓ అన్నా! నామేను, ఈకట్టు, బొట్టూ ఎంత అసహ్యంగా ఉన్నాయో, చూడు. ఇటువంటి నన్ను చూచి మదనవికారానికి గురవటం భావ్యమా?' – అంటూ ప్రశ్నించింది. తనను వలచి విరహాన్ని ప్రకటిస్తున్న కీచకుడిని ఓ అన్నా! అనే బంధువాచకంతో, గౌరవవాచకంతో సంబోధించి ముందరికాళ్లకు బంధం వేసింది. తనను కామించటం తప్పని పరోక్షంగా చెప్పింది. నీకు కూడ తోబుట్టువులున్నారుకదా! అని హెచ్చరించింది. మెత్తని మాటలకు లొంగని సందర్భంలో గట్టిగానే హెచ్చరించింది. సైరంధ్రిని కీచకుని యింటికి వెళ్లి మదిర తెమ్మని సుదేష్ణ ఆజ్ఞాపించిన సందర్భంలోను, కీచకుని భంగపాటుకు గురయినప్పుడు విరాటుని సభలో కంకభట్టుతో చేసిన సంభాషణలోనూ ద్రౌపది సంభాషణా చాతుర్యం తెలుస్తుంది.

**ధీరవనిత**

ద్రౌపది ధీరవనిత. ఎంతటి సుకుమారహృదయమో అంతటి ధీరతగలవనిత. కీచకునికి మెత్తని మాటలతో చెప్పి చూచింది. వినలేదు. వీడు నీచుడు కాబట్టి భయపెట్టితే తప్ప తొలగిపోడని భావించి -

శా॥ "దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!" (విరా. 2-55)

అంటూ బెదిరించింది. అందని మానిపండ్లు కోయటానికి ఆశపడుతున్న అవివేకివని హెచ్చరించింది.

కీచకుని మందిరానికి వెళ్లవలసి వచ్చినప్పుడు, కీచకుడు పట్టుకున్నప్పుడు విదిలించుకొని కీచకుని యింటినుండి బయటపడినప్పుడు, విరాటుడిని హెచ్చరించటంలోను రాత్రివేళ భీముని వద్దకు పోయి జరిగిన విషయమంతా చెప్పి కీచకవధకు అవసరమైన పథక రచన చేయటంలోనూ సైరంధ్రి చూపిన నేర్పు అనితర సాధ్యమైనదే కాదు. ఆమె ధీరత్వాన్ని కూడ తెలుపుతుంది.

**అభిమానధన**

ద్రౌపది విరాటుని అంతఃపురంలో ప్రవేశించేటప్పుడు నీచమైన పనులకు నన్ను వినియోగించవద్దని చెప్పింది. దానికి భిన్నంగా సైరంధ్రిని కీచకుని యింటికి పోయి మదిరను తెమ్మని సుదేష్ణ అన్నప్పుడు నేనిలాంటి పనులు చేయనని ముందే చెప్పాను. నీ ఇంట్లో సదాచార సంపన్నత నడుస్తుందని తెలిసి, నా భర్తలు చెంతలేకున్నా ధైర్యంతో నమ్మకంగా ఉన్నాను. సజ్జనులు ఆశ్రయించిన వారిని రక్షిస్తారు. తద్భిన్నంగా నీవు ప్రవర్తిస్తున్నావని తిరస్కరించింది. తన అభిమానానికి ఇబ్బంది ఏర్పడినప్పుడు ఎవ్వరినీ క్షమించలేదు. విరాటుని కొలువులో సైరంధ్రి ఆవేశాన్ని చూచి కంకభట్టు రూపంలో ఉన్న ధర్మరాజు "నాట్యం చేస్తున్నట్టు స్వైరవిహారం చేస్తూ, కులస్త్రీల ఔన్నత్యం తొలగిపోయేలా నీవు సభలో నిలబడటం తగదని" పరోక్షంగా మందలించినప్పుడు -

"నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు
పెద్దవారి యట్ల పిన్నవారు
గాను బతుల విధమ కాకయే శైలూషి
గాననంగరాదు కంకభట్ట!" (విరా. 2-152)

అని ఊరుకోకుండ, "నా భర్త నాట్యగాడు మాత్రమే కాదు. జూదరికూడ. జూదరి భార్యకు పెద్దరికం, గౌరవం ఎక్కడినుండి వస్తుంది?" - అని మాట్లాడి మరీ సభను వదలిపెట్టిన అభిమానధన.

**పరేంగితావగాహనశీల**

ఎదుటివారి మనసుల్ని చదివి తదనుగుణంగా వ్యవహరించే దక్షత ద్రౌపది సొంతం. తొలుత కీచకుడు తనను చూచి వింత చేష్టలు చేస్తుంటే సున్నితంగా చెప్పింది. వాడి బుద్ధి పెడబుద్ధి అని తెలిసి స్వరం పెంచి, భర్తలను గురించి చెప్పి బెదరించింది. అయినా వినే స్థితిలో లేడని తెలిసి ఆ ప్రదేశంనుండి తప్పుకుంది. కీచకుని మందిరానికి వెళ్లి మదిర తీసుకురమ్మని సుదేష్ణ చెప్పినప్పుడు ఎన్నో విధాలుగా చెప్పి చూచింది. అయినా వినలేదు. ఇక ఎక్కువ వాదించి లాభంలేదని , ధైర్యాన్ని కూడగట్టుకొని బయలుదేరింది. కీచకవధకు పథకరచన జరిగాక, భీముడు వీరావేశాన్ని ప్రదర్శిస్తుంటే, మీ అన్నగారికి అపఖ్యాతి రాకుండ, మన అజ్ఞాతవాసపు సమయభంగం జరగకుండా చేయాలంటూ భీముని ఆవేశాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఇలా సమయోచితంగా, పరుల మనసును చదివి ప్రవర్తించటం ద్రౌపది పాత్రలో కనిపించే విశేషం. సుదేష్ణవద్దకు వచ్చి, కీచకుని మందిరంలో జరిగినది చెప్పినప్పుడు, కీచకుడిని దండిస్తానని సుదేష్ణ కపటంతో అనగా 'నీకు అంతబాధ అక్కరలేదు, నా పతులే చూసుకొంటారు' లెమ్మని ఆమెను తిరస్కరించి మాట్లాడటంలో సుదేష్ణ అసత్యపు కోపం, నటనను గమనించటమే.

**పతులపట్ల ఎడతెగని అనురాగం**

కీచకునితో భంగపాటు కలిగిన తరువాత, రాత్రి సమయంలో భీముని వద్దకు పోయి తన విషయాన్నంతా వివరించి చెప్పింది. ఆ సందర్భంలో తన పతులైన పాండవుల గొప్పదనాన్ని, వారిపట్ల తనకున్న అనురాగాన్ని భీముడికి వివరించి చెపుతుంది. అంతటి గొప్పవాళ్లు ఇలా ప్రచ్ఛన్నంగా విరాటుని కొలువులో ఉండటం తనమనసును కలచివేస్తుందని బాధపడుతుంది. ధర్మజుని ధర్మదీక్ష వలననే మనం బ్రతుకుతున్నామని,

సీ॥ "ఎవ్వని వాకిట నిభమదపంకంబు
రాజభూషణ రజోరాజి నడుగు;
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు
నొజ్జయై వినయంబు నొఱపు గఱపు;
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
మానిత సంపద లీనుచుండు;
నెవ్వని గుణలత లేడు వారాసుల
కడపటి కొండపై గలయ బ్రాకు;

తే.గీ. నతుడు భూరిప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటీరమణివేష్టితాంఘ్రి
తలుడు కేవల మర్త్యుఁడె ధర్మసుతుడు!" (విరా.2-191)

అని ధర్మరాజు కేవలం మానవమాత్రుడు కాదని చెపుతుంది. హిడింబ కిమ్మీరాదుల్ని వధించిన నీవు, నీ భుజబలాన్ని వంటకట్టెల్ని కొట్టటానికి ఉపయోగించటం దుఃఖకరమని, అర్జున నకులసహదేవుల వైశిష్ట్యాన్ని కూడ వివరించి అలాగే బాధపడుతుంది. అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు కుంతీదేవి ద్రౌపదిని దగ్గరకు తీసికొని సహదేవుడిని అప్పగించి ఎప్పుడైనా, ఎక్కడైనా అన్నిటా ఎట్లా చూసుకోవాలో అట్లా చూసుకొమ్మని చెప్పి అప్పగించింది. వనవాసంలో అత్తగారి ఆజ్ఞను పాటించగలిగాను కాని, ఇప్పుడు చేసేదేమీ లేక బాధపడుతున్నానని చెప్పి దుఃఖిస్తుంది.

**ఉత్తమ ఇల్లాలు**

ద్రౌపది పుట్టింటి గౌరవాన్ని, మెట్టినింటి మన్ననను, భర్తల అనురాగాన్ని, ప్రజానురాగాన్ని, బంధుప్రీతిని పొందిన ఇల్లాలు. సంతానవతియై, కుటుంబ గౌరవాన్ని ఇనుమడింపచేసిన ఉత్తమ ఇల్లాలు. రాత్రివేళ భీమునివద్దకు పోయి తన భంగపాటును చెప్పిన సందర్భంలో తన భర్తల గొప్పదనాన్ని గురించి చెప్పి, ఆ వరుసలో తననుగురించి కూడ చెప్పుకుంటుంది. అవి స్వాతిశయంతో చెప్పినమాటలు కాదు. సహజోక్తులే.

సీ॥ ద్రుపద భూవిభుడు పుత్రులకంటె నెంతయు
బెంపు సేయుచు గారవింప బెరిగి
కుంతీమహాదేవి కోడండ్ర లోపల
నగ్గలంబుగు గొనియాడుబరుగి,
ప్రాణంబులకు నెల్లు బ్రాణంబుగా మీరు
నెయ్యంబు తియ్యంబు నెఱప నడచి,

మదిఁ దల్లిదండ్రుల మాఱుగాఁ గొని జను
లనిశంబు భక్తి సేయంగ నెగడి

తే॥ రూపగుణ విక్రమంబుల రూఢికెక్కు
నట్టి కొడుకులు గని భరతాన్వయంబు
నందు నా యిల్ల యిల్లుగా నతిశయిల్లి
తగవుమై బాంధవులచేతఁ బొగడు వడసి. (విరా. 2-216)

ఇందులో పుట్టింటిలో అంటే ద్రుపదుని ఇంట వంశోద్ధారకుడైన పుత్రినికంటే ఎక్కువగా గౌరవించబడటం, మెట్టినింటిలో గౌరవించటం, ప్రాణానికి ప్రాణంగా భర్తలు చూసుకోవటం, తల్లిదండ్రులలాగా భావించి, ఆమె వాత్సల్యాన్ని పొందిన ప్రజలు భక్తిగాకీర్తించటం, రూపగుణ పరాక్రమాలలో పేరొందిన కుమారుల్ని పొందటం, బంధువుల పొగడ్తలను పొందటం, భరతవంశంలో తన కుటుంబమే గొప్పదిగా ప్రకాశించటం, ఇవన్నీ ఉత్తమ గృహిణి లక్షణాలు. రాజసూయంలో అవభృదస్నానాలతో పవిత్రమైన వేణిని ధరించిన కళ్యాణాత్మకురాలు.

**అత్తప్రేమను పరిపూర్ణగా పొందిన సాధుశీల**

ఈ కీచకవధ ఘట్టంలో ద్రౌపది భీమునితో తన కష్టాన్ని చెప్పుకునే సందర్భంలో కుంతీదేవి ప్రస్తావన తెస్తుంది. "నన్నుబనిగొనునెడు బాండుని యగ్రమహిషి గొంకుచు బనిగఱపెడు చందమునన పనుచుటెఱుగవే?" - అని అంటుంది. అంటే కుంతీదేవి తనకేదైనా పని చెప్పేటప్పుడు వెనుకాడేదట. ఆజ్ఞాపించినట్లు గాక పనినేర్పటానికి పని చెప్పిన విధంగానే పనులు చెప్పేదట. అంటే ద్రౌపదిని అంతప్రేమగా చూసుకునేదట. కుంతీదేవి పట్ల ద్రౌపదికి కూడా అంతటి అనురాగమే. అందుకే వనవాసం పోయేటప్పుడు సహదేవుని అప్పగించి జాగ్రత్తగా చూడమని చెప్పి 'తడవినాచేత దీవనవడయు మమ్మ!' - అని చెపుతుంది.

**ప్రతీకారేచ్ఛగలస్త్రీ**

ద్రౌపది తనకు జరిగిన భంగపాటుకు భయపడి, విరాటరాజును రక్షించమని కోరింది. విరాటుడు కీచకుని బారినుండి తనను కాపాడే శక్తిలేనివాడని గ్రహించాకనే భీమసేనుడిని ఆశ్రయించింది. భీమసేనుని రెచ్చగొట్టింది. భీముడు చెప్పిన సలహాతోనే కీచకవధకు నర్తనశాల కార్యక్షేత్రమైంది. చీకటిలో భీముడు కీచకుడిని వికృతంగా చంపాక, కీచకుని శవంవద్దకు పోయి -

ఉ॥ చూచుచు జేరి వ్రేల్మిడుచుచుం దలయూచి విలక్షచిత్తయై
యా చపలాక్షి ముక్కుపయి నంగుళముం గదియించి దీనికై
కీచక! యింత సేసితి, సుఖిత్వము బొందుదుగాక! యింక న
ట్లేచిన నిట్లు గా కుదుగునే?' యనుచున్ వెఱుగందుచుండుగన్. (విరా. 2-356)

అని అంటుంది ఆశ్చర్యంగా ముక్కుమీద వేలువేసికొని, మెటికలువిరుస్తూ "కీచకా! దీనికోసమేనా? ఇంత చేశావు. ఇకనైనా శాంతంగా ఉండు. కన్నుమిన్ను తెలియక విజృంభిస్తే ఇలాగే జరుగుతుందని అనటంలో ప్రతీకారేచ్ఛ తీరిన తరువాత మాట్లాడే మాటతీరును తెలియచెపుతుంది.

**కార్య సంఘటనా చతుర**

కీచకుని ప్రమాదాన్ని తప్పించుకోవటానికి వలలుడిని ఆశ్రయించింది. వలలుడు చెప్పినట్లు కీచకుడిని నర్తనశాలకు రప్పించాలి. ఎలా కీచకుడిని రప్పించాలన్న విషయాన్ని వలలుడు చెప్పలేదు. కాని ద్రౌపది ఆ కార్యాన్ని సంఘటించింది. లేని ప్రేమను నటిస్తూ, కీచకుని పొందుని అంగీకరిస్తున్నట్లు నటించి నర్తనశాలను సంకేతస్థలంగా చెప్పి, రాత్రికిరమ్మంది. సైరంధ్రికోసం

తల్లడిల్లుతున్న కీచకునికి ఇదేమీ అనుమానాస్పదం కాలేదు. అలా కీచకునికి అనుమానం రాకుండా కార్యాన్ని సంఘటింప చేయటం చాతుర్యంతో కూడిన కార్యం. కీచకుడిని హతమార్చేందుకు భీముడిని ఎలా చాకచక్యంగా రెచ్చగొట్టిందో, అంతే చాకచక్యంగా నర్తనశాలకు నడిపించింది.

కుటుంబ జీవనంలోగాని, సాంఘిక జీవనంలోగాని స్త్రీకి అవమానం జరిగితే ఆవేశకావేశాలు పెరిగి, పంతాలు, పట్టింపులు, ప్రతిజ్ఞలు ఎలా బయలుదేరి పెనవేసుకుంటాయో, సమస్యలు ఎలా తీవ్రమై దోషుల్ని మింగేస్తాయో, పరిణామాలు ఎలా దారుణంగా ఉంటాయో తెలియజెప్పిన పాత్ర ద్రౌపది. స్త్రీ సౌందర్యం కష్టాలకు ఎలా గురిచేస్తుందో కీచకవధ ఘట్టంలో ద్రౌపది పాత్ర తెలుపుతుంది. స్త్రీలంతా ఈనాటి సంక్లిష్ట వాతావరణంలో ద్రౌపదిలా ధీరలై కీచకులవంటి నీచుల్ని పరిమార్చాలని ద్రౌపది పాత్ర స్ఫూర్తినిస్తుంది.

**3. కీచకవధ ఘట్టంలో భీముని పాత్రను వివరించండి?**

కుంతీదేవికి వాయుదేవుని అనుగ్రహంతో జన్మించిన వాడు భీముడు. భీముడు, దుర్యోధనుడు సమానవయస్కులు. భీముడు జన్మించినప్పుడు బలవంతులలో శ్రేష్ఠుడని ఆకాశవాణి పలికింది. శిశువు జన్మించినప్పుడే తల్లి ఒడిలోనుండి జారి శిలపై పడ్డప్పుడు, ఆ శిలయే చూర్ణమై పోయిందని భారతం పేర్కొన్నది. గదాయుద్ధంలో ఆరితేరినవాడు. మల్లయుద్ధంలో సాటిలేని జెట్టి. కురుసభలో ద్రౌపదిని పరాభవించినప్పుడు, కౌరవులను హతమారుస్తానని భీషణప్రతిజ్ఞను సభలో చేసింది భీముడే. బక జటాసురాది రాక్షసులను మర్దించిన నాగాయుత బలసంపన్నుడు. ఇంత బలసంపన్నుడైనప్పటికీ అన్న ధర్మజుని మాటకు బద్ధుడు. కోపావేశంతో కొన్ని సందర్భాలలో అన్నను తిరస్కరించిన మాట్లాడినప్పటికీ, అన్న మాటను మీరి ఏ పని చేసిన దాఖలాలు లేవు. భారతకథలో అనునాయకుడు. ధీరోద్ధతుడు.

అజ్ఞాతవాసంలో వంటవానివేషంలో విరాటుని కొలువులో ప్రవేశించాడు. విరాటపర్వంలోని ప్రధానమైన 'కీచకవధ' – ఘట్టంలో నాయకుడు భీమసేనుడేనని చెప్పాలి. కేవలం వంటవానిగానే కాకుండా, రాజుకూ, ఆయన పరివారానికి వ్యాయామాదులతో వినోదం కలిగించేవాడు. ఉత్తర గోగ్రహణానికి కారణభూతమని చెప్పదగిన కీచకవధను నిర్వర్తించింది భీమసేనుడే. కీచకుని వధించటానికి అవసరమైన పథకరచన ఎవరూ చెప్పకయే తన ఇచ్చానుసారమే భీముడు చేశాడు. సతియైన ద్రౌపది పరాభవానికి స్పందించి, ఆమె మానమును కాపాడటంలో సమయభంగానికి గాని, అగ్రజుని ఆగ్రహానికి గాని ఏమాత్రమూ భయపడని వీరుడు, భీమసేనుడు.

**తీవ్రంగా స్పందించే లక్షణం**

కీచకవధ ఘట్టంలో భీముడు తొలుత కనిపించింది. విరాటుని కొల్వులోనే. సైరంధ్రి కీచకుని మందిరానికి పోయి మదిరను తీసుకురమ్మన్న సుదేష్ణ మాట మీర వీలులేక తప్పనిసరై పోయి, కీచకుని బారినుండి తప్పించుకొని బయటపడింది. అయినావాడు వదలక దేగలాగా వెంటబడి తరుముకొచ్చాడు. ఆ సందర్భంలో సైరంధ్రికి ఏమి చేయాలో పాలుపోక, విరాటుడు కొలువు తీరియుండటాన్ని గమనించి, తప్పించుకోవచ్చునన్న ఆశతో కొలువులోకి ప్రవేశించింది. అయినా కీచకుడు వెంటబడి సైరంధ్రికొప్పులాగి, పడతన్నాడు. అదే సమయంలో విరాటుని కొలువులో అన్నతోకూడ కూర్చొనియున్న భీముడు ద్రౌపదికి జరిగిన అవమానాన్నీ, కీచకుని పొగరుబోతుతన్నాన్నీ గమనించాడు. అప్పటి భీముని రౌద్రాకారాన్ని గమనించాలి.

చ॥ కనుగొని కోప వేగమను గన్నుల నిప్పులు రాల, నంగము
ల్గనలుగ, సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంతదంతపీ
డనరట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై. (విరా. 2–133)

కళ్ళనిప్పులు రాలుతుండగా, బళ్లంతా ఉడికిపోయి, చెమటలు కమ్ముతుంటే, కోపంతో పళ్లు పటపటాకొరుకుతూ, బొమముడిని కదిలిస్తూ భయంకరరూపం ధరించినట్లు కోపావేశంతో ఊగిపోయాడు.

సీ॥ నేలయు నింగియు దాళముల్గా జేసి
యేపున రేగి వాయించి యాడు,
గులపర్వతంబులు గూల్చి యొండొంటితోఁ
దానికంగ మీకమై దన్ని యాడ,
నేడు సాగరములు నిక్కడక్కడు బెట్టి
పలుచని రొంపి మై నలుదికొనుగ,
దిక్కులు నాలుగు నొక్క చోటికి దెచ్చి
పిసికి పిండిలి సేసి పిడుచగొనుగ,

తే॥ మిగిలి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ
నప్పళించుచు బ్రళయకాలానలమున
గండరించిన రూపంబు కరణి భీము
దతి భయంకరాకారత నతిశయిల్లె. (విరా. 2-134)

భూమ్యాకాశాల్ని తాళాలుగా చేసుకొని, పెట్రేగి వాయించి ఆడినట్లుగా, కులపర్వతాల్ని కూలద్రోసి ఒకదానిమీద ఒకటి పడేటట్లు తన్నియాడినట్లుగా, సప్తసముద్రాల్ని అటూఇటూ చేసిన నీళ్లు పోగా మిగిలిన పలుచని బురదను శరీరం నిండా పూసుకొన్నట్లుగా, దిక్కులు నాల్గింటిని ఒకేచోట చేర్చి ముద్ద చేసి మింగబోతున్నట్లుగా, బ్రహ్మాండ భాండాన్ని పగలగొట్టాలని జబ్బలు చరుస్తూ ప్రళయ కాలంలోని మహాగ్ని పుట్టి మానవ రూపం ధరించిందా అన్నట్లు భీముడు భయంకరాకారుడయ్యాడు. ఆ భయంకర కోపమే సమయ సందర్భాలను తెలియనీయకుండా చేశాయి. భీముడు అలాగే ప్రవర్తించాడు.

**ధర్మజుని ఆజ్ఞకు బద్ధుడు**

ఎంతకోపాతిశయం కలిగినా, రౌద్రమూర్తిగా మారినా అన్న ధర్మజుని పట్లగల గౌరవమే మళ్లీ భీముడిని కట్టుకొయ్యకు చేరుస్తుంది. సైరంధ్రిని అవమానించిన కీచకుడిని చూచి 'అవిచారిత సమయవర్తనుండయి', కీచకుడిని, ఆతనికెదురు చెప్పలేని విరాటుడిని తన కోపంలో భాగంగా మట్టుపెట్టాలని భావించి దగ్గరలో నున్న పెద్ద చెట్టును ఎగాదిగా చూచి ఎర్రబారిన మొగంతో అన్న ధర్మరాజు ఆజ్ఞకోసం ఆవైపు చూచాడు. అప్పుడు ధర్మరాజు కనుసైగలతో వారించి, మర్మోక్తులతో వంటకట్టెల కోసం చెట్టును కొట్టవద్దని హెచ్చరించి, సందర్భాన్ని సర్ది భీముడిని ఆపాడు. తన రహస్య వచనాలతో భీముడి కోపాతిశయాన్ని తగ్గించాడు. అంత కోపావేశంలోనూ అన్న ఆజ్ఞకోసం చూడటమంటే ఆతని ఆజ్ఞకు బద్ధుడనే తాత్పర్యం.

నర్తనశాలలో కీచకవధకు రంగం సిద్ధమయ్యాక, భీముడి ఆవేశాన్ని చూచిన సైరంధ్రి రూపంలో ఉన్న ద్రౌపది భయపడింది. హద్దులు మీరిన భీముని ఆవేశం ఏ అనర్థాలను తెస్తుందోనని అన్నగారి మాటకు గౌరవానికి భంగం లేకుండా, సమయభంగం కాకుండా కార్యాన్ని నెరవేర్చమని హెచ్చరించింది. భీముని ఆవేశానికి చెలియలికట్ట ధర్మరాజే.

**వివేకశీలి**

భీముడు గూఢోక్తుల మర్మాన్ని తెలిసికోవటంలో ఎంత వివేకశీలాన్ని ప్రదర్శిస్తాడో అవసరమైనప్పుడు కార్యాచరణలోనూ అంతే వివేకంగా ప్రవర్తిస్తాడు. వలలుడు తప్ప తననింక కీచకుని బారినుండి కాపాడగల వారెవ్వరూ లేరని భావించిన సైరంధ్రి, రాత్రివేళ వలలుని వంటింటికి పోయింది. ఆ రాత్రి వచ్చిన సైరంధ్రిని, సభలో జరిగిన సన్నివేశానికి పూర్వపరాలేమని అడిగి తెలిసికొని, ఆపైన కీచకవధకు అవసరమైన పథకాన్ని రచించాడు. కీచకుడిని చంపటం ఎంతపని? మన సమయభంగం

కాకుండటం ముఖ్యమని ద్రౌపదితో అనటంలో కూడ వివేకమే కనిపిస్తుంది. ఒక సందర్భపు పూర్వాపరాలు తెలిసికోకుండా కార్యాచరణకు ఉద్యుక్తుంకాని లక్షణం ఈ సందర్భంలో కనిపిస్తుంది.

**సులభంగా రెచ్చగొట్టబడే స్వభావం**

భీముని క్రోధాగ్నిని రెచ్చగొట్టడం సులభం. భారతంలో ఇటువంటి దాఖలాలు చాలా కనిపిస్తాయి. సైరంధ్రి రాత్రివేళ వలలుని మందిరానికి వచ్చినప్పుడు సమస్య పూర్వాపరాలను ద్రౌపది నోటవిని సభలో తానుకోపాన్ని అణచుకోవటానికిగల కారణాన్ని వివరించి చెప్పాడు. పరిస్థితిని గమనించి ద్రౌపది "నీవు నీచ కీచకుడిని చంపకపోతే నేను ఉరిపోసికొని కాని, నీటిలోనో, అగ్నిలోనో పడిగాని, విషాన్ని తినిగాని శరీరాన్ని విడిచిపెడతాను. నీ మీద ఒట్టు" – అని గట్టిగా చెప్పే సరికి ద్రౌపదిని అనునయించటానికి, నమ్మించటానికి ప్రతిజ్ఞ చేశాడు.

తే.గీ. ఎల్లి యెల్ల విధంబుల నెందుజొచ్చె
నా ధర్మ తనయుండు దాన వచ్చి
యడ్డపడెనేని నీవ పెంపారు కరుణు
గాచితేని నాచేబడు గీచకుండు. (విరా. 2–232)

అంతేగాకుండ 'ఏ అడ్డూ అదుపూ లేని కీచకుడిని చంపకపోతే ఇక స్త్రీలకు రక్షణ ఎక్కడ? సభలో నా ప్రతాపం చూపి వాడిని చంపకపోవటం తప్పే అయింది. చాలు!' – అని సత్వర కార్యోన్ముఖుడయ్యాడు. నీవు అడ్డుపడ్డా, ధర్మజుడడ్డుపడ్డా చంపుతానని చెప్పాడు.

**సందర్భోచిత వర్తనుడు**

ఇతరులు గుర్తుచేస్తే తప్ప సందర్భాన్ని గమనించలేని అవివేకి కాడు భీమసేనుడు. రాత్రివేళ తన వద్దకు వచ్చిన సైరంధ్రిని చూచి కీచకుడిని చంపటానికి తనను ప్రేరేపించేందుకే వచ్చిందని గ్రహించే ఆమె నోటనే పూర్వాపరాలు చెప్పించాడు. 'ఇంతరాత్రి వేళ వచ్చావు? ఎవరూ చూడకుండానే వచ్చావా?' – అని అడుగుతాడు. విలపించే సైరంధ్రిని ఓదార్చి 'సీత, దమయంతి, లోపాముద్ర, సుకన్య వంటి సాధ్వులు కష్టాలుపడి చివరకు సుఖాలు పొందినట్లు నీవు కూడా సుఖాల్ని పొందుతావని ఊరడిస్తాడు. కీచకుడిని నర్తనశాలకు వచ్చేలా పథక రచన చేసి సైరంధ్రితో వట్టిమాటలతో కాదు, చేష్టలకు దిగాలి. అదుగో తెల్లవార బోతున్నది. లోకం గుర్తిస్తే, అజ్ఞాతవాస వ్రతానికి భంగం వాటిల్లుతుంది. మన కార్యానికి భంగం కలుగుతుంది. కీచకుడిని చంపాలనుకున్న నా కోరిక తీరాలి. నీవు వెళ్ళి నీ ప్రక్కపై పడుకో అని తొందరపెట్టి మరీ పంపాడు. కొంతదూరం కలసివెళ్ళి వీడ్కోలు చెప్పిమరీ వచ్చాడు. సైరంధ్రి తన అజ్ఞాతవాసం బహిరంగంగాకుండా శత్రుమర్దనం జరగాలి. పట్టరాని నీ కోపంతో రహస్యం చెడితే ఈ ప్రయత్నమే వద్దని సైరంధ్రి అన్నప్పుడు "కీచకుడిని ఎదిరించి పోరేటప్పుడు ఇది రహస్యంగా చేయాలి, ఇది ప్రకాశంగా చేయాలి. అనే విచక్షణ ఆ సమయంలో ఎలా ఉంటుంది?" – అని ఆ సందర్భ తీవ్రతను చెప్పి, సరే! నీవు చెప్పిన దానిని మనసులో పెట్టుకుని, ఓపినంతవరకు రహస్య పద్ధతిలో, తగిన ఉపాయంతో కీచకుడిని చంపే ప్రయత్నం చేస్తానని అంటాడు. అలాగే చప్పుడు చేయని పిడికిలి పోట్లతో కీచకునితో పోరాడు.

ఫలపుష్పభరిత వృక్షాన్ని కూల్చిన మదపుటేనుగులాగా కీచకుడిని కూల్చాక, కీచకుని శవాన్ని చూపించటానికి రహస్య ప్రయత్నంతో నిప్పును తీసికొని వచ్చి వెలిగించాడు. ఎక్కువసేపు ఇక్కడ ఉండటం మంచిది కాదని ద్రౌపదిని హెచ్చరించి వెంటనే వెళ్ళిపోయాడు.

**భార్యానురాగం**

విరాటరాజు కొలువులో ద్రౌపదికి అవమానం కలిగినప్పుడు రౌద్రాకారుడై ఎలా స్పందించాడో, కీచకవధ జరిగాక కూడ అలాగే ఉప్పొంగిపోయాడు. 'నేను అనుకొన్న పని నెరవేర్చాను. భార్య అవమానాన్నీ దుఃఖభారాన్నీ పోగొట్టాను'– అని పొంగిపోయాడు.

శా॥ 'చింతాశల్యము వాసెనే? భుజబలోత్సేకంబు నీ కెక్కనే?
శాంతిం బొందెనె రోషపావకుడు? దుశ్చారిత్రునిం జూచితే?
సంతోషించితె? యిట్లు గాక, బ్రదుకన్ శక్యంబె? దుర్వృత్తి నీ
చెంతం జేరిన యట్టి వీరులకు నాచేతం బయోజననా!' (విరా. 2-358)

అని నీమనస్సు మెచ్చేటట్లుగా ఈ కీచకవధ జరిగింది కదా! నా బలోద్రేకం నీ మనసుకు నచ్చిందా? అని భార్యమెచ్చుకోలును ఆశిస్తాడు. లోకంలో ఎంతటి వారయినా భార్యమెప్పును కోరుకుంటారనటానికి భీముని ఈ వాక్కులే నిదర్శనం. సమర్థుడైన భర్తను చూస్తే ప్రతిభార్యా సంతోషపడుతుంది. నిశ్చింతగా జీవితాన్ని గడుపుతుంది. అలాగే సైరంధ్రి భీముడిని ఇలా మెచ్చుకుంది.

సీ॥ కొలువు లోపల నిన్న కోప మట్లెత్తిను
దలుకక నిలిచిన ధైర్యమహిమ,
నే డిందు జనుదెంచి నిర్వికారతు బ్రజ
కన్నులు గప్పిన గౌరవంబు,
మనవారిలోన నొక్కని నైను బిల్వ కు
త్సాహంబు సేసిన సాహసంబు,
లోకదుర్జయు డగు నీ కీచకునిని వ్రే
ల్మిడి రూపుమాపిన కడిమిసొంపు

తే. సూడు, దలపోయ, మెచ్చ, సంస్తుతి యొనర్ప
నా తలంబె? నీ యుత్తమనాయకత్వ
మెఱిగి నిను గొనియాడ నే నెంతదాన?
మహిత విస్మయానంద నిర్మగ్న నైతి.' (విరా. 2-360)

అని ఉత్తమనాయకునిగా కీర్తించి, విస్మయానంద నిర్మగ్న నయ్యానని చెపుతుంది. భీముడు ఇంతకంటే ఆశించేది ఏముంటుందన్నట్లు ఆ మాటలు కర్ణరసాయనమై సంతోషించాడట.

**యుద్ధోత్సాహ ప్రియత్వం**

భీమసేనుని ధీరత్వం ప్రతి సందర్భంలోనూ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. విరాటుని కొలువులో రౌద్రాకారం ధరించటమే కాదు, కీచకుని చంపటానికి నర్తనశాలకు పోయేటప్పుడు 'పెళ్లికి పిలిచినట్లు సంతోషంతో తలపాగా చుట్టుకొని, వెళ్లాడట. సైరంధ్రి కీచకుడిని నర్తనశాలకు రమ్మని ఒప్పించి వచ్చి, భీమునికి ఆ వార్తను చెప్పినప్పుడు 'ఇన్నాళ్లు ప్రతీకారం తీర్చుకోలేని కోపం నా హృదయాన్ని క్రుంగదీస్తోంది. ఇప్పుడు నాకు అత్యుత్సాహాన్ని కలిగించేలా కార్యాన్ని వెంటనే సంఘటించి వచ్చావ'ని ద్రౌపదిని మెచ్చుకొని ఉత్సాహాన్ని ప్రదర్శిస్తాడు. ఆ ఉత్సాహమే కీచకుడిని వికృతమైన చావుకు గురిచేసింది.

**అధిక్షేపంతో కూడిన హాస్యోక్తి చణత్వం**

చీకటిలో, నర్తనశాలలో, సైరంధ్రిరూపంలో కూర్చొని కీచకునితో చేసిన సంభాషణ ప్రత్యేకంగా గమనించదగింది. భీమునిలో మొరటు బలమేకాదు సున్నితమైన మనస్తత్వము కూడ ఉందని ఆ సంభాషణ నిరూపిస్తుంది. నర్తనశాలలో కీచకుడు చేయి చాచినప్పుడే కోపంతో కంపించాడు కాని నిగ్రహించుకొని కీచకుని చేష్టల్ని, మాటల్ని తెలిసికోవాలనుకున్నాడు. అతని ప్రలాపాల్ని సల్లాపాల్ని విని అసహ్యించుకొని, సైరంధ్రిని ఉల్లాసపరచటానికి వ్యంగ్యంగా మాట్లాడాడు.

"నా పోల్కియాడుదాని వెదకియు నెయ్యెడనైన నీకు బడయవచ్చునె?", "నా యొడలు సేర్చినప్పుడ నీయొడలెట్లగునో దాని నీవెఱిగెదు", "నన్నుముట్టి నీవు వెండియు వనితల సంగతికి బోవువాడవె"... 'కనియెద విదె చిత్రభవు వికారమెల్లన్' –

వంటి పలుకులలోని ద్వంద్వార్థాలు పాఠకులకు హాస్యాన్ని కలిగిస్తాయి. నన్ను తాకిన తరువాత ఇంకో స్త్రీని తాకవని భీముడనటంలో, కీచకుడు తనను తాకగానే చస్తాడని, మనసులో కలిగే వికారాలన్నీ మాసిపోతాయని, వేరేవనితల జోలికి పోలేడని, తనను స్త్రీగా భావించి తప్పు చేశావని అంతరార్థం. ఈ పరిహాసకుశలమే భీముడి పాత్రను మరో కొత్త కోణంలో చూపిస్తోంది.

**మల్లయుద్ధావిశారదత్వం**

కీచకునితో పోరాడినప్పుడు భీముడు చూపిన మల్లయుద్ధనైపుణ్యం విశిష్టమైనది. తిక్కన వర్ణించి చెప్పిన ఆ మల్లయుద్ధ భంగిమలన్నీ, చర్యాప్రతిచర్యలన్నీ భీముని మల్లయుద్ధ ప్రావీణ్యాన్నే తెలియజెపుతాయి.

క॥ కదియుచు బాయుచు బట్టుచు
నదలుచుచుం బడుచు లేచు చదుగుచు వడిగొం
చొదవెడుకినుకం గడు బె
ట్టిదముగు బెనుగిరి చలంబు డింపక కడిమిన్. (విరా. 2-348)

ఇలా భయంకరంగా పోరాడేటప్పుడు కీచకుడు బలహీన పడటం తెలిసికొని, జింకమీద పడి వెంటనే దానిని నేలమీద పడవేసి, భయంకరంగా సింహం ఆక్రమించినట్లు భీముడు కీచకుడిని ఆక్రమించి, భీముడు ఆయువు పట్టులలో పొడిచి కీచకుడిని వధించాడు. వికృతపు చావు చంపాడు.

ఇలా కీచకవధాఘట్టంలో తిక్కన చిత్రించిన భీముడు ఉదాత్తుడు. గంభీరుడు. చాతుర్యంతో కార్యసాధనను సంఘటించిన ఉపాయశీలిగా, ద్రౌపదీ అనురాగ లబ్ధ మానసునిగా, గూఢ వర్తనునిగా కనిపిస్తాడు.

**4. కీచకపాత్రను తిక్కన తీర్చిన విధం ఎట్టిది?**

విరాటపర్వంలో ప్రతినాయక పాత్ర యైనప్పటికీ మరుపురాని పాత్రగా తిక్కన తీర్చిన పాత్ర కీచకుడు. కావ్యజగత్తులో శాశ్వతంగా నిలచిపోయేలా విషాదనాయకునిగా కీచకుడిని తిక్కన చిత్రించాడు. విరాటుని బావమరిదిగా, స్త్రీ వ్యసనిగా కనిపించే కీచకుడిని నాయకుని స్థానంలో తిక్కన రూపించటం విశేషం.

సుదేష్ణ, కీచకులు ఏకోదరులు కానప్పటికీ తండ్రి ఒక్కడే. కీచకుడు కూడా సుదేష్ణను అక్కకంటే ఎక్కువ ప్రేమగానే చూసేవాడు. అందుకే విరాటుని రాజ్యం కీచకునికి భిక్ష అయింది. కీచకపాత్రను ప్రవేశపెట్టేటప్పుడే అతని స్వభావం స్పష్టమయ్యేలా "మత్స్యపతి మఱందియు, దండనాథుండును, గీచకాగ్రజుండును, రూపాభిమానియు, నానాభరణ ధరణశీలుండును, దుర్విదగ్ధుండును, బలగర్వితుండును నగు సింహబలుండు" (4-2-22) అని ప్రస్తావించాడు. సింహబలుడైన కీచకుడు స్వభావత్హ రూపాభిమాని. రూపాన్ని అభిమానించటం రసికలక్షణం. స్వరూప సౌందర్యాన్ని ఆస్వాదించటం అతని స్వభావం. అంటే రూపాన్ని ప్రేమిస్తాడేగాని, గుణాన్ని ప్రేమించడని తాత్పర్యం. ఆకారాన్ని అభిమానించే వాడికి అలంకారాల పట్ల ఆదరం సహజంగానే ఉంటుంది. ఒక వేళ అతడు బలవంతుడైతే, శరీర బలగర్వితుడు కావటం అంతే సహజం. కీచకుడి రూపాభిమానం, నానాభరణశీలం, బలగర్వం అనుచితక్షేత్రాన్ని ఆశ్రయించి ప్రవర్తిల్లటం చేత అతడు దుర్విదగ్ధుడయినాడు. అంటే వివేక హీనుడయ్యాడన్నమాట. ఈ లక్షణాలే కీచకుని పాత్రలో పరచుకొని కనిపించే లక్షణాలు.

కీచకులలో అగ్రజుడు, నూటైదుగురు కీచకులకు అన్న మన కీచకుడు. అందుకే అన్న మరణానికి స్పందించి, అన్న శవంతోపాటే ద్రౌపదిని కూడా దహనం చేయాలని సోదరులైన ఉపకీచకులు భావించారు.

**రూపాభిమాని**

కీచకుడు అందాన్ని చూచి ఆకర్షితుడయ్యే స్వభావం గలవాడు. అక్కకు నమస్కరించటానికి వచ్చి, అల్లంత దూరాన పనిపాటలలో నిమగ్నురాలయి యున్న ద్రౌపది సౌందర్యాన్ని చూచి మన్మథాయత్తుడైనాడు. పేరుకు సింహబలుడైనా, ద్రౌపదీ

రూపమనే ఉచ్చులో చిక్కుకుపోయాడు. ఈమె పొందు పూర్వపుణ్యఫలమని, ఇటువంటి అందగత్తెలుసృష్టిలో ఉంటారా? అని మదనవికారంతో పలవరించాడు.

సీ॥ "దీని జన్మంబును దేజంబు నొందిన
యింతియుబతియును నెవ్వరొక్కొ!
దీని నామాకృతిగా నోచి పడసిన
యింపగు వర్ణంబు లెవ్వియొక్కొ!
దీని వల్లభు డనుగా నిల సొబగు సొం
పెసుగ వర్తిల్లు వా డెవ్వడొక్కొ!
దీని వసించుటు దా నొప్పె పెంపున
నేపారు మందిరం బెద్దియొక్కొ!

ఆ.వె. దీని బొందుగాంచు తెఱుగు నా కెయ్యది
యొక్కొ! యిట్టి పనికి నూఱడిల్లి
తోడుకొనుగ నిచట నీడగు చుట్టంబు
దడవి యెట్టులొక్కొ పడయువాడ!" (విరా. 2-30)

అంటూ రతి భావతీవ్రతతో కాముకునిలా పరవశించాడు. చూచి ఆనందించే స్వభావం కాదు కీచకుడిది. దానిని స్వంతం చేసికొని అనుభవించాలనే లక్షణం కీచకునిది. ఆ లక్షణం వలననే కోరి నశించాడు. వద్దని అక్కవారించినా, సైరంధ్రి బెదరించినా రూపాన్ని చూచిరాగరసమగ్నుడయ్యాడు.

**భయలజ్జారహితుడు**

"కామాతురాణాం నభయం నలజ్జాః" అన్న సూక్తిని సార్థకం చేసే ప్రవర్తన కీచకునిది. ద్రౌపది మీద వాల్చిన చూపుల్ని మళ్లీ వెనుకకు మరల్చక, అంతఃపురంలోనున్న ఇతరులు ఏమనుకుంటారోననియైనా చూడకుండ అలాగే ఆమెను గురించి తలపోయసాగాడు. ఆమె పొందును పొందటానికి నాకు తోడ్పడేవాడు ఎవరైనా దొరుకుతారా? అంటూ

చ॥ అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడిను దల్లడించు బై
కొను తలపోత నించు, మది గోర్కులు పేర్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుడై. (విరా. 2-31)

అన్న మాటే అంటూ ద్రౌపది సౌందర్యాన్ని పలువిధాలుగా ప్రశంసించి మాట్లాడటం, ముంచుకొని వచ్చే వలపు తలపులకు సంతోషించటం, పెల్లుబికే కోరికలకు తట్టుకోలేక తమకించటం, వారించటానికి వీలులేని ఉద్రేకంతో ఎంతకైనా తెగించేందుకు ఉత్సహించటం, వింతగా తనను చూచే జనాన్ని తేరిపారచూడటం, మతితప్పిపోయినట్లు తల్లడిల్లటం ఇవన్నీ అతని నిస్సిగ్గును తెలియజేస్తాయి. ఇవన్నీ భయంలేని తనం నుండే వస్తాయి. తనమందిరంలోనికి వచ్చిన ద్రౌపదిని వెంటబడి తరమటం, విరాటుని కొలువుకు పరుగెత్తి చేరిన ద్రౌపదిని పడదన్నటం – ఇవన్నీ భయరహితస్థితినుండి వచ్చినవే. చూసిన జనం, ప్రజలు మిన్నకుండటానికి కూడ కారణం ఆతని బలమే కారణం. ఆ బలగర్వంతోనే భయంలేకుండా ప్రవర్తించి, తన అక్కతో సైతం సైరంధ్రిని కూర్చి పెట్టమని అడుగగలిగిన తెంపరితనాన్ని ప్రదర్శించాడు. చెడుమార్గంలోపోతే చెడిపోతానన్న అక్కమాటల్ని సైతం సహించలేకపోయాడు. అక్కపాదాలపైబడి శుభాశీస్సులను కోరకుండా సైరంధ్రిని పిలిపించమంటూ కోరాడు. భయము,

లజ్జలేని వాళ్లకు మొండిపట్టుదలకూడ ఉంటుంది అది గమనించటం వలననే సైరంధ్రిని నీ మందిరానికి పంపిస్తానని సుదేష్ణ మాటయిచ్చి, అనునయించి పంపింది.

**ఉచితానుచితాలనెరుగని దుర్విదగ్ధత**

కీచకుని బుద్ధి ఉచితానుచితాలనెరుగనిది. ద్రౌపదిని గుచ్చిగుచ్చి చూస్తుంటే, ఆమె తప్పించుకో చూసింది. సిగ్గులేకుండా కోర్కెను బయటపెట్టినప్పుడు "అన్నా! కష్టాలకడలిలో జీవిస్తున్న నా మేను, కట్టు, బొట్టుతీరు నీకు అసహ్యాన్ని కలిగించటం లేదా! నీకు తోబుట్టువులు లేరా! నేను కూడా సోదరిలాంటి దానినే కదా!" – అని అన్నప్పుడయినా గమనించాలి. ఆమె అభిప్రాయాన్ని తెలిసికొనయినా మర్యాదను కాపాడుకొని యుండవలసింది. పరస్త్రీ సాంగత్యంతో వచ్చే పాపాన్నయినా భరిస్తాను కాని ఈమదన తాపాన్ని భరించలేనని చెప్పాడు. కీచకుని నీచత్వాన్ని గమనించి తన భర్తలను గురించి చెప్పి భయపెట్టింది. అయినా తన బలం ముందెంత లెమ్మని తిరస్కరించాడు. వీడు వినేరకం కాదని ద్రౌపది అక్కడి నుండి తప్పుకొంది. చివరకు సుదేష్ణ ద్రౌపదిని మదిరపేరుతో మాయమాటలతో నచ్చచెప్పి పంపినప్పుడు 'నా దాహం తీర్చకుండా, నీ రాణి దాహం తీర్చాలనుకోవటం ఏం పద్ధతి?' అంటూ అనుచితంగా మాట్లాడాడు. వెంటబడి తరుముకొచ్చి, విరాటుని సభలో పడదన్నటం, ఆపైన సైరంధ్రి కీచకవధకు పథకరచన చేసికొనివచ్చి అంగీకరించినట్లు నటించినప్పుడు ఆంతర్యాన్ని గమనించలేకపోయాడు. తనను అంతగా తిరస్కరించిన స్త్రీ, వచ్చి వలచినట్లు అంగీకరించటం వెనుకనున్న ఆంతర్యాన్ని అర్థం చేసికోలేని అవివేకత్వం, బలంతోపాటే కీచకునిలో పెనవేసుకొని కనిపిస్తాయి. సైరంధ్రిని గురించి సూర్యాస్తమయం కోసం వేచి చూస్తూ, ద్రౌపది చేజిక్కినట్లే భావించి భావరతిని పొందాడు.

నర్తనశాలను ఎంచుకోవటంలో ఏమైనా ఆంతర్యం ఉన్నదా? అన్న ఆలోచనకూడా చేయలేదు. పైగా అది అనుకూలమైన ప్రదేశంగా ఉబ్బితబ్బిబ్బయ్యాడు. ఆ రాత్రికే వస్తానని ఒంటరిగా పోయాడు. నర్తనశాలలో సైరంధ్రిరూపంలో నున్న భీముడు చేసే నర్మగర్భ సంభాషణను ఏమాత్రమూ అవగాహన చేసికోలేకపోగా 'నారూపవిలాసాదుల్ని గమనించిన ఏ వనితా తనను వదలి యుండలేదని, నా వివేకాన్ని గుర్తించిన ఏ స్త్రీయైనా తన పొందు కోరుకుంటుందని, అందరూ నా చే ఏలబడుతుంటే, నేను నీ చేత ఏలబడుతున్నానంటూ' – అవివేకంతో మాట్లాడాడు. ఇవన్నీ కీచకుని అవివేకత్వాన్నే తెలియజేస్తాయి. అయితే ఎంతటి అవివేకశీలియైనా తన భంగపాటును ఇతరులు చూస్తారేమోనని, చూస్తే తనకు పరువు తక్కువని భావించి నర్తనశాలలో భీమునితో పోరాడేటప్పుడు, చప్పుడు చేయని గూఢ విమర్దన ప్రహారాలే పొడిచాడు.

**నానాభరణ ధరణశీలుడు**

కీచకుడు ఎంతటి రూపాభిమానియో, అంతటి స్వీయదేహాలంకార ప్రియుడు. మదిరను తెమ్మని సైరంధ్రిని తన మందిరానికి సుదేష్ణ పంపుతానని చెప్పినప్పుడు సైరంధ్రికోసం ఎదురుచూస్తూ, తాను ధరించిన ఆభరణాల్ని సర్దుకుంటూ, ఉదాత్తంకాని శృంగార చేష్టలు చేస్తూ నిలుచున్నాడు. వచ్చిన సైరంధ్రిని ఆభరణాలతో ఆశపెట్టాడు. విరాటుని కొలువునుండి వెనుదిరిగివచ్చాక మరునాడు సైరంధ్రిని ఎలాగయినా శయ్యకు చేర్చుకోవాలన్న తహతహతో నిద్రలేచిన వెంటనే వడివడిగా కాలకృత్యాలను నెరవేర్చుకొని, సింగారించుకొన్న తర్వాతే సుదేష్ణ మందిరానికి వెళ్లాడు. చివరకు నర్తనశాలకు పోయినప్పుడు కూడ అలంకరించుకునే పోయాడు. సైరంధ్రికోసం మనోహరమైన ఆభరణాల్ని, వస్తువుల్ని కూడ తీసుకొనిపోయాడు. అందుకే నానాభరణ ధరణశీలి కీచకుడని తిక్కన చెప్పాడు.

**బలగర్వితుడు**

కీచకుడు కాముకత్వంతోపాటు బలగర్వితుడు కూడ. ఆ గర్వాతిశయం చేతనే ఎవరినీ లెక్కచేయనితన మబ్బింది. సైరంధ్రి తన భర్తల గురించి చెప్పి బెదరించినప్పుడు వినలేదు. పైగా "నా యతులబాహుబలము జెనయంగ భవదీయ పతుల కారు మూడులోకంబులందు నెవ్వాడు లేమినిక్కువంబు" అని నమ్మమన్నాడు. నర్తనశాలలో కీచకవధకు పథకం సిద్ధం చేసుకొని సైరంధ్రి వలపునటించేటప్పుడు

ఉ॥ "రాజుల నెల్ల నుగ్రసమరంబుల వ్రేల్మిడి నేర్చి పేర్చి యీ
భూజనకోటి నాదగు విభుత్వ సమగ్రత నాదరింప వి
భ్రాజిత రాజ్యతంత్రములు పాలన సేయుదు; నేన వీటికిన్
రా జనుగా; నెపం బిడి విరాటునకుం దగు గూడు వెట్టుదున్." (విరా. 2-254)

అని తన సమగ్ర ప్రభుత్వాన్ని జనం ఆదరిస్తుంటే రాజ్యాంగాన్ని తానేనడుపుతున్నాని, విరాటరాజును నామమాత్రంగా రాజుగా నిలబెట్టి తగిన తిండి పడవేస్తున్నానని చెప్పటం వెనుకనున్నది ఈ బలగర్వమే. ఆ బలగర్వమే ఒంటరిగా నర్తనశాలకు నడిపించింది. ఆ బలగర్వంతోనే ఆత్మస్తుతి చేసుకోవటం, ఔద్ధత్యాన్ని ప్రదర్శించటం తొలుత అనునయించి, మురిపించి ఎలాగోలా ఒప్పించి కోరికతీర్చుకోవాలని సంకల్పించినవాడు, ద్రౌపదితో కఠినంగా మాట్లాడిన తీరులో ఈ బలదర్పం స్పష్టంగా కనిపిస్తుంది.

చ॥ "విరటుడు సూచుచుండ నిను వేపుర ముందట నట్లు ద్రోవ నొ
క్కరుడును గాదుగూడ దనుగల్గెనె? పోటరులైన భర్తలే
వురు గలరంటి; వారి యలపుం జలముం గడగంటి; నింక నె
వ్వరు గల? రెట్లు దప్పె? దనివారణు బట్టెద నెందు జొచ్చినన్." (విరా. 2-257)

అని విరాటరాజు కొల్వులో వేలమంది ముందట నిన్నలా త్రోసిపడవేస్తే అడ్డుకున్నవాళ్లు ఎవరైనా ఉన్నారా? నీ భర్తలు అయిదుగురు ఉన్నారు కదా! వాళ్ల బలపరాక్రమాలు ఏమయ్యాయి. వాళ్ల అంతుచూస్తాను. నీవు ఎక్కడ చొరబడ్డా, అడ్డులేకుండా నిన్ను గ్రహిస్తాను. అని అత్యంత కఠినంగా మాట్లాడటం వెనుక ఈ బలగర్విత లక్షణమే కనిపిస్తుంది.

**కీచకుని విరహావస్థ**

సాధారణంగా విరహవర్ణన నాయికానాయకుల మధ్య రాణించినట్లు నాయిక, ప్రతినాయకుల మధ్య రాణించదు. ఈ ఘట్టంలో కీచకుని విరహాన్ని పరితలనాకర్షించేలా కవి వర్ణించాడు. కీచకుని అనురాగం ఏకత్రైవానురాగం. అతని రతి అధర్మరతి. ఒకవైపునే ప్రేమ ఉండటం ఆభాసం. ఈ ఆభాసానికి రసస్థితికి ఉన్నంతలోతు ఉండదు. కాని ఆకర్షణీయంగా, ఆహ్లాదంగానే కనిపిస్తుంది. కాని హాస్యభాజనమవుతుంది. హాసమెప్పుడూ వికృతివలననే కలుగుతుంది. వికృతి ఏకత్రైవానురాగంతో భాసించి, అధర్మరతిలో పుష్టిని పొందుతుంది. అనుచితవిభావాలంబనతో జుగుప్సకు స్థానం లేకుండా వర్ణించటం కవి సామర్థ్యం మీద ఉంటుంది. ఈ కీచక పాత్రగతమైన శృంగారాన్ని కూడ జుగుప్స కలుగని రీతిలో వర్ణించి, పాత్రపట్ల సానుభూతిని కలిగించేలా చిత్రించి కీచకుడిని విషాదాంత నాయకుడా? అనేటట్లుగా తిక్కన చిత్రించాడు.

**సింహబలత్వం**

కీచకుని బలం అల్పమైనదేమీ కాదు. ఏ విధమైన ప్రయత్నం లేకుండ, మదన వికారంతో మ్రగ్గిపోతున్న కీచకుడిని, భీముడు పట్టుకున్నాడు. తన బలపరాక్రమాలన్నిటినీ కూడగట్టుకొని మరీ, వెనుకాడకుండా గట్టిగా విడిపించుకొని, భీముడిని పట్టి బలంతో లాగి నేలమీద పడవేసి, శరీరాన్ని మోకాళ్లతో అదిమిపట్టాడు. ఇద్దరూ బలంలో సమానస్థాయివాళ్లే కాబట్టి పోరు అనాయాసంగా, భయంకరంగా సాగింది. ఒక విధంగా చూస్తే జరిగింది సమయుద్ధమే. ఒకరికొకరు అసాధ్యులై చేస్తున్న పోరాటాన్ని తిక్కనగారు వర్ణించిన తీరు చూడండి.

సీ॥ "తిగిచిన నడుగులు దెరలక యొండొరు
గ్రమ్మఱు దిగుచుచు గడిమి మెఱయు,
బొడచిన వెస బీఱుపోవక యొండొరు
నందంద పొడుచుచు నవని బెట్టి

యొత్తిన బెగ్గలం బొందక యొండొరు
బలువిడి నొత్తుచు నలవు మిగిలి,
యడుగంగు బొదివిన నడిచిపా టించుక
యును లేక మీక నొండొరుల నదరి,

తే॥ యడుగు బొదువుచు, నలుక యంతం కగ్గ
లించి యాయముల్ నొంది దోర్లీల నెఱపి
యుల్లసిల్లిన స్రుక్క కొండొరుల రౌద్ర
వృత్తి నొంచు చొండొరులకు వెక్కసముగ." (విరా. 2-347)

ఇంతటి బలం కలవాడు కాబట్టే, భీముడంతగా కష్టపడి మట్టుపెట్టవలసి వచ్చింది. తన బలానికి ఎదురులేదని విర్రవీగినందువలననే పరువు నష్టమవుతుందన్న భయంతో చప్పుడు చేయకుండా ద్వంద్వయుద్ధం చేయవలసి వచ్చింది.

ఈ విధంగా కీచకుని పాత్రను తిక్కనగారు ఒక విషాదచ్ఛాయతో కూడిన నాయకునిలాగా చిత్రించి, ప్రతినాయకపాత్రలలో విలవైనదిగా తీర్చాడు.

**5. ధర్మరాజు పాత్ర చిత్రణను వివరించండి.**

భారత కథానాయకుడైన ధర్మరాజు పరమ సాత్త్వికమూర్తి. ఎంతటి సాత్త్విక మూర్తియో అంతటి ధర్మాగ్రహంగల సార్థకనామధేయుడు. సాధువర్తనుడు. సోదరుల పట్లగల ప్రేమ, అజ్ఞాతవాస సమయాన్ని సమర్థంగా గడపటంలోగల పట్టుదల, విరాటునిపట్ల గౌరవభావం, సందర్భోచితవర్తనం, సంయమనశీలం కీచకవధ ఘట్టంలో కనిపిస్తుంది.

కుంతీదేవి సంతానంలో ప్రథముడు, భారతకథా సూత్రాన్ని తన చేతిలో పెట్టుకుని, మిగిలిన పాత్రలన్నీ తన గురించే ఆలోచింపచేసి, తన చూపుమేర నడిపించిన పాత్ర ధర్మరాజుది. కీచకవధా ఘట్టంలో ధర్మరాజు పాత్ర పరిధి పరిమితమే. కాని ఈ ఘట్టానికి కథానాయకుడై ద్రౌపదిచేత ఉత్తమనాయకునిగా ప్రశంసింపబడిన భీముడు కూడ ధర్మజుని మనసుమెచ్చేలా కార్యాన్ని చక్కబెట్టాలనే భావించాడు. పాండవులలో ఉద్ధతస్వభావం భీమునిది. అప్పుడప్పుడు అన్నగారిని తిరస్కరించి, ఆయన అభిప్రాయాలను అంగీకరించక విభేదించినప్పటికీ, మారుమాట్లాడకుండా, అక్షరాల అన్నగారి ఆజ్ఞలను నిర్వర్తించటమే ధర్మజుని వ్యక్తిత్వపు గొప్పదనానికి సాక్ష్యం.

ద్రౌపదిని కీచకుడు వెంటబడి తరమగా, పరుగెత్తుకొని విరాటుని కొలువులోనికి వచ్చిన సందర్భంలో మాత్రమే ధర్మరాజు పాత్ర ఈ ఘట్టంలో కనిపిస్తుంది. ఆ సందర్భంలో కీచకుడు ద్రౌపదిని పడదన్నినప్పుడు భీముడు రౌద్రాకారుడై, కీచకుడిని, విరాటుడిని మట్టుబెట్టాలని భావించి సమీపంలోనున్న వృక్షాన్ని పెకలించబోయి అన్నగారయిన ధర్మరాజువైపు అనుమతికోసం చూశాడు. అంటే తనకంటే బలవంతులైన తమ్ముల్ని సైతం, తన కనుసన్నలలో మెలగేలా చేసుకొన్న వ్యక్తిత్వం ధర్మరాజుది. అప్పుడు తన నయనాకారంబున వారించాడు. ప్రళయకాలంలో కాలునిలా రౌద్రమూర్తియైన భీముడిని సైతం ఆపగలిగాడు. అంతటి భయంకరాకారాన్ని ధరించిన ఉగ్రతలోకూడ భీముడు అన్న భావాన్ని గ్రహించి కోపాగ్నిని చల్లార్చుకున్నాడు. ధర్మరాజుమనోబలం అలాంటిది. ధర్మజుని మనోబలానికి, భీముని శారీరక బలం లొంగి వర్తించటం కీచకవధాఘట్టంలోనే కాదు, భారతంలో పెక్కు సందర్భాలలో కనిపిస్తుంది. ద్రౌపదికోపంతో మాటాడినప్పుడు సైతం భీముడు ద్రౌపదితో ధర్మరాజును గురించి చెపుతూ "ధైర్య హేమాచలుండైన ధర్మసుతుడు" - అని "సత్యవ్రతధర్మనిష్ఠుడగు యుధిష్ఠిరుడు పొగడ్తకుందగువాడు కాని దూఱువడ నర్హుండుగా"దని నచ్చచెపుతాడు. అంటే ధర్మరాజు వ్యక్తిత్వం ఎంతగా భీమాదుల్ని ప్రభావితం చేసిందో గమనించవచ్చు.

ఉచితానుచిత మెరిగిన ధర్మరాజు ప్రవర్తనయే పాండవులను అజ్ఞాతవాసం నుండి గట్టెక్కించింది. కీచకవధాఘట్టంలో భీమద్రౌపదుల ఆవేశ పూరితవర్తనాన్ని చెలియలికట్ట దాటనీయకుండా రక్షించింది. ధర్మజుని సమయోచితప్రసంగమే. భీముడు చెట్టును పెకలించబోయినప్పుడు కనుసైగతో వారించగలిగాడు. తమ్ముడితో సూటిగా మాట్లాడే సందర్భం కాదది. గూఢంగా చెప్పాలి. చుట్టూ ఉన్నవారికి అర్థంకాని రహస్యభాషలో చెప్పాలి. అందుకే

మ॥ "వలలుం డెక్కడు జూచె నొండెడ ననేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పుగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపగా
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపగా నేటికిన్?" (విరా. 2-136)

ఇది భీముని ఉద్దేశించి "ఎందుకు చెట్టువైపు చూస్తావు. ఈ చెట్టును పెకలించి రాజును, ఆతని బావమరిదిని చంపాలని భావిస్తావు. ఈ రాజు నీడనిచ్చే చెట్టు. అజ్ఞావాసంలో మనకు ఆశ్రయాన్నిచ్చిన సేవ్యక్ష్మాజం. ఆశ్రయించిన మనల్ని బంధువుల్ని పోషిస్తూ నిలువనీడనిచ్చిన వాడు ఈ రాజు. కీచకుడు వంట కట్టెలవంటివాడు. వాడికోసం ఈ రాజును చంపతగదు. అజ్ఞావాస నియమ భంగాన్ని కావించకు!" అని చెప్పినట్లు.

కొలువులో నున్న ఇతరులకేమో "ఈ వంటలవాడికి ఈ చెట్టు ఎక్కడ కనిపించింది. పొయ్యిలోకి కావాలంటే వేరే చోట పనికిరాని ఎండిపోయిన చెట్లులేవా? పండ్లతో, మంచి కొమ్మలతో విస్తరించి, ఆశ్రయించినబాటసారులకు ఉపయోగపడుతూ నిల్వనీడనిస్తోంది. దీనిని వంటకట్టెలకు కొట్టడం అనుచితం" - అని స్ఫురించేలా ధర్మజుడు నర్మగర్భ సంభాషణ చేశాడు. ఈ నిగూఢ సంభాషణతో భీముడి రౌద్రాన్ని తగ్గించాడు ధర్మజుడు.

భీముడి కోపాతిశయాన్ని తగ్గించగలిగిన ధర్మజునికి మళ్లీ ద్రౌపది ఆవేశం మరొక సమస్య అయింది. అన్నదమ్ముల రహస్య వచనాలు విని ఒకవైపు కోపం, మరోవైపు సమయభంగ భయం కలవరపెడుతుంటే భర్తలవైపు కోపంతో చూచి సభాసదులను చూచి "ధర్మాధర్మ విచక్షణ కలిగి, శిష్టరక్షణ - దుష్టశిక్షణ చేయగలిగి, శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరి, శత్రువుల నవలీలగా చంపగల గంధర్వులైన నా పతులు ఈ కీచకుడు నన్నిలా అవమానిస్తుంటే మిన్నకున్నారు. ఇక పై లోకంలో ఇతరుల భార్యలకు అవమానం కలిగితే రక్షకులెవరు? కీచకుడింతచేసినా మిన్నకున్న ఈ విరాటరాజునననాలి? ధర్మలోపం జరిగితే పూనుకోని వీడేం రాజన్నట్లు సైరంధ్రి రూపంలోనున్న ద్రౌపది మాట్లాడింది. ఇంతటి దుఃఖావేశంలోనున్న ద్రౌపదిని చూచి సభలోనున్న వాళ్లు గుసగుసలు పోయి పరితపించారు. మరి ధర్మరాజెలా ప్రవర్తించాలి!

అంతాచూసే చూడనట్లున్న ధర్మరాజుపై ద్రౌపదికి కోపం. ద్రౌపది పరుషంగా మాట్లాడుతున్నది. ఆమెను సభలో అడ్డగించటానికి వీలులేదు. సమయభంగం కాకుండా పరిస్థితిని చక్కదిద్దాలి. అటువంటి పరిస్థితులలో తొలుత ఆమె ఆవేశానికి అడ్డుకట్టవేయాలని భావించాడు ధర్మరాజు. అప్పటి ధర్మరాజు స్థితిని చూడండి.

ఉ॥ "అప్పుడు ధర్మసూతి హృదయంబు గలంగ, లలాట భాగముం
గప్పుగ ఘర్మవారి, యధికంబగు రోషము నొందియుండియుం
దప్పుగ ద్రోచికొంచు దనధైర్యము పెంపున నిర్వికారుడై
యెప్పుడుదాను బల్కు నెలు గేర్పడ ద్రౌపదితోడ నిట్లనున్." (విరా. 2-147)

ఇందులో ధర్మరాజుపడిన సంఘర్షణ కనిపిస్తుంది. హృదయం కలత చెందింది. రోషం పెరిగింది. నొసట చెమట పట్టింది. తన ధృఢమైన చిత్తంతో నిర్వికారుడై గొంతుపెకలించుకొని ద్రౌపదితో మాట్లాడటానికి పూనుకున్నాడు. ఎవరమైనా ఆప్తులతో ఆర్ద్రంగా మాట్లాడేటప్పుడు గొంతు కాస్తమారుతుంది. అందులోనూ ఇక్కడ ద్రౌపది పరాభవాన్ని కళ్లారా చూసి, ఏమీ చేయలేని నిస్సహాయత గొంతులో ధ్వనిస్తే ప్రమాదం కదా! అందుకే ధర్మరాజు 'ఎప్పుడు దాను పలుకు ఎలుగేర్పడ' పలికాడు.

అంటే ఎప్పుడూ మాట్లాడే గొంతుతోనే మాట్లాడాడట. అంటే ధర్మరాజు మనస్సు ఎంతటి స్థిరమైనదో, ఉద్వేగాలను అదుపులో ఉంచుకోగల శక్తి ఎంత ఉన్నదో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఎంతటి మానసిక సంక్షోభాన్నయినా సంయమించుకోవటంలో ధర్మరాజు వశీకృత చిత్తుడే.

సరే! చెప్పి చూద్దామన్నట్లుగా "సైరంధ్రీ! నీ విషయాన్ని రాజుగారు, సభాసదులు తెలిసికొన్నారు. మాటలు చాలించి, రాణిగారి అంతఃపురానికి వెళ్లు. నీ భర్తలైన గంధర్వులు ఈ సమయంలో నిన్నాదుకోలేదంటే ఇది తగిన సమయం కాదని ఊరుకున్నారేమో? అది తెలియక నీ భర్తల్ని నిందించటం సరికాదు! ఎంత బాధపడినా సభలలో ఎక్కువసేపు నిలబడి, సంకోచం లేకుండా ధిక్కరించి మాట్లాడటం తగదు" – అని గంధర్వుల పేరుతో తన మనసులోని అభిప్రాయాన్ని చెప్పాడు. ఇవి కేవలం ద్రౌపదికే కాదు, భీమునికి కూడా సూచనలే. నీవెంత మాట్లాడినా మేం స్పందించటానికి ఇది సమయం కాదు. సభాస్థలం అందుకు సందర్భం కాదు. మాకూ నీకంటే ఎక్కువగానే కోపముంది. నీవిక్కడ ఉండటం శ్రేయస్సుకాదు. అనే అర్థంతో నిగూఢంగా చెప్పి చూచాడు.

ఎంత చెప్పినా సభను వీడక ఇంకా ఏదో చెప్పాలని సైరంధ్రి చూస్తోంది. అప్పుడు ఆక్రోశంతో నున్న ద్రౌపది మనసు గ్రహించి

కII "పలుపోకలు బోవుచు వి
చ్చలవిడి నాట్యంబు సలుపు చాడ్పున నిచటన్
గులసతుల గఱువ చందము
దొలుగుగ నిట్లునికి దగునె తోయజవదనా!" (విరా. 2-150)

అని అన్నాడు. ఇక్కడ ఏమీ చేయలేని నిస్సహాయస్థితి ధర్మజునిది. ఆ అసహాయతలో నుండి వచ్చిన కోపంతోనే పై మాటలు ధర్మజుడు అన్నాడు. ద్రౌపది కూడ మరింత కోపంతో నా భర్తలు నటులు, జూదరులంటూ ధర్మరాజును ఎత్తిపొడిచింది. జూదరి ఆలికి గౌరవం ఎక్కడిదంటూ రజోగుణ తీవ్రతతో మాట్లాడి సభనుండి నిష్క్రమించింది. ఇంత తిరస్కరించి మాట్లాడిన ద్రౌపదే భీమునితో మాట్లాడుతూ 'ధృతిమాలి పలికితి'నని చెపుతుంది. ధర్మరాజు పట్ల తన గౌరవాన్ని, భక్తిని ప్రదర్శించి కీర్తిస్తుంది.

ధర్మజుని ధర్మనిరతియే జగత్తుకు రక్షయని, ఆతని సంతత ధర్మ నిరతియే మనలను రక్షించి బ్రతుకునిస్తున్నదని ద్రౌపది కీర్తిస్తుంది.

సీII "ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
రాజభూషణ రజోరాజి నడుగు;
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు
నొజ్జయై విసయంబు నొఱపు గఱపు;
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
మానిత సంపద లీనుచుండు;
నెవ్వని గుణలత లేడు వారాసుల
కడపటి కొండపై గలయబ్రాకు;

తేII నతుడు భూరిప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటీర మణిఘృవి వేష్టితాంఘ్రి
తలుడు కేవల మర్త్యుడె ధర్మసుతుడు!" (విరా. 2-191)

అని ధర్మరాజు కీర్తిని కీర్తిస్తుంది. రూపెత్తిన ధర్మావతారమని ధర్మజుని గురించి చెపుతుంది.

దిగ్విజయము, అజాతశత్రుత్వం, ధర్మనిరతి, గాంభీర్యము, ధైర్యము, సుగుణత్వంకల ధర్మజుని పాత్ర కీచకవధా ఘట్టంలో కేవలం విరాటుని కొలువులో భీమద్రౌపదుల ఆవేశాన్ని కట్టడి చేయటానికి మాత్రమే ఉపకరించినట్లు కనిపించినా, భీమద్రౌపదుల పాత్రల అంతరంగాన్ని జయించినడిపించింది ధర్మరాజే.

ఈ ఘట్టంలోనే కాదు, కీచకుడిని నర్తనశాలకు రమ్మని చెప్పి ఒప్పించి, ఆ విషయాన్ని భీముడికి చెప్పటానికి పోయినప్పుడు భీముడి ఉత్సాహోద్రేకాన్ని చూచి భయపడిన ద్రౌపది, మళ్లీ ధర్మరాజుపేరు చెప్పే అపాయం కలుగకుండా వారించింది.

ఇలా ధర్మరాజుపాత్ర ఈ కీచకవధాఘట్టంలో భీమద్రౌపదుల ఆవేశమనే మదపుటేనుగుకు అంకుశంలా ఔచిత్య పోషకమయింది.

**6. తిక్కన వర్ణించిన కీచకుని విరహపు తీరును వివరించండి?**

**(లేదా)**

**అలంకారశాస్త్రం పేర్కొన్న శృంగార దశావస్థలను కీచకుని పాత్రకు సమన్వయించండి?**

భారతంలో శృంగార రసానికి పెద్దస్థానం లేదు. నాయికా నాయక శృంగారాన్ని విరివిగా వర్ణించిన ఘట్టాలు అసలు లేవన్నా అతిశయోక్తి కాదు. కాని కీచకుని శృంగారం మాత్రం విపులంగానే వర్ణించబడింది. కీచకుడు ప్రతినాయకుడు. ఈ ప్రతినాయకుని విరహం పది మదనావస్థలను పొంది విప్రలంభ శృంగారంగా భాసిస్తోంది. ఏ కావ్యంలోనైనా ఈ మదనావస్థలను నాయిక పొందినట్లు వర్ణించటం కనిపిస్తుంది. నాయకుల విషయంలో సైతం వర్ణించినట్లు కనిపించదు. ఒకవేళ అలా కనిపించిందంటే అది అరుదైన అంశమే. అలంకారశాస్త్రాలు సైతం మదనావస్థలను మగువలకే వర్ణించి చెప్పాయిగాని పురుషులకు చెప్పలేదు. అలా చెప్పటం పురుషాధిక్య సమాజపు భావజాలమని స్త్రీవాదులు వాదిస్తారు కాని ఈ దశావస్థలు పురుషగతంగా వర్ణించిన దానికంటే స్త్రీగతంగా వర్ణించటంలోనే మాధుర్యం, రమ్యత గోచరిస్తుంది. హృదయమున్నప్పుడు స్త్రీ, పురుషులు ఇద్దరికీ అనుభవం సమానమే. కీచకుని గుణగణాలను ఎంత సూక్ష్మంగా చిత్రించాడో ఆతని మదనావస్థలను కూడా తిక్కన అంతే అందంగా చిత్రించాడు.

అలంకారశాస్త్రాలు మదనావస్థలు పదియని, పన్నెండని రెండు విధాలుగా చెప్పటం కనిపిస్తుంది.

> "దృఙ్మనస్సంగ సంకల్పో జాగర్ణ కృశతాఽరత్తి ।
> హ్రీత్యాగోన్మాద మూర్ఛాంత ఇత్యనంగదశాదశ ॥"

1. దృక్కు (చక్షుప్రీతి), 2. మనస్సంగము, 3. సంకల్పము, 4. జాగరము, 5. కృశత, 6. అరతి, 7. హ్రీత్యాగము, 8. ఉన్మాదము, 9. మూర్ఛ, 10 అంతము.

ఈ పది మన్మథావస్థలని కొందరు చెప్పారు. ప్రతాపరుద్రీయంలో ఈ దశావస్థలకు తోడు ప్రలాపము, సంజ్వరము అనే మరో రెండు అవస్థల్ని పేర్కొన్నది. భావప్రకాశికలో ఈ అవస్థలు భిన్నంగా కనిపిస్తాయి.

> దశధామన్మథావస్థా భవేద్ద్వాదశధాఽపివా
> ఇచ్ఛోత్కంఠాభిలాషాశ్చ చింతాస్మృతి గుణస్తుతీ
> ఉద్వేగోఽథ ప్రలాపస్స్యాదున్మాదో వ్యాధిరేవచ
> జాడ్యం మరణమిత్యాద్యైకైశ్చిద్వర్జితే బుద్ధె

ఇచ్ఛ, ఉత్కంఠ, అభిలాష, చింత, స్మృతి, గుణస్తుతి, ఉద్వేగము, ప్రలాపము, ఉన్మాదము, వ్యాధి, జాడ్యము, మరణము అనే పన్నెండింటిలో మొదటి రెండింటిని ఇచ్ఛ, ఉత్కంఠను కొంతమంది విడిచిపెట్టారు. మొదట పేర్కొన్న పదింటిని స్వీకరించి, వాటితోపాటు ప్రలాప సంజ్వరాలను కలిపికొని మొత్తం పన్నెండవస్థలను స్వీకరించటం సముచితమని కొందరు భావించారు.

ఈ పైన ప్రస్తావించిన పది అవస్థలలో మూర్ఛ, అంతము అనేవి స్త్రీ పాత్రలకు సరిపడినంతగా పురుషపాత్రలకు తగవు. అందుకేనేమో తిక్కన వీటిని కీచకుని పట్ల వర్ణించలేదు. అది ఉత్తమ శృంగార నాయకులకే తగినది. అరతిని ఒకవచనంతో మాత్రమే సూచించి విడిచిపెట్టాడు. అన్నపానాలు పట్టించుకోకుండా మదనావేశ వివశుడై యున్నాడని ధ్వని పూర్వకంగా చెప్పాడు. "రాత్రిళ్లు జాగరణ చేసి ఎలా తెల్లవారుతుందా? అన్న వేదన పడే అవసరం లేనందున తిక్కన పగటి జాగరణనే కల్పించాడు. చంద్రుడిని ఉపాలంభనం చేసే బదులుగ సూర్యుడిని ఉపాలంభింపచేశాడు. "మాయ రవి ఏలక్రుంకుడొకో!' (2-312)

ఆ.వె. "దినము కాని యింక భువనంబు నందిట
వట్టిరాత్రిలేని యట్టుగాుగ
జేసెనొక్కొ విధి విశేషించి నాక కా
నేడ దివము సాగి నిలిచెనొక్కొ"

అని సూర్యుడిని చూచి నిందాగర్భితంగా మాట్లాడాడు. మిగిలిన మదనావస్థలను చూద్దాం.

**1. చక్షుప్రీతి**

ప్రేమించినవారిని ఆదరంగా చూడటం చక్షుప్రీతి.

ఉ॥ అక్కజమైన చెల్వమున నాత్మకు మ్రేగయి పొల్చు పొల్తిపై
నెక్కొను చూడ్కి గ్రమ్మఱువ నేరక యూరక నిల్చు గాముచే
జిక్కిన నెమ్మనంబు గడు జేద్పడు మానము జేష్టితంబులం
దక్కిన యంగముం దలకు ధైర్యమునై యతు డప్పు డయ్యెడన్. (విరా.2-23)

ఇందులో ద్రౌపది సౌందర్యం ఆలంబన విభావం. అనుభావం కీచకుడు దృష్టిని మరల్పలేకపోవటం. సాత్త్వికభావం ఆశ్చర్యంతో కలిగిన స్తంభము. అతని యందలి స్థాయి "కాముచేజిక్కిన నెమ్మనంబున" నిలచినరతి. మనశ్చాపలం, మోహం, ధృతిని కోల్పోవటం మొ॥వి సంచారులు. ఇందులో రతిభావం ధ్వనించబడుతోంది.

**2. మనస్సంగమం**

మనస్సు ప్రేమించినవారితో సంగమించటం.

తే॥గీ॥ "ద్రౌపదీ రూప మను నురి దగిలి తనదు
హృదయ మను మృగ మత్తఱి నుదిలగొనుచు
గాముడను బల్లిదపు మేటకాని బారి
బడుట కెంతయు నా సింహబలుడు తలరి." (విరా. 2.24)

హృదయమనే మృగం ద్రౌపదీరూపమనే ఉరిలో తగిలిందని చెప్పటం మనోగతమైన పాశవిక కామానికి సంకేతం. కీచకుని చక్షుప్రీతిని, మనస్సంగమాన్ని దాదాపు పది పద్యాలలో వర్ణించి చెప్పాడు.

చ॥ అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడిను దల్లడించు బై
కొను తలపోత నించు, మదు గోర్కులు పేర్చిన నప్పళించు, నె

ట్టన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుడై. (విరా. 2-31)

ఇందులో ఉగ్గడించటం, తల్లడించటం, అప్పళించటం, అగ్గలించటం, పరికించటం, కళవళించటం అనేవి మదన వికారంతో చేస్తున్న చేష్టలు. ఆ క్రమంలోనే ఒక పొందిక, భావోదయ వికాసం కనిపిస్తుంది.

**3. అభిలాష (సంకల్పం)**

సంగమోపాయ చింతన చేయటం అభిలాష. రెండు సీసపద్యాలలో దీనిని తిక్కన వర్ణించాడు. అందులో ఒకటి.

సీ॥ "తెలి గన్నుగవ కాంతి పొలుపార నించుక
కను విచ్చి చూచిను గాదె యబల!
చెలువంపు నెమ్మోము నెలమి సొం పినుమడి
గా నల్ల నవ్వినుు గాదె యింతి!
దంతమౌక్తికరుచి దలకొన మఱుమాట
వలికిను గాదె యుత్పలదళాక్షి!
యుల్లంబు సరసత దెల్లంబుగా లీలు
గైకొన్నుగాదె పంకరుహవదన!'

ఆ॥ యనుచు, జేరు, నమ్ముగ్ధ పలుకులు
వినుగు గోరు, గేలు తనదు కేలు
గీలుకొలుప దలుచు గీచకాధముుడు ని
జానురక్తి దెలుప నప్పళించు" (విరా. 2-45)

తనకున్న అనురక్తిని తెలుపుతూ, అతిశయించిన ఆసక్తితో తత్తరపాటు పడుతూ సాగే అతని మాటలు అభిలాషను వ్యక్తం చేస్తున్నాయి. చూడను, చేరను, పలుకను, వినగను, కేలు తనదుకేలుగీలు కొలుపను తలచటంలో అభిలాష బాహ్యేంద్రియ వ్యాపారాన్ని ఆశ్రయించి కనిపిస్తుంది.

**4. హ్రీత్యాగము**

సిగ్గును వదిలేయటం అంతఃపురంలోని యితర కాంతలు చూస్తారని భావించకుండా, స్వీయగౌరవాన్ని వదలి వర్తించటం, మర్యాద లేకుండా మసలటం, సుదేష్ణతో సైరంధ్రి పట్ల గల వలపును గురించి ముచ్చటించటం, సైరంధ్రి వెంటబడి అందరిముందే నడవటం వంటి ఘట్టాలలో ఉన్నది ఈ హ్రీత్యాగమే.

**5. ఉన్మాదము**

కీచకుని భావోన్మాదము, చేష్టోన్మాదము రెండు రకాలుగా కనిపిస్తుంది.

సీ॥ "నెత్తమ్మిరేకుల మెత్తుదనము దెచ్చి
యచ్చును బెట్టిన ట్లంద మొంది,
చక్రవాకంబుల చందంబు గొనివచ్చి
కుప్పలు సేసిన ట్లొప్పు మెఱసి,
చందరు నునుగాంతి కం దేర్చి కూర్చి బా
గునకు దెచ్చిన యట్లు కొమరు మిగిలి,

యళికులంబుల కప్పు గలయంతయును దెచ్చి
నారు వోసిన భంగి నవక మెక్కి

తే॥ యంఘ్రితలములు, గుచములు, నాననంబు,
గచభరంబును, నిట్లున్న రుచిరమూర్తి
యనుపమాన భోగములకు నాస్పదంబు
కాదె? యీ త్రిప్పు లేటికి గమలవదన?" (విరా. 2-52)

సీ॥ పొడసూపినట్లైన వడిబట్ట సమకట్టి,
పరికించి కానక బమ్మరించు;
మెలుగినయట్లైను బలికింప దలుచి, ని
రూపించి లేమి నశ్రులు వహించు;
గదిసినయట్లైన గౌగిలింప గడంగి
యారసి బొంకైన నలుత నొందు;
నొదుబద్ధయట్లైన నదరి పై కొనుజూచి
చెన్నుటి యగుట నిశ్చేష్టు బొరయు

తే॥ లలిత వివిధ విహారంబులకు లతాంగి
యెలసి సొలసిన యట్లైన నెలమి గలిసి
యభిమతక్రీడ సలుపంగ నప్పళించి
వెదకి రిత్తబయల్ గని విహ్వలించు." (విరా. 2-301)

మొదటి పద్యంలో భావోన్మాదం, రెండవ పద్యంలో చేష్టోన్మాదం కనిపిస్తుంది.

**6. ప్రలాపము**

"లీలనాముందట నాలేమ వలసిన
చూడ్కికి జుబ్బన చూర గాదె"
"కాంతి తళ్కొత్తు నీ కడగంటి చూడ్కితో
బొందగానని మేను పొగులుటయు"
"కెంగేలు గేలితో గీలించి నెయ్యంపు
మాటల తగుమారు మాటలార్తు" (విరా. 2-310)

వంటి పద్యాలు ఈ అవస్థకు ఉదాహరణ.

**7. సంజ్వరము (తాపము)**

తే॥ "అనుచు గ్రుంకింపరానిప్రొ ద్దరసి యరసి,
శిశిర పర్యంకమున మేను చేర్చి చేర్చి,
నంతు దలపోసి తలపోసి వనరి వనరి
మిగుల వందురి వందురి, పొగిలి పొగిలి." (విరా. 2-314)

శిశిర పర్యంకం మీద మేనువాల్చటం తాపబాధితమైన మనస్సునే చెపుతుంది.

భావప్రకాశిక పేర్కొన్న చింత, స్మృతి, గుణవినుతి అనేవి ప్రత్యేకంగా పేర్కొనదగినవి.

**8. చింత**

సీ॥ "వామాక్షి రుచిర లావణ్యంబు భావించు,
దన్వంగి రూపు చిత్తమున నిలుపు,
గంబుకంథర చెన్ను కైవడి తలపోయు
నంగన సౌకుమార్యము దలంచు,
భామిని సహజ విభ్రమ మెదు గీలించు
బదుతి చెయ్వులు మదు బట్టుకొలుపు,
మానిని గరువంపు మాటపొం దూహించు
దళితాబ్జముఖి తిన్నదనము మెచ్చు.

తే॥ నదరి కోర్కులు చిఱ్ఱుముఱ్ఱాడ వెడుగు
పడిన యుల్లంబు పట్టును బరుమ దనకు
వశముగాకున్న నెంతయు వంతుబొందు,
జింత యెసకంబు వడిగొని చిక్కువఱుప. (విరా. 2-292)

— వంటి పద్యాలలో ఈ చింతయే కనిపిస్తుంది. ఇంకా 2-296, 297 పద్యాలు ఈ చింతాస్థితినే తెలియచెపుతాయి. పై పద్యంలో సైరంధ్రి రూపవైభవాన్ని కీచకుడు దర్శించి, మనస్సులో పర్యాలోచన చేయటం కనిపిస్తుంది.

**9. స్మృతి**

సంస్కారజన్యమైన జ్ఞానంతో తలపోయటం స్మృతి. కీచకుడు ద్రౌపదిని గురించి

"పదతిన్నూరద బలికిన భంగిన
నిచ్చమై నిక్కకు వచ్చునొక్కొ"

అని తలపోయటం స్మృతికి ఉదాహరణ.

**10. గుణవినుతి**

ప్రేయసి గుణకీర్తనం చేయటం గుణవినుతి. సౌందర్యాధిష్ఠానదేవతలాగా ద్రౌపదిని భావించి, ఆమె సౌందర్యాన్ని కీర్తించిన పద్యాలనెన్నిటినో ఇక్కడ ప్రస్తావించవచ్చు. ఉదా॥కు

సీ॥ గండుమీలకు బుట్టి కాము బాణములతోఁ,
గలసి యాడెడు నట్టి కన్ను గవయు,
బిసకాండముల శిక్షు బెరిగి లే దీగల
మెచ్చక యున్నట్టి మృదుకరములు,
జిగురులతో సంధి సేసి యంబుజముల
పై నెత్తి చను నట్టి పదతలములు,
గలకంఠములచేతు గఱచిన విద్య వీ
ణల కిచ్చునట్టి తిన్నని యెలుంగు

తే॥ నత్తెఱంగున రేఖయు, నవ్విధంబు
గరువ చందంబు, నమ్మెయి కలికితనము
నట్టి చెన్నును సైరంధ్రియంద కాక
కలవె యొరులకు? నెఱుగక పలికి తబల! (విరా. 2-67)

కీచకుని అనురాగం ఏకత్రైవానురాగం. పరసతీగతమైన విరహాన్ని కీచకుడనుభవించటం ధర్మేతరమైన విషయం. అనౌచిత్యం. రసభంగం. దీనిని రసాభాసమనాలా? రసభంగమనాలా? అంటే రసభంగమేనని చెప్పాలి. ద్రౌపదిని కీచకుడు లొంగదీసుకున్నా, ఆమె ఆతనిని అంగీకరించినా కలిగేది రసభంగమే. కీచకుడు ద్రౌపదిని కోరి విరహాన్ని అనుభవించటం, ఆమె తిరస్కరించటం ఆభాసమే. ధర్మభంగం జరిగిన చోట రసభంగమే ఉంటుంది. ద్రౌపదీ కీచకుల సంగమం ధర్మభంగం, రసభంగం. ఆతని వలపు భావస్థితిని పొంది, పాఠకులకు హాస్యాన్ని గర్భీకరించుకొని, రతిభావ చమత్కారాన్ని కలిగిస్తుంది. ధర్మరతికి వికృతిని ప్రదర్శించే విభావం కీచకుడు. ఆతని రతి ఆభాసస్థితిలో కనిపిస్తుంది. ఏకత్రైవానురాగంలోనున్న కీచకుని విరహాన్ని ఇంత విస్తారంగా వర్ణించటం చేత పాత్ర పట్ల పాఠకులకు సానుభూతి కలుగుతుంది. ఇలా తిక్కనగారు కీచకుని శృంగారాన్ని విపులంగా వర్ణించాడు.

**7) మీ పాఠ్యభాగాన్ని అనుసరించి తిక్కనగారి కవితారీతుల్ని తెలపండి.**

ఆంధ్రమహాభారత రచనాక్రమంలో ద్వితీయుడు, తెలుగు సాహిత్య లోకంలో అద్వితీయుడునైన కవి తిక్కన సోమయాజి. ప్రపంచంలో ఏ భాషా సాహిత్యాలకు సంబంధించిన కవిని తీసికొన్నా, వాళ్లకంటే సమున్నతంగా కనిపించే కవి తిక్కన సోమయాజి. తిక్కన తన కవితా లక్షణాలను చెపుతూ నిర్వచనోత్తర రామాయణంలో

1. "అమలోదాత్త మనీష నేనుభయకావ్యప్రౌఢి బాటించు శిల్పమునంబారగుడ" (నిర్వ.రా. 1-13)

2. తెలుగు కవిత్వము చెప్పం
దలచినకవి యర్థమునకు తగియుండెడు మా
టలు గొని వళులుం బ్రాసం
బులు నిలుపక మొగిలి బులిమిపుచ్చుట చదురే (నిర్వ.రా. 1-7)

3. జాత్యముగామియొప్పయిన సంస్కృతమెయ్యెడు జొన్ప, వాక్య సాం
గత్యము సేయుచోనయిన గద్యముతోడుగు జెప్పి పెట్ట, దౌ
ర్గత్యము దోమ బ్రాసముప్రకారము వేఱగు నక్షరంబులన్
శ్రుత్యనురూపమంచునిడ, నొరుల కివ్విధమింపు బెంపదే (నిర్వ.రా. 1-14)

4. లలితపద హృద్య పద్యం
బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై
యలతి యలతి తునియలుగా
హళసంధించిన విధంబు సమరుగవలయున్ (నిర్వ.రా. 1-16) - అని చెప్పుకున్నాడు.

వీటిలో మొదటిది ఉభయకావ్యప్రౌఢి. తప్పులు లేని ఉదాత్త బుద్ధితో, ఉభయకావ్యాలలో కవులు ప్రదర్శించే ప్రౌఢినిపాటించే శిల్పంలో తిక్కన నిష్ణాతుడు. ఉభయ కావ్యాలంటే సంస్కృతాంధ్రాలు, శ్రవ్యదృశ్యకావ్యాలు. మార్గదేశి, సంప్రదాయాలు మేళవించిన కావ్యాలూ కావచ్చు. సామాన్య పదాలతో అసామాన్యమైన అర్థం చెప్పటం ప్రౌఢి. అటువంటి ప్రౌఢవాక్కుల్ని రమణీయంగా చెప్పే కళ తెలియటమే కళావిదిత్వం. అంటే తిక్కన రమణీయార్థ ప్రతిపాదక ప్రౌఢోక్తి ప్రయోగ శిల్పంలో మేధావి అని తాత్పర్యం.

2. రెండవది అర్థానికి తగిన మాటలు స్వీకరించి యతిప్రాసల్ని సమకూర్చటం.

3. సంస్కృత పదాలుగాని, తత్సమశబ్దాలుగానీ తెలుగులో వాడేటప్పుడు తెలుగువారు వాటిని ఏయేఅర్థాలలో వాడతారో ఆయా అర్థాలలో తెలిసివాడటం. పద్యానికీ – పద్యానికీ, వాక్యానికీ–వాక్యానికీ మధ్య వచనంతో అతకటం తిక్కన ఇష్టపడడు. ప్రాసల్ని ధ్వనిస్వామ్యగల వేరే అక్షరాలతో వాడటం దుర్గతియని తిక్కన భావన.

4. చిన్న చిన్న పదాలతో కూడిన వాక్యాల పోహళింపుతో పద్యం మాట్లాడుతున్నట్లు, ఆ ఆలోచనకు నాగేటిచాలు తీరుస్తున్నట్లు తోచేలా రచించటం. దీనినే నాటకీయశైలియని, సంభాషణాశైలిగా రూఢిచేశారు.

ఈ పైన పేర్కొన్న వాటిలో తిక్కన కావ్యశిల్పం ఎలా ఉంటుందో స్థాలీపులాకన్యాయంతో పాఠ్యభాగాన్ని అనుసరించి పరిశీలిద్దాం.

తిక్కన భారతాన్ని ప్రబంధమండలిగా భావించారు. ఇతిహాసంగా ఉన్న వ్యాసభారతాన్ని కావ్య స్పర్శతో కావ్యేతిహాసంగా మార్చిన ఘనత కవిత్రయానిది. దానికి నన్నయ ఆద్యుడు. తిక్కన దానికి కొనసాగింపు.

మహాభారతంలోని నాల్గవ పర్వం విరాట పర్వం. దీనిని తిక్కనగారు 'హృదయాహ్లాది' యని, 'ఊర్జిత కథోపేతమ'ని 'నానారసాభ్యుదయోల్లాసి' యని పేర్కొన్నాడు. కీచకవధాఘట్టం కూడా ఈ మూడు లక్షణాలను పొదవుకునే కనిపిస్తుంది.

**హృదయాహ్లాది**

పాండవులు కంకుభట్టు, వలలుడు, బృహన్నల, దామగ్రంథి, తంత్రీపాలుడనే పేర్లతో, ద్రౌపది సైరంధ్రిగా విరాటుని కొలువులో చేరారు. వీళ్లు మారువేషాలతో ఉన్నప్పటికీ, పాండవులుగానే పాఠకులు భావిస్తారు. కాని ఆయా సన్నివేశాలలోని ఇతర పాత్రలకు తెలియదు కదా! సైరంధ్రిని ద్రౌపదిగా సుదేష్ణగాని, కీచకుడుగాని, విరాటుడు గాని పోల్చుకోలేరు. వలలుడినైనా, కంకుభట్టునైనా అంతే. కాని పాఠకుడు వలలుడిని చూచి, భీముడిగానే తెలిసి ఆనందిస్తాడు. ఈ విషయం తెలియక ప్రవర్తించే మిగిలిన పాత్రల అజ్ఞానానికి నవ్వుకొంటాడు. అదే సమయంలో ఆ పాత్రలు పొందే అనుభవాన్ని కూడ పాఠకుడు పంచుకొంటాడు. కాని అది నిజంకాదని పొందే ద్వంద్వానుభవం ఆహ్లాదం. కథాకథనంలో కనిపించే ఉత్కంఠ కూడా ఆహ్లాద కారకమే. పాండవుల అజ్ఞాత వాసానికి ప్రళయంగా మారిన కీచకుడి పీడ, సుదేష్ణకపటోపాయం, సభాసన్నివేశంలో భీమద్రౌపదుల ఉద్రేకోద్వేగాలు, సంభాషణలు, చేష్టలు, భీముడి వ్యూహం, ద్రౌపది నాటకం– ఇవన్నీ పాఠకునికి ఉత్కంఠను ఉద్వేగాన్ని కలిగిస్తాయి. అందుచేత ఈ కథాఘట్టం హృదయాహ్లాది.

**ఊర్జిత కథోపేతము**

ఊర్జితకథ అంటే బిగువుగల కథయని అర్థం. లేదా జిగిబిగి గల కథయని అర్థం. సంవిధాన బంధురమైనది శ్రవ్య కావ్యమైతే, పంచసంధి బంధురమైనది దృశ్యకావ్యం. ఈ కీచకవధా ఘట్టంలో ప్రధాన కథకు అడ్డుపడే సన్నివేశాలేమీ లేవు. సన్నివేశ సంవిధానాన్ని కూడా కార్యకారణ బద్ధంగా నిబంధించటం గమనించాలి. ద్రౌపదిని చూచి కీచకుడు మోహించటం, అక్క చేత కార్యాన్ని సంఘటింప చేసికోవాలనుకోవటం, సుదేష్ణ అంగీకరించి సైరంధ్రిని కీచకుని మందిరానికి పంపటం, కీచకుడు పై బడపోగా తప్పించుకోని విరాటుని కొలువుకు రావటం, కీచకుడు తరుముకుంటూ వచ్చి ద్రౌపదిని పడతన్నటం, భీముని రౌద్రం, కంకుభట్టు సంభాషణ, ద్రౌపది ఆవేశం, భీముని పథకరచన, నర్తనశాల కేంద్రాన్ని చేయటం, కీచకవధ అన్నీ కార్యకారణ సంబంధంగా కూర్చిన సన్నివేశాలే.

ఇక దృశ్యకావ్యపరంగా చూచినప్పుడు కీచకుడు ద్రౌపదిని చూచి వెంటబడటం ముఖసంధి. ద్రౌపది తిరస్కరించటం ప్రతిముఖసంధి. సుదేష్ణ కుయుక్తి, దుష్టకీచకుడి వలన ద్రౌపది భంగపాటు, భీముడి రౌద్రం ఇవన్నీ గర్భసంధి. ద్రౌపది భీముని

వద్దకు పోయి రాత్రివేళ కీచకవధకు పథకరచన చేయటం, కీచకుడిని ఒప్పించటం అవిమర్శసంధి, నర్తనశాలకేంద్రంగా కీచకవధా నిర్వహణం నిర్వహణసంధి. ఇలా జిగిబిగితో కథాకార్యం నడుస్తుంది.

శ్రవ్యకావ్యశోభకు దృశ్యకావ్య వైభవాన్ని కలిగించే నైపుణ్యం తిక్కనగారిది. తిక్కన పాత్రలు అభియిస్తూ మాట్లాడతాయి. వాటిని తిక్కన చలనచిత్రంలాగా వర్ణించి చూపుతాడు. పాత్రల ఆంగికవాచిక సాత్త్విక అభినయాలను తిక్కన వర్ణించి చూపినంతగా తెలుగులో మరే యితర కవి చేసి చూపించలేదు.

సుదేష్ణ సైరంధ్రిని కీచకుని ఇంటికిపోయి మదిరను తీసుకురమ్మని చెప్పినప్పుడు ద్రౌపది మానసిక సంఘర్షణను వర్ణించి ఆమె సాత్త్విక భావాభివ్యక్తిని చెపుతాడు. మొదట ఆమెకు ఉల్లము తల్లడిల్లింది. శరీరమంతా చెమటలు పట్టింది. మనిషి డీలాపడింది. మనసులో బాధ అధికంగా మొదలయింది. ఆ తరువాత వితర్కం పెల్లుబికింది. దైవం గుర్తుకువచ్చింది. అభినయ ముద్రితమైన వాచకాభినయం వర్ణించిన ఈ పద్యం చూడండి.

ఉ॥ "ఉల్లము దల్లడిల్లు దను వుద్గత ఘర్మజలంబు దాల్చుచున్
డిల్లపడంగ 'నా కిది కడింది విచారము పుట్టె; నందు బో
నొల్ల ననంగ రా, దచటి కూరక పోవను రాదు, నేర్పు సం
ధిల్లుగ దీని బాపికొను దీమస మెట్టిది యొక్కొ దైవమా!" (విరా 2-91)

ద్రౌపదీ హృదయోల్లాసం కోసం కీచకుడిని వికృతపు చావుకు గురిచేసి, 'క్రంతలతిత్తి' లా చేసి పడవేసిన శవాన్ని ద్రౌపదికి చూపినప్పుడు కన్నార్పకుండా చూస్తూ, పీడావిరగతయిందన్నట్లు మెటికలు విరచటం, తగినశాస్తి జరిగిందిలే అన్నట్లు తల ఊపటం, ఎంతలో ఎంతపని జరిగిందన్నట్లు ముక్కుమీద వేలువేసికొని బాధపడటం, ఆమె విలక్షణ చిత్తంతో చేసిన అభినయాన్ని తిక్కనగారు "చూచుచు జేరి వ్రేల్మిడుచుచుం" (విరా. 2-356) అనే పద్యంలో హృద్యంగా వర్ణించి చూపాడు.

కీచకుడు ద్రౌపదిని నేలమీదకు పడతన్నినప్పుడు భీమునికి కలిగిన కోపాన్ని అతని రౌద్రాకారాన్ని "కనుగొనికోపవేగమును గన్నుల నిప్పులు రాల", "నేలయునింగియుతాళముల్గాజేసి" - అనే పద్యాలలో భీముని క్రోధాభినయాన్ని, రసభావోద్రేకాన్ని వర్ణించాడు. అయితే అంతటి ఆవేశంలోనూ ఒక్కమాట మాటాడకపోవటం, నర్తనశాలకు కీచకవధార్థం పోయేటప్పుడు కూడా యుద్ధోత్సాహంతో కలిగిన వేగిరపాటు తనాన్ని నిబ్బరించుకొని, రవ్వంత అనుమానం రాకుండా గంభీరంగా వెళ్లటం, వివిధ సందర్భాలలో భీముని అభినయకౌశలమే. అలాగే నర్తనశాలలో భీముడు కోపాన్ని నిగ్రహించుకొని, కీచకుడి మన్మథ చేష్టలను, మాటలను వాటి వైఖరిని బాగా గమనించాలని ఓర్పుగా కదలకుండా కూర్చోవటం, 'అవికార నిగూఢ నిజ ప్రకారుడై' - ఉండటం, ఎంతో మనోహరంగా తిక్కన వర్ణించి చెప్పాడు.

కీచకునిలో చతుర్విధాభినయశీలాన్ని తిక్కన విశేషంగా వర్ణించి చూపాడు. అతని నానారసభావ ప్రకటనశీలాన్ని, అభినయ విదగ్ధతను, విరహభావోన్మత్తతను, విరహార్తితో శృంగార నాయకునిలా స్పందించి చేసిన సాత్త్వికాభినయాన్ని మనకు సాక్షాత్కరించేలా తిక్కన చెప్పాడు

**ఆంగికాభినయం**

చ॥ అని యని యుగ్గడించు, ధృతి యల్లల నాడిను దల్లడించు బై
కొను తలపోత నించు, మది గోర్కులు పేర్చిన నప్పళించు, నె
ట్లన తెగ నగ్గలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధి దూ
లిన వెస నెంతయుం గళవళించు మనోజవికారమగ్నుడై. (విరా. 2-31)

**ఆహార్యాభినయం**

కII "చిడిముడి వడుచు నెదురు చను
గడుగుచు హారములు సక్కగా ద్రోచుచు మ
ల్లడి గొనుచు, దుర్విలాసం
బొడలికి నొడు గూర్చుచుండ నుగ్మలి యంతన్. (విరా. 2-114)

**వాచికాభినయం**

సీII "సుదతి! నీమై చక్కు జూచుట కోడెదు
గను బాటు వొరయునో యని తలంచి;" (విరా. 2-47)

**సాత్త్వికాభినయం**

చII తలరు, నలందురున్, నవయు, దాపభరంబున వెచ్చనూర్చు, మే
నలయుగ నొల్లుబోవు, వెగడందు, గలంగు, బరిభ్రమించు, గొం
దలపడు, దల్లడం బడరి ధైర్యము దూలిన బెగ్గడిల్లు, వి
చ్చలవిడి బేర్చు, నెవ్వగల సందడి డెందము గంది చేద్పడున్. (విరా. 2-293)

కీచకుని విరహావస్థలు, మదనవికార విశేషాలు పట్టి చూపే అభినయాన్ని ప్రత్యేకంగా చూడాలి. "శృంగార నాయకుల రంగప్రదర్శనానికి తిక్కన చిత్రించిన కీచకుడొక నమూనాపాత్ర" - జి.వి. సుబ్రహ్మణ్యం.

ధర్మజ పాత్రలోని సాత్త్వికాభినయాన్ని కీచకుడు విరాటుని కొలువులోకి ప్రవేశించి ద్రౌపదిపట్ల అమానుషంగా ప్రవర్తించినప్పుడు, భీమద్రౌపదుల ఆవేశాన్ని చూచినప్పుడు, వాళ్ల ఉద్రేకాన్ని తగ్గించటానికి పడ్డ పాటును చెప్పే సందర్భంలో తిక్కన వర్ణించిన "అప్పుడు ధర్మసూతి హృదయంబుగలంగ, లలాట భాగముంగప్పుగ ఘర్మవారి..." (విరా. 2-147) అనే పద్యంలో వర్ణించి చూపాడు.

**సంభాషణ**

నాటకంలో సంభాషణాశిల్పం మీదనే సన్నివేశం రక్తికడుతుంది. ప్రతి సన్నివేశంలోను, ప్రతి సంభాషణా ప్రయోజనాత్మకంగా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కీచకుడు వెంటబడ్డప్పుడు ద్రౌపది చేసిన సంభాషణ, సుదేష్ణకీచకుల సంభాషణ, ద్రౌపదీ సుదేష్ణల సంభాషణ, విరాటుని కొల్వులో కంకుభట్టుతో ద్రౌపది చేసిన సంభాషణ, రాత్రివేళ భీమునివద్దకు వెళ్లి ద్రౌపది చేసిన సంభాషణ, నర్తనశాలలో మారువేషంతో నున్న భీమునితో కీచకుడు చేసిన సంభాషణ - ఇవన్నీ తిక్కన సంభాషణ శైలినీ కవితావిభవాన్నే చాటుతున్నాయి.

మచ్చుకొకటి. కీచకుడు నర్తనశాలకు రాబోతున్నాడన్న విషయాన్ని భీమునికి తెలియజేయటానికి వంటశాలకు వచ్చి ద్రౌపది -

కII 'నాకొఱుతు దీర్చివచ్చితి;
నీ కొఱుతయ యింక; సూతునిం దెగు జూడన్
లోకము వంచింపను దగు
చీకటి రే యొదవ; నేమి సేసెదొ చెపుమా?' (విరా. 2-271)

కీచకుడిని చంపటానికి, లోకం కన్న కప్పటానికి అనువుగా ఈ రోజు చీకటి రోజుయింది. ఏమి చేస్తావోయేమో! అని భీముడిని చాతుర్యంగా రెచ్చగొట్టింది. భీముడు

కII "నన్నడుగనేల? నీవును
నన్నీచుడు నేమి మాటలాడితి? రది నా
కున్నట్టు లెఱుఁగ జెప్పుము;
ని న్నే మెచ్చించువాఁడ నీరజవదనా!" (విరా. 2-273)

'నీవంతుపని నీవు చేశావు. నావంతు సంగతి నీవు అడగకుండానే చేస్తాను. ఆ భయం నీకువద్దు. అయితే ఆ నీచుడు నీవు ఏమి మాట్లాడారో ఉన్నది ఉన్నట్లు చెప్పు' - అని భీముడు అడిగాడు. ఇవి సంభాషణను తెలిపే రెండు పద్యాలే అయినా పూర్వాపర సన్నివేశ సంభాషణల సంవిధానాన్ని సంఘటిస్తున్నాయి.

ఇలా తిక్కనగారి నాటకీయత తెలుగుకవులను ప్రభావితం చేసి, సంస్కృత నాటకాలను ప్రబంధాలుగా, కావ్యాలుగా రాయటానికి ప్రేరణ కలిగించింది.

**రసపోషణ**

"వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు" (కాశీ.ఖం. 1-13) అని శ్రీనాథుడు తిక్కన మహాకవి కవిత్వలక్షణాలలో రసాభ్యుచిత బంధాన్ని ప్రత్యేకంగా ప్రశంసించాడు. కీచకవధా ఘట్టంలో అంగిరసం వీరమే. వీరరసానికి కేంద్రం ధర్మవీరమే. దీనికి స్థాయి ధర్మోత్సాహం. పాండవుల్ని ఆశ్రయించుకున్న ధర్మోత్సాహాన్ని కీచకుని అధర్మరతి ఢీకొంది. భీముడి ప్రతీకారపు ఇచ్ఛతో వీరం రౌద్రమై, ఆభాస శృంగారాన్ని మింగింది. ధర్మాన్ని రక్షించింది. ధర్మప్రవృత్తియైన వీరానికి, అధర్మప్రవృత్తితో కూడిన శృంగారం సహజంగానే వ్యతిరేకమైంది. ఇటువంటి రెండు విరుద్ధరసాల సంయోజన చేయవలసి వచ్చినప్పుడు కవులు సహజంగానే రసాంతరాలను పోషించి రస సమన్వయ దోహదం చేస్తారు. ఈ ఘట్టంలో అటువంటి రసాంతరాలే భీముడి రౌద్రం, ద్రౌపది శోకం. ఇటువంటి సంవిధానశిల్పం వలననే అంగి సర్వాంగ సుందరంగా పరిపుష్టమవుతుంది.

శృంగార రసాభాస ఘట్టాలలో వరూధినీ ప్రవర ఘట్టానికి ముందు, ప్రసిద్ధి గాంచినదీ కీచకవధా ఘట్టం. కీచకుడు ద్రౌపదిపట్ల చూపిన తీవ్రకామం, రతిభావం ఒకవైపు, ఆత్మరక్షణ కోసం ద్రౌపది పొందిన శోకాకుల భావతీవ్రతమరోవైపు, ఆవేశంతో అజ్ఞాతవాస నియమాన్ని భంగం చేస్తారేమోనని ఆలినీ, అనుజుడిని అదుపులో పెట్టటానికి ధర్మరాజు పొందే అంతర్వేదన మరోవైపు, ప్రాణాధికయైన భార్య భంగపాటు ప్రళయకాలపు రౌద్రాన్ని ప్రేరేపించగా, గూఢంగా విరోధిని మట్టుబెట్టాలన్న సంయమన శీలంతో కూడిన భీముని క్రోధోద్ధతి మరోవైపు ఈ ఘట్టంలో తీవ్రవిరుద్ధభావ సంఘర్షణను సమకూర్చింది. కీచకవిరహం ఏకత్రైవానురాగం. అధర్మరతి. అందుచేత ఇది ఆభాసమేగాని రసస్థితికాదు. అయినా ఆహ్లాదకరమే. రసాభ్యుచిత బంధ నిపుణుడైన తిక్కన కీచకవిరహాన్ని విస్తరించి వర్ణించటానికి కారణం కీచకుని పాత్ర పట్ల పాఠకునికి ఏవగింపు కలుగకుండా సానుభూతి కలిగేలా చేయాలన్న కారణమే.

కీచక విరహంతో విప్రలంభ శృంగారం, భీమునితో వీరరౌద్రాలు, ద్రౌపదితో శోకభయాలు పోషించి, కీచకవధా సందర్భంలో అద్భుతాన్ని పోషించి రససంవిధాన్ని తిక్కన సమకూర్చాడు. భీముడు నర్తనశాలలో గొంతుమార్చి సైరంధ్రిలా కీచకుడితో మాట్లాడినప్పుడు హాస్య రసంతొంగిచూస్తుంది.

**పాత్రచిత్రణ**

పాత్రల శీలాన్ని చిత్రించటంలో తిక్కనపాటి ప్రతిభ మరెవరికీ లేదు. కీచకుడు ప్రతినాయకుడైనప్పటికి విషాదాంత కావ్య నాయక స్థాయిలో వర్ణించి చెప్పాడు. సుదేష్ణను నమ్ముకున్న ధర్మానికి, ఇచ్చిన మాటకు కట్టుబడని వ్యక్తిగా, అసమర్థుడైనప్పటికీ, అనునయించి చెప్పియైనా సమస్యకు తాత్కాలికంగా వాయిదా వేయించగల వానిగా విరాటుడిని, అనుజుడిని ఆలినీ అదుపులో పెట్టగల ఆదర్శధర్మశీలిగా ధర్మరాజును తిక్కన చిత్రించాడు. ఈ కీచకవధాఘట్టంలో సగం కథను ముందుకు నడిపింది ద్రౌపదే.

కీచకుడు తనను చూసినది మొదలు అక్కసాయంతో పొందాలని చేసిన ప్రయత్నాలన్నిటినీ చాకచక్యంగా, ధైర్యంగా, దైవబలంతో ఎదుర్కొన్నది. ఆ తరువాత భీముడి చేతిలో కథాసూత్రాన్ని పెట్టి నడిపించింది. ద్రౌపదే అద్భుతరసంలో మునిగిపోయేటట్లు కార్యాన్ని భీముడు నిర్వహించాడు. భీముడు స్వతహాగానే పథకరచన చేసి, ద్రౌపదిని పాత్రధారిగా కథను నడిపించి, నర్తనశాలలో మట్టుపెట్టి ఉత్తమనాయకునిగా భార్యచేత ప్రశంసింపబడతాడు.

**వర్ణనలు**

తిక్కన వర్ణనలు ఔచిత్య శోభితాలు. తిక్కన చేసిన ప్రకృతి వర్ణననలు, ఆయా సందర్భాలలో కథాగతికి దోహదం చేస్తాయి. కీచకుని చేత ద్రౌపది రూపాన్ని వర్ణించిన సందర్భాలు, కీచక వధకు నిర్ణయం జరిగాక జరిగిన ప్రభాతకాల వర్ణన, కీచకుని విరహవర్ణన, నర్తనశాలకు కీచక భీములు వెళ్లే సందర్భంలోని చీకటిని వర్ణించిన ప్రకృతి వర్ణనలు, కోపోద్రిక్తుడై రౌద్రాకారాన్ని దాల్చిన భీముని వర్ణన, నర్తనశాలలోని భీమకీచకుల మల్లయుద్ధవర్ణన, తిక్కనగారి ఔచితీపోషకమైన వర్ణన నైపుణ్యానికి నికషం.

**తిక్కన తెలుగుదనం**

తిక్కన భారతాన్ని చదువుతుంటే అది అనువాదమన్న, భావనే కలుగదు. తెలుగు వాతావరణంతో తెలుగు నేలమీదనే జరిగిందన్న స్పృహ కలుగుతుంది. అందుకు తెలుగునుడికారమెంత దోహదమో, తిక్కన వేసిన తెలుగు ముద్రకూడా అంతే దోహదం. కీచకుని విరహఘట్టంలో తిక్కన సూత్ర ధారియై కీచకాది పాత్రలకు వంత పాడుతున్నట్లు కనిపిస్తుంది. ఇది తెలుగువారి యక్షగాన పద్ధతి. భీముడి ఆవేశం చూస్తే, ప్రతి తెలుగు పాఠకుడు భీముడి రౌద్రం తమ ఆవేశానికి ప్రతిరూపమే నన్నట్లు భావిస్తారు. ద్రౌపది చూపే పౌరుషం, ఆత్మాభిమానం ప్రతి తెలుగువాడు అభిమానిస్తాడు. తిక్కనగారి దేశీయ పదబహుళశైలి తెలుగుదనాన్ని ప్రోది చేస్తుంది. అమూర్తభావాలను కూడ తెలుగు పదాలతో చెప్పటం తిక్కనలో చూస్తాం. ద్రౌపది కీచకుడిని నీకు తోబుట్టువులున్నారనటం, అన్నా! అని కీచకుడిని సంబోధించటం, సుదేష్ణను 'జంతకి' – అని తిట్టటం, మరణించిన కీచకుడి శవాన్ని చూచి మెటికలు విరవటం వంటివి తెలుగుదనాన్ని పోషించాయి. చుబ్బన చూరలు, కొందలపడు, ఉత్తలపడు, అచ్చొత్తిన యట్లు, కొత్తకాన్పు, వాలుగసోగలు, నెరవిరితమ్మలు, వాలికతంపులు, క్రొక్కారు మెఱుగులు, పుల్లగిలటం, వందుట, డిల్లపడుట, వలవంత, ఉరియాడు, మల్లడిగొనుట, విన్ననగుట, వలమూలావు, వెడకూడు, అడియాసలు వంటి తెలుగు పదాలు తిక్కన భాషలోని తెలుగుదనాన్ని తెలుపుతాయి.

**అలంకారాలు**

తిక్కన కూర్చిన అలంకారాలు కూడా సమయోచితంగా, సందర్భోచితంగా కథాగతికి దోహదం చేసేవిగానే ఉంటాయి. కర్ణుని సహజకవచకుండలాలలాగా సహజంగా అమరినట్లుంటాయి. అలంకారాలలో ఎక్కువగా ఉపమను వాడినట్లు కనిపిస్తుంది.

ఉదా॥ "పిడుగుపడినవానిగొఱవిం జూడిన తెఱుంగున" (విరా. 2-103)
"బెబ్బులియున్న పొదరు సొచ్చులేడి చందంబున" (విరా. 2-112)

కీచకవధకు నిర్ణయం జరిగిన రాత్రి తెల్లవారినప్పటి ప్రభాతకాలవర్ణనను గమనిస్తే, తిక్కనగారి ప్రకృతి వర్ణనలలో కూర్చిన అలంకారాలు సైతం ఎంతటి శిల్పశోభితాలో తెలుస్తాయి.

తే.గీ. "ద్రుపద నందన పరిభవ దుఃఖమునకు
నుల్లమున దురపిల్లుచు నున్న సరసి
మేడి నిట్టూర్పులో యన వెడలె గ్రొత్త
తావి మూతులు విచ్చు నెత్తమ్మివిరుల" (విరా. 2-236)

ద్రౌపది అవమానదుఃఖాన్ని చూచి విలపిస్తున్న సరస్సు అనే స్నేహితురాలు విడిచిన వేడి నిట్టూర్పులో అన్నట్లుగా మూతులు విచ్చుకుంటున్న పద్మాలనుండి వచ్చే కొత్తవాసనలు వెలువడుతున్నాయి. ద్రౌపదిదుఃఖాన్ని చూచి సరస్సు కూడ సానుభూతిని చూపి నిట్టూర్పుల్ని తామరల రూపంలో వదలుతున్నదని వర్ణించటం ఉత్ప్రేక్ష.

తే.గీ. "ద్రౌపదీ రూప మను నురి దగిలి తనదు
హృదయ మను మృగ మత్తఱి నుదిలగొనుచు
గాముడను బల్లిదపు మేటకాని బారి
బదుట కెంతయు నా సింహబలుుడు తలరి." (విరా.2-24)

ద్రౌపదీ సౌందర్యమనే ఉచ్చులో చిక్కి, కీచకుని హృదయమనే జింక, మన్మథుడనే బలిష్ఠుడైన వేటగాడివలలో చిక్కటం రూపకాలంకారం.

ఇంకా పరికరం, పరికరాంకురం, కావ్యార్థాపత్తి, వ్యతిరేకం, పర్యాయోక్తి, లోకోక్తి, నిరుక్తి, యథాసంఖ్యం, వికల్పం, సముచ్చయం, మాలోపమ, ఉల్లేఖం, గూఢోక్తి, అతిశయోక్తి, అర్థాంతరన్యాసం, ఉదాత్తం, శ్లేష, సమాసోక్తి, కావ్యలింగం, స్వభావోక్తి వంటి అలంకారాలు ఆయా సందర్భానుగుణంగా కుదురుకొని కావ్యపుసొగసును ఇనుమడించాయి.

ఇలా తిక్కనగారి కవితారీతుల్ని భావించినప్పుడు నాటకీయ పద్ధతిలో కథ చెప్పటం, పదాలు వాక్యాలు పద్యంలో మాట్లాడేరీతిలో కుదురుకోవటం, రసాభ్యుచిత బంధంగా కథను చెప్పటం, పాత్రలను సమర్థంగా తీర్చిదిద్దటం, వర్ణనలు కథాగతికి దోహదం చేసేలా చేయటం, తెలుగుదనాన్ని సమకూర్చి తెలుగుముద్రవేయటం దేశ్యపదబహుళశైలిలో రచన చేయటం కనిపిస్తుంది.

మ॥ "తనుకావించిన సృష్టి దక్కొరుల చేతంగాదు నా నేముఖం
బునదాని బల్కిన పల్కులాగమంబులై పొల్పొందు నా వాణి భ
ర్తను నీకండొకరుండు నా జనుమహత్త్వాప్తిన్ గవిబ్రహ్మనా
వినుతింతున్ గవి తిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్"

అని ఎఱ్ఱనగారు తిక్కన గురించి చేసిన ప్రశంస అక్షరాలా సార్థకం. తెలుగులో కవిబ్రహ్మ తిక్కన ఒక్కడే.

**7) తిక్కన అనువాద విధానాన్ని వివరించండి? (లేదా) మీ పాఠ్యభాగాన్ని అనుసరించి తిక్కన ఆంధ్రీకరణ విధానాన్ని వివరించండి.**

తిక్కన విరాటపర్వంనుండి స్వర్గారోహణ పర్వం వరకు భారతాన్ని అనువదించి తెలుగుజాతికి మహోపకారం చేశాడు. 'సాత్యవతేయ సంస్మృతి శ్రీవిభవాస్పదంబయిన చిత్తము తోడ" – అంటే వ్యాసమహర్షి యొక్క భావసంపదయొక్క వైభవంతో కూడిన మనస్సుతో తిక్కన మహాకవిత్వదీక్షావిధితో అనువాదానికి పూనుకున్నాడు. విస్తృతమైన కావ్యాల్ని రసమయంగా, శిల్పసుందరంగా, అర్థగంభీరంగా ఉదాత్త శైలిలో రచించే కవిత్వరచనా పద్ధతినే మహాకవిత్వ దీక్షావిధి అంటారు. అటువంటి తిక్కన ఆంధ్రీకరణ విధానాన్ని పరిశీలిద్దాం.

ఏకవయినా మూలాన్ని అనువదించేటప్పుడు

1. మూలాన్ని సంక్షిప్తీకరించటం
2. మూలాన్ని పెంచటం
3. అన్యథా ప్రకల్పన చేయటం

4. అమూలకంగా ఔచిత్యంగా చేర్చి రాయటం

5. మూలాన్ని యథాతథంగా రాయటం

కనిపిస్తుంది. తిక్కన కూడ వ్యాసభారతాన్ని అలాగే అనువదించాడు. తిక్కన చేసిన అనువాదాన్ని చూస్తే అదొక స్వతంత్ర రచనమా అనేటట్లు అనువదించాడు.

1) మదిరను తెమ్మని సైరంధ్రిని సుదేష్ణ కీచకుని మందిరానికి పంపినప్పుడు అక్కడి సన్నివేశాన్ని తిక్కన మూలంలో కంటే అందంగా రాశాడు. మూలంలో కీచకుడు ద్రౌపది చేతిని పట్టుకున్నాడు. ఆమె విదిలించికొట్టింది. అంతటితో ఆగక, ఆమెను పట్టుకునే ప్రయత్నంచేసి పైటను చిక్కించుకున్నాడు. ఆమె నిట్టూర్పులు నిగుడిస్తూ, వేగంగా విదిలించికొట్టింది. కీచకుడు మొదలునరకిన చెట్టులా నేలకూలాడు. ద్రౌపది భయంతో పరుగెత్తి విరాటరాజు కొల్వుకు చేరింది. అలా పరుగెత్తుతున్న సైరంధ్రిని కీచకుడు జుట్టుపట్టుకొని, నేలమీదపడవేసి కాలితో తన్నాడు. ఇది వ్యాసభారతం.

**తిక్కన:** తిక్కన భారతంలో కీచకుడు మదనావేశంతో ద్రౌపదిని చేయిపట్టుకోలేదు. కౌగిలించుకోబోయాడు. అంటే పైన బడి పట్టుకొన్నాడు. తనకు అండగానున్న రాక్షసుని బలంతో కీచకుడిని త్రోసివేసింది. అంటే ద్రౌపది కొంగుపట్టుకోవటం, ఆమె త్రోయటం, చెట్టులా విరిగినేలపై పడటం తిక్కన తీసివేశాడు.

**కీచకవిరహము**

తిక్కన, కీచకుని విరహాన్ని అమూలకంగా పెంచి రాసిన ఘట్టాలు రెండు ఉన్నాయి. తొలుత సైరంధ్రిని కీచకుని మందిరానికి పంపుతానని సుదేష్ణ చెప్పి కీచకుడికి పంపిన తరువాత, కీచకుడు, సైరంధ్రికోసం ఎదురుచూసేసందర్భంలోని కీచకవిరహం.

నర్తనశాలకు రమ్మని కీచకునితో సైరంధ్రి చెప్పి పంపిన తరువాత కీచకుడు అనుభవించిన విరహ సందర్భము. ఇది తెలుగు సాహిత్యంలోనే శృంగార నాయకుని దశవిధ మదనావస్థల ఆలంకారికవర్ణనలకు దారులు తీసింది.

**ప్రభాత కాలవర్ణనలు**

కీచకవధకు నిర్ణయం జరిగాక రాత్రి పూట ద్రౌపది వచ్చి శయ్యమీద వాలింది. నిద్రరాక కళ్ళుమూసికొని కదలకుండా పడుకొని ఉంది. ఆపైన తెల్లవారిందని చెప్పే ప్రభాతవర్ణనం అయిదు పద్యాలు ఒక దీర్ఘ వచనము ఉంది. (విరా. 2.236-240) ఇది అమూలకమైన వర్ణన.

**సూర్యాస్తమయవర్ణన**

కీచకుని నర్తనశాలాగమనానికి నాందిగా చేసిన

క॥ "ఇనుడు దనకడకు నేతెం
చిన రాగము బొందు టిది యుచిత మనుగా గెం
పున మెఱసి పశ్చిమాశాం
గిన జనసంభావనముల గౌరవ మందెన్. (విరా. 2-318)

అనే పద్యంలో చేసిన వర్ణన అమూలకం.

**కీచకుని ఉద్యానవన విహారం**

కీచకుడు మదన తాపంతో ఇంట్లో ఉండలేక శైత్యోపకారాలకోసం ఉద్యానవనాదులలో విహరించటం చేసిన వర్ణన అమూలకం.

**భీమకీచకద్వంద్వయుద్ధం**

మూలంలో "తయోద్భుజవినిష్పేషాదుభయో ర్బలినోస్తదా
శబ్ద స్సమభవద్ఘోరోవేణుస్ఫోట సమోయుద్ధి"
"సదంతంచమహానాదంభిన్న భేరీమస్వనమ్
భ్రామయామాస సుచిరం విస్ఫురంత మచేతసమ్" -

కీచక భీమసేనులు యుద్ధం చేసేటప్పుడు, వారి సింహనాదాలతో నర్తనశాలకంపించినదని, వారి భుజబలాటోపాన్ని చెప్పటం కనిపిస్తుంది. దానిని తిక్కన ఎంతో ఔచిత్యవంతంగా మార్చి

క॥ "తన యగపాటొరు లెఱుగుదు
రని సూతుడు సమయభంగం మగుటకు భీము
డును గొంకుచుజప్పుడు సే
యని గూఢ విమర్దనప్రహారములు దగన్." (విరా. 2-345)

చప్పుడు చేయని గూఢవిమర్దన ప్రహారాలతో ఒకరినొకరు బాధించుకున్నారని, చేసిన నిశ్శబ్ద యుద్ధాన్ని తిక్కన ఎంతో ఔచిత్య భరితంగా వర్ణించాడు.

**నర్తనశాలావర్ణనం**

నర్తనశాల ముఖభాగస్థలాన్ని వర్ణించిన 'చనవివేకరహితు హృదయంబునుంబోలె' (2-235) అనే వచనం అమూలకమైనది.

**ఔచిత్యమైన కొన్ని మార్పులు**

కీచకుడు సైరంధ్రిని తొలుత చూచినప్పుడు ఆమె 'అన్న! తోబుట్టువులున్న వాడివి' - అంటూ చేసిన మెత్తని మాటల ప్రసంగాన్ని గ్రహించక కీచకుడు ప్రలపించినట్లు మూలంలో ఉంది. తిక్కన, ఆ పొగడ్తలను ప్రలాపాన్ని విడిచి కీచకుని చేత చక్కని వర్ణన చేయించాడు. ఆ తరువాత తగురీతిలో అంగవర్ణన చేశాడు. కీచకుడిని గట్టిగా మందలిస్తే తప్ప లాభం లేదని భావించి కఠినంగా మాట్లాడిన సందర్భంలో మూలంలో అయిదు శ్లోకాలున్నాయి. అందులో బాలుడు తెలివిలేక ప్రవాహము దాట దలచినట్లు, తల్లి ఒడిలోకూర్చుండి చంద్రుని బట్టగోరినట్లు తనను కీచకుడు కోరుతున్నాడని పలకటంలో ఔచిత్యం కనిపించదు. కీచకుని వంటి ఉద్ధతుడిని బాలునితో పోల్చటంలో తీవ్రతలేదు. తిక్కన ఈ సందర్భంలోనే

శా॥ "దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!" (విరా. 2-55)

అని రాసిన పద్యంలో వాడి వేడి కనిపిస్తుంది. ద్రౌపది ఠీవి, దర్పం కనిపిస్తుంది.

మదిరను తెమ్మని సుదేష్ణ సైరంధ్రిని ఆజ్ఞాపించినప్పుడు ద్రౌపది బేలయై కీచకుడు తనను అవమానిస్తాడని విన్నవించుకున్నట్లు వ్యాసభారతంలో ఉంది. తెలిసి ఆజ్ఞాపిస్తున్న సుదేష్ణకు విన్నవించుకొని ఫలితంలేదని, చెవిటి వానిముందు శంఖమూదినట్లేనని భావించి "నన్నుదుగుమొడ్లను బంపు" మని వినయంగా పేర్కొన్నట్లు తిక్కన మార్చాడు. 'నగచ్ఛేయమహం'- అనటం దాసికి తగనిమాట. 'నన్నుదుగుమొడ్లను బంపు' మనటం వినయంతో కూడినమాట. ఈ సందర్భంలోనే కీచకుడిని నిందిస్తూ 'కీచకస్తుసుకేశాంతేమూఢో మదనదర్పిత్ష' - మూఢుడు, మదన దర్పితుడు కీచకుడని చెప్పటం మూలంలో ఉంది. దానిని తిక్కన పరిహరించాడు. మూలంలో లాగా కీచకుని నిందించటం కంటె తనను పంపితే కలిగే పరిణామాలకు సుదేష్ణ బాధ్యురాలన్నట్లు

సైరంధ్రి చేత తిక్కన మాట్లాడించాడు. గత్యంతరం లేని పరిస్థితులలో వెళూతూ దైవాన్ని మాయవిధియా అనటం, అలమటుబొందటం, అశ్రువులు కార్చటం, తొట్రుపడటం, మోముపాలిపోవటం, తనువు కంపించటం, తొట్రుపడటం (2–106) వంటి ఉద్విగ్నతను తిక్కన కల్పించినదే. ఈ సందర్భంలో హరిస్మరణ చేయటం కూడా తిక్కన కల్పనమే.

రాత్రివేళ భీముని మందిరానికి పోయి కీచకవధకు పథకరచన చేశాక తెల్లవారవస్తున్నది. జనులు మేల్కొని మనలను చూస్తే రహస్యం బయటపడుతుంది. కీచకవధకు పూనుకొన్న నా కోరిక నెరవేరాలి.' – అని పలకటం తిక్కనగారు చేసిన కల్పన.

నర్తనశాలకు రమ్మని కీచకుడిని ఒప్పించి, ఆ విషయాన్ని భీమునికి తెలిపింది ద్రౌపది. మూలంలో చీకటి పడిన తరువాత చెప్పినట్లుంది. అంత సమయం వరకు భీముడు ఎదురుచూడటం సరికాదని కీచకునితో మాట్లాడిన వెంటనే ద్రౌపది భీమునికా సంగతి తెలిపినట్లు, భీముడు కోపోద్రేకాన్ని, యుద్ధోత్సాహాన్ని వెల్లడించినట్లు తిక్కన పెంపు చేశాడు. కీచకుడిని ఎదుర్కొనటానికి పెండ్లికి పోయినట్లు భీముడు పోయాడని, భీముడు గంభీరంగా నున్నాడని వర్ణించటం అమూలకం. మూలంలో "భీమోఽధప్రథమంగత్వారాత్రౌ ఛన్న, ఉపావిశత్" – అని మాత్రమే ఉంది. కాని భీముడు ఎంతో జాగ్రత్తగా పరిసరాల్ని పరిశీలించి నర్తనశాలలో ప్రవేశించినట్లు తిక్కన కల్పించి రాశాడు.

కః కెలుకులు బిఱింది దెసయుం,
గలయం బరికించి తన యఖండిత బాహా
బలగర్వమ యచ్చట ముం
గలిగా మదమత్తభద్రగజసదృశగతిన్. (విరా. 2–326)

భీముడి నడక మదమత్త భద్రగజంలా ఉన్నదట. ద్రౌపది, తననునుసరించి అల్లంత దూరంలో రమ్మనటం, నర్తనశాలలోకి ద్రౌపది చేతిని పట్టుకొని నడవటం, పాంచాలిని కొంతదూరంలో ఉంచటం తిక్కన ప్రవేశపెట్టిన అంశాలు. మూలంలో ఈ సందర్భంలో ద్రౌపది ప్రస్తావనే లేదు. కీచక వధానంతరం మాత్రమే ఆమె ప్రసక్తి కనిపిస్తుంది.

నర్తనశాలలో, కీచకుడు చేయి చాచినప్పుడే భీమునికి కోపం కలిగింది. కంపం కలిగింది. కాని ధృతితో ఆ చలనాన్ని అణచుకొని, కీచకుని చేష్టల్ని, మాటల్ని తెలిసికోవాలని అనుకున్నాడు. భీమసేనుని ఈకుతూహలం తిక్కన కల్పనమే. కీచకునితో చేసిన నిగూఢ సంభాషణ కూడ తిక్కన కల్పనమే.

కీచకవధ జరిగిన తరువాత, రహస్యంగా అగ్నితెచ్చి వెలిగించి, ద్రౌపదికి పీనుగును చూపించాడు. ఇటువంటి జాగ్రత్తను పాటించటం మూలంలో లేదు. కేవలం కీచకుడిని చంపి, ద్రౌపదికి చెప్పి వెళ్లిపోయినట్లుగా ఉంది. 'చింతా శల్యము వాసెనే?... అని భీముడు ద్రౌపదిని అడగటం, 'నీ ఉత్తమ నాయకత్వము' – అంటూ భీముని కీర్తించటం మూలంలో లేదు.

ఈ విధంగా తిక్కన వ్యాసభారతాన్ని తెలుగులోకి అనువదించాడు. కీచకవధా ఘట్టాన్ని ఒక రసభరితమైన ప్రబంధంగా తీర్చిదిద్దాడు.

**– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం,
వారణాసి

పాఠం - 9

# సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - ఆరణ్యపర్వం - సప్తమాశ్వాసం
## (170 నుండి 279వ పద్యం వరకు)

# 9.1 కవి కాలాదులు

**9.1** కవి కాలాదులు

**9.2** పాఠ్యభాగ సారాంశం

**ఎఱ్ఱనగారి జీవన రేఖలు - ఇతర రచనలు**

ఉ॥ **"అంబ!నవాంబుజోజ్జ్వలకరాంబుజ! శారదచంద్రచంద్రికా**
**డంబర చారుమూర్తి! ప్రకటస్ఫుట భూషణరత్నదీపికా**
**చుంబిత దిగ్విభాగ! శ్రుతిసూక్తవివిక్తనిజప్రభావ!భా**
**వాంబరవీధి విశ్రుతవిహారి! ననుంగృపజూడుభారతీ!"** (ఆర.4-215)

("అమ్మా! సరస్వతీమాతా! నవనవలాడే లేతపద్మాలవలే ధగధగలాడే వంటి హస్తాలుకలదానా! శరత్కాలపు వెన్నెల వెలుగులకు మెరుగులుదిద్దే మనోహరాకృతి గలదానా! దిగ్దిగంతాలకు కాంతులు వెదజల్లే రత్నభూషలుగల సుందర రూపిణి! వేదసూక్తాలలో వెల్లడించబడిన మహిమగలదానా! భావాంబర వీధిలో విశ్రుత విహారం చేస్తున్నతల్లీ! నన్ను దయతోజూడు!")

ఈ పద్యం తెలుగువాళ్ల నాలుకలపై నర్తించే హృదయగీతి. అయినప్పటికీ దీనికర్త 'ఎఱ్ఱన' గారని చాలామందికి తెలియదు. పోతనగారి భాగవతావతారికలో ఈ పద్యం కన్పించటంచేత చాలామంది దీనిని పోతన కృతమనే భ్రమించారు. ఈ పద్యం మీది గౌరవంతో, పోతన తన భాగవతంలో చేర్చుకుని ఉండటమో, లేఖకులు చేర్చటమో చేసి యుంటారు. పోతనగారినే మోహపెట్టిన ముచ్చట ఎఱ్ఱనగారిది. అది ఎఱ్ఱనగారి విశిష్టత.

**జీవనరేఖలు**

ఎఱ్ఱన 'శ్రీవత్సస' గోత్రుడు. ఆపస్తంబసూత్రుడు. తాత ఎఱపోతసూరి. తండ్రి సూరన. తల్లి పోతమాంబ. పుట్టిన ఊరు 'గుడ్లూరు'. ఈ గుడ్లూరు పాకనాడులో నీలకంఠేశ్వరుని దేవస్థానం వలన ప్రసిద్ధిపొందిన క్షేత్రం. విష్ణుపురాణకర్త వెన్నెలకంటి సూరన కూడ ఈ గుడ్లూరును, అక్కడి గౌరీసమేతుడైన నీలకంఠేశ్వరుణ్ణి, ఆ ఊరినానుకొని పారే మన్నేఱును పేర్కొన్నాడు.

ఎఱ్ఱన క్రీ.శ. 1280 ప్రాంతంలో జన్మించి, క్రీ.శ. 1364 ప్రాంతంవరకు జీవించినట్లు తెలుస్తోంది. ఎఱ్ఱన రాసినట్లుగా చెప్పబడుతున్న కృతులు నాలుగు. ఎఱ్ఱన మనుమడు చదలవాడ మల్లన ఎఱ్ఱన రచనలను గురించి చెపుతూ విప్రనారాయణ చరిత్రలో

సీ॥ "ప్రతిభతో నారణ్యపర్వశేషము జెప్పి
గవులకుజెవుల పండువులు గాఁగ
వల్మీకభవు వచోవైఖరి రామాయ
ణంబునాంధ్ర ప్రబంధంబుజేసె
నారసింహునిపురాణమొనర్చి హరిమెచ్చ
నన్నునెన్నుడు చూచినాఁడవనుగ

ప్రౌఢిమైహరివంశభాగముల్ రెండును
రచియించె సభలందుబ్రాజ్ఞులెన్న

ఆ॥వె॥ **దురితహరుబ్రబంధ పరమేశ్వరుని జెద**
**ల్వాడనిలయు నాదువంశకర్త**
**ధన్యమూర్తి శంభుదాసునెఱ్ఱాప్రెగ**
**దనునుతింప బ్రహ్మకునుదరంబె"** (విప్రనారాయణచరిత్ర)

దీనిని బట్టి ఎఱ్ఱన కృతులు నాలుగని తెలుస్తోంది. అవి - (1) ఆరణ్యపర్వశేషము, (2) రామాయణము, (3) నృసింహపురాణము, (4) హరివంశము.

14వ శతాబ్దం పూర్వార్థంలో అద్దంకిని రాజధానిగా చేసుకొని, కృష్ణానదికి దక్షిణాన రాజ్యాన్నేర్పాటు చేసుకొని పాలించిన ప్రోలయవేమారెడ్డి పోషణలో ఎఱ్ఱన ఉన్నాడు. అప్పుడే రామాయణాన్నీ హరివంశాన్ని తెలుగులో రాశాడు. భారత ఆరణ్యపర్వశేషము, నృసింహపురాణము తరువాతి రచనలు. అలాగని ఎలా చెప్పగలుగుతున్నామంటే, వాటిలో వేమారెడ్డి ప్రస్తావన లేదు కాబట్టి. అంతే కాకుండ రామాయణాన్ని గురించిన ప్రస్తావన హరివంశంలోను, ఆరణ్యపర్వ శేషాన్ని గురించిన ప్రస్తావన నృసింహపురాణంలోను కనిపిస్తుంది. ఎఱ్ఱన, క్రీ.శ. 1325కు ముందు స్వతంత్రంగా బ్రతికినట్లే, క్రీ.శ. 1353 తరువాత కూడ (వేమారెడ్డి మరణంతరువాత) తన బ్రతుకుతాను స్వేచ్ఛగా బ్రతికియుండవచ్చు. వేమన తరువాత రాజ్యాన్ని పాలించిన అనపోత, అనవేమారెడ్ల కాలంలో కూడ ఎఱ్ఱన జీవించి యున్నట్లు కొల్లూరు శాసనం తెలియజేస్తోంది. ఎఱ్ఱాప్రెగ్గడకు 'కేసరిపాటి యాభైపుట్ల చేను' - దానమిచ్చి, ఆ భూమిని కొల్లూరుతో కలిపినట్లు ఆ శాసనం చెపుతోంది. బహుశా వార్ధక్యంలో ఎఱ్ఱనగారి సుఖజీవనంకోసం ఈ ఏర్పాటు చేయబడిందేమో!

రామాయణం తొలిరచనగా, నృసింహపురాణం చివరి రచనగా విమర్శకులు భావించారు. ఎఱ్ఱనగారి తొలినివాసం గుడ్లూరు, చివరి మజిలీ కొల్లూరు ప్రాంతమైయుండవచ్చునని ఒక ఊహ.

**వేమారెడ్డి-మల్లారెడ్డి**

కాకతీయ సామ్రాజ్య శిథిలాలపై వెలిసిందే రెడ్డిరాజ్యం. క్రీ.శ. 1323లో ప్రతాపరుద్రుణ్ణి ఢిల్లీసుల్తాన్‌పట్టుకొనిపోయాక, మహమ్మదీయుల్ని ఎదుర్కొనటానికి, కాకతీయసామంతులైన ముసునూరి నాయకులు-రేచర్ల వెలమనాయకులు - రెడ్డిరాజులు స్వతంత్రాన్ని ప్రకటించుకొని, ఆయా ప్రాంతాలకు తామే పాలకులై పాలించటం ప్రారంభించారు. అలా రూపుదిద్దుకున్నదే రెడ్డిరాజ్యం. దక్షిణాన కందుకూరి ప్రాంతం నుండి, ఉత్తర తీరం వెంబడి సింహాచలం దాకా వ్యాపించిన రెడ్డిరాజ్యంలో వేమారెడ్డికి తిరుగులేకుండా నడిచింది.

అద్దంకిని రాజధానిగా పరిపాలించిన రెడ్డి రాజవంశానికి కర్త వేమారెడ్డి. వీళ్లది వెల్లశేరిగోత్రం. వేముడికి 'కోమటి ప్రోలయ'కుమారుడు. ఇతడు మండలాధీశ్వరుడు. కోమటి ప్రోలయ కల్యాణగోత్రోద్భవుడైన దొడ్డారెడ్డి - గుండాంబల కుమార్తెయైన అన్నమాంబను వివాహమాడాడు. వాళ్లకు వరుసగా మాచారెడ్డి, వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి, మల్లారెడ్డి అనే అయిదుగురు కుమారులు కలిగారు. వీళ్లలో రెండవ వాడే అద్దంకిలో రెడ్డిరాజ్యస్థాపకుడైన వేమారెడ్డి. ఈతని భార్యప్రోలమ్మ. వీళ్లకు ఇద్దరు కుమారులు. వాళ్లలో పెద్దవాడైన పోతయ సైన్యాధ్యక్షుడు, యువరాజు. రెండవవాడు కోమటిరెడ్డి. వీళ్లను గురించి ఎఱ్ఱన హరివంశావతారికలో పేర్కొన్నాడు. కోమటి రెడ్డిని గురించి చెప్పిన

క॥ **దానంబున కర్ణుని సరి**
**మానంబున పేర్మిననుపమానుడు, బుధస**

**న్మానచతురుండుప్రోలయ**
**సూనుడు కోమటిసమస్తసులభుడు కరుణన్"** (అవతారిక-32)

పద్యంలో 'ప్రోలయసూనుడు' - బదులు 'ప్రోలమసూనుడు'- అని చదువుకోవాలి. ఎందుకంటే వేముని భార్యపేరు 'ప్రోలమ'కదా! ఇది లేఖకదోషమైయుండవచ్చు. హరివంశంలోని ఉత్తరభాగంలోని తొమ్మిదవ ఆశ్వాసాంతంలోని పద్యాలలో

**క॥ "లలిత యువరాజవిభవో**
**న్నత పోతయసైన్యనాథ నయమార్గసమీ**
**హిత సంతత సేవావిల**
**సిత పుత్రశ్రీసమృద్ధ శివగుణసిద్ధా"** (హ.ఉ. 9-260)

అనే ఈ పద్యంలో యువరాజుగా, సైన్యాధ్యక్షునిగా పోతారెడ్డి ఉదాహరించ బడ్డాడు. కాటయవేముని అన్నవరదాన శాసనంలో అన్నారెడ్డి యువరాజుగా ఉన్నట్లు చెప్పబడింది. హరివంశంలో అన్నారెడ్డి జీవించి యుండగానే ప్రోలయవేముని కుమారుడు పోతారెడ్డి సైన్యనాథుడుగా యువరాజుగా ఉన్నట్లు చెప్పబడింది. యువరాజైన అన్నారెడ్డి జీవించియుండగా, ఆతని పుత్రుడు యువరాజు కావటానికి అవకాశంలేదు. కాబట్టి ప్రోలయవేముని పుత్రులు యువరాజుగాయుండి చనిపోవటం, రెండవవాడైన కోమటి కూడ మరేదైనా యుద్ధంలో చనిపోవటమో జరిగియుండవచ్చు. అప్పుడు సోదరుడైన అన్నారెడ్డి యువరాజైయుండవచ్చు. ప్రోలయ వేముని కంటే ముందే చనిపోవటంతో అన్నారెడ్డి సంతానంలోని అన్నపోత, అన్నవేములను తాను దగ్గరకుతీసి, పెద్దవాడైన అన్నపోతారెడ్డిని యువరాజుగా చేసియుండవచ్చు. అతడే సింహాసనానికి ఉత్తరాధికారి అయ్యాడు.

ప్రోలయవేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి. ఎఱ్ఱన హరివంశరచనాకాలానికి మల్లారెడ్డి కురుములూరు పాలకుడు. ఈ కురుములూరు కడపజిల్లాలోనిది. తరువాత విజయనగర రాజులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించాక, ముఖ్యపట్టణం కందుకూరుకు మార్చబడింది. రెడ్డిరాజుల రాజధాని కొండవీడుకు మారాక, కొంతకాలానికి అంటే సుమారు క్రీ.శ. 1390 ప్రాంతంలో మల్లారెడ్డి సంతతి వాళ్లు అద్దంకి చేరి, అక్కడినుండి దాన శాసనాలు వ్రాయిస్తూ వచ్చారు.

ఈ మల్లారెడ్డే ఎఱ్ఱన్నను కవిగా గుర్తించి దగ్గరకు తీసి ఆదరించింది. తరువాత తన అన్నగారైన వేమారెడ్డికి పరిచయం చేశాడు. ఆ విధంగా వేమారెడ్డి ప్రాపులభించాక ఎఱ్ఱన రామాయణాన్ని రాసి ఉంటాడు. ఎందుకంటే

శా॥ **"నా తమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు నిన్నాతత**
**శ్రీతోడన్ సముపేతుజేసి యెలమింజేపట్టిమాకిచ్చుటం**
**చేతోమోదమెలర్ప రామకథమున్ జెప్పించి యత్యుత్తమ**
**ఖ్యాతింబొందితి నింకనేను దనియన్ గావ్యామృతాస్వాదనన్"** (హ.పూ. 1-39)

అని చెప్పటాన్ని బట్టి, రామాయణ హరివంశాలు రెండూ వేమారెడ్డి తెలుగులో వ్రాయమంటేనే ఎఱ్ఱన రాసినట్లుగా తెలుస్తోంది. అయితే క్రీ.శ. 1335 తరువాత వేమారెడ్డి ఆధ్వర్యంలోనే జరిగిన శ్రీశైల, అహోబలక్షేత్రాల సోపాన నిర్మాణాది విశిష్టసంఘటనల సంగతి హరివంశంలో ప్రస్తావించబడలేదు. కాబట్టి ఎఱ్ఱన 1325-35 మధ్యకాలంలో ఒక దశాబ్ది మాత్రమే వేమారెడ్డి ఆస్థానంలో ఉండి యుంటాడని చారిత్రక పరిశోధకులు ఊహిస్తున్నారు. హరివంశంలో రామాయణ ప్రసక్తిమాత్రమే ఉండటం మూలాన భారతాన్ని క్రీ.శ. 1335 తరువాత వ్రాసియుంటాడు. ఆ తరువాతిది నృసింహపురాణం.

వేమభూపాలుడు వినుకొండ, కొండవీడు, ధరణికోట, కొండపల్లి మొ॥న దుర్గాల్ని తన క్రిందనుంచుకొని, దేవబ్రాహ్మణ వృత్తుల్ని యవనుల బారినుండి కాపాటినట్లు వివిధ శాసనాలు తెలియజెప్తున్నాయి. శ్రీశైల, అహోబలక్షేత్రాల పర్వతాలకు సోపానాలు నిర్మించిన ఘనత ఈయనదే. వేమారెడ్డికి 'చెంచుమల చూరకార'-అనే బిరుదముంది. చెంచుల నివాసమైన శ్రీశైలంలో చెంచుల్ని

అదుపులో పెట్టటం చేత ఈ బిరుదం వచ్చియుంటుంది. ఈతని ఆస్థానంలో మహాదేవకవి, ఎఱ్ఱాప్రెగడ, వెన్నెలకంటి సూరన ప్రసిద్ధకవులు. ఎఱ్ఱన, వేమభూపాలుని కీర్తిని హరివంశం ద్వారా అజరామరంచేశాడు. హరివంశంలోని ఆశ్వాసాంత పద్యాలలో మల్లారెడ్డిని గురించి పున్ఃపున్ః ప్రస్తావించటాన్ని బట్టి ఎఱ్ఱనకు మల్లారెడ్డి – అంటే ఎంత ఇష్టమో విస్పష్టమవుతుంది.

**తాతతండ్రులవారసత్వం**

ఎఱ్ఱనతాతగారు ఎఱపోతసూరి. ఆయన భార్య పేరమ. సూరి గారి ఇష్టదైవం అహోబల నరసింహుడు. వీళ్లది వేగినాడులోని కరాపర్తిగ్రామం. ఈ ఎరపోతసూరి తాతగారు భీమనమంత్రి. వెలనాటి చోడులవల్ల ఈ భీమనమంత్రి సత్కారాలు పొందినట్లు తెలుస్తోంది. ఎఱపోతసూరికుమారుడు సూరన్న. సూరన్న అప్రతిమానంగా, అద్భుతంగా ఉభయ భాషల కవిత్వాలలో, ప్రౌఢశబ్దార్థ యోగాజ్ఞాసిద్ధిలో ఘనుడు. ప్రాజ్ఞప్రస్తుతభవ్యభోగవిభవస్ఫారాత్ముడు. ఆరాధ్య సర్వజ్ఞుడు. సూరన్న తనకుగలిగిన సంతానానికి తన తండ్రి పేరేపెట్టుకున్నాడు.

తన పేరుతోనున్న మనుమణ్ణి ఎఱపోతసూరి ఎప్పుడూ ప్రేమగా ఆదరించేవాడు. ఎఱ్ఱన ఆశ్వాసాంతగద్యలో 'సూర్యసుకవిమిత్ర సంభవ', 'శ్రీసూర్య సుకవిపుత్ర'–అని చెప్పటంవలన తనతండ్రి సూరన్న, కవిగా తెలుస్తున్నాడు కాని, మరెవ్వరూ ఆతనిని కవిగా పేర్కొనలేదు. ఆతని రచనలూ లభించలేదు. తాత ఎఱపోతసూరియే స్వప్నంలో సాక్షాత్కరించి నృసింహపురాణాన్ని రాయమన్నట్లు ఎఱ్ఱనగారు నృసింహపురాణ పీఠికలో చెప్పుకున్నాడు.

తే॥ అమ్మహాత్ముడు నిత్యదయార్ద్రహృదయు
దతులితానంద జలధి నోలాడుగాత
విష్ణుధర్మ ప్రశంసాపవిత్రమైన
యస్మదీయ ప్రబంధ సామగ్రివలన (నృసింహ పీఠిక – 25)

అలా ఆదేశించిన తన తాత ఎఱపోతసూరి తన ప్రబంధరచనవల్ల అతులితమైన ఆనందజలధిలో ఓలలాడ గలడని భావించాడు. ఇలా తాతతండ్రుల నుండి కవితావారసత్వం ఎఱ్ఱనకులభించింది.

**శంకరస్వామి శిష్యరికం–శంభుదాసత్వం**

ఎఱ్ఱన గురువు పేరు శంకరస్వామి. ఆయనను గురించి

**ఉ॥ "యామములెన్మిదింటనియతాకృతి బ్రత్యహమున్‌శివార్చనా
రామతయొప్ప, నిత్యశివరాత్రివ్రతంబుగుబూని భవ్యయో
గామృతతృప్తిమైద్రిజగదర్పితలీలుదనర్చుశంకర
స్వామిమునీంద్రుభక్తజనవత్సలు మద్గురు నాశ్రయించెదన్."** అని నృసింహపురాణంలో పేర్కొన్నాడు.

శంకరస్వామి ప్రతిరోజూ నియమంగా ఎనిమిది ఝాములూ శివార్చన చేసేవాడు. నిత్యశివరాత్రివ్రతంగా జీవితాన్ని గడిపిన యోగిపుంగవుడు. ఈయనను శృంగేరీ పీఠపు శంకరాచార్యులని కొందరు రాశారు. కొందరు ఆరాధ్యశైవగురు వన్నారు. కాని అది సరికాదు. నిత్యశివరాత్రివ్రతంగా ఎనిమిదియామాలలో శివార్చనచేసేవాడని శంకరస్వామినిగురించి చెప్పటంచేత, ఈ ఎనిమిది యామాలలో శివపూజ చేయటం ఆరాధ్యులలో లేదు. షట్కాల శివార్చనమే వారికున్నది. మహాశివరాత్రినాడు దీక్షగా ఎనిమిది యామాలలో శివార్చనం చేయటం స్మార్తులలోనే ఉంది. అంతేకాకుండ 'శంకరస్వామి'–అనే పేరు శాంకరపీఠస్థులందరికీ పరిచయమైన ప్రసిద్ధమైన పేరు. వాళ్లంతా భారతీ సంప్రదాయానికి చెందిన యతీశ్వరులు. అలాగే ఎఱ్ఱన నృసింహపురాణంలో చేసిన స్తుతిని గమనిస్తే భారతిని యతి రూపంలో కీర్తించటంగా కనిపిస్తుంది.

**చ॥ కరకమలంబునందు బటికంపు గమండలు, పచ్చకాంతి భా**
**సురవగు మౌక్తికంపు జపసూత్రము దాల్చుట, బ్రహ్మాదియై**
**పరగిన హంసముం బిలిచి బాలమృణాళము జూపు చందమౌ**
**సిరి దిలకింప నొప్పు బుధసేవితమూర్తి దలంతుభారతిన్.**

ఈ పద్యంలో సరస్వతీమాతను సన్యాసిరూపంలో ధ్యానించటం గమనించాలి. ఈ పద్యాన్ని ఉద్దేశించి నోరి నరసింహశాస్త్రిగారు చేసిన వ్యాఖ్యానాన్ని గమనించండి. 'శ్రీ శంకరస్వామి సంయమీశ్వర చరణసరోరుహ ధ్యానానంద సౌందర్యధుర్యుడ'నని ఎఱ్ఱన సగర్వంగా తన గద్యములన్నిటిలో చెప్పుకున్నారు. శ్రీవిద్యారణ్యులు స్తోత్రము చేసిన శంకరానంద గురుపాదులీతడే కావచ్చును. కాకపోతే ఆతని సతీర్థ్యుడై ఉండును. శృంగేరి మొదలగు మూల శంకర పీఠముల స్వాములందరు భారతీ సంప్రదాయ యతులగుటచే ఎఱ్ఱన గురువు కూడ భారతీయతియై ఉండును. కర్ణాటక ప్రాంతంలో శ్రీవిద్యారణ్యులు చేసినట్టి ఉద్ధరణ కార్యమును ఈ శంకరస్వామి శ్రీశైల భూమిలో చేసి యుండుననుటకు సందేహము లేదు. శంభుదాసుడను లక్షణాభిధేయము ఎఱ్ఱనకి గురువే ప్రసాదించి యుండును."

**నీలకంఠేశ్వరార్చన**

**"నినుసేవించిన గల్గుమానవులకున్ వీటీవధూటీఘటీ**
**ఘనకోటీ శకటీ కటీతటిపటీ గందేభవాటీ పటీ**
**ర నటీ హారికటీ సువర్ణమకుటీ ప్రస్ఫోటికాపేటికల్**
**కనదామ్నాయమహాతురంగ! శివలింగా!నీలకంఠేశ్వరా!"**

ఇది ఎఱ్ఱనగారి పేరుతో ప్రచారంలోనున్న చాటువు. ఇందులో పేర్కొన్న నీలకంఠేశ్వరుడు గుడ్లూరులో వేంచేసిన ఈశ్వరుడే. ఎఱ్ఱన బాల్యంలో పద్యసాధన చేసుకునేరోజుల్లో ఆస్వామిపేర ఒక శతకాన్ని రాసి యుండవచ్చు. అదికూడ మల్లారెడ్డి పరిచయం కాకముందే రాసి యుండియుండవచ్చు. ఈ పద్యాన్ని చదువుతుంటే పెద్దనగారి ఉత్పలమాలికలోని సంస్కృతభాగంలోని 'భారతీవధూ/ టీతపనీయగర్భనికటీభవదాననవర్వసాహితీ/ఘౌతికనాటకప్రకర భారతభారత నమ్మతప్రభా/ శీతనగాత్మజాగిరికశేఖరశీతమయుఖరేఖికా..... అంటూ సాగే పంక్తులకు, ఒరవడి పెట్టిందేమో? నని ఆరుద్రగారు ఊహ చేశారుగాని ఈ పద్యానికి ఒరవడి ఎవరిదో ప్రస్తావించలేదు. కాళిదాసు రచనగా చెప్పబడే దేవీఅశ్వధాటిలోని

**శ్లో॥ "చేటీభవన్నిఖిల ఖేటీకదంబవన వాటీషునాకిపటలీ**
**కోటీరచారుతరకోటీ మణీకిరణకోటీకరంబితపదా**
**పాటీరగంధికుచశాటీ కవిత్వపరిపాటీ మగాధిపసుతా**
**ఘోటీఖురాదధికధాటీ ముదారముఖవీటీ రసేనతనుతామ్"**

– అనే శ్లోకం, ఎఱ్ఱనగారి పద్యాన్ని చదివినప్పుడు స్మృతిలో మెదులుతుంది. కాళిదాసు చేసింది దేవీస్తుతి అయితే, ఎఱ్రనగారు చేసింది పరమేశ్వరస్తుతి. అంతేతేడా. శబ్దాల పోహళింపు ఇంచుమించు ఒకటిగానే కనిపిస్తుంది. ఎఱ్ఱనగారి ఈ పద్యశతకం తెలుగుజాతికి ఎందుకోలభించలేదు. దానికి కారణాన్ని కేతవరపు రామకోటిశాస్త్రిగారిలా ఊహించారు. "ఇంతశబ్దపాండిత్యం పడేస్తే కవిత్వం తట్టుకోలేదు. కనుకనే ఎఱ్ఱనగారి నీలకంఠేశ్వరశతకం దొరక్కుండా పోయింది."1

**ఎఱ్ఱనగారి రామాయణం**

ప్రాచీనకాలంలో భారతం ఎవరైనా రాయాలంటే దానికి ముందు రామాయణాన్ని రాసేవారట. తిక్కన నిర్వచనోత్తరరామాయణం లాగే అంతకు ముందు నన్నయ రాఘవాభ్యుదయం రాశాడనే ప్రచారం ఉంది. ఎఱ్ఱన కూడ అలాగే

రాసి ఉండియుండవచ్చు. తెలుగుజాతికి లభించని గ్రంథాలలో ఎఱ్ఱనగారి రామాయణం ఒకటి. దీనిని గురించిన ప్రస్తావన లక్షణ గ్రంథాలలో మాత్రమే కనిపిస్తుంది. గణపవరపు వేంకటకవి తన ప్రయోగరత్నాకరంలో "ఎఱ్ఱాప్రెగడ సంక్షేప రామాయణం" – నుండి అని పేర్కొని

**కII "ఆదశరథసూనుండు ప**
**యోధిజలంబింకుజేసి యొకశరము సుగ్ర**
**వ్యాదవిభుదునిమి సీతను**
**మోదంబునుజేకొని కపిపుంగవుతోడన్"**

అనే పద్యాన్ని ఉదాహరించాడు. దీనిని బట్టి ఎఱ్ఱన సంక్షేపరామాయణం మాత్రమే రచించియుండవచ్చునని కొందరు భావించారు. కాని అది సరికాదు. ఎందుకంటే ప్రోలయవేమారెడి

**శాII "నా తమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండు నిన్నాతత**
**శ్రీతోడన్ సముపేతుజేసి యెలమింజేపట్టి మాకిచ్చుటం**
**జేతోమోదమెలర్పరామకథమున్ జెప్పించి యత్యుత్తమ**
**ఖ్యాతింబొందితినింకనేను దనియన్ గావ్యామృతాస్వాదనన్"** (హ.పూ.1-39)

– అని గొప్పగా చెప్పుకొని మురియటానికి హేతువు సంక్షేపరామాయణం కాదు. చదలవాడ మల్లన 'వల్మీకభవువచోవైఖరిరామాయణంబు నాంధ్ర ప్రబంధంబు చేసె' – నని పేర్కొనటంలో సంపూర్ణ రామాయణమన్న స్ఫూర్తేగాని సంక్షేపరామాయణమన్న భావన కలుగదు.

కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణ సారసంగ్రహంలో ఎఱ్ఱనగారి రామాయణంలోని ఏడెనిమిది పద్యాల్ని పేర్కొన్నాడు. అవి వివిధ సందర్భాలకు చెందిన పద్యాలు. ఇంకా వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ పరిశీలనలో లభించిన రామాయణ పద్యాలను, వివిధ రామాయణ పద్యాలతో సరిపోల్చి, అవి ఎఱ్ఱన గారివేనని తీర్మానించారు. వీటినే వేలూరి శివరామశాస్త్రిగారు హరివంశ పీఠికలో ప్రస్తావించారు. ఇవి మొత్తం 46 పద్యాలు.

మల్లారెడ్డి దగ్గరకుతీశాక, గుడ్లూరును వదలి ఎఱ్ఱన చదలవాడకు చేరాడు. మల్లారెడ్డి చదలవాడలో రామాలయాన్ని కట్టించగా, క్రీ.శ.1325లో ప్రోలయవేమారెడ్డే స్వయంగా వచ్చి, ఆ రామాలయానికి అగ్రహారాన్నిచ్చాడు. దీనికి తన తమ్ముడిపేరుతో 'మల్లవరం' – అనే పేరు పెట్టటం, ఆ ఊరు ఇప్పటికీ అదే పేరుతో చదలవాడ సమీపంలో ఉండటం విశేషం. ఈ సందర్భంలోనే మల్లారెడ్డి, ఎఱ్ఱనను వేమారెడ్డికి పరిచయం చేయటం, రామాయణాన్ని రాయమని వేమారెడ్డి ఎఱ్ఱనను అడిగియుండటం జరిగియుండవచ్చు. మల్లవరంలో రామలక్ష్మణ ప్రతిష్ఠకు, రామాయణ రచనకు సంబంధాన్ని వేలూరి శివరామశాస్త్రిగారూ హించారు. ఆరుద్రగారు ఆ ఊహ సబబేనన్నారు. రామలక్ష్మణులు, ప్రోలయ వేమారెడ్డి మల్లారెడ్లయితే, వాల్మీకిస్థానీయుడు 'ఎఱ్ఱన'. అందుకే అది వల్మీకభవు వచోవైఖరిని పుణికిపుట్టుకొన్నదని చదలవాడమల్లన తీర్మానం.

**1) హరివంశం**

భారతశ్లోక సంఖ్యనులక్షగా, అందలి పర్వాలను నూరుగా పేర్కొనటం లోక ప్రసిద్ధం. ఈ ఖిలభాగాన్ని పరిగణించినపుడే భారతం శతపర్వ సమన్వితము, లక్షశ్లోక పరిమితిగలదే అవుతుంది. హరివంశంలో శ్లోకాలు పన్నెండువేలుగా భారతం చెబుతుంది. హరివంశ, విష్ణు భవిష్యపర్వాలు మూడూ ఉన్న సంస్కృత హరివంశ శ్లోకాల సంఖ్య 15970.

భారతానికి "కార్ష్ణవేదం" అనే పేరు కూడా ఉంది. కృష్ణస్య ఇదం కార్ష్ణమ్" కృష్ణుని చరితాన్ని చెప్పేది అన్న అర్థాన్ని స్వీకరిస్తే హరివంశాన్ని చేర్చినప్పుడు మాత్రమే అది సార్థకమవుతుంది. కాబట్టి హరివంశాన్ని భారత భాగంగానే పరిగణించాలి.

నన్నయగారు ఈ పర్వానుక్రమణికలో విష్ణుపర్వాన్ని పేర్కొనలేదు. ఎఱ్ఱనగారు ఈ విష్ణుపర్వం, హరివంశ పర్వం, భవిష్య పర్వం అనే పేర్లను స్వీకరించకుండా పూర్వోత్తర భాగాలుగా విభజించాడు. విష్ణుపర్వంలోని కొంత భాగాన్ని పూర్వార్థంలోనూ, మరికొంత భాగాన్ని ఉత్తరార్థంలోనూ చేర్చి, పూర్వభాగంలోని నాలుగు ఆశ్వాసాలలో హరివంశ పర్వ కథను చెప్పి, ఐదవ ఆశ్వాసం నుండి ఉత్తరభాగంలోని ఎనిమిదవ ఆశ్వాసం వరకు శ్రీకృష్ణుని జీవిత చరిత్రను వర్ణించాడు. అవన్నీ విష్ణుపర్వం, భవిష్య పర్వంలోనివే. వ్యాసుడు భవిష్య పర్వంలో చేర్చిన కృష్ణ సంబంధి కథలను శ్రీకృష్ణుని జీవితచరిత్ర క్రమాన్ననుసరించి మార్చాడు. వాటిలో 'హంస డిభకోపాఖ్యానాన్ని' వదిలి వేశాడు. అలాగే విష్ణు పర్వంలోని 'ప్రభావతీ ప్రద్యుమ్నో పాఖ్యానా'న్ని కూడా వదిలిపెట్టాడు. భవిష్య పర్వాన్ని చాలా సంక్షిప్తంగా చివరి రెండు ఆశ్వాసాలలో ముగించాడు. ఎఱ్ఱన హరివంశంలో పూర్వ భాగంలో తొమ్మిది ఆశ్వాసాలు, ఉత్తరభాగంలో పది ఆశ్వాసాలూ ఉన్నాయి. పూర్వభాగంలో 20031 గద్యపద్యాలు, ఉత్తరభాగంలో 20621 గద్యపద్యాలున్నాయి. అంటే మొత్తం 46052 గద్యపద్యాలున్నాయి.

**హరివంశ వైశిష్ట్యం**

ఎఱ్ఱనగారు సంపూర్ణంగా హరివంశాన్ని అనువదించి, పరిపూర్ణ భారతాన్ని తెలుగువాళ్లకిచ్చినవాడయ్యాడు. పురాణ కథకునికి, చెప్పే విషయంమీద శ్రద్ధ తప్ప ఎలా చెపుతున్నామన్న దానిమీద శ్రద్ధ కనిపించదు. స్తోత్రాలు–నామాలు – నామనిరుక్తి – అద్భుతకథనం – దైవమాహాత్మ్య కథనం పున్నపున్న చేయటం వంటివి పురాణంలో సాధారణం. ఎఱ్ఱనగారి హరివంశం కూడ అంతే. ఎఱ్ఱనగారి హరివంశం చదివితే, పోతనగారి భాగవతానికి మూల ధాతువులు ఎక్కడి నుండి లభించాయో తెలుస్తుంది.

పల్లెజీవనాన్ని, ప్రకృతిలోని నిసర్గరమణీయత్వాన్ని ఎఱ్ఱన చిత్రించినట్లుగా మరొక ప్రాచీన కవి చిత్రించలేదేమోనన్నట్లుగా ఎఱ్ఱనగారి కవిత్వంలో దర్శన మిస్తుంది.

"ఎఱ్రనగారి హరివంశం వింటేచాలు పంచభక్ష్య పరమాన్నాలతో భోంచేసినట్టు కడుపునిండిపోతుంది. అంతతృప్తినిచ్చే కవిత్వం ఇందులో ఉంది. పోతరాజుగారికి ఒరవడిపెట్టిన కృష్ణలీలలు చదువుతూంటే సస్యశ్యామలమై పాడిపంటలతో వర్ధిల్లే పచ్చని తెలుగు పల్లెటూళ్లలో స్వచ్ఛమైన ప్రాణవాయువుల్ని పీలుస్తున్నట్టు ఉంటుంది.

**ఆరణ్య పర్వశేషం**

**ఉ॥ భాసుర భారతార్థముల భంగులు నిక్క మెఱుంగ నేరమిన్**
**గాసటబీసటేచదివి గాథలు ద్రవ్వ తెనుంగు వారికిన్**
**వ్యాసముని ప్రణీతపరమార్థము తెల్లము జేసినట్టి య**
**బ్జాసనకల్పులం దలుతు నాద్యుల నన్నయ తిక్కనార్యులన్** (నృ.పీఠిక 5-9)

ఎఱ్ఱనగారు ఆరణ్యపర్వశేషాన్ని రాయలేదని, కేవలం శిథిల పూరణమాత్రమే చేశాడని లోకంలో ఒక ప్రచారం కొన్నేళ్ళ సాగింది. ఈ వాదానికి నడకుదుటి వీరరాజుగారు, వేదాల తిరువేంగళాచార్యులు కేంద్రకంగా ఉన్నారు. కానీ ఎఱ్ఱనగారు శిథిలపూరణకర్తకాదని, ఆరణ్య పర్వశేషకర్త మాత్రమేనని పరిశోధకులు తేల్చి చెప్పారు. గమనిస్తే సంస్కృతమహాభారతంలో వనపర్వంలోని శ్లోకసంఖ్య 13,664. ఉపపర్వాలు 16. తెలుగులో ఆరణ్యపర్వగద్యపద్యసంఖ్య 2894. ఆశ్వాసాలు 7. అందులో నన్నయ 6981 శ్లోకాలుగల భాగాన్ని 1299 గద్యపద్యాలలో, ఎఱ్ఱన 6683 శ్లోకాలుగల భాగాన్ని 1595 గద్యపద్యాలలో నిర్మించాడు. ఈ అంకెలను పరిగణిస్తూ డా॥ పాటిబండ మాధవశర్మగారు "నన్నయ మూలము కంటె ఎఱ్ఱయ మూలము మూడువందల శ్లోకములు తక్కువ. నన్నయ మూలము కంటె ఎఱ్ఱన అనువాదము మూడువందల గద్యపద్యములు ఎక్కువ. మూలమునకు ఎక్కువ సన్నిహితమగుటయు ఎడనెడ రసభావానుగుణములైన వివరణలు వర్ణనలు ఎక్కువగా చేరుటయు కారణములుగా ఎఱ్ఱయ అనువాదము నన్నయ అనువాదం కంటె కొంత భిన్నమై, తిక్కన మార్గముననుసరించుచు, శ్రీనాథాదులకు త్రోవచూపుచున్నట్లున్నది". (ఆరణ్య పర్వ పీఠిక. పుట.52 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి ఆంధ్రమహాభారతం)

ఎఱ్ఱనగారి ఆరణ్యపర్వానికి, నన్నయగారి ఆరణ్యపర్వభాగానికి వస్తువులోనే స్పష్టమైన తేడా కనిపిస్తుంది. నన్నయగారి భాగంలో ధర్మరాజాదుల తీర్థయాత్రా విశేషాలు సగానికిపైగా విస్తరించి కనిపిస్తాయి. ఎఱ్ఱనగారి ఆరణ్యపర్వంలో ప్రధానంగా మార్కండేయ మహర్షి చెప్పిన కథాంశాలు కనిపిస్తాయి.

ఎఱ్ఱనగారి భాగంలో శ్రీకృష్ణుడు కామ్యక వనంలో ఉంటున్న పాండవుల యోగక్షేమాలు తెలుసుకోవటానికి రావటం, ధర్మరాజుకు మార్కండేయ మహర్షి సరస్వతీగీత, వైవస్వతమనువృత్తాంతం, వామదేవుని వృత్తాంతం, కలికాలపు వృత్తాంతం, కువలాశ్వచరిత్ర, మధు కైటభుల వృత్తాంతం వినిపించటం, పతివ్రతా మాహాత్మ్యం, ధర్మవ్యాధోపాఖ్యానం, కుమారస్వామి వృత్తాంతం, ఆ తర్వాత సత్యాద్రౌపదీ సంవాదంలో పాతివ్రత్య ధర్మాలు చెప్పటం, ఘోషయాత్ర, వ్రీహిద్రోణో పాఖ్యానము, సైంధవ పరాభవము, రామాయణకథ, సావిత్ర్యుపాఖ్యానము, యక్షప్రశ్నలు, ప్రధానమైన విషయాలు.

**3) నృసింహపురాణం**

లక్ష్మీనృసింహావతారమనే ఈ నృసింహపురాణం ప్రబంధ పద్ధతిలో రచింప బడిన క్షేత్రమాహాత్మ్యకావ్యం. ఈ కథను బ్రహ్మాండపురాణంనుంచి గ్రహించటమే గాకుండ, పెద్దల వలన తాను విన్న అంశాలను కూడా పొందుపరచి రచించినట్లుగా తెలుస్తుంది. దీనిని కేవలం క్షేత్రమాహాత్మ్య కావ్యమని అనటానికి వీలులేదు. ఎందుకంటే ఇందులో క్షేత్రమహిమను నిరూపించే ఉపాఖ్యానాలు, ఆ క్షేత్రాన్ని సేవించటంవలన పవిత్రులై తరించిన వాళ్ళ కథలుగానీ లేవు. అందుచేత ఇది స్థల పురాణంకాదు. ఈ ప్రబంధాన్ని తన తాతయైన ఎరపోతసూరి స్వప్నంలో కనిపించి, రచించమని ఆజ్ఞాపించినట్లుగా ఎర్రనగారు చెప్పుకొన్నారు.

**క॥ కావును బ్రబంధరచనా**
**ప్రావీణ్యము నీకు సహజ పరిణతసిద్ధం**
**బై వెలసినయది యొకకృతి**
**గావింప జగద్ధితంబుగా నేబనుతున్ (నృసింహ.పీ.20)**

**ఉ॥ శ్రీమదహోబలేశ నరసింహుడు నాప్రియదైవతంబు, మ**
**త్స్వామి, తదీయతీర్థవిభవంబును దన్మహితావతారమున్**
**నీమధురోక్తిగుంభన మనీషులు మెచ్చుగుబ్రస్తుతింపు నీ**
**కేమెయి సంభవించు నఖిలేప్సితపుణ్యఫలోదయోన్నతుల్.** (నృసిం.పీఠిక-21)

అహోబలనృసింహుడు నాకిష్టదైవం. ఆ తీర్థవైభవాన్ని, ఆ స్వామి మహిమావతారాన్ని నీ మధురోక్తులతో మనీషులు మెచ్చగా గానంచేయి. నీకు పుణ్యం ఫలించి, కోర్కెలు సిద్ధించి, ఔన్నత్యం కలుగుతుందని తాతగారు చెపితే పులికించిపోయి ఈ కథను ఎఱ్ఱన రచించాడు.

లక్ష్మీనృసింహావతారకథ ఐదు అశ్వాసాలు, 804 గద్యపద్యాలలో రచించ బడింది. దీన్ని ప్రబంధమని, కావ్యమని, విజ్ఞాన వాఙ్మయమని ఎఱ్ఱన పేర్కొన్నాడు.

ఎఱ్ఱనలాంటి కవుల్ని సాహిత్య క్షేత్రంలో అరుదుగా చూస్తాం. ఒక కవితో సమానమైన ప్రతిభా సంపద కలిగియుండి, ఆ కవి చేయలేని పనిని తాను చేసి, చేసిన ఆ పనికి, తన పేరుకాక ఆ మహాకవి పేరునే పేర్కొనటం ఎంత అరుదైన సంస్కారం! అరణ్య పర్వశేషాన్ని పూరించి, సవినయంగా తన పాత్రను పేర్కొని ఊరుకున్న వినయశీలి, విద్వన్మూర్తి ఎఱ్ఱన. ఆ వినయశీలం ఈతరం కవులకు ఎంతైనా అవసరం.

## 9.2 పాఠ్యభాగ సారాంశం

సైంధవ పరాభవం జరిగాక, కామ్యకవనంలోఉంటున్న పాండవుల వద్దకు మార్కండేయమహర్షివచ్చాడు. పాంచాలి పట్ల సైంధవుడు వ్యవహరించిన తీరును, వాడి బారినుండి ద్రౌపదిని విడిపించటానికి పడ్డకష్టాన్ని ధర్మరాజు మార్కండేయ మహర్షికి వివరించాడు. ద్రౌపదిలా కష్టాలపాలయిన స్త్రీలు, తనలాగా కష్టాలకడలిలో మునిగిశోకించే రాజు ఏ కాలంలోనైనా ఉన్నాడా? అని అడిగితే, మార్కండేయుడు ధర్మరాజా! అలా కష్టాలు పడ్డ సీతారాములున్నారని, రామాయణ కథను వివరించాడు. ఆ పిదప పతిభక్తితో సమస్త దుఃఖాలను అనుభవించి, శుభాలను పొందిన పుణ్యవతి చరిత్ర వినాలని ఉన్నదని ధర్మరాజు అడుగగా మార్కండేయుడు సావిత్రి కథను వినిపించాడు.

అశ్వపతి మద్రదేశానికి అధీశ్వరుడు. అతనికి సంతానం లేదు. సంతానకాంక్షతో పద్దెనిమిదేళ్లు సావిత్రి దేవిని గురించి తీవ్ర తపస్సు చేశాడు. తపస్సుకు దేవి ప్రసన్నురాలయి ఏ వరం కావాలో కోరుకొమ్మని అనుగ్రహించింది. ఆమె అనుగ్రహానికి ఆనందించి, అత్యంత వినమ్రుడై, కొడుకుని ప్రసాదించమని అభ్యర్థించాడు. అయితే ఆ లోకైకమాత 'కన్నియనీకు ఉదయించగలదు' – అని వరమిచ్చింది. అశ్వపతి 'అమ్మా! జగన్మాతా! నీ దయవలన నా కోరిక నెరవేరవలదా?' – అని మదిలోని అభిప్రాయాన్ని వెల్లడించగా, అశ్వపతిపై కృపారసదృష్టితో చూచి 'మద్రేశ్వరా! నీ మదిలోని కోరికను ఇంతకు మునుపే బ్రహ్మకు తెలియజేశాను. ఆ మహనీయుడు ఒక్క కన్యను మాత్రమే అనుగ్రహించాడు. అయితే ఆ పుత్రిక ప్రభావంవల్ల నీకు అనతికాలంలోనే వందమంది పుత్రులు లభించగలరు' – అని కటాక్షించి అదృశ్యమైంది.

కొంతకాలానికి అశ్వపతి భార్యయైన మాళవియందు సావిత్రీదేవి కృపతో 'సావిత్రి' – అనే కుమార్తె జన్మించింది. ఆ బాలిక క్రమక్రమంగా పెరిగి పెద్దదయింది. సౌందర్యంలో సిద్ధసాధ్యయక్షామరుల కుమార్తెలకంటె మిన్న అయింది. అశ్వపతి ఆమె గుణ వయోరూపాతిశయాలకు ఎంతో ఆనందించి, నా కుమార్తెకు అన్ని విధాల తగిన వరుడు ఎక్కడ లభిస్తాడో కదా! అని ప్రతిరోజు కలవరించసాగాడు. అటువంటి సమయంలో సాళ్వపతియైన ద్యుమత్సేనుని సంతానమైన సత్యవంతుడు మంచి రూపవంతుడని, గుణవంతుడని కర్ణాకర్ణిగా విన్న సావిత్రికి, ఆతని పట్ల మక్కువ కలిగింది. కానీ సిగ్గుతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేదు.

ఒకనాడు నారదమునీంద్రుడు మద్రపతి వద్దకు వచ్చాడు. అర్ఘ్యపాద్యాది గౌరవపూజలందుకొని ఇష్టగోష్ఠి చేస్తున్న సందర్భంలో సావిత్రి నెచ్చెలులతో మన్మథ సామ్రాజ్యలక్ష్మిలా వచ్చింది. అల్లంత దూరంలో నిలబడి, తండ్రికి నమస్కరించింది. అశ్వపతి ఆమెనెంతో వాత్సల్యంతో ఆదరించి, ఒడిలో కూర్చుండ పెట్టుకొని చల్లని పలుకులతో ఉపలాలించాడు. అప్పుడు నారదుడు 'మద్రేశ్వరా! ఈ కన్నియను ఇంతవరకు తగినవరునికీయలేదేమి?' – అని ప్రశ్నించాడు. అశ్వపతి కుమార్తెవైపు చూచి 'తల్లీ! నీకు తగిన వరుడిని నీవే అన్వేషించి వరించు. అన్ని విధాలా నాకిదే అభిమతమ'ని చెప్పాడు. తండ్రి మాటలకు సావిత్రి కొంతసేపు సిగ్గుపడి 'తండ్రీ! సాళ్వభూనాథుడైన ద్యుమత్సేనుని కొడుకు సత్యవంతుని పట్ల నాకు కూరిమి కలిగింది. ఆతనికి నన్నిచ్చి వివాహం చేయవలసింది. శత్రువులంతా కలసి ఆతని రాజ్యాన్ని అపహరించినందున సాళ్వపతి ఇప్పుడు సకుటుంబంగా అరణ్యంలో నివసిస్తున్నాడు. దైవయోగంవల్ల ఆ మహనీయునికి అంధత్వమేర్పడింది. ఏది ఏమయినా సత్యవంతుడే నా భర్త' – అని పలికింది. మద్రపతి నారదునివైపు చూచి "మునినాథ! ముల్లోకాలలో నీకు తెలియని వారెవరూ లేరు. నా కుమార్తె వరించిన ఆ రాకుమారుడు ఎటువంటివాడో చెప్పవలసిందని" ప్రార్థించాడు. రవంతసేపు ఆలోచించి, ఆతని అభ్యర్థననుమన్నించి, దేవర్షి ఇలా చెప్పాడు.

అశ్వపతీ! సాళ్వపతి కుమారునికి చిత్రాశ్వుడనే మరోపేరు ఉంది. సదా సత్యాన్నే పలకటంచేత సత్యవంతుడనే పేరు కూడా ఉంది. తేజస్సులో భాస్కరునితో, బుద్ధికి బృహస్పతితోను, శౌర్యానికి వాసవునితో, ఓర్పుకు భూమాతతోను, కాంతికి జాబిలితోను, సౌందర్యానికి అశ్వినీదేవతలతోను పోలదగినవాడు. శమదమాదులు, దేవ బ్రాహ్మణభక్తి, తపస్సు మొ॥న గుణాలు

ఆతనియందున్నట్లు ఇతరులలో చూడలేం. అయితే నేటికి ఒక్క సంవత్సరం మాత్రమే ఆతని ఆయుర్దాయం. ఇది నీవు తెలిసికోవలసింది. కాబట్టే విస్పష్టంగా చెప్పాను. ఈ విషయాన్ని బాగా పర్యాలోచించవలసిందిగా కోరుతున్నానని చెప్పాడు.

ఆ ప్రసంగాన్ని విన్న అశ్వపతి చింతించి, కుమార్తెవైపు చూచి, 'అమ్మా! నారదమహర్షి దేవ రహస్యవేత్త. ఆయన మాట అమోఘమైంది. నీకలాంటి అల్పాయువైన వరుడు దేనికి? వేరొకని ఎవరినైనా వరించు'– అని హితవు చెప్పాడు. ఆ మాటలకు సావిత్రి 'తండ్రీ! మనోవాక్కాయాలనే త్రికరణాలలో మనస్సు ముఖ్యమైంది. మనసా వరించిన భర్తను కాకుండా మరొకరిని అభిలషించలేను. సత్యవంతుడెలాంటివాడయినా అతడే నా ప్రాణపతి' – అని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ఏమి చేయాలో తోచక అశ్వపతి నారదునివైపు చూచాడు. నారదుడామెధోరణిని గ్రహించి 'మద్రేశ్వరా! నీ కుమార్తె సుగుణాలరాశి. ఆమె దృఢసంకల్పాన్ని ఎవరమూ మార్చలేం. అనుమానించక సావిత్రిని సత్యవంతునకిచ్చి వివాహం జరిపించు. ఈ పుణ్యశీలయొక్క సుకృతరాశివల్లనయినా ఆతనికి చిరాయువు లభించవచ్చు' – అని హితవు చెప్పాడు. మద్రపతి 'మునిసత్తమా! మీయాజ్ఞ శిరసావహిస్తాన'ని – అంగీకరించాడు. వాళ్లిద్దరినీ ఆశీర్వదించి నారదుడు దేవలోకానికి తరలిపోయాడు.

ఒక పుణ్యదినాన అశ్వపతి బంధుమిత్ర సపరివారంగా కుమార్తె సావిత్రితోసహా వివిధ వైవాహిక సంబంధ మంగళద్రవ్యాలతో ప్రయాణమై, అరణ్యమధ్యంలో నివసిస్తున్న ద్యుమత్సేనుని ఆశ్రమానికి వెళ్లి, కలిశారు. ద్యుమత్సేన మహారాజుకూడ సాదరంగా ఆహ్వానించి, అర్ఘ్యపాద్యాదులతో గౌరవించి వచ్చిన కారణమేమని అడిగాడు. మద్రపతి తనకుమార్తెను చూపి 'మహారాజా! ఈమె నా కుమార్తె. నావంశంలో పుట్టిన మౌక్తికమణి. నా మాట మన్నించి ఈమెను కోడలిగా స్వీకరించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. సావిత్రీ సత్యవంతులిద్దరూ వయ్ణసౌందర్య సద్గుణాలలో ఒకరికొకరు తీసిపోని వారు' – అని ప్రార్థించాడు.

ద్యుమత్సేనుడా ప్రార్థనను విని, ఒకింత ఆశ్చర్యపడి 'మద్రేశ్వరా! రాజ్యాన్ని కోల్పోయి, ఈ ఘోరారణ్యపు మధ్యభాగంలో కుటీరాన్ని ఏర్పరచుకొని, నిరంతర తపశ్చర్యలలో కాలాన్ని వెళ్లదీస్తున్న మాతో పాటు సుకుమారియైన నీ కుమార్తె కష్టాలు పడగలదా?' – అని ప్రశ్నించాడు. మద్రపతి ఆ మాటలు విని 'రాజా! కలిమిలేములు శాశ్వతం కాదు. అవి కలిగినప్పుడు ఆనందం, లేనప్పుడు దుఃఖం ధీరులదరిజేరవు. నా కుమార్తె చిన్నదేగాని ధైర్యంలో మిన్న, మీతో వియ్యమందాలన్న ఆశతో ఎంతో శ్రమపడి, నీ దగ్గరికొచ్చాను. నా ప్రార్థన తిరస్కరించటం న్యాయమా? నా మనోరథాన్ని కరుణించి నెరవేర్చు' – అని ప్రాధేయపడ్డాడు.

**సావిత్రీ సత్యవంతుల వివాహం**

ద్యుమత్సేను డా ప్రార్థనను అంగీకరించి, ఆశ్రమవాసులైన మునీంద్రులతోకలసి, శుభలగ్నవేళలో సావిత్రీ సత్యవంతుల వివాహాన్ని యథావిధిగా జరిపించాడు. అశ్వపతి కూతురికి, అల్లునికి వేర్వేరు ఆభరణాలు బహూకరించి, బంధువులనందరినీ వీడ్కోలు పలికి, సపరివారంగా తన రాజధానికి మరలిపోయాడు. ఆ పిమ్మట సావిత్రి మనోజ్ఞమైన అలంకారాల్ని వస్త్రాలను వదలి, వనవాస యోగ్యమైన వల్కలాజినాలను ధరించి, భక్తితో అత్తమామలకు పరిచర్యలు చేస్తూ భర్తను సేవిస్తూ కాలాన్ని గడుపుతోంది. భక్తితో సావిత్రిచేసే పరిచర్యలకు అత్తమామలు పొంగిపోయారు. అలా నాలుగు రోజులు తక్కువగా, ఒక సంవత్సరం గడిచింది.

నాల్గవరోజు భర్త చనిపోయేరోజని గుర్తించి, సావిత్రి అత్యంత కఠోరనిష్ఠతో, త్రిరాత్రోపవాస దీక్ష ప్రారంభించింది. మామగారయిన ద్యుమత్సేనుడు అది గమనించి ఆశ్చర్యపడి, కోడలితో 'తల్లీ! ఇంతటి దుష్కరమైన వ్రతనిష్ఠ దేనికోసం?' అని అడిగాడు. ఆ ప్రశ్నకు సావిత్రి అత్యంత వినయంతో 'ఈ దుష్కరవ్రత భారం స్వీకరించటంలో ఉద్దేశం కేవలం మహనీయ శుభాభిలాషయే తప్ప మరేమీకాదు. దీని హేతువు త్వరలోనే మీకు అవగతం కాగలదు' – అని విన్నవించగా సంతోషించి 'శుభమగుగాక' – అని ఆశీర్వదించాడు.

సత్యవంతుని మరణదినం రానే వచ్చింది. అది సావిత్రి వ్రత దీక్ష ముగిసిన మరునాటిరోజు. ప్రభాతవేళ మేల్కొని, చిరునవ్వు ముఖంతో, భక్తి తాత్పర్యాలతో అత్తమామలకు ప్రణమిల్లి, సౌభాగ్యసంవర్ధకాలయిన ఆశీర్వచనాలందుకొన్నది. మామగారు కోడలితో 'తల్లీ! తీవ్రమైన వ్రతనిష్ఠతో అలసిపోయియున్నావు. ఆలసించక ఆహారాన్ని స్వీకరించమ'ని చెప్పాడు. 'ఈనాటి సాయం సమయం వరకు భుజించరాదన్న నియమాన్ని మొదటే పెట్టుకున్నాన'ని సావిత్రి వినయంతో సమాధానం చెప్పింది.

ఆ సమయంలో సత్యవంతుడు సమిధలు, దర్భలు, పండ్లు తేవటానికై అడవికి బయలుదేరాడు. సావిత్రి సత్యవంతుని చేరి, 'అడవికి నీతోపాటే వస్తాను నీతో కూడ రావటానికి అనుమతించమని' కోరింది. 'మూడు రాత్రులు ఉపవసించి నీరసంగా ఉన్నావు. రాలేవునలే' – అని సత్యవంతుడు అన్నాడు. 'బడలిక ఏమాత్రం లేదు. ఈ అడవిలో పూలు, లతలు, చిగురాకులు, పండ్లుతో శోభించే చెట్లను చూడాలని మనసు కోరుకుంటున్నది. ఈ మాత్రపు చనవు నాకీయవచ్చు కదా!' – అని సావిత్రి కోరిన కోర్కెను సత్యవంతుడు అంగీకరించాడు.

సావిత్రి అత్తమామల అనుమతి తీసికొని పతితో బయలుదేరింది. మదిలో రేగే విషాదాన్ని అణచుకొని, చిరునవ్వులు చిందిస్తూ, భర్త మనస్సును రంజింపచేస్తూ పతితో కలసి సమీపారణ్యం లోకి ప్రవేశించారు.

ఆ సమయంలో ఆ అడవి అత్యంత మనోహరమై కనిపించింది. కొలనులలో రాయంచలజంటలు అల్లనల్లన తూగాడాయి. ఎటువైపు చూచినా లతలను ఆలింగనం చేసుకున్న తరువులు బహువిధ ఫలపుష్పాలతో, చిగురాకులతో కనువిందుకూర్చాయి. తీయ తీయని తేనె లారగించి మత్తిల్లిన గండు తుమ్మెదల ధ్వని సావిత్రి సత్యవంతుల వీనులలో మాటి మాటికి మారుమ్రోగినది. మిగులమగ్గిన పండ్లరసాలారగించి విజృంభించిన రాచిలకల పలుకుల కలకలం నలువైపుల చెలరేగినది. ద్యుమత్సేనుని కుమారు దరణ్యంలో గోచరించిన ఆయా విశేషాలను తన అంగుళితో తన ప్రియపత్ని కదుగడుగునా నిర్దేశించి అపూర్వోల్లాసం కలిగించాడు. రాజకుమారి నిర్వికార ముఖ వైఖరితో అదేవిధంగా పతి ననుసరించి కాననలలో యథేచ్ఛగా విహరించినది.

సత్యవంతుడంతట విపినంలో నాలుగు వైపుల పరిభ్రమించి ఫల పుష్పాదులతో తన చేతనున్న పెనుసజ్జను నింపాడు. ఆ పైన గండ్రగొడ్డలి చేపట్టి, కట్టెలుకొన్ని కొట్టి, మిక్కిలి అలసి ఆ పరశువు ధరణిపై పడవైచి ఎడతెగని నిట్టూర్పులతో విషణ్ణ వదనుడై సావిత్రి వైపు చూచి 'నేడెందువల్లనో నెమ్మేను అవశమయినది. మానసం పరిపరి విధాల పరిభ్రమిస్తున్నది. బహు శూలాలతో శిరస్సుపై అనుక్షణము పొడుస్తున్నట్లుగా ఉన్నది. ఇక క్షణమయినా నిలవలేను. ఇక్కడ ఒక నిమేషకాలం విశ్రమిస్తాను' అని అస్పష్ట స్వరంతో వక్కాణించాడు. ఆ సాధ్వి ఆ పలుకు లాలకించి, తన ఒడిని తలగడగా అమర్చి, ఎంతో ఆప్యాయతతో ఆదుకొన్నది. సత్యవంతుడు ఆమె అంకతలంలో వాలి అవశుడై, కేవల నిశ్చేతనుడయినట్లు గోచరించాడు.

మరికొంత సేపటి కత్యంత భయంకరాకారుడయిన పురుషుడొకడు సావిత్రి కనతి దూరంలో సాక్షాత్కరించాడు. అతడు కాలమేఘ వినీలాకారుడు, ఎర్రని వదనంపై తళతళ లాడుతున్న తెలతెల్లని వాడి వాడి కోరలతో చూచినంతలోనే ప్రాణిలోక భయంకరుడై బంగారు రంగును ఎల్లెడలా విరజిమ్ముతున్న వస్త్రాలతో ప్రళయకాల భయంకర జ్వాలలా ప్రజ్వలిస్తున్నట్లు కనిపించాడు. ఆ పురుషుని హస్తంలో సుదీర్ఘమయిన పాశమొకటి పొడగట్టినది. ఆ భీషణాకారుడంతలోనే సత్యవంతుని సమీపించాడు. సావిత్రి ఆ వింత మానిసివైపు చూచి, మిక్కిలి ఆశ్చర్యపడి పతి శీర్షం మెల్లన దిగువ ఉంచి, మిక్కిలి భయభక్తులతో అంజలి ఘటించి, 'ఆర్యా! తామెవ్వరు? ఇచ్చటికి విజయం చేసిన హేతువేమి?' అని ప్రశ్నించినది.

ఆ పురుషుడంతట, 'సాధ్వీమణీ! నే నంతకుడును. మహనీయ మయిన నీ పాతివ్రత్య ప్రభావంవల్లనే నీకు నా సాక్షాత్కర భాగ్యం చేకూరింది. అంతేగాని అన్యుల కెవరికి నే నగపడను. నీ భర్త ఆయుర్దాయం ముగిసినది. అయితే ఈతడు మహాపుణ్యాత్ముడు. ఇందువల్లనే ఇతరుల కెవ్వరికీ ఆజ్ఞాపించక స్వయంగా నేనే ఈతనిని కొని పోవలెనని సంకల్పించుకొన్నాను' అని పలికి సత్యవంతుని శరీరంలో ప్రాదేశమాత్రాకారుడై ప్రజ్వలిస్తున్న జీవుడిని పాశంతో వెలువరించి, దక్షిణ దిశాభిముఖుడై, తన ప్రస్థానం

ప్రారంభించాడు. మద్రరాజ తనూజ అది గమనించి, లోలోపల మిక్కిలి దుఃఖించి, పతి శరీరాన్ని ఒకచోట మిక్కిలి జాగరూకతతో భద్రపరచి, సత్వరమే యముని వెన్నంటి సాగిపోయింది.

దండధరుడది గమనించి, 'లతాంగి! నన్నేల అనుసరిస్తున్నావు? వలదు వలదు, నిలిచి పోవలసినది. ఇక ఈ మార్గం నీ కగమ్యము' అని ఆజ్ఞాపించాడు, అయినా, సావిత్రి తన ధోరణి విరమించక ప్రగాఢ వినయంతో ఇలా నివేదించింది.

'పుణ్యపురుషా! పతులెచ్చటికి పోయినా సతులు వారి ననుసరించవలసినదే కదా! నీ అనుగ్రహంవల్ల, భర్తృ భక్తి ప్రభావం వల్ల నా కగమ్యమయిన నెలవున్నదా? అంతే కాకుండా, సకలమార్గాలలో ధర్మపద్ధతి మిక్కిలి ప్రశస్తమయినది. సత్పురుషులే అట్టి ధర్మాని కాధారభూతులు. సజ్జన సందర్శన మెన్నడు వ్యర్థం కానేరదు. సాధుశేఖరుడ వయిన నీ సాక్షాత్కార భాగ్యం లభించినప్పుడు శుభప్రాప్తిలేక నేను వట్టి చేతులతో మరలి పోగలనా?'

**సావిత్రి అభీష్ట వరప్రాప్తి**

ఆ ప్రసంగానికి సమర్థియైన యముడు ఎంతో సంతోషించి 'నీ మాటలు నాకెంతో ఆనందాన్ని కలిగించాయి. పతిప్రాణాలు తప్ప మరొకటి కోరుకో ప్రసాదిస్తానని అనుగ్రహించాడు. ఆ మాటలకు సావిత్రి సంతోషపడి ఇనుమడించిన అణకువతో చేతులు జోడించి 'ధర్మమూర్తీ! శత్రువులు రాజ్యాన్ని అపహరించాక, అంధత్వంతో అలమటిస్తూ అరణ్యమధ్యంలో నివసిస్తున్న ద్యుమత్సేన మహారాజుకు పరిపూర్ణ దృష్టిని అనుగ్రహించ'మని వేడుకున్నది. సరేనని యముడు సావిత్రి కా వరాన్ని ప్రసాదించాడు. తనను అనుసరించి రావద్దని ఆదేశించి తనలోకంవైపు కదలిపోసాగాడు. అయినా సావిత్రి తన సంకల్పాన్ని వదలక మరికొంత దూరం వెన్నంటి పోయింది. అణకువ ఉట్టిపడేలా విన్నవించుకుంది.

'ఓ దేవోత్తమా! ఆర్యులెప్పుడూ తమ మనోవాక్కాయ కర్మలతో ఇతరులపట్ల హింసను సంకల్పించరు. దీనులను దయతో రక్షిస్తుంటారు. వరాలిచ్చేటప్పుడు పొందవలసిన వాటిని అర్థించకుండానే ఇచ్చి కోరికలీడేరుస్తుంటారు. ఆశ్రితులకు అడుగడుగునా ఆనందాన్ని కలిగిస్తుంటారు. ఇవి ఆర్యధర్మాలు. నీ వెరుగనిదేముంది? అందుకే నీకు ధర్మదేవత అనే పేరు కలిగింది. పక్షపాతం లేకుండా, సర్వసమాన దృష్టితో ప్రాణులకు, ఆయాశుభాశుభ కర్మఫలితాలను అందీయటం చేత లోకాలన్నీ నిన్ను సమవర్తి యని అన్నాయి. ఎల్లవేళలా ప్రాణికోటిని నియమిస్తున్నందున 'యము'డనే పేరు ఏర్పడింది – పాపనాశకుడవయి నందున నీకు 'శమను'డనే పేరు వచ్చింది. అటువంటి నీకు నేను ప్రత్యేకంగా చెప్పవలసింది ఏముంది?" – అని సావిత్రి అన్నమాటలకు యముడు దరహాస వదనంతో ఇలా అన్నాడు.

ఓ రాకుమారీ! దప్పిగొన్నవాడికి చల్లని మంచినీటి ధారలాగా నీ ప్రసంగం నాకు సంతోషాన్ని కలిగించింది. సత్యవంతుని ప్రాణాలు తప్ప మరేదయినా కోరుకో. సత్వరమే నీ కది ప్రసాదిస్తానని అన్నాడు. సావిత్రి యముని ఆదరణకెంతో సంతోషించి 'కరుణామూర్తీ! శత్రువులు అపహరించిన రాజ్యాన్ని మళ్లీ ప్రసాదించి, సాళ్వభూపతియైన ద్యుమత్సేనుని అనుగ్రహించమని అభ్యర్థించింది. యమధర్మరాజు ఆ ప్రార్థన మన్నించి అనుగ్రహించాడు. మళ్లీ నా వెన్నంటిరాక మరలిపో. ఇది దుర్గమ మార్గం. నీవు ఇటువైపు రారాదు." – అని నిషేధాజ్ఞ విధించాడు. అయినా సావిత్రి తన ప్రాణనాథుని అనుసరించటం మానలేదు. ఇనుమడించిన భక్తితో అంజలి ఘటించి "ధర్మాధిపతీ! ఎటువంటి కష్టం వచ్చినా ధర్మాత్ములు, తమ మార్గాన్ని వదలరు. వాళ్ల మనసులో మోహతాపాలు ఒక్కింతయినా కలగవు. కాబట్టి నాకు సముచితమైన మార్గంలో నిలకడగల చిత్తంతో నేను సాగవద్దా? పతిని అనుగమించటం ఎలా వదలగలను. నాకు ఇంతకన్నా ముఖ్యకర్తవ్యం ఏమి ఉంది? – అని తన ప్రయత్నాన్ని సమర్థించుకున్నది.

మారు మాటాడలేక యముడు 'రాకుమారీ! నీ వత్యంత ధర్మతత్పరురాలవు, ఇందువల్ల తిరిగి నీకింకొక వరం ప్రసాదించవలెనని నిశ్చయించుకొన్నాను. అర్థించవలసినది' అని ఆజ్ఞాపించాడు. సావిత్రిదానికెంతో ఆనందించి, తిరిగి దోసిలికట్టి,

'మా తండ్రికి పురుష సంతానం కలగలేదు. కరుణించి ఆ సచ్చారిత్రునికి నూరుగురు పుత్రుల నను(గహించ వలసినది' అని ప్రార్థించింది. యముడావరం ప్రసాదించి, 'సుదూరం నన్ననుసరించి మిక్కిలి అలిసినావు. మరి మరలి పోవలసినది' అని తిరిగి హితోపదేశం ప్రసాదించాడు. సావిత్రి దానిపై సవినయ మనోజ్ఞ స్వరంతో విన్నవించినది:

ఓ యమధర్మరాజా! నా హృదయం భర్తపట్ల పరిపూర్ణ భక్తిభావంతో తొణికిసలాడుతున్నది. అటువంటి నాకు అలసట ఎలా కలుగుతుంది. సతులకు ప్రాణేశ్వరుని అనుసరించటం కాక, మరో పవిత్రధర్మం ఏముంది? మరో విన్నపం. దయాహృదయుడవై విను. ఆత్మధర్మనిరతులయిన పుణ్యాత్ములు ఈ లోకంలో మిక్కిలి దుర్లభులు. వాళ్ల సాంగత్యంతో సమస్త పాపాలు నిశ్శేషంగా నశిస్తున్నాయి. అటువంటి వాళ్లంతా ఈ భూమి మీద పవిత్ర తీర్థ స్వరూపులు. వాళ్ల ప్రభావంతోనే సూర్య చంద్రులు గతులు తప్పకుండా ఆకాశంలో ప్రకాశిస్తున్నారు. భూమాత ప్రాణికోటిని భరిస్తున్నది. మరొక్క విషయం. ఏడు మాటలు మాటలాడినంతనే ఎటువంటివారయినా ఆర్యజనులకు బంధువులవుతున్నారని విజ్ఞులు చెపుతారు. మీతో ఇంతసేపు సంభాషణ చేసిన నేను నీకు ఆప్తురాలిని అయ్యానని వేరే చెప్పవలసినపనిలేదు. కాబట్టి నా కోరికను తప్పనిసరిగా నెరవేర్చదగిందని భావిస్తాను' – అని అన్నది.

ఆ ప్రసంగం విన్న సమవర్తి 'ఓ సావిత్రీ! నీకు ఇంకొక వరాన్ని ఇవ్వాలని నిశ్చయించుకున్నాను. కోరుకో!' – అని అన్నాడు. సావిత్రి సంతోషించి 'కృపాంభోనిధీ! పతిజీవితం తప్ప మరేదయినా కోరుకొమ్మని ఇంతకు ముందు ఆదేశించావు. కానీ ఇప్పుడు అలాంటి నియమాన్ని ఏమీ విధించలేదు. అందుచేత ఆనందం నిండిన మనస్సుతో అభ్యర్థిస్తున్నాను. "పతి వియోగం భరించరానిది. పతిలేని ఇల్లాలిని శుభకార్యాలలో తిరస్కరిస్తారు. కాబట్టి నా భర్త పునర్జీవితుడై సుగుణ సంపత్తితో, సాటిలేని కీర్తితో విలసిల్లేలాగా అను(గహించు. ఇంతకుమించి నేను కోరేదేదీలేదు.' – అని అభ్యర్థించింది.

యమధర్మరాజు ఆమె ప్రార్థనను అంగీకరించి ఆ క్షణంలోనే సత్యవంతునికి మృత్యుపాశవిముక్తిని కలిగించాడు. సావిత్రి వైపు చూచి, 'రాజపుత్రీ! ఇదుగో నీ ప్రాణపతిని స్వీకరించు. ఇతడు ఇకపై నాలుగు వందలేళ్లు జీవించి శతపుత్రులతో, నిరంతర యాగ నిర్వహణతో, వంశశ్రేష్ఠుడై కీర్తిని పొందుతాడు.' – అని పలికి అంతర్ధానమై తన లోకానికి చేరుకున్నాడు. సావిత్రి తిరిగివెళ్లి, పతి తలను తన ఒడిలో పెట్టుకొని నిమిషమొక యుగంగా ఎదురుచూసింది.

కొంతసేపటికి సత్యవంతుడు తెలివి తెచ్చుకొని ప్రియసతివైపు చూసి "చాలాసేపు నిద్రించినట్లున్నాను. నన్ను లేపకపోయావా? బలవంతుడెవరో నన్ను పాశంతో బంధించి తనవైపు ఆకర్షించుకున్నాడు. అతడెవరు? అదినాకు కలగా అనిపించలేదు. నిజంలాగే ఉంది. నాకేదో విచిత్రమైన చిత్తభ్రాంతి కలుగుతున్నట్లు ఉంది.' – అని అనగా సావిత్రి సత్యవంతుని పునర్జీవనానికి ఎంతో సంతోషించి, 'నాథా! ఈ విషయం సంపూర్ణంగా రేపు వివరిస్తాను. చీకటి నలువైపులా వ్యాపిస్తున్నది. ఇక నిమిషమైనా ఆలస్యం చేయరాదు. అదుగో మహోగ్రాకారులై రాత్రి వేళ తిరిగే రాక్షసులు సంచరిస్తున్నారు. నక్కల కూతలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గుంపులు గుంపులుగా జంతువులు అటూయిటూ తిరుగుతున్నాయి. నాకు భయంతో కంపం కలుగుతోంది. మీరు ఆలస్యం చేయటంవలన అత్తమామలు ఆందోళనపడి దుఃఖిస్తారు. త్వరగా పోయి వాళ్లను ఆనందింపచేయాలి. – అని అన్నది. సత్యవంతుని చేష్ట విషాదంగా ఉండటాన్ని గమనించి, 'సుగుణాకారా! చీకటి దట్టంగా వ్యాపించింది. మన ఆశ్రమం ఇక్కడికి చాలాదూరం. అలసట తీరలేదని మనసుకు అనిపిస్తే, ఈ రాత్రి ఇక్కడే గడిపి తెల్లవారిన పిదపవెళ్లవచ్చునని మీ ఉద్దేశమేమిటని అడిగింది. అప్పుడు సత్యవంతుడు ఇలా బదులిచ్చాడు.

సావిత్రీ! నా తలనొప్పి తొలగిపోయింది. బలం చేకూరింది. మెల్లమెల్లగా నడువగలను. నా తల్లిదండ్రుల్ని చూడకుండా ఈ అరణ్యంలో ఎలా నిలువగలను. ఇంతకుముందెప్పుడూ ఇంతసేపు వాళ్లను విడిచి ఉండలేదు. నన్నుకానక వాళ్లు ఎన్ని రకాలుగా ఆందోళన పడుతున్నారో? మా అమ్మ సాయంసంధ్యవేళ ఎప్పుడూ నన్ను ఇంటినుండి బయటకు వెళ్లనిచ్చేది కాదు. ఈ రోజు ఈ అడవి మధ్యలో, ఈ రాత్రివేళ ఇలా ఆలస్యం చేయటంవలన ఆమె ఎంతటి ఆవేదనకు లోనయిందో, నేనెఱుగను.

ముదుసలులయిన నా తల్లిదండ్రులు చెక్కిళ్లపై కన్నీరు జాలువారగా, నన్ను అనుదినమూ కౌగిలించుకొని, శిరస్సును మూర్కొని, 'నాయనా! మా దేహప్రాణాదులన్నీ నీవే కదా! నిన్నొక తెప్పగా చేసికొని, ఈ సంసారాబ్ధిని తరించగలమన్న నమ్మకంతో ఉన్నాము. కళ్లు లేనిమాకు కళ్లు, కాళ్లునీవే. వంశాన్ని ఉద్ధరించే భారం నీదే. అని నిట్టూర్చేవారు. అటువంటి నా తల్లిదండ్రులు ఏమయ్యారో? అరణ్యానికి వచ్చిన పిదప త్వరగా కందమూలాదుల్ని సేకరించుకొని వెళ్లి యుండవలసింది. విధివశాత్తు ఇక్కడ చిక్కుబడ్డాము. నేను ఎక్కడ ఉన్నదీ మా తండ్రిగారికి తెలియదు కదా! మిక్కుటమైన దుఃఖంతో ఆశ్రమ వాసులనందరినీ నా గురించి మాటిమాటికీ అడుగుతుంటాడు. నా క్షేమ వార్త తెలియక, ముసలివారైన నా జననీ జనకులు ఈ పాటికే ప్రాణాలు వదలి యుంటారు. ఇక నేను ఆశ్రమానికి పోయి ప్రయోజనమేముంటుంది? నేను కూడా ఇక్కడే ప్రాణాల్ని వదిలివేస్తాను.

**సావిత్రీ సత్యవంతుల ఆశ్రమ ప్రవేశము**

ఈ విధంగా పరిపరివిధాలుగా దుఃఖిస్తున్న పతిని సావిత్రి చల్లని పలుకులతో సమాశ్వాసించి మృదువయిన భుజాలతో కౌగిలించుకొని అల్లన లేవనెత్తినది. అతడాసాధ్వి నానుకొని నిలిచి, ధూళిధూసర మయిన శరీరం తుడుచుకొని, ఆశ్రమం వైపు సాగిపోవటానికి సంకల్పించుకొన్నాడు. అంతలోనే ఆ రాజపుత్రి ఫలభారం మోయటం కష్టమని తలచి, ఆ పండ్ల బుట్టను కొమ్మ కొకదాని కమర్చి, తళతళలాడుతున్న గండ్రగొడ్డలి తన చేతిలోనికి తీసికొన్నది. ఎడమ చేతితో పతి ఎడమ చేతిని అదిమిపట్టి, కుడిచేతితో అతనిని గ్రుచ్చి కౌగిలించుకొని మందమంద గమనంతో ఆశ్రమం వైపు నడిపించింది.

ఇక ఆశ్రమంలో అంతకుమునుపే కన్నులు వచ్చిన ద్యుమత్సేనుడు, ఎల్లెడలా పరికించి, తన రెండు కళ్లవంటి కుమారుడడవిలో అంత సేపు రాకపోవుటానికిగల హేతువేమో తెలియక, కేవలం కళ్లు లేనివాని వలె కుమిలి కుమిలి పలవించాడు. కుమారుని కొరకై నలువైపుల అన్వేషించి, అతనిపైగల ఎనలేని ప్రేమతో, అతని సుగుణాలను నభివర్ణిస్తూ, అడవిలోగల మునుల వద్దకు పోయి, 'మునీంద్రులారా! మీ రెవ్వరయినా, ఎచ్చటయినా ఈ అడవిలో నా కుమారుని చూచినారా?' అని ప్రశ్నిస్తూ, 'అయ్యో! నాయనా!' అని గొంతెత్తి దుఃఖించాడు. కొందరు ఆ ఆర్తనాదాలను ఆలకించి, ఆతని దృష్టి లబ్ధికి ఎంతో అచ్చెరువంది, ఉచిత వాక్యాలతో అతని నాశ్వాసించుచున్నంతలో సావిత్రి, సత్యవంతులు అడవిలో అల్లంత దూరంలో గోచరించారు. వారిరువురు కొడుకును ఇనుమడించిన వాత్సల్యంతో కౌగిలించుకొని, శిరస్సును మూర్కొన్నారు. ఆ శుభ సంఘటన గమనించి తాపసు లందరూ పరమానందభరితులైనారు.

ద్యుమత్సేనుడు పుత్రునివైపు చూచి, 'నాయనా! అరణ్యంలో ఇంతటి ఆలస్యాని కేమి హేతువు?' అని ప్రశ్నించాడు. సత్యవంతుడు తాను పండ్లు కోసిన పిమ్మట కట్టెలు కొట్టుతున్న సమయంలో విపరీతమైన శిరోవేదనవల్ల క్షణమయినా నిలువలేక విశ్రమించిన విషయము, స్వప్నంలో తన్నొక పురుషుడు నిగ్రహించిన వృత్తాంతము, సవిస్తరంగా తెలిపాడు. అంతలోనే సావిత్రి అందుకొని, జరిగిన వృత్తాంతం యావత్తు సంగ్రహంగా అత్తమామల కిరువురికి నివేదించింది.

'నారద మహాముని ఈ రాజకుమారుని కీ దినమే మృత్యువని వక్కాణించాడు. ముని మాట అమోఘ మన్న సంకల్పంతో నేనీనాడు పతిననుసరించి అరణ్యానికి ప్రయాణ మయినాను. అక్కడ ఈ రాజకుమారు డెంతో అలసి నిద్రించిన సమయంలో, యముడచ్చటికి విచ్చేసి, ఈతని జీవుని పాశంతో బంధించి తన లోకానికి ప్రయాణమయినాడు. నే నాతని ననుసరించి, సత్యమయిన ధర్మమార్గంలో అనేక విధాల ప్రస్తుతించాను. దాని కాతడెంతో సంతోషించి నాకు నాలుగు వరాలననుగ్రహించాడు. వానిలో ఒక వరంవల్ల తిరిగి నా భర్త పునరుజ్జీవితు డయినాడు. వేరొక వరంవల్ల మీకు దృష్టి కలిగినది. మూడవ వరంవల్ల శాత్రవ హస్తగత మయిన రాజ్యం తిరిగి సంక్రమించినది. నాల్గవ వరంవల్ల నా జనకునికి పుత్ర శత లాభం సంప్రాప్తించగలదు.'

ఆ వృద్ధ దంపతులాశుభ వృత్తాంతం విని, అపూర్వోల్లాస భరితులయినారు. 'తల్లీ! ఆపత్సముద్రంలో పడి మునిగిపోతున్న మా వంశానికొక తెప్పవై, లెస్సగా సంరక్షించిన నీ చరిత్రం పుణ్యపురుషుల కందరికి కీర్తనీయం కాగలదు' అని అభినందించారు.

మిగిలిన మునీంద్రులా రాజకుమారి ననేక విధాల అభినందించి, దంపతుల కిరువురికి అనేకాశీస్సు లనుగ్రహించి వీడ్కొని తమ తమ గృహాలవైపు తరలిపోయినారు.

మరికొన్ని రోజులు గడిచిన పిమ్మట సాళ్వ భూపతి ఆప్త మంత్రులు, మూలభృత్యులు, పౌరులు ఆదిగాగలవా రెందరో ఆతని సన్నిధికి వచ్చి, 'అవనీశ్వరా! నీ శత్రువు, తన అనుచరులతో ఏర్పడిన కలతలవల్ల ఆత్మీయబాంధవులతో సహా పరలోకం చేరుకొన్నాడు. ఆ తరువాత నీ రాజ్యంలో గల ప్రజలంతా తమలో తామేకీభవించి నీకే పట్టం కట్టాలని ఉత్సాహపడుతున్నారు. లోకమంతా నీ అపూర్వ విజయఘోష వ్యాపించింది. భద్రగజంపై అధిరోహించి శీఘ్రమే రాజధానికి బయలుదేరి రండి. తపశ్శక్తితో తిరిగి దృష్టిని సంపాదించుకొన్న నిన్ను చూడటం మాకు ఆనందకారకం.

వారి విజ్ఞప్తికి సంతృప్తి చెంది, ఆ క్షణంలోనే ద్యుమత్సేనుడు ఆశ్రమంలోని ఋషులకు వీడ్కోలు పలికి, తానూ సత్యవంతుడు ఏనుగును ఎక్కి, పత్నితో కోడలితో, చతురంగ బలాలతో ప్రయాణించి తన రాజధానికి చేరుకున్నాడు. సత్యవంతునికి యువరాజ పట్టాభిషేకాన్ని జరిపి, తాను రాజ్యాన్ని పరిపాలించాడు. ఈ విధంగా ద్యుమత్సేనుడు గొప్ప ఐశ్వర్యాన్ని పొందాడు.

ఓ ధర్మరాజా! భర్తను, అత్తమామల్ని, తల్లిదండ్రుల్ని ఉద్ధరించిన సావిత్రి లాగే ఈ ద్రౌపదికూడ మిమ్మల్ని మీ వంశాన్ని ఉద్ధరిస్తుంది. అటువంటి అదృష్టయోగం మీకు పట్టబోతోంది. అని మార్కండేయమహర్షి పాండవులను వీడ్కొని తన ఆశ్రమానికి వెళ్లాడు.

**- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 10

# సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - ఆరణ్యపర్వం - సప్తమాశ్వాసం
## (170 నుండి 279వ పద్యం వరకు)

## సమగ్ర వ్యాఖ్యలు

చ. 'గొనములప్రోక నీ యనుగు గూతురు; దీని తలంపు మాన్పుగా
మనకు నశక్య; మింక ననుమానము లేల? నరేంద్ర! కూతు జ
య్యన నృపసూతి కిమ్ము; కమలానన చేసిన పుణ్యగౌరవం
బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతు డయ్యెడున్." (భార.ఆరణ్య.7.185)

**కవి పరిచయం:**

ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:**

మార్కండేయమహాముని ధర్మరాజునకు సావిత్ర్యుపాఖ్యానాన్ని చెపుతూ, సావిత్రి సుగుణాలను చెప్పి, సత్యవంతునికి ఆమెనిచ్చి వివాహం చేయమని అశ్వపతితో చెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| నర + ఇంద్ర! | = | నరులలో శ్రేష్ఠుడవైన ఓ అశ్వపతిరాజా! |
| నీ + అనుగు కూతురు | = | నీ కూరిమిపుత్రిక |
| గొనములప్రోక | = | సుగుణాలరాశి |
| దీని తలంపున్ | = | ఈమెఆలోచనను |
| మాన్పుగాన్ | = | మాన్పించటానికి |
| మనకున్ | = | నీకును నాకును |
| అశక్యము | = | సాధ్యం కాదు |
| ఇంకన్ | = | ఇకమీద |
| అనుమానములు + ఏల? | = | సందేహాలు దేనికి? |
| కూతున్ | = | పుత్రికను |
| చయ్యనన్ | = | వెంటనే |
| నృపసూతికిన్ | = | రాజపుత్రుడికి (సత్యవంతుడికి) |
| ఇమ్ము | = | ఒసగుము |
| కమల + ఆనన | = | పద్మం వంటి మొగం కలదౌ సావిత్రి |
| చేసిన | = | ఒనర్చిన |
| పుణ్యగౌరవంబునన్+అయినన్ | = | సుకృతం యొక్క గొప్పతనం వలన అయినను |
| ప్రియుండు | = | భర్త |

పరిపూర్ణ, చిర+ఆయున్+ఉపేతుడు అయ్యెడున్ = దీర్ఘమైన నిండైన ఆయువుతో కూడినవాడు అగునుగాక.

**తాత్పర్యం:**

ఓ రాజా! నీకుమార్తె సుగుణాల రాశి. ఈమె ఆలోచనను మార్చలేము. ఇక అనుమానం దేనికి? వెంటనే నీకుమార్తెను ఆరాకుమారుడైన సత్యవంతునికి ఇచ్చి వివాహం చెయ్యి. పద్మముఖియైన సావిత్రి చేసిన పుణ్యఫలం వలన నయినా ఆమె భర్త అయిన సత్యవంతునికి పరిపూర్ణమైన ఆయుర్దాయం పొందగలుగుతాడు.

**సంధులు:** చిరాయ్ణు + ఉపేతుడు = (రేఫాదేశ విసర్గ సంధి)
అనుగున్ + కూతురు = ద్రుతసంధి

**సమాసాలు:** నృపసూతి = నృపునకు సూతి (షష్ఠీతత్పురుష సమాసం)
కమలానన = కమలమువంటి ఆననముగలది (బహుమ్రీహి)

**ఛందస్సు:** న జ భ జ జ జ ర
I I I I U I U I I I U I I U I I U I U I U
గొనము/లప్రోక/నీయను/గుగూతు/రు; దీని/తలంపు/మాన్పుగా

**లక్షణాలు:**

చంపకమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 21.

చ. **"కలిమియు లేమియున్ సతముగా; వవిసెందినచో జెలంగుచున్**
**గలుగుచు నున్కి ధీరులప్రకారమె? లెస్సగ నింతవట్టు నే**
**దెలియుదు జెప్పెదన్ వసుమతీవర! పిన్న యనంగ నేల? నే**
**కొలుదియు గాదు; ధీరమతి గూతురు; పేర్కొను జాలు పెంపునన్.** (భార.ఆరణ్య 7-194)

**కవి పరిచయం:**

ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:**

అశ్వపతి తన కుమార్తెయైన సావిత్రిని సత్యవంతునకు ఇవ్వదలచి అడవిలోనున్న ద్యుమత్సేనుని వద్దకు వెళ్లి అభ్యర్థించాడు. అందుకు ద్యుమత్సేనుడు సుకుమారియైన మీ అమ్మాయి అడవిలో మాతో ఉండి కష్టాలకోర్చి కాపురం చేయగలదా?' - అని అన్నప్పుడు, సమాధానమిస్తూ అశ్వపతి ద్యుమత్సేనునితో అన్న మాటలివి.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| వసుమతీ+వర! | = | ఓ రాజా! ద్యుమత్సేనా! |
| కలిమియున్ | = | సంపదయున్నూ |
| లేమియున్ | = | దారిద్ర్యమున్నూ |
| సతము కావు | = | శాశ్వతము కావు |
| అవి | = | కలిమి లేములు |
| చెందినచోన్ | = | పొందినప్పుడు |

| | | |
|---|---|---|
| చెలంగుచున్ | = | అతిశయిస్తూ |
| కలుగుచున్ | = | కలత చెందుతూ |
| ఉన్కి | = | ఉండటం |
| ధీరుల, ప్రకారమె | = | ధైర్యవంతుల పద్ధతియా! |
| లెస్సగన్ | = | మేలుగా |
| ఇంత+పట్టు | = | ఇంతమేర |
| నేన్ తెలియుదున్ | = | నేను ఎఱుగుదును |
| చెప్పెదన్ | = | చెబుతున్నాను |
| కూఁతురు | = | నా పుత్రిక సావిత్రి |
| పిన్న+అనంగన్+ఏల | = | (సావిత్రి) చిన్న పిల్ల అనటం ఎందుకు |
| ఏ కొలదియున్ + కాదు | = | అంత తక్కువది కాదు (శక్తియున్నదే) |
| పేర్కొనన్ + చాలు | = | ప్రస్తావించదగినది (గణింపదగింది) |
| పెంపునన్ | = | గొప్పదనంలో |
| ధీరమతి | = | ధైర్యంతో కూడిన మనస్సు కలది. |

**తాత్పర్యం:**

ఓరాజా! (ద్యుమత్సేనా!) కలిమిలేములు శాశ్వతం కావు. సంపదకలిగినప్పుడు పొంగిపోవటం, దారిద్ర్యం సంక్రమించినప్పుడు క్రుంగిపోవటం ధీరుల పద్ధతికాదు. నాకు తెలిసినంతవరకు చెప్పగలను. నా కుమార్తెను చిన్నపిల్ల అనటం దేనికి? ఆమె అంత తక్కువ శక్తిగలదేంకాదు. ధైర్యంలో గొప్పదనంలో ఎన్నదగినదే.

**విశే:**

ఉపవాసమంటే (ఉప= దగ్గరగా; వాసము = వసించటం) భగవంతునికి దగ్గరగా ఉండటమని అర్థం. నిరాహారంగా, లోచూపుతో దైవంతో అనుసంధానం కావటమే ఉపవాస దీక్ష ధ్యేయం. ఉపవాసాన్ని ఆరోగ్యరీత్యాకూడ మంచిదని ఆరోగ్య శాస్త్ర చెపుతోంది.

**సంధులు:** ఇంత + పట్టు = ఇంతవట్టు (గసడదవాదేశసంధి)
పేర్కొనన్ + చాలు = పేర్కొనజాలు (ద్రుతసంధి)

**సమాసములు:** వసుమతీవర!ా వసుమతులలో శ్రేష్ఠుడు (షష్ఠీ తత్పురుష సమాసం)
ధీరమతిా ధీరమైనమనస్సుకలది (బహువ్రీహి)

**అలంకారం:** నిదర్శనం

**ఛందస్సు:** న జ భ జ జ జ ర
I I I/I U I /U I I/I U I/I U I /I U I / U I U
కలిమి/యులేమి/యున్సత/ముగ్గావ/విసెంది/నచోజె/లంగుచున్

**లక్షణాలు:**

చంపకమాల ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 21.

మ. ఉపవాసశ్రమ మించుకేనియును నాయుల్లంబునం దోప దీ
విపినంబుజ్జ్వలపుష్పపల్లవఫలావిర్భూత నానాలతా
గపరీతం బన విందు; జూడుగ మదిం గౌతూహలంబయ్యె; న
న్నుపరోధింపకు మింతపట్టు చన వీ యుక్తుండ వెబ్భంగులన్. (భార.ఆరణ్య 7-209)

**కవి పరిచయం:**

ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:**

త్రిరాత్రోపవాస వ్రతాన్ని ముగించి, నాల్గవ రోజున సావిత్రి, తన భర్తతో కలిసి అడవికి పోవటానికి సిద్ధపడగా వారించిన భర్తకు సమాధానంగా చెప్పిన మాటలివి.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఉపవాసశ్రమము | = | నిరాహారదీక్షవలన ఏర్పడిన బడలిక |
| ఇంచుక+ఏనియును | = | కొంచెంకూడ |
| నా ఉల్లంబునన్ | = | నా హృదయంలో |
| తోపదు | = | కన్పించదు |
| ఈ విపినంబు | = | ఈ అడవి |
| ఉత్+జ్వల | = | ప్రకాశించే |
| పుష్ప | = | పూవులు |
| పల్లవ | = | చిగుళ్ళు |
| ఫల+ఆవిర్భూత | = | ఫలాలు పుట్టెడి |
| నానా, లతా+అగ | = | పెక్కులతలతో, చెట్లతో |
| పరీతంబు+అనన్ | = | వ్యాపించి ఉన్నదని |
| విందున్ | = | వింటాను |
| చూడగన్ | = | (ఈ అడవిని) దర్శించగా |
| మదిన్ | = | చిత్తంలో |
| కౌతూహలంబు | = | వేడుక |
| అయ్యెన్ | = | అయింది |
| నన్నున్ | = | నన్ను |
| ఉపరోధింపకుము | = | అడ్డు పెట్టకుము |
| ఏ+భంగులన్ | = | ఏ రీతులలో ఆలోచించినా |
| ఇంత+పట్టు | = | ఇంతమాత్రం |
| చనవు | = | చొరవతోడి కోరికను |
| ఈన్ | = | ఇవ్వటానికి |
| ముక్తుండవు | = | తగినవాడవు. |

**తాత్పర్యం:**

మూడురోజులు ఉపవాసం చేసినందున ఏ విధమైన బడలిక నా మనస్సులో లేదు. ఈ అడవి, అందంగా శోభించే పూలు, చిగుళ్ళు, ఫలాలు కాచే తీగలతో, చెట్లతో కూడిందని ఇతరులు చెప్పగా విన్నాను. ఇప్పుడు స్వయంగా చూడాలని కుతూహలంగా ఉంది. నన్ను అడ్డుపెట్టకు ఏ విధంగా చూచినా ఈ పాటి చనువును నాకీయదగినవాడవు.

**విశే:**

సావిత్రి అడవికి భర్తతో వెళ్లటానికి కృతనిశ్చయమై, వారిస్తున్న భర్తను అంగీకరింపచేసే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది. వన సౌందర్యాన్ని, చూడాలని మనసు ఉవ్విళ్లూరుతోందని, ఆ కోరిక తీర్చాల్సిన బాధ్యత నీదేసుమా! అని భర్తను అంగీకరింప చేయటానికి ప్రయత్నిస్తుంది.

**సంధులు:** నానాలతాగపరీతంబు = నానాలత + అగపరీతంబు = (సవర్ణదీర్ఘసంధి)
నన్ను + ఉపరోధింపకు = నన్ను పరోధింపకు (ఉత్వసంధి)
ఏ + భంగులన్ = ఎబ్భంగులన్ (త్రికసంధి)

**సమాసాలు:** ఉపవాసశ్రమ = ఉపవాసం వలన కలిగిన శ్రమ (పంచమీ తత్పురుష సమాసం)
నానాలతాగపరీతంబు = నానాలతలు, వృక్షాలతో ఆడినది (తృతీయా తత్పురుష సమాసం)

**ఛందస్సు:** స భ ర న మ య వ
I I U/U I I /U I U/I I I /U U U/ I U U /I U
ఉపవా/సశ్రమ/మించుకే/నియును/నాయుల్లం/బునందో/పదీ

**లక్షణాలు:**

మత్తేభము. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో “స-భ-ర-న-మ-య-వ” అనే గణాలుంటాయి. యతి: 14వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 20.

చ. **‘ఒడలు వశంబు గాదు, భ్రమ నొందినయట్లు మనంబు దూలెడిం,**
**గడుగి శిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టి ద**
**య్యెడు, నిలువంగ నోప; నొకయించుకసేపు శ్రమంబు దీఱ నీ**
**యెడ శయనింతు’ నావుడు సితేక్షణ మెత్తని సంభ్రమంబుతోన్.** (భార. ఆరణ్య 7-215)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** అడవిలో సత్యవంతుడు పండ్లుకోసి, సమిధలను గొడ్డలితో కొయ్యను నరుకుతూ అలసటచెంది, భూమి మీద విసరివేశాడు. నిట్టూర్పులతో, విషాదంతో సావిత్రితో తన స్థితిని గురించి చెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| ఒడలు | = | శరీరం |
| వంశపు + కాదు | = | స్వాధీనంలో లేదు |
| మనంబు | = | మనస్సు |
| భ్రమన్ | = | మోహము |
| ఒందిన + అట్లు | = | పొందినట్లు |

| | | |
|---|---|---|
| తూలెడిన్ | = | తూలి పడిపోతున్నది |
| కదుగి | = | పూని |
| శిరంబు | = | తల |
| శూలివిశిఖ ప్రకరంబునన్ | = | బల్లెములు బాణాల సమూహంచేత |
| నొంచినట్టిది+అయ్యెడున్ | = | నొప్పి కలిగించినట్టిది అయింది |
| నిలువంగన్ + ఓపన్ | = | నిలబడ జాలను |
| ఒక + ఇంచుక సేపు | = | ఒక్కింతసేపు |
| ఈ + ఎడన్ | = | ఈ చోట |
| శ్రమంబు+తీఱన్ | = | అలసట తీరేటట్లు |
| శయనింతున్ | = | పండుకొంటాను |
| నావుడున్ | = | అని (సత్యవంతుడు)చెప్పగా |
| సిత+ఈక్షణ | = | తెల్లని కాంతితో గూడిన కన్నులు (చూపులు గల సావిత్రి |
| మెత్తని సంభ్రమంబుతోన్ | = | మృదువయిన తత్తరపాటుతో |

**తాత్పర్యం:**

శరీరం స్వాధీనంలో లేదు ఏదో భ్రమకు లోనైనట్లు మనసు తూలిపోతున్నది శూలాలతో బాణాలతో పొడిచి నొప్పి కలిగించినట్లు తలనొప్పి కలుగుతోంది. కొంచెం సేపయినా నిలబడలేను. శ్రమతీరేవరకు ఇక్కడ పడుకుంటాను." – అని సత్యవంతుడు అనగా సావిత్రి సున్నితమైన తత్తరపాటుతో

**విశే:** మృత్యువు ఆసన్నమైనప్పుడు ప్రాణస్థితిగతుల్ని చెప్పటం ఇందులో కనిపిస్తుంది.

**సంధులు:** మనంబు + తూలెడిన్ = మనంబుదూలెడిన్ (గసడదవాదేశసంధి)
సిత + ఈక్షణ = సితేక్షణ (గుణసంధి)

**సమాసాలు:** సితేక్షణా సితమైన ఈక్షణములుగలది (బహువ్రీహి)

**ఛందస్సు:** న జ భ జ జ జ ర
ı ı ı/ı ∪ ı /∪ ı ı/ı ∪ı /ı ∪ ı /ı ∪ ı /∪ ı ∪
ఒడలు/వశంబు/గాదుభ్ర/మనొంది/నయట్లు/మనంబు/దూలెడిం

**లక్షణాలు:**

చంపకమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య – 21.

మ. **కనియెం గోమలి నీలమేఘవిలసత్కాలాంజనాకారు, ఘో**
**రనిశాతోత్కటదంష్ట్రు, నుజ్జ్వలచలద్రక్తాక్షు బ్రత్యగ్ర కాం**
**చనవర్ణాంబరు, నంత్యకాలదహనజ్వాలా ప్రచండున్, జగ**
**జ్జనసంత్రాసను, నొక్కదివ్యు, బటుపాశప్రౌఢహస్తోద్ధతున్** (భార.ఆరణ్య 7-217)

**కవి పరిచయం:**

ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:**

సత్యవంతుని ప్రాణాలను అపహరించటానికి వచ్చిన యముని గురించి వర్ణించి చెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| నీల, మేఘవిలసత్ | = | నల్లని మబ్బువలె శోభిల్లే |
| కాల+అంజన+ఆకారున్ | = | నల్లని కాటుకవంటి రూపం కలవాడిని |
| ఘోర | = | భయంకరమైన |
| నిశాత | = | వాడిఅయిన |
| ఉత్కట | = | క్రూరములైన |
| దంష్ట్రున్ | = | కోరలు కలవాడివి |
| ఉత్+జ్వల, | = | ప్రకాశమానాలై |
| చలత్ | = | చలించే |
| రక్త+అక్షున్ | = | ఎర్రని కన్నులు కలవాడిని |
| ప్రత్యగ్రకాంచనవర్ణ+అంబరున్ | = | పరిశుద్ధమైన బంగారు రంగుతో కూడిన వస్త్రాలు కలవాడిని |
| అంత్యకాల | = | ప్రళయకాలంలోని |
| దహనజ్వాలా | = | అగ్నిశిఖవలె |
| ప్రచండున్ | = | భయంకరమైన ఆకారం కలవాడివి |
| జగత్+జన, సంత్రాసనున్ | = | లోకంలోని జనులకు భీతిని కలిగించేవాడిని |
| ఒక్కదివ్యున్ | = | ఒక వేలుపును |
| పటు | = | తీక్ష్ణమైన |
| పాశ ప్రౌఢ, హస్త+ఉద్ధతున్ | = | పాశాయుధమును ధరించుటయందలి నేర్పుతోగూడిన చేతిచే గర్వించినవాడిని |
| కోమలి | = | సుకుమారియైన సావిత్రి |
| కనియెన్ | = | చూచింది. |

**తాత్పర్యం:**

కోమలియైన సావిత్రి నల్లని మేఘంలా ప్రకాశించే కాటుకవంటి ఆకారం గలవాడిని, భయంకరము, క్రూరమూనైన వాడి కోరలు గలవాడిని, రక్తవర్ణంతో ప్రకాశించే ఎఱ్ఱని కళ్లుగలవాడిని, పరిశుద్ధమైన బంగారు రంగుతోకూడిన వస్త్రాలు ధరించినవాడిని, ప్రళయ కాలాగ్నిలా భయంకరాకారంగలవాడిని, లోకంలోని జనులకు భయాన్ని కలిగించేవాడు, తీక్షణమైన పాశమనే ఆయుధాన్ని నేర్పుగా తిప్పే చేతితో గర్వించే వ్యక్తిని చూచింది.

**విశే:**

యముని రూపాన్ని మాటలతో బొమ్మకట్టటం ఇందులోని ప్రధానాంశం. యముడు ఉద్ధతుడు. ఆతని రూపం భయంకరం. దీనిని చూచింది కోమలియైన సావిత్రి. కోమలత్వం, ఉద్ధతత్వం రెండూ విరుద్ధ లక్షణాలు. ఇటువంటి సందర్భాలనే ప్రతియోగస్ఫూర్తి అంటారు. పద్యంలో 'కనియెన్' – అన్న శబ్దం తప్ప మిగిలిన పద్యమంతా సంస్కృత శబ్దాలే. భాగవతంలో 'కనియెన్ రుక్మిణి.... మనుచరిత్రలో 'అటుజని కాంచె...' వంటి పద్యాలకు ఒరవడి ఇటువంటి పద్యాలే.

**సంధులు:** జగత్ + జన సంత్రాసనున్ = జగజ్జనసంత్రాసనున్ (జశ్త్వసంధి)
హస్త + ఉద్ధతున్ = హస్తోద్ధతున్ (గుణసంధి)

**సమాసాలు:** జగజ్జనసంత్రాసనున్– జగజ్జనులకు సంత్రాసనున్ కారణమైనవాడివి (తత్పురుష సమాసం)
కాంచనవర్ణాంబరుడు– కాంచనవర్ణంతోకూడిన అంబరాన్ని ధరించినవాడు (బహువ్రీహి సమాసం)

**అలంకారం:** రూపకం

నీలమేఘవిలసత్కాలాంజనకారున్, ఘోరనిశాతోత్కటదంష్ట్రున్,
ఉజ్జ్వల చలద్రక్తాక్షున్, ప్రత్యగ్రకాంచన వర్ణాంబరున్,
అంత్యకాలదహనజ్వాలాప్రచండున్. . . . . .
ఈ మొదలైన సమాసాలలో ఉపమానాలకు అభేదం చెప్పటమే కనిపిస్తుంది. అందుచేత ఇది రూపకం.

**ఛందస్సు:** స భ ర న మ య వ

I I U /U I I /U I U/ I I I /U U U/I U U /I U

క్రనియెం/గోమలి/నీలమే/ఘవిల/సత్కాలాం/జనాకా/రుఘో

**లక్షణాలు:**

మత్తేభము. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "స-భ-ర-న-మ-య-వ" అనే గణాలుంటాయి. యతి: 14వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 20.

**చ. అనవుడు మద్రరాజసుత ప్రాంజలియై సమవర్తితోడ ని**
**ట్లను 'రిపుకోటిచే నపజయంబును బొంది వనాంతరంబునం**
**దనవరతవ్రతాభిరతు డైన మహాత్ముడు సాళ్వభూవిభుం**
**దనఘుుడు లబ్ధచక్షు డగు నట్టులుగా గరుణింపవే మదిన్.'** (భార.ఆరణ్య 7-225)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** సావిత్రి యమధర్మరాజుని వరాలడిగే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అనవుడున్ | = | అని యముడు చెప్పగా; |
| మద్రరాజసుత | = | (మద్రదేశాధిపతి అయిన అశ్వపతికూతురు) సావిత్రి; |
| ప్రాంజలి+ఐ | = | రెండు చేతులను జోడించినదై |
| సమవర్తితోడన్ | = | యమధర్మరాజుతో; |
| ఇట్లు + అనున్ | = | ఈ విధంగా చెప్పింది; |
| 'రిపుకోటిచేన్' | = | శత్రుసమూహాలచేత; |
| అపజయంబును + పొంది | = | పరాజయం పొంది; |
| వన + అంతరంబునందున్ | = | అరణ్యంలోపల |
| అనవరత | = | ఎల్లప్పుడును |
| వ్రత + అభిరతుడు+ఐన | = | నోములు నోయటంలోనే ఆసక్తుడై ఉన్న వాడయిన |
| మహా + ఆత్ముడు | = | మహానుభావుడు |

| | | |
|---|---|---|
| అనఘుడు | = | పాపరహితుడు, పుణ్యాత్ముడు |
| సాళ్వభూవిభుండు | = | సాళ్వదేశాధిపతి ద్యుమత్సేనుడు |
| లబ్ధచక్షుడు | = | పొందిన కన్నులు కలవాడు |
| అగునట్టులుగాన్ | = | అయినరీతిగా |
| మదిన్ | = | మనస్సులో |
| కరుణింపవే | = | అనుగ్రహించుమా. |

**తాత్పర్యం:**

సావిత్రిని యముడు వరాలు కోరుకొమ్మని చెప్పగా, ఆమె యమునికి నమస్కరించి 'శత్రుసమూహంచేత పరాజయం పొంది, అరణ్యమధ్యలో నిరంతరం వ్రతాలు చేయటంలోనే ఆసక్తుడై యున్న మహాత్ముడు, పుణ్యాత్ముడూ సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనునికి దయతో కళ్లను ప్రసాదించి అనుగ్రహించమని వేడుకొన్నది.

**విశే:**

'సమవర్తి' అని యమధర్మరాజును సంబోధించటాన్ని యిక్కడ గమనించాలి. ధర్మాచరణలోను, కర్తవ్య పరాయణత్వంలోను అందరినీ సమానంగా చూచి వర్తించేవాడు కాబట్టి యముని కాపేరు వచ్చింది. ఇక్కడ సావిత్రి, ధర్మనిరతిని మెచ్చిన యముడు సావిత్రికి వరాలనిచ్చాడు. ప్రాణికోటి చేసే కర్మలకు తగిన ఫలాన్ని సమానమైన బుద్ధితో ఇచ్చేవాడు కాబట్టే సమవర్తి అయ్యాడు.

**సంధులు:** వన + అంతరంబునన్ = వనాంతరంబునన్ (సవర్ణదీర్ఘసంధి)
వ్రత + అభిరతుడు = వ్రతాభిరతుడు (సవర్ణదీర్ఘసంధి)

**సమాసాలు:** రిపుకోటిః అసంఖ్యాకమైన రిపులు (ద్విగు సమాసం)
సాళ్వభూవిభుడూ సాళ్వదేశానికి అధిపతి (కర్మధారయ సమాసం)

**అలంకారం:** సాభిప్రాయ విశేషణాన్ని యమునికి ప్రయోగించటం చేత పరికరాలంకారం.

**ఛందస్సు:** న జ భ జ జ జ ర
I I I / I U I / U I I / I U I / I U I / I U I / U I U
<u>అ</u>నవు/దుమద్ర/రాజసు/తప్రాంజ/లియైస/మవర్తి/తోడని

**లక్షణాలు:** చంపకమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 21.

చ. **'ఎడపక వాఙ్మనక్రియల నేరికి హింస యొనర్పుబూన; రె**
**య్యెడలన్ దీనులం గరుణ యేర్పడు బ్రోమగజూతు; రిచ్చుచో**
**గడమ వడంగ నీ కెదిరి కాంక్షితముల్ దుదిముట్టు దీర్తు; రె**
**క్కుడు మది గూర్తు రాశ్రితులకున్; నిను మిన్నియు నార్యధర్మముల్.** (భార.ఆరణ్య 7-228)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** తన వెన్నంటి వస్తున్న సావిత్రికి వరాలిచ్చి, వెనుకకు మరలించి పంపాలనుకున్న యముడిని వదలకుండా వెంబడించి పోతూ సావిత్రి చెప్పిన ఆర్యధర్మాలివి.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| వినుము | = | వినుడు |
| ఎడపక | = | వ్యవధానం లేకుండా (వేగంగా) |
| వాఙ్మనక్రియలన్ | | |
| (వాక్+మనస్+క్రియలన్) | = | మాటలలో, మనస్సులో, చేతలలో |
| ఏరికిన్ | = | ఎవరికీ |
| హింస | = | హాని |
| ఒనర్పన్ + పూనరు | = | చేయటానికి ప్రయత్నించరు |
| ఏ+ఎడలను | = | ఏ సందర్భాలందైనా |
| దీనులన్ | = | ఆర్తులను, కష్టాలలో ఉన్నవారిని |
| కరుణ ఏర్పడన్ | = | దయకలిగి |
| ప్రోమ గన్ + చూతురు | = | రక్షించాలనే చూస్తారు |
| ఇచ్చుచోన్ | = | దానం చేసేటప్పుడు |
| కడమ+పడంగనీక | = | కొరతలేకుండా |
| ఎదిరి, కాంక్షితముల్ | = | ఇతరుల కోరికలు |
| తుదిముట్టన్ | = | సంపూర్ణంగా |
| తీర్తురు | = | నెరవేరుస్తారు |
| ఆశ్రితులకున్ | = | ఆశ్రయించినవారికి |
| మదిన్ | = | హృదయంలో |
| ఎక్కుడు | = | అధికంగా |
| కూర్తురు | = | సంతోషం కలిగిస్తారు |
| ఇన్నియున్ | = | ఇవి అన్నియును |
| ఆర్యధర్మముల్ | = | పూజ్యులైనవారు నిర్వహించే ధర్మాలు, నెరవేర్చే కర్తవ్యాలు |

**తాత్పర్యం:**

మనోవాక్కాయకర్మలమధ్య ఎటువంటి తేడాలేని త్రికరణశుద్ధితో, ఎవరికీ ఎటువంటి హానిని చేయాలని ప్రయత్నించరు. దీనులను కాపాడటానికే ప్రయత్నిస్తారు. దానం చేసేటప్పుడు ఏ కొరత లేకుండ ఎదుటివారి కోరికలను సంపూర్ణంగా తీరుస్తారు. ఆశ్రయించినవారిని మనసునిండే లాగా ఆదరిస్తారు. ఇవన్నీ ఆర్యులాచరించే ధర్మాలు.

**విశే:**

చేతులతో చేసేదే హింసకాదు. పరుషోక్తులతో ఎదుటివారి మనసును గాయపరచటం కూడా హింసయే. అది వాక్‌హింస. మనస్తాపం కలిగించే ఏ చర్య అయినా మానసిక హింసే. ఎవరి శక్తికి తగినట్లు వాళ్లు హింస చెయ్యనివాడు లోకంలో కనిపించడు.

**సంధులు:** ఏ + ఎడలను = ఎయ్యెడలను (త్రికసంధి)

కడమ + పడంగనీక = కడమవడంగనీక (గసడదవాదేశసంధి)

**సమాసాలు:** వాఙ్మనక్రియలు – వాక్కు, మనస్సు, క్రియలు (బహుపద ద్వంద్వం)
ఎదిరికాంక్షితములు – ఎదుటివారియొక్క కాంక్షితములు (షష్ఠీ తత్పురుష సమాసం)
ఆర్యధర్మములు – ఆర్యుల యొక్క ధర్మములు (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు:** న జ భ జ జ జ ర
I I I / I U I / U I I / I U I / I U I / I U I / U I U
ఎడప/కవాఙ్మ/నక్రియ/లనేరి/కిహింస/యొనర్పు/బూనరె

**లక్షణాలు:**

చంపకమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న–జ–భ–జ–జ–జ–ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య – 21.

ఉ. **వారల పేర్మి గాదె శశివారిజమిత్రులు నిర్వికారసం**
**చారత నుల్లసిల్లెదరు, సర్వపయోనిధులున్ నిరాకులా**
**కారతు గ్రాలెడుం, గులనగంబులు నిశ్చలరూఢి జాల నొ**
**ప్పారెడు భూతధాత్రి నిఖిలైకధురీణతు బేర్మి బొందెడున్** (భార. ఆరణ్య 7–244)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** సావిత్రి యమధర్మరాజుతో పలికిన మాటలు.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| వారల పేర్మిన్+కాదె | = | వారలయొక్క అంటే ఆత్మధర్మనిరతులైన పుణ్యాత్ములచేతనే కదా |
| శశివారిజమిత్రులు | = | చంద్రుడు, సూర్యుడు |
| నిర్వికార సంచారతన్ | = | గతులు తప్పక సంచరిస్తూ |
| ఉల్లసిల్లెదరు | = | శోభిల్లుతూ ఉంటారు |
| సర్వ పయోనిధులున్ | = | అన్ని సముద్రాలూ |
| నిరాకుల+ఆకారతన్ | = | మేరమీరని రూపంతో |
| క్రాలెడున్ | = | వెలుగొందుతాయి |
| కులనగంబులు | = | కులపర్వతాలు |
| నిశ్చలరూఢిన్ | = | కదలకుండ ఉండే స్థితికలిగి |
| చాలన్ | = | మిక్కిలు |
| ఒప్పారెడున్ | = | విలసిల్లుతున్నవి |
| భూతధాత్రి | = | ప్రాణులతో కూడిన భూమి |
| నిఖిల+ఏక, ధురీణతన్ | = | సమస్తమున్నూ తానే భరించటంలో |
| పేర్మిన్ | = | గొప్పతనాన్ని |
| పొందెడున్ | = | సంపాదిస్తుంది |

**తాత్పర్యం:**

స్వీయ ధర్మ నిరతులైన పుణ్యాత్ముల గొప్పదనం వలననే సూర్యుడు, చంద్రుడు గతి తప్పకుండ తిరుగుతున్నారు. సముద్రాలన్నీ హద్దుమీరకుండా ఒప్పుతున్నాయి. కులపర్వతాలు కదలకుండా నిశ్చలంగా విలసిల్లుతున్నాయి. ప్రాణికోటితో కూడిన భూమి, సమస్తాన్నీ భరించి గొప్పతనాన్ని పొందగలుగుతున్నది.

**విశే:**

స్వీయ ధర్మనిరతులైన మహానుభావుల మహిమవల్లనే సృష్టిలయ చెదరకుండ సాగుతుందని, మహాత్ముల ధర్మ నిరతియే సృష్టికి శ్రుతిని సమకూరుస్తుందని చెప్పటం గొప్ప విషయం.

**సంధులు:** నిరాకుల + ఆకారతన్ = నిరాకులాకారతన్ (సవర్ణదీర్ఘసంధి)
నిఖిల + ఏకధురీణతన్ = నిఖిలైక ధురీణతన్ (వృద్ధిసంధి)

**సమాసాలు:** శశివారిజమిత్రులూ౼ శశి, వారిజమిత్రుడు (ద్వంద్వ సమాసం)
భూతధాత్రి – భూతాలతో కూడిన ధాత్రి (తృతీయ తత్పురుష సమాసం)

**అలంకారం:** ఉత్ప్రేక్షాలంకారం.

**ఛందస్సు:** భ ర న భ భ ర వ
U I I / U I U / I I I / U I I / U I I / U I U / I U
వారల/పేర్మిగా/దెశశి/వారిజ/మిత్రులు/నిర్వికా/రసం

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి: 10వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య – 20.

మ. **అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారులై క్రందుగా**
**మెదలం జొచ్చిరి, ఘోరఫేరవరుతుల్ మిన్నందె దీవ్రంబులై,**
**పదశబ్దంబులు మీఱు జూడు కలయంబాలం దొడంగెం బెనుం**
**గదుపుల్ గట్టి మృగంబు; లెంతయు భయోత్కంపంబు నా కయ్యెడున్.** (భార. ఆరణ్య 7-255)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** పునర్జీవితుడైన సత్యవంతుని ఉద్దేశించి, సావిత్రి పలికిన పలుకులివి.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| అదె | = | అదిగో |
| నక్తంచరులు | = | రాక్షసులు |
| ఇందున్+అందున్ | = | ఇక్కడ అక్కడ |
| మహా+ఉగ్ర+ఆకారులు+ఐ | = | మిక్కిలి భయంకరమైన రూపాలు కలవారై |
| క్రందుగాన్ | = | సందడిగా |
| మెదలన్ + చొచ్చిరి | = | తిరుగాడసాగారు |
| ఘోర ఫేరవ రుతుల్ | = | భయంకరమైన నక్కలకూతలు |
| తీవ్రంబులు + ఐ | = | తీక్ష్ణమై |
| మిన్ను + అందెన్ | = | ఆకసాన్ని అంటాయి |
| పెనున్ + కదుపుల్ కట్టి | = | పెద్దగుంపులుగా చేరి |
| మృగంబులు | = | జంతువులు |
| చూడు | = | చూడుమా |

| | | |
|---|---|---|
| కలయన్ + పాఱన్ + తొడంగెన్ | = | అంతటా పరుగెత్తుతున్నాయి |
| చూడు | = | గమనించుము |
| పదశబ్దంబులు | = | అడుగుల చప్పుడులు |
| మీఱెన్ | = | అతిశయించాయి |
| ఎంతయున్ | = | మిక్కిలి |
| భయ + ఉత్కంపంబు | = | వెఱపు వలన ఏర్పడిన వణకు |
| నాకున్ + అయ్యెడున్ | = | నాకు కలుగుతున్నది. |

**తాత్పర్యం:**

చీకటి కమ్ముకుంది. అందులో రాత్రిపూట తిరిగే రాక్షసులు భయంకరాకారంతో సందడి చేయటం ప్రారంభించారు. నక్కల కూతలు భయంకరంగా ఆకాశాన్ని తాకుతున్నాయి. జంతువులు పెద్ద పెద్ద గుంపులుగా అటూయిటూ తిరుగుతున్నాయి. వాటి అడుగుల సవ్వడి అతిశయిస్తున్నది. చూడు. నాకు భయంతో వణుకుపుడుతోంది.

**విశే:** అడవిలో రాత్రివేళ ఉండేవాతావరణాన్ని సహజ సుందరంగా సావిత్రినోట కవి పలికించాడు.

**సంధులు:** మహా + ఉగ్రాకారులు = మహోగ్రాకారులు (గుణసంధి)
భయ + ఉత్కంపంబు = భయోత్కంపంబు (గుణసంధి)
మిన్ను + అందె = మిన్నందె (ఉత్వసంధి)

**సమాసాలు:** నక్తంచరులూ రాత్రిలో తిరిగేవారు (షష్ఠీ తత్పురుష సమాసం)
భయోత్కంపమూ భయముచేత ఉత్కంపము (తృతీయా తత్పురుష సమాసం)

**ఛందస్సు:** స భ ర న మ య వ
I I U/U I I /U I U/ I I I /U U U/I U U /I U
అదెన/క్తంచరు/లిందునం/దునుమ/హోగ్రాకా/రులైక్రం/దుగా

**లక్షణాలు:**

మత్తేభము. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో “స-భ-ర-న-మ-య-వ” అనే గణాలుంటాయి. యతి: 14వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 20.

చ. **‘తమమును బెల్లుగాం బరుగె, దవ్వు నిజాశ్రమభూమియున్, మదిన్**
**శ్రమమును బాయ దిప్పు దనుచందమ యైను జనంగ నేల? యిం**
**పమరుగ నింతప్రొద్దు సుగుణాకర! యిచ్చట నిల్చి రేపు వో**
**దమె? తెలు గెద్ది?’ నావుడును దన్వికి సాళ్వతనూజు డిట్లనున్’** (భార. ఆరణ్య 7-258)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** పునర్జీవితుడైన సత్యవంతునితో సావిత్రి చీకటి పడింది. క్రూరమృగాలు, రాక్షసులు విజృంభించే సమయం, ఈ అడవి నుండి త్వరగా వెళ్ళి ఇల్లు చేరదామని చెప్పింది. కాని సత్యవంతుడు విషాదంతో ఉండటం గమనించి సావిత్రి చెప్పే సందర్భంలోనిది.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| తమమును | = | చీకటియును |
| పెల్లుగాన్ | = | అధికంగా |
| పరుగెన్ | = | వ్యాపించింది |
| నిజ + ఆశ్రమభూమియున్ | = | మన ఆశ్రమసీమకూడ |
| దవ్వు | = | దూరం |
| మదిన్ | = | చిత్తంలో |
| శ్రమమును | = | అలసటయును |
| ఇప్పుడు | = | ఇప్పుడు |
| పాయదు | = | పోదు |
| అను | = | అనునట్టి |
| చందము + అ + ఐనన్ | = | రీతిగా అయితే |
| చనంగన్ + ఏల? | = | పోవటం దేనికి? |
| సుగుణ + ఆకర! | = | మంచిగుణాలకు నెలవు అయినవాడా, ఓ సత్యవంతుడా! |
| ఇంపు + అమరుగన్ | = | ప్రీతి ఎసగగా |
| ఇంతప్రొద్దు | = | ఈ రాత్రి సమయం |
| ఇచ్చటన్ | = | ఈ స్థలంలో |
| నిల్చి | = | ఉండి |
| రేపు | = | ప్రొద్దున |
| పోదము + ఎ | = | పోదామా? |
| తెఱుగు + ఎద్ది? | = | మార్గం ఏది? |
| నావుడును | = | అని వచించగా |
| తన్వికిన్ | = | సావిత్రితో |
| సాళ్వతనూజుుడు | = | సాళ్వరాజు కుమారుడు - సత్యవంతుడు |
| ఇట్లు + అనున్ | = | ఈ విధంగా అంటున్నాడు. |

**తాత్పర్యం:**

సుగుణాలకు నెలవైన ఓ సత్యవంతుడా! చీకట్లు బాగా కమ్మాయి. మన ఆశ్రమం చాలా దూరంలో ఉంది. అలసట తీరలేదని మనసులో అనిపిస్తే, వెళ్లటం దేనికి? ఈ రాత్రికి సంతోషంగా ఇక్కడనే గడిపి, రేపు పొద్దునే వెళదాం. మీ ఉద్దేశమేమిటి? అని సావిత్రి పలుకగా, సత్యవంతుడు ఇలా బదులిచ్చాడు.

**సంధులు:** రేపు + పోదమె = రేపు వోదమె (గసడదవాదేశసంధి)

తెఱగు + ఎద్ది = తెఱగెద్ది (ఉత్వసంధి)

**సమాసాలు:** సుగుణాకరా సుగుణాలకు ఆకరమైనవాడా! (షష్ఠీ తత్పురుష సమాసం)

సాళ్వతనూజుడూ సాళ్వదేశపు రాజకుమారుడు (షష్ఠీ తత్పురుష సమాసం)

**ఛందస్సు:** న జ భ జ జ జ ర

I I I / I ∪ I /∪ I I / I ∪ I / I ∪ I / I ∪ I /∪ I ∪

తమము/నుబెల్లు/గాబరు/గెద్దవ్వ/నిజాగ్ర/మభూమి/యున్మదిన్

**లక్షణాలు:**

చంపకమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "న-జ-భ-జ-జ-జ-ర" అనే గణాలుంటాయి. యతి: 11వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 21.

ఉ. **కన్నులు వచ్చి యెల్లెడలు గన్గొని వృద్ధనరేంద్రు దాత్మకుం**
**గన్నులు బోలె నైన తన గాదిలిపుత్త్రుడు గాననంబులో**
**నెన్నుడు లేని యింత తడ వేటికి జిక్కెనొ యంచు నార్తితో**
**గన్నులు లేనియ ట్లతుడు గానక యేడ్చె సతీసమేతు డై.** (భార.ఆరణ్య 7-269)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** సావిత్రికి యమధర్మరాజు ఇచ్చిన వర ప్రభావంతో, ద్యుమత్సేనునికి కళ్ళు వచ్చాయి. ఆ సమయంలో కొడుకుని గూర్చి ద్యుమత్సేనుడు విలపించే సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| కన్నులు వచ్చి | = | కన్నులు వచ్చి (ఇంతవరకు ద్యుమత్సేనుడు గ్రుడ్డివాడు, అతడికి ఆకస్మికంగా దృష్టి వచ్చింది. సావిత్రికి యముడు అనుగ్రహించిన వరం చొప్పున) |
| ఎల్ల + ఎడలున్ | = | అన్ని చోటులును |
| కన్గొని | = | చూచి |
| వృద్ధ, నర + ఇంద్రుడు | = | ముసలిరాజు ద్యుమత్సేనుడు |
| ఆత్మకున్ | = | తన అంతరాత్మకు |
| కన్నులున్ + పోలెన్ + ఐన | = | నేత్రాలు వలెనే ఉన్నటువంటి |
| తన, గాదిలి, పుత్త్రుడు | = | తన అనుగుకొడుకు సత్యవంతుడు |
| కాననంబులోన్ | = | అరణ్యంలో |
| ఎన్నుడు లేని | = | ఎప్పుడును జరుగని |
| ఇంత, తడవు | = | ఇంత సేపు |
| ఏటికిన్ | = | ఎందుకు |
| చిక్కెనొ | = | ఉండిపోయాడో |
| అంచున్ | = | అని తలపోస్తూ |
| ఆర్తితోన్ | = | దైన్యంతో |
| కన్నులు లేని + అట్లు | = | నేత్రాలు లేని మాదిరిగా |
| అతుడు | = | ద్యుమత్సేనుడు |
| కానక | = | కనుపించక (ఇపుడు ఆతనికి ప్రపంచమంతా కనిపిస్తున్నా - కొడుకు కన్పించకపోవటం చేత కన్పించనట్లుగనే ఎంచి) |

సతీసమేతుడు = భార్యతో కూడినవాడై
ఏడ్చెన్ = విలపించాడు.

**తాత్పర్యం:**

ఆకస్మికంగా కళ్లువచ్చి, అన్ని తావులా వెదకి, తన ఆత్మకు కళ్లలా ఉన్న కొడుకు సత్యవంతుడు, అడవిలో ఎప్పుడూ ఇంతసేపుండలేదు. ఎందుకు చిక్కువడిపోయాడో అంటూ ఆర్తితో కళ్లులేని వానిలాగా భార్యతో కలసి విలపించాడు.

**విశే:**

ద్యుమత్సేనుని మానసిక స్థితి ఇందులో చెప్పబడింది. కళ్లులేనప్పుడు చూడని ప్రపంచాన్ని ఇప్పుడు చూడగలుగుతున్నాడు. అలా చూడటానికి అవకాశం రాగానే తన కొడుకునే వెదుక్కున్నాడు. ఆ కొడుకు తన ఆత్మకు కళ్లలాంటివాడు. లోకంలో ఎవరైనా తమకు ఏదైనా అదృష్టం పట్టినప్పుడు ఆత్మీయులతో పంచుకుంటారు. అలాగే ద్యుమత్సేనుడు కూడా.

**సంధులు:** ఎల్ల + ఎడలు = ఎల్లెడలు (అత్త్వసంధి)
తడవు + ఏటికి = తడవేటికి (ఉత్త్వసంధి

**సమాసాలు:** వృద్ధనరేంద్రుడు - వృద్ధుడైన నరేంద్రుడు (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం)
గాదిలిపుత్రుడు - గాదిలియైన పుత్రుడు (విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం)

**అలంకారం:** ఉపమాలంకారం. 'ఆత్మకు కళ్లలాంటివైన తన ప్రియమైన కొడుకు' అని అనటంలో ఉపమాలంకారముంది.

**ఛందస్సు:** భ ర న భ భ ర వ
U I I/U I U/I I I /U I I /U I I/U I U /I U
కన్నులు/వచ్చియె/ల్లెడలు/గన్గొని/వృద్ధన/రేంద్రుదా/త్మకుం

**లక్షణాలు:**

ఉత్పలమాల. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో "భ-ర-న-భ-భ-ర-వ" అనే గణాలుంటాయి. యతి: 10వ అక్షరం, ప్రాసనియమం కలదు. ప్రతి పాదంలో అక్షరాల సంఖ్య - 20.

**తరళము కొడుకు నిందును నందు రోయుచు గోరి ప్రేమభరంబునం**
**గొడుకుసద్గుణకోటి యెల్లను గోటిభంగుల నోని ను**
**గ్గడన సేయుచు సత్యవంతుని గానరే మునులార! యే**
**యడవిలోపల నంచు హాసుత! యంచు ధైర్యము డించుచున్.** (భార.ఆరణ్య 7-270)

**కవి పరిచయం:** ఈ పద్యం ఎఱ్ఱనగారిచే రచింపబడిన ఆరణ్యపర్వంలోని సావిత్ర్యుపాఖ్యానం నుండి గ్రహించబడింది.

**సందర్భం:** యముడు సావిత్రికిచ్చిన వర ప్రభావంతో ద్యుమత్సేనునికి చూపు లభించినా, కొడుకు కనిపించక తల్లడిల్లసాగాడు. ఆ సందర్భంలోనిది ఈ పద్యం.

**ప్రతిపదార్థం:**

కొడుకున్ = పుత్రుడిని (సత్యవంతుడిని)
ఇందున్ + అందున్ = ఇక్కడ అక్కడా అన్నిచోటులలో
రోయుచున్ = వెదకుతూ
కోరి = ప్రీతితో పూవి

| | | |
|---|---|---|
| ప్రేమభరంబునన్ | = | ప్రేమాతిశయంతో కలిగిన హృదయ భారంతో |
| సత్ + గుణకోటి+ఎల్లను | = | పుత్రుడియొక్క మంచి గుణగణాలనన్నింటిని |
| కోటిభంగులన్ | = | పెక్కువిధాలుగా |
| ఓలిన్ | = | వరుసగా |
| ఉగ్గడన + చేయుచున్ | = | గట్టిగా వల్లిస్తూ |
| మునులారా! | = | ఋషులార! |
| ఏ + అడవిలోపలన్ | = | ఏ అరణ్యంలోనైనా |
| సత్యవంతునిన్ | = | సత్యవంతుడిని |
| కానరే | = | చూడలేదా |
| అంచున్ | = | అని అడుగుతూ |
| హా, సుత! | = | అయ్యో కొడుకా! |
| అంచున్ | = | అంటూ |
| ధైర్యము | = | చిత్తస్థైర్యం |
| డించుచున్ | = | కోలుపోతూ |

**తాత్పర్యం:**

కొడుకును అన్వేషిస్తూ ద్యుమత్సేనుడు, ఇక్కడ అక్కడ వెదికాడు. కొడుకుపైనున్న వాత్సల్యాతిశయంచేత, కొడుకు గుణగణాలను వరుసగా ఏకరువు పెట్టి అరణ్యమంతా తిరుగుతూ అనేక రకాలుగా విలపించసాగాడు. ఓ మునులార! మీరు ఎక్కడైనా ఈ అడవిలో నా తనయుడిని చూశారా? అంటూ ధైర్యాన్ని కోల్పోయి 'ఓ కొడుకా!' – అంటూ దుఃఖించసాగాడు.

**సమాసాలు:** ప్రేమభరంబున – ప్రేమయొక్క భారతంతో (తృతీయా తత్పురుష సమాసం)
కోటిభంగులూ కోటివిధాలు (ద్విగు సమాసం)

**ఛందస్సు:**

| న | భ | ర | స | జ | జ | గ |
|---|---|---|---|---|---|---|
| I I I | U I I | U I U | I I U | I U I | I U I | U |
| కొడుకు | నిందును | నందురో | యుచుగో | రిప్రేమ | భరంబు | నం |

**లక్షణం:**

తరళము. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ప్రతిపాదంలో "న–భ–ర–స–జ–జ–గ" అనే గణాలుంటాయి. యతి 12వ అక్షరం. ప్రాసనియమం కలదు. ప్రతిపాదంలో అక్షరాలు సంఖ్య – 19.

**– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 11

# సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - ఆరణ్యపర్వం - సప్తమాశ్వాసం
## (170 నుండి 279వ పద్యం వరకు)

# సందర్భసహిత వ్యాఖ్యలు

**1. పచ్చవిలుతుకలిమియెల్లు బద్మాననయై యచ్చుపడినట్లు (7-175)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** నారదుడు, మద్రపతియైన అశ్వపతి వద్దకు వచ్చిన గోష్ఠి సంభాషణ చేస్తున్న సందర్భంలో వచ్చిన సావిత్రినుద్దేశించి కవి చెప్పిన మాటలు.

**భావం:** త్రిలోకసంచారి అయిన నారదుడు, అశ్వపతివద్దకు వచ్చి, అతిథి మర్యాదలను పొంది గోష్ఠిలో విశేషాలు చర్చిస్తున్న సందర్భంలో సావిత్రి వచ్చింది. నెచ్చెలులు సేవిస్తుండగా వచ్చిన సావిత్రి, మన్మథుని సంపద అంతా మూర్తీభవించి, పద్మముఖియైన సావిత్రిగా రూపొందినట్లు అనిపిస్తోందని కవి ఉత్ప్రేక్షించాడు.

**2. అతనియందకాని యన్యుల యందు లేదు (7-181)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** సావిత్రి తన తండ్రితో సాళ్వదేశ ప్రభువైన సత్యవంతుడే తనకు తగిన వరుడని చెప్పినప్పుడు, ఆతని గుణగణ విశేషాలు ఎలాంటివో చెప్పమని మద్రభూపతి నారదుని అడుగగా, నారదుడు సత్యవంతుని గుణగణాలను వివరించి చెప్పే సందర్భంలోనిది.

**భావం:** ఓ మద్రపతీ! సత్యాన్ని పలకటం చేత సత్యవంతుడన్న పేరు వచ్చింది. చిత్రాశ్వుడనే మరోపేరు కూడ ఉంది. తేజస్సులో సూర్యుడిని, బుద్ధిలో బృహస్పతిని, శూరత్వంలో ఇంద్రుడిని, ఓర్పులో భూమిని, కాంతిలో చంద్రుడిని, సౌందర్యంలో అశ్వినిదేవతలను, సరిపోలుతాడు. తపస్సు శమదమాదులు, దాతృత్వగుణం, బ్రాహ్మణభక్తి, మహానుభావత ఆ సత్యవంతునిలో తప్ప, ఇతరుల యందులేవు. నిజం. అని నారదుడు వివరించి చెప్పాడు.

**3. మనసును గైకొన్న భర్త మానుటు దగునే (7-183)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** సత్యవంతుడు వివాహమైన సంవత్సరానికే మరణిస్తాడని నారదుడు చెప్పినప్పుడు, తండ్రియైన మద్రపతి సావిత్రిని వారించి, సత్యవంతుని కాకుండ వేరే వరుని మనువాడమని చెప్పినప్పుడు తండ్రితో సావిత్రి చెప్పిన మాటలివి.

**భావం:** సావిత్రి తన తండ్రితో "నాన్నా! నా మాటను ఆలకించు. మనస్సు, వాక్కు, కాయరా అనే ఈ త్రికరణాలలో మనస్సు ప్రధానమైంది. కాబట్టి మనసారా వరించిన భర్తను కాదని వేరే వారిని స్వీకరించమనటం భావ్యం కాదు కదా!" అని

అన్నది. మనసులో నింపుకున్న వారిని కాదని వేరే వారిని పెండ్లి చేసుకోవటం తగదని సావిత్రి తండ్రితో నిష్కర్షగా చెప్పటం ఇందులోని తాత్పర్యం.

**4. మాకులమున కెల్ల తెప్ప (7-188)**

**(లేదా)**

**అనన్య గుణాకారులియ్యిరువురును సమంచితమూర్తుల్ (7-190)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** అశ్వపతి ద్యుమత్సేనుని వద్దకు వచ్చి, తన కుమార్తెయైన సావిత్రిని ద్యుమత్సేనుని కుమారుడైన సత్యవంతునకు ఇచ్చి వివాహం చెయ్యమని అభ్యర్థించే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** ఓ ద్యుమత్సేనా! ఈ సావిత్రి నా కూతురు. మా వంశాన్ని తరింపచేసే తెప్ప (పడవ) లాంటిది. నా మాట మన్నించి ఈమెను నీ కోడలిగా చేసికో, నీ కొడుకైన సత్యవంతునికి తగినది. నీ కొడుకు ఈమెకు సరిపోతాడు. ఈ ఇద్దరూ సాటిలేని సుగుణాలకు నెలవులు. అందచందాలతో, మూర్తిమత్వంలో ఈడుజోడు సరిపోయిన జంట వీరు.

**5. మాతోడి యిడుమకునోర్చునయ్య (7-192)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** అశ్వపతి సత్యవంతునకు తన కుమార్తెనిచ్చి వివాహం జరిపించమని అభ్యర్థించిన అశ్వపతితో ద్యుమత్సేనుడు అన్న మాటలివి.

**భావం:** ఓ అశ్వపతీ! మేము రాజ్యాన్ని కోల్పోయి, భయంకరమైన అడవులకు వచ్చి, ఈ విధంగా తపస్సు చేసికొంటున్నాము. మీ సావిత్రి చిన్న పిల్ల. పైగా సుకుమారి. మా అబ్బాయిని పరిణయమాడితే, ఈ అడవులలో మాతోపాటు ఈ కష్టాలను అనుభవించగలదా? అని ద్యుమత్సేనుడు అన్నాడు.

**6. మత్ప్రార్థను బ్రీతిగు జేకొనక యునికి పాడియెనీకున్ (7-195)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** సావిత్రిని కోడలిగ చేసికొమ్మని ద్యుమత్సేనుడిని అశ్వపతి అర్థించాడు. సుకుమారియైన సావిత్రి అడవులలో నుండి కష్టాలు అనుభవించగలదా? అన్న సందేహాన్ని వెలిబుచ్చిన ద్యుమత్సేనునితో అశ్వపతి అన్న మాటలివి.

**భావం:** ఓ ద్యుమత్సేన మహారాజా! నీతో వియ్యమందాలని మనసారా ఆశించి, నీవద్దకు వచ్చాను. నీవు నా ప్రార్థనను ప్రీతితో స్వీకరించకపోవటం నీకు న్యాయమా? అని అశ్వపతి ద్యుమత్సేనుని అర్థించెనని భావం.

**7. కారణమును మీకు నెఱుగుగా నగు బిదపన్ (7-202)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసంనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** భర్త సత్యవంతుని మరణం సమీపిస్తుందని తెలిసి నాలుగు రోజులు ముందుగా సావిత్రి త్రిరాత్రోపవాస వ్రత దీక్షపూనింది. ఆమె దీక్షకు ఆశ్చర్యపడిన ద్యుమత్సేనుడు కోడలితో 'తల్లీ! ఇలాంటి వ్రతం దేనికి పూనావని ప్రశ్నించగా సావిత్రి సమాధానం చెప్పే సందర్భంలోనిది ఈ వాక్యం.

**భావం:** నా వ్రతభారాన్ని గురించి విచారించకండి. పరమశుభాన్ని కోరే నేనీవ్రతం చేయటానికి పూనుకున్నాను. ఈ వ్రతానికి పూనుకొన్న కారణం ఏమిటో తరువాత మీకు తెలుస్తుంది. అని దమయంతి తన మామగారైన ద్యుమత్సేనునితో అన్నదని భావం.

**8. "ఇంతపట్టు చనవీ యుక్తుండ వెబ్భంగులన్" (7-209)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** అడవికి బయలుదేరిన సత్యవంతునితో సావిత్రి తాను కూడా వస్తానని అన్నది. మూడు రోజుల ఉపవాస వ్రతంతో అలసి ఉన్నావు, రావద్దని వారించిన భర్తతో సావిత్రి పలికిన మాటలివి.

**భావం:** నా మనసులో ఉపవాసపు బడలిక రవ్వంత కూడా లేదు. ఈ అడవిలో అందంగా ప్రకాశించే పూలు, చిగురుటాకులు, ఫలాలు పుట్టే లతలతో, చెట్లతో కూడి యున్నదని విన్నాను. చాలా కాలంగా చూడాలని కుతూహలంగా ఉంది. నన్ను వారించక ఈ మాత్రపు చనువునైనా నాకు ఇవ్వటానికి నీవు తగినవాడవేకదా! అని సావిత్రి భర్తతో అన్నదని తాత్పర్యం.

**9. "నిర్వికార సల్లాపమింపారనతని తెఱుగు నరయుచుండె (7-213)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** సత్యవంతునితో కలసి అరణ్యానికి వెళ్ళిన సావిత్రి వన సౌందర్యాన్ని చూస్తూనే భర్తను గమనిస్తోంది. తనకు రాబోయే విపత్తునుగురించి తెలియని సత్యవంతుడు ప్రకృతి సోయగాన్ని సావిత్రికి చూపుతున్నాడు. మీదికి రాబోతున్న ఆపద సావిత్రికి తెలుసు. ఆ సందర్భంలో సావిత్రి వర్తనను తెలియపరుస్తూ చెప్పిన వాక్యమిది.

**భావం:** కమనీయమైన సరోవరాల కెరటాల క్రమంలో తేలియాడే రాజహంసల కదలికలలోని అందాన్ని, పూలతో, చిగురాకులతో రంగురంగులతో శోభిల్లే తీగలను, చెట్లనూ, మకరందాన్ని త్రాగి మత్తెక్కి విహరించే కొదమ తుమ్మెదల ఝుంకారాలున్నూ, పరిపక్వమైన పండ్లలోని గుజ్జును, రసాన్ని త్రాగి పలికే రాజిలుకల పలుకుల రవాళ్ళీ విడివిడిగా చూపించి, వివరిస్తూ సత్యవంతుడు సావిత్రితో సాగిపోతున్నాడు. చిగురాకువంటి సుకుమార శరీరంగల సావిత్రి, సత్యవంతుడు చూపించే దృశ్యాలను చూస్తూ, చెప్పే మాటల్ని వింటూ, ఏ వికారమూలేని సల్లాపాలతో తెలియకుండానే అతని తీరుతెన్నుల్ని పరిశీలిస్తూనే ఉంది - అని దీని తాత్పర్యం.

**10. "ప్రాదేశ పరిమితాత్ముడగుచు బ్రజ్వరిల్లు జీవు వెడలుదిగిచి" (7-219)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** యముడు, సత్యవంతుని ప్రాణాలను తీసికొని పోయే సందర్భంలోనిది.

**భావం:** యమధర్మరాజు, సత్యవంతుని శరీరంలోప్రాదేశ పరిమితిగల ఆకారంతో ప్రకాశించే జీవాత్మను బయటికి వచ్చేలా లాగి, వెంటనే భయాన్ని కలిగించే తన పాశంతో బంధించాడని భావం. 'ప్రాదేశ పరిమితి' - అంటే చూపుడు వ్రేలు, బొటనవ్రేలు చూపగాపైన నడిమి కొలతగల ఆకారం. దేహంలో వెలిగే జీవాత్మ పరిమాణం ఇది.

**11. నా కరుగరానిచోటుంగలదే (7-222)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** తన పతిప్రాణాలను తీసికొని వెళ్లిపోతున్న యమధర్మరాజును వెన్నంటి వస్తున్న సావిత్రిని చూచి ఆశ్చర్యంతో యముడు 'ఎందుకిలా వెంటపడి వస్తున్నాను. ఈదారి అగమ్యమైనది. వెనుదిరిగి పొమ్మన్నప్పుడు సావిత్రి సమాధానం చెప్పే సందర్భంలోనిది.

**భావం:** ఓ యమధర్మరాజా! భర్తలు ఎక్కడికి పోతే అక్కడికి భార్యలు పోవాలి కదా! నీ దయవలన, భర్తపైగల భక్తి వలన నేను వెళ్లకూడని స్థలం ఉన్నదా? అని సావిత్రి యమధర్మరాజుతో అన్నదని భావం.

**12. సకల మార్గంబుల యందును ధర్మమార్గంబు ప్రధానంబు (7-223)**

**(లేదా)**

**సజ్జన సందర్శనంబెప్పుడు వృథగాదు (7-223)**

**(లేదా)**

**రిత్తజనంబులతెఱుంగుననూఱకయెట్లుమగుడుదు (7-223)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** పతి ప్రాణాలను తీసికొని వెళుతున్న యముని వెంటపడిపోతున్న సావిత్రిని చూచి, వారించాలని ప్రయత్నించిన యమునితో సావిత్రి పలికిన పలుకులివి.

**భావం:** ఓ యమధర్మరాజా! అన్ని మార్గాలలో ధర్మమార్గమే ప్రధానమైనది. అటువంటి ధర్మానికి ఆధారం సజ్జనులేనని ధర్మశాస్త్రాలు తెలిసిన పెద్దలు చెపుతారు. సజ్జనుల సందర్శనం ఎప్పుడూ వ్యర్థంకాదు. కాబట్టి సజ్జనులలో శ్రేష్ఠుడవైన నీ దర్శనంవలన పరమశుభాలను పొందకుండ వట్టిచేతులతో వ్యర్థమానవులవలే ఎలా వెళతాను. అని సావిత్రి ధర్మరాజుతో పలికిందని భావం.

**13. వెలసితివి నీవు ధర్మదేవతవనగాన్ (7-229)**

**(లేదా)**

**ధర్మగతులతెఱగెల్ల భవద్భావాధీనము (7-229)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** వెంటబడి వస్తున్న సావిత్రికి వరమిచ్చి వెనుకకు పంపించాలని భావించి యముడు వరము కోరుకొమ్మనగా తన మామగారైన ద్యుమత్సేనునికి దృష్టిప్రసాదించమని సావిత్రికోరుకొంది.

**భావం:** యమధర్మరాజును వదలక వెంబడిస్తూ సావిత్రి ఆర్యధర్మాలను వివరించింది. ఆపైన దేవతాశ్రేష్ఠుడవైన ఓ యమధర్మరాజా! నీకు తెలియని ధర్మమేమున్నది. ధర్మం, దానిమార్గం, అదినడచే తీరు అన్నీ నీ భావంలోనే ఉన్నాయి. అంటే నీ సంకల్పాధీనమై ఉన్నాయి. అందుకేనీకు ధర్మదేవత అనేపేరు సిద్ధించింది. - అని యముడిని కీర్తించింది.

**14. తృషితుడగు వాని శీతల తుషారతోయములు మోదితునిజేయుగతిన్ (7-233)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** పతిప్రాణాలకోసం వెంటాడి వస్తున్న సావిత్రికి, పతిప్రాణం వినా వరాలిచ్చిపంపాలని యత్నించిన యముడిని వదలక వెంటాడివస్తూ యమధర్మరాజును ప్రస్తుతించింది. ఆప్రస్తుతికి ప్రత్యుత్తరంగా యముడు అన్న మాటలివి.

**భావం:** దప్పిగొన్నవాడికి చల్లని మంచినీళ్లు సంతోషాన్ని కలిగించినట్లుగా, పాపాలను హరించే నీ మాటలు సందర్భశుద్ధితో నాకు ఆత్మతృప్తిని కలిగించాయి. అని యముడు సావిత్రితో అన్నాడు.

**15. మోహోర్మ్ములుదాపము బుట్టవు ధార్మిక హృదయములన్ (7-237)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** వలదని వారించి వెనుదిరిగిపొమ్మని చెప్పి యముడు సావిత్రికి పతిప్రాణాలు తప్ప కోరిన కోరికలను తీర్చాడు. చోరరాని చోటిది, రాతగదని హెచ్చరించాడు. ఆ సందర్భంలో సావిత్రి యమునితో అన్నమాటలవి.

**భావం:** సావిత్రి యమునితో 'ఓ ధర్మరాజా! ధర్మాత్ములైనవారు, తాము చేసే ధార్మికమైన క్రియలను ఎటువంటి దశలోను విడనాడరు. ధర్మాన్ని ఆచరించే వారి మనస్సులో పరితాపం, భ్రాంతి అనే కెరటాలు పుట్టవు' - అని ధార్మిక బుద్ధిని గురించి వివరించింది.

**16. సతులకు నన్యమెట్టిదియును ధర్మమె భర్తృ సంశ్రయముగాక (7-241)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** వెన్నంటి వస్తున్న సావిత్రికి రెండు వరాలిచ్చి వెనుదిరిగి పొమ్మని చెపుతూ 'నీవు చాలా దూరం వచ్చావు. బాగా అలసిపోయి యుంటావు. ఇక వెనుదిరిగి పోవటం మంచిద'ని అన్నాడు. అప్పుడు సావిత్రి యమునితో అన్న మాటలివి.

**భావం:** ఓ యమధర్మరాజా! నాకు అలసట ఎక్కడిది? నా మనస్సు నా భర్త పాద పద్మాలయందే ఆసక్తిగలిగి, మిక్కిలి భక్తితో అలరారుతున్నది. పతివ్రతలకు ఎన్ని వరాలనిచ్చినప్పటికీ అవి మగని అండతో సమానమైనది కాదు. సతికి భర్తను ఆశ్రయించి ఉండటమే పరమధర్మం- అని సావిత్రి చెప్పటం ఇందులోని తాత్పర్యం.

**17. నీకు నేను జుట్టమనని చెప్పనేల వేఱ (7-246)**

**(లేదా)**

**మిత్రమనోరథంబవశ్యకర్తవ్యంబుగా జిత్తగింపుము (7-247)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** రెండువరాలు పొంది వెనుదిరుగకుండా యముని అనుసరించి పోతున్న సావిత్రి, యముని అనుగ్రహించమని వేడుకొంటూ అన్నమాటలివి.

**భావం:** 'సఖ్యం సాప్తపదీనమ్'' అన్నట్లు ఏడు మాటలు మాట్లాడితే, ఎటువంటివారైనా పూజ్యులైన పెద్దలకు చుట్టాలే అవుతారు. అటువంటప్పుడు నేను నీతో చాలాసేపు సంభాషణ కొనసాగించాను. కాబట్టి నేను నీకు చుట్టాన్నే అవుతాను. అందుచేతమిత్రమనోరథాన్ని తీర్చటం తప్పనిసరికార్యం. కాబట్టి నాభర్తను బ్రతికించమంటూ సావిత్రి యముని పట్టు పట్టటం ఇందులోని తాత్పర్యం.

**18. కన్నులు లేని యట్లతడుగానక యేడ్చె సతీసమేతుడై (7-269)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** యముని వర ప్రభావం వలన ద్యుమత్సేనునికి దృష్టిలభించింది. తన ఆత్మకు కళ్లయి నిలచిన కొడుకు కనిపించకపోయే సరికి దుఃఖిస్తూ అన్న మాటలివి.

**భావం:** ద్యుమత్సేనుడికి చూపు లభించింది. ఆ చూపుతో అన్ని వైపులా చూచి, తన అంతరాత్మకు నేత్రాల వంటివాడైన ప్రియపుత్రుడు అడవిలోకి పోయి ఎప్పుడూ లేనంతసేపు ఎందుకు ఉన్నాడో తెలియక ఆర్తితో, కళ్లులేనివానిలాగే సతీసమేతుడై కన్నకొడుకు కనబడనందుకు విలపించాడు. కళ్లువచ్చినందుకు పొందవలసిన ఆనందం కంటే, కొడుకు కనిపించని దుఃఖమే ఆతనిని గుడ్డివానిలా అనిపింపచేశాయి. అందుకే భార్యతో కలసి గుడ్డివాడిలా విలపించాడు.

**19. నీ పుణ్యచరిత్రముకీర్తనీయము తల్లీ! (7-274)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** యముని వెంటబడి పతిప్రాణాలను కాపాడి తెచ్చుకోవటంతోపాటు, అత్తమామలకు చూపును, పోయిన రాజ్యాన్ని, అశ్వపతికి సంతానలాభాన్ని వరంగా పొందింది. ఆ విషయం తెలిసిన అత్తమామలు సావిత్రిని అభినందిస్తూ అన్న మాటలివి.

**భావం:** తల్లీ! సావిత్రీ! నీపుణ్యచరిత్ర కీర్తించదగింది. ఆపత్సముద్రంలో మునిగి నశించిపోయే మా వంశాన్ని తెప్పవయి ఒడ్డుకు చేర్చి వృద్ధిచేశావు. నీవు ప్రశంసార్హులవు అని భావం.

**20. భద్రగజమునెక్కి వేగకదలు మింక (7-276) (లేదా)**
**మా కన్నులు చల్లనయ్యెమా భాగ్యమునన్ (7-277)**

**కవిపరిచయం:** ఈ వాక్యం ఎఱ్ఱన గారిచే రచింపబడిన ఆంధ్రమహాభారతం, ఆరణ్యపర్వంలోని సప్తమాశ్వాసనుండి గ్రహించబడిన సావిత్ర్యుపాఖ్యానంలోనిది.

**సందర్భం:** యమధర్మరాజు సావిత్రికి యిచ్చిన వరప్రభావం వలన ద్యుమత్సేనునికి కోల్పోయిన రాజ్యము, చూపులభించాయి. అప్పుడు ద్యుమత్సేన మహారాజుగారి ఆంతరంగిక సచివులు, సేవకులు, పురజనులువచ్చి రాజ్యానికి ఆహ్వానిస్తూ అన్న మాటలివి.

**భావం:** ద్యుమత్సేనుని రాజ్యానికి వచ్చి పట్టాభిషిక్తుడవు కమ్మని ఆహ్వానిస్తూ పురజనులు, మంత్రులు సేవకులు 'ఓ రాజా! మిత్రభేదంవలన నీ శత్రువు బంధువర్గంతో సహా మరణించాడు. సమస్త జనమూ ఏకమనస్కతతో నీకు రాజ్య పట్టాభిషేకం చేయటానికి సంసిద్ధులైవచ్చారు. నీ జయఘోష భూమండలమంతా వ్యాపించింది. ఇక పట్టపుటేనుగునెక్కి వేగంగా బయలుదేరు. నీతపోమహిమవలన దృష్టిలభించింది. మా అదృష్టం కొద్దీ చూపు లభించిన నిన్ను చూసి మాకళ్లుకూడా చల్లబడ్డాయి అని రాజ్యానికి ఆహ్వానిస్తూ ద్యుమత్సేనునితో అన్నారు.

**- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 12

# సావిత్ర్యుపాఖ్యానం - ఎఱ్ఱన

## శ్రీ మదాంధ్ర మహాభారతం - ఆరణ్యపర్వం - సప్తమాశ్వాసం (170 నుండి 279వ పద్యం వరకు)

## వ్యాసరూప వ్యాఖ్యలు

**1) ఎఱ్ఱనగారు చిత్రించిన సత్యవంతుని పాత్రను గురించి వివరించండి.**

సత్యవంతుడు సాళ్వదేశాధిపతియైన ద్యుమత్సేనుని ఏకైక సంతానం. రూపవంతుడు, సార్థకనామధేయుడైన సత్యశీలుడు. ఉదాత్త హృదయ సంపన్నుడు. వృద్ధులయి గ్రుడ్డివారయిన తన తల్లిదండ్రులతో కన్నవారి ఆత్మకుతానే నేత్రాలయిన ఉత్తమపుత్రుడు. రాజ్యాన్ని కోల్పోయిన తల్లిదండ్రులతోపాటే తానూ అడవిలో జీవిస్తూ సాధుజనసేవతో కాలాన్ని గడిపిన స్వాదువర్తనుడు. తల్లిదండ్రుల అనురాగాన్ని పరిపూర్ణంగా చూరకొన్న అదృష్టవంతుడు.

సత్యవంతుని గుణగణాలను, సౌందర్యాన్ని గురించి విన్న సావిత్రి తనమనసును సత్యవంతునికే అర్పించింది. వరాన్వేషణలోనున్న తండ్రికి ఇదే విషయాన్ని వివరించింది. తనకూతురు వరించిన సత్యవంతుని గుణగణాలు ఎలాంటివో తెలిసికోనెంచి అశ్వపతి, నారదునితో ప్రస్తావించగా, నారదుడు సత్యవంతుని గురించి ఇలా చెపుతాడు.

**సీ॥ "సత్యంబు పలుకుట సత్యవంతుండన**
**నతడొప్పు; మఱియుఁజిత్రాశ్వుడనుగ**
**నామాంతరంబు నన్నరనాథుసుతునకు**
**గలదు; తేజంబునుగదులమిత్త్రు**
**బుద్ధినింద్రాచార్యుఁబురుడించు; శూరత**
**వాసవు దాలిమి వసుధ బోల్తు;**
**గాంతిఁజంద్రునకెనగుఁదగు; రూపున**
**నాశ్వినేయుల సరియనుదలిర్చు;**

**ఆ.వె. దపముశమముదమము దానంబు బ్రాహ్మణ**
**భక్తియును మహానుభావతయును**
**నతని యందకాని యన్యులయందులే**
**దింతనిక్కువముమహీతలేశ! (7-181)**

సత్యాన్ని పలకటంచేత సత్యవంతుడన్న సార్థక నామధేయం ఏర్పడిందని, చిత్రాశ్వుడనే మరొకపేరు ఉన్నదని, తేజస్సులో సూర్యుడని, బుద్ధిబృహస్పతిని, పరాక్రమంలో ఇంద్రుడిని, ఓర్పులో భూదేవిని, కాంతిలో చంద్రుడిని, అందచందాలలో అశ్వినేయులను తలపిస్తాడు, తపస్సు, అంతరింద్రియ నిగ్రహం, బాహ్యేంద్రియనిగ్రహం, త్యాగంతోకూడిన పరోపకారశీలత్వం, బ్రాహ్మణభక్తి, ప్రభావశీలత్వంతోకూడిన వ్యక్తిత్వం సత్యవంతునిలో మాత్రమే కనిపిస్తాయని నారదుడు చెపుతాడు.

ఇటువంటి ఉత్తమగుణశోభితుడైన సత్యవంతుడు వివాహమైన ఒక సంవత్సరానికే మరణిస్తాడని ఇది విధిలిఖితమని నారదుడు వివరిస్తాడు.

సత్యవంతుడు పెద్దల పట్ల అత్యంత గౌరవం గలవాడు. సావిత్రి సత్యవంతుడిని వలచిందని, అశ్వపతి వచ్చిద్యుమత్సేనుని ఒప్పించి సంబంధాన్ని స్థిరపరుస్తాడు. తన వివాహ విషయంలో పెద్దల నిర్ణయాన్నే గౌరవించినట్లుగా కనిపిస్తాడు. పైగా తమ నిరుపేద స్థితికి ఏమాత్రం సంశయించకుండ అశ్వపతి పిలిచి పిల్లనిస్తామనటం అత్యంత గౌరవార్హమైన విషయం కదా!

వివాహానంతరం సతిసేవల్ని పొందుతూ తల్లిదండ్రులసేవతో జీవితాన్ని గడిపాడు. ఆశ్రమానికి అవసరమైన సమిధల్ని ఫలాల్ని సమకూర్చటం, తపస్స్వాధ్యాయవిధులపట్ల ఏమరకుండా కాలంగడిపాడు. సావిత్రి రూపంలో ఆతనికి అదృష్టం వరించింది. సత్యవంతుడు ప్రకృతి ప్రేమికుడు. భార్య తనతోపాటే వనానికి వచ్చినప్పుడు ప్రకృతి దృశ్యాలను విడమరచి వివరిస్తాడు. ఆ చెప్పటంలో సత్యవంతుని సౌందర్యాలాలసత్వం విశదమవుతుంది.

**సీ॥ "కమనీయకమలినీకల్లోల వీథులు**
**గదలురాయంచలగతుల యొప్పు,**
**బహుపుష్పపల్లవ ప్రకార చిత్రితములై**
**తనరారు తరులతా తతులసొంపు,**
**మకరందరసపాన మదలిలోలంబులై**
**క్రాలెడి యెలదేటి గములయువిపు**
**బరిపక్వమంజుల ఫలరసోద్ధతములై**
**పలుకురా చిలుకల పటురవంబు**

**ఆ.వె. బ్రియుడు వేఱువేఱ బ్రీతిమై జూపుచు**
**జెప్పుచును జనంగు జిగురుబోడి**
**గనుచు వినుచు నిర్వికార సల్లాపమిం**
**పారనతని తెఱుగు నరయుచుండె."** (7-213)

సరోవరకెరటాలలో తేలేరాజహంసల నడలతీరు, పూలు, చిగుళ్లతో శోభిల్లే తీగల సొగసు, మదించిన కొదమ తుమ్మెదల ఝుంకారం, చిలుకల కలకలరావాలూ వీటన్నింటినీ వివరంగా చెపుతుంటే, సావిత్రి ఆలకిస్తూ చూస్తున్నది. ఈ సందర్భంలో సావిత్రి నిర్వికార సల్లాపంచేస్తోంది. ఆమె తన ప్రాణరక్షణకోసం వచ్చిందని అతనికి తెలియదు. సావిత్రి త్రిరాత్రోపవాసదీక్ష తీసికొనటం, అడవికి తనతోరావటం ఇవన్నీ సాధారణ విషయాలుగానే భావించాడు గాని తనకోసమేనని ఊహించలేని అమాయకత్వం సత్యవంతునిది. తన మరణపు విషయం తెలియనందునే వీటినేమీ పట్టించుకోలేదు.

సత్యవంతుడు అడవిలో పండ్లు కోసి బుట్టను నింపి, సమిధల కోసం గొడ్డలితో కట్టెల్ని కొడుతూ అలసట చెంది, గొడ్డలిని నేలపై విసరివేశాడు. నిట్టూర్పులతో, విషాదంతో సావిత్రివైపు చూచి శరీరం స్వాధీనంలో లేదు. మనస్సు ఏదో భ్రమ చెందినట్లు తూలుతోంది. బల్లేలతో ప్రాణాలతో పొడిచినట్లు తలపోటు పుడుతున్నది. అలసటగా ఉంది. ఇక కొంచెం సేపైనా నిలువలేను అని అనగానే సావిత్రి తన మృదువైన హస్తాలతో తన అంకతలాన్ని భర్తకు తలగడగా చేసింది. సత్యవంతుడు తిన్నగా ఆమె తొడలపై వాలి, వివశుడై, చైతన్యరహితుడయ్యాడు. ఇలా మృత్యువు అనుభవాన్ని చవిచూసినవాడు సత్యవంతుడు.

యముడు సత్యవంతుని ప్రాణాన్ని తీసుకుపోవటానికై, స్వయంగా వచ్చాడు. యమభటులనెవరినోపంపక తానే రావటంలోని ఆంతర్యాన్ని సావిత్రితో యముడు చెపుతూ -

"వీడు మహాపుణ్యనిధిగాన యితరులు బనుపక యేనవీని గ్రచ్చుఱుగొనిపోవగా జనుదెంచితి" - నని చెపుతాడు. దీనిని బట్టి సత్యవంతుని పుణ్యశీలం విశదమవుతుంది. సావిత్రి చైతన్యహీనమైన సత్యవంతుని పార్థివదేహాన్ని జాగ్రత్తపరచి యమధర్మరాజును అనుసరించింది.

సత్యవంతుడిని పునర్జీవితుని చేస్తూ యముడు అన్న మాటలను చూడండి. అవన్నీ తరువాతి కాలంలో సత్యవంతుని గుణశీలాదుల్ని వ్యంజింపచేసే విశేషణాలే. చూడండి.

చ॥ **కొనుమిదె నీమనఃప్రియుని గోమలి! మీదు చతుశ్శతాబ్దముల్**
**మనునిటమీదు; బుత్త్రులు గ్రమంబున నూర్వురుగాంచు; గీర్తివ**
**ర్ధనుడగు; సంతతాధ్వరవితానములం బరితుష్టి సేయున**
**య్యనిమిషకోటికెల్లను; నిజాన్వయమౌళి విభూషణంబగున్** (7-251)

పేరు ప్రతిష్ఠలు సంపాదించి, యజ్ఞయాగాదులు నిర్వహించి దేవతాప్రీతి కావించగలడని, వంశశ్రేష్ఠుడవుతాడని చెపుతాడు.

లోకంలో మృత్యువు అనుభవం పొంది పరలోకగతులైన వారేగాని వెనుదిరిగివచ్చినవారు లేరు. సత్యవంతుడే అటువంటి అనుభవాన్ని మూటగట్టుకున్నవాడు. మార్కండేయుడికి ఆ అనుభవమే లేకుండా ఈశ్వరుడు యముడిని దండించి పంపించివేశాడు. మృత్యుఅనుభవాన్ని ఒక నిద్రగానే సత్యవంతుడు వ్యక్తీకరించాడు. తాను మృత్యువు పాలయ్యానన్న స్పృహే లేనందున 'ఇంతసేపు నిద్రపోతుంటే లేపవద్దా? ఎవరో నన్ను వేగంగా లాక్కుపోతున్నట్లు అనిపించిందని', అది కలగాదు, నిక్కవమయైనటులున్నది; నాకు నెంతయున్ మది వెఱపుట్టె" – అని తన అనుభవాన్ని భార్యతో చెపుతాడు. ఈ సందర్భంలో సత్యవంతుని చేష్టలు ఖేదంతో ఉండటాన్ని గమనించి, అతని మనసును సావిత్రి మళ్లిస్తుంది.

సత్యవంతునికి తల్లిదండ్రులపట్ల ఎనలేని విడదీయరాని ప్రేమ ఉంది. అందుకే పునర్జీవితుడయ్యాక, నా తల్లిదండ్రులను చూడకుండా ఈవనంలో నేనెలా ఉండగలను. ఎప్పుడూ ఇంతసేపు వాళ్లను ఎడబాసి ఉండలేదు. ఇప్పుడు వాళ్లెలా దుఃఖపడుతున్నారోనంటూ తలపోస్తాడు. ఇరుసంధ్యలలో ఇల్లు వెడలనీయని తల్లిని తలచి దుఃఖిస్తాడు.

సీ॥ **"కౌగిట ననుజక్కగదియించి శిరము మూ**
**ర్కొంచును బాష్పముల్ గురియుచుండు**
**బట్టిమాయొడలులు బ్రాణంబులును నెల్ల**
**యర్థముల్ నీవ; మాయన్న! నీవు**
**దెప్పగా సంసార తీరంబు సేరెద**
**మని తలంచెదము సుమ్మన్న! యన్న**
**కన్నులు లేని మాకన్నులుగాళులు**
**నీవకదన్న మా నిఖిలవంశ**

తే.గీ. **మును సముద్ధరించు మోపు నీయదియ క**
**దన్న! యనుచునిట్టులగ్గలంపు**
**బ్రేమ ననుదినంబు బ్రేముడింతురువృద్ధు**
**లక్కటకట! యేమియైరొనేడు?" (7-262)**

అంటూ విలపిస్తాడు. ఆ తల్లిదండ్రులకు పంచప్రాణాలై వారి ఆత్మలకు నేత్రాలై, ఆశలకు మూలమై కళ్లు కాళ్లుగా జీవించటం తల్లిదండ్రుల తపఃఫలమే కదా! సత్యవంతుడు అలాంటి ధన్యజీవి. అందుకే కళ్లువచ్చిన ద్యుమత్సేనుడు కూడా తమ ఆత్మలకు కళ్లవంటి సత్యవంతుడు కనిపించకపోయేసరికి భార్యాసహితుడై విలపించి, అన్వేషించాడు. ఇది కేవల పితాపుత్ర సంబంధమే కాదు. తమ పంచప్రాణాలతో కొడుకుపట్ల పెంచుకున్న అనుబంధం, ఆర్ద్ర భావం. చివరికాదుఃఖం నుండి సావిత్రే సత్యవంతుడిని అనునయించి లేవనెత్తుతుంది. భార్యతో కలసి ఆశ్రమం చేరి అందరికీ ఆనందాన్ని సమకూరుస్తాడు.

చివరికి తండ్రితో కలసి గజారూఢుడై రాజ్యానికి చేరి యువరాజ్యపట్టాభిషేకాన్ని పొందుతాడు.

ఇలా ద్యుమత్సేన మహారాజు తనయునిగా, సావిత్రి భర్తగా లబ్ధప్రతిష్ఠుడైనట్లు కనిపించినా తనదైన గుణగరిమ, సత్యవాక్పాలన, తల్లిదండ్రులపట్లగల ప్రేమ, భార్యానురాగం ఇవన్నీ మూర్తీభవించిన వ్యక్తిత్వం కాబట్టే అందరి అనుగ్రహాన్ని పొందాడు. తండ్రివలన రాజ్యలాభం, సావిత్రివలన చిరాయువు పొంది యశోవిశాలుడయ్యాడు. మూర్తీభవించిన సత్యమే సత్యవంతుడని ప్రతీకార్థం.

**2) ఎఱ్ఱనగారు చిత్రించిన సావిత్రీదేవి పాత్రను వివరించండి.**

భారతీయ వాఙ్మయంలోనే సావిత్రి పాత్ర విశిష్టమైంది. ఈ సావిత్రికథనే అరవిందుడు ఆంగ్లంలో మహాకావ్యంగారాశాడు. ప్రపంచ సాహిత్యంలోనే సావిత్రికథ ఆధ్యాత్మికేతిహాసంగా ప్రసిద్ధికెక్కింది. భారతంలో కామ్యకవనంలోనున్న ధర్మరాజుకు మార్కండేయుడు వినిపించిన కథయిది.

**సావిత్రీ వరప్రసాదిత**

సావిత్రీ దేవి వరప్రసాదంతో మద్రపతికి జన్మించిన కుమార్తె సావిత్రి. అశ్వపతి సంతానంకోసం తపస్సు చేసి సావిత్రీ దేవిని ఉపాసించగా, దేవి ప్రత్యక్షమై వరంకోరుకొమ్మనగా 'కొడుకునిమ్మ'ని అశ్వపతి అభ్యర్థించాడు. అప్పుడు 'నీ కోరికను ఇంతకు పూర్వమే బ్రహ్మకు తెలుపగా ఆయన నీకు పుత్రికనే అనుగ్రహించే నిర్ణయించాడు. అయితే ఆమె వలననే నీ వంశం ఉద్ధరించబడి, ఒకానొక సన్నివేశం ఏర్పడి నూర్గురు సంతానం కలుగుతుందని వరమిచ్చింది. పిదప మాళివి గర్భవాసాన సావిత్రి జన్మించింది.

**అతిలోక సౌందర్యరాశి**

సావిత్రి అతిలోక సౌందర్యవతి. సిద్ధసాధ్యయక్ష దేవతాకన్యకలందరినీ జయించిన సౌందర్యరాశి. మన్మథుని సిరిసంపద అంతాకలసిమూర్తీభవించినట్లున్న సౌందర్యరాశి. అటువంటి అపురూపసౌందర్యవతి కాబట్టే నీ రూపానికి గుణాలకు తగిన వరుని ఎంచుకొమ్మని తండ్రిసైతం కుమార్తె అభీష్టాన్నే గౌరవించాడు.

**ముగ్ధమనస్క**

సావిత్రి ముగ్ధమనస్కురాలు. సాళ్వదేశాధిపతియైన ద్యుమత్సేనుడి కొడుకైన సత్యవంతుడు అందగాడని, సుగుణవంతుడని తెలిసి మనసిచ్చింది. అయినప్పటికి స్త్రీ సహజమైన లజ్జతో, ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. నారదుడు మద్రపతి వద్దకువచ్చినప్పుడు సావిత్రిని చూచి వివాహప్రస్తావనతేగా, తండ్రి సావిత్రిని నచ్చిన వరుని ఎన్నుకొమ్మని చెప్పాడు. అప్పుడు కూడా సావిత్రి తనమనసులోని మాటను చెప్పటానికి కొంత సిగ్గుపడింది. ఆ పిదపనే తండ్రికి మనసులోని మాటను చెప్పింది.

**మనసుకు విలువనిచ్చే వ్యక్తిత్వం**

సత్యవంతునికి మనసునిచ్చానని ఆతని తండ్రి రాజ్యాన్ని కోల్పోయి, గుడ్డివాడయి భార్యాబిడ్డలతో అడవులుపట్టి యున్నాడని అయినప్పటికీ ఆతనినే వివాహం చేసుకుంటానని నిష్కర్షగా చెప్పింది. మద్రేశ్వరుని కోరిక మేరకు నారదుడు సత్యవంతుని గుణశీలాదుల్ని పేర్కొని, వివాహమైన సంవత్సరానికే మరణిస్తాడని చెప్పాడు. అప్పుడు తండ్రి 'తల్లీ! నీకు ఇలాంటి వరుడు దేనికి? మరొకని వరించమని చెప్పగా 'మనో వాక్కాయాలలో మనస్సు ముఖ్యమైంది. కాబట్టి మనసారా వరించిన మగడిని వదిలివేయటం కుదరని పని. సత్యవంతుడెటువంటివాడైనా, నేను వేరేవాళ్లను వరించనని నిష్కర్షగా చెప్పింది. అందువలననే నారదుడు మద్రపతికి నచ్చచెప్పాడు. అంతేకాకుండ

చ॥ **"గౌనముల(ప్రోకనీయనుగుగూతురు; దీని తలంపుమాన్పుగా**
**మనకు నశక్యమింక ననుమానములేల? నరేంద్ర! కూతు జ**
**య్యన నృపసూతికిమ్ము; కమలాసన చేసిన పుణ్యగౌరవం**
**బునయినం బ్రియుండు పరిపూర్ణ చిరాయురుపేతుడయ్యెడున్"**

సావిత్రి పుణ్యఫలంవలనయినా ఆమె భర్తకు నిండు ఆయుర్దాయం లభించగలదని చెప్పాడు.

**పతివ్రత**

సావిత్రి, పతిని అనుసరించటమే ధ్యేయంగా గలది. వివాహమైన తరువాత తన పుట్టింటివారు తనకు, భర్తకు వివిధ వస్త్రాలు, ఆభరణాలు కానుకగా ఇచ్చినప్పటికీ, వాటిని పరిత్యజించి భర్తృశుశ్రూషతోనే గడుపుతూ, అడవిలో అత్తమామలతో కలసి జీవించటానికి అనువయిన నారవస్త్రాలనే ధరించింది. ప్రతిదినమూ భర్త ఆయువునే లెక్కిస్తూ అతని వెన్నంటి నడచింది. చివరిరోజున కూడ ఉపవాసవ్రతదీక్షతో నీరసంగా నున్నప్పటికీ భర్తతోపాటే అడవికి పోయింది. మరణంలోనూ పతినే అనుసరించి యముని వెన్నంటి పతిని తెచ్చుకున్న సతీమతల్లి సావిత్రి. సావిత్రి యోగినిలా, సిద్ధురాలిగా వెన్నంటి రావటం గమనించి యముడు వారించబోగా, యమునితో –

క. **"పతులెందు జనిన నచటికి**
**సతులుంజనవలదె? నీప్రసాదమునను మ**
**త్పతి భక్తికతమునను సం**
**స్తుతగుణ! నాకరుగరాని చోటు గలదే" (7-220)** అని అంటుంది. పతివ్రతశక్తి ఏపాటిదో చెప్పటమిది.

**పుణ్యాచరణశీల**

అడవిలో నారచీరలు ధరించి పవిత్రజీవనం చేయటమే కాకుండా, భర్త ఆయువు తీరటానికి నాలుగురోజులున్నదని తెలిసి త్రిరాత్రోపవాసదీక్షను స్వీకరించింది. ఇలా దుస్తరమైన వ్రతందేనికి? అని అత్తమామలువారించినా, వినయంతోనే వాళ్లకు సమాధానం చెప్పింది.

**పెద్దలపట్ల గౌరవం**

పుట్టింటిలోనున్నా, అత్తవారింటిలోనున్నా పెద్దలయెడ వినయశీలంతో వర్తించటం సావిత్రి సుగుణాలలో ఒకటి. అందువలనే కన్న తండ్రి, 'మాకులమునకెల్ల తెప్ప' అని అన్నాడు. అడవికి భర్తతో వెళ్లటానికి కూడ అత్తమామల అనుమతిని పొందింది. వాస్తవానికి భర్త అనుమతించాడు. చాలులెమ్మని అనుకోకుండా అత్తమామల అనుమతిని కూడా పొందింది. భర్తపునర్జీవితుడయ్యాక కూడ వృద్ధులైన అత్తమామలు మనకోసం వెతుకుతూ ఇబ్బంది పడుతుంటారు, వెంటనే వెళ్లిపోదామని భర్తతో చెపుతుంది.

**సంభాషణా చతుర**

సావిత్రి వాక్చాతుర్యం అమోఘమైనది. సత్యవంతుని వివాహమాడే విషయంలో తల్లిదండ్రుల్ని ఒప్పించే సందర్భంలోగాని, త్రిరాత్రోపవాస వ్రతానికి అత్తమామల్ని అంగీకరింపచేసే విషయంలోగాని, భర్తతో కలసి అడవికి వెళ్లే విషయంలో భర్తను అత్తమామలను ఒప్పించే విషయంలోగాని, సావిత్రి వినయగర్భితమైన చతురతతో మాట్లాడి సానుకూలతను సాధించుకుంది. ఇక యముని వెంటబడి పోయేటప్పుడు యముని మెప్పించేవిధంగా సంభాషించి తన భర్త ప్రాణాలను వెనుకకు తెచ్చుకోగలిగిన వాక్చాతుర్యమేయిది.

యముడుకూడ సావిత్రి మాటలకు ఆశ్చర్యపడ్డాడు. అంతేకాదు

ఆ॥వె॥ **తనులతాంగి! భవదుదార వాగ్భంగికి**
**మెచ్చువచ్చెనాత్మ; నిచ్చువాడ**
**వేడు మొక్కవరము విభునిజీవితమొక్క**
**టియును దక్కనేదియయిననొండు**

సావిత్రిమాటలు, తన మనసును అలరించాయని వరాన్ని కోరుకొమ్మంటాడు. సావిత్రిమాటలకు యముడు దప్పిగొన్నవాడికి చల్లని మంచినీళ్లు సంతోషపరిచినట్లుగా ఉందనటం ఆమె సంభాషణా వైశిష్ట్యాన్ని తెలుపుతాయి.

**ధర్మమెరిగిన ధార్మికురాలు**

సావిత్రి ధర్మపద్ధతిని తెలిసిన యువతి. అందుకే యముని సంభాషణలో పతిధర్మాన్నే కాదు, ఆర్య ధర్మనియతని కూడ ప్రస్తావించిన ధార్మికశీలం సావిత్రిది.

చ॥ **ఎడపకవాఙ్మన క్రియల నేరికి హింసయొనర్పుబూన; రె**
**య్యెడలను దీనులంగరుణ యేర్పడు బోమగు జూతు; రిచ్చుచో**
**గడమతడంగ నీకెదిరికాంక్షితముల్ దుదిముట్టుదీర్తు; రె**
**క్కుడుమది గూర్తురాశ్రితులకున్; వినుమిన్నియునార్యధర్మముల్"**

అని యమునితో సంభాషిస్తూ ఆర్యధర్మాలను ప్రస్తావించింది. యముడు వరాన్ని కోరుకొమ్మన్నప్పుడు తొలుత తన అత్తమామలకు నేత్రాల్ని, పోగొట్టుకున్న రాజ్యాన్ని ప్రసాదించమని కోరింది. ఆ పిదపనే తన తల్లిదండ్రులకు సంతానభాగ్యాన్ని అర్థించింది. సతికితొలుత మెట్టినిల్లు, ఆపైననే పుట్టినిల్లన్న ధర్మాన్ని సావిత్రి ఇక్కడ పాటించింది. మృత్యుంజయత్వాన్ని భర్తకు సాధించిపెట్టిన సాధ్వి. సావిత్రి భర్తతో అద్వైతానురాగాన్ని పొందింది. సత్యవంతుడు మృతిచెంది దేహాన్ని వీడాడు. సావిత్రి దేహంతో బ్రతికే ఉంది. అద్వైతానుబంధం పొందిన తరువాత శరీరావరణ భావంలేని ఆధ్యాత్మికస్పృహ సావిత్రిది. మృత్యువు విడదీయలేనిస్థితి. సావిత్రీ సత్యవంతులు దైహికంగానే కాదు, ఆత్మగతంగా కూడ అభిన్నులు. సావిత్రి తాను చేసిన త్రిరాత్రోపాసన ద్వారా తెలియజెప్పినదదే. భర్తవెంట చేసిన యోగయానం ద్వారా తెలిసేదేమంటే, సావిత్రి యముని వెంటపోవటం లేదు, యముడే సత్యవంతుడితోపాటు సావిత్రిని కూడ తీసుకపోయినట్లు లెక్క. సత్యవంతునితోపాటు సావిత్రి ప్రాణాలు తీశానా? అన్నంతగా యముని ప్రభావితం చేసి కార్యసాధన చేసింది. కాలంతీరిన సత్యవంతునితోపాటు, కాలంతీరని సావిత్రిని పతితో అనుగమనం చేయించే హక్కు యమునికి లేదుకదా! దానిని గుర్తించే యముడు సావిత్రి పట్ల ప్రసన్నుడయ్యాడు.

**సందర్భోచితవర్తనురాలు**

సావిత్రి స్త్రీ సహజోచితమైన ముగ్ధత్వమెంత ఉన్నప్పటికీ, ధీరత్వం, ఉచితజ్ఞత ఆమెకు రెండుకన్నులు. త్రిరాత్రోపవాస దీక్ష ఎందుకన్న అత్తమామలకు 'పరమశుభముల్ గోరిమొనరింప బూనితి గారణమును మీకు నెఱుగుగానగు బిదపన్' - అని చెప్పి సమాధాన పరచింది. సత్యవంతుని అకాలమరణాన్ని గురించి చెప్పి ఆ వృద్ధ దంపతులకు మనస్తాపం కలిగించటం దేనికని ఆమె చెప్పలేదు. మరణమాసన్నమైన దినంరోజున అడవికి సమిధలకోసం వెళుతున్న భర్తతో కలసి పోవటానికి భర్తను ఒప్పించేటప్పుడుగాని, అత్తమామల అనుమతిని తీసుకునేటప్పుడుగాని, విషయాన్ని బయటపెట్టలేదు. చివరికి పునర్జీవితుడైన సత్యవంతుడు ఎవరో అత్యంత వేగంగా వచ్చి, బలం పోయేలా చేసినన్ను పట్టుకొని పోయాడు - ఎవరని అడిగినా రేపు చెపుతాను. పొద్దుగ్రుంకుతోంది వెళదామంటూ తొందరచేసి, అత్తమామల గురించి ఆలోచించింది. తప్ప చెప్పలేదు. ద్యుమత్సేనుడు కొడుకుని చూచి ఇలా అడవిలో ఎందుకున్నావని అడగటంతో సత్యవంతుడు పండ్లుకోసి, కట్టెలు కొట్టేటప్పుడు తలనొప్పి రావటం, అలసివిశ్రమించటం, ఒక విశిష్ట వ్యక్తి కనిపించి నిగ్రహించాడని చెపుతుండగా అప్పుడు మాత్రమే సావిత్రి కల్పించుకొని సమస్తాన్ని వివరించింది.

**ఉభయవంశోద్ధారకురాలు**

పుట్టినింటికి, అత్తవారింటికి పేరుతెచ్చే శక్తి స్త్రీకిమాత్రమే ఉంది. సావిత్రి ఉభయవంశాలను ఉద్ధరించింది. తాను తప్ప వారసులు లేని పుట్టినింటికి యముని వరప్రభావంతో తన తండ్రికి వారసుల్ని ప్రాప్తింపచేసింది. అంధులై అలమటించే అత్తమామలకు చూపును, కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి ప్రాప్తింప చేసింది. వీటన్నింటికంటే సత్యవంతుడి అల్పాయువును చిరాయువుగా మార్చివేసి ఆచంద్రతారార్కం ఆదర్శసతిగా మిగిలిపోయింది. ఇలా సావిత్రి ఉభయవంశాలను ఉద్ధరించింది. ద్యుమత్సేనుని వద్దకు వచ్చి అశ్వపతి, తన కుమార్తె సావిత్రిని కోడలిగా స్వీకరించమని అర్థించేటప్పుడు 'మా కులమున కెల్లు దెప్ప' - యని సావిత్రిని గురించి చెపుతాడు. అలాగే వరలబ్దయై సత్యవంతునితో తిరిగివచ్చిన సావిత్రితో ద్యుమత్సేనుడు

**"ఆపత్సముద్రమగ్నం**
**బైపోయెడు నస్మదన్వయం పెంపెసగం**
**దేపయయికడమ బెట్టితి**
**నీపుణ్య చరిత్ర కీర్తనీయముతల్లీ!"** – అని అనటం ఇలా ఉభయవంశాలకు ఆమె తెప్పయై రక్షగానిలిచి కాపాడింది.

ఇలా సావిత్రీ చరిత్ర ధర్మశీలంతో తాను ఉద్ధరించబడటమే కాకుండా ఇతరులనూ ఉద్ధరించిన ధన్య. వివాహమాడిన సంవత్సరానికే చనిపోతాడని తెలిసి పెండ్లాడి, మృత్యుభయంలేకుండ పతివ్రతాన్ని చేపట్టి అమృతత్వాన్ని సాధించిన సావిత్రి శీలం పతివ్రతాధర్మానికే ఒక ప్రతీక. ఎంతోమంది వేదకాలంనుండి సావిత్రి కథను, దాని తత్త్వాన్ని వ్యాఖ్యానిస్తున్నారంటే సావిత్రి కథ యుగయుగాలకథ.

ఈ కథలో సావిత్రిని అనుసరించే కథ నడుస్తుంది. అందుచేత సత్యవంతుడు ఫలభోక్తమాత్రమే. నాయకస్థానం సావిత్రిదే.

**3) మీ పాఠ్యభాగమాధారంగా ఎఱ్ఱన కవితారీతులను వివరించండి.**

ఎఱ్ఱనగారికి ప్రబంధపరమేశ్వరుడన్న ఖ్యాతి ఉంది. అది సావిత్ర్యుపాఖ్యానం వంటి గ్రంథాలవలననే లభించింది. పురాణేతిహాసాల వారసత్వాన్ని దాని రచనా సంప్రదాయాన్ని గౌరవిస్తూనే, శ్రీనాథుడు, పెద్దన వంటి కవులకు మార్గదర్శకమయ్యే ప్రబంధరీతికి దారులు వేశాడు. నన్నయ లాగే ఎఱ్ఱనగారు కథా కథన శైలిని ఆదరించినప్పటికీ విడమరచి మధురమనోహరంగా చెప్పటం ఎఱ్ఱనగారి పద్ధతి. ఏమి చెప్పాడన్న విషయంతోపాటు ఎలా చెప్పాడన్న విషయానికీ ప్రాధాన్యమున్న రీతి ఎఱ్ఱనగారి కావ్యకళలో కనిపిస్తుంది.

**"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులు గావ్యకర్తవై**
**యెన్నికమైప్రబంధపరమేశు డనంగ నరణ్యపర్వశే**
**షోన్నయమాంధ్రభాష సుజనోత్సవమొప్పగ నిర్వహించిన తా**
**నన్నయభట్టుతక్కకవినాథులకెక్కిన భక్తి పెంపునన్"** (నృసింహపురాణం, 1-17)

ఇది ఎఱ్ఱనగారి తాతగారయిన ఎఱపోతసూరి చేసిన ప్రశంసగా ఎఱ్ఱనగారు చెప్పుకున్నపద్యం. ఇందులో ఎఱ్ఱనగారి కవిత్వలక్షణాల్ని, రచనాశైలిని పరోక్షంగా ప్రస్తావించటాన్ని గమనించవచ్చు. ఎఱ్ఱనగారి రచనామార్గం చతురోక్తి పథం. చతురోక్తి అంటే చతురమైన ఉక్తి. దాని అర్థమేమంటే నిపుణమైన లేదా ప్రౌఢియైన కవితాభివ్యక్తి. రసోపస్కారకంగా శబ్దార్థాలను ప్రయోగించే చాతుర్యంతో రచన చేయటమని తాత్పర్యం. అందుకు ఈ సావిత్రి కథలోని ఉదాహరణను చూద్దాం.

యముడు, సావిత్రికి యిచ్చిన వరప్రభావంతో కన్నులు పొందిన ద్యుమత్సేనుడు, తన భార్య శైబ్యతో కలసి పుత్రుడు కనిపించక, అరణ్యాన్నీ ఆశ్రమాలను వెదకి, అడవి అంతా తిరిగి, కాళ్లకు చేతులకు గాయాలయినా లెక్కపెట్టకుండా తిరిగాడని చెప్తూ,

**"భిన్నైశ్చపరుషై పాద్రై సవ్రణ్ణై శోణితోక్షితై**
**కుశన్మకంటకవిద్ధాంగావున్నత్తా వివధావత్ణ"** (సం.2-15)

అని మూలంలో ఉంది. దానిని ఎఱ్ఱనగారు చేసిన అనువాదం చూడండి.

**ఉ॥ "కన్నులు వచ్చి యెల్లెడలు గన్గొని వృద్ధనరేంద్రు డాత్మకుం**
**గన్నులు బోలెనైన తనగాదిలిపుత్త్రుడు గాననంబులో**
**నెన్నడులేని యింతతడవేటికి జిక్కెనొయంచునార్తితో**
**గన్నులు లేనియట్లతుడుగానకయేద్చె సతీసమేతుడై**

తరలము॥ **కొడుకునింది నందురోయుచు గోరిప్రేమభరంబునం**
**గొడుకు సద్గుణకోటి యెల్లను కోటి భంగుల నోలి ను**
**గ్గడన చేయుచు సత్యవంతుని గానరేమునులారా! యే**
**యడవి లోపలనంచు 'హాసుత' యంచు ధైర్యము డించుచున్** (ఆరణ్య 7-289)

ఈ పద్యాలు మూలానికి వన్నెపెట్టేవిగా ఉన్నాయి. కళ్లువచ్చాక, ద్యుమత్సేనుడు శైబ్యతో కలసి దుఃఖించటానికి కారణం కొడుకు కనిపించకపోవటం. కుశకంటకాలు గుచ్చుకొని పాదాలు నెత్తురోడి ఉన్మత్తుల్లాగా శైబ్యాద్యుమత్సేనులు విలపించటం సహజోచితమైన వర్ణనయే మూలంలో.

కాని ఎఱ్ఱనగారి రచనలో ఉక్తివైచిత్రి ప్రత్యేకంగా చూడదగింది. మూలంలో శైబ్యాద్యుమత్సేనులు ఉన్మత్తులై విలపిస్తే, తెలుగు పద్యాలలో సాత్త్వికమైన ఆర్తితో అలమటించటం కనిపిస్తుంది. ఉదాత్తుడు, ధీరుడూనైన ద్యుమత్సేనునకు సత్యవంతుడు 'గాదిలిపుత్త్రుడు' – ఆరోప్రాణం. తమ ఆత్మకు కళ్లవంటివాడు. భౌతికంగా నేత్రాలు వచ్చిలోకాన్ని చూడగలుగుతున్నారుగాని కొడుకును చూడలేకపోయారు. దానితో లోకమంతా శూన్యంగానే వారికి తోచింది. అడవికి వెళ్లి అంతసేపు ఉండటానికి కారణం, కొడుకేమైనా చనిపోయాడేమోనన్న అనుమానం ఆ వృద్ధ దంపతుల ఆర్తికి కారణమైంది. దీనిని ధ్వని మార్గంలో నిర్వహించిన తీరు ఇక్కడ విశేషం. 'ఆత్మకుంగన్నులు బోలెనైన' – అన్న ఉపమ మిగిలిన పద్యాన్నంతటిని నడుపుతోంది.

'కొడుకు నిందునంద' అనే రెండో పద్యం మునులార! హాసుత! అంటూ విలపించటం సాత్త్వికాభినయం. కొడుకు గుణాలను కీర్తిస్తూ, ఎదురైన వారినెల్లా అడిగి విచారించటం వాళ్ల దుఃఖ భారాన్ని సూచిస్తుంది. బిడ్డలమీది ప్రేమభారం కన్నవారిని ఎంతగా వివశులను చేస్తుందో, ఎలా ఆర్తితో అలమటించి పోతారో శైబ్యాద్యుమత్సేనుల ప్రవర్తన తెలియజేస్తుంది. దానిని సాత్త్వికాభినయరీతితో, భాషావైచిత్రితో, అభినయరమ్యతతో చిత్రించారు.

ధ్వనిప్రస్థానంలో వస్తుధ్వని, అలంకారధ్వని, రసధ్వని అని మూడు ధ్వనులు ఉన్నాయి. ఎఱ్ఱనగారు ఎక్కువగా అలంకార ధ్వనిని ఆశ్రయించారు. అలంకారమనగానే మనకు శబ్దార్థాలంకారాలు మెదులుతాయి. ఎఱ్ఱనగారు శబ్దాలంకారాల కంటే అర్థాలంకారాలకే ప్రాముఖ్యమిచ్చారు. అక్షర రమ్యత సూచించే శబ్దవైచిత్రి శబ్దాలంకారమైతే, అర్థగతమైన ప్రౌఢత్వంతో కూడిన ఉక్తుల వైచిత్రియే అర్థాలంకారం. ఈ వైచిత్రిని సావిత్ర్యుపాఖ్యానంలో మనం గమనించగలం. సావిత్రి ఉపవాసదీక్షతో ఉండి, భర్తను అనుసరించి అడవికి పోయినప్పుడు, ప్రకృతి సౌందర్యాన్ని సత్యవంతుడు సావిత్రికి చూపించే సందర్భంలో చేసిన వర్ణనను గమనించండి.

సీ॥ **కమనీయకమలినీకల్లోల వీథులు**
**గదలురాయంచలగతుల యొప్పు,**
**బహుపుష్పపల్లవ ప్రకార చిత్రితములై**
**తనరారు తరులతా తతులసొంపు,**
**మకరందరసపాన మదవిలోలంబులై**
**క్రాలెడి యెలదేటి గములయూర్పు**
**బరిపక్వమంజుల ఫలరసోద్ధతములై**
**పలుకురా చిలుకల పటురవంబు**

ఆ.వె. **ప్రియుడు వేఱువేఱ ప్రీతిమై జీపుచుచు**
**జెప్పుచును జనంగు జిగురుబోడి**

**గనుచు వినుచు నిర్వికార సల్లాపమిం**
**పారనతని తెలుగు నరయుచుండె**

ఈ పద్యంలో, కొలది సేపటిలో చనిపోబోతున్న సత్యవంతుడు సౌందర్యలాలసతతో ప్రకృతి సౌందర్యాన్ని సావిత్రికి చూపుతున్నాడు. అతని మరణ రహస్యం సావిత్రికి తెలుసు. ఆ విషయం భర్తకు తెలియకుండా, తనకు సహృదయతతో అనుభూతం చేయిస్తున్న ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించినట్లు నటించాలి. మనసులో దుఃఖం అణచుకొనే ఆమె నిర్వికార సల్లాపాలు చేసింది. దానినే ఎఱ్ఱనగారు ఈ పద్యంలో 'నిర్వికార సల్లాపమింపార' సావిత్రి ప్రవర్తించిందని చెప్పటం ఈ పద్యంలో కనిపిస్తుంది. ఇటువంటి మానసిక సంఘర్షణను వైచిత్రితో నిర్వహించటం ఎఱ్ఱనగారి శైలి. ఇటువంటి పద్యాలశైలియే తరువాతి ప్రబంధ కవులకు మార్గదర్శకమైంది.

**సంభాషణలో చతురోక్తులు**

తనవెంటబడి వస్తున్న సావిత్రిని యముడు వారించినప్పుడు సావిత్రి

**క॥ "పతులెందు జనిన నచటికి**
**సతులుంజనవలదె? నీప్రసాదముననుమ**
**తృతిభక్తి కతమునను సం**
**స్తుతగుణ! నాకరుగురాని చోటుంగలదే?"** (ఆరణ్య 7-20)

ఈ పద్యంలో కాకువుతోకూడిన చతురోక్తులు గమనించదగినవి. 'చనవలదె?', 'అరుగరాని చోటుంగలదే?' - అనే పదాలు కాకువుతో రెండర్థాలనిస్తాయి.

చనవలదె? (చనన్ + వలదె) = భర్త ఎక్కడికి వెళితే భార్య అక్కడికి వెళ్ళకూడదా? తప్పకుండా వెళ్లాలి, వెళ్ళాలికదా!

అరుగరాని చోటుంగలదె? = వెళ్ళకూడని చోటున్నదా? వెళ్లలేని చోటుందా?

ధార్మిక వర్తనం చేత, పతిభక్తి ప్రభావం చేత తనకు వెళ్లకూడని చోటు లేదని చెప్పటం సావిత్రి ఉద్దేశం. దానిని ఇలా చతురోక్తిగా ఎఱ్ఱనగారు చెప్పించారు.

అలాగే ఈ ఉపాఖ్యానంలో సమస్య వచ్చినప్పుడల్లా సంభాషణలు కాకువుతోనే నడుస్తాయి. చూడండి.

అల్పాయుష్కుడైన భర్తదేనికని అశ్వపతి సావిత్రిని వారించినప్పుడు 'మనమునుగైకొన్న భర్తమానుటుదగునే?' (7-183) - అని సావిత్రి సమాధానమిస్తుంది.

అశ్వపతి కూతురిని సత్యవంతునకివ్వటానికి అంగీకరించి ద్యుమత్సేనునికి వద్దకుపోయినప్పుడు, ద్యుమత్సేనుడు రాజ్యంలేక అడవిలో ఇడుములు పడుతున్నమాతో, మీ అమ్మాయి కష్టాలు పడి భరిస్తుందా? అంటూ - 'అడవి నుండి మాతోడియిడుమకు నోర్చునయ్య' (7-192) - అని అంటాడు.

అశ్వపతి, ద్యుమత్సేనునితో నా విన్నపాన్ని అంగీకరించక మా అమ్మాయిని కోడలిగా చేసుకోననటం తగునా? అంటూ "మత్ప్రార్థను బ్రాతిగు జేకొనకయునికి పాడియె నీకున్" (7-195) - అని అంటాడు.

త్రిరాత్రోపవాసం ముగిశాక పారణచేయమని ద్యుమత్సేనుడు తన కోడలయిన సావిత్రితో - 'తడయక పారణ యొనర్పుదగదే యింకన్' (7-205) - అని చేయవచ్చును కదా! అని కాకువుతో అడుగుతాడు.

యముడు సావిత్రి మధ్య జరిగిన సంభాషణలో ఈ కాకువుతో కూడిన సంభాషణలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కాకువు సంభాషణలో వక్త వినియోగించుకునే చమత్కారవిశేషం. ఇది వక్త కంఠంలోనుండి వెలువడే ఒక విలక్షణ ధ్వని. దానివలన కలిగే అర్థాంతరవిశేషం పఠితను అలరిస్తుంది. ఇటువంటి చతురోక్తులను సమర్థంగా నిర్వహించటంలో ఎఱ్ఱనగారిది సిద్ధహస్తం.

**శైలి**

ఎఱ్ఱనగారిని విశ్వనాథ సత్యనారాయణ 'సర్వమార్గేచ్ఛావిధాతృండ'ని అన్నాడు. అంటే అన్ని మార్గాలలోనూ స్వేచ్ఛగా విహరించే బ్రహ్మవంటివాడని అర్థం. అన్ని మార్గాలు అంటే కవితానిర్మాణంలో ఉన్న అన్ని మార్గాలని. నన్నయగారి కథాకథన పద్ధతి, తిక్కనగారి నాటకీయ పద్ధతి, కవులకు సిద్ధమైన వర్ణనాత్మక పద్ధతి మొ॥వి. ఈ సావిత్ర్యుపాఖ్యానంలో ఈ మూడు రకాల శైలులనూ చూడగలం.

**కథాకథన శైలి**

మార్కండేయ మహర్షితో 'పతిభక్తితో కష్టాలకోర్చి, శుభాలను పొందిన పుణ్యవతి కథ వినాలని ఉంది.' – అని ప్రార్థించటంతో మార్కండేయ మహర్షి సావిత్ర్యుపాఖ్యానాన్ని చెపుతాడు. ఈ కథ నాతివర్ణనలతో, నాతి దీర్ఘసంభాషణలతో కథాకథనమే ప్రధానంగా సాగుతుంది.

**వర్ణనాత్మకశైలి**

ఈ కథలో నాతిదీర్ఘవర్ణనలు లేవు. ఇతిహాస రచనయితకు కథ, వక్తవ్యాంశమే ప్రధానం. కాని ఎఱ్ఱన చెప్పే పద్ధతిని కూడా చారుతరం చేయటంతో ఆ శైలి వర్ణనాత్మకమైంది. పనిగట్టుకొని చేసిన వర్ణనలు లేవు. సత్యవంతుని వెంట సావిత్రి అడవికి పోయినప్పుడు, వన సౌందర్యాన్ని సత్యవంతుడు విశదం చేస్తున్నప్పుడు చేసిన వర్ణనయే ప్రధానమైంది. మిగిలినచోట్ల అభివ్యక్తి చాతుర్యమే ఈ వర్ణనాత్మకశైలిని పోషిస్తుంది. యముని రూపవర్ణనకూడ సహజోక్తులతో అలరిన వర్ణనయే.

**నాటకీయ శైలి**

ఏ రెండు పాత్రలు తారసిల్లినా వాళ్ల భాషణమంతా నడిచేది నాటకీయ పద్ధతే. అయితే నాటకంలోని పాత్రల సాత్త్విక, ఆంగిక, ఆహార్యాభినయాలను పట్టి చెప్పటం శ్రవ్యకావ్యంలో నాటకీయ శైలిని ప్రతిపాదిస్తుంది. ఈ సావిత్ర్యుపాఖ్యానంలో కూడా అటువంటి భావవర్ణనలు ఉన్నాయి.

> "సఖీజనంబులనంతంతనిలిపి మెలపుతోడి పొలుపున నమ్ముగ్ధలీలామధురంబగుచుండ తండ్రికిమ్రొక్కిన, నతండు గాఢ స్నేహదోహళంబగు చిత్తంబుతో" – (176)
>
> "కొండొక లజ్జించికోర్కెపెంపున సిగ్గుదొలగంద్రోచి, ప్రకట కౌతూహల తరళితాంతరంగయగుచు" (178)
>
> "మానసమును దద్దయుశోకసంతాపంబుగదురంగ" (204)
>
> "చిత్తంబును బైకొనియెడు
> నుత్తలమునడంచిముఖపయోరుహమునుద
> ళ్ళొత్తెడి వెడనవ్వునుబ్రియు
> చ్చితంబిగురొత్తు జనియె జెలువ యడవికిన్" (211)
>
> "నిర్వికార సల్లాపమింపారనతని తెఱుగునరయుచుండె"

ఇ వంటి పక్తుల్ని చూచినప్పుడు ఎఱ్ఱనగారు సాత్త్విక భావాలతో పాత్రల్ని వర్ణించిచెప్పి నాటకోచితశైలికి ఎలా దోహదం చేశాడో తెలుస్తుంది.

సావిత్రి యమధర్మరాజుల మధ్య నడచిన సంభాషణ అంతా నాటకీయమే.

**సూక్తివైచిత్రి**

ఉక్తివైచిత్రిలో భాగమే సూక్తివైచిత్రి. శ్రీనాథుడు 'పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని తేవసూక్తివైచిత్రి నొక్కక్కమాటు" – అని ఎఱ్ఱనను కీర్తించిన ధోరణిలో ఇమిడియున్నది, ఈ ఉక్తివైచిత్రియే. దానినే పైన పేర్కొన్నాం. సుభాషితాలులాగా ఉదాహరించదగిన పంక్తులు బోలెడన్ని కనిపిస్తాయి.

"మనమునుగైకొన్న భర్తమానుటు దగునే?" (7-185)

"కలిమియులేమియున్ సతముగావు" (7-194)

"పతులెందు జనిన నచటికి సతులుంజనవలదె" (7-222)

"ధర్మాత్ములు తమ సలిపెడు ధర్మక్రియ దప్పరెట్టిదశలందును" (7-237)

"సతులకు నవ్యమెట్టిదియును ధర్మమె భర్తృసంశ్రయముగాక" (7-241)

"ఆత్మధర్మనిరతులైన పుణ్యాత్ములు దుర్లభులు" (7-243)

"ఏడుమాటలాడిన యంతనెట్టివారు నార్య జనులకుజుట్టంబులగుదురు" (7-246)

**ఆలంకారికత**

ఎఱ్ఱనగారు తన ఆరణ్యపర్వశేషభాగానికి శ్రోతగా నన్నయ్యగారిలాగే రాజరాజనరేంద్రుడినే ఎంచుకున్నాడు. అలా ఎంచుకొని సంబోధిస్తూ -

"విచిత్రాలంకారోజ్జ్వల కవితాలాపకలాప సంతతానందమతీ!" (ఆరణ్య 6-1)

'మహాకావ్యరసప్రయోజనాద్యుడెవరీ"

అని కీర్తించాడు. ఈ సంబోధనలు రెండూ ఎఱ్ఱనగారి కవిత్వానికి ప్రతిరూపాలే. ఎఱ్ఱనగారి అలంకార ప్రయోగ ఔచిత్యం ఈ విషయాన్నే రూఢిచేస్తాయి.

సావిత్రి సౌందర్యాన్ని చెపుతూ

"పచ్చవిలుతు కలిమియెల్ల పద్మాననయై యచ్చుపడిన యట్లు మెఱయుచున్నచ్చటి 'కేతెంచె' - మన్మథుని సంపద అంతా కలిసి పద్మముఖిగా రూపొందా అన్నట్లు ప్రకాశిస్తుందనటంతో ఉత్ప్రేక్ష ఊసులాడుతుంది. సావిత్రి అనుపమాన సౌందర్యమూ రూపుకడుతుంది.

'కమనీయకమలినీ కల్లోలవీథుల .... అంటూ వనసౌందర్యాన్ని వర్ణించే ఈ పద్యంలో సహజోక్తి సల్లాపమాడుతుంది.

సత్యవతి చేసిన యముని గుణప్రశంసకు ఆనందపడి

క॥ **"తృషితుడగు వాని శీతల**
**తుషారతోయమ్ములుమోదితుని జేయుగతిన్**
**హృషితాత్ము జేసెనను"** - అన్నప్పుడు ఉపమాలంకారము కనిపిస్తుంది.

ఇవన్నీ సహజంగా అమరిన అలంకారాలు.

**రసం**

సావిత్ర్యుపాఖ్యానంలో సావిత్రి పరంగా చూస్తే ధర్మవీరమే ప్రతిపాదింపబడినట్లు అనిపిస్తుంది. పతిరక్షణశీలంతో ఆమె ఉద్యమించి త్రిరాత్రవ్రతదీక్ష స్వీకరించటం, అత్తమామల అనుమతిని పొంది భర్తతో అడవికి వెళ్లటం, యముని వెంటబడి పతిప్రాణాలను కొనితెచ్చుకోవటం ఇందులోని ప్రధాన విషయం. ఇవన్నీ సావిత్రీదేవి ఉత్సాహోద్వేగాలనే వ్యంజిస్తున్నాయి. అసలు సత్యవంతుని తోటి వివాహమే సావిత్రి పట్టుదల వలన జరిగింది. అందువలన పతితో అద్వైతానురాగాన్ని పొందిన స్త్రీ ఉత్సాహశీలమే ఈ కథలో పరచుకొని ఉన్నందున అది ఉత్సాహం స్థాయిభావంగా ఉన్న ధర్మవీరమే ఇందులోని ప్రధాన విషయం.

అయితే పాఠకుని పరంగా చూచినప్పుడు సావిత్రి ఉత్సాహశీలంతో సాధించిన ఫలాలన్నీ పాఠకునికి అద్భుత విశేషాలే. యముడు సత్యవంతుని ప్రాణాలనుతీసుకొని పోతుంటే సావిత్రికి కనిపించటం, వెంబడించటం, అత్తమామలకు నేత్రాల్ని, రాజ్యాన్ని సంతానంలేని తన తల్లిదండ్రులకు సంతాన భాగ్యాన్ని, చివరకు తన పతిప్రాణాల్ని తిరిగి తెచ్చుకోవటం ఇవన్నీ అద్భుతరసమగ్నం చేసే విషయాలే.

సత్యవంతుని కోసం విలపించే ద్యుమత్సేనుని విలాపంలో కరుణరసం, తల్లిదండ్రుల్ని స్మరించి విలపించే సత్యవంతుని తలపులలో కరుణం అంతర్లీనంగా నున్న తల్లిదండ్రుల వాత్సల్యం కనిపిస్తాయి.

ఈ విధంగా ఎఱ్ఱన గారి కవితారీతుల్ని ఈ సావిత్ర్యుపాఖ్యానంద్వారా భావించవచ్చు.

**4) ఎఱ్ఱనగారి అనువాద విధానాన్ని పేర్కొనండి.**

సావిత్ర్యుపాఖ్యానాన్ని ఎఱ్ఱనగారొక చిన్నసైజు ప్రబంధంగాతీర్చిదిద్దారని ఆరుద్రగారు పేర్కొన్నారు. మూలంలో ఇతిహాసంగా ఉన్నదాన్ని తెలుగులో ప్రబంధంగా మార్చటమంటే ఎఱ్ఱనగారు కొన్ని నగిషీలు చెక్కటమో, అనవసరమైన దానిని తీసివేయటమో చేసియుండాలి. కవిత్రయ భారతం వ్యాస భారతానికి అనుసృజనేగాని కేవల అనువాదం ఎంతమాత్రం కాదు. అనువాదం చేయటంలో ఏకవయినా పాటించే పద్ధతి ఒకటుంది. మూల తాత్పర్యం చెడకుండా, అర్థవంతంగా అనువదించటం ఇటువంటి సందర్భాలలో పాత్రవహించేది భావమే తప్ప, కేవల శబ్దానువాదం కాదు. కవిత్రయ అనువాదంలో సాధారణంగా ఈ కింది పద్ధతి కనిపిస్తుంది.

1. అనౌచిత్యాన్ని పరిహరించటం.
2. మూలంలోని ఔచిత్యాన్ని చెడగొట్టకుండాఅనువాదంలో తేవటం
3. మూలాన్ని సంక్షేపించటం.
4. మూలాన్ని విస్తరించటం.
5. అన్యథా ప్రకల్పించి రాయటం.

ఎఱ్ఱనగారు కూడా ఈ అయిదు పద్ధతుల్ని అనుసరించే భారతానువాదాన్ని చేశాడు. భారతంలోని ఈ సావిత్రికథను ఏ విధంగా తీర్చిదిద్దాడో పరిశీలిద్దాం.

**సావిత్ర్యుపాఖ్యానము**

ఈ కథ ఆరణ్యపర్వ సప్తమాశ్వాసంలో 112 గద్యపద్యాలలో కనిపిస్తుంది. భారతీయ సాహిత్యంలోనే సావిత్రికథకు ఒక విశిష్టత ఉన్నది. అరవిందమహర్షి ఈ కథను ఒక ప్రత్యేక కావ్యంగా తీర్చి ధార్మిక కవిత్వానికి ప్రతీకగా నిలిపాడు. "పతిభక్తి తాత్పర్యంబున నఖిలద్దుఃఖంబులకోర్చి శుభంబులొందిన పుణ్యసతి చరిత్రం" (ఆరణ్య 7-169)గా సావిత్రి కథ ఆరణ్యపర్వశేషంలో చెప్పబడింది. ఈ కథంతా చెప్పి మార్కండేయుడిట్లా అన్నాడు.

క॥ **"తనమగని నత్తమామల**
**జననీ జనకులను దన్ను సకలంబును దా**
**ఘనముగ సముద్ధరించెను**
**జనవర! సావిత్రి ధర్మచరితముకంటే!"**

తే॥ **"ఆ పతివ్రతయట్ల యీయాజ్ఞసేని**
**పరమకల్యాణ కర్మసంభావనీయ**
**యధిప! మిమ్మును మీ యఖిలాన్వయంబు**
**నుద్ధరించు మహాభాగ్యయుక్తిజేసి** (ఆరణ్య 7-279, 280)

పై పద్యంలో 'కంటె' అనడంలో సావిత్రి కథ ఆధ్యాత్మిక, అంతరార్థ దర్శన ఫలమని వ్యాఖ్యానించటం. ఈ కథలో మూలంకంటే భిన్నంగా ఎఱ్ఱన చేసిన మార్పుల్ని గమనిద్దాం.

**(1) సావిత్రీ జననము**

**మూలం–** అశ్వపతి పద్దెనిమిది సంవత్సరాలు సావిత్రీదేవిని ఉపాసించగా ఆమె ప్రత్యక్షమై వరాన్ని కోరుకొమ్మనగా అశ్వపతి బహుపుత్రప్రాప్తిని కోరుకొంటాడు. కాని సావిత్రీదేవి తేజస్వియైన ఒక కన్యకను ప్రసాదిస్తుంది. ఇది బ్రహ్మ ఆజ్ఞ అని మళ్ళీ మళ్ళీ అభ్యర్థించవద్దని అంటుంది.

**ఎఱ్ఱన–** అశ్వపతి పద్దెనిమిది సంవత్సరాలు తపస్సు చేస్తే ఆమె ప్రత్యక్షమై వరం కోరుకోమన్నప్పుడు అశ్వపతి పుత్రుణ్ణి అడుగుతాడు. ఆమె పుత్రికనిస్తుంది. "తల్లీ! పుత్రుణ్ణడిగితే పుత్రికనిస్తావా?" అని అశ్వపతి సావిత్రీదేవిని అడిగితే "ఇది బ్రహ్మ యానతియని అక్కన్నియ కారణంబున నీకు నొక్క విధంబునం బిదప పుత్ర శతలాభంబునగు సంతసిల్లుమని" చెబుతుంది.

**(2) సావిత్రీ కల్యాణము**

**మూలం –** సావిత్రి తేజోవైభవాన్ని చూసి, ఏ దేవకన్యకగానో ఆమెను భావించి, ఆమెను పరిణయమాడటానికి ఏ రాకుమారుడు ముందుకు రాడు. అందుకు చింతించిన అశ్వపతి, ఆమెనే తగు వరుణ్ణి వెతుక్కోమని చెప్తాడు. వివిధ రాజ్యాలకు, తపోవనాలకు వెళ్ళటానికి తగు ఏర్పాట్లను చేసి పరివారాన్ని వెంటపంపుతాడు. ఆమె రాజ్యాలను, తపోవనాలను తిరిగి ఇంటికి వచ్చే సమయానికి నారదుడు అశ్వపతితో సమావేశమై ఉంటాడు. సత్యవంతుణ్ణి పరిణయమాడటానికి తన నిర్ణయాన్ని సావిత్రి చెప్పగా నారదుడు, సత్యవంతుని మరణగండాన్ని గూర్చి ప్రస్తావిస్తాడు. అయినప్పటికీ ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోదు. అశ్వపతి, నారదుని సూచనమేరకు సావిత్రీ సత్యవంతుల వివాహానికి అంగీకరిస్తాడు.

**ఎఱ్ఱన–** వరాన్వేషణకు సావిత్రి వివిధ దేశాలకు తిరగటాన్ని ఎఱ్ఱనగారు మార్చారు. సత్యవంతుని గుణగణాల్ని కర్ణాకర్ణిగా విన్న సావిత్రి అతనినే పరిణయ మాడటానికి నిర్ణయించుకొంటుంది. నారదుడు, సత్యవంతుడు అల్పాయుష్కుడని చెప్పి వారించటానికి ప్రయత్నించినప్పటికీ సావిత్రి తిరస్కరిస్తుంది. దైన్యంతో ఉన్న అశ్వపతితో నారదుడు ఇలా అంటాడు.

చ॥ **"గౌనములట్రోక నీయనుగు గూతురు, దీని తలంపు మాన్పుగా**
**మనకు నశక్య మింక ననుమానములేల? నరేంద్ర! కూతు జ**
**య్యన నృపసూతి కిమ్ము, కమలానన చేసిన పుణ్యగౌరవం**
**బున నయినం బ్రియుండు పరిపూర్ణ చిరాయురుపేతుడయ్యెడున్"** (ఆరణ్య 7-185)

నీ కూతురి పుణ్యంవల్లనయినా సత్యవంతుడు దీర్ఘాయుష్మంతుడౌతాడన్న నారదుని మాటలు మూలంలో లేదు.

**(3) అడవికి భర్తతో సహగమనం**

**మూలం –** సత్యవంతుడు జీవితంలో చివరిరోజున "సమిత్కుశఫలా హరణార్థం" అడవికి బయలుదేరుతాడు. తానుకూడా వస్తానన్న సావిత్రిని మొదట సత్యవంతుడు వద్దని వారించినా చివరికి అంగీకరిస్తాడు. సత్యవంతుని సూచనమేరకు అత్తమామల అనుమతితో సత్యవంతునితో కలిసి బయలుదేరుతుంది.

**ఎఱ్ఱన –** మూలంలో లాగే రాసినప్పటికీ, భర్త చెప్పకయే అత్తమామల అనుమతిని తీసుకొని సావిత్రి వెళుతుంది. మూలంలో అత్తమామలు సావిత్రిని అడవిలో సత్యవంతుణ్ణి జాగ్రత్తగా చూసుకొమ్మని చెప్పటాన్ని ఎఱ్ఱనగారు వదిలేశారు.

**(4) సావిత్రీ యమసంవాదము**

**మూలం –** మూలంలో యమధర్మరాజు సావిత్రికి ఐదు వరాలనిచ్చినట్లు, ఎఱ్ఱనగారి భారతంలో సావిత్రికి యముడు నాలుగు వరాలే ఇచ్చినట్లుగా ఉన్నది. సావిత్రి మామకు చూపు మొదటివరంగా, రాజ్యాన్ని రెండవ వరంగా, తండ్రికి పుత్రశతలాభం

మూడవ వరంగా కోరుకొంటుంది. వ్యాసుభారతంలో యముడు నాల్గవ వరం ఇవ్వటానికి ముందు సత్యవంతుని ప్రాణం తప్ప మరేదైనా కోరుకొమ్మని అంటాడు. అప్పుడు సావిత్రి సత్యవంతునికి వారసునిగా నూరుగురి సంతానాన్ని కోరుతుంది. ఆ వరాన్నిచ్చి యముడు సావిత్రిని మరలిపొమ్మంటాడు. యముడు వరాన్ని అనుగ్రహించి ముందుకు సాగిపోతుంటే, సావిత్రి అనుగమిస్తుంది. ధర్మసహితము, మనో అనుకూలము, మహా అర్థవంతమైన ఆమె సంభాషణ పట్ల ప్రీతిగలవాడై మరొక్క వరాన్ని కోరుకొమ్మని అంటాడు. అయితే ఈ సారి సత్యవంతుని ప్రాణం తప్ప అని అనడు. అది గమనించిన సావిత్రి నా అదృష్టం కొద్దీ సత్యవంతుని ప్రాణం తప్ప అని మీరనలేదు. నా భర్త ప్రాణాలను ప్రసాదించమని కోరుతుంది. పైగా భర్త లేకుండా శతపుత్రప్రాప్తి ఏ విధంగా కల్గుతుందని అడిగిన సావిత్రి పట్ల, యముడికి విధిలేని క్లిష్ట పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు పాశం నుండి సత్యవంతుని ప్రాణాల్ని వదిలి పెడతాడు.

**ఎఱ్ఱన** – మొదటి మూడు వరాలు జాగ్రత్తగా ఇచ్చిన యమధర్మరాజు నాలుగవ వరం కోరుకొమ్మని చెప్పిన సందర్భంలో “నీకు బ్రసన్నుండనైతి నభీష్టంబైన వరంబక్కటి యిచ్చెద వేడుము” అంటాడు. అప్పుడు సావిత్రి ఇంతకుముందు సత్యవంతుని జీవితం తప్ప మరేదైనా ఇస్తానని అన్నావు. ఇప్పుడు ఆ మాట నీవనలేదు కాబట్టి

చ॥ **“పతి విరహంబు దుస్సహము, భర్తృ వినాకృతియైన కాంత దూ**
**షితయగు సర్వమంగళ విశేషములందును, గాన మత్ప్రియుం**
**దతులిత కీర్తిశాలి సుగుణాఢ్యుడు సాళ్వసుతుండు లబ్ధజీ**
**వితుడుగ నిమ్ము ధర్మపదవీ పరిరక్షణ! పుణ్యవీక్షణా”** (ఆరణ్య 7-249)

– అని అర్థించగా శతపుత్రలాభంతోపాటు సత్యవంతునికి నాలుగువందల సంవత్సరాల ఆయువును ప్రసాదిస్తాడు. ఇలా ఎఱ్ఱనగారు నాలుగు వరాలతో కథను ముగిస్తాడు.

ఈ సావిత్ర్యుపాఖ్యానాన్ని ఆరుద్రగారు “ఓ చిన్నసైజు ప్రబంధంగా” పేర్కొన్నారు. వర్ణనలతోపాటు లోకధర్మాన్ని ప్రతిబింబించే రచన సావిత్ర్యు పాఖ్యానంలో కనిపిస్తుంది.

తరలము **“కొడుకు నిందుననందురోయుచు గోరి ప్రేమ భరంబునం**
**గొడుకు సద్గుణకోటి యెల్లను గోటిభంగులనోలి ను**
**గ్గడనసేయుచు సత్యవంతునిగావరే మునులార! యే**
**యడవిలోపల నంచు ‘హాసుత’ యంచుధైర్యముడించుచున్”** (ఆరణ్య 7-269,270)

మూలంలో కళ్లు వచ్చిన శైబ్యాద్యుమత్సేనులు కొడుకు కనిపించక పోయేసరికి అడవులలో తిరుగుతూ ఉన్మత్తులై రోదించినట్లు ఉంది. దర్భముళ్లు గుచ్చుకొని శరీరాంగాలు, పాదాలు గాయపడ్డాయని, నెత్తురోడాయని మూలంలో ప్రస్తావించటం కనిపిస్తుంది. కళ్లు వచ్చాయి కాబట్టి తిరిగారు. కళ్ళున్నా కాళ్లకు గాయాలయ్యాయనటం అంత ఔచిత్యంకాదు. వాళ్లు ఉన్మత్తులు కావటమే ప్రధాన కారణమని చెప్పుకొన్నప్పటికీ అందులో ఎటువంటి చమత్కారంగాని, వైచిత్రిగాని కనిపించదు.

ఎఱ్ఱనగారి అనువాదంలో ఈ గాయాలగొడవలేదు. కళ్లువచ్చాక, అంతవరకు తమ ఆత్మలకు కళ్లయి నడిపిన కొడుకు కనిపించకపోయేసరికి, ఇంతసేపు అడవిలో ఎప్పుడూ లేడు. కొడుకుకు ఆపదలేమైనా ముంచుకొచ్చాయేమోనని తల్లడిల్లి పోయారు. కొడుకు ఆలస్యానికి కారణం మృత్యువాతపడియుంటాడేమోనన్న భీతి. అందుకే దుఃఖితులై, కొడుకులేని అభాగ్యస్థితిని తలచుకొని కన్నులున్నా కళ్లులేనివానిలా విలపించినట్లు ఎఱ్ఱన ఉక్తివైచిత్రితో అనువదించాడు. మూలంలో ఉన్మత్తవర్తనంగా ఉన్నది ఉచితవర్తనంగా ఎఱ్ఱనగారు మార్చారు.

సత్యవంతుడు పునర్జీవితుడై సావిత్రితో కలసి బయలుదేరాడు. యముడు ప్రసాదించిన నేత్రాలవల్ల ద్యుమత్సేనుడు తన భార్య శైబ్యతో కలసి కొడుకు కనిపించనందుకు ఆశ్రమాలన్నింటినీ తిరిగి తిరిగి, అడవినంతా గాలించి, కాళ్లకు చేతులకూ గాయాలైనా లెక్కించకుండా ఉన్మత్తుడిలా రోదించాడని మూలంలో ఉంది.

**ఏతస్మిన్నేవకాలేతు । ద్యుమత్సేనోమహావనే**
**లబ్ధచక్షు ప్రసన్నాత్మా! దృష్ట్వా సర్వందదర్శ**
**ససర్వానాశ్రమవాన్ గత్వా । శైబ్యయా సహభార్యయా**
**పుత్రహేత్నో పరామార్తిం । జగామమనుడజర్ధథ॥**
**తావాశ్రమున్నదీశ్చైవ । వనానిచ పరాంసిచ**
**తాంస్తాన్దేశాన్వి చిన్వన్తౌ । దంపతోపరిజగ్మత్తు॥**
**శ్రుత్వాశబ్దంతు యత్కించి । దున్ముఖా సంతశంకయా**
**సావిత్రి సహితోభ్యేతి ఒ సత్యవానిత్య ధావతామ్॥**
**భిన్నైశ్చ పరుషై పాద్ధై సత్రణై శోణితోక్షిషై**
**కుశకంటక విద్ధాంగా । వున్నత్తా వివధావత్ణ ॥** (సం.282.1-5)

ఈ సన్నివేశాన్ని ఎఱ్ఱనగారు రెండు పద్యాలలో అనువదించి, తన ఔచిత్య హృదయాన్ని చాటుకున్నారు.

ఉ॥ **కన్నులు వచ్చి యెల్లెడలు గన్గొని వృద్ధనరేంద్రుదాత్మకుం**
**గన్నులు బోలెనైన తన గాదిలి పుత్త్రుడు గాననంబులో**
**నెన్నడులేనియింత తడవేటికి జిక్కెనో యంచు నార్తితో**
**గన్నులు లేని యట్లతుడు గానక యేడ్చె సతీసమేతుడై**

ఇలా ఎఱ్ఱనగారి అనువాద విధానాన్ని పరిశీలిస్తే ఔచిత్యంతో కూడిన రచనా సామర్థ్యం అవగతమవుతుంది.

**- ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

పాఠం - 13

# సిరియాళుని కథ - శ్రీనాథుడు

## (హరవిలాసం - ద్వితీయాశ్వాసం - 1 నుంచి 142వ పద్యం వరకు )

## కవి పరిచయం, పాఠ్యభాగ వివరణ

### 13.1 కవి పరిచయం :

తెలుగు సాహితీజగత్తులో కవిత్రయం తర్వాత అంతపేరు ప్రఖ్యాతులున్న కవి శ్రీనాథుడు. ఇతని తల్లిదండ్రులు భీమాంబిక, మారయామాత్యులు. తాత కమలనాభుడు. సంస్కృతాంధ్ర భాషలలో ప్రావీణ్యం సంపాదించినవాడు. కవిసార్వభౌముడని బిరుదు పొందినవాడు. సకల విద్యాసనాథుడు. బ్రాహ్మీదత్తవరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాశీలుడు, ఆగమజ్ఞాననిధి. తత్త్వార్థఖని, బహుపురాణజ్ఞుడు అని కొనియాడబడినవాడు. రెడ్డిరాజుల ఆస్థానంలో శోభించిన కవివరేణ్యుడు. పెదకోమటి వేమారెడ్డి కాలంలో విద్యాధికారిగా నియమింపబడినవాడు. రాజమహేంద్రవర రెడ్డిరాజులైన అల్లాడరెడ్డి, వీరభద్రారెడ్డిల ఆస్థానకవి. అనేక రచనలు చేసి తెలుగు సాహితీ జగత్తులో శ్రీనాథయుగంగా తన పేరుతో ఒక యుగం ఏర్పడటానికి కారకుడైన యుగకర్త.

శ్రీనాథుడు రచించిన కొన్ని కృతులు కాశీఖండ పీఠికలోని ఈ పద్యం వలన తెలుస్తాయి.

చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు
        రచియించితి మరుత్తరాట్చరిత
నూనూగు మీసాల నూత్నయౌవనమున
        శాలివాహన సప్తశతి నుడివితి
సంతరించితి నిండు జవ్వనంబున యందు
        హర్షనైషధ కావ్యమాంధ్ర భాష
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమునఁగొని
        యాడితి భీమనాయకుని మహిమ

ప్రాయమింతయు మిగులఁగైఁబ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథ మేనుఁ
దెనుఁగుఁజేసెదఁ గర్ణాట దేశకటక
పద్మవనహేళి శ్రీనాథ భట్టసుకవి.

వీటిలో ముందు రచించినవి శృంగార నైషధము, భీమేశ్వర పురాణము, కాశీఖండము. తరువాత రాయబడినవి హరవిలాసము, క్రీడాభిరామము, శివరాత్రి మహాత్మ్యము. కవి సార్వభౌమ బిరుదు లభించిన తరువాత రాసినది పలనాటి వీరచరిత్ర. ఇవేగాక అనేక శాసనాలను, చాటు పద్యాలను రచించారు.

హరవిలాసమును తన బాలసఖుడైన అవచితిప్పయ్యశెట్టికి అంకితమిచ్చెను. శ్రీనాథుని మిగిలిన రచనలతో పోల్చినప్పుడు హరివిలాసము శైలి కొంత భిన్నముగా కనిపిస్తుంది. మిగిలిన రచనలలోవలే సమాసభూయిష్ఠతాజన్యమైన శబ్ద గాంభీర్యమిందులో లేదు. వానికంటే సమ సంస్కృతాంధ్ర పదమయమై, ప్రసన్నమై, సుబోధమై హరవిలాసము శ్రీనాథ

పండితుడుకాక శ్రీనాథకవి రాసినట్లుంటుంది. దానికి కారణం ఈ రచన దేనికీ అనువాదంకాక పోవటమే. మిగిలిన రచనలలోలేని స్వతంత్రత హరివిలాసంలో కనిపిస్తుంది. సిరియాలుని కథ, గౌరీకల్యాణము, దారుకావన విహారము, హాలహల భక్షణము, కిరాతార్జునీయము హరవిలాసంలోని కథలు. సిరియాలుని కథ పాల్కురికి సోమనాథుని బసవపురాణములో ఉంది కానీ పాత్ర పేర్లలో ఈ రెండింటికి వ్యత్యాసం కనిపిస్తుంది.

**సందర్భము :**

హరవిలాసములోని ద్వితీయా శ్వాసములో సిరియాళుని కథ చెప్పబడింది. ఈ కథను స్వయంగా పరమశివుడే పార్వతీదేవికి చెప్పటం విశేషం. దుర్వాసముని శాపం కారణంగా తంబురుడు కాంచీపురంలో వైశ్యకులంలో చిఱుతొండడుగా జన్మించాడు. చిఱుతొండడు షట్కాలాలలో శివుని పూజిస్తూ శివభక్తుల కోరికలు తీరుస్తుంటాడు. ఒకరోజు మిండజంగముడు దోసిట శివలింగంతో చిరుతొండని ఇంటికొచ్చి అభిషేకం కోసం చెరుకురసం కావాలంటాడు. చెరుకుగడలు కొని వాటిని ఎత్తలేక అవస్థపడుతున్న చిఱుతొండనికి శివుడే సహాయంగా వచ్చి ఒకప్రక్క మోపునెత్తుతాడు. దానితో శివుడికి చెమట పడుతుంది. ఆ సమయంలోనే పార్వతీదేవి సహితంగా అప్సరసలు నాట్యం తిలకిస్తున్న శివుడికి చెమటపట్టడం చూసి పార్వతీదేవి అప్సరసలను చూచి చెమర్చావు అని కోపగించుకున్న సందర్భంలో శివుడు తనకు చెమట పట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ చిఱుతొండని గురించి చెపుతాడు.

**13.2 పాఠ్యభాగ వివరణ :**

అన్ని దీవులలో జంబూద్వీపం ఉత్తమమైనది. అందులో భరత ఖండం మేలైనది. దీనిలో ద్రావిడదేశం గొప్పది. ఆ దేశానికి మొలనూలు వంటిది కాంచీపురం. ఆ కాంచీపురంలో శివభక్తి అనే ఆచార్య సామ్రాజ్యలక్ష్మికి కంఠాభరణమైనవాడు, మచ్చలేని వ్యాపార కులంబోధికి పూర్ణచంద్రుడివంటివాడు చిఱుతొండడు. ఆ ఉత్తముడు నిరంతరం జంగమారాధనలు విడువక చేస్తుండేవాడు. జంగములు ఎందరు, ఏ సమయంలో, ఏ పదార్థం ఎంత, ఏవిధంగా కోరినా సంకోచించక అందరికీ ఆ పదార్థాలను వారు కోరినరీతిలోనే ప్రాణాలుపణంగా పెట్టైనా సమకూరుస్తుండేవాడు. అతనికి సమానమైనవాడు ప్రపంచంలోనే మరొకడులేడు. కలియుగంలో కల్యాణకటక నగరవాసియైన బసవన్న, కంచిపట్టణవాసి అయిన చిఱుతొండనంబి తన భక్తులని శివుడు పార్వతితో చెబుతాడు.

ఒకరోజు ఆ వైశ్యకులంలో జన్మించినవానిని, పరమేశ్వరుడికీ, కామాక్షీదేవికి తన మనస్సును శయ్యామందిరంగా చేసిన చిఱుతొండనంబిని భిక్ష వృత్తి అయిన జంగముడొకడు సమీపించి శివుడిని ఆరోజు అభిషేకించటం కోసం తూమెడు చెరుకురసం కావాలని ప్రార్థనాపూర్వకంగా ఆజ్ఞాపిస్తాడు. అలాగేనని శైవాచార సంపన్నుడైన ఆ చిరుతొండనంబి తోటకు వెళ్ళి తియ్యనిరసానికి నిలయాలైన మంచి నల్ల చెఱుకులు బారపొడవు ఉండేటట్లుగా విరిచి ముదిరిన చెరుకు దవ్వలతో మోపుకట్టాడు. తూమెడు రసానికి సరిపడినన్ని చెరుకుగడలు తీగలతో గుండ్రంగా మోపుకట్టాడు. కానీ ఆ మోపు కదల్చటానికి సామర్థ్యం లేకపోయింది. ఆ మోపును చిఱుతొండనంబి ఎత్తులేకున్న సమయంలో నేను ఒక్కడినే వెళ్ళి ఆ మోపును ఒకవైపు ఎత్తుకున్నాను. ఆ చిరుతొండనంబి ఇంకోవైపు ఎత్తాడు. ఆ మోపు బరువుకు అతడు, నేనూ చెమర్చాము. ఇంతకంటే ఏమీలేదని, దానిని వేరేవిధంగా భావించవద్దని శివుడు పార్వతికి తెలిపాడు. నేను భక్తులను ప్రేమిస్తాను, వారూ నన్ను ప్రేమిస్తారు. నేను భక్తికి లొంగుతాననే మాట ఈరోజుది కాదు కదా అనగా పార్వతీదేవి నాకు కూడా ఆ వీరమాహేశ్వరుడిని చూడాలని ఉంది. నన్ను కూడా కంచికి తీసుకొని వెళ్ళమని శివుడిని ప్రార్థించింది. అప్పుడు శివుడు ఇంద్రుడిని ఆ కాంచీపురంలో నాలుగువైపుల మూడు యోజనాలమేర కుంభవృష్టిగా అకాలవర్షాలు కురిపించమని చెప్పగా ఇంద్రుడు అలాగే తన రాజధాని అయిన అమరావతికి ఐరావతమునెక్కి వెళ్ళి పుష్కలము, ఆవర్తకము మొదలైన మేఘాలు కట్టుత్రాళ్ళు వదలించి త్వరగావెళ్ళి కంచిలో ఇరవై ఒక్కరోజులు వర్షించమని పంపాడు.

వర్షాగమనాన్ని సూచించే విధంగా ఉరుములు ఉరిమి మూలగొడ్పులు వేగంగా వీయటం ప్రారంభమైంది. ఉత్తరదిక్కున మెరుపులు మెరిశాయి. కప్పలు అరవసాగాయి. ఆకాశంలో తూనీగలు ఆడటం ప్రారంభించాయి. ధూళి తిరుగుడుపడి ఎగురసాగింది. పిచ్చుకలు ఎగురసాగాయి. గబ్బిపులుగు మాటిమాటికి కొమ్మపై అరువసాగింది. చాలారోజులు వానకురిసి బాధిస్తుందని కంచిలోని పౌరులు చెప్పుకొనసాగారు. జ్యోతిష్కులు ఆకాశంలో పూర్వాషాడ నక్షత్రం చంద్రుడిని సమీపించి ఉండగా గుడికట్టడం గమనించి వర్షం అధికంగా కురుస్తుందని తమలోతాము అనుకోగా విన్న గృహస్థులు వంటచెరుకు, ఎండుగడ్డికి కొరత ఏర్పడుతుందని విచారించారు. విపరీతంగా ఇరవైఒక్క రోజులు వర్షం కుండపోతగా కురియటం వలన పట్టణమంతా నీటిలో మునిగిపోయింది. ఇరవైరెండవరోజున సూర్యోదయమైంది. వర్షం వెలిసి ప్రాణకోటికి కొంత తెరపిచ్చింది. ఈ ఇరవైఒక్కరోజులు చిరుతొండనంబి శివభక్తికి అతడు పరాకాష్ఠ అనేవిధంగా ఎంతో భక్తిప్రపత్తులతో శుభం కలిగేవిధంగా శివయోగులకు రాత్రిపగళ్ళు రుచికరమైన భోజనాలు పెడుతున్నాడు. వంట చేయడానికి కట్టెలు దొరకకపోతే ఆ పుణ్యాదంపతులైన చిరుతొండనంబి, తిరువెంగనాచి వస్త్రాలను గుట్టలుగా నూనెలో ముంచి ఆ మంటలతో వంటకాలు చేయించి శివభక్తి సమూహాలకు సమృద్ధిగా ఆహారాన్ని వడ్డించారు. ఎడతెరపిలేక వర్షాలు కురుస్తుంటే చిరుతొండనంబి భక్తితో చాయపప్పు, నెయ్యి, క్షీరాన్నం, చారులు, పిండివంటలు, పంచదార, పెరుగు మొదలైన చతుర్విధ అన్నాలని శివభక్తులు తినగలిగినంతా పెట్టారు. అకాలవర్ష సమయంలో చిఱుతొండనంబి తన విశాలమైన చావిళ్ళలో వస్త్రాలు, ఆహారం శివభక్తులకు ఇస్తున్నాడు.

ప్రతిరోజు జంగమప్రమథులు కనీసమొక్కడైనా తన సహపంక్తికి లేకపోతే భోజనంచేయని వ్రతంగలవాడైన చిరుతొండడు మధ్యాహ్న సమయంలో వీరశైవాచారవ్రత మార్గాన్ననుసరించి శరీరమంతా విభూతి పూసుకొని, ఉతికిన వస్త్రాలు ధరించి, నుదిటిన త్రిపుండ్రాలు దిద్ది చేతిలో లింగం మనసులో శివుడిని నిల్పినవాడై శివుడిని పంచోపచారాలతో పూజించి జంగమ ప్రమథుల కోసం వాకిలి ముందుకు వచ్చాడు. ఒక్కజంగమ ప్రమథుడైనా చావడిలో లేని కారణంగా భార్యతో ముసురుపట్టిన రోజులలో కూడా చావడిలో అనేకమంది పరమేశ్వర భక్తులున్నారు. ఈరోజు ఒక్కరైనా లేరు ఆశ్చర్యంగా, పట్టణంలోకి వెళ్ళి జంగమ ప్రమథులను వెతికితెస్తాను, లింగార్చనకు అవసరమైన సంబారాలను సిద్ధం చేయమని చెప్పి జంగములను వెదుగుటకు వెళ్ళాడు. చిఱుతొండనంబి జంగముల కోసం వీధులలో, దేవాలయాల దగ్గర, పాశనాలల దగ్గర, రచ్చపట్టుల దగ్గర, పశువుల బందెఖానాల దగ్గర, జోస్యులు ఉండేచోట్లలో తొందరపాటు, భయం పెనగొనగా వెదకసాగాడు. వెదికిన దగ్గరే మరల మరల వెదకసాగాడు. కాంచీపురమంతా వెదకి ఎక్కడా జంగమ ప్రమథులు కానరాకపోవటంచేత కోటదాటి దూరంగా వెళ్ళి అక్కడ పూదోట సమీపంలో పాడుబడిన గుడి గర్భమంటపంలో ఎనభై ఏళ్ళ వృద్ధజంగముడిని, అంతే వయస్సుగల గ్రుడ్డి అవ్వ పాదాలొత్తుచుండగా చూసి నమస్కరించాడు. మీరు, ఈ ముసలిఅవ్వ మా గృహంలో శివార్చన చేసి నన్ను ధన్యుడిని చేయాలంటూ ఆ టక్కరి మాయజంగముడి కాళ్ళపై పడగా ఆ ముసలి జంగముడు తల వణుకుచుండగా పరమేశ్వరుని దయ అంటూ ఆశీర్వదించాడు. నేను చెవిటివాడను, నువ్వు చెప్పేది బిగ్గరగా చెప్పమని జంగముడడుగగా చిఱుతొండనంబి మీరు, దేవి మా ఇంటికి శివార్చన చేయటం కోసం వచ్చి మమ్మల్ని ధన్యులను చేయండి. అంగీకారంగా విభూతి అందుకోండి అన్నాడు. అప్పుడు జంగముడు నీ వంశమేది, నీ పేరేది, నీ వసలు శివభక్తుడవేనా, నీ భార్య నువ్వు చెప్పినట్లు వింటుందా, సంతానం ఉందా, కూటికి గుడ్డకు లోటులేదుకదా అడిగినది ఇవ్వగలవా, జోగి జంగములు అసాధ్యులు. వారి మాటను త్రోసివేయకూడదు. అయినా భిక్ష కోసం నిన్ను ఇంత పరీక్షించనవసరం లేదులే, వీరశైవ వ్రతాన్ని పాటించేవాడవైతే చాలు ఇప్పటి నా పనికి సరిపోతావు అన్నాడు.

శివుడిని మనసులో నిలిపి సంవత్సరకాలంగా నేను నిరాహారదీక్ష చేస్తున్నాను. ఈ వ్రతము జంతుబలితో ముగుస్తుంది. ఆ జంతువు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యకులానికి చెందిన ఆరోగ్యవంతుడు, అందగాడైన బాలుడై ఉండాలి. తల్లిదండ్రులే ఆ బాలుడికి ఉపనయనం చేసి వండి వడ్డిస్తే శివుడికి నైవేద్యమిచ్చి నేను భుజిస్తాను. అంతేకాకుండా నాతో

గృహస్థుడు, అతడి కుమారుడు కూడా భుజించాలి అని జంగముడు చెప్పగా, చిఱుతొండనంబి మహాప్రసాదమని తాను వైశ్యకులసంజాతుడనని, శివభక్తుల పాదసేవ చేస్తుంటానని, భక్తుల వ్రతం సఫలీకృతం చేయటమే తన వ్రతమని, తమ ఇంటికి దయ చేయమని చిఱుతొండడు అభ్యర్థించాడు. అంతట ఆ శివయోగి తల అడ్డంగా ఊపుతూ నేను ముసలివాడిని, నీ మాట ప్రమాణంగా తీసుకొని అంతదూరం వచ్చి, నీ భార్య వీలుకాదంటే తిరిగి ఇక్కడికి రాలేను. అంతేకాక నవమాసాలు గర్భంలో మోసి, ప్రసవవేదనను అనుభవించి, బిడ్డను కనిపెంచి పెద్దచేసిన తల్లికి బిడ్డ ప్రియమైనవాడు. నీవు ఇంత భయంకరమైన వీరశైవ వ్రతాలు ఇంతకుముందు చేసినవాడవు కావు, పుత్రుని ప్రేమ గొప్పది, కాబట్టి నువ్వు నీ భార్యాబాగా ఆలోచించి ఈ పనికి ఇద్దరూ అంగీకరిస్తే అప్పుడు భస్మం గ్రహింతురు. మీరు ఒప్పుకున్నా చంపబడే ఆ బిడ్డ ఈ పనికెలా అంగీకరిస్తాడు. నియమంలో ఉండే నిష్ఠచేత నువ్వు, గుండె ధైర్యంతో తల్లీ ఓర్చుకున్నా ప్రాణాలు పోగొట్టుకునే బిడ్డకది అశక్యం కదా అని జంగమ ప్రమథుడు చిఱుతొండనంబితో అన్నాడు. ఈ మనసనేది ఒక రీతిగా ఉండదు, మాటిమాటికి ఊగిసలాడుతుంది. తన ఆత్మ తనకు సరే కానీ ఇతరుల మనసులు తెలుసుకోవటం ఎలా సాధ్యం. అవేమీ కుట్టి చూడటానికి దోసకాయలు కాదుకదా, కాబట్టి నీ భార్య కోసం ఈ విభూతి తీసుకొని ఆమె ఇష్టం తెలుసుకొనిరా. మరల తిరిగి రావటం నీకేమంత కష్టమైన పనికాదుకదా అని జంగముడు పలుకగా చిఱుతొండనంబి తన భార్య, కుమారులు తన మాట జవదాటరని మనసున ఎరిగి కూడా అతనితో వ్యర్థప్రసంగాలెందుకని అతని ఇష్టప్రకారమే విభూతి తీసుకొని తన నివాసానికి వచ్చాడు.

అతని భార్య తిరువెంగనాచి భర్తకు ఎదురువచ్చి భర్త ముఖంలోని సంతోషం చూచి తాను సంతోషించి శివయోగి ఎక్కడ దొరికాడని అడిగింది. చిఱుతొండనంబి జరిగినదంతా ఆమెకు ఎరిగించగా ఆమె ఏమాత్రం ఆందోళన పడకుండా సంతోషంతో నవ్వుతూ మన ధనమాన ప్రాణాలకు శివయోగీశ్వరులే కర్తలు కదా, అయినప్పుడు వారి సొమ్ము వారికి ఇవ్వటం ఏమంత గొప్పపని, అంతేకాదు ఆ శివయోగి కోరాలే కానీ కుమారుడేమి, నేను, మీరు కూడా అతనికి ఆహారం కాగలం. ఇంక మాటలనవసరం. అతని నియమం చెల్లేటట్లుగా విభూతి నివ్వండి అని చెప్పింది. భార్య మాటల భావం గ్రహించిన చిఱుతొండనంబి చందనికకు విషయమంతా చెప్పాడు. ఆ ముగ్గురూ ఒక్కటిగా శివయోగికి సపర్య చేయ నిశ్చయించి చిఱుతొండనంబి శివయోగిని తీసుకురావటానికి వెళ్ళాడు.

మాయజోగి రూపంలోనున్న శివుడు తన ముసలివేషం వదిలి, ఇంకో రూపం ధరించి గుణవంతుడైన సిరియాళుడు గురువువెంట చదువుకుంటుండగా అతని మనసు మార్చాలనే కోరికతో వచ్చి చూడగా చేతిలోనున్న పుస్తకంలోని పరమేశ్వరస్తవాన్ని చదువుతూ అక్కడున్న విద్యార్థిలందరిలోకి సిరియాళుడు గ్రహాలలో చంద్రుడిలా ప్రకాశిస్తున్నాడు. ఆ శివయోగి దగ్గరకు రాగా భక్తితో నమస్కరించిన సిరియాళినితో చిరుతొండనంబి అనేవాడు నీ తండ్రేకాదు, ఆ నిర్భాగ్యుడు, మద్యపానం చేత మత్తెక్కిన ఒక శివయోగికి నిన్ను చంపి పరమేశ్వరుడికి నైవేద్యంగా సమర్పించటానికి ఆహారంగా వండింపదలచాడు. నీపట్ల నున్న స్నేహంచేత ఈ విషయం నీకు తెలపాలని వేగంగా వచ్చాను. కడుపున పుట్టిన ప్రేమను త్రోసివేసి వంశోద్ధారకుడైన కుమారుని చంపి మాంసం తినే జోగులకు పెట్టే క్రూరాత్ములు ఎక్కడైనా ఉన్నారా. పసివాడిని చంపటానికి ప్రయత్నించేవాడు రాక్షసుడుకాక తండ్రి ఎలా అవుతాడు, బ్రతికుంటే సుఖాలు పొందవచ్చు కాబట్టి ఎక్కడికైనా పోయి ఆ ఆపదను తప్పించుకోవటం తక్షణం నువ్వు చెయ్యవలసింది అని చెప్పగా సిరియాళుడు చెవులు మూసుకుంటూ ఓ పుణ్యాత్ముడా ! ఇలా చెప్పటం నీకు తగినదేనా, నీకు సమాధానం చెప్పటానికి నాకు భయంగా ఉంది. ఇతరుల కోసం శరీరం త్యజించుట కంటే పుట్టుకకు మరొక ఫలితమేముంది. ధధీచి, జీమూతవాహనుడు, శిబియు తెలివిలేనివారా, ప్రపంచంలో పరోపకారార్థమే ఈ శరీరం అనే ఆర్యసూక్తి తెలియనిది కాదు కదా అన్నాడు. దానితో శివయోగి వీడు చిఱుతొండనంబిని మించినవాడు సుమా అనుకుంటూ వెళ్ళిపోయాడు. జగన్నాటక సూత్రధారి అయిన శివుడు సిరియాళుని మూర్ఛపోయేటట్లు చేయగా ఆ గురువు కలతపడి, భయభ్రాంతుడయ్యాడు. ఆ క్షణంలోనే నోటినుండి

విపరీతంగా చొంగ కారుతుండగా, కనుగ్రుడ్ల సంచారం ఆగిపోగా, గుండెలదరగా, కంఠంలో గురక తీవ్రంకాగా, సిరియాళుడు భూమిపైపడి మూర్ఛపోయాడు. ఓం నమఃశివాయ అనే మంత్రోచ్చారణ చేసి గురువు సిరియాళుని నుదుటిన విభూతి నలమగా అతడు మూర్ఛ నుండి తేరుకున్నాడు. భక్తులకు ప్రాణరక్షయైన దివ్యౌషధం భస్మమే కదా.

చిఱుతొండనంబి కుష్ఠువ్యాధి పీడితుడైన ఆ శివయోగిని వీపున ధరించి, గ్రుడ్డి అవ్వ చేతికర్ర తాటిస్తూ వెంటరాగా, ఆమెను కూడా కలుపుకుంటూ, భస్మపుసంచి, యోగదండం, కమండలం, పులితోలు చేతితో పట్టుకొని, శరణుగోరదగినవారు ఎదురొస్తే శరణంటూ వీధులలో జనసమ్మర్దమును తప్పించుకుంటూ మెల్లమెల్లగా శివస్తోత్రం చేస్తూ ప్రజలందరూ తనను మెచ్చి చూస్తుండగా ఇంటికొచ్చాడు. కపటపు జోగి రూపంలోనున్న గంగాధరుని మోయటం వలన ఎంత అదృష్టం. ఆ వైశ్యుడు అత్యంత భక్తిశ్రద్ధలతో జంగముని రాజవీధులలో మోశాడు. ఆవిధంగా ఇంటికి తెచ్చి ఆ వైశ్యుడు, అతని భార్య భయభక్తి వినయ గౌరవాలతో యోగిపుంగవుడికి, ముసలమ్మకూ సంపంగె నూనె పూసి స్నానం చేయించి ఉతికినబట్టలు కట్టించారు. ఆ తర్వాత ఏకాంతగృహంలో దేవతార్చనకు కావలసిన అన్ని వస్తువులను సమకూర్చగా ఆ ఆదిదంపతులు శివపూజ చేస్తున్నారు. అప్పుడు శివుడి ఆజ్ఞననుసరించి పల్లె నుంచి చిఱుతొండనంబి బావమరుదులు మేనల్లుడైన సిరియాళుడిపై గల ప్రేమతో అటుకులు, చక్కిలాలు, పటిక బెల్లపుముక్కలు, సెనగపప్పు, చిమ్మిలి ఉండలు ఎక్కువగా తెచ్చారు.

నుదుటిపై విభూతిరేఖలు, చెవులకు రాగికమ్మలు, కంఠంలో దళసరి కంటె, వక్షోజాలపై కావిరంగు వల్లెవాటు, జఘనమండలంపై కరక్కాయ రంగద్దిన వస్త్రం మడిచికట్టిన కట్టు, చేతికి లింగకంకణం, జడ కుచ్చులపై వస్త్రపుపీలిక కలిగిన పదహారేళ్ళ పచ్చిబాలింతరాలైన తాపస స్త్రీ తిరువెంగనాచి దగ్గరకొచ్చి బిడ్డకు పాలుపోయించమని అడిగింది. ప్రేమ ఇనుమడించగా కుమారుడిని చంపటానికి ఆటంకం కలిగించి దయ పుట్టించే విధంగా పార్వతీదేవి మాయజోగిత వేషంలో మెల్లమెల్లగా వచ్చి బిడ్డకు పాలుకోరగా తిరువెంగనాచి అన్ని సమయాలలో ఎలా ఉంటుందో అలాగే మనసులో ఎలాంటి వ్యాకులపాటు లేకుండా పాలుపోసింది. పాలు పోయించుకొని పార్వతీ చన్మొనలు పాలచేపుతో గిలిగింతలు పెట్టగా అరచేతులతో సుతిమెత్తగా వత్తుకుంటూ తిరువెంగనాంచితో ఇలా అంది. కంచిపట్టణంలోని ప్రజలంతా నిజమో, అబద్దమో కానీ మీరు దయవిడిచి కుమారుడిని చంపి ఒక మాయజోగికి ఆహారంగా పెడుతున్నారని చెప్పుకుంటున్నారు. ప్రపంచంలో ఇలాంటిది ఎక్కడైనా ఉందా, మాయోపాయాలు పన్నుటలో నేర్పరులైన జోగులు నిధులు, సిద్ధులు పొందటానికి ఏవిధంగానైనా ప్రవర్తిస్తారు. పుత్రుడిని చంపి ఆహారంగా వారికివ్వటం మీకు తగినదేనా. నీ భర్త బుద్ధి కాటిలో కలిసిందా ఏంటి, చిన్నబిడ్డను చంపటానికి నీ భర్త ఎలా పూనుకున్నాడు. అతను వెర్రిభక్తితో కన్నులు కానడుగాక, అతడెవడు నీ కుమారుడిని చంపటానికి. మగవాడు, మ్రాను ఒకటే అను మాట నేటి మాట కాదుకదా చెపుమా ! అనిన మాయజోగిత మాటలు లక్ష్యపెట్టక తిరువెంగనాచి శివుడికీ, శివయోగికి భేదం లేదుకదా, శరణార్థుల ప్రాణాలు శివాధీనాలే కదా, అతడే కర్త. అతడే భోక్త. దీనికోసం ఇంత విచారించుట యెందుకు, నీకు ఆలస్యమవుతుంది. మొదలు బాలింతరాలివి, చన్నులు చేపుచున్నవి. ఈ ఆలస్యానికి బిడ్డ ఎంత బాధపడునో, పోసిన పాలు చాలుకదా. ఎప్పుడూ మా ఇంటికి వస్తూ పోతూండు. వెళ్ళిరా, కలతపడకు అని చేదోయి నుదుట నుంచి నమస్కరించి తన పనిలో తాను నిమగ్నమైన ఆమెలో ఎలాంటి సంకోచం కనిపించక పార్వతీదేవి అక్కడి నుంచి అంతర్హితురాలైంది.

ఆ సమయంలో చిఱుతొండనంబి భార్యను సమీపించి బిడ్డకు ఉపనయనం చేయాలి కాబట్టి గురువుల ఇంటికి వెళ్ళి బిడ్డను తీసుకురా. ఇరుగుపొరుగువారందరి భాగ్యసంపదలు, వంశాభివృద్ధి జరుగుచుండగా మనం మన కుమారుడికి ఉపనయనం చేసిన మరుక్షణమే ముక్తికన్యతో వైభవంగా వివాహం చేయాలి అనగా తిరువెంగనాంచి అలాగేనని ఆచార్యుని ఇంట చదువుతున్న కుమారుడిని తీసుకొని వచ్చింది. ప్రేమతో మేనత్తలు పంపిన తినుబండారాలు తీనెలో, నేతిలో ముంచి తింటూ తల్లిదండ్రులను ఊరిస్తూ చేష్టలు మీద ఇంటి ముంగిట సిరియాళుడు ఆడుతున్నాడు. తర్వాత సిరియాళుడికి

జడల అల్లిక సడలించి, సంపెంగనూనె జుట్టు కుదుళ్ళకు రాసి, చక్కగా నలుగుపెట్టి పన్నీటితో నూరిన పసుపుతో సిందూరమలది, కస్తూరి కలిపిన చందనంతో, సీకాయ పొడితో శరీరం జిడ్డు పోగొట్టి నులివెచ్చని నీటితో స్నానం చేయించి జుట్టును ఆరబెట్టి, సురపొన్న పువ్వులను అలంకరించి, బట్టలు తొడిగి, కాటుకపెట్టి, నుదుటున భస్మంతో మూడురేఖలు దిద్ది కుమారుని అలంకరించి అతనితో తల్లిదండ్రులు ఈవిధంగా చెప్పారు. శివయోగికొకనికి, పాశుపత వ్రతాచరణము ననుసరించి నైవేద్యము పెట్టుటకై నిన్ను మాంసాహారంగా వండి భోజనం పెడుతున్నాము. నీ మనసులో ప్రాణాలు విడువలేని దుఃఖం కొంచెమైనా లేదు కదా అనగా సిరియాళుడు ప్రాణమందు నాకెంతమాత్రము తీపిలేదు. మీ వంశం అలాంటిది కాదుకదా, మనసులో కలత మానండి. మాయా మహాయోగి అయిన శివుడికి నైవేద్యమవుతాను. హింస చేస్తున్నామనే దుఃఖాన్ని వదలండి, పరమ గురువులైన తల్లిదండ్రులు మీరు, మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను. వీరశైవాచార వ్రతానుసరణ పూజ్యభావంతో చావడానికి అంగీకరించిన కుమారుడికి, చంపటానికి అంగీకరించిన దంపతులకు భేదమేముంది. ఈవిధంగా చందనికతో సహా ముగ్గురూ ఏకకార్య నిశ్చయబద్ధులయ్యారు. పాలిచ్చే విధంగా తల్లి బిడ్డను పడుకోబెట్టుకోగా, చందనిక క్రింద ఒత్తుగా తన చేతులనుంచింది. సిరియాళుడు చిరునవ్వు నవ్వుతూ చేతులను జోడించాడు. చిరుతొండనంబి కొత్తకత్తిని వాదర అంచు సమానంగా ఉండేటట్లు పదునుపెట్టాడు. ఆవిధంగా ఆ నలుగురి హృదయాలలో ఆనందం నిండివుండగా తల్లిదండ్రులు ముగ్గురు కుమారుడైన సిరియాళుడితో ప్రేమ మీద తండ్రీ సిరియాళ కుమారా ! వీరశైవదీక్షా సంపన్నా ! మనసులో శంకించవద్దు. మాపట్ల నున్న ప్రేమానురాగాలు వదిలివేయి, పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తుండు. ఇది పరబ్రహ్మపదం పొందటంలాంటిది సుమా ! అని అన్నారు. చిరుతొండనంబి ఇదంతా శివసంబంధమైంది అనే పరమవిశ్వాసంతో, మనసులో ఎలాంటి అనుమానంలేక నిర్వికారంగా తిరువెంగనాంచి తొడలను దన్నుగా చేసికొని పదునైన కత్తి మెడయందు మోపగానే సిరియాళుడి శిరసు తెగి భూమిపైపడి నమశ్శివాయ మంత్రాన్ని పఠిస్తూ వుంది. కందకుండా, కళావిహీనం కాకుండా, కాంతి చెడకుండా, చెక్కిళ్ళపై చిరునవ్వు పోకుండా మెల్లమెల్లగా క్రమంగా నిద్రపోతున్నట్టి సిరియాళుడి ముఖచంద్రుడు అందంగా భాసించాడు. ఆ సమయంలో దంపతులిద్దరి హృదయాలు ఆనందంతో నిండాయి. పందెంవేసి గెల్చినట్లు, అప్పు పూర్తిగా తీర్చినట్లు ఆ ఆలుమగలు తమ ముద్దుబిడ్డను చంపి వీరశైవ వ్రతక్రమాన్ని నిర్వహించారు.

మిరియాలు, ఉల్లిపాయలు, పసుపు, మెంతులు, ఇంగువ, జీలకర్ర, పంచదార, చింతపండు, లవంగాలు, నేయి, నువ్వులనూనె, పెరుగు మొదలైనవాటితో చక్కగా సమ్మిశ్రంచేసి సిరియాళుని ఆ స్త్రీలిద్దరూ మనసురాయి చేసుకొని వండారు. తిరువెంగనాంచి, చందనికలు వంశకరుడైన సిరియాళుని మాంసాన్ని కమ్మని పులుసుగా, నీరు పూర్తిగా పోయేటట్లు సన్నని ముక్కలుగా తరిగి నేతిలో వేయించి, మూల్గుటెముకలతో రక్తం కలిపి చారుగా తయారుచేసి, వడియాలతో మరికొన్నింటిని కలిపి కొవ్వుతో తాలింపు వేయించి షడ్రసోపేతంగా రుచిగా వండారు. అందంలో మన్మథ సమానుడైన సిరియాళుని అనేకవిధాలైన కూరలుగా తయారుచేసి దొంతిగా పేర్చారు. నిగనిగా మెరుస్తున్న తోమిన వంటకాలున్న పాత్రలను భోజనశాలలోనికి తెచ్చి, పేర్చి, పన్నీరుజల్లి రత్నకంబళిపరచి, దేవతార్చనకు కావలసిన ధూపదీపాది సకల వస్తువులను సిద్ధపరచి కర్పూరం కలిపిన ముగ్గుతో ముగ్గులుపెట్టి, ఎడమ వైపున రాగిపాత్ర ఉంచి అందులో గరికముంతతో నీరుపోసి తిరువెంగనాంచి భోజనానికి సర్వసిద్ధమైందని చెప్పగా చిరుతొండనంబి వృద్ధుడైన జంగముడిని, అంధురాలైన ముసలి అవ్వను అక్కడకు తీసుకువచ్చాడు. చిరుతొండనంబి పవిత్రమూర్తి అయిన జంగముని పాదపద్మాలు కడిగి పాదోదకాన్ని అతడు, అతడి భార్య స్వీకరించారు. తర్వాత అంతచేత ముదురుకాని, పొడవు వెడల్పు గల అరటి ఆకులను మధ్యలోని ఈనెతీసి నీటితో కడిగి, చుట్టూ నీరు ధారగా వదలి పాయసం, అప్పం, పప్పు, చెరకురసం, ద్రాక్షరసం, ఆవుపాలు, తేనె, పంచదార, నేయి, పెరుగు, ఆకుకూరలు, పానకం, కుమారుడి మాంసం అన్నంతో సహా వడ్డించి పరమేశ్వర స్వరూపుడవైన యోగీశ్వరుడా ఆరగించవలసింది అని ఆ దంపతులు నమస్కరించారు. జంగమశ్రేష్ఠుడు సిరియాళ కుమారుని మాంసంతో కూడిన కూరలను బాగా పరీక్షించి చూచి చిరుతొండనంబితో అందులో తలమాంసం కనిపించకపోవటంతో ఈ నీరస

మాంసమెందుకు ? నీ ప్రియపుత్రుని తలమాంసం వండించలేదు, కుమారుడిపై వ్యామోహం ఇలా ఉంటుంది కదా అన్నాడు. అయ్యో ! మా వ్రతం చెడిపోయింది. ఇది ఏమి భోజనం మాకెందుకు, తలమాంసం లేని మిగిలిన మాంసమెందుకు దీనిని నేనెలా భుజిస్తాను అనగా చిరుతొండనంబి భయంతో తిరువెంగనాంచితో ఇప్పుడెలా అనగా ఆ క్షణంలోనే చందనిక తలమాంసాన్ని ముందుపెట్టి, తంటాలమారి జంగముల పద్దతి ముందే తెలిసినదానిని కనుక నేను దానిని వండాను. యోగివరుని మనసు ఏవిధమైన వికారం పొందకుండా వడ్డిస్తానని వడ్డించగా సంతోషించిన ఆ కపటయోగి తిరిగి చిరుతొండనంబితో నా సహపంక్తిని నువ్వు కూడా భుజింపనిచో నాకు మాత్రం భోజనం చేయటానికి చెయ్యి ఎలా ఆడుతుంది. ఒక్కరే భుజించుట పాపమనే వేదవాక్యం నీవు వినలేదా. అంతేకాక భోజనవిషయంలో ఇంకో నియమముంది. బాలుడు బంతిలో లేకపోతే నాకు భోజనం సహించదు. మగబిడ్డలేని అదృష్టహీనులింట భోజనం చేయరాదు. కావున, నీ కుమారుని భోజనానికి పిలువు. అపుడు ఆరగిద్దాము అనగా మహానుభావా ! తమరు ముందే ఈ మాట చెప్పారు, నేను దానిని మరిచాను. మాకు మరొకబిడ్డ ఉన్నాడు, కానీ అతడు ఇప్పుడు ఆడుకోవటానికో, చదువుకోవటానికో వెళ్ళాడు. ఈ క్షణంలోనే పిలిపిస్తాను. కానీ అతడి కోసం ఎదురుచూస్తుంటే కూరలు చల్లారిపోతాయి కదా అని చిరుతొండడు అనెను. ఆ యోగిపుంగవుడు నీ భార్య నాలుగుదిక్కులకు తిరిగి బిగ్గరగా పిలిస్తే కుమారుడు వస్తే బంతిన కూర్చోబెట్టుకొని భుజిద్దాము. రాకపోతే నేను, ఈ గ్రుడ్డి అవ్వ అప్పుడు భుజిస్తాము. అంతేగానీ, నీవుపడిన శ్రమను వృధాచేయములే అనగా భర్త అంగీకారంతో తిరువెంగనాంచి ఓ వైశ్యకులాబ్ది చంద్రమా ! వికసిత పద్మనేత్రుడా ! ఘోర వీరశైవవ్రతుడా ! త్యాగైకశీలా! కుమార కంఠీరవమా! బుద్ధి యందు బుధునివంటివాడా ! మన్మథాకారా ! సంసారదూరా ! వన్నెవడుగ, కుమార సిరియాలా ! నా ప్రాణమా, నా దైవమా రారా అంటూ కుమారుని ఉద్దేశించి పిలిచింది. ఆ తిరువెంగనాంచి అన్ని దిక్కులకు తిరిగి బిగ్గరగా కుమారుడిని రమ్మని పిలువగా, సిరియాళుడు మహావేగంగా కూరలుగా వండబడిన ఆ మాంసపు ఖండాల నుండి వారి మనసులకు సంతోషం కలిగించగా వచ్చాడు. భస్మమలదిన శరీరంతో, కంఠమందు సర్పభూషణుడై, మెడ యందు నల్లని కప్పుకలవాడై, ప్రకాశిస్తున్న గొప్ప జడలుకలవాడై, అర్థశశాంక శేఖరుడై, ఫాలతలాన నేత్రం కలవాడై పరమేశ్వరుడు చిరుతొండనంబికి హృదయంలో సంతోషం కలిగే విధంగా ప్రత్యక్షమయ్యాడు. ఆ పరమశైవుడైన చిరుతొండనంబి భయభక్తి విశ్వాసాలు మనసులో ముప్పిరిగొనగా జయం నీలకంఠా, జయంభక్త చింతామణీ, జయం గంగాధర, చంద్రశేఖరా, విశ్వప్రభూ, దయాంభోనిధీ, జయం పార్వతీ కుచద్వయాశ్రిత చందన కుంకుమ ముద్రాంకిత వక్షస్థలా ! జయము జయమని స్తుతించాడు. అనేకవిధాలుగా ప్రార్థించాడు. పరమేశ్వరుడు చిరుతొండనంబితో నీవు తుంబురుడవు, తిరువెంగనాంచి గంధర్వ స్త్రీ, సిరియాళుడు కుమారస్వామి, చందనిక అప్సరస స్త్రీ. మీరిరువురు ఒక్కో కారణంగా మానవజన్మ ఎత్తారు. మీరు మీ యథాస్థానాలలో ఉండి నన్ను పూజించండి. శరీరంతో కైలాసానికి రండి అని అనుగ్రహించగా చిరుతొండనంబి ఈ ప్రపంచంలో కోమటి కులంలో ప్రఖ్యాతిగాంచి, వేయిగోత్రాలతో ప్రసిద్ధిచెంది, వీరశైవాచారాన్ని విడువకుండా పాటిస్తూ, ఏడువాడల వారందరం ఎలాంటి ఎక్కువతక్కువలు లేకుండా కలిసిమెలసి ఉన్నాము. ఇలాంటి చుట్టప్రక్కాలను వదలి నేనొక్కడినే రాలేను. కనుక ఓ చంద్రశేఖరా ! వీరందరిని తీసుకువెళ్ళేటట్లైతే వస్తాను, నీకు అంగీకారమైతే వీరందరిని తీసుకువెళ్ళు, లేకపోతే వెళ్ళిరావచ్చు. ప్రమథులలో లేమే అనే బాధలేదు. ఇక్కడే మేమందరం కలిసి నిన్ను పూజిస్తూ ఉంటాము అన్నాడు. ఆ పరమేశ్వరుడు కరుణించి ఏడు వాడల వారందరూ కదలిరండి, నీకిష్టమైన వరం ఇచ్చాను అనిన క్షణంలోనే కంచిలోని ఏడువాడలలో ఉన్న వైశ్య ప్రముఖులతో, సర్వజీవరాసులతో ప్రకాశమై వెల్గొందుతూ, చిరుతొండనంబి ఆకాశపథాన కైలాసానికెళ్ళెను.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము.

**పాఠం - 14**

# సిరియాళుని కథ - శ్రీనాథుడు

## (హరవిలాసం - ద్వితీయాశ్వాసం - 1 నుంచి 142వ పద్యం వరకు )

## సమగ్రవ్యాఖ్యలు

**సమగ్ర వ్యాఖ్యలు :**

**పద్యం - 7**

అయ్యూరూద్భవ వంశసంభవుని నేకామ్రాధినాథాంబికా
శయ్యామందిర నిర్మలాత్మకుని భిక్షావృత్తి జంగంబొకం
డొయ్యంజేరఁగ వచ్చి మా శివుని నేఁడోలార్చెదం గాని తే
వయ్యా యిక్షురసంబు తూమెఁడనుచుం బ్రార్థించి నేమించినన్.

**పరిచయం :**

శ్రీనాథ మహాకవి రచించిన హరవిలాసము ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

**సందర్భం :**

శివుడు పార్వతీదేవితో చిఱుతొండనంబి వృత్తాంతం చెబుతూ అతడు నిరంతరం జంగమారాధనలు చేసేవాడనే సందర్భములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఆ + ఊరు + ఉద్భవవంశ సంభవునిన్ | = | బ్రహ్మ తొడల నుంచి పుట్టిన వైశ్యకులంలో జన్మించినవాడిని |
| ఏకామ్ర + అధినాథ + అంబికా శయ్యామందిర | = | పరమేశ్వరుడికి, కామాక్షీదేవికి శయ్యా మందిరముగా |
| నిర్మల + ఆత్మకుని | = | నిర్మలమైన మనస్సును చేసినవానిని |
| భిక్షావృత్తి జంగంబు + ఒకండు | = | భిక్ష వృత్తిలో నున్న జంగమదేవుడొకడు |
| ఒయ్యన్ | = | మెల్లగా |
| చేరఁగవచ్చి | = | సమీపించి |
| మా శివుని | = | మా శివుడిని |
| నేడు | = | ఈ రోజు |
| ఓలార్చెదన్ కాని | = | అభిషేకింతును కనుక |
| తేవయ్యా | = | తీసుకొని రా |
| ఇక్షురసంబు | = | చెరకు రసం |
| తూమెడు | = | తూమెడు |
| అనుచున్ | = | అంటూ |
| ప్రార్థించి | = | ప్రార్థన చేసి |
| నేమించినన్ | = | నియమించగా |

**తాత్పర్యం :**

ఆ వైశ్యకులంలో పుట్టినవాడు, పరమేశ్వరుడు, కామాక్షీదేవికి తన మనసును శయ్యామందిరముగా చేసినవాడిని, భిక్షవృత్తి అయిన జంగముడొకడు సమీపించి శివుని నేడు అభిషేకించుటకు తూమెడు చెరకురసం కావలెనని ప్రార్థనాపూర్వకంగా ఆజ్ఞాపించాడు.

**విశేషాంశాలు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| UUU | IIU | I UI | I I U | U U I | U U I | U |
| శయ్యామం | దిర ని | ర్మలాత్మ | కుని భి | క్షావృత్తి | జంగం బొ | కం |

దీనిలో “మ-స-జ-స-త-త-గ” అనే గణాలున్నాయి. యతి స్థానం 13వ అక్షరం. కాబట్టి ఇది శార్దూలం.

**19వ పద్యం :**

**తూనిఁగ లాడ జొచ్చె దివిఁధూళి భ్రమింపఁగఁజొచ్చెఁబిచ్చుకల్**
**మానకయుబ్బె గుబ్బులుఁగు మాటికిమాటికిఁగొల్చెఁగొమ్మపై**
**దాన యవశ్యమింక బహువాసరముల్ జడివట్టునంచొగిన్**
**వానికి వాని కాడిరి యవారణఁబౌరులు కంచిలోపలన్.**

**పరిచయం :**

కవిసార్వభౌమ శ్రీనాథ విరచితమైన హరవిలాస మందలి ద్వితీయాశ్వాసంలోని “సిరియాళుని కథ” అనే పాఠ్యభాగములోనిదీ పద్యం.

**సందర్భం :**

శివుడి ఆజ్ఞతో ఇంద్రుడు కంచిపట్టణంలో 21 రోజులు వర్షం కురిపింప తలపెట్టగా వర్షాగమన సూచనలను తెలుపు సందర్భములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తూనిఁగలు + ఆడన్‌చొచ్చె | = | తూనిగలు ఆడటం ప్రారంభించాయి |
| దివి | = | ఆకాశంలో |
| ధూళి భ్రమింపఁగన్ చొచ్చెన్ | = | ధూళి తిరుగుడు పడసాగింది |
| పిచ్చుకల్ | = | పిచ్చుకలు |
| మానక ఉబ్బె | = | విడుపులేక ఎగురసాగాయి |
| గబ్బి + పులుగు | = | గబ్బి పక్షి |
| మాటికి మాటికిన్ కొల్చెన్ కొమ్మపై | = | మాటిమాటికి కొమ్మపై కూయసాగెను |
| వాన | = | వర్షం |
| అవశ్యము + ఇంక | = | తప్పదు ఇకను |
| బహువాసరముల్ | = | అనేక దినములు |
| జడిపెట్టు | = | భాదించును |

| | | |
|---|---|---|
| అంచు | = | అంటూ |
| ఒగిన్ | = | క్రమంగా |
| వానికి వానికి + ఆడిరి | = | ఒకరినొకరు అనుకోసాగిరి |
| అవారణన్ | = | అడ్డులేక |
| పౌరులు | = | పురజనులు |
| కంచి లోపలన్ | = | కంచి పట్టణంలో |

**తాత్పర్యం :**

ఆకాశంలో తూనీగలు ఆడుచున్నాయి. ధూళి తిరుగుడుపడి ఎగురసాగింది. గబ్బిలుగు మాటిమాటికి కొమ్మపై అరువసాగింది. చాలారోజులపాటు వానకురిసి బాధించునని కంచిలో పౌరులు ఒకరికొకరు ఆ గుబ్బుగా చెప్పికొనసాగిరి.

**విశేషాంశాలు :**

వర్షాగమన సూచనలు సహజంగా వర్ణించటం జరిగింది కాబట్టి స్వభావోక్తి అలంకారంతో ఈ పద్యం అలరారుతుంది.

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| UII | UIU | III | UII | UII | UIU | IU |
| తూనిఁగ | లాడఁజొ | చ్చె దివి | ధూళి భ్ర | మింపఁగఁ | జొచ్చెఁబి | చ్చుకల్ |

ఈ పద్యపాదమందు భ, ర, న, భ, భ, ర, వ, అనే గణాలున్నాయి. కాబట్టి ఇది ఉత్పలమాల. యతి స్థానం 10వ అక్షరం.

**29వ పద్యం :**

ఆ ముయ్యేడుదినంబులందు శివభక్త్యాచార సంపత్తికిన్
సీమాభూమి యనం బ్రసిద్ధుఁడగు నాచిర్తొండనంబీశ్వరుం
డేమీ కొంకకపెట్టు జంగములకున్ హేరాలమిష్టాన్నముల్
సేమం బొప్పఁగ రేలునుం బగలునున్ విశ్వాసపూర్వంబుగన్.

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని సిరియాళుని కథ అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

శివుడి ఆదేశం ప్రకారం ఇంద్రుడు కంచిపట్టణంలో 21 రోజులు వర్షం కురిపించినప్పుడు చిఱుతొండడు జంగములకు మృష్టాన్నాలు సమకూర్చు సందర్భములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఆ ముయ్యేడు దినంబులు | = | ఆ ఇరవైఒక్క రోజులలో |
| శివభక్తి + ఆచారసంపత్తికిన్ | = | శివభక్తి ఆచార సంపదకు |
| సీమాభూమి అనన్ | = | అవధి అనునట్లుగా |

| | | |
|---|---|---|
| ప్రసిద్ధుఁడు అగున్ | = | పేరుపొందినవాడగు |
| ఆ చిర్తొండనంబి + ఈశ్వరుడు | = | ఆ చిరుతొండనంబి శ్రేష్ఠుడు |
| ఏమీ కొంకక | = | ఏమీ సందేహించక |
| పెట్టు | = | పెడతాడు |
| జంగములకున్ | = | జంగములకు |
| హేరాలము | = | అధికంగా |
| ఇష్ట + అన్నముల్ | = | ఇష్టమైన అన్నములు |
| సేమంబు ఒప్పగ | = | శుభం కలుగునట్లుగా |
| రేలునున్ పగలున్ | = | రాత్రింబవళ్ళు |
| విశ్వాసపూర్వంబుగన్ | = | భక్తి ప్రపత్తులతో, నమ్మకం చెడకుండా |

**తాత్పర్యం :**

ఆ ఇరవైఒక్కరోజులు శివభక్తికతడు మారురూపు అనునట్లుగా ఆ చిరుతొండనంబి అత్యంతం భక్తిప్రపత్తులతో శివయోగులకు ఏవిధమైన జంకులేక, రుచికరములైన భోజనాలు పెట్టుచుండెను.

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| UUU | I IU | I UI | I I U | U U I | U U I | U |
| ఆ ముయ్యే | డు దినం | బులందు | శివభ | క్త్యా చార | సంపత్తి | కిన్ |

మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. యతిస్థానం 13వ అక్షరం. కాబట్టి ఇది శార్దూలం.

**91వ పద్యం :**

**ముసురుదినంబులందు మనమోసలఁ బంచటరుంగుమీఁదటన్**
**భసితవిభూషణుల్ పరమపావనమూర్తులు శైవసంహితా**
**భ్యసనపరాయణుల్ గిరిశభ్తులనేకులు నిండియుంద్రు నేఁ**
**డసితసరోరుహాక్షి ! యొకఁడైనను లేఁడిది యేమి చోద్యమో**

**పరిచయం :**

ఈ పద్యం శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసం లోని సిరియాళుని కథ అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

జంగమ ప్రమథుల కోసం ఇంటి వాకిట చూచి ఒకరు లేకుండుట చూచి ఆశ్చర్యంతో ఆ విషయాన్ని భార్యకు తెలుపు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అసీతసరోరుహ + అక్షి | = | వికసించిన నల్లని కలువల వంటి నేత్రాలు గలదానా |
| ముసురు దినంబులందు | = | ముసురు పట్టిన రోజులలో సైతం |

| | | |
|---|---|---|
| మన మోసలన్ | = | ముఖశాలలో |
| పంచటరుంగు మీదటన్ | = | పంచ అరుగుపైన |
| భసిత విభూషణుల్ | = | భస్మం ధరించినవారు |
| పరమపావన మూర్తులు | = | పుణ్యాశాలురు |
| శైవసంహిత + అభ్యసన పరాయణుల్ | = | శివపురాణం పారాయణం చేయువారు |
| గిరిశభక్తులు + అనేకులు | = | శివభక్తిపరులు అనేకమంది |
| నిండియుండ్రు | = | నిండి ఉండువారు |
| నేడు | = | ఈ దినము |
| ఒకడు + అయినను లేడు | = | ఒక్కడైనా లేడు |
| ఇది ఏమి చోద్యమో | = | ఇది ఏమి వింతయో (విడ్డూరమో) |

**తాత్పర్యం :**

ఓ తిరువెంగనాంచీ ! ఓ సౌభాగ్యవతీ ! ముసురుపట్టిన దినములందు సైతం మన పంచలో భస్మధారణులు, పుణ్యాశాలులు, శివవేద పరాయణులు, పరమేశ్వర భక్తులు అనేకులుండెడివారు. అదేమి విడ్డూరమోకాని ఈ రోజున మచ్చునకొక్కరైనను కానరాలేదు.

**విశేషాంశాలు :**

కవితాపరంగా, అసితసరోరుహాక్షీ అని సంభోదించినది భార్యయగు తిరువెంగనాంచిని. అయితే దంపతులు ఒకరినొకరు పేరుపెట్టి పిలుచుకొనుట ఆచారంకాదు. అందువలన సౌభాగ్యవతీ ! అని చేర్చుట జరిగింది. ఇట్టి అలవాటు అనగా, మరొక పేరుతో భార్యను పిలుచుట కొన్ని కుటుంబాలలో నేటికినీ గలదు.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | IUI | U I I | I U I | I U I | I U I | U I U |
| భసిత | విభూష | ణుల్ పర | మ పావ | న మూర్తు | లు శైవ | సంహితా |

న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలున్నాయి. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల.

**48వ పద్యం :**

**మ్రొక్కి కరాంబుజద్వయము మోడ్చి లలాటమునన్ ఘటించి మా**
**యక్కడ మీరు నీ ముసలి యవ్వయు నేఁడు శివార్చనంబు స**
**మ్య క్కృతిఁజేసి నన్నుఁ జరితార్థునిఁజేయుట యుక్తమంచు నా**
**టక్కరి మాయజోగికిఁ దటాలుమనం బ్రణమిల్లినంతటన్.**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

ఇంటి ముందు ఒక్క జంగము ప్రమథుడు లేనికారణంగా కంచిపట్టణమంతా వెదుకగా కోటదాటి దూరంగా పాడుబడిన గుడిలో వృద్ధుడైన జంగముడు కనిపించగా సంతోషంతో చిఱుతొండనంబి అతనిని తన ఇంటికి రమ్మని ప్రార్థించు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మ్రొక్కి | = | మ్రొక్కి |
| కర + అంబుజద్వయము | = | పద్మముల వంటి రెండు చేతులను |
| మోడ్చి | = | మొగిడ్చి (ఒక్కటిగా చేసి) |
| లలాటమునన్ ఘటించి | = | నెన్నెదుట చేర్చి |
| మా యక్కడ | = | మా ఆ చోట |
| మీరును | = | మీరు |
| ఈ ముసలి అవ్వయు | = | ఈ ముసలి అవ్వ |
| నేడు | = | ఈ రోజు |
| శివార్చనంబు | = | పరమేశ్వరపూజ |
| సమ్యక్ + కృతిన్ కావించి | = | చక్కగా చేసి |
| నన్నున్ | = | నన్ను |
| చరిత + అర్థునిన్ చేయుట | = | కృతార్థుని చేయుట |
| యుక్తము + అంచున్ | = | తగుననుచు |
| ఆ టక్కరి | = | ఆ టక్కరి |
| మాయజోగికిన్ | = | మాయ జంగముడికి |
| తటాలుమనన్ | = | తత్క్షణమున |
| ప్రణమిల్లిన | = | కాళ్ళపై బడిన |
| అంతటన్ | = | అంతట |

**తాత్పర్యం :**

నమస్కరించి, హస్తద్వయమును ముకుళించి నొసట నుంచి నేడు మీరును, ఈ ముసలి అవ్వయు, మా గృహంబున శివార్చనముగావించి, నన్ను ధన్యుని చేయవలసినదని, ఉన్నపాటున ఆ టక్కరి జంగము ప్రమథుని కాళ్లపైపడగా అంతట .

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| UII | U I U | I I I | UI I | U I I | U I U | I U |
| టక్కరి | మాయజో | గికిఁ ద | టాలు మ | నం బ్రణ | మిల్లి నం | తటన్ |

ఈ పద్యపాదంలో భ, ర, న, భ, భ, ర, వ అనే గణాలున్నాయి. యతిస్థానం 10వ అక్షరం. ప్రాసనియమం కలదు. కాబట్టి ఇది ఉత్పలమాల.

**59వ పద్యం :**

ఉదరమున్ భరించి ప్రసవోద్భవ వేదన బొంది పిమ్మటన్
ముదమదియైన పీతఁబడి మూత్రమునంబడి లజ్జ వండుగా
నదవదయైన తల్లికిఁ బ్రియంబొ సుతుండు వృథాభిమాన దు
ర్మదుఁడగు తండ్రికిం బ్రియుఁడొ మానసవీథిఁదలంచి చూడుమా.

**పరిచయం :**

ఈ పద్యం శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని సిరియాళుని కథ అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

శివయోగి మూర్ఖునిలా తల అడ్డంగా తిప్పి నేను వృద్ధుడిని, నీమాట ప్రమాణంగా నీ ఇంటికి వస్తే నీ భార్య కాదంటే ఆ చోటికి వచ్చి తిరిగి ఇక్కడకు రాలేను అంటూ తల్లి ప్రేమ గురించి చెప్పే సందర్భములోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఉదరమునన్ భరించి | = | గర్భమునందు భరించి |
| ప్రసవ + ఉద్భవ వేదనన్ | = | ప్రసవ వేదనను |
| పొంది | = | పొంది |
| పిమ్మటన్ | = | తరువాత |
| ముదమదియైన | = | దురవస్థ కలిగించు |
| పీతఁబడి | = | మలమునపడి |
| మూత్రమునంబడి | = | మూత్రంలో పడి |
| లజ్జవండుగాన్ | = | సిగ్గు చెందినదై |
| అదవదయైన | = | కలత చెందిన |
| తల్లికిన్ | = | తల్లికి |
| ప్రియంబొ | = | ఇష్టుడొ |
| సుతుండు | = | కుమారుడు |
| వృథా + అభిమాన | = | వట్టి గర్వించే |
| దుర్మదుడగు | = | దుర్మదం కలవాడైన |
| తండ్రికిన్ | = | తండ్రికి |
| ప్రియుఁడొ | = | ఇష్టుడో |
| మానసవీథిన్ | = | మనసు నందు |
| తలంచి చూడుమా | = | ఆలోచించి చూడవలసింది |

**తాత్పర్యం :**

గర్భంలో మోసి, ప్రసవవేదన బొంది, మాల మూత్రములను ఎత్తి, ఎన్నో దురవస్థలకు లోనూ, అవమానము చెందినట్టి తల్లికి కుమారుడు, ప్రియమైనవాడో లేక కేవల దురభిమానియైన తండ్రికి ఇష్టుడో, మనసులో తలంచి చూడుమా!

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

న జ భ జ జ జ ర

I I I I U I U I I I U I I U I I U I U IU

ఉదర మునన్ భ రించి ప్ర సవోద్భ వ వేద న బొంది పిమ్మటన్

ఈ పద్యపాదంలో న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలున్నాయి. ప్రాస నియమం చెల్లుతుంది. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల.

**69వ పద్యం :**

**వలచినయేని నబ్భువన వంద్యునకున్ శివయోగినేతకున్**
**బాలకయిగా వరంబయిన పుత్రుఁడొకండననేల నేను న**
**వ్వల మఱి నీవుఁ బ్రాపులగువారమెకామె విభూతిఁదెం డిఁకం**
**బలుకులు వేయు నేటిఁకల భక్తుని నేమమ పారమొందుతన్.**

**పరిచయం :**

ఈ పద్యం శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసం "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

చిఱుతొండనంబి శివయోగి కోరికను భార్య తిరువెంగనాంచితో చెప్పగా ఆమె సంతోషంతో అంగీకరించి మన ధన మాన ప్రాణాలకు శివయోగీశ్వరులే కర్తలు కనుక వారి సొమ్ము వారికి అప్పగించటం ఏమంత గొప్పపని అని చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| వలచిన ఏనిన్ | = | కావలయునని కోరినచో |
| భువనవంద్యునకున్ | = | ప్రపంచముచే పొగడబడువానికి |
| శివయోగినేతకున్ | = | జంగమ ముఖ్యునకు |
| పొలకయిగా | = | మాంసాహారంగా |
| వరంబు అయిన | = | వరప్రసాదమయిన |
| పుత్రుండు | = | కుమారుడు |
| ఒకండు అనన్ ఏల | = | ఒకడేయని చెప్పనేల |
| నేను | = | నేను |
| ఆ + వల | = | ఆపైన |
| నీవున్ | = | నీవు కూడా |
| ప్రాపులగువారమె కామె | = | అధీనమైనవారము కామా |
| విభూతి | = | విభూతి |
| తెండు | = | తేవలసినది |

| | | |
|---|---|---|
| ఇకన్ | = | ఇంక |
| పలుకులు వేయున్ ఏల | = | వేయి మాటలేల |
| నేటికి | = | ఈ రోజుకు |
| అల | = | ఆ |
| భక్తుని | = | భక్తుడి |
| నేమము | = | నియమము |
| పారము | = | ఒడ్డు |
| ఒందుతన్ | = | పొందుటకు |

**తాత్పర్యం :**

కావలెనని ఆ శివయోగి కోరవలయునే కాని, కుమారుడే అననేమి, నేనును, ఆపైన మీరును, అతనికి ఆహారము కాగలము కదా ! కనుక ఇకనిన్ని మాటలు అనవసరం. అతని నియమము చెల్లునట్లుగా విభూతినివ్వవలసినది.

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| బలుకు | లు వేయు | నేటి క | ల భక్తు | ని నేమ | మ పార | మొందుతున్ |

ఈ పద్యపాదంలో న, జ, భ, జ, జ, జ, ర అనే గణాలున్నాయి. ప్రాస నియమం చెల్లుతుంది. యతిస్థానం 11వ అక్షరం. కాబట్టి ఇది చంపకమాల.

**75వ పద్యం :**

అన్నా యీ చిఱుతొండనంబియను పాపాత్ముండు మీ తండ్రియే
యన్నిర్భాగ్యుడు జోగి కొక్కరునికిన్ హాలామదోన్మాదికిన్
నిన్నుంజంపి మహేశహారముగ దండింపగనున్నాఁడు సం
పన్న స్నేహముతోడ నీకు నెఱిఁగింపన్ వచ్చితిం జెచ్చెరన్.

**పరిచయం :**

శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

శివుడు జటాధారి రూపంలో గురువుగృహంలో చదువుకుంటున్న సిరియాళుని దగ్గరకొచ్చి అతనితో మాట్లాడు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అన్నా | = | ఓ అన్నా |
| ఈ | = | ఈ |
| చిఱుతొండనంబి | = | చిఱుతొండనంబి |

| | | |
|---|---|---|
| అను | = | అనే |
| పాపాత్ముండు | = | పాపాత్ముడు |
| మీ తండ్రి ఏ | = | మీ నాయనయేనా |
| ఆ నిర్భాగ్యుడు | = | ఆ భాగ్యహీనుడు |
| జోగికి | = | జోగికి |
| ఒక్కరునికిన్ | = | ఒకనికి |
| హాలామద + ఉన్మాదికిన్ | = | మద్యపానమత్తుడైన పిచ్చివానికి |
| నిన్నున్ | = | నిన్ను |
| చంపి | = | చంపి |
| మహేశాహారముగా | = | శివునికి నివేదనముగా |
| వండింపంగనున్నాఁడు | = | వండించనున్నాడు |
| సంపన్న స్నేహముతో | = | నిండు స్నేహంతో |
| నీకున్ | = | నీకు |
| ఎఱిఁగింపన్ | = | తెలియచెప్పుటకు |
| వచ్చితిన్ | = | వచ్చాను |
| చెచ్చెరన్ | = | వెంటనే |

**తాత్పర్యం :**

అన్నా ! చిఱుతొండనంబియనువాడు మీ తండ్రియేకదా ! ఆ నిర్భాగ్యుడు మద్యపానంచే మత్తిల్లిన ఒక శివయోగికి నిన్ను చంపి పరమేశ్వరునికి నైవేద్యంగా సమర్పింప ఆహారంగా వండింపదలచాడు. నీయందలి స్నేహంచేత ఈ విషయం నీకు తెలుపకోరి వేగంగా వచ్చాను.

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| UUU | I I U | I U I | I I U | U U I | U U I | U |
| అన్నాయీ | చిఱుతొం | డనంబి | యను పా | పాత్ముండు | మీ తండ్రి | యే |

ఈ పద్యపాదంలో మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. యతిస్థానం 13వ అక్షరం. ప్రాసనియమం కలదు. కాబట్టి ఇది శార్దూలం.

**89వ పద్యం :**

**మహినూహింపఁగ నెంత భాగ్యముకొ యామ్నాయాంత సిద్ధాంత వా**
**జ్మ హిళాకుంతలమౌక్తికభరణమున్ మందాకినీశేఖరుం**
**గుహనా భైరవు యోగిపుంగవుని భర్గున్ రాజమార్గంబునన్**
**వహియించెం దన వీఁపునం దిరముగా వైశ్యుండనాలస్యతన్.**

**పరిచయం :**

ఈ పద్యం శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

చిఱుతొండనంబి గ్రుడ్డి అవ్వ వెంటరాగా కుష్ఠువ్యాధి పీడితుడైన శివయోగిని వీపుపై ధరించి కంచిపట్టణ వీధుల నుండి శివస్తోత్రం చేస్తూ ఇంటికి పోవు సమయంలో అతని అదృష్టాన్ని వర్ణించే సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మహిన్ | = | ప్రపంచంలో |
| ఊహింపగన్ | = | ఆలోచించగా |
| ఎంత భాగ్యము ఒకొ | = | ఎంత అదృష్టమో గదా |
| అమ్నాయ + అంత సిద్దాంత | = | వేదాంత సిద్ధాంతమను |
| వాక్ + మహిళాకుంతల | | |
| మౌక్తిక ఆభరణమున్ | = | స్త్రీ రత్నం కొప్పు యందు ముత్యాల ఆభరణమైనవాడు (శివుడు) |
| మందాకినీ శేఖరున్ | = | ఆకాశగంగను తలయందు ధరించినవాడు |
| కుహనా భైరవు | = | కపటభైరవుడు |
| యోగిపుంగవుని | = | యోగీశ్వరుడిని |
| భర్గున్ | = | శివుని |
| రాజమార్గంబునన్ | = | రాజవీధి యందు |
| వహియించెన్ | = | మోసెను |
| తన వీపునన్ | = | తన వీపుపై |
| తిరముగా | = | స్థిరముగా |
| వైశ్యుండు | = | వైశ్యుడైన ఆ చిరుతొండనంబి |
| అన్ + ఆలస్యతన్ | = | ఎట్టి అలసత్వం లేకుండా |

**తాత్పర్యం :**

ఆలోచించి చూడగా, ప్రపంచంలో ఇది ఎంత అదృష్టమో కదా ! ఉపనిషద్విద్యకు అవధియైన, కపటపు జోగి రూపముననున్న గంగాధరుని, ఆ వైశ్యుడు అత్యంత భక్తిప్రపత్తులతో రాజవీధులందు మోసెను.

విశేషాంశాలు :

**అలంకారం :**

రూపక, ఉల్లాసములు

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| గుహనా | భైరవు | యోగి పుం | గవుని | భర్గున్ | రాజమార్గం | బునన్ |

స, భ, ర, న, మ, య, వ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 14వ అక్షరం. కాబట్టి ఇది మత్తేభం.

**98వ పద్యం :**

ప్రజలెల్లం బురిఁ గ్రంతక్రంతల మహాపాపంబుగాఁబల్కెడున్
నిజమో కల్లయొగాని మీరఁట కడున్ నిస్త్రింశభావంబునన్
నిజపుత్రున్ సుకుమారుఁజంపి యొక దుర్నిర్వాణికిం జోగికి
న్భు జియింపంగ నొనర్చువారటిది యెందున్గల్గునే యిద్ధరన్.

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

తిరువెంగనాంబి దగ్గరకు పచ్చి బాలింతరాలైన తాపస స్త్రీ వేషంలో పార్వతీదేవి వచ్చి ఆమె మనసు మార్చటం కోసం దయపుట్టించు రీతిలో మాట్లాడు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రజలు + ఎల్లన్ | = | ప్రజలందరూ |
| పురిన్ క్రంత క్రంతల | = | పట్టణ మంతటను (సందుగొందులలో సైతం) |
| మహాపాపంబుగా | = | భయంకరమైన పాపంగా |
| పల్కెడున్ | = | అనుకొనుచున్నారు |
| నిజమో కల్లయోకాని | = | సత్యమో, అసత్యమో కాని |
| మీరు అట | = | మీరేమో |
| కడున్ | = | మిక్కిలి |
| నిస్త్రింశభావంబునన్ | = | నిర్ణయాత్ముౖలై |
| నిజపుత్రున్ | = | స్వంత కుమారుని |
| చంపి | = | చంపి |
| ఒక దుర్ + నిర్ + వాణికిన్ | = | దుర్మార్గుడైన తాపసికి |
| భుజింపగన్ | = | భుజింపగా |
| ఒనర్చువారట | = | పెట్టువారట గదా |
| ఇది | = | ఇలాంటిది |
| ఎందున్ కల్గున్ | = | ఎక్కడైనా కలదా |
| ఈ + ధరన్ | = | ఈ ప్రపంచంలో |

**తాత్పర్యం :**

కంచి పట్టణమంతట సందుగొందులలో సైతం ప్రజలు, నిజమో, అబద్ధమోకాని, మీరు దయమాలి, కుమారుని చంపి, ఒక మాయజోగికి ఆహారంగా పెట్టుచున్నారని చెప్పుకొనుచున్నారు. ప్రపంచమునందిట్టిది ఎక్కడైనా కలదా !

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| ప్రజలె | ల్లంబురి | గ్రంతక్రం | తల మ | హా పాపం | బుగాఁబ | ల్కెడున్ |

స, భ, ర, న, మ, య, వ అనే గణాలున్నాయి. యతిస్థానం 14వ అక్షరం. ప్రాసనియమం కలదు. కాబట్టి ఇది మత్తేభం.

**112వ పద్యం :**

సంసార భ్రమమించుకేనియును మత్స్వాంతంబునన్ లేదు మీ
వంశంబీ పరిపాటిదే యుడుగుఁడీ వైక్లబ్యసంభావనల్
మాంసాహారమునయ్యెదన్ శివునకున్ మాయామహాయోగికిన్
హింసాక్లేశము మానుఁడీ గురులు మీరే మిమ్ముఁబ్రార్థించెదన్

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

తండ్రి చిఱుతొండనంబి సిరియాళునితో నిన్ను శివయోగికొకనికి నైవేద్యం పెట్టుటకు మాంసాహారంగా వండి భోజనం పెడుతున్నాము. నీ మనసులో ప్రాణాలు వదలలేని దుఃఖమేమైనా ఉందా అని అడిగినప్పుడు సిరియాళుడు సమాధానం చెప్పిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| సంసారభ్రమము | = | ప్రాణములందలి తీపి |
| ఇంచుక + ఏనియున్ | = | ఎంతమాత్రమును |
| మత్ | = | నా |
| స్వాంతంబునన్ | = | మనసు నందు |
| లేదు | = | లేదు |
| మీ వంశంబు | = | మీ వంశం |
| ఈ పరిపాటిచే | = | ఇట్టి ఆచారము గలదే / ఈ మాత్రముదే |
| ఉడుగుఁడు | = | మానుడు |
| ఈ వైక్లబ్యసంభావనల్ | = | ఈ విధమైన మానసిక విచారమును |
| మాంస + ఆహారమున్ | = | మాంసాహారాన్ని |
| అయ్యెదన్ | = | అవుతాను |
| శివునకున్ | = | శివుడికి |
| మాయామహా యోగికిన్ | = | మాయా మహాయోగికి |

| | | |
|---|---|---|
| హింసాక్లేశము | = | హింసించుట వలన కష్టమును |
| మానుఁడీ | = | మానుకొనవలసింది |
| గురులు | = | పరమ గురువులు |
| మీరే | = | మీరే |
| మిమ్మున్ | = | మిమ్ములను |
| ప్రార్థించెదన్ | = | వేడుకొంటున్నాను |

**తాత్పర్యం :**

ప్రాణమునందలి తీపి నాకెంతమాత్రమును లేదు. మీ వంశమిట్టిదా ! మనమునందు కలత మానుడు. మాయా మహాయోగియైన శివునకు నైవేద్యమవుతాను. హింస చేయుచున్నామను దుఃఖమును వదలుడు. పరమగురువులైన తల్లిదండ్రులు మీరు మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

విశేషాంశాలు :

**అలంకారం = ఉదాత్తము**

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| మ | స | జ | స | త | త | గ |
| UUU | IIU | I UI | II U | U U I | U U I | U |
| సంసార | భ్రమమిం | చంకేని | యును మ | త్ప్రాంతంబు | నన్ లేదు | మీ |

మ, స, జ, స, త, త, గ అనే గణాలున్నాయి. ప్రాసనియమం కలదు. యతిస్థానం 13వ అక్షరం. కాబట్టి ఇది శార్దూలం.

**132వ పద్యం :**

మొదలం దేవర యానతిచ్చితిర యేమ్ముం జిత్తవృత్తిన్ మఱా
మది నాకుంగొడుకింకనుం గలుడు వాఁడాడంగ నెందేగెనో
చదువంబోయెనొ ! పిల్వఁబంచెద నవశ్యంబుం బ్రతీక్షించు నీ
యదనం గూరలు చల్లనారవె మహాత్మా యోగిచూడామణీ

**పరిచయం :**

శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

కపట యోగి చిఱుతొండనంబితో తన పంక్తిన నువ్వు, నీ కుమారుడు కూర్చుని భోజనం చేయమని, మగబిడ్డలేని అదృష్టహీనునింట భోజనము చేయరాదని చెప్పగా అతనికి చిఱుతొండనంబి సమాధానం చెప్పు సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మొదలన్ | = | మొదటనే |
| దేవర | = | దేవరైన తాము |

| | | |
|---|---|---|
| ఆనతి + ఇచ్చితిర | = | చెప్పియున్నారు |
| ఏమున్ | = | మేము |
| చిత్తవృత్తిన్ | = | మనసు నందు |
| మఱాము + అది | = | అది దురచితిమి |
| నాకున్ | = | నాకు |
| కొడుకు ఇంకనున్ | = | కొడుకు ఇంకొకడు |
| కలండు | = | ఉన్నాడు |
| వాడు + ఆడంగన్ | = | వాడు ఆడుకొనుటకు |
| ఎందు + ఏగెనో | = | ఎక్కడకు వెళ్ళెనో |
| చదువన్ పోయెనొ | = | చదువుకొనుటకు వెళ్ళెనో |
| పిల్వన్ పంచెదన్ | = | పిలువనంపెదను |
| అవశ్యంబున్ | = | వెంటనే |
| ఇపుడే | = | ఇప్పుడే |
| ప్రతీక్షించున్ | = | ఎదురు చూచుట |
| ఈ అదనన్ | = | ఈ సమయంలో |
| కూరలు | = | కూరలు |
| చల్లన్ + ఆరవె | = | చల్లబడిపోవా |
| మహాత్మా | = | ఓ మహాత్మా |
| యోగి చూడామణీ | = | యోగులకు శిరోభూషణమైనవాడా ! |

**తాత్పర్యం :**

ఓ మహానుభావా ! తాము మెదటనే ఈ మాట చెప్పివున్నారు. కానీ దానినెట్లో మరచితిని. మాకు మరియొక బిడ్డడుగలడు. కాని అతడు ఇపుడు ఆడుకొనుటకు వెళ్ళెనో, లేక చదువుకొనుటకు వెళ్ళెనో, ఇప్పుడే ఈ క్షణముననే పిలువనంపెదను కాని, అతని కొరకు ఎదురుచూచుట వలన కూరలు చల్లారిపోవును గదా !

**విశేషాంశాలు :**

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| మొదలం | దేవర | యానతి | చ్చితర | యేముం జి | త్తవృత్తిన్ | మఱా |

స, భ, ర, న, మ, య, వ అనే గణాలున్నాయి. యతిస్థానం 14వ అక్షరం. ప్రాసనియమం కలదు. కాబట్టి ఇది మత్తేభం.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము.

పాఠం - 15

# సిరియాళుని కథ - శ్రీనాథుడు

## (హరవిలాసం - ద్వితీయాశ్వాసం - 1 నుంచి 142వ పద్యం వరకు )

## సందర్భసహిత వ్యాఖ్యలు

**సందర్భసహిత వ్యాఖ్యలు :**

**1. వాని సరి యెవ్వ(డు లే(డు వసుంధరాస్థలిన్ (పద్యం - 5)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసం నుండి గ్రహించబడిన "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగములోనిదీ వాక్యం.

**సందర్భం :**

పరమశివుడు పార్వతీదేవితో కాంచీపురంలో శివభక్తి అనే ఆచార సామ్రాజ్యలక్ష్మికి కంఠాభరణమైనవాడు, మచ్చలేని వ్యాపార కులంబోధికి పూర్ణచంద్రుడి వంటివాడు, ఉత్తముడు అయిన చిఱుతొండనంబి గురించి చెప్పు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

జంగములు ఎందరు, ఏ సమయంలో, ఏ పదార్థం ఎంత కోరినా సంకోచించక అందరికీ ఆవిధంగా ప్రాణాలుపణంగా పెట్టి అయినా సమకూరుస్తాడు. ఆ చిఱుతొండనంబికి సమానమైనవాడు ప్రపంచంలో మరొకడులేడు.

**2. యామోపు(గదల్పలేక యవశుండయ్యెన్ (పద్యం - 9)**

**పరిచయం :**

శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగములోనిదీ వాక్యం.

**సందర్భం :**

శివుని అభిషేకించుటకు తూమెడు చెరుకురసం కావాలని అడిగిన జంగముడి కోర్కె తీర్చటం కోసం చిరుతొండనంబి మంచి నల్లచెఱకులను బారపొడవుండే విధంగా విరిచి వాటినన్నింటిని మోపుకట్టి ఆ మోపును ఎత్తే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

తూమెడు చెరకురసం వచ్చుటకు తగినన్ని చెరకుగడలు తీగలతో గుండ్రంగా మోపుకట్టి ఆ మోపును కదిలించలేక అసమర్థుడయ్యెను.

**3. నేను నపుడు చెమర్చితినేమి చెప్ప (11వ పద్యం)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

శివుడు పార్వతీదేవితో తనకు చెమటపట్టడానికి కారణం చెబుతూ చిరుతొండనంబి తూమెడు చెరకురసం రావటానికి తగినన్ని చెరుకుగడలు మోపుకట్టి ఎత్తులేకున్నాడు అని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

అపుడు నేను ఒక్కడినే వెళ్ళి ఆ మోపును ఒకవైపు ఎత్తికొంటిని. ఆ చిరుతొండనంబి మరొకవైపు ఎత్తుకొనెను. ఆ మోపు బరువుకి అతడును, నేను చెమర్చితిమి. చెప్పుటకు ఇంతకంటే ఏమీలేదు.

**4. నంబుధర మాలికలు దక్షిణంబు నడచె (పద్యం - 17)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

చిరుతొండనంబిని పరీక్షించదలచిన శివుడు ఇంద్రుడిని పిలిచి కంచిపట్టణంలో నాలుగువైపుల, మూడు యోజనాల దూరం వరకు కుంభవృష్టి కురిపించటానికి మేఘాలను పంపమనగా ఇంద్రుడు అమరావతికి వచ్చి మేఘాల కట్టు త్రాళ్ళు వదిలించి కంచిలో ఇరవైఒక్కరోజులు కురవమని చెప్పిన సమయంలో వర్షాగమన సూచనలు వర్ణించు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

పడమటి దిక్కున వరదగుడి వేసింది. పూర్ణచంద్రుని చుట్టూ గుడి కట్టింది. ఆకాశమార్గంలో దట్టమైన మేఘాలు పట్టాయి. మేఘాలు దక్షిణంవైపు నడిచాయి.

**5. గంచిఁ దెప్పలఁదేల్చె నకాలవృష్టి (పద్యం 23)**

**పరిచయం :**

శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

ఏనుగు తొండాలను పోలిన వర్షం కుండపోతగా కురియగా కంచిపట్టణంలో ప్రజలు ఆ అకాలవర్షానికి, పడుతున్న పిడుగులకు భయపడి పది అర్జుననామాలు జపిస్తున్నారని, ఆ వర్షం కారణంగా ఏర్పడిన వరద ప్రభావం ఎలా ఉందో చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

కామాక్షీదేవి ఆలయాన్ని ముంచేటంతగా ఊలపడింది. ఆలయంతో సహా ఏకామ్రనాథుని ముంచెత్తింది. కరిగిరిపై గల వరదరాజస్వామి పాదాలను ప్రవాహం తాకింది. ఆ అకాలవర్షంలో కంచిపట్టణంలో తెప్పలు తేలియాడుతున్నాయి. అనగా, ఆ పట్టణమంతా మునిగిపోవటంతో ప్రజలు వీథులలో తెప్పలపై తిరగవలసి వచ్చిందని భావం.

**6. నిశాతఖడ్గము క్రియం గన్పెట్టె నప్పట్టుగన్ (పద్యం - 26)**

**పరిచయం :**

శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

ఇరవై ఒక్క రోజులు ఎడతెఱపి లేకుండా కురిసిన వర్షం ఎట్టకేలకు ఆగింది. సూర్యోదయమై, వర్షం వెలసి బాధిత ప్రాణకోటికి కొంత తెరపిచ్చింది అని వర్షానంతరం ఆకాశాన్ని వర్ణించే సందర్భంలోనిదీ పద్యం.

**వివరణ :**

అనేక దినాలు అధికవర్షం, జోరున ఎడతెరపి లేక కురిసి, ఉన్నట్టుండి హోరుగాలితో వెలసింది. ఆ సమయంలో ఆకాశం నిర్మేఘమై, మురికి పోవునట్లుగా కడుగబడిన ముత్యంలాగా, సాన పెట్టబడిన కత్తివాదరలాగా ప్రకాశించింది.

**7. దినములు రేల్ప్రయోఘృత దధిప్రచురాన్న సమర్పణంబునన్ (పద్యం 30)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

ఆ ఇరవైఒక్కరోజులు శివభక్తికి చిరుతొండనంబి మారురూపు అనే రీతిగా అత్యంత భక్తిప్రపత్తులతో శివయోగులకు ఏవిధమైన జంకు లేకుండా రుచికరమైన భోజనాలు పెడుతున్నాడని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఆ పుణ్యదంపతులైన చిరుతొండనంబి, తిరువెంగనాంచి, కుమారుడైన సిరియాళుడు, అతని దాది చందనిక ఆ అకాల వర్షసమయంలో పాలు, పెరుగు, నేయి, తేనె మొదలైన మంచి ఆహారాన్ని ఆ శివయోగులకు రాత్రింబవళ్ళు సదా పెట్టడాన్ని వారు ఎన్నోవిధాలుగా ప్రశంసిస్తారు.

**8. వాకిటికి వచ్చె శివయోగివరుల నరయ (పద్యం 38)**

**పరిచయం :**

ఈ వాక్యం శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిది.

**సందర్భం :**

చిరుతొండడు ప్రతిరోజు ప్రమథులు కనీసం ఒక్కడైనా తన సహపంక్తిని లేకున్న, భోజనం చేయని వ్రతం కలవాడగుటచే ఆరోజు మధ్యాహ్న సమయంలో వీరమాహేశ్వర సమయ సిద్ధాంత మార్గాన్ననుసరించి శివయోగుల కోసం వాకిటికొచ్చి చూసే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

చంద్రార్థమౌళికి అభిషేకం చేసి, తడియొత్తి, గంధం, పుష్పమాలికలు సమర్పించి ధూపం వేసి, దీపారాధన చేసి, తాంబూలం సమర్పించి, నమస్కరించి, జంగమారాధన సమయం కనుక నైవేద్యం సమర్పించకూడని కారణంగా పరమేశ్వర లింగమున్న పూజాపేటికను భద్రపరచి, జంగమ ప్రమథులను చూచుటకు తన వాకిలి ముందటికి వచ్చాడు.

**9. భ్రమసి తప్పిన పసరంబు నెమకినట్లు**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

ఎప్పుడు చూచినా తన వాకిట్లో అనేకులు జంగమ ప్రమథులుంటారు. అంత ముసురుపట్టిన రోజులలో కూడా అనేకమంది ఉండేవారు. ఈరోజు ఒక్కరూ లేరు. పట్టణంలోకి వెళ్ళి జంగమ ప్రమథులను వెదకి తెస్తానని తిరువెంగనాంచితో చెప్పి పట్టణంలోకి వెళ్ళి చిరుతొండనంబి ప్రమథులను వెతుకువిధానం వివరించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

చిరుతొండనంబి జంగములను వెదకు ప్రయత్నంలో తొందరపాటు, భయం పెనకొనగా వారి కొరకు వీథులలో, దేవాలయాల వద్ద, పానశాలలు వద్ద, రచ్చపట్టుల దగ్గర వెతికాడు. బెదిరి తప్పిపోయిన పశువులను వెదకినట్లు, అజాగ్రత్త వలన చేజారిపోయిన సొమ్మును వెదకినట్లుగా ఆ చిరుతొండనంబి జంగమ ప్రమథుల కోసం పట్టణం వీథుల వెంట తిరగసాగాడు.

**10. శివుని కారుణ్యమనుచు నాశీర్వదించె (పద్యం 49)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

నగరం వెలుపల పాడుబడిన గుడి గర్భమంటపంలో గ్రుడ్డి అవ్వ పాదాలొత్తుతుండగా పులితోలుపై శయనించి ఉన్న ఎనభై సంవత్సరముల వృద్ధజంగముడిని చూసి నమస్కరించి తమ ఇంటికి రమ్మని వారిని చిరుతొండడు అభ్యర్థించిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

నరసి, వాలిపోయిన కనుబొమలెత్తి, ఆ ముదుసలి జంగముడు తల వడకుచుండగా, చిరుతొండనంబి ముఖం చూచి నెమ్మది అయిన కంఠస్వరంతో పరమేశ్వరుడి దయ అని ఆశీర్వదించాడు.

**11. యిట్టి ధర్మంబు మిన్నక యేల కలుగు (పద్యం 61)**

**పరిచయం :**

శ్రీనాథ కవి విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

మాయ జంగముడు చిరుతొండనంబి వివరాలన్నీ అడిగి తెలుసుకొని, సంవత్సరకాలంగా తాను శివారాధనతో నిరాహారదీక్ష చేస్తున్నాననీ, ఆ వ్రతం తల్లిదండ్రులే తమ కుమారుడికి ఉపయనం చేసి, అతడిని వండి వడ్డించాలని దానికి అంగీకరిస్తే వస్తానని, ఆ విషయం నీ భార్యను కూడా అడిగి ఆమె అంగీకారం కూడా తెలిపిన తరువాతే విభూతి అందుకుంటానని జంగముడు చిరుతొండనంబితో చెబుతున్న సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ముందు నీ భార్యయు, పిదప నీవును భస్మము గ్రహింతురు గాక. ఇట్టి విషయంలో భార్యభర్తల ఇద్దరి మాట ఒక్కటైతేగానీ ఇలాంటి కార్యాలు నెరవేరవు.

**12. గ్రహంబులలో నుడురాజు కైవడిన్ (పద్యం - 73)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

కపటపు మాయజోగి వేషంలో నున్న శివుడు వృద్ధవేషపు తన రూపు మార్చి ఇంకో రూపంతో గురువు ఇంటిలో చదువుకుంటున్న సిరియాళుని మనసు మార్చుటకై అక్కడకు వెళ్ళిన సమయంలో సిరియాళుని వర్ణించిన సందర్భములోనిదీ వాక్యం.

**వివరణ :**

చేతిలోనున్న పుస్తకంలో వ్రాయబడి ఉన్నట్టి పరమేశ్వర స్తవమును చదువుచూ, ధీరగుణ సంపన్నులైన అక్కడి విద్యార్థులందరిలో సిరియాళుడు గ్రహాలలో చంద్రుడిలాగా ప్రకాశిస్తున్నాడు.

**13. దానవుఁడుగాక వాఁడేటితండ్రి చెపుమ (పద్యం 77)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

సిరియాళుడి మనసు మార్చటం కోసం గురువు ఇంటికి వెళ్ళిన జటాధారి సిరాయాళుడి దగ్గరకు వెళ్ళి తనకు నమస్కరించిన సిరాయాళునితో నీ తండ్రి అయిన చిరుతొండనంబి శివయోగికి నిన్ను చంపి, పరమేశ్వరుడికి నైవేద్యంగా సమర్పింప ఆహారంగా వండింపదలచాడు. నీపట్లనున్న స్నేహంచేత ఈ విషయం నీకు తెలుపాలని వేగంగా వచ్చాను అని చెప్పే సమయంలో జటాధారి సిరియాళుడితో అన్న మాటలివి.

**వివరణ :**

కడుపున పుట్టిన ప్రేమను త్రోసిరాజని కుమారుడిని, వంశోద్ధారకుడిని చంపి, మాంసాశనులైన జోగులకు పెట్టు క్రూరాత్ములు ఎక్కడైనా ఉన్నారా ! చెంపలు మీటిన వసవల్చు పసివానిని చంప ప్రయత్నించువాడు రాక్షసుడుగాక తండ్రి ఎట్లగును. మద్యపాన మత్తుడైన ఒక జంగముడు నిన్ను కోరినంతనే మీ తండ్రి నిన్ను చంపుటకు నిర్ణయించెను.

**14. కీర్తికాయంబుఁ గైకొంట కార్తియేల (పద్యం 81)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

ఎక్కడికైనా వెళ్ళి ఈ ఆపదను తప్పించుకో అని చెప్పిన జటాధారితో సిరాయాళుడు ఇతరుల కొరకు శరీరం త్యజించుట కంటే పుట్టుటకు ఫలితమేముంది, పరోపకారం కోసం ఈ శరీరం అనే ఆర్యోక్తి వినలేదా అని చెప్పు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

ఓ పుణ్యాత్ముడా ! అస్థిరం, దోషభూయిష్టమునైన ఈ దేహాన్ని ఇతరుల ఉపయోగం కొరకు వినియోగించి, నిర్మలం శాశ్వతమునైన కీర్తిని పొందుటకు సంతాపం చెందనేల.

**15. భక్తులకు భస్మమేకదా ప్రాణరక్ష (పద్యం 86)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

జంగమ ప్రమథుడు సిరియాళుని చూసి వీడు చిఱుతొండనంబిని మించినవాడు అనుకుంటూ సిరియాళుడికి మూర్ఛ వచ్చేటట్లు చేసిన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

పరమేశ్వరుని మాయావిలాస రచనము వలన సిరియాళుని ప్రాణాలు కడబట్టగా పాఠశాల మొత్తం భయంతో విహ్వలధ్వనులు చెలరేగాయి. ఓం నమఃశివాయ మంత్రోచ్చారణ గావించి గురువు సిరియాళుని నొసట విభూతి నలదుటచే అతడు మూర్ఛ నుండి తేరుకున్నాడు. భక్తులకు ప్రాణరక్షయైన దివ్యౌషధం భస్మమే గదా !

**16. "మగవాడో మ్రానో" యనుమాట నేఁటిమాటయె చెపుమా (పద్యం 101)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

తిరువెంగనాంచి మనసు మార్చటం కోసం పార్వతీదేవి పచ్చి బాలింతరాలైన తాపసస్త్రీ రూపంతో తిరువెంగనాంచిని సమీపించి బిడ్డకు పాలుపోయించుకుని కంచి పట్టణంలో ప్రజలందరూ మీ బిడ్డను చంపి మాయాజోగికి ఆహారంగా పెట్టబోతున్నారని చెప్పుకుంటున్నారు అని చెప్పే సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

మాయాపాయాలు పన్నటంలో నేర్పరులైన జోగులకు మీ బిడ్డను చంపి ఆహారంగా పెట్టటం మీకు తగినదేనా ? నీ భర్త బుద్ధి కాటకలిసేనా ఏమి చిన్నబిడ్డను చంపుటకు నీ భర్త ఎట్లు పూనుకున్నాడు. అతడు వెర్రిభక్తితో కన్నులుకానడుగాక. అతడెవడు నీ కుమారుని చంపటానికి. మానవతీ ! మగవాడు, మ్రాను ఒకటేనను మాట ఈ రోజు పుట్టినదా చెప్పు.

**17. నేకవాక్యంబుగాఁబ్రీతి నిట్టులనిరి (పద్యం 116)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

శివయోగికి పాశుపత వ్రతాచరణననుసరించి సిరియాళుని నైవేద్యంగా పెట్టు విషయంలో చిరుతొండనంబి, తిరువెంగనాంచి, సిరియాళుడు, చందనిక అందరూ ఒకే నిశ్చయం చేసుకున్నారు అని చెప్పు సందర్భములోనిదీ వాక్యం.

**వివరణ :**

పాలిచ్చు విధంగా తల్లి, బిడ్డను పరుండబెట్టగా, చందనిక క్రింద ఒత్తుగా, తన చేతులనుంచెను. సిరియాళుడు చిరునవ్వు వెలయిస్తూ చేతులను ముకుళించెను. చిరుతొండనంబి క్రొత్తకత్తిని వాదర అంచు సమముగా నుండునట్లు పదునుపెట్టెను. అట్లు ఆ నలుగురి హృదయాలలో ఆనందం నిండియుండగా తల్లిదండ్రులు ముప్పురు కుమారుడైన సిరియాళునితో ప్రేమమీద నిట్లనిరి.

**18. వరుస నడిపిరి వీరశైవ వ్రతంబు (పద్యం 120)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" అనే పాఠ్యభాగంలోనిదీ వాక్యం.

**సందర్భం :**

చిరుతొండనంబి అంతా శివసంబంధమైనదిగా భావించి సిరియాళుని మెడపై పదునైన కత్తి ఉంచగానే సిరియాళుని తల తెగి భూమిపైపడి నమఃశ్శివాయ మంత్రం పఠించు సందర్భంలో ఆ దంపతుల మానసికస్థితి తెలుపు వాక్యమిది.

**వివరణ :**

ఆ సమయంలో ఆ దంపతులిరువురి హృదయాలు ఆనందంతో నిండాయి. పంతమాడి నెగ్గినట్లు, అప్పు పూర్తిగా తీర్చివేసినట్లు ఆలుమగలు తమ ముద్దుబిడ్డను చంపి వీరశైవవ్రతక్రమాన్ని నిర్వహించారు.

**19. గూరలు సేయవైతి వివిగో నిజపుత్ర నిసర్గ మోహమున్ (పద్యం 127)**

**పరిచయం :**

ఈ వాక్యం శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" లోనిది.

**సందర్భం :**

తిరువెంగనాంచి, చందనికలు సిరియాళుని మాంసాన్ని షడ్రసోపేతంగా రుచికరంగా వండారు. వండిన అన్ని పదార్థాలను సర్ది భోజనానికి సర్వం సిద్ధమని భుజించమని జంగమ శ్రేష్ఠుడికి, ముసలి అవ్వకు నమస్కరించి చెప్పగా ఆ పదార్థాలు చూచిన జంగమదేవర చిరుతొండనంబితో మాట్లాడు సందర్భములోనిదీ వాక్యం.

**వివరణ :**

జంగమశ్రేష్ఠుడు సిరియాళ కుమారుని మాంసంతో చేసిన కూరలను బాగుగా పరీక్షించి చూచి అందులో తలమాంసం కానరాకపోవటం చేత ఓ వర్తక శ్రేష్ఠుడా, ఈ నీరసమాంసమెందులకు, నీ ప్రియపుత్రుని తలమాంసాన్ని వండింపవైతివి, పుత్రుడిపై వ్యామోహం ఇలా ఉంటుంది కదా.

**20. వేదవాక్యార్థ మన్నది వినవె చెపుమ (పద్యం 130)**

**పరిచయం :**

ఈ వాక్యం శ్రీనాథుడు రచించిన హరవిలాసం ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" లోనిది.

**సందర్భం :**

తమతో కలసి చిరుతొండనంబి, అతడి కుమారుడు భోజనం చేయాలని జంగమ ప్రమథుడు చిరుతొండనంబితో చెప్పు సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

నా సహపంక్తిని నీవు కూడా భుజింపనిచో నాకు మాత్రం భోజనంసేయ చెయెట్లాడుతుంది. ఒక్కరే భుజించుట పాపమనే వేదవాక్యం నువ్వు విని ఉండలేదా !

**21. సిరాలుతం(డికి హృదాహ్లాదంబు సంధిల్ల(గన్ (పద్యం 136)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసము ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ" లోనిదీ వాక్యం.

**సందర్భం :**

నీ భార్య నాలుగుదిక్కులకు తిరిగి కుమారుని పిలిస్తే వస్తాడు అని జంగమ ప్రమథుడు చెప్పగా తిరువెంగనాంచి కుమారుడిని పిలువగా సిరియాళుడు ఆ వండిన మాంసపు ఖండాల నుండి వారి మనసులకు సంతోషం కలిగించే విధంగా రాగా శివుడు ప్రత్యక్షమైన సందర్భంలోనిదీ వాక్యం.

**వివరణ :**

భస్మము నలదిన శరీరంతో కంఠంలో సర్పభూషణుడై మెడలో నల్లని కప్పుకలవాడై, ప్రకాశిస్తున్న గొప్ప జడల గలవాడై, అర్ధశశాంక శేఖరుడై ఫాలతలమున నేత్రం కలవాడై పరమేశ్వరుడు చిరుతొండనంబికి హృదయంలో సంతోషం కలుగగా ప్రత్యక్షమయ్యాడు.

**22. యిందఱ(గొనిపోయి తేని వత్తు( (పద్యం 140)**

**పరిచయం :**

శ్రీనాథ విరచిత హరవిలాసము ద్వితీయాశ్వాసంలోని "సిరియాళుని కథ"లోనిదీ వాక్యం.

**సందర్భం :**

పరమేశ్వరుడు ప్రత్యక్షమై చిరుతొండనంబితో నీవు తుంబురుడవు. తిరువెంగనాంచి గంధర్వ స్త్రీ. సిరియాళుడు కుమారస్వామి, చందనిక అప్సరస స్త్రీ. మీరు మానవజన్మ ఎత్తారు. మీరు శరీరంతో కైలాసానికి రండి అని చెప్పగా చిరుతొండనంబి చెప్పిన సమాధానమీ వాక్యం.

**వివరణ :**

ఈ ప్రపంచంలో కోమటి కులంలో ప్రఖ్యాతిగాంచిన వేయిగోత్రాలతో వినుతికెక్కి వీరశైవాచారాన్ని విడువక పాటిస్తూ ఏడువాడలవారం ఎట్టి హెచ్చుతగ్గులు లేక కలసిమెలసి యుందుము. ఇట్టి చుట్టుప్రక్కల విడిచి నేనొక్కడినే రాలేను. కనుక, ఓ చంద్రశేఖరా ! ఇందరిని కొనిపోయినచో వత్తును, నీ కంగీకారమైనచో ఇందరిని కొనిపొమ్ము. లేకున్న వెళ్ళిరావచ్చు. ప్రమథులలో లేమను బాధలేదు. ఇచ్చటనే మేమందరం కలసి నిన్ను పూజించుచుందుము.

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము.

పాఠం - 16

# సిరియాళుని కథ - శ్రీనాథుడు

## (హరవిలాసం - ద్వితీయాశ్వాసం - 1 నుంచి 142వ పద్యం వరకు )

## పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

**పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు**

**1. "సిరియాళుని కథ" ఇతివృత్తాన్ని వ్రాయండి.**

**లేదా**

**"సిరియాళుని కథ" పాఠ్యభాగ సారాంశాన్ని వివరించండి.**

కాంచీపురంలో నివసించే వ్యాపారి చిఱుతొండనంబి శివభక్తుడు. ఉత్తముడు. ఎంతో ప్రీతితో నిరంతరం జంగమారాధనలు చేస్తుంటాడు. జంగములు ఎందరైనా, ఏ సమయంలోనైనా, ఏ పదార్థమైనా, ఎంతైనా, ఏవిధంగా కోరినా ఏమాత్రం సంకోచించక ప్రాణం పణంగాపెట్టైనా ఆ కోరికలు సమకూరుస్తుంటాడు. ఒకరోజు భిక్షను వృత్తిగా కలిగిన జంగముడొకడు చిఱుతొండనంబిని సమీపించి శివుడిని అభిషేకించుటకు తూమెడు చెరుకురసం కావాలంటాడు. అప్పుడు చిఱుతొండనంబి తోటకు వెళ్ళి తియ్యటి చెరుకురసమిచ్చే మంచి నల్లచెరుకులు బారపొడవుండేటట్లు విరిచి తూమెడు రసానికి సరిపోయే చెరుకులన్నింటిని మోపుకట్టాడు. ఆ మోపును చిఱుతొండనంబి ఎత్తలేకున్న సమయంలో భక్తవత్సలుడైన ఆ పరమశివుడే వచ్చి ఒకవైపున ఆ మోపును ఎత్తుకొంటాడు. చిఱుతొండనంబి మరోవైపు ఎత్తుకుంటాడు. ఆ భారానికి ఇద్దరికీ చెమటపడుతుంది. శివుడు చెమర్చటానికి కారణం తెలుసుకున్న పార్వతీదేవి నాకు కూడా భక్తులలోనే శ్రేష్ఠుడైన ఆ చిఱుతొండనంబిని చూడాలనుంది, నన్నూ మీతో తీసుకువెళ్ళండి అని కోరుతుంది.

శివుడు ఇంద్రుడిని పిలిచి కాంచీపురంలో ఇరవైఒక్క రోజులు వర్షాలు కురిపించమని ఆదేశించగా అతని ఆదేశమందుకున్న ఇంద్రుడు అలాగే ఇరవైఒక్కరోజులు కుండపోతగా వర్షం కురిపిస్తాడు. కాంచీనగర ప్రజలు ఆ రోజులలో ఎంతో కష్టపడతారు. అంత వర్షపుదినాలలో కూడా చిఱుతొండనంబి జంగములకు ఏవిధమైన జంకు లేకుండా రుచికరమైన భోజనాలు పెట్టి శివయోగుల ప్రశంసలు పొందుతాడు. అకాలవర్షాలు పడిన రోజులలో తన విశాలమైన చావిడిలో శివభక్తులకు అన్నవస్త్రాలు ఇస్తాడు.

ప్రతిరోజు కనీసం ఒక జంగమ ప్రమథుడైనా తన సహపంక్తిని లేకపోతే భోజనం చేయని వ్రతం కలవాడైన చిఱుతొండడు ఆ వర్షం వెలిసిన తర్వాత మధ్యాహ్నకాలంలో వీరశైవాచార వ్రతవిధానాన్ని అనుసరించి లింగాన్ని చేతిలో ధరించి, నుదుట త్రిపుంఢ్రాలను దిద్ది మనసులో శివుడినే నిలుపుకున్నవాడై తన వాకిలి ముందుటకు వచ్చి శివయోగుల కొరకు చూడగా ఒక్కరూ కనిపించలేదు. అంత వర్షపుదినాలలో సైతం ఎందరో పరమేశ్వర భక్తులు తమ పంచలో నివసించారని, ఈరోజు ఒక్కరైనా లేరేమా అని ఆశ్చర్యపోతూ సహధర్మచారిణి అయిన తిరువెంగనాంచికి చెప్పి శివయోగులను వెదుకుటకై నగరంలోకి వెళతాడు. చిఱుతొండనంబి జంగముల కోసం వీధులలో, దేవాలయాల దగ్గర, పానశాలల దగ్గర, రచ్చపట్టుల దగ్గర, పశువుల బందెఖానాల దగ్గర, జోస్యులు ఉండే చోట్లలో వెదుకుతాడు. కాంచీపురమంతా వెదికినా ఒక్క జంగముడు కనిపించకపోవడంతో కోటదాటి దూరంగా వెళ్ళి అక్కడ పూటతోట సమీపంలో పాడుపడిన గుడి గర్భమండపంలో ఎనభైఏళ్ళ వృద్ధ జంగముడిని, అంతే వయసుగల గ్రుడ్డి అవ్వను చూసి నమస్కరించాడు. మీరు, మీ ముసలి అవ్వ మా ఇంటిలో శివార్చన చేసి నన్ను ధన్యుడిని చేయాలని చిఱుతొండనంబి ప్రార్థించగా, ఆ జంగముడు తాను సంవత్సరకాలం నుంచి

నిరాహారదీక్ష చేస్తున్నానని ఆ వ్రతం జంతుబలితో ముగుస్తుందని చెబుతాడు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య కులానికి చెందిన ఆరోగ్యవంతుడు, అందగాడైన బాలుడిని ఆ బాలుని తల్లిదండ్రులే ఉపనయనం చేసి అతడిని వండి వడ్డిస్తే తాను భుజిస్తానని దానికి సమ్మతమైతే వస్తానని చెబుతాడు. దానికి చిఱుతొండడు అంగీకరించగా దానికి జంగముడు ఇంటిలోని భార్య సమ్మతం కూడా తెలుసుకొనిరా, ఆమె అంగీకరిస్తేనే నేను వస్తాను అంటాడు. చిఱుతొండనంబి ఇంటికి వచ్చి అంతా భార్యకు తెలుపగా, ఆమె సంతోషంగా మన ధన మాన ప్రాణాలకు శివయోగీశ్వరులే కర్తలు కనుక వారి సొమ్ము వారికివ్వటం ఏమంత గొప్ప పని అంటుంది. భార్య భావం గ్రహించిన చిఱుతొండడు చందనికకు ఈ విషయం తెలుపుతాడు. ఆ ముగ్గురూ ఒక్కటిగా శివయోగికి సపర్య చేయటానికి నిశ్చయించుకుంటారు.

మాయాజోగి వేషంలో వున్న శివుడు తన ముసలివేషం తీసి ఇంకోరూపం ధరించి సిరియాళుడు గురువు ఇంట చదువుతుండగా అక్కడికి వెళ్ళి నమస్కరించిన సిరియాళునితో నీ తండ్రి నిన్ను చంపి పరమేశ్వరుడికి నైవేద్యంగా వండించదలచాడు. అతడేం తండ్రి, ఎంత క్రూరాత్ముడు, బ్రతికుంటే సుఖాలు పొందవచ్చు, నీవు ఎక్కడికైనా వెళ్ళి ఈ ఆపదను తప్పించుకోమని చెబుతాడు. దానికి సిరియాళుడు ఇలా చెప్పటం నీకు తగిందికాదు, ఇతరుల కోసం శరీరం త్యజించటం కంటే పుట్టుకకు ఫలితమేముంటుంది. దధీచి, జీమూతవాహనుడు, శిబి తెలివితక్కువవారా, పరోపకారార్థమే ఈ శరీరం అనే ఆర్యసూక్తి తెలియనిదా అని సమాధానం చెప్పగా వీడు తండ్రిని మించినవాడని శివయోగి భావిస్తూ అతడికి మూర్ఛ వచ్చేటట్లు చేస్తాడు. గురువు సిరియాళుని నుదుటిన విభూతి పెట్టగా అతడు మూర్ఛ నుండి తేరుకుంటాడు.

చిఱుతొండనంబి కుష్ఠువ్యాధి పీడితుడైన ఆ శివయోగిని వీపున ధరించి, గ్రుడ్డి అవ్వ చేతికర్ర తాటిస్తూ వెంటరాగా తన ఇంటికి తీసుకువెళతాడు. చిఱుతొండనంబి, తిరువెంగనాంచి వారిరువురికి సంపెంగె నూనె పూసి స్నానం చేయించి, ఉతికిన బట్టలు కట్టించి దేవతార్చనకు కావలసిన అన్ని వస్తువులు సమకూర్చగా ఆ ఆదిదంపతులు శివపూజ చేస్తారు. అపుడు పార్వతీదేవి తిరువెంగనాంచి దగ్గరకు పచ్చిబాలింతరాలైన తాపసస్త్రీ వేషంలో వచ్చి బిడ్డకు పాలు పోయించుకొని కంచి పట్టణంలో ప్రజలంతా మీరు బిడ్డను చంపి ఒక మాయజోగికి ఆహారంగా పెడుతున్నారని చెప్పుకుంటున్నారు. కొడుకుని చంపి మాయోపాయాలు పన్నటంలో నేర్పరులైన జంగములకు ఆహారంగా ఇవ్వడం మీకు తగినదేనా, నీ భర్తంటే మగవాడు, ద్రోమానుతో సమానం. అతడెవడు నీ బిడ్డను చంపటానికి అంటుంది. అప్పుడు తిరువెంగనాంచి శివుడికీ, శివయోగికి భేదం లేదు, శరణార్థుల ప్రాణాలు శివాధీనాలు, అతడే కర్త, అతడే భోక్త, దీనికోసం బాధపడటం ఎందుకు? నీ బిడ్డ ఆకలితో నీ ఆలశ్యానికి బాధపడుతుంటాడు, నీవు వెళ్ళిరా అంటూ నమస్కరిస్తుంది.

భర్త ఆదేశానుసారం గురువు ఇంటి దగ్గర నుండి సిరియాళుని తీసుకువచ్చి తిరువెంగనాంచి అతడికి స్నానం చేయించి అలంకరిస్తుంది. తరువాత తల్లిదండ్రులు బిడ్డతో శివయోగికొకనికి, పాశుపత వ్రతాచరణాన్ని అనుసరించి నైవేద్యం పెట్టుటకై నిన్ను మాంసాహారంగా వండి భోజనం పెడుతున్నాము. నీ మనసులో ప్రాణాలు విడువలేని దుఃఖమేమైనా ఉందా అనగా సిరియాళుడు ప్రాణంపట్ల నాకేమాత్రం తీపిలేదు, మనసులో కలత మానండి, మాయా మహాయోగి అయిన శివుడికి నైవేద్యమవుతాను. హింస చేస్తున్నామనే దుఃఖాన్ని వదలండి. పరమ గురువులైన తల్లిదండ్రులు మీరు, మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను అన్నాడు. చిఱుతొండనంబి, తిరువెంగనాంచి, చందనికలు ముగ్గురూ ఏకచిత్తులై సిరియాళ కుమారా ! వీరశైవదీక్షా సంపన్నా ! మనసులో ఏమాత్రం శంకించకు. మాపై వున్న ప్రేమానురాగాలు వదిలి పంచాక్షరీ మంత్రాన్ని పఠించు అని సిరియాళుడు మంత్రం పఠిస్తుండగా పదునైన కత్తితో తల ఖండించారు.

ఆ సిరియాళుడి మాంసాన్ని అనేకవిధాలుగా రుచికరంగా వండి తిరువెంగనాంచి, చందనికలు వాటిని చక్కగా పాత్రలలో సిద్ధం చేశారు. వాటిని వడ్డించి స్వీకరించమని జంగమశ్రేష్ఠుడిని ప్రార్థించగా వీటిలో తల మాంసం ఏది, తల మాంసం లేని మిగిలిన మాంసమెందుకు ? ఇలాంటి భోజనం మాకెందుకు అంటాడు. జంగముల పద్ధతి ముందుగానే

తెలిసిన చందనిక వండిన తలమాంసాన్ని తెచ్చి అతని ముందు ఉంచుతుంది. నా సహపంక్తిని నీవు, నీ కుమారుడు లేనిదే నేను భుజించలేను అంటాడు జంగముడు. కుమారుడు ఆడుకోవటానికి వెళ్ళాడు, పిల్చుకొస్తాము ఈలోపు కూరలు చల్లారిపోతాయి మీరు భుజించండి అని చిఱుతొండనంబి అనగా నీ భార్య పిలిస్తే కుమారుడు వస్తాడు, పిలువమను అని జంగముడంటాడు. అతని ఆనతిపై తిరువెంగనాంచి కుమారుడిని పిలువగా ఆ వండిన మాంసఖండాల నుంచి సిరియాళుడు లేచివస్తాడు.

శివుడు తన నిజరూపంతో ప్రత్యక్షమై నీవు తుంబరుడవు, తిరువెంగనాంచి గంధర్వ స్త్రీ, సిరియాళుడు కుమారస్వామి, చందనిక అప్సరస. మీరు ఒక్కో కారణంగా మానవజన్మ ఎత్తారు. శరీరంతో కైలాసానికి వచ్చి నన్ను సేవించండి అంటాడు. దానికి చిఱుతొండనంబి చుట్టుప్రక్కాలను వదలి నేనొక్కడినే కైలాసానికి రాలేను. వీరందరినీ తీసుకువెళ్ళేటట్లైతే వస్తాను అనగా పరమేశ్వరుడు కరుణించి ఆ వరం ఇస్తాడు. కంచిలోని ఏడువాడలలో ఉన్న వైశ్యప్రముఖులతో, సర్వజీవరాసులతో ప్రకాశమై వెల్గొందుతూ చిఱుతొండనంబి ఆకాశమార్గంలో కైలాసానికి వెళతాడు.

**2. సిరియాళుడి పాత్ర చిత్రణ చేయండి.**

శ్రీనాథ కవిసార్వభౌముడు హరవిలాసం అనే తన రచన ద్వారా శివభక్తుల భక్తివిశిష్ఠతను, భక్తులపట్ల శివుడి వాత్సల్యాన్ని నిరూపించే విధంగా ఇతివృత్తాన్ని, పాత్రలను తీర్చిదిద్దాడు. హరవిలాసంలోని ద్వితీయాశ్వాసంలో శివభక్తులలోనే అగ్రగణ్యుడు అంటూ చిఱుతొండనంబి వృత్తాంతాన్ని శివుడే స్వయంగా పార్వతితో చెప్పటం అతడిని చూడాలనే కోరికను పార్వతీదేవి వ్యక్తీకరించటం చిఱుతొండనంబి శివభక్తికి, అతడిపట్ల శివపార్వతుల వాత్సల్యానికి నిదర్శనం. అయితే ఆ చిఱుతొండనంబికి ఏమాత్రం తీసిపోని విధంగా శివభక్తికి పరాకాష్ఠగా తిరువెంగనాంచి, సిరియాళుల పాత్ర చిత్రీకరణ శ్రీనాథుడు చేశాడు. వయసులో పెద్దవారైన చిఱుతొండనంబి, తిరువెంగనాంచి అంత భక్తి కలిగి వుండటం ఆశ్చర్యంకాదు. కానీ అతి పిన్నవయసులోనే శివయోగుల కొరకు ప్రాణాలర్పించటానికి కూడా సిద్ధపడిన సిరియాళుడి భక్తి ఆశ్చర్య సంభ్రమాలను కలిగిస్తుంది.

సిరియాళుడు, చిఱుతొండనంబి, తిరువెంగనాంచిల ఏకైక పుత్రుడు. ముద్దుల మూట కట్టినట్లున్న పసివాడు. గురువులపట్ల, పెద్దలపట్ల భక్తి కలిగినవాడు. శివుడిపట్ల, శివయోగులపట్ల అచంచల భక్తిశ్రద్ధలను చూపువాడు. విద్యాభ్యాసంలోనూ మిగిలిన పిల్లలకంటే ముందుండువాడు.

**"హస్తగృహీత పుస్తకము నందు లిఖించిన యిట్టి నీలకం**
**ఠస్తవమున్ బఠించుచు ఘనంబుగ ధీగుణవైభవోన్నతుల్**
**విస్తరిలంగ బాలకులు వేపురిలో సిరియాళుఁడుండె న**
**భ్యస్తలిపి ప్రపంచుఁడు గ్రహంబులలో నుడురాజు కైవడిన్"**

చేతిలోనున్న పుస్తకంలో రాయబడిన పరమేశ్వరస్తవాన్ని చదువుతూ ధీరగుణ సంపన్నులైన విద్యార్థులందరిలో సిరియాళుడు గ్రహాలలో చంద్రుడిలా ప్రకాశిస్తున్నాడని శ్రీనాథుడు చెప్పటం ద్వారా గురువు దగ్గర చదువుకునే విద్యార్థులందరిలో సిరియాళుడు ఉత్తముడని చెప్పటం లక్ష్యం. గ్రహాలలో చంద్రుడితో పోల్చటంలో కూడా విశిష్ఠత ఉంది. చంద్రుడంత దగ్గరగా మనకి మిగిలిన గ్రహాలు కనిపించవు. అందువలన వాటి కాంతి మన వరకు రాదు. అంధకారంతో నిండిన రాత్రి సమయంలో చంద్రుడి వెలుగు చీకట్లను పారద్రోలుతుంది. అంతేకాకుండా మనం నేరుగా భరించలేని సూర్యకాంతిని ఆహ్లాదాన్నిచ్చే వెన్నెలలా మనకందిస్తుంది. అంతేకాకుండా అమృతత్వాన్ని ప్రసాదించేవాడు చంద్రుడు. ఇక్కడ కథలో కూడా మనకు చనిపోయిన సిరియాళుడు తిరిగిరావటం ద్వారా అమృతత్వాన్ని సాధించినట్లే అయింది. కనుక శ్రీనాథుడు సిరియాళుడిని చంద్రుడిలా అభివర్ణించారనిపిస్తుంది. ఇక్కడ సిరియాళుడికి ఏ సమయంలో ఏమి

చేయాలో అది చేసే గుణం ఉన్నట్లుగానూ కనిపిస్తుంది. గురువులింటిలో విద్యార్థి పని చదువుకోవటం, చేతిలోనున్న పుస్తకంలోని పరమేశ్వర స్తవాన్ని సిరియాళుడు పఠిస్తున్నాడు అని చెప్పటం ద్వారా సిరియాళుడికి చదువుపట్లనున్న ఆసక్తి, అదీ శివునిస్తవం పట్ల నున్న అనురక్తి నిరూపించబడుతుంది.

గురువు దగ్గర చదువుతున్న సిరియాళుడిని పరీక్షించదలచి శివుడు జటాధారి రూపం ధరించి వచ్చినప్పుడు సిరియాళుడు అతడి దగ్గరకెళ్ళి సాష్టాంగ నమస్కారంచేసి భక్తితో చేతులు జోడించి నిలిచాడు. శివభక్తులపట్ల సిరియాళుడికి అమితమైన భక్తి ఉందని ఈ సన్నివేశం నిరూపిస్తుంది. అంతేకాకుండా పిల్లలెవరైనా తమ తల్లిదండ్రులనే అనుకరిస్తారు, అనుసరిస్తారు. నిత్యం శివయోగులను భక్తిప్రపత్తులతో సేవించే తల్లిదండ్రులను చూసి సిరియాళుడు అదే భక్తిని అలవరచుకున్నాడు. పెద్దలను అనుకరించటం, తినుబండారాల పట్ల, ఆటల పట్ల ఇష్టం కలిగిఉండటం ఇవన్నీ సర్వసాధారణంగా చిన్నపిల్లల లక్షణాలే. వారు చేసే ఇలాంటి ఆటపాటలే పెద్దలను మురిపిస్తాయి. తన తల్లిదండ్రులను మురిపించే తనయుడు సిరియాళుడు.

"మంచిగ మేనయత్తలు సమాదరణం బడరంగఁబెట్టిపు
త్తెంచిన మంచి భక్ష్యములు తేనియ నేతను ముంచిముంచి భ
క్షించుచుఁ దల్లిఁదండ్రి, దన చిన్న కరాంగుళి వంచివంచి యూ
రించుచు నిచ్చమీఱంగఁ జరించెఁ గుమారకుఁడింటి ముంగిటన్

ప్రేమతో మేనత్తలు పంపిన తినుబండారాలను తేనెలో, నేతిలో ముంచి తింటూ తల్లిదండ్రులను ఊరిస్తూ చేష్టలు మీర సిరియాళుడు ఇంటి ముందు ఆడుకోవటం చిన్నపిల్లల ముద్దుచేష్టలను వాళ్ళ మనస్తత్త్వాన్ని నిరూపిస్తుంది.. వయసులో చిన్నవాడైన సిరియాళుడు ఆ వయసు పిల్లలలాగానే ఆటపాటలతో ఆనందించేవాడు. వయసులో చిన్నవాడైనా జ్ఞానంలో, శివభక్తిలో ఎంతో పరిపక్వత సాధించినవాడు సిరియాళుడు. శివుడు జటాధారి రూపంతో వచ్చి నీ తండ్రి నిన్ను చంపి పరమేశ్వరుడికి నైవేద్యంగా పెట్టబోతున్నాడు. నీ మీద స్నేహంతో నేను వేగంగా నీ దగ్గరకు వచ్చాను. కడుపున పుట్టిన కుమారుడిని, వంశోద్ధారకుడిని చంపి మాంసాశనులైన జోగులకు పెట్టే క్రూరాత్ములు ఎక్కడైనా ఉన్నారా, రాక్షసుడుగాక వాడు తండ్రి ఎలా అవుతాడు, బ్రతికివుంటే సుఖాలు పొందవచ్చు. నీవు వెంటనే ఎక్కడికైనాపోయి ఈ ఆపదను తప్పించుకో" అని చెప్పగా -

"ఎఱుకచాలని వాఁడందమే దధీచి
నల్పబుద్ధులె మేఘవాహనుఁడు శిబియు
ధరఁ బరోపకారార్థ మిదం శరీర
మనెడు వాక్యంబు వినవె సంయమివరేణ్య"

అని చెప్పిన సిరియాళుడిలో ధర్మసూక్ష్మజ్ఞత కనిపిస్తుంది. అంతేకాక దధీచి, మేఘవాహనుడు, శిబి వంటి మహాదాతల గురించి ప్రస్తావించటం సిరియాళుడి బుద్ధికుశలతకు తార్కాణం. పరోపకారం కోసం శరీరం అనే దానిని అంత చిరుప్రాయంలోనే అర్థం చేసుకోవటమే కాక దానిని ఆచరించటం కనిపిస్తుంది. చిన్నపిల్లల మనసులు అద్దం లాంటివి, మట్టిముద్దలాంటివి, అవి ఏ మూసలోపోస్తే ఆ రూపాన్ని సంతిరించుకుటాయి అనటానికి నిదర్శనంగా సిరియాళుడు నిలుస్తాడు. తల్లిదండ్రులు, గురువు మలచిన శివభక్తి స్వరూపం సిరియాళుడు.

"అధ్రువంబైన మలభాండమైన దేహ
మనఘ యన్యోపకారార్థమై వ్యయించి

ప్రవిమలంబుఁ గల్పాంతర ధ్రువములైన
కీర్తికాయంబుఁ గైకొంట కార్తియేల"

శరీరం అశాశ్వతమైనది, ఏనాటికైనా అది నశించేదే. ఇతరులకు ఉపకారం చేస్తే లభించే కీర్తి మాత్రం శాశ్వతమైంది. కల్పాలు మారినా ఆ కీర్తి తరగదు, చెరగదు, చిరస్థాయిగా నిలిచిపోతుంది. అశాశ్వతమైన శరీరాన్ని ఇచ్చి శాశ్వతమైన కీర్తి పొందటానికి దుఃఖించటమెందుకు అని మరో రూపంలో ఉన్న శివుడితో చెప్పి శివుడిచేతే వీడు తండ్రి అయిన చిఱుతొండనంబి కంటే అధికుడు అనిపించుకున్న తండ్రికి మించిన తనయుడు సిరియాళుడు.

తనను నైవేద్యం కొరకు చంపబోతున్నామని చెప్పిన తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించే విధంగా, వారు ధైర్యంగా తామనుకునే కార్యం నెరవేర్చే విధంగా -

"సంసార భ్రమ మించుకేనియును మత్స్వాంతంబునన్‌లేదు మీ
వంశంబీ పరిపాటిదే యడుగుఁడీ వైక్లబ్యసంభావనల్
మాంసాహారమునయ్యెదన్ శివునకున్ మాయామహాయోగికిన్
హింసాక్లేశము మానుఁడీ గురులు మీరే మిమ్ముఁ బ్రార్థించెదన్"

అని చెప్పగలిగిన ధీశాలి సిరియాళుడు. మనసులో ఏమాత్రం ప్రాణాల మీద తీపిలేదని, మీ వంశం సంసారం మీద వ్యామోహం పెంచేదికాదని, మీరే నాకు గురువులు, హింస అనే బాధ మానండి అని తల్లిదండ్రులకే ధైర్యవచనాలు చెప్పిన వంశదీపకుడు సిరియాళుడు. తల్లిదండ్రులనే పరమగురువులుగా భావించే పుత్రరత్నంగా సిరియాళుడు భాసిస్తాడు.

తల ఖండించేటప్పుడు, ఖండించిన తర్వాత పంచాక్షరీ మంత్రాన్ని మాత్రమే స్మరించే శివభక్తి పరాయణుడు సిరియాళుడు. తిరువెంగనాంచి ముద్దుల కుమారుడు, భర్త బిడ్డను వండి వడ్డించాలని చెప్పినప్పుడు, పార్వతీదేవి నవమాసాలు మోసి కనిపెంచిన బిడ్డను భర్త మాట కోసం మాయాజోగులకు నైవేద్యం చేయటానికి అంగీకరించవద్దు అని చెప్పినప్పుడు తిరువెంగనాంచి పరమశివ భక్తురాలు, భర్త మనసెరిగి అనుసరించే భార్యగానే కనిపిస్తుంది. ఆమె మనసులో బిడ్డపట్లనున్న ప్రేమంతా శివయోగి కుమారుడిని పిలవమన్నప్పుడు ఆ పిలుపులో కనిపిస్తుంది.

"రారా వణిగ్వంశ వారాశి హిమధామ
రారా వికస్వరాంభోరుంహాక్ష
రారా మహోఘోర వీరశైవాచార
రారా ఘనౌ దార్య రాజరాజ
రారా కుమార కంఠీరవేంద్ర కిశోర
రారా సమగ్ర ధీరా హిణేయ
రారా మనోభవాకారరూపవిలాస
రారా యసార సంసారదూర

రారా నా వన్నెవడుగ రారా తనూజ
రారా సిరియాల రార నా ప్రాణప్రదమ
రారా నా కుఱ్ఱ నా జయ్యరారా యనుచు
జీరుఁగారాపుఁగొడుకు రాజీవనయన"

తిరువెంగనాంచి కుమారునుద్దేశించి ఓ వైశ్యకులాబ్ధి చంద్రమా ! వికసిత పద్మనేత్రుడా ! ఘోరవీరశైవ వ్రతుడా! త్యాగైకశీలా ! కుమార కంఠీరవమా ! బుద్ధియందు బుధునివంటివాడా ! మన్మథాకారా ! సంసారదూరా ! వన్నెవడుగ, కుమార సిరియాలా ! నా ప్రాణమా, నా దైవమా రారా అంటూ పిలిచే పిలుపులతో బిడ్డపై ఆ తల్లికున్న ప్రేమేకాదు, సిరియాళుడి గుణగణాలు వర్ణించబడ్డాయి. సిరియాళుడిని వైశ్యకులం అనే సముద్రానికి చంద్రుడిలా, పద్మాలవంటి కన్నులు కలవాడిగా, త్యాగశీలుడిగా, సింహపుపిల్ల లాంటివాడుగా, బుద్ధిమంతుడిగా, మన్మథరూపం కలిగిన సుందరాకారుడిగా, సంసారంపట్ల ఏ మాత్రం మోహంలేనివాడుగా, తల్లిదండ్రులకు ప్రాణంలాగా శ్రీనాథుడు చిత్రీకరించాడు.

**3. "సిరియాళుని కథ" పాఠ్యభాగమాధారంగా శ్రీనాథుడి కావ్యశైలిని విశ్లేషించండి.**

విశిష్టపద రచనను లేదా సాధుశబ్ద సంయుతమైన శయ్యను శైలి అంటారు. దీనినే ఆంగ్లభాషలో స్టైల్ అంటున్నారు. శైలి కవివ్యాపారం. ఈ శైలి సమకూర్చు పాటవం కవి ప్రతిభావ్యుత్పత్తుల ననుసరించి ఉంటుంది. శ్రీనాథుడు బ్రాహ్మీదత్తవర ప్రసాదుడు, సకల విద్యాసనాథుడు. అందుకే దగ్గుపల్లి దుగ్గన తన నాచికేతోపాఖ్యానంలో "సంస్కృత ప్రాకృత సౌరసేనీ ముఖ్యభాషాపాటవంబు, పన్నగపతి సార్వభౌమ భాషిత మహాభాష్య విద్యాసమభ్యాస బలము ..." వంటివి శ్రీనాథుని పాండిత్య పటిమను నిరూపిస్తున్నాయని ప్రశంసిస్తే చింతలపూడి ఎల్లనార్యుడు తన రాధామాధవములో "సూనాస్త్ర ప్రమదామదస్ఫురిత వక్షోజాత కాఠిన్యమున్ ..." అంటూ స్తుతించాడు. ఇక స్వయంగా శ్రీనాథుడు తన కవితారీతులను గురించి కాశీఖండంలో...

**"వచియింతు వేములవాడ భీమన భంగి**
**నుద్దండ లీల నొక్కొక్కమాటు**
**భాషింతు నన్నయభట్టు మార్గంబున**
**నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు**
**వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా**
**భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు**
**పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ**
**సూక్తివైచిత్రి నొకొక్కమాటు"** అని చెప్పుకున్నాడు.

పూర్వకవుల రచనలన్నింటినీ చదివి వారి కవితారీతులను అనుసరిస్తూ పూర్వాంధ్రకవుల కవితారీతులన్నీ తన రచనలలో ఉండే విధంగా శ్రీనాథుడు తనదైనశైలిని ఏర్పరచుకున్నాడు అనేది తాను చెప్పిన పై పద్యం వలన స్పష్టమవుతుంది. ఉభయవాక్ప్రౌఢి రసాభ్యుచిత బంధం, సూక్తివైచిత్రి శ్రీనాథుని కవిత్వంలో మేళవించాయి.

**"ప్రౌఢి పరికింప సంస్కృతభాషయండ్రు**
**పలుకు నుడికారమున నాంధ్రభాషయండ్రు"** అని భీమఖండంలో చెప్పిన దానినిబట్టి శ్రీనాథుని కవిత్వంలో సంస్కృతప్రౌఢి, తెలుగు నుడికారం సమృద్ధిగా ఉన్నాయని తెలుస్తుంది, అలాగే

**"హరచూడా హరిణాంకవక్రతయు కాలాంతఃపురచ్ఛండికా**
**పురుషోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యమున్**
**సరసత్వంబు సంభవించెననగా సత్కావ్యముల్దిక్కులం**
**జిరకాలంబులో నటించుచుండు(గవి రాజీగేహరంగబులన్"** అని చెప్పుకున్నాడు. వక్రత, కాఠిన్యత, సరసత్వం శ్రీనాథుని కవిత్వంలో ఉన్నాయని తెలుస్తుందీ పద్యం వలన. శ్రీనాథుడు చెప్పిన ఉభయ వాక్ప్రౌఢి, ప్రౌఢి నుడికారం, కాఠిన్యం ఒకదానితో ఒకటి సమన్వయం కలవి. అలాగే రసాభ్యుచిత బంధం, సరసత్వం ఒకటే. సూక్తివైచిత్రి వక్రత ఒకటే.

**ఉభయ వాక్ప్రౌఢి :**

శ్రీనాథుడి రచనల్లో సంస్కృత ప్రౌఢి, తెలుగు నుడికారం సందర్భానుసారంగా పోషించబడ్డాయి.

**సంస్కృత ప్రౌఢి :**

"వనీ కఠోర లతికాకాండ ప్రకాండంబులన్ గిరి కటక శిలా విటలకంబులం గ్రేంకారంబులం కఠోర కాలకూట మషీకలంక పంకచ్ఛాయాచ్ఛటా పటలంబు నిబిరీకుసుమ కేసర కరికరాభ ధారా కదంబడంబరంబునునై" వంటి సమాసభూయిష్ఠ రచన శ్రీనాథుని సంస్కృతప్రౌఢికి ఉదాహరణ.

> "జయహాలాహల నీలకంధర మహేశా భక్తచింతామణీ
> జయగంగాధర చంద్రశేఖర జగత్స్వామీ కృపాంభోనిధీ
> జయనీహార ధరాధరేంద్ర తనయా చారుస్తన ద్వంద్వ సం
> శ్రయ సంలగ్నపటీర కుంకుమ రజస్సంపన్న బాహాంతరా"

పద్యంలోని చివరి రెండుపాదాలు దీర్ఘసమాసభూయిష్టం. ఇంకా "తత్తద్వ్యంజన పాక గంధ్యవయవ స్థాన ప్రతానంబుతోన్" వంటి దీర్ఘసమాసభూయిష్ట ప్రయోగాలు శ్రీనాథుని సంస్కృత ప్రౌఢికి నిదర్శనాలు.

**తెలుగు నుడికారం :**

సంస్కృత ప్రౌఢి ఎంత గంభీరంగా ఉంటుందో తెలుగు నుడికారం అంత రమ్యంగానూ ఉంటుంది. తెలుగు సామెతలను, జాతీయాలను సందర్భోచితంగా ప్రయోగించటంలోనూ శ్రీనాథుడు మేటి. చేయాడు, నిండుకొని వంటి జాతీయాలు, మగవాడో మ్రానో, ఆవగింజంత భూతి, గుమ్మడికాయంత వెట్టి వంటి లోకోక్తులు, తొడిని, పూసి వంటి పదాల ప్రయోగాలు, సర్వాయితము, భరిత భోజనము వంటి పదబంధాలు, ఒఱగొడ్డెములు, గొడ్డేఱు, జిడ్డుపఱచు, జుజ్జుపదను వంటి తెలుగునుడులు శ్రీనాథుని రచనలో కోకొల్లలు.

> "పాలుపోయించుకొని యా కృపాళుమూర్తి
> శూలి నాంచారి పాలిండ్ల చూచుకములు
> పాల చేఁపున గిలిగింత వాఱుటయును
> మెత్తమెత్తన నఱచేత నొత్తుకొనుచు"

> "కానండు గాక కన్నులు
> దానేమిటిఁవాడునీదు తనయునిఁ జంపన్
> మానవతీ మగవాడో
> మ్రానో యనుమాట నేటిమాటయె చెపుమా" వంటి పద్యాలు శ్రీనాథుని తెలుగుప్రౌఢికి తార్కాణాలు.

**సూక్తివైచిత్రి :**

కుంతకుడు చెప్పిన వక్రోక్తియే సూక్తివైచిత్రి. శ్రీనాథుడి రచనలో పదపర్యాయ వక్రత, రూఢి వక్రత, భావవైచిత్రివక్రత వంటి వక్రతా భేదాలు కనిపిస్తాయి. భక్తుడు అనే అర్థం కోసం "నంబి" అనే పదప్రయోగం చేయటం విశేషం.

"నంబి శివార్థమన్మనసు నమ్మిక" అనటంలో నంబి భక్తుడని, చిఱుతొండనంబి అనే రెండు అర్థాలు స్ఫురించే విధంగా ప్రయోగించటం వలన ఇది పదపర్యాయ వక్రతకు ఉదాహరణ.

"కుడుతు నా పంక్తి నీవు నీ కొడుకు గుడువ" అని అర్థద్వయాన్ని శ్రీనాథుడు చమత్కారంగా ప్రయోగించాడు. "నీవు, నీ కొడుకు నా బంతిని కూర్చుని కుడువగా" అని ఒక అర్థం. నీవు నీ కొడుకు మాంసాన్ని భుజించగా" అని మరొక అర్థం.

కుంతకుడు తన "వక్రోక్తి జీవితం"లో శైలిని సుకుమార, విచిత్ర, మధ్యమ మార్గాలుగా విభజించాడు. శ్రీనాథుడు విచిత్ర మార్గమనే శైలీవిధానాన్ని స్వీకరించాడు.

శ్రీనాథుడి కవిత్వంలోని వక్రోక్తి, ప్రౌఢోక్తి, సరసోక్తి విచిత్రమార్గంలోనే ఉన్నాయి.

ఎర్రన రామాయణంలోనివని కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సారసంగ్రహములో ఉదహరించిన లక్ష్మణుని మూర్ఛను వర్ణించు "కందక గాజువాఱక మొగంబు వికాసముఁజెందె జేతులీ ..." పద్యంలోని సూక్తివైచిత్రి విధానపు శైలిని శ్రీనాథుడు అనుసరించాడని నిరూపిస్తుందీ పద్యం.

**"కందక గాజువాఱక వికాసముడిందక మందహాస ని**
**ష్యందము చెక్కుటద్దముల నారక నెమ్మది నిద్రపోవు న**
**ట్లందము నొందె ధాత్రి సిరియాల కుమారుని వక్త్రచంద్రుడా**
**నందము నొందె నప్పుడెలనాగ మనంబును భర్తచిత్తమున్"**

**రసపోషణ :**

ఈ పాఠ్యభాగం శాంత, కరుణరస ప్రధానంగా సాగుతూ, సిరియాళుని వధించే ఘట్టాన్ని శ్రీనాథుడు మాతృభావ, పితృభావ, బాలభావాలకు నిశ్చలభక్తిని వైరుధ్యంలేని సామరస్యాన్ని వ్యక్తీకరించాడు.

**"మది శంకింపకుమన్న మావలని ప్రేమస్నేహ వాత్సల్యసం**
**పద పాటింపకున్న నాలుక తుదిన్ బంచాక్షరీ మంత్రముం**
**బదిలం బొప్పఁబఠింపుమన్న పరమ బ్రహ్మార్థ సంసిద్ధయి**
**య్యది సుమ్మన్న యనుంగు నందన సిరాలా వీరశైవ వ్రతా"**

ఈ పద్యంలో భక్తివాత్సల్య శమభావాలను పొందుపరచాడు శ్రీనాథుడు.

**వర్ణనా వైదుష్యం :**

శ్రీనాథుడి వర్ణనా నిపుణత్వాన్ని పాఠ్యభాగంలోని ప్రతిఘట్టం నిరూపిస్తుంది. కుంభవృష్టి వర్ణన, మాయ జంగముడి వర్ణన, మాయాజోగిత వర్ణన, చిఱుతొండనంబి, సిరియాళుల వర్ణనలు కనిపిస్తాయి.

ఎక్కువ రోజులు వర్షాలు కురవబోతున్నాయి అనే సూచనలను -

**"పశ్చిమంబున నింద్రచాపంబు నొడిచె**
**నిండునెలఁజుట్టెఁబరివేష మండలంబు**
**గగనమార్గంబునందు నాగడపలెగసె**
**నంబుధర మాలికలు దక్షిణంబు నడచె"** అని వర్ణించారు.

"అశితవర్ణ దేశీయుండును జరాజర్జరిత దేహుండును బలిత పాండు జటా మండలుండును రుద్రాక్షమాలికా భసిత త్రిపుండ్రాలంకృతుండు" అని మాయాజంగముడిని వర్ణించాడు. ఇంక మాయజోగితను

"ఫాల పట్టికయందు భస్మత్రిపుండ్రంబుఁ
గర్ణంబులను రాగికమ్మదోయి
కంఠమందిత్తడి కంబంపుఁ గంటియు
ఘనకుచంబుల మీఁదఁగావిగంత
కటి మండలంబునఁ గరకంచుఁ బుట్టంబు
మడచి కట్టిన మేలి నడిమికట్టు
కేలుఁదామరయందుఁగేదారవలయంబు
జడకుచ్చుమీఁదఁ బచ్చడపుఁగండ
సంతరించి పదాఱు వర్షముల వయసుఁ
బచ్చిబాలింతరాలు తాపసపురంధ్రి
నంబి భామినిఁ దిరువెంగనాంచిఁజేరి
పాలు వోయింపుఁడమ్మపాపనికి ననియె" అంటూ వర్ణించాడు.

శ్రీనాథుడికి పాకశాస్త్ర ప్రావీణ్యం ఇంత ఉందా అనే విధంగా సిరియాళుడి మాంసాన్ని వండి, వడ్డింపజేశారు. సీస పద్యరచనలో అందెవేసిన చేయి శ్రీనాథుడిది అనేది సర్వవిదితమే.

సంగీత నాట్యలలోలాగే కవిత్వంలో కూడా మార్గ, దేశీ రీతులున్నాయి. సంస్కృతం, సాంస్కృతికమైన కవిత్వం మార్గకవిత్వం. జాతుతనం, దేశీయత గలది దేశికవిత్వం. ప్రత్యేకంగా సాంస్కృతికంగానీ, దేశినిగానీ స్వీకరించకుండా రెండింటి సారాన్ని ఆకళించుకొని చెవికి ఇంపును, మనసుకు పెంపును కలిగించే శైలిని శ్రీనాథుడు తెలుగుభాషలో అవతరింపజేశాడు. ఆ శైలినే శ్రీనాథుడు సంగీతనాట్య పరిభాషానుకరణంగా కర్ణాటక భాషగా పేర్కొన్నాడు. శ్రీనాథుడి కమనీయశైలినే ఆ తరువాతి కవులైన జక్కన, అల్లసాని పెద్దన వంటివారు అనుకరించారు.

**రాదగిన ప్రశ్నలు :**

1. చిరుతొండనంబి పాత్ర చిత్రణ చేయండి.
2. శ్రీనాథుడి ఈశ్వరార్చన కళాశీలతను (శివభక్తిని) నిరూపించండి.

**ఆధార గ్రంథాలు :**

1. హరవిలాసము - శ్రీనాథుడు
2. శ్రీనాథ కవి సార్వభౌముని హరవిలాసం - వ్యాఖ్యాత - ఆచార్య యార్లగడ్డ బాలగంగాధరరావు (హైమావతీవ్యాఖ్య సహితము)
3. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
4. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం

**డా॥ ఇరపని మాధవి**
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము.